శతజయంతి నివాళి (1921-2021):

రసగంగాధర తిలకం

దేవరకొండ బాలగంగాధర తిలక్

(1921-1966)

అభిరుచులు-అలవాట్లు, ఇతర వ్యాసాలు

రచన:

ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు

నివృత్త ఆంధ్రశాఖాధ్యక్షులు

బెంగుళూరు విశ్వవిద్యాలయం

బెంగుళూరు

"శ్రీరస"

శ్రీకృష్ణదేవరాయ రసజ్ఞ సమాఖ్య

బెంగుళూరు - 560 060

2021

RASAGANGADHARA TILAKAM, Devarakonda Balagangadhara Tilak (1921-1966) Abhiruchulu- Alavatlu, Itara Vyasalu, written by Prof. T.V. Subba Rao and Published by "Srirasa" Srikrishnadevaraya Rasajna Samakhya, Bengaluru-560 060.

First Edition : 01-08-2021 (శతజయంతి సమాపనోత్సవము)

No. of pages: x + 318 (including 40 pages of colour photos)

Copies : 1000

Price: 300/-

ముఖచిత్రం: 'బాపు'

అట్టవెనుక: మిత్రుడు శ్రీపాద కృష్ణమూర్తి తీయించిన తిలక్ ఫోటో

© Prof. T.V. Subba Rao

Published by: **Prof. T.V. Subba Rao**
Founder President
Srikrishnadevaraya Rasajna Samakhya
No.1708, '*Siitaavadhaanam*'
11th Cross, 1st 'G' Main
Kengeri Satellite Town
BENGALURU - 560 060
Mobile: 99454 22742

Copies Can be had: From all leading Book Shops (like Visalaandhra, Navachetana, Navodaya, Emesco Sahiti, Prajasakthi, Nava Telangana, Pallavi Publications and Nagasri Graphics, Kuppam)

D.T.P.: **Nagasri Graphics**, H.No.1-18, Plot No.17, Brindavana ColonyNear Agnimaremma Temple, Gundlasagaram Village, Gudupalli Mandal, Kuppam-517425; Chittoor District, A.P. Ph.No.08570-517 825; 8500619283

Printing at: **Omkar Offset Printers**
3/3, 1st Main Road
New Tharagupet
Bengaluru - 560 002.
Phone: 080-26708186; 26709026

అంకితం-1

కీ.శే. ఇందిరాదేవి – కీ.శే. దేవరకొండ బాలగంగాధర తిలక్ పుణ్యదంపతుల దివ్యస్మృతికి – భక్తి ప్రపత్తులతో...

మరియు వీరి కొడుకులకు – కూతురికి – మనుమలకు – మనుమరాండ్రకు – మునిమనుమలకు – మునిమనుమరాండ్రకు –

అనేక ఆశీస్సులతో.... **– తంగిరాల వెంకట సుబ్బారావు**

వివరాలు:

1. పెద్దకొడుకు : డా॥ దేవరకొండ సత్యనారాయణమూర్తి (లండన్)
   పెద్ద కోడలు : శ్రీమతి శారద; మనుమరాండ్రు : చి॥ సంధ్య, చి॥ స్మిత
2. చిన్నకొడుకు : డా॥ దేవరకొండ సుబ్రహ్మణ్యం (అమెరికా)
   చిన్నకోడలు : శ్రీమతి హరికుమారి; మనుమలు: చి॥ రాజేష్ తిలక్ – చి॥ సునీల్ – చి॥ సంజయ్
   పెద్ద మనుమడి భార్య : చి॥ సౌ॥ "బెట్సీ" (BETSY)
   మునిమనుమడు: చి॥ "ఎవన్" (EVAN)
3. కూతురు: శ్రీమతి చంద్రలేఖ; అల్లుడు:కీ.శే.యనమండ్ర విశ్వమోహనరావు
   మనుమరాండ్రు : శ్రీమతి సీత – శ్రీమతి పద్మ – శ్రీమతి గీత
   ఇద్దరు మునిమనుమలు – ఇద్దరు మునిమనుమరాండ్రు

ఉత్తమ సాహిత్యవేత్త, సంఘజీవి, బుద్ధిజీవి, నియమబద్ధజీవి, గాంధీయవాది, ఖద్దరుధారి, నిరంతర వ్యాయామ కర్కశ వజ్రశరీరుడు, భోజనప్రియుడు, చతుర సంభాషణా నిపుణుడు, ఉభయభాషాప్రవీణుడు, ఉత్తమకవి, ఉద్దండ పండితుడు, అద్భుతవక్త, విశ్రాంత ఆంధ్రోపన్యాసకుడు, నా మొట్టమొదటి సాహిత్యగురువు, మాఅన్నయ్య-మా పాలిటి కన్నయ్య శ్రీ టి.వి.కె. సోమయాజులు (శ్రీ తంగిరాల వేంకట కృష్ణ సోమయాజులు.)గారు 28-07-2021 బుధవారంనాడు సాయంకాలం 5 గంటలకు హైదరాబాదులో స్వర్గస్థులయ్యారని తెలియ జేయటానికి మిక్కిలి చింతిస్తూ, ఆ పుణ్యశ్లోకుని దివ్యస్మృతికి అంజలిఘటిస్తూ.... భక్తి ప్రపత్తులతో...

తమ్ముళ్ళు

సుబ్బారావు – భాస్కరరావు – కృష్ణమూర్తి.

అంకితం-2

1. అష్టకష్టాల్లో చిక్కుకున్న మా అమ్మ సంసారాన్ని ఆదుకొని, పట్టుదలతో గట్టెక్కించి, తమ్ముళ్ళను తీర్చిదిద్ది, ఉన్నతపథంలో నడిపించిన ఉత్తమశ్లోకుడు మా అన్నయ్య కీ.శే. టి.వి.కె. సోమయాజులు (తంగిరాల వేంకట కృష్ణ సోమయాజులు)గారి పుణ్యస్మృతికి అంజలిఘటిస్తూ...
2. నాకు 1955లో తిలక్‌గారిని పరిచయం చేసిన ఆత్మీయ మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తి దివ్యస్మృతికి...
3. అన్నగారిని, ఆయన సాహిత్యాన్ని అభిమానించిన తిలక్‌గారి తమ్ముడు కీ.శే. దేవరకొండ గంగాధర రామారావుగారి దివ్యస్మృతికి...
4. తిలక్‌గారు తన సొంత తమ్ముళ్ళుగా భావించిన డా॥ ఆవంత్స సోమసుందర్ గారికి, డా॥ పెండ్యాల వరవరరావుగారికి...
5. తిలక్ కథలను 1967 నుండి ఈనాటివరకూ, తిలక్ కవిత్వం "అమృతం కురిసిన రాత్రి"ని 1968 నుండి ఈనాటి వరకు అనేక పర్యాయాలు ముద్రించి తెలుగు సాహిత్య ప్రియులకు అందుబాటులో ఉంచుతున్న విశాలాంధ్ర ప్రచురణాలయం వారికి...
6. 2008 జనవరి 27వ తేదీని "దేవరకొండ బాలగంగాధర తిలక్ సాహితీ సమాలోచనమ్" అనే విశేషసంచికను వెలువరించడంలోను, తిలక్ జయంత్యుత్సవం నిర్వహించడంలోను తిలక్‌గారి సంతానానికి సహకరించిన "సాధన సాహితీ స్రవంతి" అధ్యక్షులు శ్రీ సాధన నరసింహాచార్యగారికి, సభ్యులు శ్రీ వాడ్రేవు వెంకట సత్యప్రసాద్‌గారికి, విశేషసంచికకు సంపాదకత్వం వహించిన ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారికి...
7. తిలక్‌గారి సమగ్ర రచనలను నాచేత సంకలనం చేయించి ముద్రించిన (ప్రథమ ముద్రణ, నవంబరు 2013, ద్వితీయ ముద్రణ 2021) ఎమెస్కో బుక్స్ అధినేత శ్రీ డి. విజయకుమార్‌గారికి, సంపాదకుడు శ్రీ డి. చంద్రశేఖర రెడ్డిగారికి...
8. తణుకులో 17-08-2013 నాడు తిలక్‌గారి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో ఎంతో కృషిచేసిన శ్రీమతి దేవరకొండ లక్ష్మీపార్థసారథి,

ఐ.ఏ.ఎస్.గారికి... (ఈమె తిలక్‌గారి తమ్ముడు హైకోర్టు న్యాయవాది కీ.శే. దేవరకొండ పార్థసారథిగారి ఏక పుత్రిక)

9. ఎన్నో ఏండ్లుగా (1997 నుండి ఈనాటివరకు) ప్రతిసంవత్సరం "తిలక్ సాహిత్య పురస్కార సభ"ను నిర్వహిస్తున్న శ్రీ నన్నయ భట్టారక పీఠము, తణుకు, వారికి – ప్రత్యేకంగా చిరకాలం అధ్యక్షులుగా ఉన్న మా కుటుంబ మిత్రులు డా॥ జి.యస్.వి. ప్రసాద్‌గారికి..., డా॥ తాతిని రామబ్రహ్మం గారికి..., వర్తమాన అధ్యక్షులు శ్రీ జొన్నలగడ్డ సూర్య సుబ్రహ్మణ్యంగారికి..., మరియు ప్రధాన కార్యదర్శి శ్రీ యామిజాల సుబ్రహ్మణ్యశర్మ ("సుశర్మ") గారికి... సంయుక్త కార్యదర్శి శ్రీ తంగిరాల పాలగోపాలకృష్ణగారికి...

10. తిలక్‌గారు నివసించిన గృహాన్ని కొనుక్కుని, ఆయన పడకగదిలో దైవ సమానులైన శిశువులకు గత 50 ఏండ్లుగా వైద్యసేవలు అందిస్తున్న మా కుటుంబ మిత్రులు డా॥ వత్సవాయి వెంకటరాజుగారికి(శకుంతల నర్సింగ్ హోమ్, తణుకు)...

11. ఈ గ్రంథ రచనలో నాకు మిక్కిలిగా తోడ్పడినవారు, తిలక్‌గారి గేయాలను పాడించి రికార్డు చేయించిన చలనచిత్ర సంగీత దర్శకులు, తిలక్‌గారి మేనల్లుడు అయిన శ్రీ ఈవని సత్యనారాయణమూర్తి ("జుజ్జు") గారికి...

12. తిలక్ సాహిత్యాన్ని అభిమానించే మిత్రులందరికీ... ప్రత్యేకంగా – డా॥ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు–"శిఖామణి" – "కొప్పర్తి" – డా॥ రంకిరెడ్డి రామమోహనరావు – కె.వి.ఎన్.డి. వరప్రసాద్ – డా॥ గన్నమరాజు గిరిజా మనోహరబాబు – డా॥ దివాకర్ల రాజేశ్వరి – శ్రీమతి అంబికా అనంత్ – శ్రీ వి.ఆర్.విద్యార్థి – ప్రొ॥ కె. మలయవాసిని – గారలకు...

13. ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు, తిలక్ కవితా ప్రియులు ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి... పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు, ప్రముఖ జానపద సాహిత్యవేత్త ఆచార్య తంగెడ కిషన్‌రావుగారికి...

14. ఈ గ్రంథ ముద్రణకు ధన సహాయం చేసిన ఉదార హృదయులందరికీ – ప్రత్యేకంగా "రైతు బాంధవుడు" శ్రీ పోచా బ్రహ్మానందరెడ్డి (ఎం.పి.) గారికి...

ఆప్యాయంగా

తంగిరాల వెంకట సుబ్బారావు

నా మాట

నా కవితాగురువులైన కీ.శే. దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారు 1921 ఆగస్టు 1వ తేదీని, పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు ప్రక్కనే ఉన్న "మండపాక" అనే గ్రామంలో ధనిక కుటుంబంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు: కీ.శే. రామసోదెమ్మగారు – కీ.శే. సత్యనారాయణమూర్తిగారు. ఈ దంపతులకు ఐదుగురు కూతుళ్ళు, ఏడుగురు కొడుకులు. తిలక్‌గారు మొత్తం సంతానంలో ఆరవవారు; కొడుకులలో రెండవవారు.

తిలక్‌గారు మరణించిన తేదీని 1966 జూలై 1వ తేదీ అని అందరూ ప్రచారం చేస్తున్నారు. నా ఉద్దేశంలో అది సరికాదు. తిలక్‌గారు చనిపోయిన క్రొత్తలో నేను తణుకు వెళ్ళాను. అప్పుడు వారు ఏ తేదీని మరణించారో తిలక్ తమ్ముడు గంగాధర రామారావుగారు, ఇతర మిత్రులు నాకు వివరంగా చెప్పారు. అది 1966 జూన్ 30వ తేదీ రాత్రి అని తెలిసింది. మర్నాడు జూలై 1వ తేది తిలక్ మరణవార్త ఊరంతా వ్యాపించింది. జూలై 2వ తేదీని అన్ని వార్తాపత్రికలలోను ఈ వార్త ప్రముఖంగా ప్రచురితమయింది. అప్పుడు తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు వీరగాథలను గురించి పరిశోధన చేస్తున్న నేను జూలై 2వ తేదీ Indian Express లో తిలక్ మరణవార్త చదివి దిగ్భ్రాంతికి లోనయ్యాను. వెంటనే "తిలక్ అభిరుచులు–అలవాట్లు" అనే పేరుతో 80 పుటల పెద్దవ్యాసాన్ని వ్రాశాను. దీని రచనకు రెండు నెలల కాలం పట్టింది. (అంటే దీని రచనా కాలం: 1966 జూలై, ఆగస్టు మాసాలు.) దీనిలో కొంతభాగం (23 పుటలు) "తిరుపతి సాహిత్య సమితి వ్యాసావళి-3"లో 1972లో ముద్రితమయింది. మిగిలింది అలాగే ఉండిపోయింది. ఇప్పుడు మొత్తం వ్యాసాన్ని, కాలనుగుణమైన చిన్న చిన్న మార్పులతో, ప్రచురిస్తున్నాను. దీనికి మరో ఆరు వ్యాసాలు కూడా చేర్చాను.

మొదటి వ్యాసం "తిలక్ అభిరుచులు–అలవాట్లు" 1966లో వ్రాస్తే, తక్కిన వ్యాసాలు 40–50 ఏళ్ళ తర్వాత వ్రాసినట్టివి. అవి కూడా అన్నీ ఒక్కసారి వ్రాసినవి కావు; అప్పుడప్పుడు వ్రాసినవి. "తిలక్ వచన కవిత్వం–భాషాశైలి" అనే ఐదవ వ్యాసం 2007లో వ్రాశాను. "తిలక్ వచన కవితా వైభవం" అనే మూడవ వ్యాసం 2009లో వ్రాశాను. "తిలక్ సాహిత్య పరిచయం" అనే రెండవ వ్యాసం 2013లో వ్రాశాను. "తిలక్ లేఖలు – ఒక పరిశీలన" అనే చివరి (ఏడవ)

వ్యాసం కూడా 2013 ప్రాంతంలోనే వ్రాశాను. "తపాలా బంట్రోతు కవిత పుట్టుక" అనే నాల్గవ వ్యాసం 2015లో వ్రాశాను. "తిలక్ పద్యకవితా వైభవం" అనే ఆరవ వ్యాసం ఇటీవల (2021 మే నెలలో) వ్రాశాను. ఒక వ్యాసానికి మరో వ్యాసానికి రచనా కాలంలో ఎన్నో ఏండ్ల వ్యత్యాసం ఉండటం వల్లా, ఏ వ్యాసానికావ్యాసాన్ని ప్రత్యేకంగా తీర్చి దిద్దడంవల్లా, అన్నీ కలిపి ఒక పుస్తకంగా ముద్రిస్తానని అనుకోకపోవడం వల్లా – ఒక వ్యాసంలో ముచ్చటించిన అంశాలు మరో వ్యాసంలో పునరుక్తమయ్యాయి. ముఖ్యంగా "తిలక్‌గారితో నా పరిచయం" – "తిలక్‌గారి తాతముత్తాతలు, సోదర సోదరీమణుల వివరాలు" – "తిలక్ సాహిత్య దశల విభజన" – "తపాలా బంట్రోతు కవిత పుట్టుక" – అనే అంశాలు రెండు మూడు వ్యాసాల్లో వస్తాయి. "తపాలా బంట్రోతు" కవిత నాకు ఆత్మీయమూ గర్వకారణమూ అయిన కవిత. ఈ అభిమానంవల్ల దీనిలోని చరణాలు నాలుగు వ్యాసాల్లో పునరుక్తమయ్యాయి. పాఠకులు సహృదయంతో స్వీకరిస్తారని ఆశిస్తున్నాను.

తిలక్‌గారికి శతజయంతి నివాళిగా ఈ వ్యాసాలు భక్తి శ్రద్ధలతో సమర్పిస్తున్నాను. కవిగా రచయితగా తిలక్‌గారు అందరికీ తెలుసు. కాని వ్యక్తిగా చిత్రవిచిత్రమైన అభిరుచులు–అలవాట్లు కలిగిన మనవంటి సామాన్య మానవుడుగా చాలామందికి తెలియదు. సుదీర్ఘమైన (80 పుటల) మొదటి వ్యాసం ఆయా విషయాలను సమగ్రంగా విశదీకరిస్తుంది. తిలక్ మొత్తం సాహిత్యాన్ని రెండవ వ్యాసం పరిచయం చేస్తుంది. మూడవ వ్యాసంలో తిలక్ వచన కవితా వైభవం, నాల్గవ వ్యాసంలో "తపాలా బంట్రోతు" కవిత పుట్టుక, ఐదవ వ్యాసంలో తిలక్ వచన కవిత్వంలోని భాషాశైలి, ఆరవవ్యాసంలో తిలక్ పద్యకవితా వైభవం తెలియజేశాను. చివరిదైన ఏడవ వ్యాసంలో లేఖలను బట్టి తిలక్ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించాను. తిలక్ అలభ్య పద్యకావ్యం "మండోదరి"ని గురించి మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తి చెప్పిన విశేషాలు, తిలక్ మరణించినపుడు శ్రీశ్రీ వ్రాసిన స్మృతికవిత (Elegy), ఆచంట జానకిరాంగారికి తిలక్ వ్రాసిన పెద్దలేఖ, తిలక్ కుటుంబచరిత్ర, తణుకులోని శ్రీ నన్నయభట్టారక పీఠంవారు ప్రతిఏటా ఇచ్చే "తిలక్ సాహిత్య పురస్కారాల" పట్టిక (1997 నుండి 2019 వరకు) తంగిరాల జీవన రేఖలు అనుబంధాలుగా ఇచ్చాను.

"తిలక్ అభిరుచులు–అలవాట్లు" అనే మొదటి వ్యాసంలోను, "తిలక్ వచన

కవిత్వం–భాషాశైలి" అనే ఐదవ వ్యాసంలోను నా మౌలికత (Originality) ఎక్కువగా ఉండటం పాఠకులు గమనించగలరు. "తిలక్ పద్య కవితా వైభవం" అనే ఆరవ వ్యాసం కూడా నూతన విశ్లేషణతో కూడినట్టిదే! తిలక్ పద్య కవిత్వాన్ని గురించిన సమగ్రమైన వ్యాసం ఇదే అని నేను భావిస్తున్నాను. కాని "తిలక్ వచన కవితా వైభవం" అనే మూడవ వ్యాసంలో మాత్రం నేను ప్రముఖ విమర్శకులు డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావుగారు రచించిన "తిలక్ కవితా తత్త్వం–దృక్పథం" అనే వ్యాసం (చూ. లోపలికి... పుటలు 99–132) మీద ఎక్కువగా ఆధారపడ్డాను. వారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

నేను కష్టపడి రచించి, ముద్రించిన ఈ వ్యాస సంపుటిని తిలక్ దంపతులకు, వారి సంతానానికి అప్యాయంగా అంకితం చేస్తున్నాను. అలాగే 1967 నుండి తిలక్ కథలను, 1968 నుండి తిలక్ కవిత్వం "అమృతం కురిసిన రాత్రి"ని, ఈనాటి వరకూ కూడా క్రమం తప్పకుండా ముద్రిస్తూ తిలక్ సాహిత్య ప్రియులకు అందిస్తున్న విశాలాంధ్ర ప్రచురణాలయంవారికి; 2013, 2021 సంవత్సరాలలో తిలక్ సర్వలభ్య రచనలను బాపుగారి ముఖచిత్రంతో అందంగా పెద్ద బౌండ్ పుస్తకంగా ముద్రించిన "ఎమెస్కో బుక్స్" వారికి, అలాగే తిలక్ కీర్తిప్రతిష్ఠలను శాశ్వతం చేయడంలో సహకరించిన ఇతరులకు, తిలక్ కవిత్వమంటే చెవికోసుకొనే మిత్రులకు ఈ అంకితంలో భాగస్వామ్యం కల్పించాను. నిజానికి విశాలాంధ్రవారు ముందుకు రాకపోతే, తిలక్‌గారు మరుగున పడిపోయేవారు! ఇప్పుడు ఎమెస్కో వారు కూడా తిలక్ సాహిత్యానికి ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారు. అందరికి నా వందనాలు... ఈ గ్రంథ ముద్రణకు నేను రూ. 75,000/–లు ఖర్చుపెట్టాను.

ఈ పుస్తకరచనలో నాకు మిక్కిలిగా తోడ్పడిన తిలక్‌గారి మేనల్లుడు శ్రీ ఈవని సత్యనారాయణమూర్తిగారికి, ఈ వ్యాసాలన్నింటిని మిక్కిలి శ్రద్ధగా డి.టి.పి. చేసి యిచ్చిన ఆత్మీయ శిష్యుడు డా॥ తోట వెంకటస్వామికి, నేను రచించిన ఎన్నో పుస్తకాల వలెనే ఈ పుస్తకాన్ని కూడా ఎంతో అందంగా నీట్‌గా ముద్రించి యిచ్చిన ప్రియమిత్రులు శ్రీ పి.యస్. వెంకటేశ్ బాబుగారికి నా అనంతమైన ఆశీస్సులు...

బెంగుళూరు, ఇట్లు

23.07.2021 **తంగిరాల వెంకట సుబ్బారావు**

('లోకమాన్య' బాలగంగాధర తిలక్ జన్మదినం) (తిలక్‌గారి శిష్యుడు)

వెన్నెల - కన్నెలు - నెమలి కన్నులు

(విషయ సూచిక)

	అంకితం-1	iii
	అంకితం-2	iv
	నా మాట	vi
1.	తిలక్ అభిరుచులు - అలవాట్లు	1
2.	తిలక్ సాహిత్య పరిచయం	81
3.	తిలక్ వచనకవితా వైభవం	121
4.	"తపాలా బంట్రోతు" కవిత పుట్టుక	158
5.	తిలక్ వచన కవిత్వం-భాషాశైలి	169
6.	తిలక్ పద్యకవితా వైభవం	196
7.	తిలక్ లేఖలు - ఒక పరిశీలన	223
	అనుబంధం-**I**:	
	తిలక్ అలభ్యపద్యకావ్యం "మండోదరి"	241
	అనుబంధం-**II**:	
	కవితా కదన క్షాత్రుడు - శ్రీశ్రీ	249
	అనుబంధం-**III**:	
	ఆచంట జానకిరాంగారికి తిలక్ వ్రాసిన లేఖ	251
	అనుబంధం-**IV**:	
	తిలక్ కుటుంబ చరిత్ర	254
	అనుబంధం-**V**:	
	తిలక్ సాహిత్య పురస్కారాలు (1997-2019)	257
	అనుబంధం-**VI**:	
	తంగిరాల జీవన రేఖలు	260
	అనుబంధం-**VII**:	
	ఏఱిన ముత్యాలు-జ్ఞానరత్నాలు - టి.వి.కె.సోమయాజులు	265
	అనుబంధం-**VIII**:	
	ఛాయాచిత్రములు	279

కూతురు చంద్రలేఖ వివాహసమయంలో వరుడు శ్రీ యనమండ్ర
విశ్వమోహనరావుచేత యజ్ఞోపవీతధారణ చేయిస్తున్న
శ్రీమతి ఇందిరాదేవి-శ్రీ తిలక్ దంపతులు(1966)

1. తిలక్ అభిరుచులు - అలవాట్లు*

"ఏపుగా పెరిగిన చెట్టు మీద
ఎఱ్ఱని పువ్వొకటి విరిసి
ఎండలో మెరుస్తూ
'ఇదే నిజం ఇదే నిజం' అని నవ్వుతూ
అంతలో రాలిపోయింది.... !
వింతగా స్మృతిలో మాత్రం మిగిలింది...!! "

– 'కిటికీ', భారతి, ఏప్రిల్ 1965.

1. నా పరిచయ ప్రారంభం

కీ॥శే॥ దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారు నాకు అత్యంత సన్నిహితులు. 1955 నుండి 1961 వరకూ ఆరు సంవత్సరాల పాటు నేను వారితో కూడా కూడా తిరిగినవాణ్ణి. రోజూ ఇరవై నాలుగు గంటల్లో సగం గంటలు వారి యింటి దగ్గరే గడిపేవాణ్ణి. తిలక్ గారిదీ నాదీ ఒకే ఊరు (పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు) కావడం వల్ల ఈ సన్నిహితత్వం పెంపొందిందని భావించడానికి వీల్లేదు. 1955 వరకూ తిలక్‌గారు తణుకులో ఉంటున్న సంగతే నాకు తెలియదు. వారితో నా పరిచయ ప్రారంభం చాలా విచిత్రంగా జరిగింది.

1955లో నేను భీమవరం కళాశాలలో తెలుగు అభిమాన విషయంగా బి.ఏ. చదువుతున్నాను. ఆ సంవత్సరం జూన్ నెల 'భారతి'లో మొదటి పుటలో 'ఆర్తగీతం'అనే గేయం పడింది. కళాశాల గ్రంథాలయంలో మిత్రులతో

* 1996 జూన్ 30వ తేది రాత్రి తిలక్‌గారు స్వర్గస్థులయ్యారు. అప్పుడు తిరుపతిలో ఉన్న నేను జూలై 2వ తేదీ Indian Express లో ఈ వార్త చదివి మిక్కిలి దుఃఖించాను. వెంటనే ఈ వ్యాసరచనకు ఉపక్రమించాను. రెండు నెలల్లో పూర్తి చేశాను. కాబట్టి దీని రచనాకాలం: 1966 జూలై-ఆగస్టు నెలలు. ఇప్పటికి 55 ఏళ్ళు దాటిపోయాయి కాబట్టి అక్కడక్కడ కొన్ని వాక్యాలు మార్చుకోవలసివచ్చింది)

మాటాడుతూ యథాలాపంగా దాన్ని చూశాను. వెంటనే నన్ను ఆకర్షించింది. మరోమారు చదివాను. హృదయాన్ని ఊపివేసింది. వ్రాసుకోవాలనుకున్నాను. దగ్గర ఏమీ కనబడలేదు. "History of Telugu literature" నోటుబుక్కు ఉంది. అందులో వ్రాసేసుకున్నాను. బి.ఏ. క్లాసులో మిత్రులందరికీ చదివి వినిపించాను. ప్రాచీన సాహిత్య ప్రియుడు, శుద్ధ గ్రాంథికవాది అయిన ఒక్క మిత్రుడు తప్ప అందరూ మెచ్చుకున్నారు. ('స్తన్య సన్నిధి' అనే ప్రయోగం తప్పన్నాడు ఆ గ్రాంథికవాది గుడ్లురిమి చూస్తూ. "నీవీ మోక్షణ వేళాయాం వస్త్రమూల్య విచారకాః" ఏం చేస్తాం మరి!). కళాశాల వదలిన తర్వాత గదికి వెళ్లి కంఠతా పట్టాను ఆ గేయాన్ని. ఆంధ్రాభ్యుదయోత్సవాలలో కళాశాల వేదికనుండి చదివాను. అందరి ప్రశంసలనూ అందుకుంది 'ఆర్తగీతం'. కాని ఇంత మంచి గేయాన్ని వ్రాసిన కవి ఎవరో మనకు పరిచయం లేదు కదా! అని బాధపడ్డాను. 'బాలగంగాధర తిలక్' అనేది గుప్తనామధేయం (Pen Name) అనుకొన్నాను. 'తిలక్' అంటే స్వాతంత్ర్య సమరయోధుడైన మహారాష్ట్ర తిలక్కే కాని, తెలుగులో ఎవరున్నా రనుకుంటాము? కనపడిన మిత్రులందరి దగ్గరా ఆర్తగీతాన్ని ప్రశంసించడం మొదలుపెట్టాను.

ఇంతలో దసరా సెలవులు వచ్చాయి. నేను భీమవరం నుండి తణుకు వచ్చాను. శ్రీపాద కృష్ణమూర్తి అనే మిత్రుడు మా యింటికి వచ్చాడు. అతనికి తెలుగు సాహిత్యమంటే వల్లమాలిన అభిమానం. ఏదో సందర్భంలో అతనితో "జూన్ నెల భారతిలో 'ఆర్తగీత' మనే గేయం వచ్చింది చూశావా? ఎవరో 'బాలగంగాధర తిలక్' అట. చాలా అద్భుతంగా వ్రాశాడోయ్!" అన్నాను.

"ఎవరో అంటా వేమిటి? తిలక్ ఎవరో నీకు తెలియదా? మన ఊరివాడే! టౌనుహాలు ప్రక్కనున్న తెల్లడాబా! రేపు నాతో రా! పరిచయం చేస్తాను." అన్నాడు. కృష్ణమూర్తి.

నేను మహా సంతోష పడ్డాను. తిలక్‌గారిని గురించి చాలా విషయాలు చెప్పాడు కృష్ణమూర్తి. తాను వాళ్ళింట్లో పిల్లలకు ప్రయివేట్లు చెపుతున్నాననీ, ప్రాచీన సాహిత్య పద్ధతులపై తనకున్న అభిప్రాయాలను తిలక్ ఎలా మార్చివేసిందీ, అన్నీ చెప్పాడు. తాను తిలక్ రచనలపై వ్రాసిన వ్యాసాన్ని చదివి వినిపిస్తా నన్నాడు. మాయింటి దగ్గర ఉన్న సపోటాతోటలోనికి వెళ్ళాం ఇద్దరమూ. వేసవి కాలాన్ని గురించి తిలక్ వ్రాసిన గేయంలోని కొన్ని పంక్తులు కృష్ణమూర్తి తన వ్యాసంలో

'కోట్' చేశాడు. అందులో -

"కాలం కదలదు - గుహలో
పులి పంజా విప్పదు - చేపకు
గాలం తగలదు -
... ...
ఎండుటాకులు సుడిగాలికి తిరిగెను
గిర్రున - వడగొట్టిన భిక్షుకి అరచెను
వెర్రిగ -
పంకా కింద శ్రీమంతుడు
ప్రాణం విడిచెను - గుండెక్రింద నెత్తురు
నడచెను............"

అనే పంక్తులూ, 'అద్దంలో జిన్నా' అనే రచనా ప్రశంసా నన్ను అమితంగా ఆకర్షించాయి. అవి పూర్తిగా చదవాలనుకున్నాను. (కృష్ణమూర్తి 'శ్యామకృష్ణ' అన్న కలం పేరుతో ఈ వ్యాసాన్ని 1956 జూన్ నెల భారతిలో ప్రకటించాడు).

ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూశాను. మర్నాడు ఏడు గంటలకు రెడీ అయ్యాను. ఎంత సేపు ఎదురు చూసినా కృష్ణమూర్తి రాలేదు. ఇంక ఆగలేక నేనే కృష్ణమూర్తి ఇంటికి వెళ్ళాను. ఇద్దరం కలిసి టౌనుహాలు ప్రక్కనున్న తిలక్ గారి యింటికి వెళ్ళాము.

ప్రాచీన పద్ధతిలో కట్టిన పెద్దడాబా, చుట్టూ ప్రహరీగోడ, పెద్ద చెక్క తలుపుల గేటు. ఆ గేటుపై 'బృందావనము' అని వ్రాసి ఉంది. ఆ గేటు వచ్చే పోయేవారితో ఎప్పుడూ తెరవబడే ఉండేది. గేటుదాటి ఇంటిలోపలికి వెళ్ళగానే ముందుగా వీథివైపు కటకటాలతో కూడిన పెద్దహాలు ఉంది. ఆ హాలుకు కుడిచేతి వైపున్న మూడు గదులలో తిలక్‌గారి కాపురం. ఎడమచేతి వైపున్న ఒకే ఒక్క గదిలో పుస్తకాల బీరువాలు రెండు, నాలుగు కుర్చీలు ఉన్నాయి. ఇదే తిలక్‌గారి డ్రాయింగు రూము. హాలుకు మధ్యనుండి తిన్నగా లోపల మరో ఇంట్లోకి మార్గం ఉంది. ఆ యింటిలో తిలక్‌గారి తల్లి, (అప్పటికి) అవివాహితులైన ముగ్గురు తమ్ములు ఉండేవారు. నేను, కృష్ణమూర్తి కలిసి డ్రాయింగ్ రూములోకి వెళ్ళాము........

తిలక్ అంటే ఎవరో ముసలివారు, సగం పళ్ళు ఊడిపోయి, నెరిసిన తలతో చాదస్తంగా మాట్లాడుతూ ఉంటాడనుకొన్నాను. కాని, అలా జరుగ లేదు. తెల్లటి

గ్లాస్కోపంచ, తెల్లటిషర్టు, పచ్చుదబ్బపండులాంటి శరీరచ్ఛాయ, మొగలిరేకులాంటి మనిషి. పడక కుర్చీలో, మెత్తటిదిండు వెనకాల వేసుకొని, నోటిలో వక్క నములుతూ, కుడిచేతి చూపుడు వ్రేలితోనూ బొటన వ్రేలితోనూ పొడుము పట్టు పట్టుకొని, సన్నని పెదవులతో చిరునవ్వు నవ్వుతూ, ఒక అతిసుందరమైన వ్యక్తి మమ్మల్ని ఆహ్వానించాడు. నమస్కరించి కూర్చున్నాను. చిన్న చిన్న ఉంగరాలు తిరిగిన నల్లజుట్టు. కొనదేరినముక్కు. సోగకళ్లు, సువర్ణ సవర్ణ శరీరచ్ఛాయ. ముప్ఫై సంవత్సరాలు దాటిన వయస్సు! నాకు చాలా ఆశ్చర్యం వేసింది. 'ఇప్పుడే ఇంత అందంగా ఉన్నాడే ఈయన, నిండు యౌవనంలో ఇంకా ఎంత అందంగా ఉండేవాడో!' అనిపించింది నాకు.

"ఇతనేనా నీ బి.ఏ.ఫ్రెండు?" అని అడిగారు తిలక్, కృష్ణమూర్తి వైపు తిరిగి.

"అవును, మిమ్మల్ని చూద్దామని వచ్చాడు" అన్నాడు కృష్ణమూర్తి. మల్లెపూలు విచ్చినట్లు మెల్లగా నవ్వారు తిలక్‌గారు.

"మీ ఆర్తగీతం చాలా బాగుందండీ! మా కాలేజీలో అనేకసార్లు చదివాను" అన్నాను నేను.

కలకలా నవ్వారు తిలక్‌గారు. "ఏదీ ఓ సారి చదువు" అన్నారు.

"కూర్చుని చదవలేను. నిలబడి చదువుతాను", అన్నాను.

తిలక్ పకపకా నవ్వి, 'ఆల్‌రైట్! అలాగే కానీ' అన్నారు.

నేను లేచి నిలబడి, గేయమంతా గంభీరంగా చదివాను.

"బాగుంది, ఇంకా కొంచెం పాజ్ ఇచ్చి చదివితే మరీ బాగుంటుంది.

దీనిని కాకినాడలో ఒకతను ఏకపాత్రాభినయం చేశాడట" అన్నారాయన.

"దీని నెప్పుడు వ్రాశారండీ?" అని ప్రశ్నించాను నేను.

"ఒకరోజు రాత్రి 8 గంటలవేళ మాయింటికి ఒక ముష్టి అమ్మి వచ్చింది. చిరిగిన బట్టలతో చంకన పిల్లవాణ్ణి పెట్టుకొని, అన్నం అడుక్కునేందుకు వచ్చింది. ఆ రాత్రి ఈ గేయం వ్రాశాను. ఇటువంటి పేదల్ని తలచుకొంటే ఒక్కొక్క రాత్రి నాకు నిద్రపట్టదు." అన్నారు. ఆగర్భ శ్రీమంతుడు ఇలా మాట్లాడుతుంటే నేను నిశ్చేష్టుడనై అలా ఉండి పోయాను........

"నేను చూశాను నిజంగా మూర్తీభవత్ దైన్యాన్ని, హైన్యాన్ని,
క్షుభితాశ్రు కల్లోల నీరధుల్ని, గచ్చుత్ శవాకార వికారుల్ని;

ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి? ఏ విజ్ఞాన ప్రకర్షకుపశ్రుతి?
ఏ బుద్ధదేవుని జన్మభూమికి గర్వస్మృతి?
... ...
ఒక్క నిరుపేద ఉన్నంతవరకు,
ఒక్క మలినాశ్రుబిందు వొరగినంత వరకు,
ఒక ప్రేవు ఆకలి కనలినంతవరకు,
ఒక శుష్కస్తనసన్నిధిని క్షుధార్తి నేడ్చు పసిపాప ఉన్నంతవరకు,
ఒక తల్లి నీరవాక్రోశరవమ్ము విన్నంతవరకు,
ఒక క్షతదుఖితహృదయ మూరడిల్లినంతవరకు,
నాకు శాంతి కలుగదింక నేస్తం, నేను నిగర్విసైనాను;
ఈ సిగ్గులేని ముఖాన్ని చూపించలేను...."

ఇటువంటి కవిత్వం ప్రపంచంలో aristocratic family లో పుట్టిన ఏ కవీ వ్రాయలేదు! ఒక ఆరగంటసేపు వారితో సంభాషించి, ఇంటికి వెళ్ళపోయాను. "Be coming to me. You are are always welcome" అన్నారు. నేను వెళ్ళిపోతుంటే ఎంతో ఆప్యాయంగా గేటుదాకా నడిచివచ్చి మమ్మల్ని సాగనంపారు. సంతోషం నిండిన హృదయంతో ఇంటికి వెళ్ళాను.

ఇలా జరిగింది మా ప్రథమ పరిచయం. అప్పటినుండి అంటే 1955 సెప్టెంబరు నుండి, 1961 జూన్‌లో నేను తిరుపతి వెళ్ళే వరకూ, ఆరు సంవత్స రాలపాటు తిలక్‌గారితో అత్యంత సన్నిహితంగా మసిలాను. ఒక్కరోజు నన్ను చూడకపోతే ఉండలేకపోయేవారు! నేనూ అంతే! అందుచేతనే వారి అభిరుచులనూ, అలవాట్లనూ, వారు నాతో అతిరహస్యంగా ముచ్చటించిన విషయాలు కూడా ఏమీ దాపరికం లేకుండా బయట పెడుతున్నాను.... సహృదయంతో స్వీకరించవలసిందిగా ప్రతిపాఠకునీ కోరుతున్నాను. కవిగా తిలక్‌ను చూపించటం కన్నా, మామూలు మనిషిగా తిలక్‌ను చూపించటానికే ఎక్కువ ప్రయత్నం చేశాను ఈ వ్యాసంలో.

2. జననం - జనకుని ప్రభావం

చనిపోయేనాటికి (1966 జూన్ 30వ తేది నాటికి) బాలగంగాధర తిలక్‌గారికి 44 సంవత్సరాలు నిండి 45వ సంవత్సరం నడుస్తోంది. 1955లో

నాకు పరిచయమైనప్పుడు "నీ వయస్సెంత?" అని నన్ను అడిగారు. ఇరవై సంవత్సరాలని చెప్పాను (నేను 1935లో పుట్టాను). "నేను నీ కన్నా పద్నాలుగేళ్ళు పెద్దవాణ్ణి. నా వయస్సు 34 సంవత్సరాలు" అన్నారు తిలక్. 1921 ఆగస్టు నెలలో 1వ తేదీని పుట్టారు తిలక్. వీరి స్వగ్రామం పశ్చిమ గోదావరిజిల్లా 'మండపాక' గ్రామం. ఇది తణుకు పట్టణానికి నైరుతిమూలలో రెండుమైళ్ళ దూరంలో ఉంది. తిలక్‌గారు పుట్టింది ఆ గ్రామంలోనే! తరువాత వీరి తండ్రిగారు (దేవరకొండ సత్యనారాయణ మూర్తిగారు) పిల్లల చదువులకూ, కోర్టు వ్యవహారాలకు అనువుగా ఉంటుందని తణుకులో ఇల్లు కట్టుకున్నారు.

దేవరకొండవారిది పశ్చిమ గోదావరి జిల్లాలో పేరుమోసిన వెలనాటి వైదిక బ్రాహ్మణ కుటుంబం. సిరిసంపదలతో తులతూగే కుటుంబం. సాధారణంగా సిరి ఉన్నవారికి సంతానం ఉండదు. కాని, దేవరకొండవారి వంశం ఈ సూత్రానికి అపవాదం. తిలక్‌గారి తల్లిదండ్రులు: రామసోదెమ్మ–సత్యనారాయణమూర్తి. తిలక్‌గారు ఏడుగురు అన్నదమ్ములతోనూ, ఐదుగురు అప్పచెల్లెండ్రతోనూ కళకళలాడే కుటుంబంలో జన్మించారు. అన్నదమ్ములలో ఈయన రెండవ వారు; మొత్తం సంతానంలో ఆరవవారు.* సోదరులందరూ విజ్ఞానవంతులూ, వినయశీలురూ! తిలక్‌గారి పెద్దతమ్ముడు శివకుమారశాస్త్రిగారు ఏలూరు జిల్లా కోర్టులో లాయరుగా పనిచేశారు. తరువాత తమ్ముడు పార్థసారథిగారు హైదరాబాదు హైకోర్టులో లాయరుగా పనిచేశారు. వీరు కుమార్తె శ్రీమతి లక్ష్మీ పార్థసారథిగారు IAS ఆఫీసరయారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నతోద్యోగాలు చేశారు. తణుకులో తిలక్‌గారి విగ్రహం పెట్టించింది ఈమెయే. ఆ తరువాతి తమ్ముడు గంగాధర రామారావుగారు తణుకు తాలూకా కోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఈయన మంచి సాహిత్య ప్రియుడు; కథారచయిత. చివరి తమ్ముళ్ళు ధనంజయ, తిమ్మేశ్వరరావులు ఏమీ ఉద్యోగాలు చేసినట్లుగా లేదు.

* తిలక్‌గారి అక్కచెల్లెండ్రు, అన్నదమ్ములు జ్యేష్ఠానుక్రమంగా – (1) సీతారత్నం– (2) మాణిక్యాంబ – (3) అచ్యుతాంబ – (4) సూర్యకాంతం – (5) పెద్ద అన్నప్ప – (6) బాలగంగాధర తిలక్ – (7) శివకుమారశాస్త్రి – (8) ఎల్లా బాలత్రిపుర సుందరి – (9) పార్థసారథి – (10) గంగాధర రామారావు – (11) ధనంజయ – (12) తిమ్మేశ్వరరావు (ఈ తిమ్మేశ్వరరావు తణుకు హైస్కూల్లో నా సహాధ్యాయి.)

వీరి తండ్రి సత్యనారాయణమూర్తిగారు తెలుగులో మంచి పండితులు. రాజకీయాలన్నా, స్వాతంత్ర్య సమరమన్నా చెవికోసికొనేవారు. లోకమాన్య బాలగంగాధర తిలక్ అప్పుడు భారత స్వాతంత్ర్య సమరాన్ని నడుపుతున్నాడు. సత్యనారాయణమూర్తిగారికి తిలక్ అంటే పంచప్రాణాలూను. అందుచేతనే తన రెండవ కుమారుడు పుట్టగానే "బాలగంగాధర తిలక్" అని ఆ మహానాయకుని పేరు పెట్టి తన దేశభక్తిని వెల్లడించుకున్నారు. కాని ఈ పుత్రుడు రాజకీయాల జోలికి పోకుండా, కవితాకన్యను వరించి, వరింపజేసుకొన్నాడు మన అదృష్టం కొద్దీ! తణుకు హైస్కూలుల్లో స్కూలుఫైనల్ పాసయ్యాక మద్రాసువెళ్ళి, ఇంటర్మీడియేట్ చదివారు. కాని అనారోగ్య కారణాలవల్ల దాన్ని పూర్తిచేయకుండానే ఇంటికి తిరిగి వచ్చేశారు. తరువాత విశాఖపట్నం మిసెస్. ఏ.వి.యన్. కాలేజీలో చేరారు ఇంటర్లో. కాని ఆరోగ్యం సరిగాలేక అక్కడా చదువు పూర్తిచేయలేకపోయారు. తిరిగి తణుకు వచ్చేసి హాయిగా చదువుకుంటూ, కవిత్వం వ్రాసుకుంటూ కూర్చున్నారు.

కవితిలక్‌నకు తండ్రిగారంటే చాలా అభిమానం. తనకు కవిత్వాభినివేశం తండ్రివద్దనుంచే సంక్రమించిందనేవారు. నా దగ్గర తరచుగా తండ్రిగారి ప్రశంస తెస్తూ ఉండేవారు. (హాల్లో ఎదురుగా తండ్రిగారిది నిలువెత్తు ఆయిల్ పెయింటింగ్ ఉండేది. తిలక్‌గారిది అంతా తండ్రిగారి పోలికే!).

"మా నాన్న భారతంలో పద్యాలు గడగడా అప్పజెప్పేవాడు. ఆయనకు పాలిటిక్స్ అంటే మహాయిష్టం. అందులోనూ గాంధీకన్నా తిలక్ అంటే మరీ యిష్టం. ఆ పేరే నాకూ పెట్టాడు. నేను మంచి కవిని అవుతానని మా నాన్న అప్పుడప్పుడు అంటూ ఉండేవాడు. నేను పుస్తకాల విషయంలో ఎంత డబ్బు ఖర్చుచేసినా ఏమి అనేవాడు కాదు. నే నొకసారి బొంబాయి వెళ్ళి ఆరువందల రూపాయల పుస్తకాలకు అడ్వరు ఇచ్చి, తణుకు వచ్చేశాను. నాలుగు రోజుల్లో నా పేర పార్సెల్ వచ్చింది. నన్ను ఏమీ అనలేదు మా నాన్న. 'ఈ పుస్తకాలన్నీ నీకు అవసరమా?' అని మాత్రం అడిగాడు. నేను 'ఔను' అన్నాను. అంతే! ఇంకేమీ మాటాడకుండా ఆ వి.పి.పి.ని విడిపించి నాకు ఇచ్చాడు." అని చెబుతూ ఉండేవారు నాతో.

తిలక్‌గారి మూడవ తమ్ముడు కథారచయిత అయిన గంగాధరరామారావుగారి వ్యాసాన్నిబట్టి తిలక్‌గారి అనారోగ్యానికి మూలకారణం వీరి తండ్రిగారి

హఠాన్మరణం అని తెలుస్తోంది:-

"1944 జూన్‌లో మా నాన్నగారు పుష్కరస్నానానికి కానూరు అగ్రహారం వెళ్ళారు. అక్కడే గుండెపోటు వచ్చి, గోదావరి ఒడ్డునే మరణించారు. అప్పటినుంచి తిలక్ ఆరోగ్యం క్షీణించింది. అతనికి ఒక రకమైన ప్రాణభయం ఆవరించింది. అతడు చిన్నప్పటినుంచి జీర్ణసంబంధమైన సమస్యతో బాధపడేవాడు. దానివలన అప్పుడప్పుడు గుండెదడ వచ్చేది. అదే యిప్పుడు (1944లో) వస్తే అది హార్ట్‌ఎటాక్ అని భయం పెంచుకున్నాడు. ఈ అనవసర ఆందోళన ఒక మానసిక సమస్యగా క్రుంగదీసింది. డాక్టర్ల చుట్టూ తిరిగి వందలకి వందలు ఖర్చుచేశాడు. విశాఖ పట్టణం, మద్రాసులతో ఉన్న ఎక్స్‌పర్ట్ డాక్టర్లు చూసి 'నీ గుండె రాయిలా ఉంది' అని భరోసా యిచ్చారు. అయినా తిలక్ ధైర్యం తెచ్చుకోలేకపోయాడు. దీనికి తోడు ఆర్థికసమస్యలూ చుట్టుముట్టాయి" (-"మా అన్నయ్య తిలక్", తిలక్ సాహితీ సమాలోచనమ్, 2008, పుట-51)

ఈ గంగాధర రామారావుగారు వ్రాసిన దానినిబట్టి చూస్తే తిలక్‌గారికి గుండెజబ్బు లేదనీ, ఉన్నదని ఊహించుకొని భయపడ్డారని మనం భావించవలసి వస్తుంది. నేనొకసారి డా॥ రాచకొండ నరసింహశర్మ, M.D. (ప్రముఖ రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి తమ్ముడు, కవి, అనువాదకుడు) తో తిలక్‌గారి వ్యాధిని గురించి చర్చించాను. వారు తిలక్‌గారికి వచ్చిన వ్యాధిపేరు "Hypo-chondriasis" అనీ, లేని జబ్బులు ఉన్నట్లుగా భావించుకొని బాధపడటం అనీ అన్నారు. కాని 45 సంవత్సరాలు కూడా నిండకుండానే తిలక్ చనిపోవడంవల్ల వారికి గుండెజబ్బు ఉన్నదనే మనం తీర్మానించుకోవలసివుంటుంది. తిలక్ కూడా "బాధాగళము" అనే ఖండికలో "గుండియపోటుతో బ్రతుకు కోసలు వంకరలయ్యె" అని వ్రాసుకున్నారు కదా! అయినా, తిలక్ ఆధివ్యాధులను గురించి ఏదీ నిశ్చయంగా చెప్పలేకపోతున్నాను.

తిలక్ తమ్ముడుగారు వ్రాసిన దానినిబట్టి, తండ్రి సత్యనారాయణమూర్తి గారంటే తిలక్‌గారికి చెప్పలేనంత ప్రేమ అనీ, వారి ఆకస్మిక మరణంతో తిలక్ upset అయ్యారనీ, దీనితో వారికి రకరకాల మానసిక రోగాలు, నరాల వ్యాధులు, గుండెపోటు వచ్చాయని మనం అనుకోడానికి అవకాశం ఉంది.

వీరి నాన్నగారు దివంగతులయ్యాక ఏడుగురు అన్నదమ్ములూ ఆస్తిపాస్తులు పంచుకున్నారు. (ఒక్కొక్కరు యాభై యకరాల మాగాణి పొలమూ, యాభైవేల

రూపాయల రొక్కం పంచుకొన్నారని వీరి సోదరులు గంగాధర రామారావుగారు నాతో చెప్పిన జ్ఞాపకం.) కాని, భూముల విషయం, వడ్డీవ్యాపారం, పెండ్లి పేరంటాల ఆధ్వర్యం అంతా వీరి అన్న "పెద్ద అన్నప్ప" గారే నిర్వహించుకుంటూ వచ్చారు. (వీరు మంచి వ్యవహారజ్ఞులు. వీరు తణుకులోనే ప్రత్యేకంగా ఒక మేడలో ఉండేవారు.)

బాల్యంలో ఒకసారి తిలక్‌గారికి విపరీతంగా జబ్బు చేసిందట. ఎన్ని మందు లిచ్చినా తగ్గలేదు. మండపాకకు ఆరుమైళ్ళ దూరంలో ఉన్న "రేలంగి" అనే గ్రామంలో ఎవరో మంత్రజలం, విభూతి యిస్తారనీ, ఆ జలం త్రాగించి విభూతి నొసట పెడితే జ్వరం తగ్గిపోతుందనీ చెప్పారు ఒకరు. అర్ధరాత్రివేళ ఎలా వస్తుంది ఆ మంత్రజలం? తెల్లవారే వరకూ ఆగితే, పిల్లవాడు బ్రతికేలా లేడు. తల్లిదండ్రుల కేమీ తోచలేదు. వారి వద్దనున్న ఒక రైతు "నేను వెడతానండీ వంతులుగారూ" అని సత్యనారాయణమూర్తిగారితో చెప్పి, చిన్న లాంతరు తీసికొని, ఆరుమైళ్ళూ నడిచి వెళ్ళి, ఆ విభూతి, మంత్రజలం తెచ్చాడట. ఆ రైతు సేవా ధర్మాన్నీ, విశ్వాసాన్నీ తిలక్‌గారు పదే పదే తలచుకొనేవారు. "మనిషికి విశ్వాసం. పరోపకారబుద్ధీ వుండాలి. ఇవి లేనివాడు మానవుడే కాదు" అని అంటూ ఉండేవారు. ఈ సత్యాన్ని "నల్లజర్ల రోడ్డు" అనే కథలో నిరూపించారు.

3. పేకాట – బ్రాకెట్టు

పెరటి చెట్టు మందుకు పనికిరాదన్నారు పెద్దలు. తణుకులో తిలక్‌గారిని గౌరవించేవారు ఆ రోజుల్లో చాలా తక్కువగా ఉండేవారు. తిలక్‌గారు ఆగర్భ శ్రీమంతులైనా క్రమక్రమంగా ఆస్తినంతా తన అనారోగ్యానికి (గుండెజబ్బుకు, నరాలకు సంబంధించిన వ్యాధికి) వైద్యం చేయించుకోవడంలోనూ, పేకాటలోనూ, బ్రాకెట్టు (కాటన్ మార్కెట్ నంబర్స్) లోనూ, మిగిలినది స్టెయిన్‌లెస్ స్టీల్ వ్యాపారంలోనూ పాడుచేశారని తెలుస్తోంది. అందుచేత 'డబ్బు సంపాదన ముఖ్యం, అదే గౌరవ హేతువు' అనుకునే కొందరు తణుకు పెద్దలు వీరిని చులకనగా చూసేవారు. "తిలక్ అంటే వాడేనా ఆ పేకాట ఆడేవాడు?" అని అడిగి, మనం 'అవు'ననే వరకూ కొంచెం పాజ్ యిచ్చి, ఆ తర్వాత పెదవి విరిచి "నా మొహం! వాడి దగ్గర ఏమీ లేదు! అంతా తగలేశాడు!" అనేవారు ఈ పెద్దలు. ఇటువంటి మాటలు మండపాకలో ఉన్న వీరి బంధుకోటి కూడా అనేది. అది విని నేను

చాలా బాధపడేవాణ్ణి. (నేను వారితో స్నేహం చేస్తున్నానని కొందరు "పెద్దలు" నన్ను ఇదే ధోరణిలో హెచ్చరించారు కూడా!). ఇటువంటి పెద్ద లంటే తిలక్‌గారికి అరికాలిమంట నెత్తి కెక్కేంది. "జరీ కండువా పెద్దపులు"లనీ, "పరువు ప్రతిష్ఠల గాడిద"లనీ ఈ పెద్దలను అధిక్షేపించేవారు తమ కవిత్వంలో.

స్టీల్ వ్యాపారం మానివేసినా బ్రాకెట్టూ, పేకాటా చివరి వరకూ ఆడుతూనే ఉన్నారు తిలక్‌గారు. ఉండబట్టలేక ఒకసారి ఆయన్ని అడిగి వేశాను... "ఏమండీ! ఈ పేకాట ఎందుకు ఆడుతారు? ఈ టైంలో కూడా చక్కని రచనలు చేయవచ్చును గదా?"

తిలక్‌గారు చిరునవ్వు నవ్వి "ప్రతి మనిషికీ ఏదో ఒక హాబీ వుంటుంది. అస్తమానం రాస్తూ కూర్చోమంటే ఛస్తాను. నాకు పేకాట హాబీ!" అన్నారు. తనకు పేకాటలో ప్రవేశం ఎలా కలిగిందో కారణం కూడా చెప్పేవారు. "ఇది నాకు ఎలా అలవాటయిందో తెలుసా? 1946 నుంచీ 54 వరకూ. అంటే ఎనిమిదేళ్ళ పాటు–నేను 'Nervous break-down'తో బాధపడ్డాను. ఆ ఎనిమిదేళ్లు మంచం మీద నుంచి లేవలేదు, ఏమీ తోచేది కాదు. పేకాట నేర్చుకొని మిత్రులతో కాలక్షేపం చేశాను."

పేకాటకు మిత్రులు లేనప్పుడు, ఇంట్లో అన్నదమ్ములకోనూ, భార్య ఇందిరమ్మ గారితోనూ కూడా చీట్లాట ఆడుతూ ఉండేవారు తిలక్. కొంతకాలం క్లబ్ వీరింట్లోనే నడిపారు. కాటన్ మార్కెట్ మేనేజరుగాకూడా ఉన్నారు కొన్నాళ్లు. తణుకు టౌనుహాల్లో రాత్రి తెల్లవార్లూ చీట్లాట ఆడిన రోజులు చాలా ఉన్నాయి. (అటువంటి రాత్రులలో నన్ను వారింటి దగ్గర పెళ్ళాంపిల్లలకు సాయం పడుకోమనేవారు.) పేకాట నిమిత్తం ప్రత్యేకంగా పనిగట్టుకొని రాజమండ్రీ క్లబ్బుకు వెళ్ళేవారు.

తణుకులో తిలక్‌గారి యింటికి ఎదురుగుండానే టౌన్‌హాలు (క్లబ్). అక్కడ లాయర్లంతా చేరి పేకాడుతూ ఉండేవారు. చుట్టుప్రక్కల ఊళ్ళనుండి కూడా పేకాట రాయుళ్ళు అక్కడికి వస్తూ ఉండేవారు. తిలక్‌గారు తరచుగా ఆ టౌన్‌హాల్లో పేకాడుతూ ఉండేవారు. చేతిలో డబ్బుల్లేనప్పుడు మాత్రం నాతో కబుర్లు చెపుతూ ఇంట్లోనే కూర్చుండి పోయేవారు. కాని మనస్సంతా ఎదురుగా ఉన్న టౌనుహాలు మీదనే ఉండేది. ఒక్కొక్కసారి గేటు దాటి బయట రోడ్డుమీదికి వెళ్ళేవారు. టౌనుహాలు వైపు చూస్తూ, ఒక్క పొడుంపట్టు గట్టిగా పీల్చి, ప్రక్కనున్న నాతో

"ఎంత స్టేక్ ఆడుతున్నారో?" అనేవారు నాటకంలో స్వగతంలాగ. (నాకు అప్పటికీ ఇప్పటికీ పేకాటలో ఓనమాలు తెలియవు. "స్టేక్" అంటే అసలే తెలియదు!) పేకాట అంటే అంతవ్యసనం తిలక్‌గారికి!

మొత్తంమీద పేకాట అంటే తిలక్‌గారికి పంచ ప్రాణాలూను. ('సౌందరనందం' జంటకవి కాటూరి వేంకటేశ్వరరావుగారికి కూడా ఈ అలవాటు ఎక్కువగా ఉండేది. మా గురువర్యులు ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తామొక్కరే కూర్చుని పేకాట ఆడుకుంటూ ఉండేవారు). శ్రీమంతుల కిది తప్పని జబ్బు కాబోలు. కొందరు కవులలోను రచయితలలోను కూడా ఇది ఎక్కువగా కనబడుతోంది. ఈ పేకాట ఆడేవాడు పెళ్ళాం పిల్లల్ని ఎలా ఏడిపిస్తాడో తెలుపుతూ 'జ్యోతి' పత్రికలో "దొంగ" అనే కథ వ్రాశారు తిలక్‌గారు. మానవజీవితాన్ని జూదంతో (పేకాటతో) పోలుస్తూ, ఇతిహాసాలను చరిత్రను స్పృశిస్తూ "కాయ్ రాజా కాయ్" అనే వచనగీతం కూడా వ్రాశారు.

ప్రతిరోజూ రాత్రి ఏడుగంటలవేళ, తిరిగి పదిగంటలవేళ ఒక శ్రోత్రియ బ్రాహ్మణుడు తిలక్ వద్దకు వచ్చి, గదిగుమ్మం దగ్గర నమ్రతతో నిలబడేవాడు. అతన్ని చూడగానే తిలక్‌గారు లేచి గదిలోంచి బయటకు వచ్చేసి, ఆ బ్రాహ్మడితో రహస్య సంభాషణ జరిపి, తిరిగి వచ్చేవారు. తన చుట్టూ క్రొత్తవారు ఉన్నప్పుడు మాత్రమే ఇలా చేసేవారు. నే నొక్కణ్ణి ఆయన దగ్గరుంటే గదిలోంచి బయటకు రాకుండానే "ఎంత" అని అడిగేవారు. ఆ బ్రాహ్మడు ఏవో నంబర్లు చెప్పేవాడు. అంతకు ముందుగానే తనవద్ద కూడి ఉంచుకున్న పట్టికను పరిశీలించి తిలక్‌గారు కొన్ని నంబర్లు చెప్పి వెళ్లమనేవారు. నాకు మొదట్లో ఏమీ అర్థమయ్యేది కాదు. తరువాత తరువాత ఊళ్లోవాళ్లు చెప్పుకునే దాన్నిబట్టి అది "బ్రాకెట్టు ఆట" అని తెలుసుకొన్నాను.

"ఈ పనులన్నీ ఏమిటండీ!" అనేవాణ్ణి ఒక్కొక్కప్పుడు.

"ఇది ఆడనివాడు ఎవడున్నాడోయ్! కొందరు ధైర్యవంతులు స్వయంగా ఆడుతారు. మరికొందరు పెద్దలు చాటునుంచి ఆడిస్తారు సూత్రదారుల్లాగ! మన ఊళ్లో వేదం వల్లించే శ్రోత్రియ బ్రాహ్మణుడు మొదలుకొని, అంట్లు తోమే అప్పలమ్మ వరకూ ఈ ఆట ఆడుతారు" అని పక పక నవ్వేవారు.

తిలక్‌గారు చెప్పింది నిజమే! ఆయన దగ్గరకొచ్చే బ్రాహ్మడు మా యింట్లో మా తాతగారి ఆరాధనకు (తద్దినానికి) మడికట్టుకొని, మంత్రాలు గడగడా

చదివేవాడు. సద్బ్రాహ్మణుడు కదా అని సంభావన రెండు రూపాయలు ఎక్కువ ఇచ్చేవాణ్ని. ఆ సంభావన పుచ్చుకొని బ్రాకెట్ ఆఫీసువైపు దారితీసేవాడు.

బ్రాకెట్ ఆట చాలామంది ఆడుతారు అని తిలక్‌గారు చెప్పింది ప్రత్యక్షర సత్యమని తరువాతి కాలంలో తెలుసుకున్నాను. తిలక్‌గారి కన్నా సీనియర్ సాహిత్యవేత్తలు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు, కథకచక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కూడా ఈ "బ్రాకెట్ ఆట" (కాటన్ మార్కెట్ ఓపెనింగ్ క్లోజింగు నెంబర్ల మీద బెట్టింగ్ కట్టడం) ఆడేవారు. పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు "మిసిమి" మాసపత్రికలో "విశ్వనాథతో మధురవాణి ఇంటర్వ్యూ" అనే వ్యాసం వ్రాశారు. అందులో మధురవాణి చేత ఒక ప్రశ్న అడిగిస్తారు! "మీరు బ్రాకెట్టు ఆడుతారటగా?" ఈ ప్రశ్నకు విశ్వనాథవారి సమాధానం: "అవును జూదం ఒక వ్యసనం. ఓపెనింగూ, క్లోజింగూ ఆ ఛార్టు అంతా నా దగ్గర ఉండేది. నేనేమిటి? కథకచక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కూడా ఆడేవాడు!" తిలక్‌గారు "గొంగళి పురుగులు" అనే వచనకవితలో "బ్రాకెట్ల ఓపెనింగులూ క్లోజింగులు" అని వ్రాశారు.

ప్రముఖ ఉర్దూకవి 'మీర్జా గాలిబ్' పెద్ద జూదగాడు. ఢిల్లీలో ఒక జూదగృహంలో ఉండగా ప్రభుత్వం ఆయన్ని అరెస్టు చేసి, రెండు మూడు రోజులు జైల్లో పెట్టింది. అయినా గొప్పకవి కావడం వల్ల కారాగారవంలో కూడా ఆయన్ని చాలా గౌరవంగా చూసింది ప్రభుత్వం. రష్యన్ ప్రసిద్ధ రచయిత "దాస్తోవ్‌స్కీ" భయంకరమైన జూదగాడు. ఇవన్నీ ఎందుకు? ఒక్క ముక్కలో చెప్పేస్తాను అసలు విషయం. మహాభారతంలో సాక్షాత్తు ధర్మమూర్తి అవతారమైన ధర్మరాజంతటి మహాత్ముడే సకలసద్గుణసంపన్నుడే జూదమాడాడు. ఒకసారి కాదు, వరసగా రెండుసార్లు ఆడాడు. మొదటిసారి బార్యను (ద్రౌపదిని) పణంగాపెట్టి ఆడాడు. ఇంతకన్నా దారుణం ఉంటుందా? దుర్యోధనుడు ద్రౌపదీ వస్త్రాపహరణ ప్రయత్నంతో ఆమెను అవమానించబోయాడు. శ్రీకృష్ణపరమాత్మ ఆమెను రక్షించాడు. ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరాలిచ్చి, పాండవుల రాజ్యాన్ని వారికి తిరిగి ఇచ్చివేశాడు. పాండవుల ద్రౌపదీ సమేతులై ఇంద్రప్రస్థానికి వెళ్ళిపోతున్నారు. ఇంకా గమ్యస్థానం చేయలేదు. మార్గమధ్యంలో ఉన్నారు. కుటిలుడు, అసూయాపరుడు అయిన దుర్యోధనుడు తండ్రిని ఒప్పించి ధర్మరాజును పునర్ద్యూతానికి పిలిపించాడు. ధర్మరాజు ఏ మాత్రమూ సిగ్గులేకుండా, అంతకు కొన్ని ఘడియలకు పూర్వమే తన

భార్యకు జరిగిన తీవ్రమైన అవమానాన్ని పరగణించకకుండా, తిరిగివచ్చి, మళ్ళీ జూదమాడి, రాజ్యమంతా ఒడ్డి, ఓడిపోయి, అడవుల పాలయ్యాడు. (13 ఏళ్ళు అరణ్యవాసం, ఒక ఏడు అజ్ఞాతవాసం చేశాడు.) అంతేకాదు, ఇంకో విచిత్రం చూడండి. ధర్మరాజు అరణ్యవాసానికి వెడుతూ వెడుతూ ఏమి పట్టుకొని వెళ్ళాడో తెలిస్తే పాఠకులు ఆశ్చర్యపోతారు! తాను, తమ్ములు, భార్య అష్టకష్టాలు పడటానికి మూలకారణమైన జూదంలోని పాచికలు తీసికొని వెళ్ళాడు. బంగారు పాచికలు, వెండి పాచికలు, ఇనుప పాచికలు మూడు సెట్లు భద్రంగా మూటకట్టుకొని పట్టుకొని వెళ్ళాడు. (ఈ పాచికలతోనే అజ్ఞాతవాసంలో విరాటరాజును ఆనంద పరిచాడు.) ఇంతకన్నా వ్యసనపరుడు ఈ భూమండలంలో ఇంకెవరైనా ఉంటాడా? (ధర్మరాజు కన్నా కొన్ని వందల ఏండ్లు పూర్వమున్న నలమహారాజుకూడా జూదంవల్లనే సర్వనాశనమై పోయి, భార్యను కోల్పోయాడు.)

నేను పైన చెప్పిన కవులు, రచయితలు, ధర్మరాజుకన్నా గొప్పవాళ్ళు కారుకదా! విశ్వనాథవారు చెప్పినట్లుగా "జూదం ఒక వ్యసనం!" అది ఎంతటి మహాత్ముణ్ణి అయినా సరే లోబరచుకుంటుంది! ఇక మన "విశ్వనాథ-శ్రీపాద-తిలక్"లు ఒక లెక్కా? జమా? మన ప్రసిద్ధకవులు, రచయితలలో కొందరు భయంకరమైన త్రాగుబోతులున్నారు. ఆ వ్యసనం వారి కవిత్వాన్నికాని, రచనాసామర్థ్యాన్నికాని తగ్గించలేదు కదా! అలాగే ఈ ద్యూతవ్యసనం కూడా!

4. వక్కపొడి - ముక్కుపొడి

తిలక్‌గారు ఎక్కువగా వక్కపొడి నమిలేవారు. వక్కపొడి అంటే ప్యాకెట్లలో అమ్మే వక్కపొడి కాదు. పల్చని పోకచెక్కలు ఏరి ఏరి కొనుక్కొనే వారు. ఈ పక్కలు కొనుక్కొనేందుకు వారు ప్రత్యేకంగా రిక్షాలో బజారుకు వెళ్ళి, తెచ్చుకొనేవారు. ఎప్పుడూ వక్క నోట్లో నానుతూ ఉండవలిసిందే! (విశ్వనాథ సత్యనారాయణగారికీ, తిలక్ గారికీ ఈ విషయంలో చాలా పోలిక ఉంది).

తిలక్‌కు సిగరెట్లూ చుట్టలూ త్రాగే అలవాటు లేదు కాని, ముక్కుపొడి పీల్చందే ఒక్కక్షణం కూడా ఉండేవారు కారు. కాటూరివారికి చుట్టలాగ తిలక్ గారికి ముక్కుపొడుం ట్రేడ్ మార్క్. ఈ ముక్కుపొడుం కూడా ఏ కొట్లో పడితే ఆ కొట్లో కొనుక్కునేవారు కారు. తణుకులో తాలూకా ఆఫీసు ఎదురుగా నూలు సూర్యారావు అనే ఆయన షోడాషాపు పెట్టాడు. ఆయన దగ్గర చాలా ప్రశస్తమైన

ముక్కుపొడుం ఉండేది. రిక్షామీద స్వయంగా వెళ్ళి కాని, నాలాంటి శిష్యమిత్రుణ్ణి పంపించికాని, ఆ పొడుం తెప్పించుకొనే వారు. మిత్రుడూ, తిలక్ అభిమాని అయిన శ్రీ చల్లా నరసింహారావు 'మీనా బిస్కెట్ షాప్' పెట్టాక అతనిదగ్గర పొడుం కూడా వాడేవారు. అతడు కేవలం తిలక్‌గారి కోసమే బిస్కెట్ల అమ్మకానికి పొడుం కూడా జోడించాడు. మంచి ముక్కుపొడుం తెప్పిస్తే తిలక్‌గారు తన అంగడికి పదే పదే వస్తారని సంతోషపడేవాడు నరసింహారావు.

ముక్కుపొడుం చిన్న రేకుడబ్బాలో పోసుకొని. ఎడమ చేతితో పట్టుకొనే వారు. కుడిచేతి బొటన వేలు, చూపుడు వేలు – ఈ రెండింటితో ఒకపట్టు పొడుం నొక్కి పట్టి ఉంచేవారు. మాట్లాడేటప్పుడు "do you know ? do you know?" అని తరచుగా అనేవారు. ఇది వారి 'మేనరిజం'. ఎడమ అరచెయ్యి, కుడిచేతి వ్రేళ్ళు ఎప్పుడూ ముక్కుపొడుం వాడడంవల్ల దోరగా ఉండేవి. వారి డ్రాయింగ్ రూము అంతా చాలా శుభ్రంగా ఉండేది. కాని వారి పడక కుర్చీకి రెండు వైపులా నేల మీద గోధుమవన్నె త్రాచుపాములాగ పొడుం చీదిన మరకలు చాలా ఉండేవి!!

"ముక్కుపొడుం పీల్చేవాళ్ళకి ఎప్పుడూ జలుబే" అనేవారు. ఇంత ప్రియమైన పొడుం డబ్బీ అప్పుడప్పుడు మాయమై పోయేది! దానికోసం వెతుక్కుంటూ ప్రతివాడి మీదా చిరాకుపడేవారు. పనివాణ్ణి పట్టుకొని తిట్టేవారు. "మీరే ఎక్కడో పెట్టారండీ!" అని నవ్వుకుంటూ, వాడు దాన్ని వెదకి వెదకి, ఆఖరికి కృతకృత్యుడయ్యేవాడు!!

5. అమృతాంజనం

తిలక్‌గారికి ఎప్పుడూ పడిశంపట్టి ఉండేది; తలనొప్పి కూడా తరచు వచ్చేది. అందుచేత అమృతాంజనం వాడుతూఉండేవారు. ఎక్కువగా అమృతాంజనం రాయడంవల్ల కణతల దగ్గర చర్మం కొంచెం డాగుపడినట్లు ఉండేది.

తరచుగా మలబద్ధకంతో బాధపడుతూ ఉండేవారు. కాబట్టి ఎక్కువగా 'ఫ్రూటాల్' (FRUTAL) త్రాగేవారు. వీరికి చిన్నప్పటినుండి అజీర్ణ సమస్య ఉందని వీరి తమ్ముడు డి.జి. రామారావుగారు "మా అన్నయ్య" అనే వ్యాసంలో వ్రాశారు. దానివల్ల కాబోలు "ఈనో" (ENO) అనే మందు వాడేవారు. హోమియోపతీ గ్రంథాలు చదివి, ఆ వైద్యంకూడా ప్రయోగిస్తూండేవారు. పెమ్మరాజు రాజగోపాలం అనే మిత్రునివల్లకూడా వీరికి హోమియోపతీ మీద అభిరుచి ఏర్పడి ఉండవచ్చు.

6. దుస్తులు

తిలక్‌గారు ఎప్పుడూ తెల్లటి ఇస్త్రీమడతలు ధరించి, వానలో తడిసిన మల్లెమొగ్గలా, పరిశుభ్రంగా ఉండేవారు. తెల్లటి బట్టల్లో వారి ఎర్రటి శరీరం. మంచు అంటుకున్న కాశ్మీర్ యాపిల్ పండులా ఉండేది! గ్లాస్కో పంచె కట్టుకొని, షర్టు లేదా లాల్చీ ధరించేవారు. లాల్చీ తొడుక్కున్నప్పటికన్న షర్టు తొడుక్కున్నప్పుడే అందంగా కనబడేవారు నా కంటికి! టెర్లిన్‌బట్టలు కాని. రంగుబట్టలు కొని తొడుక్కునేందుకు జంకేవారు. లేత రోజారంగులో ఒక్క సిల్కు లాల్చీ మాత్రం ఉండేది. మిగిలిన వన్నీ తెల్లబట్టలే! ఒకరోజు మీటింగుకు ఆ రంగులాల్చీ తొడుక్కొని వెళ్లడానికి చాలా సందేహించారు. ఆయనికి తెల్లటి తెలుపమీదే ఎక్కువ మక్కువ.

7. అనుమానం - అతి సుకుమారం

తిలక్‌గారు అతి సుకుమారులు. దీర్ఘకాలం రోగగ్రస్తుడై ఉండడమే దీనికి కారణం కావచ్చు. ఎంత దగ్గరి ప్రదేశమైనా నడిచివెళ్ళేవారు కాదు. రిక్షా లేందే ఇంట్లోంచి అడుగు బయట పెట్టేవారు కాదు. సొంతంగా ఒక రిక్షా కొనుక్కుని, దాన్ని త్రొక్కడాని కొక మనిషిని పెట్టుకొని, కొన్నాళ్లు కాలక్షేపం చేశారు. తరువాత బయట రిక్షాలే ఉపయోగిస్తూ ఉండేవారు. రోజుకు కనీసం ఒక రూపాయి అయినా ఖర్చయ్యేది రిక్షాలకి. కిరాయి దొరకని రిక్షావాళ్ళకి తిలక్‌గారు కల్పవృక్షంలా కనబడేవారు!

"ఏమిటండి. మీరు మరీ సుకుమారులు!" అని అంటే – "ఏంచెయ్య నోయ్? నా హెల్తు మంచిదికాదు. నాకు పల్పిటేషన్ ఉంది" అనేవారు. 1946 నుంచి 1954 వరకూ 'నెర్వస్ బ్రేక్ డౌన్' వచ్చి, ఆ ఎనిమిదేళ్ళపాటు మంచంమీదనే ఉండేపోయారట. (వీరికి వచ్చిన వ్యాధిని "సైకో న్యూరోసిస్" అంటారు!)

నెలజీతం ఇచ్చి ఒక పనివాణ్ణి పెట్టుకునేవారు. ఏ ఊరు వెళ్ళినా వాడు తమ కూడా రావలసిందే!

నిజానికి రోగంకన్నా ఆయనకు అనుమానం ఎక్కువగా ఉండేది. రాత్రివేళ చేతిలో టార్చిలైటు లేందే బయట అడుగుపెట్టేవారు కాదు. పాములూ తేళ్ళూ ఉంటాయని భయపడేవారు. రాత్రిళ్ళు లఘుశంక తీర్చుకునేందుకు గేటుదాటి రోడ్డు మీదకు వచ్చేవారు. రోడ్డుమీద విద్యుద్దీపం ఉన్నాసరే. చేతిలో టార్చిలేందే వచ్చే వారు కాదు. ప్రతిచోటా ఏదో విషజంతువు లున్నాయనే భ్రాంతితో లైటువేసి

పదే పదే చూసేవారు (ఇది నరాలకు సంబంధించిన ఒక విధమైన రోగం). వారితో కబుర్లు చెపుతూ నేను రాత్రి చాలా ప్రొద్దు పోయేవరకు ఉండేవాడిని. మా యిల్లు ఊరు బయట ఉంది. తిలక్‌గారి ఇల్లు ఊరిమధ్య ఉంది. పదకొండు గంటల వేళ "నేను వెళ్ళివస్తానండి" అనేవాడిని. "ఓరి నీ తస్సాదియ్యా! ఇప్పుడెలా వెడతావోయ్ ఆ అరణ్యంలోకి? పాము లుండవూ?" అనేవారు తిలక్.

"ఏమీ. ఫరవాలేదండి, వెడతాను. నాభార్య భోజనం చెయ్యకుండా నా కోసం ఎదురుచూస్తూ ఉంటుంది" అని చెప్పి వెళ్ళిపోయేవాడిని. ఒక్కొక్కప్పుడు వారింటి వద్దనే భోజనంచేసి, అక్కడే పడుకునేవాడిని.

8. అతిశుభ్రత

శుభ్రత విషయంలో కూడా వారికి విపరీతమైన అనుమానం ఉండేది. ఆయన వాడుకునే వస్తువులు ప్రత్యేకంగా ఉంచుకునేవారు. నాలాంటి అతి సన్నిహితులను తప్ప తన బెడ్రూంలోకి ఎవరినీ రానిచ్చే వారు కాదు. ఎవరొచ్చినా "డ్రాయింగ్ రూంలో మాటాడి పోవలసిందే! చేతులు డెట్టాల్తో పదే పదే కడుక్కునేవారు. ఏ ఊరు వెళ్ళినా పెద్దపెద్ద హొటల్లో బసచేసేవారు. ఆ ఊళ్లో బంధువులున్నా సరే హొటల్లోనే ఉండేవారు. పనివాడిని మంచినీళ్లు తెమ్మనేప్పుడు "ఒరేయ్! చేతులు శుభ్రంగా కడుక్కొని మంచినీళ్ళు తీసుకురా!" అనేవారు.

9. కుటుంబం

బాలగంగాధర తిలక్‌గారి కుటుంబం చాలా పరిమితమయినది; ఇద్దరు కొడుకులు, ఒక్క కూతురు. పెద్దకొడుకు 'సత్యనారాయణమూర్తి'. ఇతనికి తిలక్‌గారు తమ తండ్రిగారి పేరు పెట్టుకున్నారు. ఈ కుర్రవాడు "సత్యశంకర్" అనే కలం పేరుతో కథలు వ్రాస్తూ ఉండేవాడు. "వీడు చూడు శుభ్రమైన పేరును ఎలా తగలేసుకున్నాడో!" అని వేళాకోళం చేసేవారు తిలక్. ఇతనిని 'సత్యం' అని పిలిచేవారు తిలక్. రెండవవాడు 'సుబ్రహ్మణ్యం'. కాని తిలక్ గారు ఇతనిని ' సుబ్బన్న' అని పిలిచేవారు. తండ్రిలాగే అందమైన కుర్రవాడు. (ప్రస్తుతం పెద్దవాడు లండన్‌లోను, రెండవవాడు అమెరికాలోను డాక్టర్లుగా చాలా ప్రసిద్ధులయ్యారు.) ఈ కొడుకు లిద్దరి తరువాత 'చంద్రలేఖ' అనే అమ్మాయి. ఆరోజుల్లో జెమినీ స్టూడియో అధినేత ఎస్.ఎస్.వాసన్ "చంద్రలేఖ" అనే ఒక అద్భుతమైన సినిమా తీశాడు. అందులో హీరోయిన్ పేరు "చంద్రలేఖ". ఆ పేరే తన కూతురికి పెట్టారు తిలక్. (తిలక్‌గారికి

సినిమాలంటే చాలా యిష్టం.) ఈ అమ్మాయి చంద్రలేఖ అంటే తిలక్‌గారికి విపరీతమైన ప్రేమ. "మా అమ్మాయి మంచి డాన్సరు అవుతుంది. అడయార్ పంపిస్తాను" అనేవారు. కాని వారి కోరిక నెరవేరలేదు. (ఆచంట జానకిరాంగారు కూడా చంద్రలేఖను అడయార్ కళాక్షేత్రానికి పంపించమని మిక్కిలిగా ప్రోత్సహించారు.) చిన్నతనంలో కొంచెం నృత్యం, వీణ మాత్రం అభ్యసించింది. (1966లో చనిపోవడానికి కొన్ని వారాల ముందు ఈ చంద్రలేఖకు పెండ్లి చేశారు తిలక్) ఈ చంద్రలేఖ తర్వాత ఒక మగశిశువు పుట్టి పోయాడట. ఆ ప్రసవసమయంలో ఇందిరమ్మ (తిలక్‌గారి సతీమణి) గారికి ఆపరేషన్ చేయవలసి వచ్చిందట. అప్పటి నుంచీ ఆమెకు సంతానం కలుగలేదు. "It is a blessing in disguise!" అనేవారు తిలక్‌గారు.

కూతురుకన్నా కొడుకు లిద్దరూ చాలా చురుకైన వాళ్ళు. ఇంట్లో ఎన్నో పుస్తకాలు ఉండడంవల్లా, తండ్రిగారు ఎప్పుడూ ఏదో రచనా వ్యాసంగంలోనూ, కవులతో రచయితలతో సంభాషిస్తూ ఉండంవల్లా వీరిద్దరికీ విపరీతమైన పఠనాసక్తి, రచనా కుతూహలం జనించాయి. (చంద్రలేఖ భర్తతో అమెరికాలో స్థిరపడింది.)

10. చిరాకు

పిల్లలమీద కాని ఇతరులమీద కాని తిలక్‌గారు ఎప్పుడూ కోప్పడేవారు గాదు; కొంచెం చిరాకు పడేవారు అంతే! ఆ చిరాకులో "దొంగముండా కొడకా!" అని తిట్టే వారు. ఇంతకన్నా పరుషవాక్యాలు మాట్లాడేవారుకాదు. (ఇదే పరుషవాక్యం కదా! ఇతంకన్నా పరుషవాక్యం ఏముంది? అని భావిస్తారేమో! ఆ శబ్దాన్ని తిలక్‌గారు మనమంతా ఉపయోగించేటంత కటువుగా ప్రయోగించే వారు కాదు. మెచ్చుకోలుకు కూడా ఇదే వాడేవారు. పైగా పారుష్యార్థం కోల్పోయిన శబ్దాలలో ఇది ఒకటి). దూషించేటప్పుడూ, భూషించేటప్పుడూ కూడా ఈ శబ్దాన్నే ప్రయోగించేవారు తిలక్. "ముండాకొడుకు బాగా వ్రాశాడోయ్! ముండాకొడుకు జీనియస్" అనేవారు కొందరు ప్రతిభావంతులైన ఆధునికుల రచనలను తలచుకొన్నప్పుడు. శ్రీశ్రీ "కవితా! ఓ కవితా!" ను కూడా ఇదే ఊతపదంతో మెచ్చుకొనేవారు. (తిలక్‌గారినుండి ఈ ఊతపదం నాకు కూడా అంటుకుంది. 86 ఏళ్ళు వచ్చినా ఇంతవరకూ వదల్లేదు.)

11. బంధుప్రీతి

తమ్ముళ్ళలో గంగాధర రామారావు (తణుకులో లాయరుగా పనిచేశారు)

గారంటే తిలక్‌గారికి ఎక్కువ అభిమానం. రామారావుగారికి సంగీతం, సాహిత్యం, అభినయం మొదలైన కళల్లో ప్రవేశం ఉండటమే దీనికి కారణం కావచ్చు. అప్పుడాయన మద్రాసులో లా చదువుతూ ఉండేవారు. ఈయన సెలవలకు తణుకు వచ్చినప్పుడు ఎక్కువ కాలాన్ని అన్నగారి వద్దనే గడిపేవారు. తిలక్‌గారు నూతన రచన ఏం చేసినా నేనూ రామారావుగారూ ప్రథమశ్రోతలమయ్యేవాళ్ళం!

తణుకులోనే ఉంటున్న వేలు విడిచిన బావగారైన ఈమని సత్యంగారిని "మా సత్యంబావ!–మా సత్యంబావ!" అని ఎంతో ఆప్యాయంగా తలచుకొనేవారు తిలక్. వీరు తిలక్‌గారి కన్నా ముందే గతించారు. (తిలక్‌గారికి ఇద్దరు పినతండ్రులు వుండేవారు. బహుశా వీరిలో ఒకరి అల్లుడై ఉంటారు 'ఈ సత్యంబావగారు'). తనచెల్లెలు ఎల్లమ్మగారి భర్త అయిన పెద్ద ఇంజనీరు శ్రీ ఈవని సుబ్బరాయ శాస్త్రిగారినీ (వీరు అమెరికాలో హఠాన్మరణం చెందారు); తన మేనకోడలి భర్త అయిన ప్రఖ్యాత వైణికుడు ఈమని శంకరశాస్త్రిగారినీ; తన అన్న బావమరిది ప్రఖ్యాత ఆంగ్ల రచయిత R.M. చల్లాగారినీ ఎక్కువగా తలచుకుంటూ ఉండేవారు తిలక్. తన జబ్బులో అహోరాత్రాలు సేవచేసిన తన శ్రీమతిని (ఇందిరమ్మగారిని) కూడా తరచు ప్రశంసిస్తూ ఉండేవారు!

12. మిత్రమండలి

శ్రీయుతులు మల్లవరపు విశ్వేశ్వరరావు, పాలగుమ్మి పద్మరాజు, పిలకా గణపతి శాస్త్రి, సంపత్ రాఘవాచారి, సూరంపూడి భాస్కరరావు, భీమశంకరం వీళ్లు తిలక్‌గారికి సన్నిహిత మిత్రులు. వీరిని చాలా ఎక్కువసార్లు తలచుకుంటూ ఉండేవారు. "గణపతిశాస్త్రీ, సంపత్తూ నాకు family friends" అనే వారు తిలక్. శ్రీయుతులు అనిసెట్టి సుబ్బారావు, అబ్బూరి వరదరాజేశ్వరరావు, తాపీ ధర్మారావుగారి పుత్రులూ, రాయప్రోలు సుబ్బారావుగారి పుత్రులూ (రాజశేఖర్, సుబ్రహ్మణ్యం). అడివి బాపిరాజుగారు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు కూడా వీరికి సఖులే. "అడివి బాపిరాజు మా యింటికి వచ్చినప్పుడు నాతో వారం రోజులు గడిపితేనే కాని వెళ్లేవాడు కాదు" అనేవారు. దేవులపల్లివారిని చిన్నతనంలో బాగా అనుకరించారు తిలక్. ఆయన శిల్పం అంటే చెవికోసుకునేవారు. కృష్ణశాస్త్రిగారి ఉపన్యాసాన్ని పదే పదే మెచ్చుకొనేవారు. గోరాశాస్త్రిగారి రచనల యెడల విపరీతమయిన అభిమానం చూపేవారు తిలక్. (1959 లో హైదరాబాద్

వెళ్ళినప్పుడు దేవులపల్లివారినీ, గోరాశాస్త్రిగారినీ కలుసుకున్నారు). "శ్రీశ్రీ నన్ను ఎరుగును కాని, కృష్ణశాస్త్రితో ఉన్నంత పరిచయం అతనితో నాకు లేదు" అనేవారు.

ఇటీవల కాలంలో (అంటే చనిపోవడానికి పది సంవత్సరాల క్రితంనుంచి) శ్రీయుతులు శ్రీపాద కృష్ణమూర్తి, తంగిరాల వెంకట సుబ్బారావు, ఏలూరిపాటి అనంతరామయ్య (అనంతం), చల్లా నరసింహారావు, వరవరరావు, వెల్చేరు నారాయణరావు-ఇంద్రగంటి శ్రీకాంతశర్మ-ఇంకా అనేకమంది యువరచయితలూ, కవులూ వీరి మైత్రిని మహాభాగ్యంగా భావించి అనుయాయులయ్యారు. బాలగంగాధర తిలక్‌గారికి అనుయాయులు ఏర్పడినా, మిత్రులు ఏర్పడినా కేవలం వారి రచనలలోని పసతో ఆకృష్టులై దగ్గరకు వచ్చిన వారే కాని, సాహిత్య సమితులవల్లనూ, రాజకీయ ప్రాబల్యంవల్లనూ, ముఠాతత్త్వంవల్లనూ ఏర్పడినవారు కారు! ఇది ముఖ్యంగా గమనింపదగిన విషయం! దీనివల్లనే తిలక్ రచనాపాటవం ఎంతటి మహత్తరమైనదో గుర్తించగలుగుతాం!!

13. మొహమాటం

'ఎంతటి ఆప్తమిత్రునితోనైనా సరే మొహమాటం లేకుండా నిజం చెప్పాలి' అనుకునేవారు బాలగంగాధర తిలక్. కాని మరుక్షణమే ఆ మిత్రుడు. బాధ పడతాడేమోనని జంకేవారు. ఒకసారి సూరంపూడి భాస్కరరావుగారు ఒక గేయకావ్యం వ్రాసి, దానికి పీఠిక వ్రాయమని తిలక్‌గారికి పంపారు. (తణుకు వాస్తవ్యులైన ఈ భాస్కరరావుగారు ఆరోజుల్లో అనంతపురం ఆర్ట్సు కాలేజీలో సంస్కృతోపన్యాసకులుగా పనిచేసేవారు.) ఆ కావ్యంలో ఒకటి రెండు శీర్షికలు తప్ప మిగిలినవన్నీ చాలా పేలవంగా ఉన్నాయి. దానిలో ఉన్న లోపాలన్నీ స్పష్టంగావ్రాసి, రిజిష్టరు పోస్టులో భాస్కరరావుగారికి పంపివేశారు తిలక్. పోస్టాఫీసునుంచి ఇంటికి వచ్చారు. ఆయన మనస్సులో ఆందోళన ప్రారంభమైంది. నాతో మెల్లగా ఇలా అన్నారు- "చూడు సుబ్బారావ్! పాపం నామీద ఎంతో గౌరవంతో పీఠిక వ్రాయమని పంపించాడు. నేను చాలా హార్ష్‌గా వ్రాశాను. అతనొక్కడూ చదువుకుంటే పరవాలేదు. కాని అది ప్రింటవుతుంది. అందరూ చదువుతారు. అతని కవిత్వాన్ని పరిహసిస్తారు. అతడు బాధపడతాడు! ఛీ! చాలా పొరపాటు చేశాను. మళ్ళీ మార్చి వ్రాస్తాను. ఈ రోజు పంపిన పీఠిక ముద్రించ వద్దని వెంటనే వైరిచ్చిరా!" అన్నారు. అలాగే అని నేను వెళ్ళి టెలిగ్రాం యిచ్చివచ్చాను.

మర్నాడు మరో పీఠిక వ్రాశారు. కావ్యాన్ని పొగడుతూ వ్రాసి పంపించారు.

కాని భాస్కరరావుగారు "నీవు మొదట వ్రాసిన పీఠికే నిజమైనది. దానినే నేను పీఠికగా ముద్రించుకుంటున్నాను." అని జవాబిచ్చారు.

"హరి వీడి తస్సాదియ్యా.....చూడు ఇతనికి నామీద ఎంత గౌరవమో!" అన్నారు తిలక్, సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోతూ.

ఇలాగే మరి కొందరు ప్రసిద్ధ కవిమిత్రుల రచనల పేలవత్వాన్ని గురించి కూడా యథార్థం చెప్పాలని చాలాసార్లు అనుకున్నారు కాని, మొహమాటం అడ్డు రావటంవల్ల చెప్పలేకపోయారు. నా దగ్గర మాత్రం ఏకాంతంగా వారి లోపాలన్నీ చెప్పేవారు.

14. పెద్దమనుషులు

అక్రమంగా డబ్బు నిలవజేసి, పరువూ ప్రతిష్ఠా అంటూ, డబ్బుతో ప్రతీ దాన్నీ కప్పి పుచ్చుకుంటూ, మానవత్వం కరుణా ఏ మాత్రం లేకుండా, భగవద్గీత ఉపన్యాసాలు శ్రద్ధగా వింటున్నట్టు నటిస్తూ, శ్రీరంగ నీతులు చెపుతూ, సిద్ధమకర ధ్వజం గుళికలు సేవిస్తూ ఉండే ముసలివాళ్ళంటే తిలక్‌గారికి విపరీతమైన అసహ్యం. ఇటువంటి పెద్దమనుష్యులు అన్ని ఊళ్ళల్లో ఉన్నట్టుగానే మా ఊళ్లోనూ ఉన్నారు. సాయంకాలం అయ్యేసరికి టౌన్‌హాల్ పార్కులో సిమెంటు బెంచీల మీద చేరి, పెద్ద పెద్ద కేకలు పెడుతూ ఉపన్యాసాలు దంచేసేవారు. వాళ్ళని నాకు చూపుతూ "చూడు చూడు! ఆ ముసలి వెధవలు ఎలా కబుర్లు చెపుతున్నారో?" అనేవారు తిలక్. "మనం కూడా కొన్నాళ్ళకి అలా అవుతాం కదా?" అనేవాడిని నేను. "శరీరానికి ముసలితనం రావచ్చును కాని, ఆలోచనలకు ముసలితనం రాకూడదు సుబ్బారావ్!" అనేవారు తిలక్.

తన కవిత్వంలో వీలైన చోటల్లా ఈ ముసలి పెద్దలను ఏకేసేవారు తిలక్! "జరీ కండువా పెద్దపులులు..." అనీ, "గడుసుదనం, మోసం. పరువూ ప్రతిష్ఠలనే గాడిదలమీద బ్రతుకుపాతబట్టల మూటల్ని వేసి తోలుతున్న వాళ్ళు" అనీ అధిక్షేపించారు.

15. నాటకాలూ – సినిమాలూ

ఔత్సాహిక నాటకాలన్నా, సినిమాలన్నా తిలక్‌గారికి చాలాఇష్టం. మార్గనాటకాల (పద్యనాటకాల) విషయం ఆయనకు తెలియదు. ఎప్పుడూ చూడలేదు. నాకు పద్యనాటకాలంటే మహాప్రాణం. రఘురామయ్య, అబ్బూరి,

పీసపాటి, షణ్ముఖి మొదలైన మహానటులు కృష్ణపాత్రలు ధరించి, కురుక్షేత్రం నాటకంలో పద్యాలు పాడుతుంటే నేను ఆనంద వివశుడనైపోతాను! ఈ నటులను గురించీ, వీరి పద్యపఠనాన్ని గురించీ తిలక్‌గారితో అప్పుడప్పుడు చెపుతూ ఉండేవాడిని. "అది సంగీత కచ్చేరీ కాని నాటకం కాదు. నటన అంతకన్నా కాదు. వాళ్ళని కుర్చీవేసి కూర్చోబెట్టి ఆ పద్యాలు పాడించుకున్నా సరిపోతుంది" అనే వారు తిలక్. నేను వారి అభిప్రాయం సరికాదని వాదించేవాడిని.

నిజానికి తిలక్‌గారు ఎప్పుడూ పద్యనాటకాలు చూడలేదు. "మీరు ఆ మహానటుల పద్యాలు వినలేదు. అందుకనే ఇలా వాదిస్తున్నారు. ఒకసారి విని ఆ తర్వాత మాట్లాడండి. షణ్ముఖి ఆంజనేయరాజుగారిది మన తణుకే! ఆయన పద్యం పాడుతూంటే అమృతం సేవిస్తున్నట్టు ఉంటుంది. 'ఆంధ్ర బాల గంగధర్వః' అని ఆయన బిరుదు. ఆయన పద్యం ఒక్కసారి వినండి!" అన్నాను. నేను ఒక్కడే కాకుండా, మరో మిత్రుడు కూడా తిలక్‌గారికి ఈ విషయంలో ఇదే సలహా ఇచ్చాడు. తిలక్‌గారు ఒప్పుకున్నారు. ఆంజనేయరాజుగారి ఇంటికి వెళ్ళి పద్యాలు వినడానికి కూడా తీర్మానించుకున్నారు. (కాని తర్వాత వెళ్ళినట్టు లేదు. ఆ రాజుగారు ఎక్కువగా ఊళ్లో ఉండకపోవడం, ఉన్నా సరే నిత్యం 'సుర' లోకంలో ఉండడం కారణంగా తిలక్ వీరిని దర్శించలేకపోయారు).

మార్గనాటకాల పద్యాలు పాడే 'వెంకన్న' అనే యువకుడు తిలక్‌గారి దగ్గరకొచ్చి ఏక పాత్రాభినయానికి ఒక స్క్రిప్టు వ్రాసి పెట్టమని అడిగాడు. తిలక్ 'సరే'నని 'భరతుని స్వగతం' వ్రాసిపెట్టారు. అందులో నాలుగైదు పద్యాలు కూడా వ్రాశారు. ఆ పద్యాలు వెంకన్న రాగాలాపనతో పాడుతుంటే మెచ్చుకున్నారు కూడా. అందుచేత తిలక్‌గారికి పద్యనాటకాలు చూడకపోవడం మూలాన వైముఖ్యం ఏర్పడింది కాని, నిజంగా ఆయన పద్యనాటక ద్వేషికాదు! జగత్ప్రసిద్ధికెక్కిన కూచిపూడి భాగవతుడు వేదాంతం సత్యనారాయణగారి "ఉషాపరిణయం" చూడడానికి పనిగట్టుకొని, తణుకుకు ఆరుమైళ్ళ దూరంలో ఉన్న రేలంగి గ్రామం వెళ్ళారు తిలక్!! శ్రీ భద్రం (రేలంగి గ్రామం) అనే రచయిత వ్రాసిన "పల్నాటి యుద్ధము" అనే పద్యనాటకానికి ఈయన పీఠిక వ్రాశారు!

ఔత్సాహిక (సాంఘిక) నాటకాలంటే తిలక్‌గారికి చెప్పలేనంత యిష్టం. తణుకు చుట్టుప్రక్కల ఎక్కడ నాటకప్రదర్శనం జరిగినా వీరిని ఆహ్వానించేవారు.

ఏదో పిలిచారని అలక్ష్యం చెయ్యకుండా, తప్పక ఆ ప్రదర్శనలకు హాజరయ్యే వారు తిలక్. ఒకసారి తణుకులో "పల్లెపడుచు" నాటకం చూసి, అందులో 'గంగులు'. పాత్రకు ముగ్ధులై అతనికి స్వయంగా ఒక బహుమతి నిచ్చారు. ఆంధ్రనాటక కళాపరిషత్ పోటీలు 1959 లో తణుకులో జరిగినప్పుడు విడవకుండా ప్రతీనాటకాన్నీ చూశారు తిలక్. బాగా నటించే యువకులు ఉన్నారనీ, రచనలు మాత్రం సరైనవి రావడంలేదని అంటూండేవారు. "అమెరికా ఇంగ్లండు దేశాలలో లాగ నెలల తరబడి ఆడే నాటకాలు రావాలి" అనేవారు. శ్రీ నాగభూషణం (రవీ ఆర్టు థియేటర్స్-మద్రాసు) ప్రదర్శించే "రక్తకన్నీరు" నాటకాన్ని తణుకులో ఆ రోజుల్లో రెండుసార్లు ప్రదర్శించారు. తిలక్‌గారు ఆ ప్రదర్శనాన్ని చూసి, చాలా మెచ్చుకున్నారు. "నాటకంలో ఒట్టి వచనమేకాదు; పాట, పద్యం, నృత్యం అన్నీ ఉండాలి. సెట్టింగులు బాగుండాలి. ప్రదర్శన త్వరత్వరగా జరగాలి. ఇవన్నీ ఉన్నాయి కాబట్టే రక్తకన్నీరు నాటకం విజయం సాధించింది" అన్నారు.

1957 లో తణుకు పూర్వ విద్యార్థి సంఘం వార్షికోత్సవానికి నాటికల పోటీ పెట్టారు. నేను అందులో పాల్గొనే నిమిత్తం ఒక నాటిక వ్రాసిపెట్టమని తిలక్ గారిని అడిగాను. 'సుచిత్ర'-'సుబ్బారావు' అనే నాయికా నాయకులతో "విచిత్ర ప్రణయం" అనే నాటిక వ్రాశారు.

నేను నిరంతరం తిలక్‌గారితో ఉండటంవలనా, మా పరిచయం అత్యంత సన్నిహితం కావడంవల్లా వారిరచనల్లో నాపేరు ఎక్కువగా దొర్లుతూ ఉండేది. "నీ మీద వ్రాస్తాను చూడు!" అని చెప్పి 'సుందరీ-సుబ్బారావు' అనే కథ వ్రాశారు. అలాగే ఈ "విచిత్ర ప్రణయం" నాటికలో హీరోకి నాపేరు పెట్టాడు.

" నాటికలో హీరో పేరు మార్చి వెయ్యండి. లేకపోతే నేను వేషం వెయ్యను" అన్నాను నేను.

"ఏం?" అన్నారు తిలక్.

"నాపేరూ, హీరో పేరూ ఒక్కటే. అంతా హాస్యం. పైగా ఆ హీరో, రోడ్ల వెంబడి హీరోయిన్ వెనకాల eve-teaser లాగా పడతాడు. రేపటినుండి హైస్కూలు పిల్లలు నన్ను వేళాకోళం చేస్తారు." అన్నాను.

"అయితే నీ యిష్టం వచ్చిన పేరు పెట్టుకో. హీరో వేషం మాత్రం నువ్వే వెయ్యాలి" అన్నారు తిలక్.

నేను 'సుబ్బారావు' అనే హీరో పేరు తీసివేసి "శేఖర్" గా మార్చాను. (కాని అలా మార్చినందుకు ఇప్పుడు బాధపడుతూ ఉంటాను. శేఖర్ పేరుకన్నా సుబ్బారావు పేరులోనే ఎక్కువ తెనుగుదనం ఉంది). ఆ నాటిక బ్రహ్మాండమైన విజయాన్ని సాధించింది. నాకు ప్రథమ బహుమతి వచ్చింది. ఒక్కొక్క డైలాగ్ వినేసరికి ప్రేక్షకులు పొట్ట చెక్కలయ్యేలా నవ్వేవారు. ఇది వీరి మొట్టమొదటి నాటిక!

1958 లో తణుకు టౌనుహాలు వార్షికోత్సవానికి తిరిగి ఇదే నాటికను ప్రదర్శించాము. అప్పుడు కూడా అద్భుత విజయాన్ని సాధించింది. ఈ నాటిక తరువాత 'సుచిత్రప్రణయం" అనే పేరుతో భారతి 1958 అక్టోబరు సంచికలో వచ్చింది. (కాని ముద్రణలో చివర కొంచెం అస్తవ్యస్తంగా పడింది. నాటికను వీరి బావమరది పెయిర్ చెయ్యడంలో ఈ పొరపాటు జరిగింది. చాలామంది నటులు ఈ పొరపాటును గుర్తించకుండానే ప్రదర్శించి వేశారు!)

ఇదే సంవత్సరం "సుశీలపెళ్ళి" అనే పెద్ద నాటకం వ్రాశారు తిలక్‌గారు. మన ఆచారాల మీదా, సంఘం మీదా, చాలా విప్లవాత్మకమైన సిద్ధాంతాలు లేవదీశారు ఈ నాటకంలో. ఒక సన్నివేశంలో భర్త, భార్యమెడలోని మంగళసూత్రాన్ని త్రెంచివేసి, ప్రేమించిన వ్యక్తితో వెళ్ళిపొమ్మని ఆదేశిస్తాడు తన భార్యను! ఈ నాటకాన్ని 'నింబుల్స్ ఎసోసియేషన్' (పాతవూరు) వారు తణుకు మారుతీ టాకీసులో ప్రదర్శించారు. వీరి నాటకాలలో ముఖ్యమైన పాత్రలను మిత్రుడు శ్రీ చిట్టూరి సూర్యారావు చాలా సామర్థ్యంతో నటించేవాడు.

తణుకులో నటనాభిలాషులైన యువకులందరినీ సమకూర్చి, 1959 లో "బృందావన కళాసమితి"ని ఏర్పాటు చేయించారు తిలక్‌గారు. నేను దానికి ప్రధాన కార్యదర్శిని. ఈ సమితి ఆంధ్ర నాటక కళాపరిషత్తులో పాల్గొనే నిమిత్తం "సాలె పురుగు" అనే నాటకాన్ని వ్రాశారు ఆయన. ఈ నాటకానికి శిక్షణ యిచ్చేటందుకు డా॥ గరికిపాటి రాజారావుగారి ట్రూపులో హీరో వేషాలు వేసే సత్యనారాయణ అనే నటశేఖరుణ్ణి రాజమండ్రీ నుంచీ, పి.యస్. భాస్కరరావు అనే వారిని కాకినాడ నుంచీ రప్పించారు తిలక్. ఈ నాటకంలో హీరో పాత్రకు సరియైన వ్యక్తి లభించకపోవడం మూలాన కళాపరిషత్తులో పాల్గొనలేకపోయాము. కాని 1960 టౌనుహాలు వార్షికోత్సవానికి ఇదే నాటకాన్ని డాక్టర్ తేతలి నరసింహారావుగారు సమర్థవంతంగా ప్రదర్శించారు. (ఈ నాటకం పేరును "సాలెగూడు" గా మార్చి తరువాత కాలంలో ముద్రించారు.)

ఇక సినిమాల విషయం: వచ్చిన ప్రతిసినిమానూ చూసే అలవాటుంది తిలక్‌గారికి. ఏవో కోర్టు వ్యవహారాలమీద తరచుగా రాజమండ్రి వెళ్ళేవారు. వెళ్ళినప్పుడల్లా రెండు మూడు సినిమాలు చూసి వచ్చేవారు. ఇంగ్లీషు, హిందీ చిత్రాలు కూడా ఎక్కువ చూసేవారు. ('వీరకంకణం', 'అనగనగా ఒక రాజు' 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే', 'దో ఆంఖేఁ బారా హాత్', 'వీరపాండ్య కట్టబ్రహ్మన' మొదలైనవి ఏడెనిమిది సినీమాలు తిలక్‌గారితో కలిసి చూశాను నేను.) ఇంగ్లీషు చిత్రాల్లో 'గ్రేటా గార్బో', 'మార్లైన్ మన్రో', హిందీ చిత్రాల్లో 'సుచిత్రసేన్', తెలుగు చిత్రాల్లో 'భానుమతి' తిలక్‌గారికి మిక్కిలి ఇష్టమైన తారలు! మాయాబజార్ సినిమాలో ఎన్. టి. రామారావుగారు ధరించిన కృష్ణ పాత్ర సౌందర్యాన్ని మిక్కిలిగా ప్రశంసించేవారు. (ఈ కృష్ణ పాత్ర చిత్రంతో ఉన్న కాలెండర్ ఒకటి వారి డ్రాయింగ్ రూంలో ఉండేది). బెంగాలీ తార సుచిత్రాసేన్ అంటే వీరికి చాలా ఇష్టం. 'విచిత్ర ప్రణయం' నాటికలో నాయికకు 'సుచిత్ర' అని పేరు పెట్టడానికి కారణం వీరికి ఆ బెంగాలీ తారపై గల అభిమానమేనని నాతో స్వయంగా చెప్పారు.

కాని తిలక్‌గారు అరవ సినిమాలనూ, వారి హాస్యాన్ని ఆక్షేపించేవారు. మేమిద్దరం కలిసి తణుకులో వేంకటేశ్వరా టాకీస్‌లో "అనగనగా ఒకరాజు" అనే తమిళం నుండి తెలుగులోకి డబ్బైన చిత్రాన్ని చూస్తున్నాము. ఎం.జి. రామచంద్రన్ హీరో, భానుమతి హీరోయిన్. భానుమతి తిలక్‌గారి అభిమానతారకాబట్టి ఆమె నటించిన ప్రతిసినిమా చూచేశారు. సినీమా మధ్యలో తిలక్ నాతో ఇలా అన్నారు, "చూడు సుబ్బారావ్! ఒక సుత్తి పట్టుకు రాగలవా?"

"ఎందుకండీ?" అన్నాను నేను తెల్లబోతూ...

"ఆ హీరో మూతిమీద కొట్టడానికి. వాడి ముందుపళ్ళు కొంచెం ఎత్తుగా ఉన్నాయి. సుత్తితో కొడితే సర్దుకుంటాయి!" అన్నారు పక పకా నవ్వుతూ!!

అలా అని ప్రతీ అరవ సినిమానీ ఆక్షేపించేవారని అర్థం కాదు. 'వీరపాండ్య కట్టబ్రహ్మన' సినిమా చూస్తుంటే కట్టబ్రహ్మన్నను ఉరితీసే ఘట్టంలో తిలక్‌గారికి శోకం కంఠపూర్తి అయిపోయింది. కట్టబ్రహ్మన తెల్లవాడిపై కత్తి దూసి "ఒరేయ్ తెల్లవాడా నీకు పన్ను కట్టాలా? ఎందుకు కట్టాలిరా పన్ను? నువ్వు దుక్కు దున్నావా? నారు పోశావా, నీరు పెట్టావా, చెమటోడ్చి చేలో పనిచేశావా? ఎందుకు కట్టాలిరా నీకు పన్ను?" అని ప్రశ్నిస్తుంటే, భూస్వామీ, ఆగర్భశ్రీమంతుడూ అయిన తిలక్

విపరీతంగా సంచలించిపోయి "చూడు చూడు సుబ్బారావ్! ఆ మాటలు ఒక్క ఇంగ్లీషువాడికే కాదోయ్! మనకి కూడా తగులు తున్నాయ్!" అన్నారు. కుప్ప నూర్చి రైతు ధాన్యం ఇంటికి పట్టుకువస్తే గాదెల్లో పోసుకోవడం తప్ప, అసలు పొలం ఎక్కడుందో కూడా తెలియని బ్రాహ్మణ ఈనాందార్లు చాలామంది ఉన్నారు మా ప్రాంతంలో.

ఆ కాలంలో మా తణుకులో ఇద్దరు ముగ్గురు సినిమా ప్రొడ్యూసర్లు బయలు దేరారు. "పరమానందయ్య శిష్యులకథ" – "గాంధారి గర్వభంగం" వంటి విజయవంతమైన చిత్రాలు కొన్ని తీశారు. వీరు భవిష్యత్తులో తిలక్‌గారిని ఆహ్వానించి మంచి పాటలు వ్రాయించు కుంటారని ఆశించాను. కాని భగవంతుడు వీరికి ఆయుర్దాయమూ ఇవ్వలేదు...!! వారికి అంత మంచి ఆలోచనా రానివ్వలేదు. *

16. సాహిత్య సేవ

నవ్యాంధ్ర సాహిత్య వియత్పథంలో బాలగంగాధర తిలక్ ఒక ధ్రువతార. పద్యం, గేయం, వచనగీతం, నాటకం, నాటిక, కథానిక, వ్యాసం, లేఖలు – ఈ అన్ని ప్రక్రియలలోను నవ్యత్వాన్ని చూపించి, పలువురు పరితలచే 'భేష్' అనిపించుకున్న మహాకవి తిలక్.

తెలుగు సాహిత్యంలో తిలక్ చేసిన సాహిత్యకృషిని ముఖ్యంగా రెండు దశలుగా వర్గీకరింపవచ్చును. వీరు 1921లో జన్మించారు. 17 సంవత్సరాల వయస్సులోనే (1938లో) ఒక చిన్న కావ్యం "ప్రభాతము-సంధ్య" అనే పేరుతో (పద్యాలు, గేయాలు) రచించారు. దీనిని వారి 19వ యేట (1940లో) స్వయంగా ప్రకటించుకున్నారు. ఇదే వారి సాహిత్యకృషికి నాంది. దీనికి "త్రివేణి" సంపాదకులైన కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు 1-6-1940 నాడు "పరిచయం" వ్రాశారు. నాయని సుబ్బారావుగారు కూడా దీనిని మెచ్చుకున్నారట. కాబట్టి 1938 నుండి 1946లో జబ్బుపడేవరకూ తిలక్‌గారి సాహిత్యసేవలో మొదటిదశ. తిరిగి 1954 నుండి 1966లో చనిపోయేవరకూ రెండవదశ. ఈ రెండవదశలోనే వీరు ప్రత్యేకంగా ప్రకాశించి, అనేక యువరచయితలకు రచయిత్రులకు మార్గదర్శకులయ్యారు. వీరు వచనగీతానికి గొప్ప సాహిత్యస్థానాన్ని కల్పించినదీ ఈ రెండవదశలోనే.

* (ఇంతవరకూ ఈ వ్యాసం 1972లో "తిరుపతి సాహిత్యసమితి వ్యాసావళి-3" లో ముద్రితమయింది.)

కాని అంతమాత్రంచేత ఈ రెండవదశ పరిణతమైనదనీ, మొదటిదశ అపరిణతమైనదనీ భావించకూడదు. (మిత్రులు ప్రొ॥ పణతుల రామచంద్రయ్యవంటి కొందరు విమర్శకులు ఇలా భావించారు. ఇది పొరపాటు.) తిలక్ రచనలలోకెల్లా అత్యుత్తమైనదిగా భావించబడే "అద్దంలో జిన్నా" అనే స్కెచ్ ప్రథమదశలో వ్రాయబడినట్టిదే. "సముద్రపు అంచులు" అనే కథ రెండవదశలో ప్రకటింప బడినప్పటికీ, రచన మాత్రం మొదటిదశలోనే జరిగింది. అలాగే "గోరువంకలు" అనే ఉత్తమమైన పద్యాలు, రెండవ ప్రపంచ యుద్ధాన్ని నిరసిస్తూ వ్రాసిన గేయాలు, ప్రథమదశలో రచింపబడినట్టివే. మొదటిదశలో తిలక్ పదిమంది గొప్ప రచయితలలో తానూ కలిసి ఉండేవారు; రెండవ దశలో తనకొక ప్రత్యేకస్థానాన్ని సృష్టించుకోగలిగారు. ఇంతే భేదం.

ఈ రెండు దశలకూ మధ్య, రెండింటినీ విడదీస్తూ ఒక "అజ్ఞాతదశ" ఉంది. దీనిని "అనారోగ్యదశ" అని కూడా పిలువవచ్చు. తిలక్‌గారు 1946 నుండి 1954 వరకూ – ఎనిమిదేళ్ళపాటు వ్యాధిగ్రస్తులై "గదిలో మంచమె ఎల్లలోక మగుచున్ కాలంబు వెళ్ళించు" స్థితిలో ఉండిపోయారు. ఈ దశలో, "బాధాగళము" వంటి కొన్ని పద్యాలు తప్ప, ఏమీ రచనలు చేయలేదు. గుండెపోటు తోను, Nervous Breakdown తోను బాధపడ్డారు. ఈ దశలో వీరిని తెలుగు సాహిత్యలోకం ఇంచుమించుగా మరిచిపోయిందనే చెప్పాలి.

16.1 సాహిత్యసేవ – మొదటిదశ (1938-1946):

'పూవు పుట్టగానే పరిమళిస్తుంది' అన్నారు పెద్దలు. తిలక్‌గారు తండ్రిగారి నుండి పొందిన తెలుగు సాహిత్యాభిరుచితోను, కృష్ణశాస్త్రిగారి రచనలవల్ల పొందిన అనుభూతితోను, కవిత్వరచనకు పూనుకొని, తన 17వ ఏటనే "ప్రభాతము–సంధ్య" అనే పద్యగేయ సంపుటిని రచించారు. (1940లో ప్రకటింపబడిన దీని కాపీ చాలా కాలంవరకూ నా దగ్గర ఉండేది. 1961లో నేను తిరుపతి వెళ్ళేముందు వారికి తిరిగి యిచ్చివేశాను.) తన బాల్యంలో ఆ కావ్యాన్ని చూచి తాను ఎంత మురిసిపోయేవారో నాతో పదే పదే చెపుతూ ఉండేవారు. 1940లో బందరు వెళ్ళినపుడు శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు ఆ లేత కావ్యాన్ని మెచ్చుకొని, తిలక్‌గారిని ఇంకా రచనలు చేయవలసిందిగా ప్రోత్సహించారు. కాని పెద్దయ్యాక ఆ పుస్తకాన్నిగురించి ఇలా అన్నారు: "ఇప్పుడు దాన్ని చదువుతూ ఉంటే నవ్వువస్తుంది

నాకు! దాంట్లో ప్రతిపంక్తిలోను కృష్ణశాస్త్రి influence స్పష్టంగా కనబడుతుంది.” మొత్తానికి వీరి “ప్రభాతము-సంధ్య” అపరిణత కావ్యంగానే చెప్పాలి. పరిణతరచనలు తన 20వ యేటనుండి (1941 నుండి) ప్రారంభమయ్యాయని తిలక్‌గారే నాతో చెప్పారు.

66 సంవత్సరాలపాటు (1924-1990) అవిచ్ఛిన్నంగా వచ్చిన ఆంధ్రుల ఏకైక ఉన్నతస్థాయి సాహిత్య మాసపత్రిక “భారతి” మాసపత్రిక! దీనిని 'దేశోద్ధారక' కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు 1924లో బొంబాయిలో స్థాపించారు. తరువాత మద్రాసుకు బదిలీ అయింది. అక్కడ అవిచ్ఛిన్నంగా 1990 వరకు వెలువడింది. దీనిలో తిలక్‌గారి మొట్టమొదటి రచన 1941 ఆగస్టు సంచికలో వచ్చింది. అప్పటికి వారి వయస్సు 20 సం॥లు మాత్రమే. అది పద్యమూ కాదు, గేయమూ కాదు, “జీవితము” అనే ఒక పెద్దకథ. 15 పుటలలో ప్రచురితమయింది. తొమ్మిది ఖండికలుగా విభజింపబడి వ్రాయబడింది. ఈ కథ ఎంతమందినో ఆకర్షించిందట. ఈ కథను చదివి భీమవరం తాలూకాలోని ఒక రాజుగారు బాలగంగాధర తిలక్‌గారిని చూడటానికి, పనికట్టుకొని తణుకు వచ్చారట. ఎదురుగా 20 ఏళ్ళ యువకుని చూచి ఆశ్చర్యపోయి “మీరు చాలా అనుభవం కలిగిన ముసలివారై ఉంటారని ఊహించుకొని వచ్చాను. తీరా చూస్తే మీకు పట్టుమని పాతికేళ్లు కూడా లేవే!” అన్నారట ఆ రాజుగారు.

రెండవ ప్రపంచయుద్ధం జరిగే రోజులలో వ్రాసిన “సైనికుడి ఉత్తరం” అనే గేయం మంచి కళాఖండం. “యుద్ధం యుద్ధం... లిబియాలో, బెర్లిన్‌లో, స్టాలిన్‌గ్రాడ్‌లో స్వార్థం పిచ్చుకుక్కలా పరుగెత్తింది” అంటారు తిలక్ ఈ కవితలో. “టులాన్” అనే మరో కవిత, “లిబియా ఎడారిలో...” అనే కథ, “కదలే నీడలు” అనే మరో కథ రెండవ ప్రపంచయుద్ధాన్నిగురించి వ్రాసిన అద్భుత రచనలు.

“గోరువంకలు” అనే పేరుతో తిలక్ రచించిన కొన్ని శృంగార రసాత్మకమైన పద్యాలు (సుమారు 50) “ప్రతిభ” పత్రికలో ప్రకటింపబడ్డాయి. ఈ పత్రికలో వీరి గేయాలు కూడా చాలా వచ్చాయి. “గోరవంకలు” లోని కొన్ని పద్యాలు 1958లో విజయనగరం నుండి “పూభా”గారు ప్రకటించిన “మణిమకుటము” అనే సంకలన గ్రంథంలో ముద్రితమయ్యాయి. అనిసెట్టి సుబ్బారావు, పిలకా గణపతిశాస్త్రి, మల్లవరపు విశ్వేశ్వరరావు, పాలగుమ్మి పద్మరాజు మొదలైన

కవిమిత్రులతో కలిసి తిలక్‌గారు తణుకునుండి 'నవ్యాలోకము" అనే కవితా సంకలనాన్ని "విజ్ఞాన సమితి" పేరుతో ప్రచురించారు. దీనిలో వీరి కవిత "ప్రాణంలేని నీడలు" వచ్చింది. "నా కవిత్వం" – "గుండెకింద నవ్వు" – "ముసలివాడు" – "వేసవి" – "భూలోకం" – "సంజ" – అనే గేయాలు; "బాబు" – "సముద్రపు అంచులు" అణే కథలు; "శిశిరర్తువు" – "వర్షా" – "ఆహ్వానము" అనే పద్య ఖండికలు – ఈ ప్రథమదశలో ఆవిర్భవించినట్టివే!

"మండోదరి" అనే శీర్షికతో ఒక చక్కని పద్యకావ్యం వ్రాశారు ఈ దశలోనే. అందులో సుమారు 300 పద్యాలున్నాయట! వీరు రోగగ్రస్తులై ఉండగా, వీరి అమ్మగారు పొరపాటున ఈ మండోదరి కావ్యాన్ని కూడా చిత్తుకాగితాలవాడికి తూచి అమ్మివేశారట! ఆ పద్యాలను తలచుకొని తిలక్‌గారు ఎన్నోసార్లు నా దగ్గర ఎంతగానో వాపోయారు, పాపం!

"భుగ్న పృష్ఠ కటి గ్రీవః, స్తబ్ధదృష్టి రధోముఖః।
కష్టేన లిఖితం గ్రంథం, యత్నేన పరిపాలయేత్॥"

– అనే శ్లోకాన్ని మన పెద్దలు తాటాకు పుస్తకాల చివర వ్రాసేవారు. "పిఱ్ఱలు, నడుము, మెడ, వంగిపోయి కూర్చొని, ముఖాన్ని వంచి, దృష్టి (తాటాకు పుస్తకం మీదనే) స్తంభింపజేసి, ఎంతో కష్టపడి వ్రాసిన గ్రంథం యిది. జాగ్రత్తగా ప్రయత్నంతో దీనిని కాపాడండి!" అని ఈ శ్లోక తాత్పర్యం. ఇలాగ కష్టపడి వ్రాసుకున్న లిఖితప్రతి పోతే కవి లేదా రచయిత ఎంత దుఃఖిస్తాడో ఊహించుకోవచ్చు.

1945 అక్టోబరు భారతిలో "మేగ్నాకార్టా" అనే గేయం వచ్చింది. "గుండెలోపలి గుండె కదలించి, తీగలోపలి తీగ సవరించి" చెప్పిన గేయం యిది. యువలోకానికి మార్చింగ్‌సాంగ్ యిది! "కల్పన" అనే సంకలన గ్రంథంలో వీరి గేయాలు కొన్ని వచ్చాయి.

1946 నవంబరు భారతిలో "అద్దంలో జిన్నా" అనే స్కెచ్ వచ్చింది. ఇది చదువుతూ ఉంటే ఎంతటివాడైనా ఉగ్రూతలూగిపోతాడు! హిందూ ముస్లిములు పరస్పరం తెగనరుక్కుంటున్న రోజులవి – భారతదేశం అట్టుడికిపోతోంది! స్వరాజ్యం రాబోతోంది. దేశాన్ని ముక్కలు చేయదలచిన జిన్నా అంతరాత్మని స్పృశించి పలికించారు బాలగంగాధర తిలక్! సుఖంగా బ్రతికే ప్రజలను విభజించి నాయకులెలా పుడతారో, తమ నాయకత్వాన్ని నిలబెట్టుకుందుకు తాము చేసిన

తప్పుడు పనులను ఎలా కప్పిపుచ్చుకుంటారో, అసత్యాన్ని సత్యంగా ప్రజలకు ఎలా చూపుతారో విపులంగా నిరూపించారు ఈ స్కెచ్‌లో. జిన్నా వచ్చి అద్దం ముందు నిలబడతాడు. అంతక్రితమే కారులో వస్తూ, పేపర్లో హిందూ ముస్లింల హత్యలు చదివాడు. కొంచెం చలించాడు.

"జిన్నా అద్దంముందు నుంచున్నాడు. జిన్నా కోటుగుండీలు విప్పుకున్నాడు... కోటు విప్పుకొని, చొక్కా విప్పుకున్నాడు. జిన్నా ఉలిక్కిపడ్డాడు! అద్దంలో జిన్నా గుండె మీద రక్తపు మరక కనబడింది!" ఈ రక్తపు మరక జిన్నాకి జ్ఞానోదయం కలుగజేసింది. తాను తన వాళ్ళలో వ్యాపింపజేసిన అబద్ధాన్ని ఎత్తిచూపింది. జిన్నా అందరితోనూ నిజం చెప్పెయ్యాలనుకున్నాడు. కాని "... ఒక అబద్ధాన్ని నిజం అని చెప్పినమ్మించవచ్చును. తర్వాత ఆ అబద్ధం అబద్ధం అని చెప్పినా ఎవరూ నమ్మరు. ఇంక దారిలేదు. నాయకుడు నాయకుడుగానే ఉండాలి. ఉండకపోతే చంపేస్తారు!" అందుచేత జిన్నా ఒక నాయకుడుగా అజ్ఞానాన్ని వ్యాపింపజేస్తూ, అబద్ధాన్ని నిజంగా చెప్పాలనే మొదటి ధోరణికే వస్తాడు. అప్పుడు–

"జిన్నా అద్దంలో చూసుకున్నాడు. అద్దంలో జిన్నా చాలా గొప్పవాడు. తన వెనకాల పదికోట్లమంది మహమ్మదీయులున్నారు. పదికోట్లమంది మహమ్మదీయుల మనస్సులలో తన భావం విద్యుత్తులా మెరిసింది! వానలా కురిసింది! కొండగుహలా ప్రతిధ్వనించింది! తాను ఒక ప్రాణి కాదు. ఒక చిత్రం కాదు. ఒక మనస్సు!!

"ఆయా!" అన్నాడు జిన్నా.

"ఈ రక్తపు మరకని చెరిపెయ్యి!" అన్నాడు జిన్నా.

"అది చెరగదు ప్రభూ!" అంది ఆయా.

జిన్నా ఉలిక్కిపడ్డాడు. "చెరగదా?"

– అని తిరిగి ప్రశ్నించాడు. తొందరగా కోటు తొడుక్కున్నాడు. కోటు గుండీలు పెట్టుకున్నాడు. అద్దంలో జిన్నా కనబడ్డాడు. అద్దంలో జిన్నా చాలా గొప్పవాడు. చాలా గొప్పవాడి కన్నా గొప్పవాడు. జిన్నా వెనుక పదికోట్లమంది మహమ్మదీయుల ఇరవై కోట్ల కళ్ళల్లో..." అని ఆగిపోతుంది రచన.

ఇది పాఠకలోకాన్ని కదిలించివేసింది! వెంటనే రాయప్రోలు సుబ్బారావుగారి పుత్రుడు రాయప్రోలు రాజశేఖర్ దీనిని ఆంగ్లంలోకి అనువదించి Illustrated weekly of India లో ప్రచురించారు.

1946లోనే డిసెంబరు నెల భారతిలో "దీక్ష" అనే మూడు పద్యాలు ప్రకటితమయ్యాయి. ఇదే ఈ ప్రథమ దశకు ఆఖరి రచన. ఇదే సంవత్సరం రాజమండ్రిలో నవ్యకళాపరిషత్తులో ఉపన్యసించారు తిలక్. అంతే! ఆ తర్వాత ఆధివ్యాధి పీడితులైపోయారు తిలక్. కవితాపికం మూగవోయింది!

16.2 అజ్ఞాతదశ లేక అనారోగ్యదశ (1946-1954):-

తిలక్ 1946 నుండి 1954 వరకు ఎనిమిదేళ్ళపాటు రోగగ్రస్తులై మంచంపట్టి వున్నారని ఇది వరకే చెప్పాను. ఈ దశలో ఏవీ రచనలు చేయలేదని వేరే చెప్పనక్కరలేదు. కాని "బాధాగళము" అనే పేరుతో ఆరు పద్యాలు మాత్రము వ్రాశారు. (వీటిని రెండవ దశలో 'భారతి'లో ప్రకటించారు.) ఇవి తాను వయసులో ఉన్నప్పుడు ప్రేమించిన ఒక యువతిపై చెప్పినట్లుగా ఉన్నాయి. అనారోగ్యంతో బాధపడుతూ, కవితారచనకు దూరమై తిలక్ ఎంత కుమిలిపోయారో మనం తెలుసుకోవడానికి ఈ క్రింది పద్యం ఒక్కటి చాలు:

"గుండియపోటుతో బ్రతుకు కోసలు వంకరయ్యె, వేదనల్
చెండిన కత్తులీ తనువు ఛిన్నమొనర్చెను, మౌనబాష్పముల్
నిండిన సంద్రముల్ కనుల నివ్వెరపోయె, నికేమిపల్కు నీ
కొండొక షట్పదమ్ము, మణికోమల వీణయు, పూంస్పికమ్ముయున్!"

(-భారతి, డిసెంబరు 1964)

16.3 ద్వితీయదశ (1954-1966):-

1954లో ఆంధ్రపత్రిక దినపత్రిక ఆదివారం సంచికలో శ్రీశ్రీగారి మీద పెద్ద దుమారం చెలరేగింది. శ్రీశ్రీగారు రష్యాయాత్ర చేసి వచ్చారు. రెండవ ప్రపంచయుద్ధంలో అక్కడ రష్యాలో స్త్రీలుకూడా నాజీసేనలను ఎదిరించి పోరాడారని; ఇక్కడ ఇండియాలో జపానువాడు విశాఖపట్టణంలో బాంబులువేస్తే, మనం కాకినాడ దాకా పరుగులు పెట్టామని ఇలా ఏదేదో అన్నారు. దీనితో మన కవి పండిత లోకానికి కోపం వచ్చింది. శ్రీశ్రీగారు కమ్యూనిస్టులను, రష్యాదేశాన్ని పొగడుతూ, భారతదేశాన్ని కించపరుస్తూ, మాట్లాడుతున్నారనీ, ఆయనకు దేశభక్తి లేదనీ, ఆయన రష్యా ఏజెంటనీ - ఇంకా ఏవేవో అంటూ ప్రతివాడూ ఆయన మీద ధ్వజమెత్తసాగాడు. శ్రీశ్రీతో సమానమైన ప్రతిభావంతులు ఏమైనా విమర్శిస్తే ఫరవాలేదు; కాని బొడ్డూడని సాహిత్యార్భకులందరూ ఆయన్ని అపహాస్యం చేయడం మాత్రం బాగాలేదు. ఈ హడావిడిలో మేల్కొన్నారు తిలక్. ఆధివ్యాధి

కబంధహస్తాలలో నుండి అప్పుడే తప్పించుకొని బయటపడ్డారు. ఆంధ్రపత్రిక ఆదివారం సంచికలలోని దుమారాన్ని తిలకించారు. (తిలక్ "హిందూ" - "ఆంధ్రపత్రిక" దినపత్రికలు తెప్పించుకొనే వారు. లెగ్యులర్‌గా చదివేశారు.) అప్పుడు తిలక్, శ్రీశ్రీని వ్యక్తిగతంగా ఏమీ అనకుండా, కమ్యూనిజంలోని లోపాలను ఎత్తిచూపుతూ "కవివాక్కు" అనే ఒక చక్కని వచన కవితను వ్రాశారు. అది ఆంధ్రపత్రిక దినపత్రిక, ఆదివారం సంచిక, జనవరి 23, 1955లో ముద్రితమయింది. కవిలోకాన్ని ఆకర్షించింది. ఇదే వారి సాహిత్యకృషిలో ద్వితీయదశకు నాందీప్రస్తావన. కమ్యూనిజాన్ని కన్నా మానవత్వాన్ని ప్రేమించడం గొప్ప అని నిరూపిస్తూ, వర్గకలహాన్ని రక్తపాతాన్ని నిరసిస్తూ -

"పులిచంపిన లేడినెత్తురు పులుముకోలేను
ఖడ్గమృగోదగ్ర విరావం ఆలకించలేను
జగద్ధాత్రీ! నీ కుమారులమైన మేము
తత్త్వాలపేర విప్లవాలపేర ఒకరినొకరం హతమార్చుకోలేము!
. . . .
శ్మశానభూమిని వికసిస్తుంది మీరు నాటిన పూలచెట్టు
కాని ఎవరు తుడుస్తారు తల్లీ! నీ కన్నీటి బొట్టు?"

శ్రీశ్రీ ఈ కవితను చూసి "తిలక్ కూడా ఎలా వ్రాశాడో చూడు?" అని తన మిత్రుల దగ్గర చెప్పుకొని బాధపడ్డాడట! "అమృతం కురిసిన రాత్రి" మొదటి ముద్రణలో (1968లో) విశాలాంధ్ర ప్రచురణాలయంవారు ఈ కవితకు సెన్సారు చేసివేయడం గమనార్హం!

1955 జూన్ భారతిలో "ఆర్తగీతం" అనే గేయం వచ్చి కవితాప్రియుల హృదయాల్లో అమృతవర్షం కురిపించింది. యౌవనదశలో తాను సాధించిన అద్భుత కార్యాలను తలచుకొంటూ "ఆరోజులు" అనే గేయం వ్రాశారు. దీనిని

---

* నేను ఛందోబద్ధమైన వాటిని పద్యాలనీ, మిగిలినవాటిని గేయాలనీ పేర్కొంటున్నాను. ఈ గేయాలు "మాత్రాగణ బద్ధమైన గేయాలు" కావచ్చు, లేదా "వచన గేయాలు" కావచ్చు. తిలక్‌గారు మొదటిదశలో మాత్రాగణబద్ధమైన గేయాలను, రెండవదశలో వచనగేయాలను ఎక్కువగా వ్రాశారు. తిలక్‌గారి వచనగేయాలలో కూడా ఒక విధమైన తూగు, అంత్యప్రాసలు, అంతర్లయ ఉంటాయి. కేవలం వచనంగా ఉన్నవి తక్కువ. వచనగేయాలను ఇప్పుడు "వచనకవితలు" అంటున్నారు. కొందరు "వచన గీతాలు" అనీ "వచన పద్యాలు" అనీ, మరికొందరు కేవలం "పద్యాలు" అనీ అంటున్నారు. వచనకవితలను "పద్యాలు" అనడం సరికాదు. ఛందోబద్ధమైనవి మాత్రమే "పద్యాలు". వీటికి వేయిసంవత్సరాల చరిత్ర ఉంది! వచనకవిత నిన్నమొన్నటిది!! 'నక్క ఎక్కడ? నాగలోకమెక్కడ?'

వారు ప్రథమదశలో కావించిన సాహిత్యకృషికి సింహావలోకనం అనవచ్చు. "సంజ"-"యుగళగీతిక"అనే గేయాలుకూడా ఇదే సంవత్సరం భారతిలో వచ్చాయి.*

1956 జూలై భారతిలో "అద్వితీయం" అనే అద్భుత వచనగీతం వచ్చింది. ఇది కేవలం ఛందోబద్ధంగా మాత్రమే పద్యాలు వ్రాసే కాటూరి వెంకటేశ్వరరావుగారి లాంటి పండితకవుల్ని కూడా ఆకర్షించింది; మంత్రముగ్ధుల్ని కావించింది! కేంద్ర సాహిత్య అకాడెమీవారు కాటూరివారి సంపాదకత్వంలో వెలువరించిన "తెలుగు కావ్యమాల" లో దీనికి స్థానం దక్కింది.

1957లో "రాత్రివేళ" అనే గేయం, "విచిత్ర ప్రణయం" ("సుచిత్ర ప్రణయం") అనే హాస్యనాటిక రచించారు. 1958లో "సుశీలపెళ్ళి" అనే నాటకం వ్రాశారు. 1959లో "సాలెపురుగు" ("సాలెగూడు") అనే నాటకం; "స్వయంవర" అనే పద్యాలు; "కఠినోపనిషత్" - "తపాలా బంట్రోతు" అనే వచనగీతాలు; "నల్లజర్ల రోడ్డు" అనే కథ రచించారు. "ఊరిచివరి యిల్లు" అనే కథ, "The shadows" అనే పేరుతో దీని ఆంగ్లానువాదము కూడా ఈ సంవత్సరంలోనే వచ్చాయి.

ఆ రోజుల్లో "The Tribune" అనే ఆంగ్ల మాసపత్రిక ప్రపంచ కథానికలపోటీ జరుపుతూ ఉండేది. ఒకసారి ఆ పోటీలలో పాలగుమ్మి పద్మరాజుగారు రచించిన "గాలివాన" కథకు (దీని ఆంగ్లానువాదానికి) ద్వితీయ బహుమతి వచ్చింది. అప్పటి నుంచి తిలక్‌గారు తన కథ కూడా ఒకటి ఆంగ్లంలోకి అనువదించి ఆ పత్రికకు పంపాలని నిశ్చయించుకున్నారు. ఫలితంగా "ఊరిచివరి యిల్లు"ను "The shadows" అనే పేరుతో తానే అనువదించి ఆ పత్రికకు పంపారు. కాని బహుమతి రాలేదు.

1960లో- "అమృతభావము" - "సంగీతవృత్తము" పద్యాలు; ప్రథమ భాగంలో రచించిన "సముద్రపు అంచులు" కథ ఈ సంవత్సరం ప్రచురిత మయింది; "ఇరుగు-పొరుగు" నాటిక. "సముద్రపు అంచులు" పెద్దకథ. ఇది 1960 నవంబరు భారతిలో ముద్రితమయింది. అప్పుడు తిలక్‌గారు నాతో ఇలా అన్నారు: "వ్యాకరణం ప్రకారం 'సముద్రము + అంచులు > సముద్రపు + అంచులు > సముద్రపు టంచులు' కావాలి. కాని 'టంచులు' బాగుండలేదు. అందువల్ల 'సముద్రపు అంచులు'గానే ఉంచేశాను!"

1961లో–"విషణ్ణ వైదేహి" పద్యాలు; "వసుధైకగీతం" – "స్వేచ్ఛావిహారం" – అనే వచనకవితలు; "ఒక శ్రుతి" అనే గేయం.

1962లో–"ఆటవెలది–1" – "శర్వరీప్రియ" పద్యాలు; "అమృతం కురిసిన రాత్రి" – "న్యూసిలబస్" అనే వచనకవితలు

1963లో–"తీవ్రవాద నాయకుడు" కథ; "ఆటవెలది–2" – "ఆటవెలది–3" పద్యాలు; "విరహోత్కంఠిత" వచనకవిత.

1964లో–"ఒక్కసారి" – "నేను కాని నేను" – "నెహ్రూ" – "అదృష్టాధ్వగమనం" – "నిన్నరాత్రి" అనే వచనకవితలు;

1965లో–"నువ్వులేవు నీ పాట వుంది" – "కిటికీ" – "నగరం మీద ప్రేమగీతం" – "దీపం" – "కొనకళ్ళకు అక్షరాంజలి" – వచన కవితలు; "దేవుణ్ణి చూసినవాడు" – "దొంగ" కథలు –

ఇక్కడ 1965లో ముద్రితమైన తిలక్‌గారి "కొనకళ్ళకు అక్షరాంజలి" అనే కవితను గురించి ఒక అతిముఖ్యమైన విషయాన్ని లోకానికి తెలియజేయాలని అనుకుంటున్నాను. ఈ కవితా శీర్షికలోని "అక్షరాంజలి" అనే సమాసాన్ని తీసికొని, దీనిని "శ్రద్ధాంజలి" గాను, "బాష్పాంజలి"గాను భావించి, డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావుగారి వంటి ప్రముఖ విమర్శకులు, డా॥ వెల్చాల కొండలరావుగారి వంటి ప్రసిద్ధ అనువాదకులు (వీరు తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటిని "The Night The Nectar Rained" గా ఆంగ్లంలోకి అనువదించారు.) ఈ కవితను తప్పుగా అర్థం చేసికొన్నారు. "మొక్కజొన్న తోటలో – ముసిరిన చీకట్లలో" – అనే సుప్రసిద్ధ నృత్యగీతాన్ని రచించిన కొనకళ్ళ వెంకటరత్నంగారు ('బంగారుమామ పాటలు' కర్త) చనిపోయినప్పుడు తిలక్ ఈ కవితను వ్రాశారని – అంటే స్మృతిగీతం(Elegy) అని పై ప్రముఖులిద్దరూ భావించారు. ఇది శుద్ధ తప్పు. కొనకళ్ళ 1909లో పుట్టారు. 1965లో (ఆయనకు 56 సం.ల వయస్సులో) ఏలూరులో ఆయన మిత్రులు అభిమానులు వారికి ఘనసన్మానం చేశారు. ఆ సందర్భంగా "అక్షర మణిహారము" అనే పేరుతో ఒక చిన్న అభినందన గ్రంథం ముద్రించారు. అందులో తిలక్ వ్రాసిన అభినందన కవిత "కొనకళ్ళకు అక్షరాంజలి". కొనకళ్ళగారు 1971 జనవరి 9వ తేదీని చనిపోయారు. అప్పటికి తిలక్ లేరు.

1966లో– "అద్వైత మాన్మథం" పద్యాలు; "శిఖరారోహణ" – "త్రిమూర్తులు" – "కాస్మొపొలిటిన్" వచనకవితలు.

1967లో– 1966 జూన్ 30వ తేదీ రాత్రి (జూలై 1వ తేదీ కాదు) తిలక్‌గారు స్వర్గస్థులైన తర్వాత, వీరు రచించిన "సమవాకారం" అనే వచన కవిత 1967 ఏప్రిల్ నెల "ఆంధ్రప్రదేశ్" అనే రాష్ట్రప్రభుత్వంవారి మాసపత్రికలో ముద్రితమయింది. "సమవాకారం" అంటే "యుద్ధం" అని అర్థం. ఇది 1962లో జరిగిన ఇండియా – చైనా యుద్ధాన్ని గురించిన కవిత. మాసపత్రికలో ముద్రితమైన ఈ కవితను ఎవరూ గుర్తించలేదు. కాని నా చిరకాలమిత్రులు, నాలాగే తిలక్ కవిత్వాభిమాని అయిన డా॥ గన్నమరాజు గిరిజామనోహరబాబుగారు (వరంగల్లు) దీని paper cutting తన దగ్గర భద్రంగా దాచుకున్నారు. 2020 సంవత్సరంలో దానిని జిరాక్సు చేయించి నాకు పంపించారు. కాని ఆ జిరాక్స్ కాపీ అంత స్పష్టంగా లేదు. ఈ విషయం వారికి తెలియజేయగా, ఎంతో శ్రద్ధవహించి, వారే ఈ కవితను స్వయంగా చేతితో వ్రాసి నాకు పోస్టు చేశారు. వారి దస్తూరీ ముత్యాల కోవలా ఉంది. అందువల్ల ఈ కవితను హాయిగా చదువుకో గలిగాను. (ప్రొ॥ బి. రామరాజుగారి దస్తూరీ, డా॥ పెండ్యాల వరవరరావుగారి దస్తూరీ కూడా ముత్యాలకోవలే!). దీనిని ఇటీవల (2021, జనవరిలో) ఎమెస్కోవారు ప్రచురించిన "దేవరకొండ బాలగంగాధర తిలక్– లభ్యరచనల సంకలనం" ద్వితీయ ముద్రణలో చేర్పించగలిగాను (మొదటి ముద్రణ 2013లో వచ్చింది). డా॥ గిరిజామనోహర బాబుగారికి నా కృతజ్ఞతలు. 1967లోనే విశాలాంధ్ర ప్రచురణాలయంవారు "తిలక్ కథలు" మొదటిసారి ముద్రించారు. అది ఇప్పటికి ఎన్నో ముద్రణలు పొందింది.

1968లో– విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు తిలక్ వచనకవితలను గేయాలను కలిపి "అమృతం కురిసిన రాత్రి" అనే పేరుతో ముద్రించి తిలక్ కవిత్వాభిమానులకు గొప్ప ఉపకారం చేశారు. ఇది శ్రీశ్రీ మహాప్రస్థానంలాగే ఇప్పటికి ఎన్నో ముద్రణలు పొందింది. అయితే

ఇది కమ్యూనిస్టు పార్టీవారి ప్రచురణసంస్థ. తిలక్ కమ్యూనిజానికి, శ్రీశ్రీకి, చైనాకి వ్యతిరేకమైన రచనలు చాలా చేశారు. అవి వీరికి గొంతులో పచ్చివెలక్కాయలా అడ్డుపడ్డాయి. "కవివాక్కు" - "త్రిమూర్తులు", "త్రిశూలం" అనే కవితలు, "తీవ్రవాద నాయకుడు" అనే కథ, "ఇరుగు-పొరుగు" అనే నాటిక - ఇటువంటివి కమ్యూనిజానికి వ్యతిరేక రచనలు. విశాలాంధ్ర ప్రచురణాలయం వారు మొదట కొన్ని సెన్సారు చేసివేశారు; కొన్ని మార్చివేశారు. కమ్యూనిస్టు పార్టీ C.P.I – C.P.M – C.P.I (ML) – మావోయిస్టు పార్టీ - ఇత్యాదిగా ఛిన్నాభిన్నం అయ్యాక C.P.I. కి చెందిన విశాలాంధ్రవారు కొంత మెత్తబడి, వీటిని తిరిగి స్వీకరించారు. శ్రీశ్రీ మావోయిస్టుపార్టీకి నక్సలైట్లకి అభిమాని అయిపోవడంతో హాయిగా గాలిపీల్చుకుని, శ్రీశ్రీకి, సాయుధవిప్లవానికి, చైనాకి, వ్యతిరేకమైన రచనలను సాదరంగా ఆహ్వానించారు. (అయితే వీరి తిలక్ కవితా సంపుటిలోను, తిలక్ కథలలోను, రచనల ముద్రణ సంవత్సరాలు తప్పుగా పడ్డాయి)

1954 నుండి 1966లో వీరు దివంగతులయ్యేంతవరకూ, వీరి రచనలు పుంఖానుపుంఖంగా వివిధ పత్రికలలో వస్తూనే ఉన్నాయి; పఠితల్ని ఆనంద పరవశుల్నిచేస్తూనే ఉన్నాయి! వీరికి ఏకలవ్యశిష్యుల్ని, అభిమానుల్ని, ఆరాధకుల్ని తయారు చేస్తూనే ఉన్నాయి! 1955 నుండి 1966 వరకు 'భారతి' పత్రికలో వీరి రచనలు ముద్రితం కాని సంవత్సరం లేదు అని చెప్పవచ్చు. వీరి రచనలకు ఏ పత్రికలోనైనా సరే అగ్రస్థానం ఇచ్చేవారు. 'భారతి' వంటి ఉత్తమ సాహిత్యపత్రికలోనే వీరి రచనలకు అగ్రతాంబూలం ఇవ్వబడింది అంటే మిగిలిన పత్రికల సంగతి చెప్పనవసరం లేదు. 1966 ఏప్రిల్ భారతిలో వచ్చిన "శిఖరారోహణ" అనే వచన కవిత, భారతిలో వచ్చిన వీరి రచనలలో చివరి రచన!

1966 జూలై "జ్యోతి" మాసపత్రికలో వచ్చిన "కాస్మోపాలిటన్" అనే వచన కవిత, వీరి జీవితంలో ఆఖరి రచన! దీంట్లో వీరు ఒక ఎపిటాఫ్ కూడా వ్రాశారు. 'కాస్మోపాలిటన్ బోర్' అనే మారుపేరుగల వ్యక్తి ప్రపంచమంతా తిరిగి తిరిగి -

సకల సిద్ధాంతాలూ మతాలూ యిజాలూ సైంటిఫిక్ నిజాలూ
అన్నీ కలబోసి రంగరించి ఒకే ఒక రహస్యం కనుక్కున్నారు
దాన్నే తన మరణానంతరం 'ఎపిటాఫ్'గా ఎన్నుకున్నారు:
"దేవుడూ మానవుడూ వీరిద్దరే యీ అనంత విశ్వంలో మూర్ఖులు
ఏకోణం నుంచి చూసినా వీరిద్దరూ మిజరబుల్ ఫెయిల్యూర్స్!"

కొందరు విమర్శకులు దీనినే తిలక్‌గారి 'ఎపిటాఫ్'గా భావించవచ్చు. కాని అది సరిగాదు. తిలక్‌గారి రచనలన్నీ సంపూర్ణంగా చదివిన తర్వాత కాని మనం ఒక నిర్ణయానికి రాకూడదు. వీరికి మానవత్వం మీద ప్రగాఢమైన విశ్వాసం ఉంది. ఏడుస్తున్న దేవుణ్ణి కూడా ఓదార్చగల ధీశాలి! భూమధ్యరేఖ తన గుండెల్లోంచి పోతోందని భావించి వసుధైకగీతాన్ని ఆలాపన చేసిన విశాలహృదయుడు తిలక్! ఇటువంటి కవి 'ఎపిటాఫ్' పై విధంగా నిరుత్సాహజనకంగా ఉండదేమో అనిపిస్తుంది నాకు. ఏమైనా దీనిని గురించి త్వరపడి ఒక నిర్ణయానికి రాకూడదు. ఇంకా పరిశీలించాలి.

అమృతం కురిసిన రాత్రిలోని మొట్టమొదటి కవిత "నా కవిత్వం"లోనే తిలక్ తానేమిటో, తన కవిత్వమేమిటో, తన ధ్యేయమేమిటో స్పష్టంగా చెప్పుకున్నారు:–

"నా కవిత్వం కాదొక తత్త్వం/ మరికాదు మీరనే మనస్తత్త్వం
కాదు ధనికవాదం సామ్యవాదం / కాదయ్యా అయోమయం జరామయం

. . . .

నా అక్షరాలు – కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు!
నా అక్షరాలు – ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు!
నా అక్షరాలు – వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు!!"

ఇలాగ ప్రత్యేకంగా (Special గా) స్వీయకవిత్వలక్షణాలు చెప్పుకోవడమే కాకుండా, సాధారణంగా (general గా) కవిత్వలక్షణాలేమిటో కూడా మరోనాలుగు కవితలలో స్పష్టంగా తెలియజేశారు. అవి "కవివాక్కు" – "నవకవిత" – "త్రిమూర్తులు" – "నా కవిత్వంలో నేను దొరుకుతాను". వీటిలో మూడు ముఖ్యమైన నిర్వచనాలున్నాయి:–

1) కరుణలేని కవివాక్కు సంకుచిత మవుతుంది!

2) ఇజంలో ఇంప్రిజన్ అయితే యింగితజ్ఞానం నశిస్తుంది!

ప్రిజంలాంటిది జీవితం, వేర్వేరు కోణాలు ప్రదర్శిస్తుంది!

3) కవిత్వం ఒక ఆల్కెమీ, దాని రహస్యం కవికే తెలుసు!

మొట్టమొదటి కవిత 'నా కవిత్వం'తో కలిపి మొత్తం ఐదుకవితలలో కవిత్వతత్త్వవిచారం చేశారు తిలక్. దీనినే ఆయన 'ఎపిటాఫ్'గా మనం భావించాలని నా అభిప్రాయం. "నా అక్షరాలు వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు" అనే సుకుమారమైన భావన అప్పటికీ ఇప్పటికీ ఎందరో సాహిత్య ప్రియులను ఆకర్షిస్తూనే ఉంది!

ప్రథమదశలో 'ప్రతిభ'–'భారతి'–'కాగడా'–'జ్వాల' – మొదలైన పత్రికలలోను; ద్వితీయదశలో 'భారతి'–'స్వతంత్ర' – 'సాహితి' – 'జ్యోతి'– 'జయశ్రీ' – 'ఆంధ్రప్రభ వారపత్రిక' – 'ఆంధ్రపత్రిక వారపత్రిక' – 'ఆంధ్రజ్యోతి దినపత్రిక' మొదలైన వాటిలోను తిలక్ రచనలు ప్రచురితమవుతూ ఉండేవి. ఏది ఏమైనా వీరి రచనలను ప్రచురించడంలో 'భారతి' మాసపత్రికదే అగ్రతాంబూలం! వీరి అత్యుత్తమ రచనలన్నీ దీనిలోనే వచ్చాయి.

అబ్బూరి ఛాయాదేవిగారి సంపాదకత్వాన వెలువడిన 'కవిత'లోను, సెవెన్ స్టార్స్ సిండికేట్‌వారి 'నవత'లోను వీరి గేయాలు వెలువడ్డాయి. తిలక్‌గారు సజీవులై వుండగా ఏలూరులోని "ప్రజా ప్రచురణలు" అనే సంస్థవారు తిలక్ వ్రాసిన కొన్ని కథలు, నాటకాలు మాత్రం పుస్తకాలుగా ప్రచురించారు. చనిపోయే నాటికి వీరి కవిత్వం పుస్తకరూపంలో ప్రచురితం కాలేదు. "కల్పన" – "అడుగుజాడ గురజాడది" అనే కవితాసంకలన గ్రంథాలలో వీరి గేయాలు కొన్ని వచ్చాయి.

ఈ సందర్భంగా ఒక ముఖ్యమైన విషయం పాఠకులకు చెప్పాలనుకుంటున్నాను. తిలక్‌గారు తన కవితలన్నీ పుస్తకరూపంలో రావాలని చాలా ఆదుర్దా పడేవారు. అకాల మరణంవల్ల వారి కోరిక నెరవేరలేదు. తన కవితా సంపుటికి "కఠినోపనిషత్" అనే పేరు పెడతానని నాతో అంటూ ఉండేవారు. అది మన ప్రాచీన "కఠోపనిషత్తు"కి పారడీ. ఈ పేరుతో ఒక కవిత కూడా వ్రాశారు. తిలక్ చనిపోయిన తరువాత విశాలాంధ్రవారు వెలువరించిన వీరి కవితలకు ప్రముఖ వచనకవి కుందుర్తి ఆంజనేయులుగారు మంచి పీఠిక వ్రాశారు. కవితా

సంపుటికి శీర్షికకూడా కుందుర్తిగారే నిర్ణయించారు. సంపుటిలోని "అమృతం కురిసిన రాత్రి" అనే కవితాశీర్షికనే మొత్తంసంపుటికి శీర్షికగా నిర్ణయించారు. ఇది చాలా గొప్ప నిర్ణయం! తిలక్ కవితా సౌందర్యాన్ని పట్టియిచ్చే అత్యద్భుతమైన శీర్షిక యిది! కుందుర్తి కూడా మంచి కవి కావడంవల్ల మంచిశీర్షికను ఎంపిక చేయగలిగారు. దీనిముందు తిలక్ మొదట తాను అనుకున్న "కఠినోపనిషత్తు" అనే శీర్షిక వెలవెల పోతోందని నా అభిప్రాయం. (భగవంతుని నిర్ణయాలు చాలా గొప్పవి కదా!). కుందుర్తిగారు తన పీఠికకు కూడా తిలక్ "త్రిమూర్తులు" కవితలోని ఒక చిన్న పాదాన్ని స్వీకరించి "మావాడు – మహగట్టివాడు" అని పెట్టుకున్నారు. తిలక్ విశ్వనాథవారిని గురించి "మావాడే! మహగట్టివాడు" అన్న పాదాన్ని కొంచెం మార్చారు. కుందుర్తివారు విశ్వనాథను గురించిన ఈ పాదాన్నే స్వీకరించడంలో ఒక చిన్న రహస్యం దాగివుంది. కుందుర్తి ఆంజనేయులుగారు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి శిష్యులు. ఈ విషయం కుందుర్తిగారే ఒక వితలో చెప్పుకున్నారు. గురువుగారిపై ఛందోబద్ధమైన ఒక పద్యం కూడా వ్రాశారు "వచన కవితా పితామహుడు" కుందుర్తి!

తిలక్‌గారు పేరుపెట్టని ఒక పెద్ద నవలను ప్రారంభించారు కాని పూర్తి చేయలేదు. దాని కథాప్రణాళికనంతా నాతో చెప్పారు. వ్రాసినంతవరకు నాకు చదివి వినిపించారు. తక్కిన కథను సినాప్సిస్‌గా చెప్పారు. కాకినాడలో తాను స్వయంగా చూచిన ఒక నిరుపేదయైన ఉత్తమ గృహిణి జీవితమే దీనికి ఆధారమని తెలియజేశారు. ఒక అందమైన యువతి దారిద్ర్యంతో బాధపడుతూ ఉంటుంది. అయినా ఆమెలో దైన్యం ఏమాత్రమూ ఉండదు. మిక్కిలి అభిమానవతి. భర్తకు ఏ విధమైన ఆదాయమూ ఉండదు. ఎదురింటి మేడలో ఆమెను ఆరాధిస్తున్న ధనికుడైన ఒక యువకుడు ఉంటాడు. అతడు ఏ విధంగా సహాయం చేద్దామనుకున్నా ఆమె అంగీకరించేది కాదు. కొన్నాళ్ళకు ఆమెలో దారిద్ర్యానికీ పాతివ్రత్యానికీ సంఘర్షణ ఏర్పడుతుంది. ఆ సంఘర్షణలో దారిద్ర్యమే గెలుస్తుంది. ఆకలిబాధ తట్టుకోలేక ఒక రోజు అర్ధరాత్రి ఆమె స్వయంగా ఎదురింటి మేడలోకి వెళ్ళి ఆ యువకుణ్ణి తట్టి లేపుతుంది. "లే! వెళిపోదాం మనం!" అంటుంది. అక్కడితో నవల పూర్తియిపోతుంది. ఒకసారి తణుకు వచ్చిన ఆచంట జానకిరాంగారితో ఈ నవలను గురించి చెప్పారు. కథా ప్రణాళిక అంతా విని జానకిరాంగారు ఈ

నవలకు "మలుపు" అని పేరు పెట్టమని సలహా యిచ్చారు. తిలక్‌గారు దీనికి "చీలిన బాట" అని పేరు పెడదామనుకున్నారు.

పి.జి. వుడ్‌హౌస్ ధోరణిలో "నిర్మల మొగుడు" అనే పేరుతో వరుసగా కొన్ని హాస్య కథలు వ్రాయాలని సంకల్పించారు. కాని వాటిలో ఒక్క కథ మాత్రమే వ్రాశారు. ఇది 1958లో ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికలో ప్రకటింపబడింది. మిగిలిన కథలు వ్రాయలేకపోయారు.

"సుప్తశిల" నాటకం, "పొగ" అనే నాటిక పూర్తిచేశారు. ఇవి వారు చనిపోయేనాటికి ప్రకటితం కాలేదు.

17. తిలక్ మరణించిన తేదీ ఏది?:-

1966 జూలై 1వ తేదీని తిలక్‌గారు చనిపోయారని అందరూ చెపుతున్నారు. కాని యిది సరికాదు. నా పరిశీలన ప్రకారం వారు 1966 జూన్ 30వ తేదీ రాత్రే చనిపోయారు. ఆ రాత్రి గుండెలో నొప్పిగా వుందని చెప్పి, తన రిక్షాలో డా॥ జి. సోమరాజుగారు అనే డాక్టరు దగ్గరకు వెళ్ళి, ఒక ఇంజెక్షన్ చేయించుకొని, భయంతో ఆసుపత్రిలోనే ఉండిపోతానన్నారు. కాని డాక్టరుగారు "ఫరవాలేదు; ఇంటికి వెళ్ళిపోండి!" అన్నారు. రిక్షాలో తిరిగి యింటికి వస్తున్నారు. వెంకటేశ్వర టాకీస్ దగ్గర (దీని వెనక వీథిలోనే సోమరాజుగారి ఆసుపత్రి ఉంది.) రిక్షా ఆపి, ఒక స్వీట్ కిళ్ళీ కట్టించుకొని వేసుకున్నారు. ఆ కిళ్ళీ నములుతూ వుంటే పులకమారింది! దానిని తట్టుకోలేకపోయారు! గిలగిల లాడిపోయారు! వెంటనే ప్రాణం పోయింది! చనిపోయిన తిలక్‌గారి శవాన్ని రిక్షావాడు ఇంటికి తీసికొని వచ్చాడు. మర్నాడు జూలై 1వ తేదీనాడు తిలక్ మరణవార్త ఊరంతా వ్యాపించింది. జూలై 2వ తేదీ నాడు అన్ని వార్తాపత్రికలూ తిలక్ అకాలమరణాన్ని ప్రముఖంగా ప్రకటించాయి. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో Ph.D. పరిశోధన చేస్తున్న నేను Indian Express లో ఆ దుర్వార్త చదివి దిగ్భ్రాంతుడనయ్యాను. తిలక్‌గారి ఆప్తమిత్రులైన డా॥ ఆవంత్స సోమసుందర్‌గారు కూడా తిలక్ మరణాన్ని 1966 జూన్ 30వ తేదీగానే గ్రంథస్థం చేశారు (చూ. విజ్ఞాన సర్వస్వము, రెండవ సంపుటం, తెలుగు సంస్కృతి-2, పుట. 408).

18. విమర్శకులు:-

నేను తణుకులో ఉన్న ఆరేళ్ళలోనూ, బాలగంగాధర తిలక్‌గారు ఏ రచన

చేసినా ముందుగా నాకు చదివి వినిపించేవారు. రచన పూర్తిచెయ్యగానే వారి పనివాడిని ఊరిచివరనున్న మా యింటికి పంపించేవారు. "ఎంతో అర్జంటుపని వుంది వెంటనే రా!" అని చిన్న చీటీ వ్రాసి పంపేవారు. నేను ఏమిటో అనుకుని పరుగు పగురున వెళ్ళేవాడిని. "నీ కొకటి చదవి వినిపంచాలనుకున్నాను; కూర్చో!" అనేవారు. ఆయన తన బెడ్‌రూంలో పందిరిమంచం పరుపుమీద, ముందు రెండు దిండులూ, వెనక రెండు దిండులూ వేసుకొని, మొగలాయీ సుల్తానులాగ కూర్చునేవారు. వారి మంచానికి దగ్గరగా ప్రేముకుర్చీలో నేను కూర్చునేవాడిని. పద్యాలయితే వక్కనములుతూ సన్నగొంతుతో ఆయనే పాడేవారు. (నేను గేయాలు చాలా బాగా చదువుతాననీ, పద్యాలయితే తగలేస్తాననీ తిలక్‌గారి అభిప్రాయం.) గేయాలయితే ఒక్కొక్కప్పుడు తానే భావగంభీరంగా చదివేవారు; లేదా నన్ను చదవమనేవారు. కథ అయితే తప్పక నన్నే చదవమనేవారు. ఈ గోష్ఠి సాధారణంగా రాత్రి 7 గంటల నుండి 10 గంటల మధ్యలో జరిగేది మాకు.

చదవడం పూర్తికాగానే "ఎలా ఉంది?" అని అడిగేవారు, వ్రేళ్ళ మధ్యనున్న ముక్కుపొడుం పట్టు ముక్కుల్లోకి గట్టిగా పీలుస్తూ. వారి కలంనుండి వచ్చిన ప్రతిపదమూ, ప్రతివాక్యమూ నన్ను అమితంగా ఆకర్షించేవి. అందులో ఒక్క దోషం కూడా నా మనస్సుకు తట్టేది కాదు. "చాలా అద్భుతంగా ఉందండీ! వెంటనే ఫెయిర్ చేసి 'భారతి'కి పంపిస్తాను!" అనేవాడిని.

తిలక్‌గారు: "నువ్వు నా భక్తుడివీ, శిష్యుడివీనూ. నీకు ప్రతీదీ బాగుంటుంది. నన్ను విమర్శించలేవు. నాకు సరైన విమర్శకులు లేరు ఈ ఊళ్ళో. ఏం చెయ్యను?" అని ఎంతో వాపోయేవారు.

ఒకసారి తిలక్‌గారు "World Short Story Competition"కి ఆంగ్లంలో ఒక కథ వ్రాశారు. (ఆ పోటీ జరిపే పత్రికపేరు "The Tribune". తిలక్ వ్రాసిన కథపేరు "The shadows". ఇది వారు తెలుగులో వ్రాసిన "ఊరిచివరి యిల్లు"కు ఆంగ్లానువాదం.) ఆ ఆంగ్ల కథను విమర్శించి చెప్పవలసి వచ్చింది. నేనూ, వారి తమ్ముడు గంగాధర రామారావుగారూ ప్రథమ శ్రోతలుగా కథ అంతా విన్నాము. కాని ఏమీ చెప్పలేకపోయాం. తిలక్‌గారికి సంతృప్తి కలగలేదు. "నా రచనలు విమర్శించి, లోటుపాట్లు చెప్పగల వ్యక్తి ఈ ఊళ్ళో ఒకే ఒకరున్నారు. రేపు ఉదయం ఆయన దగ్గరకు వెడదాం, వస్తావా?" అని అడిగారు.

నాకు ఆశ్చర్యం వేసింది. నాకు తెలియని అంతటి గొప్ప వ్యక్తి ఈ తణుకులో ఎవరున్నారా? అని అనుకున్నాను. కుతూహలం పట్టలేక "ఎవరండీ వారు?" అని ప్రశ్నించాను.

"సారంగు నరసింహారావుగారు! చాలా చదువుకున్నవాడు. తెలుగు, ఇంగ్లీషు సాహిత్యాల గురించేకాక, ఫ్రెంచి సాహిత్యాన్ని గురించి కూడా ఆయనకు తెలుసు" అన్నారు తిలక్.

నేను మరింత ఆశ్చర్యపోయాను. నిశ్శబ్దంగా, నిరాడంబరంగా, పంచకట్టు, పైన పొడుగుచేతుల చొక్కా, మెడచుట్టూ కండువా ఒక చుట్టు చుట్టి వేసుకొని, సాయంకాలం వేళ మెల్లగా నడిచి, క్లబ్బు (టౌన్‌హాల్)కు వచ్చి, పేపర్లు చూచి వెళ్ళిపోయే వయస్సు మళ్ళిన ప్లీడరుగారిలో ఇంత సాహిత్యశక్తి ఉందా? నేను గుర్తించలేకపోయానే! అనుకున్నాను మనసులో. సాహిత్య శక్తిమంతుణ్ణి అంత శ్రద్ధగా భక్తిగా కొలిచేవారు తిలక్. (ఆ తర్వాత నేను కూడా సారంగు నరసింహారావుగారిని పరిచయం చేసికొని, వారితో అప్పుడప్పుడు సంభాషిస్తూ ఉండేవాడిని.)

శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారిని గొప్ప సాహిత్య విమర్శకులుగా కీర్తించేవారు తిలక్. తాను స్వయంగా మన తెలుగు సాహిత్యం మీద "శిల్పము-కళ" అనే పేరుతో విమర్శన వ్యాసాలు వ్రాస్తానని నాతో అంటూ ఉండేవారు. కాని ఆ ప్రయత్నం చేయకుండానే వెళ్ళిపోయారు పాపం! "కథలు వ్రాయడం ఎలా?" అనే చిన్న వ్యాసంలో మాత్రం కథారచనను చక్కగా విమర్శిస్తూ వ్రాశారు. తిలక్ చిన్న చిన్న వ్యాసాలు వ్రాశారు కాని, పెద్ద పెద్ద వ్యాసాలు వ్రాయలేదు. అవి కూడా చాలా తక్కువ సంఖ్యలో వ్రాశారు. "కవిత్వం అంటే" – "కథాకావ్యం" – "కావ్యసృష్టి" – "గాంధీజీ జీవితం ఒక మహాకావ్యం" – "హేమంత హసంతిక" – "కథలు వ్రాయడం ఎలా?" – "కృష్ణశాస్త్రి" (అసంపూర్ణం) – "యుద్ధమూ: రచయిత" (అలభ్యం) – "కావ్యరసం" (అలభ్యం) – ఇలా మొత్తం తొమ్మిది లఘు వ్యాసాలు మాత్రమే రచించారు తిలక్.

ఆ రోజుల్లో మా తణుకులో బాలగంగాధర తిలక్ ఒక్కరే కవి; సారంగు నరసింహారావుగారు ఒక్కరే విమర్శకులు. తక్కిన వారంతా యతిప్రాసలతో క్షుద్రుల్ని కీర్తించే "పారసైట్ కవి వరేణ్యులు", "చెక్కభజన విమర్శకులు!" ఈ ప్యారసైట్

కవులు తిలక్‌గారిని ఆక్షేపిస్తూ ఉండేవారు. తిలక్ ఛందోబద్ధంగా పద్యాలు వ్రాసినప్పుడు "పరవాలేదు, బాగానే ఉన్నాయి" అనేవారు. వచన గీతాలు వ్రాసినప్పుడు 'ఆఁ! ఏవో లల్లాయి పదాలు వ్రాస్తాడు" అని ముఖం చిట్లించుకునేవారు. "దేవరకొండ బాలగంగాధర తిలక్" అంటే ఒక్క తణుకే కాదు, ఒక్క ఆంధ్ర రాష్ట్రమే కాదు, యావద్భారతదేశమూ, గర్వించదగిన మహాకవి అని వారికేం తెలుసు? చలం చెప్పినట్లు "పూర్‌సోల్స్" పాపం! ఈ కవితిలకుని రచనలు మలయాళం, కన్నడం, హిందీ, బెంగాలీ, ఇంగ్లీషు, రష్యన్ భాషలలోకి అనువదింపబడ్డాయని మా ఊళ్ళో వున్న కవిమాత్రోపజీవులకు తెలియదు. "అంధకజన దూషితంబులు ఘనంబులుగావె అమూల్య రత్నముల్!"

19. అభిమాన కవులు – రచయితలు:–

తిలక్‌గారు సంస్కృతంలో భవభూతి ఉత్తరరామచరిత్రను, శూద్రకుని మృచ్ఛకటికం నాటకాన్ని, వాల్మీకి రామాయణాన్ని ఎక్కువగా చదువుతూ ఉండేవారు. రామాయణంలో సీత పాత్ర అంటే వీరికి అపరిమితమైన యిష్టం. సీతను గురించి తిలక్ ఎన్నో ఖండికలు వ్రాశారు: "స్వయంవర" – "విషణ్ణవైదేహి" – "పరిత్యక్త" – "అద్వైత మాన్మథం" మొదలైనవి.

తెలుగులో నన్నయ తిక్కనల భారతాన్ని చదువుతూ ఉండేవారు. ఈ భారత పఠనం వీరికి తండ్రిగారినుండి సంక్రమించిన అలవాటు. వచనరచనలలో శరత్ నవలలు పదే పదే చదువుతూ వుండేవారు. "ప్రతీ సంవత్సరం వీటిని ఒక్కసారి చదివితే కాని నాకు తోచదు. నన్ను శరత్ ఏడిపించినట్లుగా ఎవ్వరూ ఏడిపించలేదు. అబ్బ! ఆ 'పరిణీత' నవల చదువుతూంటే నాకు ఏడుపు కంఠపూర్తి అయిపోతుంది!" అనేవారు తిలక్.

నేను ఆ రోజుల్లో శరత్‌ను అంతగా ఇష్టపడేవాడిని కాదు. "ఏఁవిటో 'శరత్ శరత్' అంటారు అందరూ మీలాగే! కాని నాకు శరత్ రచనలు పరమబోరు కొడతాయి. ఆ 'శ్రీకాంత్' నవల చూడండి, అంతా బోర్! హస్క్! unnatural! ఆడదాన్ని మగవాడినీ రాత్రంతా ఏకాంతంగా ఒక గదిలో ఉంచుతాడు. తెల్లవారిపోతుంది. వాళ్ళిద్దరికీ ఏమీ సంబంధం లేదంటాడు! ఇంత కన్నా మన చలంగారు చాలా గొప్పవాడు!" అన్నాను నేనొకసారి తెలివి తక్కువగా తిలక్‌గారితో.

"నువ్వు పొరబడుతున్నావోయ్! నేను కొన్ని ప్రిన్సిపల్స్ చెపుతాను. ఆ ప్రకారం పరిశీలిస్తూ మరొకసారి చదువు శరత్ రచనలు. అప్పుడు తెలుస్తుంది అతని గొప్పతనం! చలం జీవితాన్ని ఒకే కోణం నుంచి చూస్తాడు. శరత్ సమగ్రంగా చిత్రిస్తాడు. జీవితంలో సెక్సుకన్నా ముఖ్యమైన సమస్యలు చాలా వున్నాయి. శరత్ వాచ్యంగా ఏదీ చెప్పడు. "చరిత్రహీనులు" నవలలో కిరణ్మయికి డాక్టరుకు సంబంధం వుంది. కాని అది వాచ్యం చెయ్యడు ఎక్కడా. అదే చలం అయితే బట్ట విప్పినట్టు అన్నీ చెప్పేస్తాడు. ఏది గొప్ప శిల్పం అంటావు?" అని తిరిగి ప్రశ్నించారు నన్ను తిలక్.

"సరే లెండి! మీరు చెప్పినట్లు మరోసారి చదివితేనే కాని ఏమీ చెప్పలేను" అన్నాను.

సంస్కృతాంధ్ర గ్రంథాలలాగే ఆంగ్ల గ్రంథాలు కూడా ఎక్కువగా చదివేవారు తిలక్. షేక్స్పియర్ నాటకాలు, బెర్నార్డ్‌షా నాటకాలు, పి.జి. వుడ్‌హౌస్ రచనలు, అగతాక్రిస్టీ డిటెక్టివ్ నవలలు, W.H.Auden కవిత్వము T.S.Eliot కవిత్వము చదువుతూ ఉండేవారు. వీరి కవిత్వం ఆంగ్లంలోని ఆడెన్ కవిత్వంలా ఉంటుందని మిత్రులు పాలగుమ్మి పద్మరాజుగారు, మల్లవరపు విశ్వేశ్వరరావుగారు తిలక్‌ను "ఆంధ్రాఆడెన్" అనేవారట! షేక్స్పియర్ నాటకాలకన్నా బెర్నార్డ్‌షా నాటకాలను ఎక్కువగా అభిమానించేవారు తిలక్. "షా Arms and Man నాటకం వ్రాసినట్లు మన ఖడ్గతిక్కనపై ఒక నాటకం వ్రాయాలని ఉంది. తల్లీ భార్యల మూర్ఖత్వము, వీరలక్షణాలపై వారికున్న మూఢవిశ్వాసం కారణంగా ఖడ్గతిక్కన చనిపోయాడు. పరిస్థితి అనుకూలంగా లేదు. సైన్యమంతా చనిపోయింది. ఒక్కడూ ఏం చేస్తాడు? పిచ్చిగా ముందుకుపోయి చనిపోవడం కన్న, వెనక్కి తిరిగివచ్చి, వీలు చూసుకొని మంచి సైన్యాన్ని సమకూర్చుకొని వెళ్ళి శత్రువులపై పడడం మంచిది కదా! షా నాటకంలోని "బ్లంష్లీ" (BLUNTSCHLI) పాత్రలాగే ఖడ్గతిక్కన వెనక్కి తిరిగి వచ్చాడు. ఇందులో అతని వీరత్వం ఎక్కడికి పోయింది? చాలా తెలివైన పనిచేశాడు. తల్లీ భార్యా కలిసి అతనిలో తిరిగి మూర్ఖత్వాన్ని రెచ్చగొట్టారు" అనేవారు తిలక్. వీరిచేతినుండి యిటువంటి "ఖడ్గతిక్కన" నాటకం విప్లవాత్మక ధోరణిలో వస్తుందని ఆశించాను. కాని విధి వేరుగా తలచింది. ఈ నాటకాన్ని మొదలు పెట్టకుండానే తిలక్‌గారిని మృత్యువు కబళించింది.

ఇలాగే "అహల్య" మీద కూడా పాతనమ్మకాలు ఎగిరిపోయేలా విప్లవ ధోరణిలో నాటకం వ్రాయాలని తలపెట్టారు. తిలక్‌గారి దృష్టికోణం యిలా ఉంటుంది: "అహల్యది ఏమీ తప్పులేదు. తప్పంతా గౌతమునిదే! అంత అందగత్తెను పెళ్ళాడి, ఇరవై నాలుగుగంటలూ ముక్కుమూసుకొని కూర్చుంటే ఏమైనట్టు? యౌవనం, ప్రకృతి, వెన్నెల – ఇవన్నీ ఆమెను ఇంద్రుని వైపు నెట్టాయి. ఇందులో ఆమె తప్పులేదు. పైగా పూర్వం వారిద్దరూ పరస్పరం ప్రేమించుకున్నారు కూడా" అని వాదించేవారు. ఈ ధోరణిలో "సుప్తశిల" అనే పేరుతో అహల్యనాటకాన్ని కొంతవరకూ వ్రాశారు. 1961లో నేను తిరుపతి వెళ్ళిపోయిన తరువాత దాన్ని పూర్తిచేసినట్లున్నారు. వారు చనిపోయేనాటికి ఇది ముద్రితం కాలేదు. తరువాత విశాలాంధ్రవారు ముద్రించారు.

20. సమకాలికులపై అభిప్రాయాలు:–

20.1 "కవిసార్వభౌమి" శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారు:– వీరు రాజమండ్రీలో ఉండేవారు. సంస్కృత రామాయణ భారత భాగవతాలను ఒంటి చేతిమీద ఆంధ్రీకరించారు. వీరి బొబ్బిలియుద్ధం నాటకం ప్రసిద్ధి కెక్కింది. నూతనత్వం ఏమీ లేకుండా ప్రాచీన ధోరణిలో వ్రాసే వీరిని దృష్టిలో పెట్టుకొని తిలక్ తన "రాజమండ్రి పాటలు" కవితలో మిక్కిలి ధ్వనిగర్భితంగా ఇలా అన్నారు.

"రాజమండ్రిలో సాహిత్య సుందరి
అందెలూ బావిలీలూ ఇంకా మానలేదు
కొంచెం మడిగా చేసిపెడుతోంది
భోజనంలో పాతచింతకాయ పచ్చడీ, వంగవరుగు పులుసూ
రుచిమాట దేవుడెరుగును గానీ
మాంచి ఆరోగ్యం తినగలిగిన పెద్ద మనిషికి!
యువకులూ నడివయస్కులూ కూడా
దేవతార్చనకి అక్కడికే వెళుతున్నారట!
సెంట్లూ, అత్తర్లూ/స్నోలు, పౌడర్లు/వాడదు
సినిమాలూ క్లబ్బులూ / చూడదావిడ
వృద్ధపతి సార్వభౌముల / కృద్ధలోచన నిర్గత
శాసనాబద్ధయై, రుద్ధయై, ముగ్ధయై."

వృద్ధులైన కృష్ణమూర్తిశాస్త్రిగారే కాకుండా, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారి వంటి యువకులు కూడా వారిపద్ధతిలోనే, ప్రాచీనధోరణిలోనే వ్రాస్తున్నారనే ధ్వనితో కవిత మధ్యలో "యువకులూ నడివయస్కులూ కూడా / దేవతార్చనకి అక్కడికే వెళుతున్నారట!" అన్నారు.

20.2 విశ్వనాథ సత్యనారాయణగారు:– "విశ్వనాథ సత్యనారాయణగారింట్లో వారం రోజులున్నాను నేను. పొద్దున్నే ఆయన వ్యాయామం చేసేవారు. వాళ్ళింట్లో దంపుడు బియ్యం భోజనం తప్ప, మరబియ్యం తినరు. నేను ఆ భోజనం చెయ్యలేక దొంగతనంగా హోటలుకు వెళ్ళి భోజనం చేసి వచ్చేవాడిని!" అని ఒక సంఘటనను చెపుతూ ఉండేవారు తిలక్.

"ఒకసారి మన తణుకులో విశ్వనాథ సత్యనారాయణగారి మీటింగు జరిగింది. వారు అధ్యక్షస్థానంలో కూర్చున్నారు. నేను వ్రాసిన కొన్ని పద్యాలు చదివాను. అందులో ఆఖరిది పంచపది: 'నిశి లేవెన్నెల చాలులో కరగిపోనీ మబ్బుగాణీలు…' అని మొదలు పెట్టాను పద్యం. ఐదుపాదలూ విని, అధ్యక్షులుగా ఉన్న సత్యనారాయణగారు 'ఏమిటేమిటీ! మళ్ళీ చదువు ఆ ఆఖరి పద్యం?' అన్నారు. నాకు గుండె ఆగిపోయినంత పని జరిగింది. ఛెడామడా తిడతాడురా దేవుడా అనుకున్నాను. బెదురుతూ పద్యమంతా తిరిగి చదివాను. 'భేష్! చాలా బాగుంది యీ పద్యం!' అని మెచ్చుకున్నారు. నేను ఊపిరి పీల్చుకున్నాను." విశ్వనాథవారి ఈ మెచ్చుకోలును చాలాసార్లు తలచుకొని మురిసిపోయేవారు తిలక్.

నేనొకసారి తిలక్‌గారిని "విశ్వనాథవారి రచనలను గురించి మీ అభిప్రాయం ఏమిటండీ?" అని ప్రశ్నించాను. "వేయి పడగలు గొప్పనవల. అందులో పసరిక పాత్ర సృష్టి చాలా అద్భుతమైనది. ఆయన ఐడియాస్ నాకు నచ్చవు. రామాయణ కల్పవృక్షం నాకు సరిగా అర్థం కావడం లేదు. మొత్తానికి… జీనియస్!" అన్నారు తిలక్.

"వేయిపడగల్లో గిరికపాత్ర ఏమిటండీ? అలాగ దేవుణ్ణి ప్రేమించేవాళ్ళు ఉంటారా?" అని అడిగాను.

"ఏమీ లేదు. అటువంటి వాళ్ళు ఉంటారు కాని, అదొక జబ్బు! ఆ జబ్బు తగ్గాలంటే ఒకటే మార్గం! అటువంటి స్త్రీని బలమైన వాడొకడు పట్టుకొని రేప్ చేస్తే సరి! ఇట్టేపోతుంది ఆ రోగం!!" అని పకపక నవ్వారు.

విశ్వనాథవారి బహుముఖ ప్రజ్ఞను మెచ్చుకొన్నా, వారి అభిప్రాయాలతో ఏకీభవించేవారు కాదు తిలక్.

20.3 20వ శతాబ్ది ప్రారంభంలో (అంటే 1910 ప్రాంతంలో) తెలుగులో ఆధునిక కవిత్వం మూడు పాయలుగా ప్రవహించింది:–

1) మొదటి పాయ: "సాంప్రదాయిక కవిత్వం" (Classical Poetry); లేదా "నవ్య సంప్రదాయ కవిత్వం" (Neo–Classical Poetry). దీని ప్రారంభకులు: తిరుపతి వేంకటకవులు. దీనిని ఒక ఉద్యమంగా ముందుకు నడిపించినవారు: విశ్వనాథ సత్యనారాయణగారు.

2) రెండవ పాయ: "కాల్పనిక కవిత్వం" లేక "భావకవిత్వం" (Romantic Poetry). ప్రారంభకులు: రాయప్రోలు సుబ్బారావుగారు

ఉద్యమ నాయకులు : దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు

3) మూడవ పాయ: అభ్యుదయ కవిత్వం (Progressive Poetry)

ప్రారంభకులు: గురజాడ అప్పారావుగారు

ఉద్యమనాయకులు: శ్రీశ్రీగారు

తిలక్‌గారు విశ్వనాథ – కృష్ణశాస్త్రి – శ్రీశ్రీలకు సమకాలికులు. వీరు ముగ్గురూ తిలక్‌ని ప్రభావితం చేశారు. కాని వీరిలోని గొప్పతనంతోపాటు వీరిలోని లోపాలను కూడా తిలక్ బాగా గుర్తించారు. అందువల్ల ఈ ముగ్గురినీ దృష్టిలో పెట్టుకొని "త్రిమూర్తులు" అనే చక్కని కవిత వ్రాయగలిగారు. వీరి గొప్పతనాన్ని ప్రశంసిస్తూ, లోపాలను ఖండిస్తూ ఈ కవిత సాగుతుంది.

1) విశ్వనాథవారు:–

విశ్వనాథవారి గొప్పతనం: చాలా గొప్పకవి, గొప్ప రచయిత, గొప్ప పండితుడు, గొప్ప భావుకుడు. సాహిత్యంలో ఉన్న అన్ని ప్రక్రియలు చేపట్టినవాడు. పట్టిందల్లా బంగారం చేసినవాడు. "వేయిపడగలు" నవల, "రామాయణ కల్పవృక్షం" మహాకావ్యం – ఈ రెండూ వారి అఖండకీర్తి అనే మేరుపర్వతానికి రెండు అత్యున్నత శిఖరాలు! 20వ శతాబ్దానికి ఆయనే యుగపురుషుడు! కాని ఆయన వేల సంవత్సరాలనాటి వేదకాల సంస్కృతిని మళ్ళీ ఈనాడు పునరుద్ధరించాలని చూస్తారు. ఇది వారిలోని ప్రధానమైన లోపం. "న్యూ సిలబస్" అనే కవితలో తిలక్ యిలా ఆక్షేపించారు:

"విశ్వనాథవారు వెనక్కి నడవగా నడవగా
వేదకాలం ఇంకా వెనక్కి వెనక్కి పోయిందట!"

"త్రిమూర్తులు" కవితలో విశ్వనాథవారి గొప్పతనాన్ని - లోపాన్ని ఎంతో కవితాత్మకంగా, ధ్వనిగర్భితంగా చెపుతారు తిలక్:

"ఒకడు / మావాడే / మహాగట్టివాడు
మకుటంలేని మహారాజయ్యేవాడు
కానీ, ముసలిదాన్ని / మసక మసక కన్నులదాన్ని
మనుధర్మశాస్త్రప్పందిరిలో
మనువాడాలన్న తొందరలో
మంచీ చెడ్డా మరిచిపోయాడు
మర్యాదలతిక్రించాడు
మరి పనికిరాడు!"

2) కృష్ణశాస్త్రిగారు:-

కృష్ణశాస్త్రిగారు శుద్ధభావకవి (Pure Romantic Poet). ఈయన సృష్టించినంత శుద్ధకవిత్వాన్ని (Pure Poetry ని) ఎవరూ సృష్టించలేదు. ఆంగ్లంలోని షెల్లీ, కీట్స్‌లతో సమానుడు. ఈయనలో నిలువెల్లా కవిత్వమే ప్రవహిస్తూ ఉంటుంది. మా గురుదేవులు దిగుమర్తి సీతారామస్వామిగారు ఒకసారి నాతో ఇలా అన్నారు: "సుబ్బారావ్! కృష్ణశాస్త్రిని కత్తితో పొడిస్తే రక్తం కారదు; కవిత్వం కారుతుంది!" ఈయన భావకవుల నాయకుడు. లోపం: ఈ భావకవులు ఊహలలో ఒక ప్రేయసిని సృష్టించుకొని, ఆమెకోసం ఎంతో బాధపడుతూ కవిత్వం వ్రాస్తారు. తమ చుట్టూ ఉన్న సమాజాన్ని నిరుపేదల దుర్భర దారిద్ర్యాన్ని, నిరుద్యోగాన్ని, కార్మిక కర్షకుల కష్టాన్ని, రాజకీయవేత్తలు ప్రజలను దోపిడీ చేస్తున్న ఘోరాన్ని - ఏమీ పట్టించుకోరు. ఈ లోపం భావుకవులలోను, వారి నాయకుడైన కృష్ణశాస్త్రిగారిలోను ఉంది. తిలక్ కవిత్వంలో కృష్ణశాస్త్రిగారి చిత్రణ:-

"మరొకడు-
మల్లెపూలమీద పరుంటాడు
మంచిగంధం రాసుకుంటాడు
మరి ఎందుకు ఏడుస్తాడు?

మంచి పనివాడు / మాకు నచ్చినవాడు
మంత్రనగరానికి వెళ్ళొచ్చినవాడు
మధ్యమధ్య మాధ్వరసం చేదంటాడు
వధ్యశిలమీద విరహగీతం రాస్తాడు
మాతోపాటు నడుస్తానంటాడు
మరి నిజంగా వస్తాడా?
మారిపోయిన జగాన్ని చూస్తాడా?

కృష్ణశాస్త్రిగారంటే తిలక్‌గారికి చాలా అభిమానం. "కృష్ణశాస్త్రివల్ల నేను చాలా inspire అయ్యాను". మా తణుకు టౌన్‌హాల్ ఆవరణలో ఒక పెద్ద కడిమి చెట్టు ఉంది. దాని క్రింద ఎప్పుడో కృష్ణశాస్త్రిగారు చేసిన సాహిత్యోపన్యాసాన్ని తిలక్ ఎన్నోసార్లు జ్ఞప్తికి తెచ్చుకొని పరవశించిపోయేవారు. ఒకసారి నన్ను ఆ కడిమిచెట్టు దగ్గరకు తీసికొని వెళ్ళి, దానిని నాకు చూపిస్తూ, "సుబ్బారావ్! ఈ చెట్టుక్రిందే కృష్ణశాస్త్రిగారు ప్రసంగించారు. కృష్ణశాస్త్రి ప్రసంగిస్తూ వుంటే వెన్నెల త్రాగుతున్నట్లు వుంటుందోయ్!" అన్నారు. నిజంగా కృష్ణశాస్త్రిగారిలాగ ఉపన్యసించే సాహిత్యవేత్త ఇంతవరకూ పుట్టలేదని ఆయన ఉపన్యాసాలు విన్నవాళ్ళు పుస్తకాల్లో రికార్డు చేశారు. భావకవిత్వాన్ని గురించి, నవ్యసాహిత్య పరిషత్తునుగురించి ఊరూరా తిరిగి గొప్పప్రచారం చేశారట కృష్ణశాస్త్రిగారు. ఆరోజుల్లో గాంధీగారి జాతీయోద్యమంలాగే కృష్ణశాస్త్రిగారి భావకవిత్వోద్యమంకూడా ఆంధ్రదేశంలో పెద్ద సంచలనం లేపిందని తిలక్‌గారు తన "కృష్ణశాస్త్రి" అనే అసంపూర్ణ వ్యాసంలో పేర్కొన్నారు. కాని కృష్ణశాస్త్రి మెచ్చుకోలు తెచ్చిపెట్టుకున్నట్టుగా ఉంటుందనీ, శ్రీశ్రీ ముభావంగా ఉంటాడనీ అనేవారు నాతో.

3) శ్రీశ్రీగారు: –

విశ్వనాథ, కృష్ణశాస్త్రిల వలెనే శ్రీశ్రీ కూడా తిలక్‌కి ఇష్టుడూ, అయిష్టుడూ కూడా. కృష్ణశాస్త్రికి – శ్రీశ్రీకి ఉన్న తేడా చెపుతూ చలంగారు 'యోగ్యతాపత్రం'లో ఒక మంచి మాట అన్నారు. "కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ; ప్రపంచం బాధ అంతా శ్రీశ్రీ బాధ!" సమాజంలోని పేదరికాన్ని, కార్మిక కర్షకులను పెట్టుబడిదారులు చేసే దోపిడీని, నిరుపేదల బాధల్ని ఎంతో శక్తిమంతంగా వర్ణించిన కవి శ్రీశ్రీ. అయితే లోపం ఏమిటంటే విప్లవాన్ని మార్క్సిజాన్ని ప్రచారం చేస్తూ,

హింసను ప్రబోధిస్తూ, రష్యాచైనాలకు దాసుడైపోయి, భారతీయ సంస్కృతిని చిన్నచూపు చూస్తాడు. ఈ విషయాలన్నీ ఎంతో కవితాత్మకంగా చిత్రించారు తిలక్. చూడండి:

"మూడోవాడు-
అరె! వీడు చిచ్చుర పిడుగు
ముందుకు వేసిన అడుగు
ఎండలో నడిచే మనుషులకి గొడుగు
మాకు చిన్నన్న!
కానీ అన్నన్న!
(మరి చెవులో చెపుతాను వినండి)
యీ మధ్య విజాతీయ మద్య
పానీయాల సేవనా విద్యా
సద్యః ప్రాప్త భావశూన్యుడై
మత్తుగా పరుండి నిద్రపోయాడు
మరి యిప్పట్లో లేవడు!"

మొత్తానికి విశ్వనాథ - కృష్ణశాస్త్రి - శ్రీశ్రీలు అంటే తిలక్‌గారికి ఎంతో అభిమానముంది. ఈ ముగ్గురినీ ఆధునిక తెలుగు కవిత్వానికి "త్రిమూర్తులు"గా భావించారు తిలక్. వీరిలోని లోపాలను పరిహరించి ముగ్గురినీ కలిపితే "బాల గంగాధర తిలక్" అవుతారు. వీరిలో ఏ ఒక్కరూ కాదు, ముగ్గురూ కలిస్తేనే తిలక్. విశ్వనాథలోని రచనాగాంభీర్యం, కృష్ణశాస్త్రిలోని భావసౌకుమార్యం, శ్రీశ్రీలోని అభ్యుదయం - ఈ మూడు గుణాలూ ముప్పిరిగొని ఉంటాయి తిలక్‌గారి కవిత్వంలో. మళ్ళీ ఈ ముగ్గురిలోను ఎవరి ప్రభావం ఎక్కువగా వుంది? - అని ప్రశ్నిస్తే - "కృష్ణశాస్త్రి ప్రభావం" అని చెప్పవలసి వస్తుంది.

20.4 "గోరాశాస్త్రి" (గోవిందు రామశాస్త్రి):-

ప్రముఖ పాత్రికేయులు, హాస్యరచయిత, "తెలుగు స్వతంత్ర" అనే పత్రికకు చాలాకాలం సంపాదకులుగాను, ప్రకాశకులుగాను ఉండేవారు. వీరు హైదరాబాద్‌లో "ఆంధ్రజనత" అనే దినపత్రికను సంపాదకులుగా ఉండగా, తిలక్ రచించిన "తపాలా బంట్రోతు" కవితను అందులో ముద్రించారు.

గోరాశాస్త్రిగారి రచనలను తిలక్ అభిమానించేవారు. వీరి వ్యంగ్యము, హాస్యము తిలక్‌కి చాలా యిష్టం. ఒకసారి హైదరాబాద్ వెళ్ళినప్పుడు గోరాశాస్త్రిగారిని కలిసి "నేను మీ ఫాన్‌ని!" అని చెప్పారట.

20.5 ఆరుద్ర – దాశరథి – సి. నారాయణరెడ్డి:–

తిలక్‌గారు 1946 నుండి 1954 వరకు – అంటే వారి 25వ ఏట నుండి 33వ ఏడు వరకు 8 సంవత్సరాలపాటు అనారోగ్యంతో లోకంతో సంబంధం లేకుండా గదిలో మంచానికే పరిమితమైపోయారని ముందుగానే తెలియజేశాను. ఈ విరామ అజ్ఞాతదశలో కొందరు క్రొత్తకవులు తెలుగులో ప్రసిద్ధులయ్యారు. వారిలో ముఖ్యులు: ఆరుద్ర, దాశరథి, సి.నారాయణరెడ్డి. తిలక్ అనారోగ్యం నుంచి కోలుకున్నాక పత్రికలు తిరగవేస్తుంటే ఈ మూడు పేర్లు ప్రముఖంగా కనపడ్డాయి. "వీళ్ళెవరు?" అని మిత్రుడు శ్రీపాద కృష్ణమూర్తిని అడిగారు. అతడు చెప్పాడు. వారి రచనలు తెప్పించుకొని చదివారు. వారికి అంతగా రుచించలేదు; పెదవి విరిచారు. ఈ ముగ్గురిని గురించి తిలక్ నాతో చెప్పిన అభిప్రాయాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:–

(1) ఆరుద్ర:– అనారోగ్య దశనుండి కోలుకున్నాక తిలక్ "ఈ ఆరుద్ర ఎవడోయ్?" అని ప్రశ్నించారు శ్రీపాదకృష్ణమూర్తిని. శ్రీశ్రీ మేనల్లుడని, "త్వమేవాఽహం"అనే కొత్తకావ్యం వ్రాశాడని చెప్పాడు. వెంటనే "త్వమేవాఽహం" తెప్పించి చూచారు. 'ఇసుక గడియారం' – 'నీటిగడియారం' లాంటి ఒకటి రెండు కవితలు బాగున్నా, మొత్తంమీద స్పష్టతలేని కవిగా పేర్కొన్నారు ఆరుద్రని తిలక్‌గారు.

(2) దాశరథి – సి.నారాయణరెడ్డి:– వీరిని గురించి తిలక్ అభిప్రాయం యిలా ఉండేది: "దాశరథి కవిత్వం కొంతవరకు ఫరవాలేదు. సి.నారాయణరెడ్డి కవిత్వం 'old wine in new bottles!' అతని 'కర్పూర వసంత రాయలు' కావ్యాన్ని తెగ మెచ్చుకుంటారు అందరూ. నాకు అందులో విశేషం ఏమీ కనబడలేదు!" అని కుండ బ్రద్దలు కొట్టినట్టు చెప్పివేశారు బాలగంగాధర తిలక్. తెలంగాణా వెనుకబడిన ప్రాంతం కాబట్టి వీరిద్దరి ప్రతిభ గబుక్కున బయట పడిందనీ, ఇటువంటి కవులు సర్కారు జిల్లాల్లో ఊరికి ఇద్దరు చొప్పున ఉన్నారనీ, అభివృద్ధి చెందిన ప్రాంతం కాబట్టి అంతంత మాత్రం వాళ్ళని లెక్కచెయ్యరనీ అంటూ ఉండేవారు తిలక్!

20.6 ఆవంత్స సోమసుందర్:-

తిలక్‌గారి ఆప్తమిత్రులలో వీరు ముఖ్యులు. వీరికి ఎన్నో లేఖలు వ్రాశారు తిలక్. వీరిని గురించి తిలక్ నాతో ఒకసారి ఇలా అన్నారు: "సోమసుందర్‌కి నేనంటే చాలా ప్రేమ. నన్ను 'అన్నయ్యా' అని పిలుస్తాడు. కాని పాపం, కవిత్వ రచనలో word effect (శబ్దశక్తి) ఎంత వుంటుందో తెలియని కవి! ఉపన్యాసం మాత్రం చాలా బాగా ఇస్తాడోయ్!"

20.7 పాలగుమ్మి పద్మరాజు:-

"మా పద్మరాజు దగ్గర నియోగి పోజు చాలా ఉంది! 'నేను చదివిన పుస్తకాలలో కనీసం సగమైనా చదివినవాడితోకాని నేను మాట్లాడను' అనేవాడు. ఇతని 'పురిటిపాట' మంచి కవిత. కథారచనలో ఇతనిది ప్రత్యేకమైన శిల్పం. శ్రీశ్రీది 'Spoonful Poetry' అనేవాడు మా పద్మరాజు. 'మహాప్రస్థానం' తర్వాత మంచి రచనలు ఏవీ చేయలేదు కదా! అందుకని అలా అనేవాడు." తిలక్‌గారు పద్మరాజుగారిది 'నియోగిపోజు' అన్నారుకాని, నిజానికి ఏమీ పుస్తకాలు చదవని వాడితో ఎలా మాట్లాడగలం? ఏమి చర్చించగలం?

20.8 బుచ్చిబాబు:-

"Buchibabu is nothing but a sophisticated Chalam" అనేవారు తిలక్.

20.9 భమిడిపాటి రాధాకృష్ణ:-

ఈయన ఒక రోజు తణుకు వచ్చి తిలక్‌గారితో చాలాసేపు సంభాషించారట. మర్నాడు నాతో ఆ విషయం చెప్పి "ఇటువంటి అతిగడుసువాళ్ళంటే నాకు చాలా భయం!" అన్నారు తిలక్.

20.10 నవలా రచయిత్రులు:-

ఆ రోజుల్లో విశేషంగా విజృంభించిన నవలా రచయిత్రులను అధిక్షేపించేవారు తిలక్. "పచనమైనా రచనమైనా పైచెయ్యి వాళ్ళదే" అన్నారు "అభినవ ఋగ్వాదం" అనే కవితలో. అభూత కల్పనలతో స్త్రీలు నవలలూ కథలూ వ్రాస్తూంటే, వర్ణనీయ వస్తువే తిరగబడి మనలనే వర్ణిస్తూంటే, పురుషులు ఏమి చేయాలో తోచక, వచన కవితల మహారణ్యాలు పట్టుకొని పోతున్నారని వేళాకోళం చేశారు:-

"నవలలు నవలలు రాసేస్తున్నారు
కవలల్ని క్వాడ్రుప్లెట్లుని సృష్టిస్తున్నారు (నవలల్లో)
పచనమైనా రచనమైనా పైచెయ్యి వాళ్ళదే
వచనం వదలి మగవాళ్ళు ని
ర్వచనం లేని కవితా కంటక వనాంతరాల పడి
ప్రవాసులై నిర్వాసులై పోతున్నారు
వర్ణనీయవస్తువే తిరగబడి వర్ణిస్తూంటే
కంచెయే చేను మేస్తూంటే –
హతవిధీ! ఇది కలికాలం, కలికాలం!"

ఈ కవిత ప్రారంభంలో "నవలలు – నవలలు" అని రెండుసార్లు ప్రయోగించడంలో చిన్న గమ్మత్తు చేశారు తిలక్. మొదటి "నవలలు" అంటే "స్త్రీలు" అని అర్థం. రెండవ "నవలలు" అంటే "Novels" అని అర్థం.

స్త్రీలు అల్పమనస్కులని, బ్రెయిన్ మెచూరిటీ సరిగా ఉండదని అంటూ ఉండేవారు.

22. నన్ను దృష్టిలో పెట్టుకొని చేసిన కొన్ని రచనలు:–

నేను దిగువ మధ్యతరగతి పేద బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాణ్ణి. బి.ఏ. చదివి నెలకి 110 రూ.లు సంపాదించే చిన్న గుమాస్తా ఉద్యోగం (తంతి–తపాలాశాఖలో). పెళ్ళాం–ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు. ఇంకా చదువుకొని జీవితంలో ఉన్నతస్థితికి రావాలని ఏవేవో కలలు – కోరికలు. "నా ఆర్థిక పరిస్థితి బాగుంటే నిన్ను ఎం.ఏ. చదివించేవాడిని!" అనేవారు తిలక్ అప్పుడప్పుడు. ఇటువంటి పేదయువకుడనైన నన్ను దృష్టిలో పెట్టుకొని, నాపేరుతోనే చేసిన రచనలు మూడు: (1) 1957లో రచించిన "విచిత్ర ప్రణయం" నాటిక. దీంట్లో "సుచిత్ర–సుబ్బారావు" నాయికా నాయకులు. (నేను సిగ్గుపడి నాపేరును "శేఖర్"గా మార్చివేశాను.) (2) "సుందరీ–సుబ్బారావు" కథ. (ఇది 1958లో ఆంధ్రప్రభ వారపత్రికలో వచ్చింది.) "సుబ్బారావు" అనే పేద యువకుడు, 'సుందరి' అనే ధనికుల అమ్మాయిని ఏకత్రైవానురాగంగా – ముళ్ళపూడివారి మాటల్లో చెప్పాలంటే 'ఏకలవ్యునిగా' – లేదా 'one way traffic' గా ప్రేమిస్తాడు. సుందరి తన కాలక్షేపంకోసం ఇతనితో తమాషాగా మాట్లాడుతూ వుంటుంది. అది ప్రేమ

అనుకుంటాడు సుబ్బారావు. చివరికి ఒక రోజున తన బంధువుల అబ్బాయితో పెళ్ళి కుదిరిందని శుభలేఖ చేతిలో పెడుతుంది. సుబ్బారావు హతాశుడై తెల్లబోతాడు! (3) "తపాలా బంట్రోతు" అనే వచనకవిత. (గోరాశాస్త్రిగారి సంపాదకత్వంలో హైదరాబాదునుండి వెలువడుతున్న "ఆంధ్రజనత" దినపత్రిక 1959 దీపావళి ప్రత్యేక సంచికలో ఈ Post Man కవిత వచ్చింది.) ఈ మూడు హాస్యరస ప్రధానమైనవే. నేను ఆ రోజుల్లో ఆర్థికంగా ఇబ్బందులుపడుతూ, విశ్రాంతిలేని చిన్న గుమాస్తా ఉద్యోగం చేస్తూ, ఏవేవో కలలు కంటూ, కవిత్వం రాసుకుంటూ, ఊహాలోకంలో విహరిస్తూ వుండేవాడిని. నా రహస్యాలన్నీ తిలక్‌గారికి విన్నవించేవాడిని. వీటిని ఆధారంగా చేసికొని పైన తెల్పిన నాటిక, కథ వ్రాశారు. వచన కవిత వ్రాసిన సందర్భం వేరుగా ఉంది.

1959లో ఆగస్టు నెలలో పశ్చిమ గోదావరిజిల్లా తంతి-తపాలా శాఖవారి వార్షికోత్సవాలు భీమవరంలో జరుగబోతున్నాయని నాకు నెలరోజులు ముందుగానే తెలిసింది. నేను ఆ రోజుల్లో తణుకు పోస్టాఫీసులో గుమాస్తాగా వుండేవాడిని. కవిగా నటునిగా నాకు డిపార్టుమెంటులో కొంచెం పేరుండేది. కొందరు గుమాస్తా మిత్రులు నన్ను ఆ వార్షికోత్సవానికి పద్యాలు వ్రాయమన్నారు. నేను: "ఈ వూళ్ళో నా కన్నా గొప్పవారు, మా గురువుగారు అయిన దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారున్నారు. ఆయనచేత ఒక మంచికవిత వ్రాయించి తీసికొనివచ్చి చదువుతాను. పద్యాలకన్నా వచనకవిత అయితే అందరికీ అర్థమవుతుంది" అన్నాను. వారు 'సరే' అన్నారు. వెంటనే ఆ రోజే తిలక్‌గారింటికి వెళ్ళి "పోస్టుమెన్ మీద అద్భుతంగా ఒక గేయం వ్రాసిపెట్టండి. భీమవరంలో జరిగే మా వార్షికోత్సవాలలో చదువుతాను" అని అన్నాను. తిలక్‌గారు చిరునవ్వు నవ్వి: "సరే! చూద్దాంలే!" అన్నారు. మరిచిపోతారేమోనని వారికి ఇంచుమించు రోజూ జ్ఞాపకం చేసేవాడిని. ఇలా నెలరోజులపాటు ప్రాధేయపడ్డాను. ఎప్పుడడిగినా "చూద్దాంలే! చూద్దాంలే!" అంటూనే వచ్చారు కాని కవిత మాత్రం వ్రాయలేదు. ప్రముఖ తమిళ రాజకీయవేత్త కామరాజ్ నాడార్ ఎవరైనా వచ్చి ఏదైనా పని చేసిపెట్టమంటే "పార్కలాం" (=చూద్దాంలే) అనేవాడట! అలా చేశారు తిలక్! ఈ లోగా జిల్లా తంతితపాలాశాఖ వార్షికోత్సవం వచ్చేసింది. చేసేదేమీ లేక నేను

భీమవరం వెళ్ళి ఆ వార్షికోత్సవసభలో నాకు మిక్కిలి యిష్టమైన తిలక్‌గారి "ఆర్తగీతం" చదివి వచ్చేశాను.

ఆ తర్వాత రెండు మూడు నెలలు గడిచిపోయాయి. ఒక రోజు సాయంకాలం చాలా అర్జంటు పనివుందనీ, వెంటనే యింటికి రమ్మనీ నాకు కబురు చేశారు. ఏమిటో అనుకుని నేను పరుగెత్తుకొని వెళ్ళాను! "నీకోమంచి గేయం చదివి వినిపిస్తాను, కూచో!" అని చెప్పి–

"మైడియర్ సుబ్బారావ్!
కనిపించడం మానేశావ్!
ఏఁవిటీ? పోస్టుమేన్ మీద గేయం వ్రాయాలా?
అందమైన అమ్మాయిమీదకాని
చందమామ మీదకాని
వంద్యుడైన భగవంతుడి మీదకాని, అ
వంద్యుడైన ధీరనాయకుడి మీదకాని
పద్యాలల్లమని మన పూర్వులు శాసిస్తే
ఎక్కడి పోస్టుమానో యీగోల!
ఈ చల్లని సాయంత్రం వేళ!!"

– అంటూ "తపాలా బంట్రోతు" కవిత అంతా చదివి వినిపించారు. నేను బ్రహ్మానంద భరితుడనైపోయాను! వెంటనే ఏదో జ్ఞాపకం వచ్చి గతుక్కుమన్నాను. "అరెరే! ఇంతమంచి గేయం జరిగిపోయిన మా వార్షికోత్సవ సభల్లో చదివి వుంటే ఎంత బాగుండేది! మీరు నాకు టైంలో రాసియివ్వలేదు!" అని తిలక్‌గారిమీద నిష్ఠూరోక్తులాడాను. ఆయన చిరునవ్వునవ్వుతూ "నువ్వు రాయమన్నప్పుడు రాసివుంటే ఏడిసినట్టు వచ్చేది! గత మూడునెలలపాటు నా మనసులో నానింది కాబట్టే యింత బాగావచ్చింది!" అన్నారు. అదీ నిజమే కావచ్చు. అయినా సరే, "ఇంతమంచి గేయం వ్యర్థమై పోయిందే!" అని తరచుగా ఆయన దగ్గర బాధపడసాగాను. కాని దీనిని వ్రాసిన కొద్ది రోజులకే హైదరాబాదునుండి గోరాశాస్త్రిగారు తిలక్‌గారికి ఒక లేఖ వ్రాశారు. (ఆయన అప్పట్లో "ఆంధ్రజనత" అనే దినపత్రికకు సంపాదకులుగా ఉండేవారు.) తమ దీపావళి సంచికకు తిలక్ రచన ఒకటి తప్పక పంపవలసిందని కోరుతూ ఆ లేఖలో వ్రాశారు. వెంటనే ఈ "తపాలా బంట్రోతు" కవిత పంపించారు తిలక్. తరువాత నేను కనపడినప్పుడు:

"సుబ్బారావ్! బాధపడకు. నీ గేయం 'ఆంధ్రజనత'కు పంపించానులే!" అన్నారు నవ్వుతూ. ఆ గేయం మొదటిపాదంలో ఉన్న "మైడియర్ సుబ్బారావ్!" అని నన్ను చేసిన సంబోధన దగ్గర చిన్న Foot Note ఇచ్చి పుట క్రింది భాగంలో "సుబ్బారావు అనే మిత్రుడు జిల్లా తపాలాశాఖ జరుపుకొనే వార్షికోత్సవానికి పోస్టుమేన్ మీద వ్రాయమని కోరినప్పుడు వ్రాసియిచ్చిన గేయం" అని వ్రాశారు. నిజానికిది అప్పుడు వ్రాసింది కాదు, మూడు నెలల తర్వాత వ్రాసినది.

"ఊరిచివరి యిల్లు" అనే కథ కూడా మా యింటి పరిసరాలను దృష్టిలో పెట్టుకొని వ్రాసిన కథ. మా యిల్లు ఊరికి దూరంగా, రైల్వేస్టేషన్‌కు దగ్గరగా, పంటపొలాల మధ్యన ఉన్న తాటాకు ఇల్లు. మా యింటికి సమీపంలో చెదురు మదురుగా మరికొన్ని తాటాకు ఇళ్ళు ఉండేవి. వాటిలో కొన్ని ఇళ్ళల్లో కొందరు వ్యభిచారిణులు (వేశ్యలు) ఉండేవారు. తిలక్‌గారు నాకోసం అప్పుడప్పుడు రిక్షాలో మా యింటికి వచ్చినప్పుడు ఆ పరిసరాలను బాగా గమనించారు. ఆ నేపథ్యంలో ఊహించి ఒక పతితయువతిని గురించి వ్రాసిన కథ "ఊరిచివరి యిల్లు". (తిలక్‌గారి యిల్లు ఊరికి మధ్యలో, టౌన్‌హాలు ప్రక్కన, మెయిన్ రోడ్డుకు సమీపంలో ఉండేది.)

22. రాజకీయాలు:-

తిలక్‌గారి రచనలు చదివి చాలామంది వీరిని కమ్యూనిస్టుగా లేదా అభిమానిగా భ్రమించే ప్రమాదం ఉంది. ఈ భ్రమకు కారణాలు లేకపోలేదు. వీరి గేయాలను కమ్యూనిస్టులే రష్యన్ భాషలోకి అనువదించారు. కమ్యూనిస్టు నాయకులు తరిమెల నాగిరెడ్డిగారు ఎన్నికల ప్రచారం కోసం తణుకు వచ్చినప్పుడు తిలక్‌గారిని కలుసుకొని, రష్యన్ భాషలోకి అనువదింపబడిన వీరి గేయాలను గురించి చాలాసేపు ముచ్చటించారు. సామ్యవాద సిద్ధాంతాభిమానులు నడిపిన "జ్వాల" - "కాగడా" అనే పత్రికలలో వీరి కవితలు ప్రచురింపబడేవి. "ఆర్తగీతం" లాంటి పేదలను గురించిన గీతాలు చాలా వ్రాశారు. మా వూళ్ళో కమ్యూనిస్టు పార్టీవారు కూడా వీరిని కమ్యూనిస్టు అభిమానులుగానే భావించేవారు; పార్టీ చందాకోసం శ్రీవంకా సత్యంగారివంటి నాయకులు వీరివద్దకు వచ్చేవారు. ఈయన ప్రతి సంవత్సరం ఆ రోజుల్లో 25 రూపాయలకు తక్కువ కాకుండా కమ్యూనిస్టు పార్టీకి చందా ఇచ్చేవారు. ఇవన్నీ పరిశీలిస్తే తిలక్‌గారు కమ్యూనిస్టు అని లేదా

అభిమాని అని ఎవరైనా అనుకుంటారు. కాని నిజానికి బాలగంగాధర తిలక్‌గారు కమ్యూనిస్టు కాదు కదా, కమ్యూనిస్టు సానుభూతిపరులు కూడా కారు. కమ్యూనిజానికి, శ్రీశ్రీకి, 1962లో మనపై దాడి చేసిన చైనాకు, తీవ్రవాదానికి వ్యతిరేకంగా కొన్ని రచనలు చేశారు తిలక్: "కవివాక్కు" (1955) – "త్రిశూలం" (1962) – "త్రిమూర్తులు" (1966) – "సమవాకారం" (1966) అనే కవితలు; "తీవ్రవాద నాయకుడు" కథ (1963); "ఇరుగు–పొరుగు" నాటిక (1962). ఈ రచనలన్నీ తిలక్‌గారు మార్క్సిస్టులు కారనడానికి ప్రబల తార్కాణాలు. వర్గకలహంతో స్వర్గాన్ని సృష్టిస్తామనే తీవ్రవాదులను ఈ క్రింది విధంగా ఆక్షేపించారు:–

"శాంతికోసం యుద్ధాన్ని ప్రజ్వలింపజేస్తారు
సుఖంకోసం ఆరక్త విప్లవాన్ని తరింపజేస్తారు
శ్మశానభూమిని వికసిస్తుంది మీరు నాటిన పూలచెట్టు
కాని ఎవరు తుడుస్తారు తల్లీ! నీ కన్నీటి బొట్టు?" (–కవివాక్కు)

తిలక్‌గారికి "ప్రభాకర్" అనే నిరుపేద మిత్రుడుండేవాడు తణుకులో. వీరిద్దరూ తణుకు హైస్కూలులో సహాధ్యాయులు. స్కూలుఫైనల్ ప్యాసయ్యాక ప్రభాకర్ కమ్యూనిస్టు పార్టీలో చేరి కొన్నాళ్ళకు "Town Secretary"గా నియమింపబడ్డాడు. ఇతనిని దృష్టిలో పెట్టుకొని "తీవ్రవాదనాయకుడు" అనే కథ వ్రాశారు తిలక్. ఇందులో కమ్యూనిస్టుల వర్గద్వేషాన్ని, దానికి గల కారణాన్ని విశదీకరించారు–కొంత హాస్యాన్ని మేళవించి:–

"శేషయ్య' నిరుపేద. స్కూలుఫైనల్ ప్యాసయిన నిరుద్యోగి. ఆకలితో బాధపడుతూ వీధులమ్మట తిరుగుతూ వుంటాడు. పేదవాడైనా మంచి సాధువు. ఆకలితో బాధపడే యువకుడు కదా అని 'తిరుపతి' ఇతనిని కమ్యూనిస్టు పార్టీలో చేర్చుకోవాలని ప్రయత్నించి విఫలుడవుతాడు. శేషయ్యకి 'మాధవు'డనే ఆగర్భ శ్రీమంతుడు మిత్రుడు. తన పిసినిగొట్టు తండ్రి చనిపోయాడనే సంతోషంతో మాధవుడు శేషయ్యకు మంచి విందు చేశాడు. 'దేవేంద్ర హొటల్లో' మూడు రోజులుంచాడు. అక్కడ శేషయ్య ఇష్టం వచ్చిన పదార్థాలు తిన్నాడు; ఖరీదైన విస్కీలు త్రాగాడు; మూడు రాత్రులూ ముగ్గురు యువతులను తృప్తిగా అనుభవించాడు. నాల్గవరోజున హొటల్ ఖాళీ చేయవలసివచ్చింది! తన పాత

తాటాకు ఇంటికి వెళ్ళిపోవలసి వచ్చింది! "ఎవరో ఒక పెద్ద నిచ్చెనవేసి, ఎత్తుకి మరీ ఎత్తుకి ఎక్కించేసి, ఉన్నట్టుండి దభాల్న కిందికి తోసేసినట్టయింది శేషయ్యకి! అతని బుర్ర తీవ్రంగా పనిచెయ్యడం మొదలు పెట్టింది!" హొటలు విడిచి రోడ్డుమీదికి వచ్చాడు. ఎదురుగా మాధవుడు కనపడ్డాడు. "ఎలా వుంది?" అన్నాడు నవ్వుతూ. శేషయ్య ఉగ్రుడై పోయాడు! తనకు ఆప్తమిత్రుడైన మాధవుని పీక పట్టుకొని చంపేస్తానంటాడు! మాధవుడు బిత్తరపోతాడు! శేషయ్య తీవ్రవాద నాయకుడుగా (కమ్యూనిస్టుగా) మారిపోతాడు! "ఈ ధనికవర్గాన్ని నాశనం చెయ్యడమే నా జీవితాశయం! నల్లుల్లాగ నలిపిపారేస్తాను! విప్లవం నా ధ్యేయం! హింస నా సాధనం! ద్వేషం నా రక్తం!" అని అరుస్తాడు. మీటింగుల్లో శేషయ్య మాట్లాడుతున్నప్పుడు విన్నవాళ్ళు ఒళ్ళు జలదరించి కంగారు పడిపోయారట! "అతనేం చెప్పాడో సరిగా ఎవరికీ తెలియదుకాని, చూపులూ, మంటలూ, శ్మశానాలూ, గద్దలూ, రక్తమూ మొదలైన భయంకరమైన మాటలు చాలా చాలా వినిపించి, చాలామంది చప్పట్లు కొట్టేశారు!"

ఈ కథ చివర్లో యిలా వ్రాశారు తిలక్: "శేషయ్య కఠినంగా అయిపోయాడు. నిరంతరం ధనికద్వేషం ఒక మహావ్రతంకింద కొనసాగిస్తున్నాడు. అందుకే మేడల్నీ, మోటారుకార్లనీ, ఫస్టుక్లాసు రైలుపెట్టెల్నీ కూడా చూడడు; గట్టిగా కళ్ళుమూసేసు కుంటాడు! అందమూ, ఆనందమూ, కళలూ–ఈ మూడూ తీరిక గల ధనవంతులకే కాబట్టి వాటి ప్రసక్తి కూడా రానివ్వడు. ఎప్పుడూ కొరకొర లాడుతూ నడుస్తున్న కొరకంచులా ఉంటాడు..."

"శేషయ్య గుండెల్లో ద్వేషం స్పిరిట్‌లా నీలంగా మండుతూంటుందనీ, యిప్పటికీ అతనికి రాత్రుళ్ళు కలల్లోకి 'హొటల్లో మూడు రోజులూ, మూడు బొమ్మలూ' వచ్చి ఉలిక్కి పడుతూంటాడనీ మాధవుడు అందరితోనూ అంటూంటాడుట!" అని ముగిస్తారు కథను తిలక్.

ఈ కథ చదివిన వారెవ్వరూ తిలక్‌ను కమ్యూనిస్టుగా భావించలేరు. సోషలిస్టు లీడరు "M.N.Roy" అన్నా, వారి "Radical Humanism" అన్నా తిలక్‌గారికి చాలా ఇష్టం. "I am a Royist!" అని సగర్వంగా చెప్పుకొనేవారు. బాలగంగాధర తిలక్ రాజకీయంగా మానవత్వాన్ని ప్రేమించే రాయిస్టుగా కనపడతారు! అందుకే

"దీపం ఆసరాతో చీకటి నిజాన్ని తెలుసుకో/ పాపం ఆసరాతో మానవుడి నైజాన్ని తెలుసుకో" అని వ్రాశారు.

(ముఖ్య గమనిక– ఇక్కడ పాఠకులు ఒక ముఖ్య విషయాన్ని గమనించాలి. తిలక్‌గారు కమ్యూనిజానికి సాయుధ విప్లవానికి వ్యతిరేకంగా చేసిన రచనలన్నీ 1963కి ముందు వ్రాసినవే. 1963 తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీలో చాలా మార్పులు వచ్చాయి. 1964లో కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలిపోయింది. C.P.I – C.P.I (M) లేదా "C.P.M." మొదటివారు రష్యా అనుయాయులు. రెండవవారు చైనా అనుయాయులు. వీరిద్దరూ కూడా సాయుధవిప్లవాన్ని సమర్థించకుండా, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. మొదట E.M.S.నంబూద్రిపాద్‌గారి నాయకత్వంలో కేరళలోను, తరువాత జ్యోతిబసుగారి నాయకత్వంలో పశ్చిమబెంగాల్‌లోను అధికారంలోకి వచ్చారు. బెంగాల్‌లో జ్యోతిబసుగారి నాయకత్వంలో వరుసగా ఐదుసార్లు నెగ్గి 25 సం.లు (1978 నుండి 2004 వరకు) పాలించారు. రెండు రాష్ట్రాల్లోను అధికారంలో సింహభాగం C.P.M. వారిదే. మిగిలిన చిన్న చిన్న వామపక్షాలు వారికి సహకరించాయి. C.P.M. అధికారంలో ఉండగానే పశ్చిమ బెంగాల్లో చారుముజుందార్ నాయకత్వంలో నక్సల్‌బరీ విప్లవోద్యమం ప్రారంభమయింది. వీరే నక్సలైట్లుగా దేశమంతటా వ్యాపించి ఈ నాటికీ సాయుధ విప్లవ మార్గాన్నే అనుసరిస్తున్నారు. వీరు కొంతకాలం "C.P.I (ML)" పేరుతోను, తరువాత "మావోయిస్టు పార్టీ" గాను చెలామణి అవుతున్నారు. వీరిలో మళ్ళీ ఎన్నో చీలికలు వచ్చాయి. కాబట్టి పాఠకులు గమనించవలసింది ఏమిటంటే ఈనాడు ఈ మావోయిస్టుపార్టీ (నక్సలైట్లు) ఒక్కటి తప్ప, తక్కిన కమ్యూనిస్టు పార్టీలు ఏవీ కూడా సాయుధ విప్లవాన్ని సమర్థించడంలేదు; ప్రజాస్వామ్య యుతంగానే ఎన్నికలలో పోటీచేస్తున్నారు. నిన్నమొన్న కేరళ రాష్ట్రంలో మళ్ళీ వామపక్షాలు C.P.M. నాయకత్వంలో అధికారంలోకి వచ్చాయి. తిలక్‌గారి కాలంలోని కమ్యూనిస్టుపార్టీ వేరు, ఈనాటి కమ్యూనిస్టు పార్టీలు వేరు. తిలక్‌గారి కాలంలోని సంయుక్త కమ్యూనిస్టుపార్టీ విప్లవమార్గాన్ని సమర్థించింది. ఈనాడు ఆ పరిస్థితి లేదు.)

తిలక్‌గారు గాంధీజీ గ్రంథాలను, నెహ్రూ రచనలను ఎక్కువగా పఠించేవారు. నెహ్రూ అంటే వీరికి విపరీతమైన అభిమానం. 1964లో నెహ్రూ చనిపోయినప్పుడు

చక్కటి స్మృతిగీతం (Elegy) వ్రాశారు భారతిలో. కాని చైనా విషయంలో నెహ్రూ తప్పుచేశాడని అనేవారు. అందుకే నెహ్రూ విధానాన్ని ఆక్షేపిస్తూ 1960 జనవరి నెల భారతిలో "ఇరుగు-పొరుగు" అనే నాటిక వ్రాశారు. ఇందులో "సిద్ధాంతం" అనే పాత్ర నెహ్రూకి సంకేతం. అలాగే "రాద్ధాంతం" పాత్ర నెహ్రూ విమర్శకులకు, "ఎర్రయ్య" పాత్ర ఇండియన్ కమ్యూనిస్టులకు ప్రతీకలు.

నెహ్రూగారికి ప్రజల్లో ఉన్న పలుకుబడిని గురించి తిలక్ చాలా గమ్మత్తుగా నాతో చెపుతూ ఉండేవారు:- "ఇండియాలో మిలిటరీ కూప్ వచ్చి నెహ్రూని కూలదోస్తే, ఆయన ప్రజల్లోకి వచ్చేసి, కన్యాకుమారి దగ్గరనుండి మొదలు పెట్టి మీటింగులు పెట్టుకుంటూ ఢిల్లీ వైపు వెడితే, ఢిల్లీ వెళ్ళేసరికి ప్రజలంతా నెహ్రూ వెనకాలపడి, డిక్టేటర్‌ని పీకపిసికి చంపేసి, మళ్ళీ నెహ్రూని గద్దెనెక్కిస్తారు! ముండాకొడుక్కి అంత పలుకుబడి వుంది ప్రజల్లో!"

చైనా మన మీద దండెత్తినప్పుడు నేను: "మొదట బుద్ధుడు, ఆ తర్వాత గాంధీ ఈ దేశాన్ని పాడుచేశారు! జాతిని నిర్వీర్యం చేసిపారేశారు!" అన్నాను ఆవేశంతో.

"లేదు; నువ్వు పొరబడుతున్నావ్! ఇంకా బాగా చదవాలి. అసలు మానవుడికి యుద్ధాలెందుకు? నువ్వు విశాల దృష్టితో ఆలోచిస్తే బుద్ధుడు చెప్పినదే నిజమైన సత్యమని గ్రహిస్తావు!" అన్నారు తిలక్. యుద్ధమనేది మానవుని స్వార్థానికి చిహ్నమని తిలక్ భావన. అందుకే "నిన్నరాత్రి" అనే కవితలో ఇలా అన్నారు:-

"చీనాతో యుద్ధంలో చితికిన కొడుకు వార్త విని
చీకట్లో ఏట్లో దూకిన ముసలిదాని పసరుగుండె నే చూపించానా?
కాంగోలో క్యూబాలో లావోస్‌లో సైప్రస్‌లో
కాలి కమురుకంపు కొట్టే కాలంకథ మానవవ్యథ నే వివరించానా?"

23. సెక్స్:-

బాలగంగాధర తిలక్‌గారు సెక్స్ రచనలు ఒకటీ రెండు వ్రాయక పోలేదు. కాని వాటిని ప్రచురించలేదు. ఒక కథ వ్రాసి నాకు చదివి వినిపించారు. స్కూలు ఫైనల్ చదివే ఒక అమాయిక బాలికను టైలర్ కుర్రాడొకడు బలాత్కరించి అనుభవిస్తాడు. అప్పుడు ఆ బాలిక మనోభావాలను గమ్మత్తుగా చిత్రిస్తూ వ్రాశారు.

నిజానికి ఆస్కెచ్ చాలా బాగుంది. ప్రచురించమన్నాను." ఛీఛీ! బాగుండదు. ఏదో సరదాగా వ్రాశాను, అంతే!" అన్నారు. సెక్సు రచనలు ప్రచురించడానికి తిలక్ సిగ్గుపడేవారు. వీరు స్వయంగా సెక్సు రచనలు చెయ్యలేదుకాని, సెక్సును గురించి చలంగారు వ్రాసిన కథలూ ("అమ్మగారి అవసరం" – "మంగమ్మ" వగైరాలు), ముద్దుకృష్ణ వ్రాసిన "ఉద్యోగం" కథా చెప్పి నవ్వేవారు.

తిలక్ సెక్సును గురించి కొన్ని సిద్ధాంతాలు చేసి నాతో చెపుతూ వుండేవారు. ఒక రోజు చల్లని సాయంత్రం వేళ, నేనూ తిలక్‌గారూ వారి యింటిముందు కుర్చీలు వేసుకొని కూర్చున్నాము. ఏదో మాటల సందర్భంలో ఆయన ఇలా అన్నారు: "ఈ పదంగా దేవుడు దిగివచ్చి, మన దేశంలో ఉన్న ఆడవాళ్ళనందరినీ వరసగా నుంచోబెట్టి, 'మీకేం భయంలేదు; నేను నిజం చెపుతున్నాను. నరకం అనేది ఏమీ లేదు; పాపం అనేది అంతకన్నా లేదు. మీ యిష్టం వచ్చినట్టు ఉండండి!' అని అన్నాడంటే, ఇప్పుడున్న పతివ్రతలలో నూటికి 90 మంది వాళ్ళ వాళ్ళ మొగుళ్ళను వదిలి లేచిపోతారు! అలాగే దేవుడు మగవాళ్ళ దగ్గరకు వచ్చి 'సుఖరోగాలు లేకుండా చేశాను. మీకేం భయంలేదు!' అని చెపితే చాలు, నువ్వూ నేనూ కూడా ఈ చక్కటి సాయంకాలాన్ని యిలా వేస్ట్ చెయ్యం!" అని పకపకా నవ్వేశారు.

లోపల కోరికలుండి, పైకి లేనట్లు నటించే పతివ్రతలన్నా, పెద్దమనుషులన్నా తిలక్‌గారికి కిట్టదు. అందుకే "ప్రార్థన" అనే కవితను ఇలా ప్రారంభించారు:–

"దేవుడా!
రక్షించు నా దేశాన్ని
పవిత్రులనుండి, పతివ్రతలనుండి
పెద్దమనుషులనుండి, పెద్దపులులనుండి
నీతుల రెండు నాల్కలు సాచి బుసలుకొట్టే
నిర్హేతుక కృపాసర్పాలనుండి
లక్షలాది దేవుళ్ళనుండి, వారి పూజారులనుండి
వారి వారి ప్రతినిధులనుండి
సిద్ధాంతకేసరులనుండి, సిద్ధులనుండి
శ్రీమన్మద్గురు పరంపరనుండి"

భోగంవాళ్ళ యిళ్ళన్నీ చూడాలనీ, వారి జీవితాలనుగురించి తెలుసుకోవాలనీ తిలక్‌గారికి చాలా కోరికగా ఉండేది. కాని వారి అనారోగ్యమూ, శుభ్రత విషయంలో వారికుండే అతి చాదస్తమూ ఈ కోరిక నెరవేరకుండా చేశాయి. ఒకసారి (1959లో) 'విచిత్ర ప్రణయం' నాటికలో హీరోయిన్ వేషంకోసం నేనూ తిలక్‌గారూ కలిసి రిక్షాలో రాజమండ్రీ మెరక వీథులన్నీ తిరిగాము. ఎందరో వేశ్యల్ని చూశాము. ఒక్కరికీ వారు భావించిన హీరోయిన్ లక్షణాలు లేవు. తరువాత నిడదవోలు నుంచి 'శ్యామల' అనే అమ్మాయిని తీసుకొచ్చాం. ఆమె పాత్రధారణ కూడా తిలక్‌గారికి పూర్తి సంతృప్తిని ఇవ్వలేదు. 'సాలెపురుగు' నాటకంలో నాయిక పాత్రను కాకినాడలో ఉండే 'బాలామణి' అనే అమ్మాయి వేసింది. ఇంటువంటి నటీమణులనూ, వేశ్యలనూ నిశితంగా పరిశీలించి 'ఊరిచివరి యిల్లు' అనే కథ వ్రాశారు తిలక్. అందులో వేశ్య అంతరంగాన్ని చాలా అద్భుతంగా చిత్రించారు. పతితల్ని కూడా మానవత్వంలో ఆదరించాలని నిరూపిస్తూ 'దేవుణ్ణి చూసినవాడు' అనే అత్యద్భుతమైన కథ వ్రాశారు తిలక్ (చూ. 1965 'జ్యోతి' దీపావళి సంచిక). వెలయాలు మీద ఒక ఆటవెలది పద్యం కూడా వ్రాశారు: ('ఆటవెలది' మీద ఆటవెలది!)

'రాత్రి పడినయంత రంగైన వెలయాలు
వీథి నిలిచి విసరె విభ్రమముల
పొలముగట్ల చేరి పొలపొల కదలెను
పడగలెత్తి త్రాచుపాము గములు."

మరొక గేయంలో సానిపడుచును గూర్చి ఇలా అన్నారు:

"అమ్ముకొని యౌవనం అలసిన జీవనం
సాగించి సాగించి సంధ్యవేళ ఉరితీసుకున్న
సానిపడుచు మాట చెప్పనా?"

నాకు తెలసినంతవరకూ తిలక్‌గారికి పరకీయశృంగారం ఉన్నట్లు లేదు. తణుకులో ఒక స్త్రీ విషయంలో కొందరు యువకులు చెవులు కొరుక్కుంటారు కాని, అది విశ్వసింపదగింది కాదు. అనారోగ్యమూ, అతిశుభ్రతా వీరిని ఏకపత్నీ వ్రతులుగా చేసి ఉండవచ్చును!

కవులకూ కళాకారులకూ సాధారణంగా ఉండే మూడు లోపాలు (సిగరెట్లు, త్రాగుడు, వ్యభిచారం) బాలగంగాధర తిలక్‌గారికి లేవనే చెప్పాలి!

తిలక్‌గారు గొప్ప అందగాడని మొదట్లోనే చెప్పాను. నాకు వారి వద్ద బాగా చనువు ఏర్పడ్డ తర్వాత ఒక రోజు ఇలా వ్యాఖ్యానించాను: “మీరు ఇప్పుడే ఇంత అందంగా ఉన్నారే, ఇరవై యేళ్ల వయస్సులో ఇంకెంత అందంగా ఉండేవారో!”

“Yes, I was a women killer” అన్నారు మందస్మిత వదనంతో తిలక్. తన చిన్నతనంలో మండపాక గ్రామంలో ఒక అతిసుందరమైన యువతి తనను ప్రేమించి, పెండ్లి చేసుకోవాలని ఎలా విఫలమనోరథురాలయిందో విశదంగా చెప్పేవారు. వీరి ‘గోరువంకలు’ పద్యాలు ఆ ప్రేయసి మీద వ్రాసినవేమోనని నాకు అనుమానంగా ఉంది.

మా ఊళ్లో ఒక డాక్టరుగారి ధనాపేక్షను అధిక్షేపిస్తూ ఇలా అనేవారు తిలక్: “చూడు, వాడు చాలా గొప్ప డాక్టర్! కాని వాడికి డబ్బే ప్రధానం. వాడి దగ్గరకు నిత్యం ఎంతో అందమైన స్త్రీలు వస్తూ ఉంటారు. కాని ఆ డాక్టరు వాళ్ల ముఖాలవైపు చూడడు; మెళ్లో ఉన్న కట్లకాసులపేర్ల వైపు మాత్రమే చూస్తాడు!!” అని నవ్వేవారు.

‘సైనికుడి ఉత్తరం’ అనే గేయంలో వేశ్యతో సైనికుడు యాంత్రికంగా పొందే సెక్సుతృప్తిని కొంత వర్ణించారు తిలక్!!

23 దేవుడి మీద నమ్మకం:-

తిలక్‌గారు ఈశ్వరభక్తులేమో అనిపిస్తుంది. వారి డ్రాయింగ్ రూంలోనూ, బెడ్‌రూంలోనూ తపస్సమాధిలో ఉండే శంకరుని గ్లాస్ పెయింటింగ్స్ ఉండేవి. “మీకు దేవుని మీద నమ్మకం ఉందా?” అని అడిగాను ఓ సారి.

“ఉంది. ఈశ్వరుడంటే నాకు చాలా ఇష్టం. క్లబ్బుకి వెళ్లేటప్పుడు ఆ పటానికి నమస్కరించి వెడతాను. అప్పుడు ఆట బాగా గెలుస్తాను” అన్నారు తిలక్ తన సహజమైన చిరునవ్వుతో.

24. ఋతుపూజ:-

ఋతుచక్రంపై కవులకు ప్రేమ ఉండడం సహజం. తిలక్‌గారు కూడా దీనికి అపవాదం కానేరరు. 1958లో కొవ్వూరులో నేను ఉద్యోగం చేస్తున్నప్పుడు నాకొక లేఖ వ్రాస్తూ: “.... మన ఊళ్లో వర్షాలు బాగా కురుస్తున్నాయి. నాకు వర్షాకాలం అంటే చాలా ఇష్టమని నీకు తెలుసుగా! నా గది కిటికీలోంచి చూస్తుంటే

చెట్లన్నీ తడిసిపోయి, నీటిబిందువులను జారుస్తూ, తలలు ఊపుతుంటే చాలా బాగుంది ప్రకృతి. అందమైన స్త్రీ స్నానంచేసి తడిబట్టలతో నిలబడినట్లుంది!" అన్నారు. 'వర్షా' అనే శీర్షికతో వర్షాకాలం మీద పద్యాలు వ్రాశారు.

వేసవి కాలాన్ని గురించి కాళిదాసు ఋతుసంహారాన్ని అనుకరిస్తూ "కాలం కదలదు– చేపకు గాలం తగలదు – గుహలోపల పులి పంజావిప్పదు – పిల్లిపిల్ల బల్లిని చంపదు – " అంటూ ఒక గేయం వ్రాశారు. వేసివిలో శ్రీరామనవమి పందిట్లోకి వెళ్లే యువతుల జడలలోని మల్లెల సౌరభాన్ని కొనియాడేవారు:

"వాలుజడల మల్లెపూల తురిమిరేల
వీథివీథి తావివిందు లొసగి
రామనవమినాడు రామాభిరామమౌ
తెలుగుచైత్ర మెదల నిలుచు నెపుడు"

('ఆటవెలది' – భారతి, జూన్, 1963)

శీతకాలం మీద 'చలిపాటలు' వ్రాశారు:

"చలిచలి చలిచలి
శీతాకాలం చలి
చాలదులే మరి వాసోజాలం
కాలాగరు ధూపంతో
కావాలే ప్రియ నీ కంఠాశ్లేషం!!"

ఇలాగే శిశిరాన్ని కూడా వర్ణించారు 'ఆటవెలది' అనే ఖండికలో

"లేత యెండలోన లేమ కౌగిలిలోన
సీతువొక్క స్వప్నశీథువౌను
కవితలోన మధుర గాన డోలల లోన
బ్రతుకు పరిమళించు భావమౌను.

కొబ్బరాకు కొసల కూడుకొన్నది మంచు
కొదమతేటి గొంతు పదను దివిసె
శిశిర నిశలలోన శింజిత శింజినీ
స్వరముతోడ మరుదు జాలిగొలుపు"

(భారతి, జూలై, 1963)

25. రచన:-

వచనగీతం వ్రాయడంలో వీరికి వీరే సాటి! ఛందస్సుల్లో 'ఆటవెలది' అంటే వీరికి చాలా ఇష్టం. అందుచేతనే ప్రత్యేకంగా 'ఆటవెలది' అనే పేరుతో చాలా పద్యాలు వ్రాశారు. ఇవి మూడు ఖండికలుగా మూడుసార్లు భారతిలో వచ్చాయి. ఆటవెలది-1 = 14 పద్యాలు, భారతి, మార్చి 1962; ఆటవెలది-2= 9 పద్యాలు, భారతి, జూన్ 1963; ఆటవెలది-3 = 14 పద్యాలు, భారతి, జూలై 1963. మొత్తం 37 ఆటవెలదులు వ్రాశారు.

"నా రచనలో నాకు తెలియకుండానే దీర్ఘ సమాసాలు దొర్లుతూ ఉంటాయి. వాటిని విడదీసి, వ్యాకరణ సూత్రాలు చెప్పమంటే నా వల్ల కాదు." అనే వారు తిలక్. తిలక్ రచించిన "ఆర్తగీతం - అద్వితీయం - విరహోత్కంఠిత - దుర్మరణవార్త - వర్షహేల" అనే అయిదు కవితలు పూర్తిగా సంస్కృతశైలిలో సాగాయి. వీటిలో చివరిదైన "వర్షహేల" (సాహితి, డిసెంబరు 1961)లో 99% సంస్కృత పదాలే!

రాత్రివేళ చాలా ప్రొద్దుపోయేవరకూ చదవుతూ ఉండేవారు. వ్రాయడం కూడా రాత్రివేళల్లోనే

"ఓ నిశార్ధభాగంలో నక్షత్ర నివహ గగనం
ఒరగా భూమ్మీదకు వొంగి ఏదో రహస్యం చెపుతున్న వేళ
ఒంటరిగా నాగదిలో నేను మేల్కొని వ్రాసుకుంటూంటాను.
నా హృదయ స్పందన మాత్రం నాకు వినిపిస్తూ ఉంటుంది
ఎదురుగా గోడ మీద బల్లి ఏకాగ్రంగా నాకేసి చూస్తూ ఉంటుంది."

- అని వ్రాసుకున్నారు 'నేను కాని నేను' అనే గీతంలో.

నియమబద్ధంగా ఓ నోటుబుక్కులో కాని, పెద్ద పెద్ద ఠావులలో కాని వ్రాసేవారు కాదు. చిన్న చిన్న స్లిప్స్‌మీదా, పిల్లల చిన్న ఎక్సర్‌సయిజ్ బుక్స్‌లోనూ వ్రాసేవారు. వీరికి ప్రత్యేకంగా పెన్ ఉండేదికాదు. పిల్లల పెన్స్‌తోనే కాలక్షేపం చేసేవారు. వ్రాసిన స్లిప్పూ, ఎక్సర్‌సైజ్ బుక్కూ అన్నీ కలిపి ఓ పాత ట్రంకుపెట్టెలో పడేసేవారు. ఏదైనా రచన కావలిస్తే అవన్నీ వెతుక్కోమనేవారు నాతో. నేనూ శ్రీపాద కృష్ణమూర్తీ పోరగా పోరగా కొన్ని బైండ్‌బుక్స్ కొన్నారు. నేనూ కృష్ణమూర్తీ కలిసి వీరి రచనలు కొన్ని ఆ బైండ్స్‌లోకి ఎక్కించాం.

తిలక్‌గారి అక్షరాలు బంగారుతీగల బియ్యపుగింజల్లా సన్నగా, కోలగా, చాలా అందంగా ఉండేవి. ఇంగ్లీషు లిపి కూడా ఇలాగే ఉండేది. 'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు!' అని వ్రాసుకున్నారు ఒక గేయంలో.. ఇక్కడ 'అక్షరాలు' అంటే 'శైలి' అని అర్థం. కాని ఇది వీరి లిపి కూడా వర్తిస్తుంది.

వ్రాసిన రచనను ఫెయిర్ చెయ్యడానికి చాలా బద్ధకంగా ఉండేది వీరికి. కొన్ని రచనలు ఫెయిర్ చెయ్యకుండా అలాగే పంపివేసేవారు. "నెలకొక 50 రూపాయలిస్తాను, నాకొక లేడీ కాపీయిస్టును చూడవోయ్ సుబ్బారావ్! అందమైన అమ్మాయి దగ్గర ఉంటే నేనా కాస్త చురుకు పుడుతుందేమో మనకు!" అని నవ్వేవారు.

26. ఉపన్యాసం:-

నవ్యసాహిత్య పరిషత్తు మీటింగు రాజమండ్రీలో జరిగినప్పుడు, తిలక్ తన ఇరవై ఏళ్ల ప్రాయంలో అద్భుతంగా ఉపన్యసించానని చెప్పేవారు. ఆ ఉపన్యాసం విని కృష్ణశాస్త్రిగారు తన బసకు వచ్చి అమాంతం కౌగిలించుకున్నారట. శ్రీశ్రీ కూడా అప్పుడే వీరికి పరిచయమయ్యారట! ఇది 1944 ప్రాంతంలో జరిగింది. ఆ తరువాత 1955 వరకూ తిలక్ ఎక్కడా ఉపన్యసించలేదు. అనారోగ్య పీడితులై ఇంటివద్దనే ఉండిపోయారు. ఆరోగ్యం చేకూరిన తర్వాత, మొదటిసారి తణుకు టౌన్‌హాల్లో ప్రసంగించారు. నేను విన్నాను. ఉపన్యాసం చాలా పేలవంగా ఉంది. ఇన్నేళ్లు మౌనంగా ఉండడమే దానికి కారణం కావచ్చు. క్రమక్రమంగా improve చేశారు. తరువాత చాలా సభల్లో మనోరంజకంగా ఉపన్యసించారు. ఏమైనా, మొత్తానికి, తిలక్ లలితంగా కళాత్మకంగా ఉపన్యసిస్తారే కాని, శ్రోతల హృదయాలను ఉర్రూతలూగించే గంభీరోపన్యాసకులు మాత్రం కారు!!

తిలక్‌గారు తమ పుత్రులిద్దరికీ ఉపన్యసించడంలో మంచి శిక్షణనిచ్చారు. వీరు హైస్కూల్లో జరిగే ఉపన్యాసాల్లో బహుమతులు పొందుతూ ఉండేవారు...

27. ఇష్టాగోష్ఠి:-

"నాతో మాట్లాడ్డమే ఒక ఎడ్యుకేషన్" అన్నాడు గిరీశం. ఆ గిరీశం మాట ఎట్లా ఉన్నా, తిలక్‌గారితో మాట్లాడ్డం మాత్రం నిజంగా ఎడ్యుకేషనే! నేను వారిని ఎన్నో ప్రశ్నలు వేస్తూ ఉండేవాడిని రచనా సంబంధమైన ఎన్నో రహస్యాలు వారి వద్ద నేర్చుకున్నారు. వారినుండి నేనెంతో inspiration పొందాను. నేను నిరంతరం

వేసే ప్రశ్నలు భరించలేక నన్ను "కొశ్చన్ మార్కు సుబ్బారావ్!" అని వేళాకోళం చేసేవారు.

28. శతపత్ర గోష్ఠి:-

నిరుత్సాహంగా ఉండే యువకుల్ని నిందించేవారు తిలక్: "ఏమిటోయ్ మీరు కుర్రాళ్ళు ఇంత దల్గ్‌గా ఉంటారేమిటి? అసలు చైతన్యమే లేదు! ... మా చిన్నతనంలో మేం ఎలా ఉండేవాళ్లమనుకున్నావ్? ఎన్ని పుస్తకాలు చదివే వాళ్లం! ఎన్ని ఎసోసియేషన్స్ స్థాపించేవాళ్లం! ఎన్ని మీటింగ్స్ పెట్టేవాళ్లం!" అనేవారు. తమ యౌవనాన్ని తలచుకొని చేసిన రచనయే 'ఆరోజులు' అనే గేయం (భారతి, జనవరి 1955). వారి చిన్నతనంలో ఊళ్లో ఉన్న యువరచయితలందరూ కలిసి వారానికోసారి తిలక్‌గారి ఇంటివద్ద కలుసుకునేవారట. మధ్యహాలులో పెద్ద కంబళీ పరచి, అంతా కూర్చుని, మధ్యగా ఇన్ని అగరొత్తులు వెలిగించి పెట్టేవారట. అందరూ అల్పాహార విందుచేసి, ఆయా రచయితలు చేసిన నూత్నరచనలపై చర్చ జరిపేవారట. దీనికి 'శతపత్ర గోష్ఠి'అని పేరు పెట్టుకున్నారట. ఇటువంటి గోష్ఠిని వీరి రెండవదశలో (1954-66) లో కూడా కొన్నాళ్లు నిర్వహించారు తిలక్! (నేను కూడా తిలక్‌గారి ప్రభావంతో బెంగుళూరులో కొన్నాళ్ళు "శతపత్ర గోష్ఠి" నడిపాను.)

29. ప్రయాణాలు:-

ప్రయాణాలంటే తిలక్‌గారికి చాలా ఇష్టం. సాహిత్యకేంద్రాలుగా పేరుపొందిన పట్టణాలకు వెళ్లి, అక్కడి కవులతో రచయితలతో ఇష్టాగోష్ఠి నెరపాలనీ, పరస్పరం అర్థంచేసుకోవాలనీ తిలక్‌గారికి చాలా కోరికగా ఉండేది. కాని పాపం, వారి అనారోగ్యం వారిని అనుమతించేది కాదు. అక్కడికీ రాజమండ్రీ, కాకినాద, ఏలూరు, హైదరాబాదు, పట్టణాలకు వెళ్లి వస్తూనే ఉండేవారు. రాజమండ్రీ, 'శాంతిభవన్' హొటల్లో బసచేసినప్పుడు 'రాజమండ్రి పాటలు'' వ్రాశారు. హైదరాబాద్‌ను చూచి నపుడు 'నగరం మీద ప్రేమగీతం' వ్రాశారు. (వారి రాజమండ్రి పాటలు నాలో పదే పదే మెదలడంవల్లనే నేను 'తిరుపతి కీర్తనలు' వ్రాయగలిగాను.)

30. లేఖలు:-

కవులు లేఖలు బాగా వ్రాస్తారని ప్రతీతి. అందులో తిలక్‌లాంటి మధురకవి

లేఖలు అద్భుతంగా ఉంటాయని వేరే చెప్పనక్కరలేదు. వారి లేఖల్లో ప్రతిపంక్తిలోనూ కవిత్వం తొణకిసలాడుతూవుంటుంది. 1957లో నేను విశాఖపట్నంలో పోస్టల్ ట్రెయినింగ్ అయ్యేటప్పుడూ, 1958లో నేను కొవ్వూరులో ఉద్యోగం చేస్తున్నప్పుడూ, 1959లో నేను ఏలూరులో ఉద్యోగం చేస్తున్నప్పుడూ నాకు చాలా అందమైన లేఖలు వ్రాశారు తిలక్. దురదృష్టవశాత్తూ నేను ఆ లేఖలలో చాలా భాగం పోగొట్టుకున్నాను.

1959 ఫిబ్రవరి నెలలో తిలక్‌గారికి, సౌందర్యారాధకులలో ప్రముఖులైన శ్రీ ఆచంట జానకిరాంగారితో ప్రప్రథమంగా పరిచయమైంది. అప్పుడు నేను తిలక్‌గారితోనే ఉన్నాను. ఆ నెల భారతిలో తిలక్ సీతాకల్యాణంపై వ్రాసిన 'స్వయంవర' అనే పద్యాలు పడ్డాయి. జానకిరాంగారు కాకినాడ నుంచి తిన్నగా తణుకు వచ్చారు. తిలక్‌గారి ఇంటికి వస్తూనే "మీ స్వయంవర చాలా బావుంది! అందులోనూ ఆ ఆటవెలది పద్యం చాలా చాలా బావుంది!!"

"వీని చెంత చేరి వెడలగలను నేను
అడవికేని కడలి నడిమికేని"

– అని సీతాదేవి మనస్సులో అనుకోవడం "beautiful idea" అన్నారు ఆనందంలో ఉక్కిరి బిక్కిరైపోతూ జానకిరాంగారు.

అప్పుడు జానకిరాంగారు ఒక్కరోజు మాత్రమే తిలక్‌తో గడిపారు. మర్నాడు అర్జంటు పనిమీద మార్టేరు మీదుగా నర్సాపురం వెళ్లిపోయారు! అప్పటినుంచీ (అంటే 1959 నుంచీ) తిలక్‌గారికీ జానకిరాంగారికీ లేఖలు జోరుగా సాగాయి. అందులో తిలక్ వ్రాసిన ఒక అందమైన లేఖను ఈ క్రింద పొందుపరుస్తున్నాను:– (జానకిరాంగారు తాను రచించిన 'స్వర్ణసీత' కావ్యాన్ని రిజిస్టరు పోస్టులో తిలక్‌గారికి పంపారు. దానిని అందుకున్నాక తిలక్ వ్రాసిన జవాబు ఈ క్రింది లేఖ.)

తణుకు
16–4–59

జానకిరామ్ అన్నగారికి –

శ్రీపాద కృష్ణమూర్తి, గదిలో పరుండిన నా వద్దకు రిజిస్టరు కవరు తీసుకువచ్చి యిచ్చాడు. Receipt మీద సంతకం పెట్టి తీసుకున్నాను.

కవరు లోంచి ఆ పుస్తకాన్ని వెలికి తీశాను. మెత్తని పువ్వుల వెలుతురు లాగ, తావిలాగ తగిలింది చేతికి, కన్నులకి, మనస్సుకి.

స్వర్ణసీత! ఆ చిత్రం ఎంత మోహనంగా ఉంది! ఆ బొమ్మనే చూస్తూ అలాగ కొంతసేపు ఉండిపోయాను.

అందంగా ఆలోచించడం, అందంగా బ్రతకడమూ, అందంగా ఒక పనిచేయడమూ – అంటే 'జానకిరామ్' అన్నమాట అని అనుకున్నాను నేను.

లోపల మీ పాటల్ని (అవి పాటలే సుమండీ) చదువుకున్నాను. మనస్సు ఆర్ద్రమయింది. నా హృదయం కూడా 'మళ్లీ జానకిరామ్ ఎప్పుడొస్తారు?' అని చకోరిలాగ, చాతకంలాగా ప్రశ్నించింది.

గది నుండి హాలులోకి వచ్చాను. అక్కడ నన్నయపీఠం సభలకి ఆహ్వానింప బడిన కవిమిత్రుడు, నా తమ్ముడు సోమసుందర్ (ఆవంత్స సోమసుందర్) తదితరులూ 'స్వర్ణసీత'ని చూశారు. తలలూచి మెచ్చుకున్నారు – వారికి నేను చదివి వినిపిస్తూ ఉంటే.

సోమసుందర్‌ని మీరెప్పుడైనా చూశారా – అతని రచనలు కాని? అతనికి కొన్నాళ్ల నుండి ఒక కోర్కె ఉంది. అతను 'మిణుగురులు' అని కృష్ణాపత్రికలో యీ మధ్యా, యిదివరకు 'ఆనందవాణి'లోనూ ప్రియురాలిపరంగా కొన్ని గద్యపద్యాల లాంటివి వ్రాశాడట. నేను చూడలేదు. వాటిని అనతికాలంలోనే అచ్చువేయిస్తున్నాడు. ఆ కావ్యాన్ని మీకు అంకితం యివ్వాలని అతనికి ఒక యేడాది నుండీ ఉన్న అభిలాష. ఇక్కడకు వచ్చిన రోజునే నాకు చెప్పి నన్ను మీకు వ్రాయమన్నాడు. సభల హడావుడిలో వ్రాయలేకపోయాను. అతను వెళుతూ వెళుతూ మరిమరీ చెప్పి వెళ్లాడు. సోమసుందర్ సుందరమూ, స్నేహశీలమూ అయిన మనస్సు కలవాడు. మీరు అతని కోరికని అంగీకరిస్తే ఎంతో బావుంటుంది అనిపించింది. మీరు 'మిణుగురులు' చదివే ఉంటారనుకుంటున్నాను. లేనిదే మీకు ఆ రచన పంపే ఏర్పాటు చేస్తాను.

మీ ఉత్తరం వచ్చేటప్పటికి నేను ఊళ్లో లేను. ఎప్పటికప్పుడు వస్తారని అనుకోవడం వలన మీకు పంపబడలేదు. నేను రాజమండ్రీ, పరిసర గ్రామాలకు వెళ్లడమూ, పది పదిహేను రోజులుండి పోవడమూ జరిగింది. రాగానే తొమ్మిది రోజులపాటు సభల హడావుడి, కవిమిత్రులు అతిథులుగా రావడమూ, కవితా

గాన కోలాహలంతో యిల్లంతా నిండిపోయింది. అందువలన మీకు జవాబు వ్రాయడానికి యింత ఆలస్యమయింది. ఏమీ అనుకోకండి.

చంద్రలేఖని అడయారు కళాక్షేత్రంలో చేర్పించాలని ఉంది. నృత్య సంగీతాలు నేర్పించాలనీ ఉంది. అక్కడ విధానమూ, నిబంధనలూ, యివన్నీ మీకు తెలిసే ఉంటాయి. లేనిదే, శ్రమ అనుకోక, తెలుసుకొని నాకు విపులంగా తెలియచేస్తారా? కొందరు హైదరాబాద్‌లో నటరాజ రామకృష్ణ నడిపే పాఠశాలలో చేర్పించమనీ అంటున్నారు. ఈ సందర్భంలో మీ సలహా నాకు ఎంతగానో కావాలి.

మీరు తణుకు ఎప్పుడు వస్తారు? ఇది వరకటిలాగ కాక, యీసారి ఒకవారం రోజులకి తక్కువ కాకుండా, యితర బాదరబందీ లేకుండా గడపాలి. నా రచనలని వినిపిస్తాను మీకు. వాటిని పుస్తకరూపంలోకి తీసుకువచ్చే ప్రయత్నంలో ఉన్నాను. అందువలన మీ అభిప్రాయమూ, సలహా ముందుగానే నాకు చాలా అవసరం.

మన పరిచయం మొన్నమొన్ననే జరిగినా, ఎన్నాళ్లదోలాగ అనిపిస్తోంది. ఈ వసంతం వెళ్లిపోకుండా, మల్లెపువ్వులూ, మంచి గంధమూతోపాటు మీరుకూడా దగ్గరే వుంటే ఎంత బావుంటుంది! రండి, ఎంత త్వరలో వీలైతే అంత త్వరగా!

కృష్ణమూర్తి యీ సభలకి వచ్చి నిన్ననే వెళ్లిపోయాడు. అతని హృదయానికి చికిత్స చేస్తూనే ఉన్నాను నేను. నవ్యకవిత మీద ఒక ఉపన్యాసం వ్రాసి తీసుకువచ్చి చదివాడు. అక్కడక్కడ చాలా బాగా వ్రాశాడు.

మీ కొత్త శిష్యుడు–మా తమ్ముడు మీకు ప్రత్యేకంగా జాబు వ్రాస్తానని అన్నాడు.

ఇంతే సంగతులు. మీ జాబుకోసం ఎదురుచూస్తోంటాను. శారద అక్కగారికి నా అభివందనాలు తెలుపండి.

భవదీయుడు

బాలగంగాధర తిలక్"

* * *

(ఈ లేఖ సన్నని అక్షరాలతో, బ్లూ ఇంక్‌లో, కాగితానికి ఒకే ప్రక్కన, రెండు కాగితాలలో వ్రాయబడి ఉంది. తిలక్ ఏ పంక్తిని ఎక్కడ ఆపు చేసి వ్రాశారో అలాగే వ్రాసుకున్నాను నేను. దీనిని దయతో నా కొసగిన మాన్యమిత్రులు శ్రీ ఆచంట జానకిరాం గారికి నా నమస్సులు.) ఈ లేఖతో ఒక చిన్న చిట్ కూడా జతపరచబడింది. దానిపై ఇలా ఉంది:–

"జానకిరామ్ గారికి:
మీకు వసంతోపహారంగా

. . . .

ఇంత వేసగి మంట లేచిన నీగుండె
మాడి మసిమసిగ మారునపుడు
నా పాట నామాట నవపరీమళముల
వట్టి వేళ్ల తెరల కట్టె చూడు!

. . . .

మరీ మరీ వికసించే నా వయస్సొక్క మల్లెపువ్వు
నీ కాంక్షా నిశీథాల బలే పరిమళాన్ని రువ్వు,
మరి మరీ పొంగిపొరలు యీ యౌవన శీధువు
నింపునులే నీ బ్రతుకంతా ఎర్రని మైమరపు!

– (వసంతగీతం నుండి)
– "తిలక్:"

(తిలక్‌గారు ఆచంట జానకిరాంగారికి వ్రాసిన ఈ అందమైన లేఖను నేను 2013లోను, తిరిగి జనవరి 2021లోను 'ఎమెస్కో'వారు ప్రచురించిన "దేవరకొండ బాలగంగాధర తిలక్ – సర్వలభ్యరచనలు"లో చేర్చడం మరిచిపోయినందుకు మిక్కిలి చింతిస్తున్నాను – తంగిరాల)

31. చిన్నవాళ్లకు సలహాలు:-

"నా రచనలు ప్రింటు కావటం లేదండీ! 'భారతి' వాడు త్రిప్పి కొడుతున్నాడు" అని బాధపడ్డాను ఒకసారి తిలక్‌గారి వద్ద.

"ఏమిటోయ్! అలా బాధపడతావ్? చలం నవల్సన్నీ 'భారతి'లోనే వచ్చాయనుకుంటున్నావా? 'చిత్రగుప్త' లాంటి చిన్న పత్రికల్లో పడేవి. అయితే మాత్రం! వాటి విలువ ఏం తగ్గింది? నేడు బ్రహ్మాండమైన విజయాన్ని సాధించాయి!" అనేవారు తిలక్.

నాలాంటి చిన్న రచయితలను బాగా ప్రోత్సహించే వారు. నా రచనలన్నీ ఓపికతో విని, తగు సలహాలనిచ్చేవారు. నేనొక సారి 'పంచరంగులు' అనే స్కెచ్ వ్రాసి చూపించాను. "చాలా బాగుంది. కాని రేడియో Introduction లా మరీ

చిన్నదిగా ఉంది. కొంచెం పెంచి మళ్లీ వ్రాయి." అని సలహా ఇచ్చారు.

ఒకసారి తిలక్‌గారు తణుకులో ఒక చెప్పులషాపులోకి వెళ్ళారు. ఆ షాపు ముందు చెప్పులుకుట్టే కుర్రాడొకడు లేచి నిలబడి, జేబులోంచి మడతపెట్టిన కాగితం ఒకటి తీసి, తిలక్‌గారికి చూపించబోయి, అంతలోనే భయపడి మళ్ళీ జేబులో పెట్టేసుకున్నాడు. ఇది చూచి తిలక్‌గారు "ఏమిటది?" అని అడిగారు. వాడు భయపడుతూ భయపడుతూ "ఒక కవిత వ్రాశానండి. మీకు చూపుదామని..." అన్నాడు. "భేష్! ఇంటికిరా చూచి సలహా లిస్తాను" అన్నారు.

32. సిగ్గూ - బిడియము:-

ఒకసారి నేనూ తిలక్‌గారూ తణుకు పాతవూళ్ళో ఉన్న రాయల్ టాకీసులో ఏదో సినిమా చూసి రిక్షాలో తిరిగివస్తున్నాం. పాతవూరికి - కొత్తవూరికి మధ్య గోస్తనీ నది మీద ఒక వంతెన ఉంది. మా రిక్షా ఆవంతెన మీదకు వచ్చింది. వెనకనుంచి ఒక యువతి "సార్! సార్!" అని కేకలు పెడుతూ మా రిక్షా వెనకాల పరుగెత్తుకుంటూ వస్తోంది. వంతెన దాటగానే రిక్షాను ఒక ప్రక్కగా నిలబెట్టించారు తిలక్. ఆ యువతి పరుపరుగున వచ్చి "తిలక్‌గారంటే మీరేనాండి?" అంది ఎంతో సంతోషంతో. "అవును!" అన్నారు తిలక్ చాలా సిగ్గుపడిపోతూ. ఆ అమ్మాయి దళితుల అమ్మాయిలా ఉంది. ఎంతో ఉత్సాహంతో: " 'భారతి'లో మీ రచనలు చదువుతున్నానండి. చాలా బాగున్నాయి" అంటూ ఇంకా ఏదో చెప్పబోతోంది. నడిరోడ్డుమీద నిలబెట్టి అలా మాట్లాడడం తిలక్‌గారికి ఎందుకో నచ్చలేదు. ఎంతో బిడియపడిపోతూ "సరే! సరే!" అని ఆమె మాటలు మధ్యలో కట్ చేసి, "రిక్షాపోనియ్" అన్నారు. ఆ అమ్మాయి కొంచెం నిరుత్సాహపడి, నమస్కరించి వెళ్ళిపోయింది. ఇంటికి వచ్చాక తిలక్‌గారు 'అర్జున విషాద యోగం'లో పడిపోయారు. "చూడు సుబ్బారావ్! ఆ అమ్మాయి నా మీద ఎంతో అభిమానంతో పలకరించి నా రచనలు మెచ్చుకుంటోంది. నేను ఎందుకో సిగ్గుపడిపోయి ఆమె మాటల్ని త్రుంచివేశాను. మనసులో ఎంత నొచ్చుకుందో ఏమిటో!" అని గిలగిలలాడిపోయారు. "పల్లెటూరిపిల్లకి మన గొప్పలు మర్యాదలు ఏమి తెలుస్తాయి? రోడ్డు మీద పలకరించకూడదని తెలియదు కదా! మనసు విప్పి మాట్లాడింది, పాపం!" అని చాలా బాధపడ్డారు. అటువంటిది ఆయన స్వచ్ఛమైన మనస్సు!

33. హాస్యోక్తులు:–

తిలక్‌గారికి వ్యంగ్యపూరితమైన హాస్యం అంటే చాలా ఇష్టం. ఇటువంటి హాస్యం వారి ప్రతీ రచనలోనూ ఉంటుంది (ముఖ్యంగా వచన రచనల్లో.) 'సుచిత్ర ప్రణయం' నాటికా, 'సుందరీ – సుబ్బారావూ' కథ, 'నిర్మలమొగుడు' అనే కథ సంపూర్ణ హాస్య రచనలు. 'తీవ్రవాద నాయకుడు' కథలో వ్యంగ్యపూరిత హాస్యం ఉంది.

"ఒక్కొక్క ఆడది ఒక్కొక్క రకం వీణలాంటిది. ఎవరిని ఎలా మీటి పలికించాలో అనేది మళ్లీ బ్రహ్మాండమైన కళ." అంటారు 'సుచిత్ర ప్రణయం' నాటికలో.

"సుందరీ – సుబ్బారావు" కథలో సుబ్బారావు "మీకు ఫుట్‌బాల్ అంటే ఇష్టమేనాండి?" అని అడుగుతాడు సుందరిని. "నాకు ఫుట్‌బాల్ అంటే ఇష్టం లేదు కాని, ఫుట్ బాల్ ఆడేవాళ్లంటే ఇష్టం!" అంటుంది సుందరి.

"తీవ్రవాద నాయకుడు" కథలో హాస్యం ఎంత వ్యంగ్య పూరితంగా ఉందో చూడండి:–

"శేషయ్య మున్సిపాలిటీ వాళ్ల రోడ్లన్నీ తిరుగుతూంటాడని చెప్పడానికి అతని పైజామాలు నిదర్శనం. ఆ రోడ్ల మీద దుమ్ము మాంచి ఒత్తుగా ఉండి, అడుగు పెట్టగానే ఝామ్మని రేగిపోతుంది, మున్సిపాలిటీవారి బుద్ధికుశలతకు నిదర్శనమైనట్టు. శేషయ్య ఇలా తిరగడంవల్లనే రోడ్లరిగిపోయి, దుమ్ము లేస్తోందని ఒక కౌన్సిలర్ విమర్శకులకు చెప్పిన జవాబు! పాపం శేషయ్యకి తిరగడమేపని. ఆకలిసేనప్పుడల్లా శేషయ్య తిరుగుతూంటాడు. అదేమిటో కాని రోజూ శేషయ్యకి ఆకలేస్తుంది! అందుకే ఎప్పుడూ తిరుగుతూ ఉంటాడు... ఆ వూళ్లో ఉపాధ్యాయులు భూపరిభ్రమణాన్ని శేషయ్యతో పోల్చి చెప్పడంవలన విద్యార్థులకి చటుక్కున అర్థమై పోతోందని ప్రతీతి!... శేషయ్యకి ఓ విధవ అక్కగారూ, తల్లీ ఉండేవారు. ఇతని సంపాదనా చాతుర్యానికి తట్టుకోలేక తల్లి పరలోకానికి చప్పుడు చెయ్యకుండా వెళ్లిపోయింది. అంతకన్నా గప్ చిప్‌గా అక్కగారు ఒకనాటి రాత్రికి రాత్రి ఎవడితోనో లేచిపోయింది... ఆ రోజు శేషయ్య చాలా విచారంగా ఉన్నాడు. అక్కగారు చేసిన అప్రతిష్ఠ పనికి కాదు – తను కూడా ఆడదై పుడితే ఎవడేనా లేవదీసుకుపోను కదా అని!"

ఇట్లా హాస్యరసానికి తావున్న రచనల్లోనే గాక, "సముద్రపు అంచులు" వంటి సీరియస్ కథల్లో కూడా మధ్య మధ్య హాస్యోక్తులు విసురుతూనే ఉంటారు. చూడండి:-

"చంద్రిమేనమామ తత్వాలు పాడే ఒక చిన్నసైజు ఆధ్యాత్మికవాది. పెళ్లాం పోయాక ముండలతోనూ, ఒళ్లు పాడైపోయాక మందులతోనూ, ఓపిక పోయాక బైరాగులతోనూ మైత్రి సంపాదించిన విఖ్యాతజీవి! ఎన్ని తత్వాలు పాడినా, ఎక్కడెక్కడ తిరిగినా, వేళకి మాత్రం వచ్చి కూడు తినాలనే ప్రాథమిక వివేకం కోల్పోని జ్ఞాని!!" (-భారతి, నవంబరు 1960, పుట-72)

వచన గీతాల్లో సైతం అక్కడక్కడ హాస్యం చూపెడతారు:

"అమెరికాలో డాలర్లు పండును, ఇండియాలో సంతానం పండును" - అని మొదలు పెడతారు 'న్యూసిలబస్' అనే గేయాన్ని. ఎన్నికల్లో రాజకీయ వేత్తలు విసిరేవాగ్దానాల కత్తులకి మొనదగ్గరకన్నా పిడిదగ్గరనే వాడి యెక్కువంటారు ఈ గేయంలోనే.

నాతో పలికే మాటల్లోకూడా ఛలోక్తులు విసిరేవారు. ఒకరోజు రిక్షా చేయించుకొని ఊరి బయటనున్న మాయింటికి వచ్చారు. మాయిల్లు తాటాకుఇల్లు. ఊరిబయట రైల్వేస్టేషన్‌కి దగ్గరగా పంటపొలాల మధ్య ఉండేది. పల్లంభూమి కావడంవల్ల వానకురిస్తే యింటి చుట్టూ నీళ్లు చేరేవి. తిలక్‌గారు మా యింటికి రావడానికి ముందురోజే బాగా వానపడింది. చుట్టూ నీళ్ళు, మధ్యన మా తాటాకు కొంప! రోడ్డుమీద రిక్షాలో కూర్చున్న తిలక్‌గారితో మాట్లాడుతూ "రేపు మా ఆవిడా పిల్లలూ వస్తారు" అన్నాను. ఆయన వెంటనే "ఇదేమిటీ! సంసారంకన్నా సాగరం ముందు వచ్చేసిందే!" అన్నారు నవ్వుతూ.

తిలక్‌గారి యింటికి సమీపంలో, అదే వీథిలో, గోస్తనీనదికి దగ్గరగా పామర్తి రమణకవిగారు ఉండేవారు. వీరు ఛందోబద్ధంగా పద్యాలు వ్రాసేవారు. గాంధీజీ భక్తులు; నిత్యఖద్దరుధారి - ఒక ప్రాథమిక పాఠశాలను కూడా నడుపుతూ ఉండేవారు. దానికి "పామర్తివారి బడి" అనిపేరు. రమణకవిగారు మా అందరి దగ్గరా పావలా పావలా చొప్పున విరాళాలు పోగుచేసి, గోస్తనీనది ఒడ్డున ఉన్న సుబ్బరాయుడి గుడిలో "శ్రీ నన్నయభట్టారక పీఠం" సాహిత్య సభలు జరిపేవారు. ఈ సభలలో ఒకసారి తిలక్‌గారు, ఆవంత్స సోమసుందర్‌గారు ప్రసంగించారు;

నేను విన్నాను. రమణ కవిగారు ఉత్తముడు, సాధుమూర్తి. ఆయనపేరు "పామర్తి రమణకవి" కాబట్టే ఆయనను వేళాకోళం చేస్తూ "పారకవి" అనేవారు తిలక్! అలాగే మావూళ్లో ఆ రోజుల్లో "కంభంపాటి సత్యనారాయణమూర్తి" అనే హిందీ పండితులు ఉండేవారు. ఆయనను "కంసమూర్తి" అనేవారు తిలక్!

34. సాహిత్య వారసులు:–

బాలగంగాధర తిలక్‌గారికి కథలు వ్రాయగల వారసులున్నారు కాని, కవిత్వం వ్రాయగల వారసులు లేరు. ఈయన కొడుకులిద్దరూ (సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం) 1966లో గుంటూరులో మెడిసిన్ చదువుతూ ఉండేవారు. ఇద్దరూ కథలు వ్రాయగలరు. కాని ఇంకా పరిణత దశను అందుకోలేదు. వీరి తమ్ముడు గంగాధర రామారావుగారు మంచి కథారచయిత.

తిలక్‌గారి బావమరిది ఒకతను ఉండేవాడు. అతడు బావగారిని చూసి తాను కూడా కథలు వ్రాయాలని మొదలు పెట్టాడు. ఆ కుర్రవాడు రాజమండ్రీలో బి.యస్‌సి. చదివేటప్పుడు పరిపక్వంకాని కథలు చాలా వ్రాశాడు. ఈ బావమరిదిని దృష్టిలో ఉంచుకుని "కథలు వ్రాయడం ఎలా?" అనే వ్యాసంలో ఇలా వ్రాశారు తిలక్:–

"ప్రతీ సాహిత్య ప్రక్రియకీ వ్యుత్పత్తీ–ప్రతిభా ఈ రెండూ చాలా ముఖ్యం. ఊరికే ఊసుపోక కోసం వ్రాసే కథలు వేరు. వాటికి మనుగడ వుండదు. సాహిత్యపు విలువ ఉండదు. మా వాడొకడు డెబ్బై ఐదు కథలు రాసి అల్మారాలో సర్దివుంచాడు. అన్ని occasions కీ వ్రాసి పెట్టిన కథలవి. వినాయక చతుర్థి, సంక్రాంతి మొదలైన పండుగలకి సరిపోయేవీ; సోషలిజంమీదా, పేదవాళ్లమీదా కొన్ని; ప్రేమలో అనుమానం విషాదం వైఫల్యం మొదలైన అన్ని తరగతుల మీదా; సైకాలజీ మీదా; పిచ్చివాళ్లమీదా, హంతకులమీదా; – ఇలాగ వ్రాసి వుంచాడు. వాడు బియ్యే ప్యాసై విద్యార్థిదశలోంచి అవిద్యాదశలోకి వెళ్లబోయేస్థితిలో వున్నాడు. ఈ కథల్ని వాడు సాఫీగా వ్రాయలేదు. చాలా కష్టపడ్డాడు. హైరానా పడ్డాడు. ఒక విధంగా సెక్సు పరిభాషలో వాడు కథాకన్యల్ని బలాత్కరించాడు అని చెప్పాలి!!"

35. డబ్బు ఇబ్బంది:–

తిలక్‌గారు ఆగర్భ శ్రీమంతులైనా నాకు పరిచయమైన కాలంలో (అంటే

1955-1961 మధ్య) డబ్బుకోసం చాలా ఇబ్బంది పడుతూ ఉండేవారు. కాని ఆ విషయం పైకి తెలియనిచ్చేవారు కారు. అయినా వారి రచనలలో అది అప్పుడప్పుడు బయటపడుతూ ఉండేది. "భూమి తనచుట్టూ తాను తిరుగుతూ/ ధనవంతుడి చుట్టూ తిరుగుతోంది!" అన్నారు- "న్యూసిలబస్" అనే కవితలో. డబ్బు సంపాదన తెలియక, గడుసుతనం లేక, తాను "చాతకానితనం అనే వానాకాలపు బురదలో కూరుకుపోయా"నని వాపోతారు మరోచోట.

తిలక్‌గారి పేదరికానికి నేను మూడు కారణాలు ఊహిస్తున్నాను. (1) విద్యార్థి దశలోనే గుండెజబ్బు రావడం, నరాల సంబంధమైన వ్యాధి రావడంతో - వాటి వైద్యంకోసం ఎంతో ధనం ఖర్చుచేసి ఉంటారు. (2) పేకాట, బ్రాకెట్టులో ధనం పోగొట్టుకొని ఉంటారు, (3) స్టెయిన్‌లెస్ స్టీలు వ్యాపారం చేసి నష్టపోయారని చెపుతారు. (ఇవి నా ఊహలు మాత్రమే! సత్యమేమిటో నాకు సరిగా తెలియదు.)

మా తణుకు ప్రక్కనే "దువ్వ" అనే గ్రామం ఉంది. అక్కడ "కోటేశ్వరరావు" అనే ధనిక యువకుడు ఉండేవాడు. చేయెత్తు మనిషి. మంచి కండపుష్టి కలవాడు. తిలక్‌గారి నాటకాల్లో విలన్ వేషాలు వేసేవాడు. ఒకసారి (1961 మే నెలలో) తిలక్‌గారు నన్ను రహస్యంగా ఆ కోటేశ్వరరావు దగ్గరకు పంపి కొంత ధనం (బహుశః 200 రూపాయలు అనుకుంటాను) అప్పుగా తీసికొని రమ్మన్నారు. నేను వెళ్ళివచ్చాను. కాని ఆ ప్రయత్నం ఫలించలేదు. ఇలాగ డబ్బుకోసం బాధపడే తిలక్‌గారిని చూసి నాకు చాలా జాలివేసేది. నాది చిన్న ఉద్యోగం కావడంవల్ల నేను కూడా వారికి అంతగా సాయం చేయలేకపోయేవాడిని. నా భార్య నగలు తాకట్టు పెట్టి కొంత డబ్బు తెచ్చి తిలక్‌గారికి ఇవ్వాలనుకుంటే, ఆరోజుల్లో నా భార్య మెడలో నల్లపూసల తాడు, నేను కట్టిన తాళిబొట్టు తప్ప ఇంకేమీ ఉండేవికావు. అయినా సరే ఒకసారి ఎంతో కష్టపడి 50 రూపాయలు అప్పుగా ఇచ్చాను. నాకు వ్రాసిన ఒక లేఖలో ఈ విషయాన్ని వారు పేర్కొన్నారు. ఆ చిన్న మొత్తాన్ని కూడా వారు నాకు ఒక్కసారిగా తిరిగి ఇవ్వలేక పోయారు, పాపం! రెండు మూడు దఫాలుగా ఇచ్చారు. అప్పటి వారి ఆర్థిక పరిస్థితి అలా ఉండేది. కాని ఇక్కడ జరిగిన ఒక అద్భుతమైన దైవలీలను గురించి పాఠకులకు మనవి చేయాలనుకుంటున్నాను.

నేను 1969 Ph.D. డిగ్రీని పొందినా, నా ఆర్థిక పరిస్థితి సరిగా లేక 2013 వరకూ – అంటే 45 ఏళ్ళవరకూ దానిని ముద్రించలేకపోయాను. 2013లో బంధుమిత్రులు, శిష్యులు ఇచ్చిన ఆర్థిక సహకారంతో కష్టపడి 4½ లక్షల రూపాయలు ఖర్చు చేసి, సర్వాంగ సుందరంగా ¼th demy size లో వేయిపుటల గ్రంథాన్ని అపురూపమైన ఫోటోలతో ముద్రించాను. అప్పుడు తిలక్‌గారి ముగ్గురు పిల్లలూ కలిసి నాకు 50 వేలరూపాయలు విరాళంగా పంపించారు. స్వర్గంలో ఉన్న తిలక్‌గారే నాకీ విరాళాన్ని పంపించినట్టుగా భావించి బ్రహ్మానందభరితుడ నయ్యాను. ఇది దైవలీల తప్ప వేరు కాదు! పిల్లలంటే ఎవరు? తండ్రి ప్రతిరూపాలే కదా! "ఆత్మావై పుత్రనామాసి" అన్నారు కదా మన పెద్దలు! ("మానవుడు తానే పుత్రుడుగా జన్మిస్తాడు")

ఇక్కడ తిలక్‌గారికి – నాకు మధ్య వచ్చిన చిన్న misunderstanding ను గురించి కూడా కొంచెం చెప్పాలి. నేను అప్పుకోసం 'దువ్వ' వెళ్ళేముందు తిలక్‌గారు: "అప్పు నీకోసమని చెప్పు; నా కోసమని చెప్పకు!" అని హెచ్చరించారు. నేను 'సరే' అన్నాను. తిలక్ నన్ను అలా ఎందుకు హెచ్చరించారో అప్పుడు తెలియలేదు కాని తరువాత తెలిసింది. తిలక్‌గారు అప్పటికే చాలా అప్పుల్లో మునిగిపోయి ఉన్నారు. ఆయన పేరు చెపితే ఎవరూ అప్పు ఇవ్వడంలేదు. అందువల్ల అలా హెచ్చరించారు నన్ను. నేను 'దువ్వ' వెళ్లాను. కోటేశ్వరరావును కలిసి అప్పు అడిగాను. అతడు దేవాంతక నరాంతకుడు! పైగా వడ్డీవ్యాపారం చేసేవాడు. నేను తిలక్‌గారి ప్రియశిష్యుడనని అతనికి బాగా తెలుసు. అందువల్ల అనుమానం వచ్చి: "ఈ డబ్బు ఎవరికోసం? నీకోసమా? లేక తిలక్‌గారి కోసమా? నిజం చెప్పు!" అని నన్ను నిలదీశాడు. నేను అబద్ధం చెప్పలేకపోయాను. "తిలక్‌గారి కోసమే!" అని నిజం చెప్పేశాను. "నీకోసమైతే ఎంతైనా అప్పు ఇస్తాను. కాని తిలక్‌గారికోసమైతే చిల్లిగవ్వకూడా ఇవ్వను వెళ్ళు!" అని ఖచ్చితంగా (తెగేసి) చెప్పేశాడు. నేను నిరుత్సాహంగా తిరిగి తణుకు వచ్చేశాను. అక్కడ జరిగిన సంభాషణ అంతా జరిగింది జరిగినట్లు చెపితే తిలక్‌గారి మనస్సు బాధపడుతుందని "కోటేశ్వరరావు డబ్బు ఇవ్వనన్నాడు" అని మాత్రమే చెప్పాను. ఆయన 'సరే!' అన్నారు. నేను ఇంటికి వెళ్ళిపోయాను.

ఇక్కడితో నేను ఊరుకుంటే సరిపోయేది. నాలో అమాయకత్వం, తెలివితక్కువ తనం చాలా ఎక్కువ. ఇది మా తండ్రిగారినుండి సంక్రమించిన ఆస్తి. (మా అన్నదమ్ములు నలుగురిలోను, మా అక్కయ్యలిద్దరిలోను ఈ అమాయకత్వం ఉంది. "చెల్లక్క" అని పిలువబడే మా చిన్నక్కయ్యలోను, మా బాచితమ్ముడులోను మరీ ఎక్కువగా ఉంది.) మా తండ్రిగారి పేరు తంగిరాల వెంకట సుబ్బావధానులు. గొప్ప వేదపండితుడు. కాని లోకజ్ఞానం బొత్తిగా లేని అమాయకుడు. ఊళ్ళో అందరూ మానాన్నను "వెఱ్ఱి సుబ్బన్నగారు" అని పిలిచేవారు. మమ్మల్ని "వెఱ్ఱి సుబ్బన్నగారి పిల్లలు" అనేవారు. నాకు జీన్స్‌తో వచ్చిన ఈ అమాయకత్వంతో, తిన్నగా ఉండకుండా, 'దువ్వ' లో నాకూ - కోటేశ్వరరావుకూ మధ్య జరిగిన సంభాషణ అంతా చల్లా నరసింహారావు అనే మిత్రునితో పూసగ్రుచ్చినట్లుగా చెప్పేశాను. (నరసింహారావు మీనా బిస్కట్ కంపెనీ షాపు యజమాని; మంచి పద్యకవి; తిలక్ అభిమాని.) కాని అతడు కొండెకాడనీ, ఇక్కడి మాటలు అక్కడా, అక్కడి మాటలు ఇక్కడా చెపుతాడని నాకు తెలియదు. అతడు వెంటనే వెళ్ళి తిలక్‌గారితో నా మీద చాడీలు చెప్పాడు. తిలక్‌గారికి అప్పు ఇవ్వవద్దని నేనే కోటేశ్వరరావుతో చెప్పినట్టుగా కల్పించి చెప్పాడు! తిలక్‌గారు అతని మాటలు నమ్మి, నన్ను అపార్థం చేసుకున్నారు. నా మీద కోపంతో నన్ను వ్యంగ్యంగా ఎత్తిపొడుస్తూ 1961 మే 18వ తేదీనాటి ఉదయం 7 గంటలకు నాకు రెండు మూడు పుటల పెద్ద లేఖ వ్రాశారు. నేను చాలా బాధపడ్డాను. కొండెకాడని తెలియక నరసింహారావుతో 'దువ్వ' సంగతి అంతా చెప్పి మోసపోయానని పశ్చాత్తాపపడ్డాను.

భగవంతుడు ఇంకో రకంగా ఆయనకు చాలా మేలు చేశాడు. తిలక్‌గారి కొడుకులిద్దరూ చాలా చురుకైనవాళ్ళు. ఇద్దరికీ +2 లో (12th Standardలో) మంచి మార్కులు వచ్చాయి. ఇద్దరికీ గుంటూరు మెడికల్ కాలేజీలో సీట్లు వచ్చాయి. పేదరికంతో బాధపడుతున్న తిలక్‌గారు ఎలా చదివించగలరు? అప్పుడు వారి తమ్ముడు గంగాధర రామారావుగారి చొరవతో తక్కిన అన్నదమ్ములందరూ ముందుకువచ్చి ధనసహాయం చేసి చదివించారు. ఇప్పుడు పెద్దకొడుకు డా॥ దేవరకొండ సత్యనారాయణమూర్తి లండన్‌లో గొప్ప డాక్టరు. చిన్నకొడుకు డా॥ దేవరకొండ సుబ్రహ్మణ్యం అమెరికాలో పెద్ద డాక్టరు. ఇద్దరూ కోట్లు

గడిస్తున్నారు. అమ్మాయి శ్రీమతి చంద్రలేఖ కూడా అమెరికాలో హాయిగా ఉంది. తిలక్‌గారు నమ్మిన పరమశివుడు వారి సంతానానికి అష్టైశ్వర్యాలను ప్రసాదించి, కంటికి రెప్పలా కాపాడుతున్నాడు. దైవలీల అంటే ఇదే కదా!

36. తిలక్ ఫిలాసఫీ:

"జీవితము' అనే కథా, 'సముద్రపు అంచులు' అనే పెద్దకథా ఎక్కువ తాత్త్వికదృష్టితో వ్రాయబడిన రచనలు. తిలక్ ఫిలాసఫీ ఎటువంటిదో వీటిని బట్టి నిర్ణయించుకోవచ్చును. 'జీవితం' కథలో చిట్టచివరన ఇలా వ్రాశారు.

"ఆకలికి అన్నం తింటారు, తినటం మూలాన్ని పెరుగుతారు, యవ్వనంలో కామిస్తారు, వృద్ధాప్యంలో – చచ్చిపోయే రోజులు సమీపించిన కొలదీ, చాలాకాలం బ్రతుకుతామనే ఆశతో జీవిస్తారు. శ్రావ్యంగా పాడేవాడికీ, పాటరానివాడికీ ఒకటే హృదయం ఉంది. 'నేను నీకంటె గొప్పవాణ్ణి' అంటానికి ఎవరికీ హక్కులేదు. ఒకరికి కవిత్వం రాయటంలో, ప్రకృతిని ఆనందించటంలో శక్తి ఉంటుంది. మరొకరికి హృదయాన్ని కరడుకట్టించుకొని చీకట్లని వెదచల్లే శక్తి ఉంటుంది. తోచక దెబ్బలాడుతారు. తెలివి తేటలెక్కువై ప్రభుత్వాలూ, యుద్ధాలూ, విప్లవాలూ, కోర్టులూ కల్పించుకుంటారు. జీవితంలో నగ్నసత్యం తెలుసుకొని, నవలలూ సినీమాలూ రొమాన్సులూ చూసి ఆనందిస్తారు. చివరికి ప్రతిజీవితం ప్రత్యేక జీవితం. ఒకరికీ ఒకరికీ సంబంధం లేదు. ఆశకు అంతులేదు. అంతానికి ఆశ కారణం. ఇది ప్రపంచం, ఇది జీవితం!!" (–భారతి, ఆగస్టు 1941.)

"అద్దంలో జిన్నా" అనే రచన తిలక్‌గారి 'పొలిటికల్ ఫిలాసఫీ'కి చక్కని ఉదాహరణం.

జిన్నా "ఒక భావంతో తాను పదికోట్ల మందిని ముప్పైకోట్ల జనం నుండి వేరు చేశాడు. అందరూ చేసేది యింతే! రాజకీయజ్ఞులపని వేరుచెయ్యడం. ఒక జాతి అంటే తక్కిన మానవసంఘంతో వేరుపడిన ఒక సమూహం అన్న మాట. బాగా వేరుచేస్తే మరీ పెద్దనాయకుడవుతాడు...."

37. జాన్సన్ (Johnson) – బాస్వెల్ (Boswell):–

నేను తిలక్‌గారితో యథాలాపంగా రెండు మూడు సార్లు "జాన్సన్ జీవితాన్ని బాస్వెల్ వ్రాసినట్లుగా మీ జీవితాన్నంతటినీ నేను వ్రాస్తాను" అన్నాను.

తిలక్ లేతనవ్వు నవ్వి : “బాస్వెల్ ఎప్పుడూ జాన్సన్‌తోనే ఉండేవాడు. జాన్సన్‌కు విసుగొచ్చి ‘పోరా వెధవా’ అని తన్నినా సరే, విడిచి పోయేవాడు కాదట. ఎప్పుడూ జాన్సన్ ఇంటి దగ్గరే పడివుండేవాడట. ఇక నువ్వు ‘ఉండవయ్యా బాబూ!’ అని బ్రతిమాలినా మా యింటి దగ్గర ఉండవు కదా! ఎలా వ్రాస్తావు నా Life history?” అన్నారు.

అప్పటికీ నేను రోజులో చాలా భాగం వారియింటి దగ్గరనే గడిపేవాడిని. అయినా సరే వారికి తృప్తిగా ఉండేది కాదు. “పురుష దాంపత్యంలా ఎప్పుడూ ఆ తిలక్కుతోనే ఉంటావు! ఇంట్లోకి ఏం కావలసినా తీసుకురావు. ఎలాగరా నీతో?” అని విసుక్కునేది మా అమ్మ. ‘కూరలు తీసుకురారా’ అని సాయంకాలం నాలుగు గంటల వేళ బజారుకు పంపిస్తే, ఆ కూరల సంచీ తీసుకుని తిలక్‌గారింటికి వెళ్లి, రాత్రి 12 గంటలకు తిరిగి మా ఇంటికి వచ్చేవాడిని!! ఇలాగే నేను వారితో ఆరు సంవత్సరాలపాటు (1955–61) కూడా కూడా తిరగటంవల్ల వారి అభిరుచులూ – అలవాట్లూ వ్రాయగలిగాను. ఇది నా కొక పెద్ద ఆత్మసంతృప్తి! నా కవితా గురువులైన తిలక్‌గారు 45 ఏళ్ళు కూడా నిండకుండా అకాలమరణాన్ని పొందడం, నేను 86 ఏళ్ళు బ్రతికి వారి శతజయంతి ఉత్సవాలు తిలకించడం, వాటిలో పాల్గొనడం – ఒక విచిత్రమైన దైవలీలగా నేను భావిస్తున్నాను.

ఇప్పుడు –

“నువ్వు లేవు, నీ పాట వుంది;
ఇంటిముందు జూకామల్లె తీగల్లో అల్లుకుని
లాంతరు సన్నని వెలుతురులో క్రమ్ముకుని
నా గుండెల్లో చుట్టుకుని
గాలిలో
ఆకాశంలో
నక్షత్రం చివరి మెరుపులలో దాక్కుని
నీరవంగా నిజంగా వుంది....
జాలిగా హాయిగా వినబడుతూ వుంది...
శిశిర వసంతాల మధ్యవచ్చే

విచిత్ర మధురమైన మార్పును
గుర్తుకు తెస్తోంది.... యిన్నేళ్ళ తర్వాత!"

ముఖ్య గమనిక:– ఈ సుదీర్ఘ వ్యాసాన్ని చదివి కొందరు పాఠకులు ఒక పొరపాటుపడే అవకాశం ఉంది. నా అభిప్రాయాలన్నీ తిలక్‌గారికి ఆపాదించి, ఆయన చెప్పినట్లుగా వ్రాశానని అనుకోవచ్చును. నేను త్రికరణశుద్ధిగా చెపుతున్నాను. ఈ వ్యాసంలో ఉన్న విషయాలన్నీ తిలక్‌గారు ఆయా సందర్భాలలో నాతో చెప్పినవే! వీటిలో నేను కల్పించిన విషయం కాని, నా సొంత అభిప్రాయం కాని ఒక్కటికూడా లేదు; అన్నీ తిలక్‌గారివే! – అని దైవసాక్షిగా ప్రమాణంచేసి చెపుతున్నాను.

ఇట్లు,
– తంగిరాల వెంకట సుబ్బారావు

- **"కవిత్వం ఒక ఆల్కెమీ**
  దాని రహస్యం కవికే తెలుసు
  కాళిదాసుకు తెలుసు, పెద్దన్నకి తెలుసు
  కృష్ణశాస్త్రికి తెలుసు, శ్రీశ్రీకి తెలుసు"
  (తిలక్‌కి తెలుసు, శేషేంద్రకు తెలుసు!)
  – (నవత – కవిత)

- **నా అక్షరాలు –**
  కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు!
  నా అక్షరాలు –
  ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు!
  నా అక్షరాలు
  వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు!!
  (– నా కవిత్వం)

2. తిలక్ సాహిత్య పరిచయం

20వ శతాబ్ది ప్రారంభంలో (1910లో) తెలుగులో కవిత్వం మూడు పాయలుగా ప్రవహించింది. (1) "సంప్రదాయ కవిత్వం" లేక "నవ్యసంప్రదాయ కవిత్వం"; (2) "భావకవిత్వం" లేక "కాల్పనిక కవిత్వం"; (3) "అభ్యుదయ కవిత్వం". నవ్య సంప్రదాయ కవిత్వానికి ప్రారంభకులు తిరుపతి వేంకటకవులు. దీనిని ఒక పెద్ద ఉద్యమంగా ముందుకు నడిపించిన వ్యక్తి "కవిసమ్రాట్" విశ్వనాథ సత్యనారాయణగారు. కాల్పనిక కవిత్వానికి ప్రారంభకులు రాయప్రోలు సుబ్బారావుగారు. దీనిని ఒక ఉద్యమంగా ముందుకు నడిపించిన వ్యక్తి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు. అభ్యుదయకవిత్వ ప్రారంభకులు గురజాడ అప్పారావుగారు. దీనిని ఒక ఉద్యమంగా ముందుకు నడిపించిన వ్యక్తి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు). అందువల్లనే విశ్వనాథ – కృష్ణశాస్త్రి – శ్రీశ్రీ – ఈ ముగ్గురూ తిలక్‌గారి దృష్టిలో ఆధునికాంధ్ర కవిత్వానికి "త్రిమూర్తులు". ఈ పేరుతో తిలక్ ఒక కవిత కూడా వ్రాశారు. ఈ ఆధునిక కవిత్రయంలోని గొప్పతనాన్ని ప్రశంసిస్తూనే, వారి వారి లోపాలను కూడా ఎత్తి చూపారు తిలక్. ఈ కవిత్రయంలోని మంచిని గ్రహించి, చెడును పరిహరించి తానొక ప్రత్యేకమైన కవిగా రూపొందారు తిలక్. భావకవిత్వాన్ని అభ్యుదయకవిత్వాన్ని మేళవించి "సమ్యక్ సమ్మేళనం గావించి" నూతన కవితాలోకాన్ని ఆవిష్కరించారు; కవితాప్రియుల్ని ఆకర్షించారు.

కవిత్వ రహస్య తత్త్వవేత్త తిలక్. కవిత్వం ఒక "ఆల్కెమీ" అనీ, దాని రహస్యం కవికి మాత్రమే తెలుస్తుందనీ, మహాకవి కాళిదాసుకీ, ఆంధ్రకవితా పితామహుడు అల్లసాని పెద్దనకీ, భావకవి కృష్ణశాస్త్రికి, అభ్యుదయ (విప్లవ) మహాకవి శ్రీశ్రీకి ఆ కవితా రహస్యం తెలుసుననీ తిలక్ ఒక కవితలో అన్నారు. ఈ పేర్ల చివర తిలక్ పేరును, శేషేంద్ర పేరును కూడా మనం చేర్చవలసిన అవసరం చాలా ఉంది:

"కవిత్వం ఒక ఆల్కెమీ
దాని రహస్యం కవికే తెలుసు
కాళిదాసుకు తెలుసు, పెద్దన్నకి తెలుసు
కృష్ణశాస్త్రికి తెలుసు, శ్రీశ్రీకి తెలుసు
తిలక్‌కి తెలుసు, శేషేంద్రకు తెలుసు."

నా పరిచయం:-

"శ్రీశ్రీ - తిలక్- శేషేంద్ర" ఈ ముగ్గురూ "నవ్యాధునిక కవిత్రయం" అంటాడు మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తి. నేను శ్రీశ్రీకి ఏకలవ్య శిష్యుణ్ణి; తిలక్‌కి ప్రత్యక్ష శిష్యుణ్ని, శేషేంద్రకు ఆత్మీయ మిత్రుణ్ణి! 1955 నుండి 1961 వరకూ ఆరు సంవత్సరాలు తిలక్‌గారిని గాఢమైన భక్తితో ఆరాధిస్తూ సేవించాను. నాదీ, తిలక్ గారిదీ తణుకే అయినా 1955 వరకూ వారితో నాకు పరిచయం ఏర్పడలేదు. 1955 జూన్ నెల 'భారతి' మొట్టమొదటి పుటలో "ఆర్తగీతం" అనే కవిత ప్రకటించబడింది. దాని క్రింద "బాలగంగాధర తిలక్" అని ఉంది. కొటేషన్స్‌లో ఉండడంవల్ల అది 'పెన్ నేమ్" అనుకున్నాను. అప్పుడు నేను భీమవరం కళాశాలలో తెలుగు బి.ఏ. చదువుతున్నాను. ఆర్తగీతం కవిత నన్ను అమితంగా ఆకర్షించింది. దానిని కంఠస్థం చేసి, కనబడిన మిత్రులందరి దగ్గరా బిగ్గరగా చదివేవాడిని. ఇంతలో దసరా సెలవులు వచ్చాయి. తణుకు వెళ్ళాను. శ్రీపాద కృష్ణమూర్తి అనే మిత్రుని దగ్గర 'ఆర్తగీతం' ప్రసక్తి తెచ్చి, "ఈ బాలగంగాధర తిలక్ ఎవరో తెలియడం లేదు" అన్నాను. అతడు వెంటనే: "ఎవరో ఏమిటి? తిలక్ మన ఊరివాడే! టౌన్ హాల్ ప్రక్కన యిల్లు. రా! నీకు పరిచయం చేస్తాను" అన్నాడు. అలాగ 1955 సెప్టెంబరు నెలలో - దసరా పండుగలలో - తిలక్‌గారితో నాకు పరిచయం ప్రారంభమయింది. 1961 జూన్ నెలలో నేను ఏం.ఏ. చదవడానికి తిరుపతి వెళ్ళేవరకూ మా గురు-శిష్య సంబంధం గాఢంగా కొనసాగింది.

తిలక్ జీవితం:-

దేవకొండ బాలగంగాధర తిలక్‌గారు 1921 ఆగస్టు 1వ తేదీని, పశ్చిమగోదావరి జిల్లా, తణుకు తాలూకా "మండపాక" గ్రామంలో జన్మించారు. ఇది తణుకు ప్రక్కనే రెండు కి.మీ. దూరంలో ఉంది. వీరి తల్లిదండ్రులు:

రామసోదెమ్మ– సత్యనారాయణమూర్తి. వీరిది గొప్ప ధనిక కుటుంబం (మండపాక జమీందారులుగా ప్రసిద్ధి). దేవరకొండవారు వెలనాటి వైదిక బ్రాహ్మణులు. వీరిది "హరితస" గోత్రం. మూలపురుషుడు "ఎల్లప్ప" – ఎల్లప్ప కొడుకు "కృష్ణప్ప" – కృష్ణప్ప కొడుకు "అన్నప్ప" – ఈ అన్నప్పగారి కొడుకే సత్యనారాయణమూర్తిగారు. రామసోదెమ్మ–సత్యనారాయణమూర్తి దంపతులకు ఐదుగురు కూతుళ్ళు, ఏడుగురు కొడుకులు. కొడుకులలో తిలక్ రెండవవారు; మొత్తంసంతానంలో ఆరవవారు. తిలక్ అక్కచెల్లెండ్రు, అన్నదమ్ములు జ్యేష్ఠానుక్రమంగా:– సీతారత్నం, మాణిక్యాంబ, అచ్యుతాంబ, సూర్యకాంతం, పెద్ద అన్నప్ప, బాలగంగాధర తిలక్, శివకుమార శాస్త్రి, ఎల్లా బాలాత్రిపుర సుందరి, పార్థసారథి, గంగాధర రామారావు, ధనంజయ, తిమ్మేశ్వరరావు. (ఈ తిమ్మేశ్వరరావు ఎస్.ఎస్.ఎల్.సి.లో నా సహాధ్యాయి.)

బాలగంగాధర తిలక్‌గారి భార్యపేరు ఇందిరాదేవి. ఈ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు: డా॥ సత్యనారాయణమూర్తి (ఇంగ్లండ్), డా॥ సుబ్రహ్మణ్యం (అమెరికా), శ్రీమతి యనమండ్ర చంద్రలేఖ (అమెరికా). ఈ పిల్లలు ముగ్గురూ ఇప్పుడు ఆర్థికంగా మంచి అభివృద్ధిలో ఉన్నారు. తిలక్‌గారు గొప్ప ధనిక కుటుంబంలో పుట్టినా, జీవితంలో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతూఉండేవారు. పిల్లలు చురుకైనవాళ్ళు. ఇద్దరు మగపిల్లలకీ ఎమ్.బి.బి.ఎస్. సీట్లు వచ్చాయి. కాని వారిద్దరినీ డాక్టరు కోర్సులు చదివించే స్తోమత వారికి లేకపోయింది. అప్పుడు తిలక్‌గారి తమ్ముడు గంగాధర రామారావుగారి ప్రోద్బలంతో తిలక్ సోదరులంతా కలిసి ఈ పిల్లల చదువులకు ధనసహాయం చేశారు. భగవంతుని దయవల్ల వీరు పైకి వచ్చారు. (గుండెజబ్బుకు పెద్ద ఖర్చుతో వైద్యం చేయించుకోవడం వల్ల, ఉద్యోగమేమీ లేకపోవడం వల్ల, స్టెయిన్లెస్ స్టీల్ వ్యాపారం చేసి నష్టపోవడం వల్ల – తిలక్‌గారు ఆర్థికంగా చితికిపోయి ఉంటారని నేను ఊహిస్తున్నాను.) తిలక్‌గారి పెద్దబ్బాయి డా॥ సత్యనారాయణమూర్తి భార్య శ్రీమతి శారద. వీరికి ఇద్దరు ఆడపిల్లలు: సంధ్య, స్మిత. రెండవ అబ్బాయి డా॥ సుబ్రహ్మణ్యం భార్య శ్రీమతి హరికుమారి. వీరికి ముగ్గురు మగపిల్లలు: రాజేష్ తిలక్, సునీల్, సంజయ్. కూతురు శ్రీమతి చంద్రలేఖ భర్త శ్రీ యనమండ్ర విశ్వమోహనరావుగారు. వీరికి ముగ్గురు కూతుళ్ళు: సీత, పద్మ, గీత. ఇదీ తిలక్‌గారి దోసతోటవంటి సంతానం. ఆధునిక తెలుగు కవిలోకంలో ఇద్దరే యిద్దరు

అందగాళ్ళు, అపర మన్మథులు: తిలక్ – శేషేంద్ర. చక్కని కనుముక్కు తీరుతో పచ్చదబ్బపండువంటి శరీరచ్ఛాయతో నల్లని ఉంగరాల జుట్టుతో ఎంతో అందంగా ఉండేవారు తిలక్. వారి కొడుకులు, కూతురు, మనుమలు, మనుమరాండ్రు – అందరూ బంగారు బొమ్మలే!

విద్యాభ్యాసం:-

తిలక్‌గారు తణుకు బోర్డు హైస్కూలులో ఉన్నత పాఠశాలవిద్య పూర్తిచేసికొని, మద్రాసు లయోలా కాలేజీలో ఇంటర్మీడియేట్ లో చేరారు. అనారోగ్య కారణంవల్ల దానిని పూర్తిచేయలేదు. తిరిగి విశాఖపట్టణంలో మిసెస్. ఎ.వి.ఎన్. కాలేజీలో చేరారు. అక్కడా చదువు పూర్తిచేయలేదు. సొంతంగా తెలుగుసాహిత్యం, సంస్కృతసాహిత్యం, ఆంగ్లసాహిత్యం బాగా చదువుకున్నారు. తండ్రి సత్యనారాయణ మూర్తిగారు గొప్ప సాహిత్య ప్రియుడు; దేశభక్తుడు. "మానాన్న తిక్కన భారతంలోని పద్యాలు గడగడా అప్పగించేవాడు. జాతీయోద్యమంవల్ల ఆయన బాగా ప్రభావితుడయ్యాడు. గాంధీగారికన్నా లోకమాన్య బాలగంగాధర్ తిలక్ అంటే ఆయనకు చాలా యిష్టం. ఆ పేరే నాకు పెట్టారు" అనేవారు తిలక్. వారియింట్లో హాల్లో లోపలి గుమ్మానికి పైన వారి నాన్నగారి నిలువెత్తు ఆయిల్ పెయింటింగ్ ఉండేది. తిలక్‌గారు అచ్చంగా వారి నాన్నగారి పోలికే!

మిత్రులు – సాహిత్య గోష్ఠులు:-

తిలక్‌గారికి మిత్రులు చాలామంది ఉండేవారు. వాళ్ళంతా కవులు, పండితులు, ప్రసిద్ధ రచయితలు. మొదటితరంలో మల్లవరపు విశ్వేశ్వరరావు, పాలగుమ్మి పద్మరాజు, పిలకా గణపతిశాస్త్రి, సూరంపూడి భాస్కరరావు, అనిసెట్టి సుబ్బారావు, అబ్బూరి వరదరాజేశ్వరరావు ఉప్పులూరి కాళిదాసు (ఆనందవాణి), సంపత్ రాఘవాచారి, రాయప్రోలు రాజశేఖర్, రాయప్రోలు సుబ్రహ్మణ్యం మొదలైనవారు ఉండేవారు. రెండవతరంలో ఆవంత్స సోమసుందర్. శ్రీపాద కృష్ణమూర్తి, తంగిరాల సుబ్బారావు, చల్లా నరసింహారావు, వరవరరావు, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, మిరియాల రామకృష్ణ, వెల్చేరు నారాయణరావు మొదలైనవారు ఉండేవారు. "సాహితీ సరోవరం" – "శతపత్ర గోష్ఠి" – "బృందావన కళాసమితి" వంటి సంస్థలను స్థాపించి, మిత్రులతో సాహిత్యచర్చలు కావించేవారు. వీటిలో

"బృందావన కళాసమితి" 1958 డిసెంబరు 20వ తేదీని స్థాపింపబడింది. దీనికి నేను ప్రధాన కార్యదర్శిగా ఉండేవాడిని.

తిలక్ సాహిత్య జీవితంలో మూడు దశలు:-

(i) మొదటి సాహిత్యదశ (భావకవిత్వ దశ): 1938 నుండి 1946 వరకు (17వ ఏటనుండి 25వ ఏడువరకు) = 8 సంవత్సరాలు

(ii) అనారోగ్య విరామ దశ: 1946 నుండి 1954 వరకు (25వ ఏటనుండి 33వ ఏడు వరకు) = 8 సంవత్సరాలు. ఈ కాలంలో తిలక్ "గదిలో మంచమె ఎల్లలోక మగుచున్ కాలమ్ము వెళ్ళించు" చూ ఉండిపోయారు. నరాల సంబంధమైన వ్యాధి వచ్చింది. గుండె జబ్బుకూడా ఉండి ఉండాలి.) వీరికి వచ్చిన వ్యాధి పేరు "Hypochondriasis" అని అంటారు. లేని జబ్బులు ఉన్నట్లుగా భావించుకొని బాధపడటం ఈ వ్యాధి లక్షణమని డాక్టర్లు చెపుతారు. కాని తిలక్‌గారు నిజంగానే ఏదో వ్యాధితో బాధపడేవారు. తనకు గుండెపోటు వచ్చిందని "బాధాగళము" అనే పద్యఖండికలో తిలక్ చెప్పుకొన్నారు. ("గుండియ పోటుతో బ్రతుకు కోసలు వంకరలయ్యె!").

(iii) రెండవ సాహిత్యదశ (అభ్యుదయ కవిత్వ దశ): 1954 నుండి 1966 వరకు (వారి 33వ ఏటనుండి 45వ ఏడు వరకు) = 12 సంవత్సరాలు.

తిలక్ రచనలు:-

తిలక్ సంపూర్ణ సాహిత్యాన్ని నా ఉద్దేశంలో ఆరు రకాలుగా విభజించ వచ్చును. అవి 1. కవిత్వం, 2. కథలు, 3. నాటికలు, 4. నాటకాలు, 5.లఘువ్యాసాలు, 6. లేఖలు.

1. కవిత్వం:-

1.1. ప్రారంభ కవిత్వం: "ప్రభాతము-సంధ్య" (దీనిని "కవితా ఖండికా సముచ్చయం" అన్నారు తిలక్), స్వీయ ప్రచురణ, 1940. దీనిని తిలక్ 17 సంవత్సరాల వయసులో రచించారు (పద్యాలు, గేయాలు).

1.2 పద్యకవిత్వం:-

1.2.1."మండోదరి" (300 పద్యాలు): తిలక్‌గారి అనారోగ్యదశలో నష్టమై పోయింది. (మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తి ధారణనుండి మూడు

పద్యాలు మాత్రం సేకరించగలిగాను.)

1.2.2."గోరువంకలు": డా॥ డి.యస్. మూర్తిగారి (తిలక్‌గారి పెద్దబ్బాయి, లండన్) ప్రచురణ, జనవరి 1993.

1.3. వచన కవిత్వం : "అమృతం కురిసిన రాత్రి", విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, జూలై 1968. (తరువాత ఇది చాలా ముద్రణలు పొందింది.)

2. కథలు:-

2.1. "సుందరీ-సుబ్బారావూ", ప్రజాప్రచురణలు, ఏలూరు, 1961

2.2. "ఊరిచివరి యిల్లు" ప్రజాప్రచురణలు, ఏలూరు, 1961.

2.3. "తిలక్ కథలు" విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1967. (తరువాత ఇది చాలా ముద్రణలు పొందింది.)

3. నాటికలు:-

3.1. "ఇరుగు-పొరుగు", 'భారతి' (మాసపత్రిక), జనవరి, 1960

3.2. "సుచిత్ర ప్రణయం", ప్రజాప్రచురణలు, ఏలూరు, 1961

3.3. "సుప్తశిల", విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, అక్టోబరు, 1967

3.4. "పొగ", 'నవత' (త్రైమాసిక), ఏప్రిల్-జూన్, 1968

3.5. "భరతుడు" (ఏకపాత్రాభినయం), ఇది "తిలక్ లేఖలు" అనే గ్రంథంలో అనుబంధంగా ముద్రితమయింది, 1968.

4. నాటకాలు:-

4.1. "సుశీలపెళ్ళి" ప్రజాప్రచురణలు, ఏలూరు, నవంబరు 1961

4.2. "సాలెగూడు" విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, జనవరి 1980

5. లఘువ్యాసాలు:-

5.1. "కవిత్వం అంటే", 'ఆనందవాణి', మద్రాసు, 1940 ప్రాంతం (?), 'తిలక్ సాహితీ సమాలోచనమ్'లో పునర్ముద్రితం, హైదరాబాదు, జనవరి 27, 2008.

5.2. "హృదయం విప్పి" వచనకవితను గురించి కుందుర్తిగారికి సమాధానంగా వ్రాసిన చిన్నవ్యాసం, 'నవత', తృతీయ సంచిక, 1964 సెప్టెంబరు 15, (ఇది ఈ గ్రంథంలో "కథాకావ్యం" అనే పేరుతో ముద్రితమయింది).

5.3. కృష్ణశాస్త్రిగారిని గురించి వ్రాసిన అసంపూర్ణ వ్యాసం, ఆంధ్రజ్యోతి, 24-2-1992 (దీనిని డా॥ శ్రీపాద కృష్ణమూర్తి సేకరించి ఆ పత్రికకు పంపాడు)

5.4. "కావ్యసృష్టి" - భారతి, జూన్ 1944

5.5. "గాంధీ జీవితం ఒక మహాకావ్యం" - కళాకేళి, సెప్టెంబరు 1969

5.6. "హేమంత హసంతిక"(సాహిత్య సంభాషణలు-1) ఆంధ్రపత్రిక ఉగాది సంచిక, 1972.

5.7. "కథలు వ్రాయడం ఎలా?" - కథలెలా రాస్తారు? (వ్యాస సంకలనం), సంపాదకుడు "శార్వరి", పునర్ముద్రణ: విశాలాంధ్ర ప్రచురణాలయం, 1992.

5.8. "కావ్యరసం" వ్యాసం, ఆంధ్రపత్రిక ఉగాది ప్రత్యేక సంచిక, (సంవత్సరం తెలియలేదు), నాకు లభించలేదు.

6.9. "సాహితి" మాసపత్రికలో 1963 ఏప్రిల్ నెలలో వచ్చిన "యుద్ధమూ - రచయిత" అనే వ్యాసం. (28-3-1963 నాడు వరవరావుగారికి వ్రాసిన లేఖనుబట్టి తెలుస్తోంది.) నాకు లభించలేదు.

6. లేఖాసాహిత్యం:-

6.1. "తిలక్ లేఖలు", తిలక్ సాహితీ సరోవరము, తణుకు, జూన్ 1968.

6.2. "నవత" (ఏప్రిల్ - జూన్, 1968)లో ప్రచురింపబడిన ఏడు లేఖలు.

6.3. నాకు వ్రాసిన నాలుగు లేఖలు (అముద్రితములు)

6.4. ఆచంట జానకిరాంగారికి వ్రాసిన ఒక పెద్దలేఖ (అముద్రితము)

తిలక్‌గారు వ్రాయాలని సంకల్పించిన రచనలు

1. "మలుపు" లేక "చీలినబాట" (నవల):-

కాకినాడలో తాను చూచిన ఒక స్త్రీ దీనగాథ. దారిద్ర్యంతో మిక్కిలిగా బాధపడుతున్న ఒక గృహిణి జీవితాన్ని ఒక పెద్ద నవలగా వ్రాయ సంకల్పించారు తిలక్. కొంత వ్రాశారు కూడా. ఈ నవల ఇతివృత్తాన్ని నాతో చర్చించారు. ఆచంట జానకిరామ్‌గారు ఒకసారి తిలక్‌గారిని చూడటానికి తణుకు వస్తే ఆయన దగ్గరకూడా ఈ నవలను గురించి చర్చించారు. యౌవనంలో ఉన్న ఒక అందమైన

గృహిణి దుర్భరమైన దారిద్ర్యంతో బాధపడుతూ ఉంటుంది. ఎదురింటి మేడమీద ఉంటున్న యువకుడు ఆమెను ప్రేమిస్తూ ఉంటాడు. ఆమె అతని ప్రయత్నాలను తిప్పికొడుతుంది. అతడు ఆమెకు ఆర్థికంగా సహాయపడాలని చూస్తాడు. కాని ఆమె స్వీకరించదు. ఇలా అభిమానంతో పాతివ్రత్యంతో బ్రతుకుతున్న ఆ గృహిణి పేదరికం రోజు రోజుకూ ఎక్కువై పోతూ ఉంటుంది. భర్త నిస్సహాయుడుగా ఉంటాడు. ఆకలిని భరించలేక ఒకరోజు రాత్రి ఆమె ఎదురింటి మేడమీది గదిలోకి వెళ్ళి, ఆ యువకుణ్ణి లేపి, "పోదాం, పద!" అంటుంది. ఇంతటితో నవల అయిపోతుంది. ఈ నవలకు తిలక్‌గారు అప్పటికి పేరేమీ పెట్టలేదు. ఈ కథంతా విని, జానకిరామ్‌గారు ఈ నవలకు "చీలినబాట" అని పేరు పెట్టమని సలహాయిచ్చారు. ఈ సంభాషణ జరుగుతున్నప్పుడు నేను అక్కడే ఉన్నాను. దీని రచన 1961లో ప్రారంభించి 60 పుటలు వ్రాసి నిలిపివేశారు. (ఈ నవలకు 'చీలిన బాట' అని పేరు పెట్టమని జానకిరాంగారు చెప్పినట్లుగా తిలక్‌గారు వరవరరావుగారికి వ్రాసిన ఒక లేఖలో తెలియజేశారు. తిలక్‌గారు తన మనసులో అనుకున్న పేరు "మలుపు").

2. "ఖడ్గతిక్కన" నాటకం

యుద్ధంలో శత్రువులకు వెన్ను చూపకూడదు; ఎట్టి పరిస్థితులలోను యుద్ధం నుండి పారిపోయి రాకూడదు; యుద్ధం చేస్తూ చనిపోవాలి; అలా చేస్తే వీరస్వర్గం వస్తుంది; స్వర్గంలో రంభాది అప్సరసలతో సుఖించవచ్చును" – ఇది మన భారతీయ సంప్రదాయంలోని నమ్మకం. ఖడ్గతిక్కన మొదటిసారి యుద్ధానికి వెళ్ళినప్పుడు అతని సైన్యమంతా చనిపోయింది. చేసేదిలేక అతడు రణరంగంనుండి తిరిగి నెల్లూరుకు వచ్చివేశాడు. ఇది మన భారతీయ సంప్రదాయానికి వ్యతిరేకమైనపని. అందువల్ల యుద్ధంలో ఓడిపోయి వచ్చిన ఖడ్గతిక్కనను, నెల్లూరి ప్రజలు, తల్లిదండ్రులు, కట్టుకున్న భార్య అనరాని మాటలన్నారు. అతిదారుణంగా పరాభవించారు. అందువల్ల అతడు పౌరుషం తెచ్చుకొని, మర్నాడు రెండోసారి యుద్ధానికి వెళ్ళి, తన సైనికులందరూ చనిపోయినా సరే, రణభూమిని విడిచి రాకుండా, బ్రహ్మరుద్రయ్యతో ద్వంద్వయుద్ధం చేసి చనిపోతాడు. ఈ ఖడ్గతిక్కన కథను గురించి నాతో చర్చిస్తూ తిలక్‌గారు: "చూడు సుబ్బారావ్! ఖడ్గతిక్కనను

శత్రువులు చంపలేదు. నెల్లూరి ప్రజలు, తల్లిదండ్రులు, భార్య కలిసి చంపేశారు. ప్రతికూల పరిస్థితులున్నప్పుడు యుద్ధంనుండి పారిపోయి వస్తే తప్పేముంది? బెర్నార్డ్ షా "Arms and the Man" నాటకం వ్రాసినట్టుగా నేను ఖడ్గతిక్కన నాటకం క్రొత్తగా వ్రాస్తాను!" అనేవారు.

3. మరో నాటకం:-

గొగోల్ "ఇన్‌స్పెక్టర్ జనరల్" నాటకంలాంటి మరో నాటకాన్ని కూడా వ్రాయాలని తిలక్ సంకల్పించారు. దాని కథను నాతోను, ఇతర "బృందావన కళాసమితి" మిత్రులతోను తరచుగా చర్చించేవారు. ఒక యువకుడు ఒక ఊళ్ళో అల్లరిచిల్లరగా తిరుగుతూ వుంటాడు. ఉన్నట్టుండి అతడు ఎక్కడికో వెళ్ళిపోతాడు. ఏమయ్యాడో ఎవరికీ తెలియదు. చాలా ఏండ్ల తరువాత తిరిగి తన ఊరికి వస్తాడు. చాలా గొప్పవాడుగా, పెద్ద ఉద్యోగిగా హంగూ ఆర్భాటంతో తిరిగివస్తాడు. బంధుమిత్రులందరినీ సరదాగా పలకరిస్తాడు. అందరూ ఆశ్చర్యపోతారు. ఊళ్ళో ఉన్న ఒక ధనికుడు పిల్లనిచ్చి పెళ్ళిచేయబోతాడు కూడా. ఇలా కొన్ని హాస్య సంఘటనల తర్వాత మళ్ళీ అతడు మాయమైపోతాడు. చివరికి అతడు తమ ఊళ్ళో పూర్వం ఉండే యువకుడు కాదనీ, ఎవరో మోసగాడనీ తేలిపోతుంది. ఈ నాటకాన్ని తిలక్‌గారు వ్రాయలేదు. నేను తిరుపతిలో ఎం.ఏ. చదువుతూ ఉండగా (1961-63 మధ్య) ఈ యితివృత్తాన్ని తీసికొని "మేనత్త కొడుకు" అనే రేడియో నాటిక వ్రాశాను. అది విజయవాడ ఆకాశవాణి కేంద్రం నుండి ప్రసారమయింది.

తిలక్ అభ్యుదయవాదే కాని హింసావాది మాత్రం కాదు:-

తిలక్ సాహిత్యంలో అభ్యుదయ భావాలు మెండుగా ఉన్నాయి కాని ఆయన కమ్యూనిస్టు మాత్రం కాదు, సోషలిస్టు. అందులోను "రాయిస్టు." "I am a Royist" అని నాతో సగర్వంగా చెపుతూ ఉండేవారు. M.N. Roy అంటే తిలక్‌గారికి చాలా యిష్టం. రాయ్ రచనలన్నీ ఆమూలాగ్రం చదివేశారు. (మార్క్స్, లెనిన్, నెహ్రూ, జయప్రకాష్ నారాయణ్ మొదలైనవారి రచనలు కూడా బాగా చదివినట్టుగా ఆయన లేఖలు చెపుతున్నాయి.) మార్క్సిజం గురించి బాగా చదివినా

కమ్యూనిస్టుల హింసాత్మక విప్లవధోరణి మాత్రం ఆయనకు నచ్చేది కాదు. కమ్యూనిజానికి వ్యతిరేకంగా, రష్యా చైనాలకు వ్యతిరేకంగా, శ్రీశ్రీకి వ్యతిరేకంగా ఎన్నో రచనలు చేశారు తిలక్. "కవివాక్కు", "త్రిశూలం" అనే కవితలు, "తీవ్రవాద నాయకుడు" అనే కథ, "ఇరుగు పొరుగు" అనే నాటిక, "త్రిమూర్తులు" కవితలో శ్రీశ్రీని గురించిన చివరి చరణం - తిలక్‌గారు కమ్యూనిస్టుకాదు అనడానికి సాక్ష్యాలు. అయితే దురదృష్టం ఏమిటంటే, ఆయన చనిపోగానే ఆయన రచనలన్నీ కమ్యూనిస్టులైన "విశాలాంధ్రవారి చేతుల్లో పడటం! వారు తమ సిద్ధాంతాలకు, శ్రీశ్రీకి వ్యతిరేకమైన రచనలన్నీ సెన్సారు చేసివేశారు. తరువాత కమ్యూనిస్టు పార్టీ రెండుగానూ, మూడుగానూ చీలిపోయాక, నాలాంటివారు గొడవ పెట్టడంతో, అయిష్టంగానే పై రచనలలో కొన్ని స్వీకరించక తప్పలేదు. తిలక్‌గారు బ్రతికుండగా ఆయన రచనలను, ముఖ్యంగా కవిత్వాన్ని అందంగా ముద్రించుకోలేక పోవడం కూడా ఒక విషాదమే!

ఆ రోజుల్లో మా తణుకులో కమ్యూనిస్టు నాయకుడు కీ.శే. వంకా సత్యనారాయణగారు; సోషలిస్టు నాయకుడు కీ.శే. శ్రీని రామారావుగారు. వీరిద్దరూ తిలక్‌గారి మిత్రులు. ప్రతిసంవత్సరం వంకా సత్యంగారు వచ్చి అడగ్గానే కమ్యూనిస్టుపార్టీ ఫండుకు 25 రూ.లు విరాళంగా ఇచ్చేవారు తిలక్. ఒకసారి శ్రీని రామారావుగారు మరికొందరు మిత్రులతో తిలక్‌గారి దగ్గరకు వచ్చి సోషలిస్టుపార్టీలో చేరమన్నారు. ఆయన ఆరోగ్యరీత్యా ఆ ఆహ్వానాన్ని తిరస్కరించారు. ఈ విషయం తిలక్‌లేఖల్లో (శ్రీమతి మోగంటి మాణిక్యాంబాదేవిగారికి వ్రాసిన లేఖల్లో) కూడా కనబడుతుంది.

తిలక్ వచన కవిత్వం - "అమృతం కురిసిన రాత్రి":-

తిలక్ వచన కవితలన్నీ ఒక సంపుటంగా ఆయన బ్రతికి ఉండగా రాలేదు. 1966లో ఆయన మరణించారు. రెండేళ్ళ తరువాత, 1968 జూలై నెలలో విశాలాంధ్రవారు వాటిని ప్రచురించారు. దీనికి కుందుర్తి ఆంజనేయులుగారిచేత పీఠిక వ్రాయించారు. ఈ కావ్యానికి "అమృతం కురిసిన రాత్రి" అనే శీర్షిక కూడా కుందుర్తిగారే పెట్టారు. తిలక్ తన వచనకవితా సంపుటికి "కఠినోపనిషత్" అనే పేరు పెట్టాలని అనుకున్నట్లుగా నాతో తరచుగా చెపుతూ ఉండేవారు. అంతేకాదు,

1961, నవంబరులో ప్రజాప్రచురణలు (ఏలూరు) ముద్రించిన "సుశీలపెళ్లి" అనే నాటకాన్నిబట్టి కూడా ఈ విషయం తెలుస్తోంది. తిలక్‌గారు తలపెట్టిన శీర్షికకన్నా కుందుర్తిగారు పెట్టిన శీర్షికే చాలాబాగుంది; తిలక్ భావనాశక్తికి అద్దం పడుతోంది.

"అమృతం కురిసిన రాత్రి"లో 81 సంపూర్ణ కవితలు, 15 అసంపూర్ణ కవితలు, మొత్తం 96 కవితలున్నాయి. ఇవన్నీ వచన కవితలు కావు. మాత్రాగణ బద్ధమైన గేయాలు కూడా కొన్ని ఉన్నాయి. "దృశ్యభావాలు – ప్రాతఃకాలం – సంధ్య – మేగ్నాకార్టా – భూలోకం – ఒక శ్రుతి – లయగీతం – ఒక్కసారి – లాలి" అనే తొమ్మిది కవితలు వచన కవితలు కావు; మాత్రాగణబద్ధమైన గేయాలు. సంగీతంలో ప్రవేశం ఉన్నవారు వీటిని హాయిగా పాడుకోవచ్చు – నిజానికి చలన చిత్ర సంగీత దర్శకులైన తిలక్‌గారి మేనల్లుడు (కీ.శే. ఎల్లా బాలత్రిపుర సుందరిగారి పెద్దకొడుకు) శ్రీ ఈవని సత్యనారాయణమూర్తిగారు ఇటువంటి గేయాలకు, "సుప్తశిల" నాటకంలోని కొన్ని పాటలకు 'ట్యూన్లు' కట్టి ఒక 'ఆల్‌బమ్' తయారు చేస్తున్నట్లుగా నాతో చెప్పారు. తిలక్ రచించిన వచన కవితలుగా చెప్పబడే వాటిలో కూడా కొంత లయాత్మకత తొంగిచూస్తూనే ఉంటుంది. ఈ సంపుటిలోని 96 కవితలను ఎనిమిది వర్గాలుగా విడదీయ వచ్చును. 1.కవిత్వతత్త్వవిచారం; 2.భావకవిత్వం; 3.అనుభూతి కవిత్వం; 4. అభ్యుదయ కవిత్వం; 5. యుద్ధకవిత్వం; 6.మానవతావాదం; 7. తాత్త్వికత; 8. ఇతరములు.

ఈ కావ్యంలో తిలక్ ఎన్నో నూతన ఉపమాలంకారాలను సృష్టించారు. అవి అద్భుత సౌందర్యంతో కూడి, పాఠకుల్ని తన్మయీభూతుల్ని చేస్తాయి. ఉదా:

1. "నాగరికత మైలపడిన దుప్పటిలా నన్ను కప్పుకుంది" (ఈ రాత్రి–2)
2. "కాలిపోయే యిల్లులా జీవితం ఒరుగుతుంది. కాలం పాడునుయ్యిలా నా కన్నులకు కనబడింది" (పాడువోయిన ఊరు)
3. "రాత్రిని రంపం పెట్టి కోసినప్పుడు / రాలిన పొట్టులా ఉంది వేకువ" (వేకువ)
4. "చలిగాలి గుండెలమీద కత్తిలా తెగింది" (సైనికుడి ఉత్తరం)
5. "పందిరి మంచం పైన / ఆమె చిరునవ్వులో కవిత్వం లాంటి కొత్తదనం మెరిసింది." (యుగళ గీతిక)

6. "కార్తిక మాసపురాత్రి వేళ / చల్లని తెల్లని వెన్నెల" – ఎలా ఉన్నదో చెపుతూ తిలక్ ఇలా అంటారు:–

"ఎంత శాంతంగా, హాయిగా, ఆప్యాయంగా ఉందీ!
చచ్చిపోయిన మా అమ్మ తిరిగొచ్చినట్టుంది!".

కృష్ణశాస్త్రిగారి "కృష్ణపక్షం" లాగా, శ్రీశ్రీగారి "మహాప్రస్థానం" లాగా, తిలక్‌గారి "అమృతం కురిసిన రాత్రి" కూడా ఆధునికాంధ్ర కవిత్వచరిత్రలో ఒక మైలురాయి! అనేక ముద్రణలు పొంది ప్రజల అభిమానాన్ని ఈనాటికీ చూరగొంటోంది. ఎందరో యువతీయువకుల్ని కవులుగా తీర్చిదిద్దుతోంది. ఈ కవితాసంపుటికి 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, 1971లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చాయి.

ఈ సంపుటిలోని "తపాలా బంట్రోతు" అనే కవితను తిలక్‌గారు నా కోరిక మీద వ్రాశారు. 1959–1961 మధ్య నేను తణుకు పోస్టాఫీసులో గుమాస్తాగా పనిచేస్తూ ఉండేవాడిని. 1959 ఆగస్టు నెలలో పశ్చిమగోదావరిజిల్లా తంతి తపాలాశాఖవారు జరుపుకొనే వార్షికోత్సవాల సభలో చదవడానికి "పోస్టుమేన్" మీద ఒక గేయం వ్రాసిపెట్టమని తిలక్‌గారిని పదేపదే ప్రాధేయపడ్డాను. "సరేలే! చూద్దాం!" అని వాయిదాలు వేస్తూ మూడు నెలలు గడిపివేశారు. ఇంతలో వార్షికోత్సవ సభలు జరిగిపోయాయి. (చేసేది లేక ఆ సభలలో తిలక్‌గారి "ఆర్తగీతం" చదివాను నేను.) కాని తిలక్ కవిత వ్రాయలేదు. తరువాత కొంతకాలానికి (రెండు మూడు నెలల తర్వాత) ఒకరోజు నన్ను అర్జంటుగా తన దగ్గరకు రమ్మని కబురు చేశారు. హడావిడిగా వెళ్ళాను. నన్ను కూర్చోబెట్టి "తపాలా బంట్రోతు" కవిత చదివి వినిపించారు. నేను బ్రహ్మానంద భరితుణ్ణి అయిపోయాను. నేను వ్రాయమన్నప్పుడు వ్రాయలేదని తిలక్‌గారి మీద నాకు కోపం వచ్చింది: "అప్పుడు వ్రాయమంటే వ్రాయలేదు. వార్షికోత్సవాలు జరిగిపోయాక ఇప్పుడు వ్రాశారు" అని బాధపడ్డాను. తిలక్‌గారు చిరునవ్వు నవ్వుతూ! "నువ్వు వ్రాయమనగానే వ్రాస్తే ఏడిసినట్టు వచ్చేది. ఇన్నాళ్ళుగా ఈ కవితా వస్తువు నా మనసులో నానింది కాబట్టే ఇంత బాగా వచ్చింది!" అన్నారు. మహాభారతాన్ని వైశంపాయనుడు జనమేజయునకు చెప్పినట్లుగా, సూతుడు శౌనకాది మహా మునులకు చెప్పినట్టుగా, ఈ కవితను తిలక్‌గారు నన్ను ఆప్యాయంగా సంబోధిస్తూ

("మై డియర్! సుబ్బారావ్! కనిపించడం మానేశావ్" అంటూ) నాకు నివేదించారు. నా జీవితం ధన్యమయింది! ఈ "తపాలాబంట్రోతు" కవిత హైదరాబాదునుండి గోరాశాస్త్రిగారి సంపాదకత్వంలో ఆరోజుల్లో వస్తున్న "ఆంధ్రజనత" దినపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రకటింపబడి పాఠకుల ప్రశంసల నందుకుంది. ఈ కవిత ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు పాఠ్యాంశంగా కూడా కొన్నేళ్ళు ఉన్నది.

ఈ సంపుటిలో అన్నిటికన్నా యుద్ధకవితలు ఎక్కువగా (14 కవితలు) ఉన్నాయి. తిలక్‌గారు తన జీవితంలో మూడు యుద్ధాలు చూశారు. 1. రెండవ ప్రపంచయుద్ధం (1939–1944); 2. భారత – చైనా యుద్ధం (1962); 3. ఇండియా– పాకిస్థాన్ మొదటి యుద్ధం (1965). తిలక్‌గారు రెండవ ప్రపంచయుద్ధాన్ని ఖండించారు. మనం చైనాతో చేసిన యుద్ధాన్ని, పాకిస్థాన్‌తో చేసిన యుద్ధాన్ని మాత్రం సమర్థించారు. దీనికి ఆయన దేశభక్తి కారణం.

తిలక్ పద్యకవిత్వం – "ప్రభాతము: సంధ్య" – "గోరువంకలు":–

తిలక్ ప్రారంభకవిత్వాన్ని 17 సంవత్సరాల వయస్సులో (1938లో) వ్రాశారు. అందులో లయాత్మకమైన గేయాలు, ఛందోబద్ధమైన పద్యాలు ఉన్నాయి. వీటిని "కవితా ఖండికా సముచ్చయం" అన్నారు తిలక్. వీటిని "ప్రభాతము–సంధ్య" అనే పేరుతో తన 19వ యేట (1940లో) తానే ప్రచురించుకున్నారు.

'త్రివేణి' సంపాదకులైన కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు ఈ కావ్యానికి 1–6–1940 నాడు ఒక చక్కని 'పరిచయము'ను వ్రాశారు.

"ప్రేమతో పొంగిపోయే హృదయం, ఆశానిరాశల మధ్య తూలిపోతూ స్వాప్నిక జగత్తులో విహరించే స్వభావం, వీటికి తోడు రసవంతమైన కవనమూ" ఈ కావ్యంలో ఉన్నాయన్నారు "ఇంత చిన్నతనంలోనే ఇన్ని అనుభవాలూ, ఇన్ని కలలూ ఎలా కలిగినవని ఆశ్చర్యపడ్డా"నన్నారు. ఆయనతోపాటు నాయని సుబ్బారావుగారు కూడా ఈ 'ప్రభాతము–సంధ్య'లోని కవితలను విని మెచ్చుకున్నారట.

"నీ నొసట తీర్చెద విశ్వమానవ కల్యాణ కుంకుమ" అనడం. "నా జీవితమంత ఒక నివాళిగా అర్పణ చేసెద"ననడం, "విశ్వగానము ఎల్లప్పుడూ నా హృదయంలో

నినదిస్తూనే ఉంటుంది" అనడం, "ప్రేమకొరకై జీవితమే సమిధగా వైచినాను" అనడం; మాతృదేవతను దర్శించి "ఆమె చలువ వెలుగు చూపులలరు నాకు/ నిదుర జోకొట్టు లాలి పన్నీటి పాట" అనడం; "చిన్నారి నవ్వులో చీకట్లు విచ్చాయి/ చిన్నారి సిగ్గులో చేమంతి పూసింది" అనడం – 'బాలకవి' – 'బాల' గంగాధర తిలక్ సౌందర్యారాధనకు, రసపిపాసకు నిదర్శనాలు. ఈ కావ్యంలో కృష్ణశాస్త్రి, వేదుల మొదలైన భావకవుల ప్రభావం ఎక్కువగా కనబడుతుంది. ఇది బాల్య చాపల్యంతో ప్రచురించిన కావ్యమని ఒకసారి తిలక్‌గారు నాతో అన్నారు.

తిలక్ తన మొదటి సాహిత్యదశ (1938–1946) లో పద్యకవితలు ఎక్కువగా వ్రాశారు. "గోరువంకలు" పేరుతో 50 పద్యాలు వ్రాశానని నాతో చెప్పారు. అవి "ప్రతిభ" అనే పత్రికలో 1942–44 మధ్య వచ్చాయి. కాని నేడు 39 పద్యాలు మాత్రమే లభిస్తున్నాయి.

ఈ దశలోనే "మండోదరి" పేరుతో 300 పద్యాలు వ్రాశానని నాతోను, మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తితోను తరచుగా చెపుతూ ఉండేవారు. అయితే అవన్నీ ఆయన అనారోగ్య విరామదశ (1946–1954) లో నష్టమైపోయాయని ఎంతో బాధపడేవారు. తాను రోగంతో మంచం పట్టినప్పుడు వారి అమ్మగారు పాత న్యూస్‌పేపర్లతో కలిపి మండోదరి వ్రాతప్రతిని కూడా అమ్మివేశారని తిలక్ గారు నాతో చెప్పిన జ్ఞాపకం. మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తి ఇంకో రకంగా చెపుతున్నాడు. 2010 డిసెంబరు నెలలో తిలక్ అవార్డు సందర్భంగా మేమిద్దరం తణుకులో కలిశాము. అప్పుడు అతడు నాతో ఇలా అన్నాడు. "రోజూ తిలక్ గారింట్లో కాఫీ కాచడం నిమిత్తం కుంపటి వెలిగించడానికి చిత్తుకాగితాలు ఉపయోగించేవారు. ఆ చిత్తు కాగితాల్లో ఈ 'మండోదరి' కావ్యంకూడా చేరిపోయింది. దానిలో మొదటి పేజీ మాత్రం మిగిలింది. ఆ పేజీలో మూడు పద్యాలున్నాయి. ఆ మూడు పద్యాలనూ నేను ధారణ చేశాను. ఇప్పుడు నా ధారణలో ఒక్క పద్యం మాత్రమే మిగిలింది" అని చెప్పి ఈ క్రింది పద్యాన్ని మంచి కావ్యధోరణిలో చక్కగా చదివాడు:

ఉ॥ "సింహళ సిందువారముల శీకృతిలో చెలరేగి సాగి, ఆ
సింహళ సింధువార రసశీకర సేచనలో కలంగి, ఆ

రంహరుదార మారుత శలాక యొకండు పతాక తాకె, ఓ
సింహళనాథ! లెమ్ము! శివసేవనవేళ గమించి పోయెడున్!"

తరువాత అతడు మిగిలిన రెండు పద్యాలూ జ్ఞాపకం చేసుకొని 26-10-2012 నాడు నాకు పంపించాడు. ఈ మూడు పద్యాలూ ఈ రెండవ ముద్రణలో ఇచ్చాను. ఈ పద్యాలను బట్టి "మండోదరి" పద్యకావ్యం మంచి ప్రౌఢమైన కావ్యమని, తెల్లవారు జామున వందిమాగధులు సింహళ ప్రభువైన రావణుని మేల్కొల్పడంతో కావ్యం ప్రారంభమవుతుందని – మనం ఊహించవచ్చు.

"సాహితి" మాసపత్రిక 1962 అక్టోబరు సంచికలో తిలక్‌గారు రచించిన "యౌవనాహ్వానము" అనే పద్యఖండిక లభించింది. దీంట్లో ఏడు వృత్త పద్యాలున్నాయి. ఇవి "గోరువంకలు" ఖండికకు సంబంధించినవని కవితా ఖండిక చివర వ్రాశారు కాబట్టి దాంట్లో చేర్చాను.

1993 జనవరిలో ప్రకటింపబడిన "గోరువంకలు" కావ్యంలో "సీత-1", "సీత-2" అని రెండు ఖండికలు ముద్రించారు. అవి నిజానికి 'భారతి'లో వరుసగా "విషణ్ణ వైదేహి" – "పరిత్యక్త" అనే పేర్లతో ప్రకటితమయ్యాయి. కాబట్టి ఈ శీర్షికలనే ఉంచాను. కుండలీకరణాలతో "సీత-1", "సీత-2" అని కూడా ఇచ్చాను. ఈ "గోరువంకలు" పద్యకవితా సంపుటిలో 80% భావకవిత్వమే ఉన్నది. మిగిలిన 20% ఇతర విషయాలున్నాయి. భావకవిత్వంలో ప్రణయకవితలు (లౌకిక ప్రణయం, అలౌకిక ప్రణయం), ఋతువర్ణనలు – ఇతర ప్రకృతి వర్ణనలు, బాధ- అవ్యక్త వేదన – అనే అంతర్విభాగాలను గుర్తింపవచ్చును. ఇతరములలో స్వీయకవితా నిర్వచనం, మహాత్ముల ప్రశంస, వాల్మీకి రామాయణ వైశిష్ట్యం, కరుణరసం – అనే విభాగాలు కనబడతాయి.

తిలక్ వచన కవిత్వాన్ని ఎంత గొప్పగా వ్రాసేవారో, పద్యకవిత్వాన్ని కూడా అంతే గొప్పగా వ్రాశారు. కాని విమర్శకులు ఈ విషయాన్ని అంతగా పట్టించుకున్నట్టుగా లేదు. తిలక్ పద్యరచన ఎక్కువగా కృష్ణశాస్త్రిగారి ప్రభావంతో భావకవిత్వ ధోరణిలో సాగడమే దీనికి కారణం కావచ్చు.

తిలక్ కథలు:-

తిలక్‌గారు కవిగా మిక్కిలి ప్రసిద్ధులు. అయినా కథలు కూడా విరివిగా వ్రాసి పాఠకుల్ని మెప్పించారు. ఇది గొప్ప విషయం. కవులు కథలు వ్రాస్తే ఒక

ప్రమాదం ఉంది. కథాకథనాన్ని కవిత్వం మ్రింగివేస్తుంది. ఈ ప్రమాదం ఏర్పడకుండా విశ్వనాథవారిలాగే తిలక్‌గారు కూడా జాగ్రత్త పడ్డారు. "కథ అనేది వచన ప్రక్రియ; దీనికి కవిత్వంతో సంబంధం లేదు" – అనే వాస్తవాన్ని తిలక్ గుర్తించారు.

"పరిపక్వత, నిపుణత, సంపూర్ణత–ఈ మూడూ పుష్కలంగా ఉన్న కథారచయిత తిలక్" అంటారు విమర్శకులు. ఈయన తన కవిత్వానికి ఏయే లక్షణాలు ఉన్నాయని చెప్పుకున్నారో, అవే లక్షణాలు ఈయన కథలలో కూడా మనకు దర్శనమిస్తాయి. "త్యాగశక్తి–ప్రేమరక్తి– శాంతిసూక్తి" ఈ మూడింటితో కూడిన మానవతాదృక్పథం; "కన్నీటి జడులతో తడిసే దయాపారావతాల" వంటి కరుణ; "ప్రజాశక్తులవహించే విజయఐరావతాల"వంటి అభ్యుదయం; "వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లల"వంటి సౌందర్యం తిలక్ కథలలోకూడా స్పష్టంగా ఉన్నాయి.

సంభాషణా చాతుర్యం, సున్నిత హాస్యం, అత్యంత ఆధునిక శాస్త్రీయదృష్టి, అద్యతన రాజకీయ పరిజ్ఞానం, వస్తువైవిధ్యం, అనుభవ సంపద, నిశిత పరిశీలన – తిలక్ కథలలో మనకు దర్శనమిస్తాయి. రసపుష్టము, భావనిష్ఠము అయిన తిలక్‌పద్యంలాగే తిలక్‌గద్యంకూడా ప్రవహిస్తుంది.

ఒక విమర్శకుడు చెప్పినట్టుగా "మధ్యతరగతి మందహాసాలూ, కింది తరగతి చిందు లాస్యాలూ, ఉన్నతవర్గాల ఉన్మత్త విలాసాలూ –వెరసి సమాజంలో కొడిగట్టి పోతున్న మానవత్వ దీపం చుట్టూ మూగుతున్న ఆశా, పేరాశా, దురాశా, స్వార్థం, మోసం, క్రౌర్యాల మరణమృదంగధ్వానాలను తన కథలద్వారా వినిపించిన విశిష్ట కథకుడు తిలక్". సాంప్రదాయిక నీతికీ, మతానికీ ఇచ్చిన ప్రాధాన్యం, మన సమాజం మానవత్వానికి ఇవ్వడం లేదని తిలక్ తన కథలలో వాపోయారు.

కథలలోని కొన్ని పాత్రల ద్వారాను, స్వయంగాను తిలక్ వెలిబుచ్చిన ఈ క్రింది అభిప్రాయాలు ఆయన రచనోద్దేశాన్ని మనకు స్పష్టం చేస్తాయి.

1. "ఎవర్నీ నమ్మకు. ఈ మనుషులంతా దొంగవెధవలు. విషసర్పాలు."
2. "సముద్రం లాంటిదే దరిద్రం కూడా; అవతలి గట్టు కనపడదు."
3. "స్వార్థం కన్నా గొప్ప శక్తి ప్రపంచంలో లేదని తెలిసిపోయింది నాకు. ఈ ఆదర్శాలు ఆశయాలు అన్నీ ఈ ప్రాథమిక స్వార్థానికి అంతరాయం కలిగించనంత వరకే."

4. 'రోగిష్ఠి ఆరోగ్యాన్ని గురించీ, ఆకలితో ఉన్నవాడు రుచికరమైన పిండివంటలను గురించీ ఆలోచించకుండా ఏ చట్టమూ శాసించలేదు."
5. "ప్రతి జీవితం ప్రత్యేక జీవితం – ఒకరికీ మరొకరికీ సంబంధం లేదు. ఆశకు అంతులేదు. అంతానికి ఆశ కారణం. ఇది ప్రపంచం, ఇది జీవితం!"

20 ఏండ్ల చిన్నవయస్సులో తిలక్ "జీవితం" అనే కథ వ్రాశారు. అది 1941 ఆగస్టు నెల 'భారతి'లో ప్రకటితమయింది. ఏదో పల్లెటూరులో ఉండి, ఈ కథను చదివి ఆనందించిన ఒక వృద్ధుడైన రాజుగారు తిలక్‌ని చూద్దామని భీమవరంనుండి తణుకు వచ్చి, పిన్నవయసులో ఉన్న తిలక్‌ను చూచి "ఇంత చిన్నవయసులో ఇంత అనుభవం ఎలా వచ్చింది?" అని ఆశ్చర్యపోయారట! (ఈ విషయం తిలక్‌గారు నాతో స్వయంగా చెప్పారు.)

ప్రముఖ కథకులు, కవి అయిన శ్రీమునిపల్లె బి. రాజుగారు పూర్వం ఒకసారి మద్రాసులో తిలక్‌గారిని కలిశారట. అప్పుడు వారిద్దరి మధ్య కథలను గురించి చర్చ జరిగిందట. ఆ చర్చలోని విషయాలను 10–12–2008 నాడు మునిపల్లె రాజుగారు ఫోనులో నాకు తెలియజేశారు. కథలను గురించి తిలక్‌గారి అభిప్రాయాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:–

1. "Each story reveals a secret of life."
2. "కవిత్వంలో కూడా చెప్పలేని విషయాలను కథల్లో సులభంగా చెప్పవచ్చు."
3. "మార్క్సిస్టులు 'ఆకలి' ఒక్కదానిని గురించి మాత్రమే చెపుతారు. అదే మానవుని మనస్తత్వాన్ని తెలియజేస్తుందని అంటారు. కాని ఆకలితో సమానంగా 'కామం' కూడా మనిషి మనస్తత్వాన్ని విశదీకరిస్తుంది" (ఉదా : తిలక్ రచించిన "అతని కోరిక" కథ).
4. "మనిషి పగటి కలలు కంటాడు. ఈ పగటి కలల్ని కథల్లో చెప్పవచ్చు" (ఉదా : తిలక్ రచించిన "సుందరీ–సుబ్బారావూ" కథ)

"ఊరిచివరి యిల్లు" అనే కథను తిలక్‌గారు "The Shadows" అనే పేరుతో స్వయంగా ఆంగ్లంలోకి అనువదించి, "TRIBUNE" అనే అమెరికన్ పత్రిక జరిపే ప్రపంచ కథల పోటీకి పంపించారు. (ఈ పత్రిక జరిపిన పోటీలలోనే

పాలగుమ్మి పద్మరాజుగారి "గాలివాన" కథకు ద్వితీయ బహుమతి వచ్చింది.) తన మిత్రుడు పద్మరాజుగారి లాగే తనకు కూడా బహుమతి రావాలని తిలక్ పట్టుదలతో ఉండేవారు.

తిలక్‌గారికి శరత్ రచనలంటే చాలా యిష్టం "నన్ను శరత్ ఏడిపించినట్టుగా ఏ రచయితా ఏడిపించలేదు. ప్రతి సంవత్సరం ఒకసారి శరత్ రచలన్నీ చదువుతాను, నన్ను నేను re-charge చేసుకుందుకు" అనేవారు తిలక్ నాతో. నిశితంగా పరిశీలిస్తే తిలక్ కథలమీద శరత్ ప్రభావం కొంత కనబడుతుంది.

తిలక్ నాటికలు:

1. "సుచిత్ర ప్రణయం":-

ఇది 1957లో తిలక్ గారు వ్రాసిన మొట్టమొదటి రూపకం. దీనికి ముందు తిలక్‌గారు నాటికలు కాని, నాటకాలు కాని ఏమీ వ్రాయలేదు. దీనిని కేవలం నాకోసం, నన్ను హీరోగా మనసులో పెట్టుకొని వ్రాసిన నాటిక. నాకప్పుడు 22 సంవత్సరాలు. బి.ఏ. ప్యాసయ్యాను. ఎత్తుగా తెల్లగా అందంగా ఉండేవాడిని. మాది పేద కుటుంబం. ఎం.ఏ. చదవడానికి డబ్బులేక పోస్టాఫీసులో గుమస్తాగా చేరాను. అందమైన, చలాకీయైన ఒక పేదయువకుని ఆశలు ఆశయాలు ఎలా ఉంటాయో, ధనవంతుడు కావాలని ఎలా పగటికలలు కంటాడో తిలక్‌గారు నన్ను మనసులో పెట్టుకొని, ఎన్నో కల్పనలు చేసేవారు. నా పేరును యథాతథంగా ఉంచి, ఒక కథను; ఒక నాటికను వ్రాశారు; ఒక కవితను కూడా వ్రాశారు. కథ పేరు "సుందరీ – సుబ్బారావు"; నాటిక పేరు "విచిత్ర ప్రణయం" (ఈ నాటిక మొదటి పేరు విచిత్ర ప్రణయమే!. తరువాత దీనిని "సుచిత్ర ప్రణయం"గా మార్చారు తిలక్). ఇందులో "సుచిత్ర– సుబ్బారావు" నాయికా నాయకులు. (ఈనాటికలో హీరో పేరు మొదట సుబ్బారావే! తిలక్‌గారి అనుమతితో నేను 'సుబ్బారావు' అనే పేరును 'శేఖర్' గా మార్చాను.) ఈ నాటికలో 'సుచిత్ర' అనే అందమైన, ధనికురాలైన, అమ్మాయి వెనుక 'సుబ్బారావు' పడతాడు. నా పేరు కూడా సుబ్బారావే కాబట్టి ఆ వేషం వేయడానికి నేను భయపడ్డాను. "ఈ నాటిక ప్రదర్శించిన తరువాత నా మిత్రులందరూ నన్ను ఏడిపిస్తారు. 'సుబ్బారావు' అనే పేరు మార్చెయ్యండి. లేకపోతే నేను ఈ వేషం వెయ్యను!" అన్నాను తిలక్‌గారితో. ఆయన నవ్వుతూ "సరే! నీ యిష్టం వచ్చిన పేరు నువ్వే పెట్టుకో. హీరోవేషం

మాత్రం నువ్వే వేయాలి!" అన్నారు. నేను ఆ హీరోకి "శేఖర్" అనే పేరు పెట్టాను. "సుందరీ – సుబ్బారావూ" కథలో ధనికురాలైన సుందరిని ప్రేమించిన సుబ్బారావు ఆశలు పేకమేడల్లా కూలిపోతాయి. "విచిత్ర ప్రణయం" ("సుచిత్ర ప్రణయం") లో "సుబ్బారావు" ("శేఖర్") ఆశలు ఫలిస్తాయి. జమీందారుగారి కూతురైన సుచిత్ర సుబ్బారావుని వరిస్తుంది. పెండ్లి చేసుకుంటుంది. "కథ"లో వాస్తవికతనూ, "నాటిక"లో కాల్పనికతనూ పాటించారు తిలక్. హాస్యరసపోషణకోసం, నాటకీయత కోసం దీనిలో ప్రేమ ఫలించినట్లు చూపడం అవసరమయింది. ఈ నాటికను ప్రదర్శించిన తర్వాత తిలక్‌గారి కుటుంబంలో అందరూ నన్ను "సుబ్బారావు" అని పిలవడం మానేసి, "శేఖర్" అని పిలవడం మొదలు పెట్టారు!

ఈ నాటిక మీద, ముఖ్యంగా "శేఖర్" (సుబ్బారావు) పాత్రమీద, కన్యాశుల్క నాటక ప్రభావం – ముఖ్యంగా గిరీశం ప్రభావం బలంగా ఉంది. రెండు మూడు చోట్ల శేఖరాన్ని గిరీశంతో పోల్చి, "గిరీశంగాడు" అన్న సందర్భాలు కూడా ఉన్నాయి. తిలక్‌గారి హాస్యరసపోషణ, నాటకీయత ఈ నాటికలో పరాకాష్ఠనందుకున్నాయి. నేను హీరోగా ఈ నాటికను 1957లో తణుకు హైస్కూలులో మొదటిసారి, 1959లో తణుకు టౌన్‌హాలులో రెండవసారి విజయవంతంగా ప్రదర్శించాను. నాతోపాటు మిత్రులు గౌస్ మొహిద్దీన్, ఎ. లక్ష్మయ్య ఎల్.ఎస్. రామకృష్ణ, కుమారి బాలామణి ఈ నాటికలో నటించారు. తరువాత తణుకు పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు కూడా దీనిని చక్కగా ప్రదర్శించారు. రంగస్థలం మీద ఈ నాటిక విజయవంతం కావడంతో, తిలక్ గారికి చాలా ధైర్యం వచ్చింది. తరువాత నాటకాలు నాటికలు విరివిగా వ్రాయడం మొదలు పెట్టారు. "బృందావన కళాసమితి" అనే సంస్థను స్థాపించి, నాలాంటి యువకులచేత వాటిని ప్రదర్శింపజేశారు.

ఈ నాటికలో హీరోయిన్ కి "సుచిత్ర" అని పేరు పెట్టడంలో ఒక రహస్యం దాగి వుంది. తిలక్‌గారు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు సినీమాలు బాగా చూసేవారు. నన్నుకూడా తీసికెడుతూఉండేవారు. తెలుగులో 'భానుమతి', హిందీలో 'సుచిత్రాసేన్', ఇంగ్లీషులో 'మార్లెస్ మన్రో' 'గ్రీటాగార్బో' తిలక్‌గారికి మిక్కిలి యిష్టమైన కథానాయికలు! నాచిన్నతనంలో వచ్చిన జెమినీవారి "చంద్రలేఖ" సినీమాచూచి, ఎంతో ప్రభావితులై, తిలక్‌గారు వాళ్ళ అమ్మాయికి ఆ పేరు పెట్టారు.

2. "సుప్తశిల":-

రామాయణంలోని అహల్యకథను ఒక అద్భుతమైన నాటికగా మలిచారు తిలక్. పౌరాణిక నాటిక అయినా సంభాషణలు మాత్రం వ్యావహారికంలోనే వ్రాశారు. 21 పద్యాలు, 4 పాటలు కూడా మధ్య మధ్య చేర్చారు. దీనిని 15-5-1963 నాటికి పూర్తిచేసినట్టుగా వరవరరావుగారికి వ్రాసిన ఒక లేఖనుబట్టి తెలుస్తోంది.

అహల్య సౌందర్య పిపాసిని. మృదువైన కుసుమం వంటిది. అపూర్వ సౌందర్య విలసనం ఆమెలో కనబడుతుంది. ప్రకృతిశోభ, కోరికలు, ఆశలు, స్వేచ్ఛ, మానవ సహజత్వం, మానవ చైతన్యం - వీటికి ప్రతీక అహల్య.

గౌతముడు జడత్వానికి, కాఠిన్యానికి, శిలాసదృశతకు ప్రతీక. తపస్సు, సంయమనం, పరమార్థం, ఉత్తమ మానవజిగీష ఆయనలో కనబడతాయి.

ఈనాటికలోని వెన్నెల నేపథ్యం సౌందర్య భావనకి, మనశ్చాంచల్యానికి ప్రతీక. కఠోర నియమాలతో కూడిన తాపసజీవనం కన్నా, సుఖదుఃఖాలతో కూడిన మానవ జీవితం గొప్పది. నాగరిక మానవులకన్నా గిరిజనులు ఇంకా స్వేచ్ఛగా బ్రతుకుతున్నారు. సుఖదుఃఖాలతో కూడిన మానవ జీవితం మాయ లేదా భ్రమ అయితే, తపశ్చరణతో సుఖదుఃఖాలకతీతమైన స్థితిని పొందడం కూడా భ్రమే అవుతుంది- ఈ రకంగా ఉంటాయి అహల్య భావనలు.

"ఈ శిలాచరిత్ర ఆర్షధర్మంనుండి, ఆర్యవర్తననుండి దిగజారిపోయేవారికి హెచ్చరికగా నిలుస్తుంది" అనే గౌతముని వాక్యమే ఈ నాటికకు భరతవాక్యం. అహల్యను శిలగా అయిపొమ్మని శపించిన తరువాత గౌతముడు తనలో "అమూల్యమైన ఒక రత్నాన్ని రాయిగా మార్చివేశానా?" అని ఎంతో బాధపడతాడు.

సౌందర్యానికీ, మానవ చైతన్యానికి ప్రతీకయైన అహల్య, చలనంలేని శిలగా మారిపోవడం ఇక్కడి విషాదం! ఈ నాటిక చదివితే అహల్య మీద జాలి కలుగుతుంది కాని జుగుప్స కలుగదు.

అహల్యా సంక్రందనుల సమాగమాన్ని పూర్వకవులు కొందరు అతివేలంగా అనౌచిత్యంగా వర్ణించారు. కాని తిలక్ మాత్రం వెన్నెలలో ఒక్క పరిష్వంగంతో సరిపెట్టారు. వెంటనే గౌతముడు వచ్చి శపిస్తాడు. తిలక్ ఔచిత్యపోషణకు ఈ సన్నివేశం మచ్చుతునక.

తిలక్ నాటికలలో "సుప్తశిల", నాటకాలలో "సుశీలపెళ్ళి" చాలా గొప్ప రచనలని నా అభిప్రాయం. తిలక్‌గారికి కూడా ఈ "సుప్తశిల" మంచి రచన అనే నమ్మకం ఉండేది. ఆయన మాటలలోనే చెప్పాలంటే-

"సుప్తశిల" అని అహల్య మీద రూపకం పూర్తి చేశాను. ఎంతో ఇష్టం నాకీ రచన, "believe it will turn out to be a fine piece" (-వరవరరావుగారికి వ్రాసిన లేఖ 15-5-1963).

3. "ఇరుగు పొరుగు":-

1959లో చైనా మన హిమాలయ సరిహద్దులలోని మెక్‌మోహన్ రేఖను అతిక్రమించి దురాక్రమణ చేసింది. 40 మైళ్ళు భారత భూభాగంలోకి చొచ్చుకొని వచ్చింది. దేశ ప్రజలంతా గగ్గోలు చెందారు. భారతదేశంలోని కమ్యూనిస్టులు మాత్రం చైనాను సమర్థించారు. దురాక్రమణ జరిగినా మన ప్రధాని నెహ్రూ సహనాన్ని పాటించారు. యుద్ధానికి అనుమతి నివ్వలేదు. దీనిని దృష్టిలో పెట్టుకొని తిలక్‌గారు ఈ నాటిక వ్రాశారు. అందులో హీరో "సిద్ధాంతం" అనే పాత్ర నెహ్రూగారి పంచశీల సిద్ధాంతాలను ప్రతిబింబిస్తుంది. 'సిద్ధాంతంభార్య', 'రాద్ధాంతం', 'నారాయణ', 'నరసింహం' - అనే పాత్రలు భారత ప్రజలకు ప్రతీకలు, 'రాద్ధాంతం' పాత్రను ప్రతిపక్షాలకు ప్రతీకగా కూడా తీసుకోవచ్చు. 'ఎరకయ్య' మన సి.ఐ.డి. వ్యవస్థకు, 'ఎర్రయ్య' భారతదేశ కమ్యూనిస్టులకు, డి.యస్.పి. మన సైన్యాధ్యక్షునకు, పోలీసులు మన సైన్యానికి ప్రతీకలు. 'ఇరుగు' భారతదేశం; 'పొరుగు' చైనా. ఇంటి వెనకాల "చౌదయ్యగారి యిల్లు" చైనాదేశం. "సీనారేకుల చౌదయ్య" చైనా ప్రధాని 'చౌ ఎన్ లే!'. చైనా టిబెట్టును ఆక్రమించడం కూడా ఈ నాటికలో సూచింపబడింది. 'పంచశీల' ఒప్పందం చేసికొని, నెహ్రూగారు చైనాను గుడ్డిగా నమ్మారు. చైనావిషయంలో నెహ్రూగారు అనుసరించిన ఉదార సిద్ధాంతాలను, శాంతియుత సహజీవన సూత్రాన్ని, పంచశీలను, తిలక్‌గారు ఈనాటికలో నిశితంగా విమర్శించారు; హాస్యరస గర్భితంగా అవహేళన చేశారు. అయితే దీనిని ప్రదర్శించిన దాఖలాలు మాత్రం లేవు.

తిలక్‌గారు ఈనాటికలో సూచించినట్టుగానే 1959లో సరిహద్దును దాటి లోపలికి వచ్చిన చైనా, 1962లో మనమీద దాడిచేసింది. చైనాచేసిన ద్రోహానికి బెంగపెట్టుకొని నెహ్రూగారు 1964లో కన్నుమూశారు. తాను దురాక్రమణ చేసిన

భాగంనుండి చైనా యింతవరకూ తప్పుకోలేదు. పైగా పాకిస్థాన్‌తో కలిసి కాశ్మీరులో కొంతభాగం కూడా కబళించింది. ఇప్పుడు అరుణాచల్ ప్రదేశ్ కూడా తనదేనని మనతో వాదిస్తోంది. ఇది మన దుస్థితి!

ఈ నాటికలో నెహ్రూగారిని ఎంతో విమర్శించిన తిలక్, 1964లో నెహ్రూ చనిపోతే చాలా బాధపడిపోయి, "నెహ్రూ" అనే గొప్పకవిత – స్మృతిగీతం వ్రాశారు.

తిలక్‌గారు కమ్యూనిస్టుల వర్గకలహానికీ, సాయుధ విప్లవానికీ, హింసా మార్గానికీ బద్ధవ్యతిరేకి. ఎం.ఎన్. రాయ్‌గారి 'రాడికల్ హ్యూమనిజం' అంటే వారికి చాలా యిష్టం.

4. పొగ:–

స్త్రీల విషయంలో "శీలం"–"పాతివ్రత్యం" అనే సామాజిక భావనలను, పాతపద్ధతిలో కాకుండా, ఆధునిక నాగరిక సమాజంలో క్రొత్తగా నిర్వచించవలసి ఉంటుందని తిలక్ ఈ నాటికలో సూచిస్తున్నారు. సమాజాన్ని ధనం పొగలా క్రమ్మివేసింది. మానవత్వాన్ని కనబడకుండా చేస్తోంది – అని శీర్షికలోని ధ్వని కావచ్చును.

ఎంతటి గొప్పకవి అయినా, ఎంతటి గొప్ప ప్రేమికుడైనా, భావనా లోకాల్లో విహరించకూడదు. త్రాగుడు, జూదం మొదలైన దుర్వ్యసనాలకు బానిసయై ధనాన్ని దుర్వ్యయం చేయకూడదు. వాస్తవిక ప్రపంచంలో జీవించాలి. కష్టపడి పనిచేయాలి. ఆనందంగా జీవించాలి. ప్రేమ వేరు, కామం వేరు. డబ్బుతో కామాన్ని తీర్చుకోగలం కాని ప్రేమను పొందలేం. తనను గాఢంగా ప్రేమించిన ధనికురాలైన యువతిని పెళ్ళిచేసికొని, ఆమెను సంతోష పెట్టకుండా నిర్లక్ష్యం చేస్తే, డబ్బంతా నాశనం చేసి, ఆమెకు నిలువ నీడ కూడా లేకుండా చేస్తే, ఆమె ఆకలి బ్రతుకు బ్రతకలేక, డబ్బుకోసం శీలాన్ని కూడా అమ్ముకొనే దుఃస్థితికి రావచ్చు – అని ఈ నాటిక హెచ్చరిస్తోంది. ఈనాటికలో "ప్రియంవద – కవి – గుజరాతీ సేట్ బన్సీలాల్ – అవ్వ" – అనే నాలుగు పాత్రలున్నాయి. "ప్రియంవద" ధనికురాలైన యువతి. కవిత్వమంటే ఆమెకు ప్రాణం. తండ్రి ఎంత చెపుతున్నా వినకుండా, అందగాడు, పేదవాడు, గొప్ప భావుకుడు అయిన 'కవి'ని పెళ్ళి చేసుకుంటుంది. అతడు గొప్పకవే కాని, త్రాగుబోతు, తిరుగుబోతు, జూదరి (పేకాట, రేసులు). ప్రియంవద ఆస్తిని, ఆభరణాలను, డబ్బును కొద్దికాలంలోనే నాశనం చేస్తాడు భర్త. చివరికి ఆమె

తండ్రి యిచ్చిన మేడ కూడా వేలం పాటకి వచ్చేస్తుంది. దాన్ని కాపాడుకోవాలంటే కనీసం పదివేల రూపాయలు కావాలి. ఆమె ఒక పార్టీకి వెళ్ళి, తన ఒయ్యారాలు ఒలకబోసి కొందరు ధనికుల్ని అప్పు అడుగుతుంది. ఎవరూ ఇవ్వరు. విసుగ్గా యింటికి వచ్చేస్తుంది. స్నానం చేస్తుంది. ఆమె అందం మీద చాలా రోజులుగా కన్నువేసిన 'బన్సీలాల్' ప్రియంవద దగ్గర పనిమనిషిగా ఉన్న 'అవ్వ'ను మచ్చిక చేసికొని, తన కోరిక తీరిస్తే 12 వేల రూపాయలిస్తానని కబురు చేస్తాడు. తన తండ్రి యిచ్చిన మేడని రక్షించుకోవాలనే తాపత్రయంతోను, రాబోయే దుర్భర దారిద్ర్యాన్ని ఊహించుకొన్న భయంతోను, మనసులో ఇష్టం లేకపోయినా విధిలేక బన్సీలాలకు లొంగిపోతుంది. అతనితో లేచిపోవడానికి కూడా సిద్ధపడుతుంది. ఇద్దరూ గదిలో ఉండగా భర్తయైన 'కవి' వస్తాడు. విషయాన్ని గ్రహిస్తాడు. తాను భార్య మనస్సును అర్థం చేసుకోకుండా, వ్యసనపరుడై, ధనమంతా మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుచేసినందుకే ఇంత పని జరిగిందని, తన తప్పుతాను తెలిసికొని, బన్సీలాల్‌తో వెళ్ళవద్దని ప్రియంవదను బ్రతిమాలుతాడు. ధనానికి ప్రాధాన్యమిచ్చే ఈసమాజం నుండి దూరంగా వెళ్ళిపోయి, కష్టపడి బ్రతుకుదామంటాడు. భర్త మీది మోహంతో గాఢమైన ప్రేమతో ఆమె అంగీకరిస్తుంది. బన్సీలాల్ డబ్బు తిరిగి అతనికి యిచ్చి వేస్తుంది. భర్తతో కలసి ఇల్లు వదలి వెళ్ళిపోతుంది.

ఈ నాటికలో "అవ్వ" అనే పాత్ర పేరునుబట్టి ముసలిది అనుకుంటాం. కాని మొదట్లోనే ఆమెకు – "ఇరవై అయిదో, ఎనిమిదో ఏళ్ళుంటాయి" అని తిలక్ స్పష్టంగా చెప్పారు. నాటిక చివర్లో ఆమె బన్సీలాల్‌ను "కొంటెగా చూసి నవ్వి, మనం గదిలోకి వెళదామా? అని సైగ చేస్తుంది" అని వ్రాశారు. అరవైయేళ్ళ ముసలిది అయితే ఇలా ప్రవర్తించదు కదా? కాబట్టి ప్రియంవదలాగే ఆమెకు "అవ్వ"అని కాకుండా ఏదైనా మరోపేరు పెట్టివుంటే ఈ confusionకి తావు వుండేది కాదు. (కాని తెలంగాణలోను ఉత్తర కర్ణాటక లోను "అవ్వ" అంటే "యువతి" అని అర్థం. నన్నయగారు కూడా ఈ శబ్దాన్ని "యువతి" అనే అర్థంలోనే వాడాడు–"అవ్వా! ఎవ్వరిదానవీవు?". కాని నేటి తెలుగు ప్రామాణికభాషలో "అవ్వ" అంటే "ముసలిది" అనే అర్థం.)

ఈ నాటిక ప్రదర్శనయోగ్యం కాదని తిలక్‌గారే అనుమానించారు. సుదీర్ఘమైన సంభాషణలు ఉండడమే ఈ అనుమానానికి కారణం కావచ్చు. పైగా పాతివ్రత్యానికి

తానిచ్చిన ఆధునిక నిర్వచనంవల్ల దీనిని ప్రదర్శించడానికి ఎవరూ సాహసం చేయరని ఆయన భావించి ఉండాలి. కాని దీనిని ఆధునిక నాటక ప్రయోక్త అయిన శ్రీ అబ్బూరి గోపాలకృష్ణగారికి పంపదలచినట్లుగా వారికి 11-12-1965 నాడు వ్రాసిన లేఖనుబట్టి తెలుస్తోంది.

5. పాదుకా పట్టాభిషేకము నందలి భరతుడు (ఏకపాత్రాభినయము):-

1957-61 ప్రాంతంలో తణుకు బోర్డుహైస్కూలులో వెంకన్న అనే గుమాస్తా ఉండేవాడు. అతడు రంగస్థల పద్యాలు రాగయుక్తంగా చక్కగా పాడేవాడు. వెంకన్న ఒక రోజున తిలక్‌గారి దగ్గరకు వచ్చి, తనకు పద్యాలతో ఒక ఏకపాత్రాభినయం వ్రాసిపెట్టమన్నాడు. హైస్కూలు వార్షికోత్సవసభలో ప్రదర్శిస్తానన్నాడు. అతని కోరిక మేరకు భరతుడు ఏకపాత్రాభినయం - వ్రాసి పెట్టారు తిలక్. పౌరాణికగాథ కాబట్టి వచనం గ్రాంథికంలో వ్రాశారు. వెంకన్న రంగస్థల నటుడు కాబట్టి పద్యాలు వ్రాశారు. వెంకన్న దీనిని తణుకు హైస్కూలులో ప్రదర్శించినప్పుడు నేను, తిలక్‌గారు వెళ్ళి చూశాము; బాగుంది.

1966లో తిలక్ గారు స్వర్గస్థులు కాగానే, తణుకులోని ఆయన అభిమానులు "తిలక్ సాహితీ సరోవరము" అనే సంస్థను స్థాపించి, "తిలక్ లేఖలు" అనే పుస్తకాన్ని 1968 జూన్‌లో ప్రచురించారు. అప్పుడు వెంకన్న దగ్గర ఉన్న ఈ వ్రాతప్రతిని తీసికొని, ఏకపాత్రాభినయాన్ని పుస్తకంలో చివర చేర్చారు. ఇది తిలక్‌గారు వ్రాసిన వ్రాతప్రతి కాదు; వెంకన్న వ్రాసుకున్న వ్రాతప్రతి. అతని ఉచ్చారణలో కొన్ని తప్పులు దొర్లాయి. వాటిని నేను సవరించాను.

ఏకపాత్రాభినయం వ్రాయడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఎదురుగా ఇంకొక పాత్ర ఉండదు కాబట్టి కొన్నిసార్లు తెరలోంచి చెప్పించాలి. కొన్ని పాత్రల సంభాషణలను ఊహించుకోవాలి. తిలక్‌గారు దశరథుని మరణవార్తను, దానికిగల కారణాలను, రాముని వనవాస విషయాన్ని తెరలోంచి చెప్పించారు. భరతుడు కైకను చంపబోగా, రాముడు వారించినట్లుగా ఊహించుకొని ఆ ప్రయత్నాన్ని విరమించాడు.

ఈ ఏకపాత్రాభినయంలో తెరలో నుండి చెప్పించిన వాక్యాలలో - కైకేయి దశరథుని రెండువరము లడిగిందని, ఆ వరములను తీర్చలేక బెంగతో దశరథుడు

చనిపోయినాడని చెపుతూ యిలా వ్రాశారు తిలక్: (కైకేయి వరములు) “ఒకటి: భరతుని పట్టాభిషేకము, రెండు: శ్రీరామచంద్రుని పదునాలుగేండ్లు అరణ్యవాసము. **ఆ ముసలిరాజేమి చేయగలడు? గుండెపగిలి చచ్చినాడు.**” ఈ డైలాగులో బోల్డుగా వుంచిన చివరి వాక్యాలు బాగాలేవు; చాలా harsh గా ఉన్నాయి. దశరథుడు చాలా గొప్పరాజు. ఆయనను గురించి ఇలా కఠినంగా మాట్లాడటం సమంజసం కాదు. “ఈ కోరికలు విని దశరథుడు హతాశుడై మూర్ఛిల్లినాడు. పుత్ర వియోగముతో మూడు దినములు శోకించి శోకించి ప్రాణములు విడిచినాడు!” అని వ్రాసినట్లయితే బాగుండేది. “గుండెపగిలి చచ్చినాడు” అనే వాక్యం ఆ రోజుల్లోనే నాకు కర్ణకఠోరంగా వినబడింది. తిలక్‌గారికి చెపుతామని నోటి చివరిదాకా వచ్చింది. కాని భయపడి ఆగిపోయాను.

ఈ ఏకపాత్రాభినయంలోని పద్యాలకు రాగాలు సూచింపబడ్డాయి. ఈ సూచనలు చేసింది వెంకన్న (తిలక్‌గారు కాదు). ఎక్కడ ఏ రాగం పాడాలో తన స్క్రిప్టులో వ్రాసుకొని ఉంచుకున్నాడు వెంకన్న. “తిలక్ సాహితీ సరోవరం” వారు వెంకన్న వ్రాతప్రతిని అనుసరించడంవల్ల ఈ లాభం జరిగింది. దీనిని ప్రదర్శించ దలచుకొన్న భవిష్యత్ నటులకు ఇది చక్కని మార్గదర్శనం. తిలక్‌గారికి సంగీతంలో ప్రవేశం లేదు; రాగాలు తెలియవు.

పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు రచించిన “పాదుకా పట్టాభిషేకము” అనే నాటకానికి నాటకరంగంలో మంచి పేరుప్రఖ్యాతులున్నాయి. దానికీ దీనికీ సంబంధం లేదు.

తిలక్ నాటకాలు:–

1. “సాలెగూడు”:–

ఇది ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీలకోసం వ్రాసిన నాటకం. విశాలాంధ్రవారు దీనిని “నాటిక” అన్నారు. అది సరికాదు. పరిషత్తు పోటీలలో నాటకానికి కాలపరిమితి ఉండడంవల్ల మామూలు నాటకంకన్నా కొంచెం చిన్నదిగా వ్రాశారు. ఒకే ఒక రంగంతో నాటకమంతా వ్రాయడంవల్ల దీనిని ఏకాంకికగా భావించి ‘నాటిక’ అని ఉంటారు. కాని ఇది నాటకమే. మా మిత్రులంతా కలిసి దీనిని ప్రదర్శించారు. కొన్ని కారణాలవల్ల పరిషత్తులో దీనిని ప్రదర్శించలేక

పోయాం. తరువాత డా॥ తేతలి నరసింహారావుగారు దీనిని తణుకు టౌనుహాలులో విజయవంతంగా ప్రదర్శించారు.

యువతీయువకుల మధ్య ఉండే ప్రేమే దీనిలోని కథావస్తువు. నాయికా నాయకులలో ఒకరు ధనికులై ఉండటం, మరొకరు పేదవారుగా ఉండడం తిలక్ నాటికా – నాటకాలలో సర్వసాధారణం. ఇందులో నాయిక 'సావిత్రి' ధనికురాలు. నాయకుడు 'ప్రసాద్' డాక్టరు, పేదవాడు. ఇద్దరినీ చిన్నతనంనుండీ ప్రొ॥ విశ్వనాథంగారు పెంచుతారు. సావిత్రి విశ్వనాథంగారి కూతురుగానే పెరిగింది. ఆమెకు సంప్రదాయం, కులీనతల మీద గట్టినమ్మకం. సావిత్రి ప్రసాద్ ప్రేమించుకుంటారు. నరసింహం అనే ప్రతినాయకుడు (విలన్) సావిత్రిని ప్రేమించి విఫలుడవుతాడు. ఆ పగతో వారిప్రేమకు భంగం కలిగించాలని చూస్తాడు. ప్రసాద్ ఒక విధవరాలైన కులటకు పుట్టాడని సావిత్రితో చెపుతాడు. దానికి ఆధారంగా ఒక చీటీ చూపుతాడు. ఆమె నమ్ముతుంది. ప్రసాద్ ఎంత చెప్పినా వినదు; అతనిని పొమ్మంటుంది. క్లైమాక్సులో కులటయైన విధవరాలికి పుట్టినది తానేనని విశ్వనాథంగారిద్వారా తెలుసుకొని, పశ్చాత్తాప పడుతుంది. అందరూ నరసింహాన్ని అసహ్యించుకుంటారు. "శేషగిరి", "వర్మ" (ఆధునిక కవి), "యాజులు" (ఆంధ్రత్వవాది) అనే పాత్రలద్వారా ఎంతో హాస్యాన్ని పండించారు తిలక్ ఈ నాటకంలో.

పాతివ్రత్యాన్ని గురించి, పవిత్రతను గురించి, కులీనతను గురించి, నడవడికను గురించి, నీతిని గురించి, ధర్మాన్ని గురించి మన సమాజంలో పాతుకుపోయిన సనాతన అభిప్రాయాలను ఖండించి, అభ్యుదయ దృక్పథంతో మన సంఘం పురోగమించాలని తిలక్‌గారు ఈ నాటకం ద్వారా ప్రబోధించారు. పతాక సన్నివేశంలో విశ్వనాథంగారు సావిత్రితో ఇలా అంటారు. "ధర్మం అంటే ఏమిటో నీకు తెలియదు. పవిత్రత అంటే ఏమిటో నీకు తెలియదు. ప్రేమే అన్నిటికన్నా ఉత్తమ ధర్మం. సృష్టి ప్రేమమూలంగా ఏర్పడింది. ప్రేమవల్లనే సృష్టి నిలుస్తోంది."

'నరసింహం' అనే విలన్ పాత్రమీద షేక్స్పియర్ "జులియన్ సీజరు", "ఒథెల్లో" నాటకాలలోని విలన్ల ప్రభావం ఉంది. అలాగే సావిత్రి పాత్ర మీద రవీంద్రనాథ్ టాగూరు గారి 'గోరా' నవల ప్రభావం కనబడుతుంది.

1959లో ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీలు మా తణుకులో జరిగాయి. అప్పుడు తిలక్‌గారు, నేను వాటిని క్రమం తప్పకుండా చూశాము.

ఈ నాటకానికి మొదట "సాలెపురుగు" అని పేరు పెట్టారు తిలక్. నాటకంలో రెండు మూడు చోట్ల విలన్ నరసింహాన్ని ఉద్దేశించి "సాలెపురుగు" అనే మాట వస్తుంది. కాని ఎవరో ఈ పేరు బాగా లేదన్నారు. పైగా ఈ నాటకం పరిషత్తు పోటీలకు వెడుతోంది కూడా. అందువల్ల "సాలెపురుగు" అనే పేరును. "సాలెగూడు"గా మార్చారు తిలక్.

తన నాటకాలలోని పాత్రలకు "సావిత్రి" - "సుశీల" - "సుచిత్ర" - "ప్రియంవద" "ఎల్లయ్య" మొదలైన పేర్లు సాభిప్రాయంగా పెట్టేవారు తిలక్.

2. "సుశీలపెళ్ళి":-

"సాలెగూడు" నాటకాన్ని వ్రాసిన తరువాత ఈ నాటకాన్ని రచించారు తిలక్. ఈ రచనలో గొప్ప పరిణతి కనబడుతుంది; ప్రతిభ కనబడుతుంది. మన వివాహవ్యవస్థలోని డొల్లతనాన్ని బయటపెట్టడం, ప్రేమయొక్క ఔన్నత్యాన్ని చాటి చెప్పడం ఈనాటకంలోని ప్రధానాంశం. 'సుశీల'-'సూర్యం' అనే ఇద్దరు మధ్యతరగతి యువతీయువకులు ప్రేమించుకుంటారు. అనుకోని పరిస్థితులలో సుశీల 'ప్రభాకరం' అనే ధనికయువకుణ్ణి, ఆధునికభావాలు కలవాడిని, ఉదారగుణం కలవాడిని పెండ్లి చేసుకుంటుంది. అయినా సరే, ప్రేమించిన సూర్యాన్ని మరచిపోలేక పోతుంది. పెండ్లికి - ప్రేమకి ఘర్షణ ఏర్పడుతుంది. దీనికి నేపథ్యంలో పేదవాడికి - ధనికుడికి ఉండే తేడాలు, సంప్రదాయవాదికి-అభ్యుదయవాదికి ఉండే తేడాలు, హరిజనోద్ధరణ కనబడతాయి. సుశీలసూర్యాన్ని గాఢంగా ప్రేమించిందని తెలిసికొన్న ప్రభాకరం ఆమె మెడలోని తాళిని త్రెంపివేసి, సూర్యంతో వెళ్ళిపొమ్మంటాడు. ఇద్దరినీ తిరిగి పెళ్ళిచేసుకోమంటాడు. భారతీయ సంప్రదాయాన్ని గౌరవించే సూర్యం ఒకరి భార్యను తన భార్యగా స్వీకరించలేను అంటాడు. ఇద్దరి మధ్యా తాను ఆటవస్తువును కానని సుశీల తన వ్యక్తిత్వాన్ని చాటుకుంటుంది. సమాజసేవకు, హరిజనోద్ధరణకు తన జీవితాన్ని అంకితం చేసుకుంటుంది.

తిలక్ నాటికలలో "సుప్తశిల" ఎంత గొప్పదో, నాటకాలలో "సుశీలపెళ్లి" అంత గొప్పది. ఒక రకంగా సుప్తశిలకు ఆధునికరూపమే సుశీలపెళ్ళి - అని

చూడా చెప్పవచ్చును. శరత్ "దేవదాసు" నవల ప్రభావం, షేక్స్‌పియర్ "ఒథెల్లో" నాటక ప్రభావం (జేబురుమాలు సంఘటన) ఈ నాటకం మీద కొంత కనబడతాయి. ప్రేమ-పెండ్లి- మానవత్వం మొదలైన వాటిని గురించి కొన్ని లోకోత్తరమైన సిద్ధాంతాలు చేశారు తిలక్ ఈ నాటకంలో-

1. "రెండు దేహాలు కలిస్తే స్నేహం అవొచ్చును; పొరపాటు అవొచ్చును; వ్యభిచారం అవొచ్చును. కాని రెండు మనస్సులు కలిస్తేనే కాని వివాహం కాదు!"
2. "భయమూ, భక్తీ ఏనాటికీ ప్రేమ కావు" - "వివాహానికి ప్రేమ ప్రాతిపదిక."
3. "కరుణకన్న గొప్పధర్మం లేదు. స్వతంత్రంకన్న గొప్పసూక్తి లేదు. మానవశ్రేయస్సుకన్న గొప్పగమ్యం లేదు."

ప్రదర్శనకు మిక్కిలి అనుకూలమైన నాటకం ఇది. కేవలం పఠించినప్పుడు కూడా ఎంతో ఉత్కంఠను కలిగిస్తుంది. ఏకబిగిని చదివిస్తుంది.

తిలక్ నాటకాలను ప్రదర్శించే "బృందావన కళాసమితి"లో ఆజానుబాహుడు, స్ఫురద్రూపి, చేయెత్తు మనిషి అయిన శ్రీ చిట్టూరి సూర్యారావు ఉండేవాడు. అతనిని దృష్టిలో పెట్టుకొని ఈ నాటకం వ్రాశారు తిలక్. ఇద్దరు హీరోలలో ఒకరికి 'సూర్యం' అనే పేరు కూడా పెట్టారు. ఆ చిట్టూరి సూర్యారావు, మరో మిత్రుడు లకంసాని శ్రీరామకృష్ణ కలిసి 'ప్రభాకరం' - 'సూర్యం' పాత్రలు ధరించి, తణుకు 'మారుతీ టాకీస్' లో ఈ నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించారు.

తిలక్ లఘువ్యాసాలు:-

1. "కవిత్వం అంటే":- ఇది మొదట 1940 ప్రాంతంలో మద్రాసునుండి వెలువడే "ఆనందవాణి" లో ప్రచురింపబడింది. ఆ పత్రిక సంపాదకులు 'ఉప్పులూరి కాళిదాసుగారు' తిలక్‌కి మంచి మిత్రులు, బంధువులు. తరువాత ఈ వ్యాసం 27-1-2008 నాడు హైదరాబాద్‌నుండి వెలువడిన "తిలక్ సాహితీ సమాలోచనమ్"లో పునర్ముద్రితమయింది.

కవిత్వం అనిర్వచనీయమైనది. దానిని మనసుతో ఆనందించగలం కాని మాటలతో చెప్పలేం. "కవిత్వం మనసుకీ ఉద్రేకాలకీ సంబంధించినది. ఆ మనస్సునీ

ఉద్రేకాల్ని కొలిచే సరియైన మానం యిదివరకు లేదు; ఇక ముందు రాదు" అని తిలక్‌గారి తీర్మానం. "కవిత్వం" బ్రహ్మపదార్థం లాంటిది. ఏ ఒక్క నిర్వచనానికి లొంగదు" – అని గట్టిగా భావించిన తిలక్ గారు, ఈ చిన్నివ్యాసంలో కవిత్వమంటే ఏమిటో విడమరచి చెప్పి, దానికి ఒక నిర్వచనం ఇవ్వడానికి ఎంతో ప్రయత్నించారు. "కవిత్వం అంటే ఒక విశిష్టానుభూతిని కవి పాఠకుడికి సరఫరాచేసే శక్తి, అక్షరాల కూర్పు అన్నమాట" అని ఒక చక్కటి నిర్వచనం, అతిసులభమైన నిర్వచనం మనకిచ్చారు.

2. "హృదయం విప్పి":– ఇది "నవత" (త్రైమాసిక), తృతీయ సంచికలో (1964, సెప్టెంబరు 15) వచ్చిన వచనకవితకు సంబంధించిన ఒక శీర్షిక. దీనిక్రింద కుందుర్తిగారు ఒక చిన్నవ్యాసం, తిలక్‌గారు మరో చిన్నవ్యాసం వ్రాశారు. "నవత" ద్వితీయ సంచికలో కుందుర్తిగారు వెలిబుచ్చిన ఒక అభిప్రాయానికి వ్యతిరేకంగా తిలక్‌గారు వ్రాసిన వ్యాసం యిది. అందులో కుందుర్తిగారు "నేటివరకూ వచనగేయం కవితాఖండికల రూపంలోనే కాలం గడుపుతోంది. సంపూర్ణ కావ్యదృష్టి అలవరచుకోలేదు" అని చెపుతూ, వచన కవిత్వం సమగ్రరూపం ధరించాలంటే, దానిలో కథానికలు, నాటికలు, మహాకావ్యాలు రావాలని ఆశించారు. దీనికి సమాధానంగా తిలక్‌గారు మన కవిత్వచరిత్రను చెపుతూ, ప్రాచీనకాలంలో (పురాణకాలంలో అంటే భారత, రామాయణాలలో) కథ + కవిత్వం కలిసి ఉండేవనీ, ప్రబంధకాలం వచ్చేసరికి కథాప్రాముఖ్యం తగ్గిపోయి వర్ణనలు పెరిగాయనీ, ఆధునికకాలంలో కథాప్రాధాన్యం పూర్తిగా పోయి, కవిత్వంనుండి కథ విడిపోయి, కథానికలలోకి, నవలలోకి, సాంఘిక నాటకాలలోకి వెళ్ళిపోయిందనీ తిలక్ అభిప్రాయపడ్డారు. ఈనాటి కవిత్వం కథజోలికి వెళ్ళకుండా, "వస్తుస్వరూపాలకూ, సంఘర్షణలకూ, శక్తులకూ మూలమైన కీలకస్థానం మీద శక్తిమంతమైన బ్యాట్రీలైటు ఫోకస్ చెయ్యాలి" అని తిలక్ ఈ చిన్న వ్యాసంలో తీర్మానించారు. (ఇది తిలక్ సర్వలభ్యరచనల సంకలనంలో "కథాకావ్యం" అనే పేరుతో ముద్రితమయింది.)

3. కావ్యసృష్టి:– ఈ వ్యాసం భారతి, జూన్ 1944లో వచ్చింది. కవియొక్క అవ్యక్తమైన అనుభూతిని సువ్యక్తం చేయటంలోనే కవిత్వంయొక్క ప్రక్రియ జరుగుతుంది. కవి చేయవలసింది ప్రకటన కాదు – అనుభవాన్ని తెలియజేయడం.

కవి తన అవ్యక్తమైన అనుభూతిని అలంకారాలతో కూడిన వర్ణన ద్వారా తెలియజేస్తాడు. కవికీ వర్ణనకీ చాలా అవినాభావ సంబంధం వుంది. కవి మనఃస్థితికి వర్ణన లొంగిఉండాలి. వర్ణనవిధానానికి కవి లొంగినపుడు నిర్జీవమయిన కవిత వస్తుంది. మంచి కవిత్వానికి కాళిదాసు శ్లోకాలను ఉదాహరించారు తిలక్.

4. గాంధీజీ జీవితం ఒక మహాకావ్యం:– ఆవంత్స సోమసుందర్‌గారి "కళాకేళి" పత్రిక సెప్టెంబరు 1969లో ప్రకటింపబడిన వ్యాసం. గాంధీని విడదీసి భారతదేశాన్ని చూస్తే దేశం అంతా కొత్తగా, మనది కానట్టుగా కనిపిస్తుంది. గాంధీజీ మృతికి ప్రతిహృదయంలోనూ కొంత శ్మశానం ఏర్పడింది. గాంధీజీ తాను చెప్పినదానికన్న, చేసినదానికన్న గొప్పవాడు. ఏసుక్రీస్తు, బుద్ధుడు, గాంధీ లాంటివారు ఏవో కొన్ని యుగాలకు కాని భూమి మీద అవతరించరు. అయితే వారులేని చరిత్ర నిస్సారమైనది. గాంధీజీ మతవిశ్వాసమూ, దైవభక్తి ఈనాడు విద్యాధికులలో ఒక భాగానికి రుచించవు; అర్థమూ కావు. కాని అదే విశ్వాసంతో ఎన్నో పురాతన సంప్రదాయాల మీద, విశ్వాసాల మీద దాడి చేశాడు. రామనామ సంకీర్తన కావిస్తూనే హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించాడు. సత్యమూ అహింసా అన్న యీ రెండు ఆదర్శాలూ గాంధీజీ కొత్తగా ప్రవచించినవి కావు. ఉత్తమాటలుగా చప్పబడిపోయిన వీటికి మళ్ళీ కొన్నివేల వోల్టుల చైతన్యాన్ని కలిగించాడు. గాంధీజీ యింత గొప్పవాడైనా, ఆయన మతాన్ని రాజకీయాల్ని కలపడం మాత్రం తిలక్‌గారికి రుచించలేదు.

5. హేమంత హసంతిక (సాహిత్య సంభాషణలు – 1) :– అసంపూర్ణవ్యాసం. ఇది ఆంధ్రపత్రిక ఉగాదిసంచిక 1972లో ప్రకటితమయింది. "హసంతిక" అంటే కుంపటి. ఇది చలికాలంలో వెచ్చటి కుంపటి లాంటి సాహిత్య సంభాషణ. "There is an awful warmth about my heart like a load of immortality" అనే కీట్సుమహాకవి వాక్యాన్ని తీసికొని గొప్పకవిత్వంయొక్క లోతుల్ని ఆవిష్కరించారు తిలక్. గొప్పకవిత్వం సృష్టియొక్క అద్భుతత్వాన్నీ రహస్యాన్నీ అందుకునేటట్టు చేస్తుంది. ఫీలింగుకు సంబంధించినది కవిత్వం. ఇంద్రియాలూ, ఉద్రేకాలూ కవి విహరించే క్షేత్రాలు. సమాధిలో సాధనలో ఒక జ్ఞాని సాధించగలిగినదాన్ని, కవి కులాసాగా తన ఫీలింగ్ ద్వారా పొందగలడు. కవి మనిషికీ ప్రకృతికీ ఉన్న ఒక అద్వైతాన్ని, అంతర్లీనంగా ఉన్న ఒక సంబంధాన్ని సహజంగా గుర్తిస్తాడు. తనలోంచి

తాను విడిపోయి అంతటా పరుచుకుంటాడు. వట్టి ఆధ్యాత్మిక వేదాంత ప్రవచనాలు కవిత్వం అవవు. ఆర్ద్రత ఉండాలి. ప్రగాఢ జీవితంయొక్క ముద్ర ఉండాలి. అందుకే వాల్మీకీ, కాళిదాసూ, షేక్స్పియరూ అందరూ జీవితం రుచి తెలిసినవాళ్ళు. అందమైన ఆడదీ, సంధ్యాదృశ్యమూ, మోడైన చెట్టూ – యివన్నీ కూడా ఒక అలౌకిక ఆధ్యాత్మిక భావన అంత తీవ్రంగానూ ఆకర్షిస్తాయి. విలియమ్ బ్లేక్, తిక్కన, కృష్ణశాస్త్రి, కాళిదాసుల కవిత్వాలలోని ఆధ్యాత్మిక భావనతో కూడిన అనుభూతిని విశ్లేషించి చూపారు తిలక్. మంచికవిత్వం అర్థమైనట్టు తోస్తుంది. కాని ఇంకా ఆ కవితలో, కవితచుట్టూ ఏదో గారడీ వున్నట్లూ, మనకి దొరకకుండా తప్పించుకుంటూన్నట్టు అనిపిస్తుంది. ఈ గుణాన్ని మనం “ధ్వని” (Suggestion) అని కూడా పిలవొచ్చును.

6. కృష్ణశాస్త్రి (అసంపూర్ణ వ్యాసం) :– ఈ వ్యాసాన్ని నాలాగే తిలక్‌గారి ముఖ్యశిష్యుడైన డా॥ శ్రీపాద కృష్ణమూర్తి సేకరించి ఆంధ్రజ్యోతి దినపత్రికకు పంపించాడు. దానిలో 24–2–1992 నాడు ప్రచురింపబడింది. 1947 ఆగస్టు 15వ తేదీకి ముందు మూడు దశాబ్దాలపాటు కృష్ణశాస్త్రి నవ్యకవిత్వం, భారత జాతీయోద్యమంలాగే దేశంలో గొప్ప ఉద్రిక్తతనీ, వేడినీ కలిగి ఉండేది. అంతవరకూ వచ్చిన సాంప్రదాయిక శృంఖలాబద్ధమైన కవితను చెరనుండి విడిపించిన కాంగ్రెసు వంటిది కృష్ణశాస్త్రి నవ్యకవిత్వోద్యమం. దేశంలో ఇంగ్లీషుసాహిత్య ప్రభావం, రవీంద్రుని వినూత్నరచనా ప్రభావమూ, ఒక ప్రక్క రూపొంది ప్రచండంగా తయారయ్యే జాతీయభావమూ, సంఘంలో ఉండే లక్షలాది మౌఢ్య ఆచారాల నెదుర్కొనే సంస్కారోద్రేకమూ – వీటన్నింటికీ అవినాభావ సంబంధం వుంది. ఆ ఉద్రిక్త సమయాల్లో జనం అటోయిటో చీలిపోయేవారు. కొత్తకి స్వాగతం ఇచ్చి ఆకాశానికెత్తేసేవారు కొందరూ, కొత్తని దుయ్యబట్టి పాతాళానికి తొక్కేసేవారు కొందరూ – సాహిత్యాన్ని సాహిత్యంగా ఆలోచించుకోవలసిన కుదురూ, నెమ్మదీ, నిదానం అప్పుడు లేవు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అంతా నెమ్మదించింది. పాశ్చాత్య విజ్ఞానం:– భారతీయ విజ్ఞానం – విచిత్రంగా చాలా చోట్ల తెలియకుండా కలుసుకు పోయాయి. ఉద్రేకోత్సాహాలలోంచి నిర్మాణాత్మకమైన జాగ్రత్తలో పడ్డాము. ఇప్పుడు కవిత్వం ఉద్యమం కాదు. ఎవరికి వారు తమ ఇళ్ళల్లో కూర్చుని వ్రాసుకుంటున్నారు.

ఇప్పుడు కృష్ణశాస్త్రిని అందరూ ఒప్పేసుకున్నారు, ఆయన్ని ఒక ప్రమాదంగా ఎంచడం మానివేశారు. నిజమైనకవి ప్రతివాడూ గొప్ప ప్రతిభావంతుడు. అతని చైతన్యం బహుపదునైనది. అతని త్వగింద్రియం కూడా వేలమైళ్ళ దూరాన ఉన్నదానిని స్పృశించి పులకరించగలదు. అటువంటి ప్రతిభకలవాడు కృష్ణశాస్త్రి. అందుకే కృష్ణశాస్త్రి నిజమైన కవి.

7. "కథలు వ్రాయడం ఎలా?":– మొదట "శార్వరి"గారి సంపాదకత్వంలో వెలువడిన "కథలెలా రాస్తారు?" అనే వ్యాససంకలనంలో వచ్చింది. తరువాత ఈ పుస్తకాన్ని విశాలాంధ్ర ప్రచురణాలయంవారు 1992లో పునర్ముద్రణ కావించారు. ఒక కథ వ్రాయడానికి ఒక నిర్దిష్టపద్ధతీ ప్రకారమూ ఉంటాయని చెప్పలేం. మానసిక చర్యలకు ఒక కొలమానం వుండదు. కథలు మనసుల్నీ మనసులున్న మనుషుల్నీ ఆధారం చేసుకుని ఉంటాయి. కాబట్టి ఇలాగ వుండాలి అని నిర్దేశించలేము. కథ తన స్వభావాన్నిబట్టి తన రూపాన్ని ఏర్పరచుకుంటుంది. ప్రతిరచయితకీ మొదటి శ్రోతా విమర్శకుడూ తనే. ఈ శ్రోతయొక్క పక్వ స్థితినిబట్టి కథకుడికి బలం ఏర్పడుతుంది. ఈ మనిషిలోని మనిషికి నలుగురు పెద్ద కథారచయితలలో పరిచయమూ, లోకజ్ఞానమూ, విమర్శాశక్తి వుండాలి. దీన్నే పెద్దలు వ్యుత్పత్తి, ప్రతిభా అని పిలిచేవారు. ప్రతిసాహిత్య ప్రక్రియకీ యీ రెండూ చాలా ముఖ్యం. ఊరికే ఊసుపోకకు వ్రాసే కథలు వేరు. వాటికి మనుగడ ఉండదు. కథకుడు విశిష్టార్థప్రతిపాదకమైన ఇతివృత్తాన్ని కాని, సంఘటనను కాని చిత్రించాలి. ప్రతీకథా మనకి జీవితంతో, జీవితరహస్యంతో, జీవిత వైచిత్రితో కొంత కొత్తపరిచయం కలగచెయ్యాలి. మన సానుభూతిని విశాలం చెయ్యాలి. కథ ఒక మనస్తత్వానికీ, ఒక చిన్న సంఘటనకీ, ఒక స్వభావానికీ సంబంధించి వుంటుంది. కాని ఆ పరిధిలోనే ఒక విశిష్టతని ప్రదర్శించాలి. మామూలు సంఘటనల వెనకా, స్వభావాల వెనకా ఉన్న ఒక యథార్థాన్ని అనువదించకలగాలి.

ఒక సంఘటనను ఉన్నదున్నట్లు చిత్రిస్తే రిపోర్టింగ్ అవుతుంది కాని కథ అవకపోవచ్చును. దాన్ని కథగా మార్చేందుకు కొన్ని మార్పులు చేర్పులు చెయ్యవలసిన అవసరం వుంది. కథ వాస్తవికమైన ఫొటోగ్రఫీ కాదు; వాస్తవికమైన వ్యాఖ్యానం మాత్రం. కథకుడికీ, నవలాకారుడికీ జీవితమే లేబరేటరీ. రకరకాల జీవితం, దాన్ని నడిపించే సామాజిక చారిత్రక శక్తులూ, వ్యక్తిగతమైన మనస్తత్వాలూ,

ఉద్రేకాలూ – ఈ జీవితార్ణవంలో శోధించిన కొలదీ తరగని విశేషాలు వింతలూ బయల్పడుతుంటాయి. కథారచయితకి అన్ని రకాల మనుష్యులు ఆప్తులు. రచయిత తనకి ఉన్న సిద్ధాంతాల్నీ, మంచి చెడ్డల దృక్పథాన్ని ఆధారం చేసుకుని మనుషుల్ని కేటాయించకూడదు. వాళ్ళ ఉద్రేకాలూ, ఊహలూ ఒక నిర్ణీత పథానికి లొంగి వుండవు. ప్రతిమనిషిలోనూ ఒక గొప్పతనం వుంటుంది.

8. "కావ్యరసం":– ఆంధ్రపత్రిక ఉగాది ప్రత్యేక సంచిక. సంవత్సరం తెలియలేదు. ఇది డా॥ శ్రీపాద కృష్ణమూర్తి నాతో చెప్పిన విషయం. ఒకవేళ ఇది ఈ గ్రంథంలో ఉన్న "హేమంత హసంతిక" వ్యాసమే కావచ్చును. నిశ్చయంగా చెప్పలేను.

9. "యుద్ధమూ–రచయిత":– సాహిత్య మానసపత్రిక "సాహితి" 1963 ఏప్రిల్ సంచికలో వచ్చినట్లుగా తిలక్ లేఖలను బట్టి తెలుస్తోంది. 28–03–1963 నాడు శ్రీవరవరరావుగారికి వ్రాసిన లేఖలో తిలక్ ఈ వ్యాసాన్ని గురించి ప్రస్తావించారు. ఈ సాహితిసంచికకోసం నేను ప్రయత్నించి విఫలుడనయ్యాను. ఎవరైనా సేకరిస్తే సంతోషిస్తాను. ఈ వ్యాసం ఆ సంచికలో తప్పక ఉన్నదని, 'సాహితి' 1963 సంవత్సరాంతంలో వేసిన 12 సంచికలలోనూ ఉన్న విషయ సూచికల పట్టికను బట్టి మిత్రులు శ్రీ ఎం.వి. రాయుడుగారు (మనసు ఫౌండేషన్) నాతో చెప్పారు. వ్యాసం పేరుకూడా ఆయనే చెప్పగలిగారు.

10. తిలక్ ఇంటర్వ్యూలు:–

10.1 గోలకొండ పత్రికలో ఇంటర్వ్యూ:– గోలకొండ పత్రిక విలేఖకుడు శ్రీబాసాని సుదర్శనరెడ్డిగారు, 1965 జనవరి నెలలో తిలక్‌గారు హైదరాబాద్ వచ్చినప్పుడు వారిని ఇంటర్వ్యూ చేశారు. అయితే వారు ఈ ఇంటర్వ్యూను "ప్రశ్నలు–జవాబులు" రూపంలో ముద్రించలేదు. తిలక్‌తో తాను జరిపిన ఇష్టాగోష్ఠి ఆధారంగా ఒక వ్యాసం క్రింద వ్రాసి ప్రచురించారు. ఈ వ్యాసం తిరిగి "నవత" అనే సాహిత్య త్రైమాసిక పత్రిక 1968 ఏప్రిల్–జూన్, 7వ సంచికలో పునర్ముద్రణ పొందింది.

10.2 "ఆనందవాణి" – తిలక్ ప్రత్యేక సంచికలో ఇంటర్వ్యూ:– 1966 జూన్ 30వ తేదీ రాత్రి తిలక్ నిర్యాణం. దీనికి సరిగ్గా నెలా రెండు నెలలకు ముందు ప్రముఖ రచయిత వా.స.మూర్తిగారు తణుకు వెళ్ళి తిలక్‌గారిని కలిశారు.

అప్పుడు తిలక్‌గారి ఏకైక పుత్రిక "చంద్రలేఖ" పెండ్లిపనులు జరుగుతున్నాయి. వాసమూర్తిగారు ఒక రోజంతా తిలక్‌గారితో గడిపి, అనేక సాహిత్య విషయాలు చర్చించారు. ఈ యిష్టాగోష్ఠి అంతా "తిలక్‌తో కొన్ని గంటలు" అనే పేరుతో ఒక పెద్దవ్యాసంగా వ్రాశారు. ఇది 1969 "ఆనందవాణి-తిలక్ ప్రత్యేక సంచిక"లో ముద్రింపబడింది. అయితే ఈ ఇంటర్వ్యూ కూడా "ప్రశ్నలు-జవాబులు" పద్ధతిలో రాలేదు. వాసమూర్తి గారు వ్రాసిన వ్యాసరూపంలోనే వచ్చింది.

ఈ ఇంటర్వ్యూలు రెండూ తిలక్ సర్వలభ్య రచనల సంకలన గ్రంథం చివర్లో ఉన్నాయి చూడండి.

తిలక్ లేఖలు:-

ఆధునికయుగంలో ప్రసిద్ధకవులు, రచయితలు లేఖారచనను ఒక నూతన సాహిత్య ప్రక్రియగా అభివృద్ధి చేశారు (ఇది ఆంగ్లసాహిత్య ప్రభావమే అనడంలో ఏమీ సందేహం లేదు). చలంగారి లేఖలు మిక్కిలి ప్రసిద్ధమైనవి. (ఇప్పుడు ఫోన్లు, సెల్‌ఫోన్లు వచ్చాక ఈ ప్రక్రియ పూర్తిగా అంతరించిపోయింది). తిలక్‌గారు తన రెండవ సాహిత్యదశ (1954-1966) లో ముఖ్యంగా 1959 నుండి 1966లో తాను మరణించేంతవరకు, లేఖాప్రక్రియను పరిపుష్టం చేశారు. ఆయన స్వతహాగా స్నేహశీలి, సౌందర్యారాధకుడు, గొప్ప భావుకుడు, గొప్పకవి కావడంవల్ల ఈ లేఖలకు మంచి సాహిత్యపరిమళం వచ్చింది.

తిలక్ ఎందరో కవిమిత్రులకు ఎన్నో లేఖలు రాశారు. అందరూ వాటిని భద్రపరచుకున్నారో లేదో తెలియదు. ఒకవేళ భద్రపరచినా ప్రచురణకర్తలకు ఇచ్చారో లేదో తెలియదు, పోయినవి పోగా, సుమారు 70 లేఖలు లభించాయి. (ప్రసిద్ధ కవులు, రచయితలు తాము వ్రాసిన లేఖలకు నకళ్ళు పెట్టుకొని వుంటే ఎంత బాగుండేది! ఆ కాలంలో జిరాక్స్ మెషిన్లు లేవుకదా!) 1966 జూన్ 30వ తేదీ రాత్రి తిలక్‌గారు 45 ఏళ్ళు కూడా నిండని నడివయస్సులో చనిపోగానే, మా తణుకులోని ఆయన మిత్రులు, అభిమానులు- ముఖ్యంగా శ్రీమతి మోగంటి మాణిక్యాంబాదేవి గారు, "తిలక్ సాహితీ సరోవరము" అనే సంస్థను స్థాపించారు. తిలక్ తనకు వ్రాసిన లేఖలు, శ్రీయుతులు సోమసుందర్, వరవరరావు, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, మిరియాల రామకృష్ణ, "జానకీ జాని" - అనే మిత్రులకు వ్రాసిన లేఖలు మొత్తం 63 సేకరించారు. 1968 జూన్ నెలలో "తిలక్ లేఖలు" అనే

పేరుతో 76 పుటల లేఖలు, మరో 62 పుటల "వ్యాసానుబంధం", 6 పుటల పీఠికలుకలిపి, మొత్తం 144 పుటల గ్రంథాన్ని ప్రచురించారు. "వ్యాసానుబంధం"లో తిలక్‌గారిని స్మరిస్తూ వివిధకవులు, రచయితలు, వ్రాసిన కవితలు, వ్యాసాలు ఉన్నాయి. వ్యాసరచయితలలో మా తణుకులో ఉండిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ముదిగంటి జగ్గన్నశాస్త్రిగారు, తిలక్‌గారికి హైస్కూలులో తెలుగు బోధించిన గురువు "తెలుగు రాజుగారు" అనబడే పండిత పెన్మెత్స సత్యనారాయణ రాజుగారు కూడా ఉన్నారు.

"తిలక్ సాహితీ సరోవరము" వారు ప్రచురించిన 63 లేఖలకు, నేను మరికొన్ని చేర్చాను. "నవత"లో ప్రచురితమైన మరో 7 లేఖలు, నాకు తిలక్ గారు వ్రాసిన 4 లేఖలు కలిపాను. మొత్తం 74 లేఖలు అయ్యాయి. ఈ సంఖ్యకు మరొకటి చేర్చాలి. తిలక్‌గారు 16.4.1959 నాడు ఆచంట జానకిరాంగారికి వ్రాసిన పెద్దలేఖను నేను 1966లోనే సంపాదించాను. దీనిని ఈ గ్రంథంలోని మొదటి వ్యాసంలో ("తిలక్ అభిరుచులు-అలవాట్లు"లో) ఇచ్చాను చూడండి. అయితే తిలక్ లభ్యరచనల సంకలనంలో ఈ లేఖను చేర్చడం మరిచిపోయాను. ఈ లేఖతో కలిపితే లభించిన తిలక్ లేఖలు మొత్తం 75 అవుతాయి.

"తిలక్ సాహితీ సరోవరము" లేఖలు:-

తిలక్‌గారు ఎక్కువ లేఖలు వ్రాసింది ప్రసిద్ధ అభ్యుదయకవి డా॥ ఆవంత్స సోమసుందర్‌గారికి, విప్లవకవి డా॥ పి. వరవరరావుగారికి, డా॥ మిరియాల రామకృష్ణగారికి, శ్రీమతి మోగంటి మాణిక్యాంబాదేవిగారికి. సోమసుందర్‌గారికి 4-4-1952 నుండి 12- 4-1966 వరకు 21 లేఖలు వ్రాశారు (కార్డును చిన్న లేఖగాను; ఇన్ లాండ్ లెటర్‌నూ, కవరునూ పెద్దలేఖగాను భావించవచ్చును). వీటిలో కార్డులకన్న కవర్లే ఎక్కువ. అంటే పెద్దలేఖలే అధికం. ఈ లేఖలన్నింటికీ సోమసుందర్‌గారు ప్రస్తావనలు, సందర్భాలు వ్రాసి, ఒక అనుస్యూతం (continuity) కలిగించారు. అందువల్ల ఒక కథలాగ చదవడానికి interest కలిగిస్తోంది. మిగిలిన వారు ఈ పనిచేయలేదు. సోమసుందర్‌గారికి మొదటిలేఖ 1952లో వ్రాసినా, తిరిగి 1959 వరకూ తిలక్‌గారు ఏమీ వ్రాయలేదు. మరల 1959-1966 మధ్య విరివిగా లేఖలు వ్రాశారు.

28-3-1963 నుండి 1966 ఏప్రిల్ వరకూ వరవరరావుగారికి 17 లేఖలు వ్రాశారు తిలక్. వీటిలో చిన్నవీ, పెద్దవీ ఉన్నాయి. ఒక ఆంగ్లలేఖ కూడా ఉంది.

ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారికి 15-7-1964 నాడు వ్రాసిన ఒకే ఒక లేఖ (పెద్దది) ఉంది. దీంట్లో సంప్రదాయవాదుల్ని కొంచెం శ్రుతిమించి విమర్శించారని అనిపిస్తుంది. 20-4-1961 నుండి 18-6-1966 వరకు మిరియాల రామకృష్ణగారికి 15 లేఖలు వ్రాశారు తిలక్. వీటిలో కొన్ని చిన్నవీ, కొన్ని పెద్దవి ఉన్నాయి.

26-2-1961 నుండి 20-2-1962 వరకూ – అంటే సరిగ్గా ఒక సంవత్సరం కాలంలో తణుకులోనే ఉంటున్న శ్రీమతి మోగంటి మాణిక్యాంబాదేవిగారికి ఎనిమిది సుదీర్ఘమైన లేఖలు వ్రాశారు తిలక్. ముద్రణలోనే ఒక్కొక్కటి రెండుమూడు పుటలు ఆక్రమించాయి. నా ఉద్దేశంలో తిలక్ లేఖాసాహిత్యంలో ఇవి అగ్రశ్రేణికి చెందుతాయి. సోమసుందర్ గారికి, వరవరరావుగారికి, మిరియాల రామకృష్ణగారికి వ్రాసిన లేఖల్లో తిలక్ హృదయం ఆవిష్కరింపబడితే, మాణిక్యాంబగారికి వ్రాసిన ఈ అపూర్వలేఖల్లో తిలక్‌గారి ఆత్మ ఆవిష్కరింపబడింది. ఆయన వ్యక్తిత్వం విశదమయింది. ఆయన సాహిత్యసృష్టికి మూలమైన పునాదులు బయటపడ్డాయి. ఆయన భావనాశక్తి తీవ్రత, ఆశయాల ఔన్నత్యం, సాహిత్య సిద్ధాంతాల వైశిష్ట్యం – ఈ లేఖల్లో అడుగడుగునా వ్యక్తమవుతున్నాయి.

చివర్లో "జానకీజాని" (శాస్త్రి) గారికి వ్రాసిన ఒక ఆంగ్లలేఖ ఉంది. దానికి అనువాదం కూడా ఇచ్చారు సంపాదకులు. శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు ('భారతి'లో) ఆధునికాంధ్ర కవిత్వచరిత్ర శ్రీశ్రీ దాకానే వ్రాశారనీ, ఆయనకు అంతవరకే పరిచయం ఉన్నదనీ, తరువాతి కవుల చరిత్రను శాస్త్రిగారు వ్రాస్తే బాగుంటుందని తిలక్ సూచించారు ("జానకీజాని"=సామవేదం జానకిరామశాస్త్రి. వీరు 1960-70 దశకంలో ఏలూరునుండి "సాహితి" అనే మాసపత్రికను వెలువరించిన సామవేదం జానకిరామశర్మగారి పుత్రులు. కాకినాడలో ఆంగ్లోపన్యాసకులుగా ఉండేవారు.)

'నవత' లేఖలు:-

తిలక్‌గారు 1964-1966 మధ్య దిగంబరకవులైన "నగ్నముని"కి ఒక

లేఖ, "నిఖిలేశ్వర్'కి ఒకలేఖ, 'నవత'ను నడిపే శిష్ట్లా జగన్నాథంగారికి ఒక లేఖ, నాటకప్రయోక్త శ్రీ అబ్బూరి గోపాలకృష్ణగారికి నాలుగు లేఖలు వ్రాశారు. మొత్తం ఈ యేడు లేఖలు 'నవత'లో ప్రచురింపబడ్డాయి. 1965లో దిగంబర కవులు తమ మొదటి కవితా సంపుటిని "నాంపల్లి పాండు" అనే రిక్షా కార్మికుడిచేత ఆవిష్కరింపజేశారు. దీనిని తిలక్ నగ్నమునికి వ్రాసిన లేఖలో విమర్శించారు. "కవిత్వం విషయంలో మంత్రిగారు ఎంతమూర్ఖుడో, రిక్షావాడూ అంతే మూర్ఖుడు" – అని అన్నారు. తన నాటిక "పొగ" ప్రదర్శించడానికి వీలవుతుందేమో చూడమని గోపాలకృష్ణగారికి వ్రాశారు.

నాకు వ్రాసిన లేఖలు: –

నాకు వ్రాసిన లేఖల్లో వర్షహేలకు ముగ్ధులు కావడం, నన్ను దృష్టిలో పెట్టుకొని "సుందరీ–సుబ్బారావు" కథను, "తపాలా బంట్రోతు" కవితను తాను వ్రాయడం, ఫలితంగా నాకు వారిమీద ప్రగాఢమైన గౌరవాభిమానాలు ఏర్పడడం, నన్ను ఆప్యాయంగా తనతోపాటు సినీమా చూడడానికి ఆహ్వానించడం ప్రసక్తమయ్యాయి.

లేఖలలో తిలక్ వ్యక్తిత్వం: –

ఒక కవి వ్యక్తిత్వం అతని రచనలలో కన్నా లేఖలలో బాగా వ్యక్తమవుతుందని విమర్శకుల భావన. తిలక్‌గారి స్నేహశీలత, ప్రేమ, ఆప్యాయత, కరుణ, సౌందర్యాన్వేషణ, అనారోగ్యంతో బాధపడుతూన్నా లెక్కచేయకుండా జీవన మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ ధైర్యంగా ముందుకు వెళ్ళడం, ఆశాభావం, జీవిత రహస్యాన్ని అన్వేషించాలనే తపన, మానవత్వాన్ని ఖూనీచేసే ఛాందస భావాలను ఖండించడం, సంప్రదాయవాదుల మౌఢ్యంమీద కుహనా దేశభక్తులమీద తిరుగుబాటు, జ్ఞానానికీ – అజ్ఞానానికి గల భేదం, సామాన్యునికి – కవికి గల భేదం, ప్రకృతి సౌందర్యాన్ని చూచి తన్మయత్వం పొందడం, తన సాహిత్య సిద్ధాంతాలు – వాటి పునాదులు, తాత్త్వికత, నిరాశ, సమాజంలోని జుగుప్సను చూచి నిస్పృహ చెందడం, తనలాగే బాధలలో ఉన్నవారి కన్నీరు తుడవడం, పేదలను చూచి ద్రవించిపోవడం, యువకవి మిత్రుల్ని ఆప్యాయంగా "తమ్ముడూ" అని పిలవడం, వారిని తన యింటికి ఆహ్వానించడం, దిగంబరకవులలోని

గుణదోషాలను నిష్కర్షగా బేరీజు వేయడం – మొదలైన ఎన్నో ముఖాలుగా వ్యాపించిన తిలక్‌గారి మహోన్నతమైన వ్యక్తిత్వం ఈ లేఖలలో ప్రతిఫలిస్తోంది.

తాను అనారోగ్యంతో బాధపడుతూ కూడా ప్రకృతి సౌందర్యాన్ని తన్మయుడై ఆస్వాదించడం తిలక్‌గారి విశిష్టలక్షణం:

"ఆకాశాన నల్లని మబ్బులు– ఒక్కసారిగా వాన – మనస్సులూ భూమీ చల్లబడి ఎంత హాయిగా వుంది! నాకు వర్షాకాలం అంటే ఎంతో యిష్టం. స్నానంచేసి వచ్చిన యౌవనవతి శరీరంలాగా విచిత్రమైన అందం, ఆకర్షణ!"

(18–6–1961 నాడు మిరియాల రామకృష్ణగారికి వ్రాసిన లేఖ)

తిలక్‌గారి గౌరవమిత్రులు సారంగు లక్ష్మీనరసింహారావుగారు చెప్పినట్లుగా "మంచువలె చల్లనైన అతని హృదయప్రవృత్తి యిందలి (ఈ తిలక్ లేఖలు గ్రంథంలోని) ప్రతివాక్యములోను వ్యక్తమగుచునే యుండును."

తిలక్ వైశిష్ట్యం:–

ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో తిలక్ వైశిష్ట్యాన్ని పది సూత్రాలలో చెప్పవచ్చు.

1. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, తిలక్, శేషేంద్ర – ఈ నలుగురూ తమతమ కాలాల్లో ఆధునికాంధ్రకవిత్వాన్ని శాసించి, మలుపు త్రిప్పిన మహానుభావులు; నవ్యకవిత్వోద్యమ నాయకులు; తరుణకవిలోకాన్ని మిక్కిలిగా ప్రభావితం చేసిన మార్గదర్శకులు. ఆయాకాలాల్లోని యువతీయువకులైన కవులు వీరి కవితలను అభిమానించారు, ఆరాధించారు, అనుసరించారు.
2. తిలక్ 60% భావకవి, 40% అభ్యుదయ కవి. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీల ప్రభావం తనమీద ఉన్నదని తిలక్ అంగీకరించారు. భావకవిత్వాన్ని అభ్యుదయ కవిత్వాన్ని కలిపి ఒక నూతన కవిత్వాన్ని (భావాభ్యుదయ కవిత్వాన్ని) సృష్టించారు. అభ్యుదయకవిత్వ పరిధిని విస్తరింపజేశారు. వస్తువు లేక భావం అభ్యుదయం, అభివ్యక్తి భావకవిత్వం. తిలక్ "భావాభ్యుదయ కవి". అందువల్ల కృష్ణశాస్త్రి + శ్రీశ్రీ = తిలక్ అని చెప్పవచ్చు.

3. భావకవిత్వాన్ని అనుభూతికవిత్వంగా పరిణమింపజేసినవాడు తిలక్. అనుభూతికవిత్వానికి ఆద్యుడు తిలక్.
4. తిలక్‌కవిత్వంలో అద్భుతసౌందర్యం ఉంటుంది; అలాగే దుర్భర విషాదం కూడా దాగి ఉంటుంది. సౌందర్యం వస్తువులో, భావంలో, శైలిలో – అంతటా పరచుకొని ఉంటుంది. అంతేకాదు; ఆయన శరీరాకృతిలోను, మనస్సులోను కూడా సౌందర్యమే ధగధగా మెరుస్తూ ఉండేది. కవిత్వంలోనే కాదు; తన కథల్లో, నాటికల్లో, నాటకాల్లో, లేఖల్లో అపూర్వసౌందర్యాన్ని నింపివేశారు తిలక్.
5. తిలక్ కవిత్వంలో విషాదం రెండు రకాలు. 1. బాహ్యవిషాదం; 2.అంతర్గత విషాదం. 1. సమాజంలో ఉన్న దుర్భర దారిద్ర్యాన్ని, పేదల బాధల్ని, యుద్ధాల్ని, మనుషుల మోసాల్ని చూచి దుఃఖించడం బాహ్యవిషాదం లేక సామాజిక విషాదం. 2. తన జీవితంలో మంచి యౌవనదశలో (25 సంవత్సరాల నుండి 33 సంవత్సరాలవరకు, అంటే, 1946 నుండి 1954 వరకు) 8 సంవత్సరాలపాటు రోగగ్రస్తుడై మంచం పట్టడం (లేదా గృహానికే పరిమితమై ఉండిపోవడం) వైయక్తిక విషాదం లేక అంతర్గత విషాదం. దీని ప్రభావం ఆయన కవిత్వం మీద పడింది.
6. తిలక్ తన కవిత్వంలో పదేపదే ప్రయోగించిన ఏడురకాల పదాలు, వాటి అర్థాలు, ఆయన విషాద మానసిక స్థితిని తెలియజేస్తాయి. (ఇవి సప్తసంఖ్యలో ఉండటం విచిత్రం). అవి (1) "స్వప్నం" లేదా "కల", (2) "బాష్పం" లేదా "కన్నీరు", (3) "ఏకాంతం" లేదా "ఒంటరితనం", (4) "విషాదం", (5) "అవ్యక్తవేదన", (6) "నిరాశ" లేదా "నిస్పృహ", (7) "రాత్రి".
7. కవిత్వరహస్య తత్త్వవేత్తగా తిలక్ ఎందరో యువతీయువకులకు మార్గదర్శి అయ్యారు.
8. తిలక్ వచనకవిత్వాన్ని ఎంత గొప్పగా వ్రాశారో, పద్యకవిత్వాన్ని కూడా అంతే గొప్పగా వ్రాశారు. (దీనిని విమర్శకులు అంతగా గమనించి నట్లుగా లేదు.)

9. తిలక్‌కవిత్వాన్నిగురించి ఒక్కమాటలో చెప్పాలంటే “అద్భుత సౌందర్యం – దుర్భర విషాదం!”
10. శ్రీశ్రీ చెప్పినట్టుగా “కవితాసతి నొసట నిత్య రసగంగాధర తిలకం” సర్గీయ దేవరకొండ బాలగంగాధర తిలక్;

(“దేవరకొండ బాలగంగాధర తిలక్ – లభ్యరచనల సంకలనం”,
ఎమెస్కో ప్రచురణ, ద్వితీయ ముద్రణ, జనవరి 2021;
ప్రధాన సంపాదకుడుగా నేను వ్రాసిన పీఠిక.)

వెన్నెల

కార్తీక మాసపు రాత్రివేళ / చల్లని తెల్లని వెన్నెల
మెత్తని పుత్తడి వెన్నెల / భూమివంటిని హత్తుకుంది
శిశువు లాంటి వెన్నెల/నవవధువులాంటి వెన్నెల/మధువులాంటి వెన్నెల..
ఎంత శాంతంగా / హాయిగా ఆప్యాయంగా ఉందీ!
చచ్చిపోయిన మా అమ్మ / తిరిగొచ్చినట్టుంది!
స్వర్గంలో ఎవరో సంగీతం / పాడుతున్నట్టుంది!
స్వర్గంలో అచ్చరలు / జలక్రీడలాడుతున్నట్టుంది!....
చలిచలిగా సరదాగా ఉంది వెన్నెల / చెలి తొలిరాత్రి సిగ్గులా వుంది!
విరిసిన చేమంతి పువ్వులా ఉంది
పడక గదిలో వెలిగించిన అగరొత్తుల వాసనలాగుంది...
యౌవనవనంలో కేళీసరస్సులా ఉంది
దవ్వుదవ్వుల పడుచుపిల్లలు / పకపక నవ్వినట్టుంది!
దాపరికంలేని కొండజాతి / నాతి వలపులాగుంది
ఇది సృష్టి సౌందర్యానుభూతికి టీక!
ఇది తరుణశృంగార జీవనహేలకు ప్రతీక!

– తిలక్

3. తిలక్ వచనకవితా వైభవం

ఏపుగా పెరిగిన చెట్టుమీద
ఎర్రని పువ్వొకటి విరిసి
ఎండలో మెరుస్తూ
'ఇదే నిజం! ఇదే నిజం!' అని నవ్వుతూ
అంతలో రాలిపోయింది...!
వింతగా స్మృతిపథంలో మాత్రం మిగిలింది!!

ప్రవేశిక:-

1966 జూన్ 30వ తేదీ రాత్రి 45 సంవత్సరాలు కూడా నిండని మధ్య వయస్సులో తిలక్‌గారు అకాలమరణం చెందగానే నేను దిగ్రభాంతుడనయ్యాను. ఆయన చనిపోవడానికి సరిగ్గా ఒక్క సంవత్సరం ముందు 1965 ఏప్రిల్ నెల 'భారతి'లో "కిటికీ" అనే కవిత ముద్రితమయింది. అందులోని పై పాదాలు నాకు జ్ఞప్తికి వచ్చాయి.

తిలక్ వచనకవిత్వం - 'అమృతం కురిసిన రాత్రి':

కృష్ణశాస్త్రిగారి "కృష్ణపక్షం" లాగా, శ్రీశ్రీ "మహాప్రస్థానం" లాగా, తిలక్‌గారి "అమృతం కురిసిన రాత్రి" కూడా ఆధునికాంధ్రకవిత్వ చరిత్రలో ఒక మైలురాయి! అనేక ముద్రణలు పొంది ప్రజల అభిమానాన్ని నేటికీ చూరగొంటోంది.

'అమృతం కురిసిన రాత్రి'లో 81 సంపూర్ణ కవితలు + 15 అసంపూర్ణ కవితలు కలిసి మొత్తం 96 కవితలున్నాయి. ఇవన్నీ వచనకవితలు కావు. మాత్రాగణ బద్ధమైన గేయాలు కూడా కొన్ని ఉన్నాయి. "దృశ్యభావాలు-ప్రాతఃకాలం - సంధ్య - మేగ్నాకార్టా - భూలోకం - ఒక శ్రుతి - లయగీతం - ఒక్కసారి - లాలి" అనే తొమ్మిది కవితలు వచనకవితలు కావు; మాత్రాగణబద్ధ గేయాలు. వచనకవితలుగా చెప్పబడే వాటిలో కూడా కొంత లయాత్మకత తొంగి చూస్తూనే

ఉంటుంది. "అమృతం కురిసిన రాత్రి"లో తిలక్ రచించిన 15 అసంపూర్ణ కవితలను విశాలాంధ్రవారు "కొన్ని అసంపూర్తి, అముద్రిత రచనలు" అనే శీర్షిక క్రింద గ్రంథం చివరలో ఇచ్చారు. వీటిని ముద్రించకుండా ఉంటే బాగుండుననే అభిప్రాయాన్ని వెలిబుచ్చిన విమర్శకులు కూడా ఉన్నారు. నిజమే కాని, ఆయన రచించిన ప్రతికవితాపంక్తి అమూల్యమని భావించే అభిమానులున్నారు. వారికోసం వీటిని ముద్రించారు. ఇవన్నీ ముడివజ్రాలనీ, ఇంకా సానపట్టవలసిన కవితలే అనీ అనడంలో ఏమాత్రమూ సందేహం లేదు. తిలక్ వీటిని first draft గా వ్రాసుకున్నారు. ఇంకా మెరుగులు దిద్దాలనుకున్నారు. కాని ఈలోగా 45 ఏళ్ళ వయసుకూడా పూర్తికాకుండానే చనిపోయారు. అసంపూర్ణాలైనా వీటిలో కొన్ని చాలా బాగున్నాయి. "వసంతం" – "నిరీక్షణ" పంటి కవితలు ముడివజ్రాలైనా ధగధగ మెరుస్తున్నాయి. 'అమృతం కురిసిన రాత్రి'లో ఉన్న మొత్తం 96 కవితలనూ ఎనిమిది వర్గాలుగా విడదీయ వచ్చును: (1) కవిత్వతత్త్వ విచారం, (2) భావకవిత్వం, (3) అనుభూతి కవిత్వం, (4) అభ్యుదయ కవిత్వం, (5) యుద్ధకవిత్వం, (6) మానవతావాదం, (7) తాత్త్వికత, (8) ఇతరములు. ఈ విభజన water tight compartments లాంటిది కాదు. కొన్ని కవితలు రెండు మూడు వర్గాలకు ఉదాహరణాలుగా అనిపించవచ్చును.

1. కవిత్వతత్త్వ విచారం: –

ఇది కవిత్వాన్నిగురించిన కవిత్వం లేదా తిలక్ దృష్టిలో కవిత్వం. ఇందులో మళ్ళీ రెండు అంతశ్శాఖలను గుర్తించవచ్చును. (i) సాధారణంగా (general గా) కవిత్వలక్షణాలేమిటి? (ii) ప్రత్యేకంగా (special గా) స్వీయకవిత్వలక్షణాలేమిటి? ఇంకో రకంగా చెపితే, (i) తిలక్ దృష్టిలో కవిత్వమంటే ఏమిటి? (ii) తిలక్ తన కవిత్వ లక్షణాలను ఎలా నిర్వచించుకున్నారు? "నా కవిత్వం" – "కవివాక్కు" – "నవత : కవిత" – "త్రిమూర్తులు" – "నా కవిత్వంలో నేను దొరుకుతాను" అనే ఐదు కవితలలో కవిత్వతత్త్వ విచారచర్చ కావించారు తిలక్.

A. సాధారణంగా కవిత్వ లక్షణాలు

1. **కరుణ లేని కవివాక్కు సంకుచితమవుతుంది** (– కవివాక్కు)
2. **ఇజంలో యింప్రిజన్ అయితే యింగితజ్ఞానం నశిస్తుంది**
   ప్రిజం లాంటిది జీవితం, వేర్వేరు కోణాలు ప్రదర్శిస్తుంది (–న్యూ సిలబస్)

3. **కవిత్వంలో obscurity కొన్ని సందర్భాలలో ఉండొచ్చును.**
కాని, పాఠకుడికి నీ అనుభూతి ఆకారం అందాలి, హత్తుకోవాలి.
అది transparent చీకటై ఉండాలి, నిన్ను పలకరించాలి.
కవిత కొత్త అనుభవాల కాంతిపేటికను తెరవాలి, కదిలించాలి!
(నవత-కవిత)

4. **కవిత్వం ఒక ఆల్కెమీ, దాని రహస్యం కవికే తెలుసు**
కాళిదాసుకు తెలుసు, పెద్దన్నకి తెలుసు
కృష్ణశాస్త్రికి తెలుసు, శ్రీశ్రీకి తెలుసు! (నవత-కవిత)

5. **నువ్వు చెప్పేదేదైనా నీదైవుండాలి**
నీలోంచి రావాలి, చించుకొని రావాలి (నవత-కవిత)

6. **అన్నా! కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి**
విస్తరించాలి చైతన్యపరిధి
అగ్ని చల్లినా, అమృతం కురిసినా
అందం, ఆనందం దాని పరమావధి (నవత-కవిత)

7. **ప్రతికవిత్వమూ, కవి, తన మీద తాను రాసుకున్నదే, ఓ విధంగా**
ఎందుకంటే కవిత్వం ultimate గా subjective కదా!
నా కవిత్వంలో నేను దొరుకుతాను! (నా కవిత్వంలో నేను దొరుకుతాను)

8. తాను కవితాసృష్టి ఎలా చేస్తున్నాడో కవికి తెలియదు - అని చెపుతూ ఇలా అంటారు తిలక్
సృష్టియొక్క రహస్యం సృష్టికి తెలియకపోవడమే
విచిత్రం అద్భుతం, అద్భుతం విచిత్రం
'ఇలాంటి పిల్లవాణ్ణి ఎలా కన్నావు?
ఏయే మార్పులు శక్తులు నీలో పనిచేశాయి?'
- అంటే ఏ తల్లీ చెప్పలేదు. (-నా కవిత్వంలో నేను దొరుకుతాను)

9. కవిత్వ రచనలో ఏ భావానికి ఏ రూపం కావాలో కవిత్వమే నిర్ణయించుకుంటుంది. భావరూపాలు కలిసి ఒకేసారి రూపుదాలుస్తాయి-అంటారు. తిలక్:
ఏ ద్రవ్య సంయోగంవల్ల ప్రాణం కలుగుతుంది?

ప్రాణానికి ఏ రూపం కావాలో, ఏ రూపం సరిపోతుందో
ప్రాణమే నిర్ణయించుకుంటుంది.
శరీరం ముందుగా ఏర్పడి, దాన్లో ప్రాణం దూరి కూర్చోదు.

(– నా కవిత్వంలో నేను దొరుకుతాను)

B. ప్రత్యేకంగా స్వీయకవిత్వ లక్షణాలు: "అమృతం కురిసిన రాత్రి" లోని మొట్టమొదటి కవిత "నా కవిత్వం" లో ("గోరువంకలు" లోని "ఆటవెలది" ఖండికలోను) తిలక్ తన కవిత్వ లక్షణాలను స్పష్టంగా చెప్పుకున్నారు. "నా కవిత్వం" లో తిలక్ చెప్పుకున్న లక్షణాలు మొత్తం ఆయన సాహిత్యానికంతటికీ (పద్యాలు + గేయాలు + వచన కవితలు + కథలు + నాటకాలు + నాటికలు – అన్నింటికీ) వర్తిస్తాయి. "నా కవిత్వం వివిధ వాదాలకు అతీతమైనది. – నాలో అస్పష్టత ఉండదు; వెనుక చూపు ఉండదు" అని చెపుతూ ఇలా అంటారు తిలక్:–

నా కవిత్వం కాదొక తత్త్వం
మరికాదు మీరనే మనస్తత్త్వం
కాదు ధనికవాదం, సామ్యవాదం
కాదయ్యా అయోమయం, జరామయం

"నా కవిత్వంలో గొప్ప సౌందర్యభావం ఉంటుంది – పంచేంద్రియాల అనుభూతి ఉంటుంది." – అని చెపుతూ ఇలా అంటారు తిలక్ –

గాజుకెరటాల వెన్నెలసముద్రాలూ
జాజిపువ్వుల అత్తరుదీపాలూ
మంత్రలోకపు మణిస్తంభాలూ
నా కవితా చందనశాలా సుందర చిత్రవిచిత్రాలు!

తిలక్ ఏ అంశం చెప్పినా అక్షరగతంగా, శైలీగతంగా, భావగతంగా గొప్ప సౌందర్యంతో నిండి ఉంటుంది. ప్రజల బాధలు; విషాదం; దేశభక్తి; త్యాగశక్తి + ప్రేమరక్తి + శాంతిసూక్తి = (మానవతావాదం) – నా కవిత్వంలో పుష్కలంగా ఉంటాయి అని చెపుతూ ఇలా అంటారు తిలక్:

అగాధ బాధా పాథఃపతంగాలూ
ధర్మవీరుల కృత రక్తనాళాలూ
త్యాగశక్తి ప్రేమరక్తి శాంతిసూక్తి
నా కళాకరవాల ధగద్ధగరవాలు!

తరువాత, చివరిగా, తన కవిత్వంలోని రసం – కరుణ రసమనీ; వస్తువు ప్రజాభ్యుదయమనీ; శైలి సౌందర్యమనీ ఎంతో అందంగా, ఇంతవరకూ ఎవ్వరూ చెప్పని విధంగా చెప్పారు తిలక్:

నా అక్షరాలు – కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు

నా అక్షరాలు – ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు

నా అక్షరాలు – వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు!

ఇక్కడ "వెన్నెల సౌందర్యానికీ, ఆడపిల్లల సౌకుమార్యానికీ, ఆడుకోవడం ఆనందానికీ చిహ్నాలు" అని డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావుగారు వ్యాఖ్యానించడం చాలా బాగుంది.

II. భావకవిత్వం:–

1910 నుండి 1935 వరకు "సుమారు పాతికేళ్ళపాటు తెలుగుకవిత్వాన్ని సుసంపన్నం చేసింది భావకవిత్వం. స్వేచ్ఛ, సౌందర్యం, సౌకుమార్యం, కాల్పనిక వాస్తవికత, ఆదర్శవాదం, ఏకాంతం, అనుభూతి ప్రాధాన్యం, ప్రకృతిప్రీతి, ప్రణయ లగ్నత మొదలైన విశిష్టగుణాలతో, అంతకుముందు తెలుగుకవిత్వం ఎరుగని రంగుల్నీ, రుచుల్నీ, వాసనల్నీ మప్పిన కవిత్వం" భావకవిత్వం: (–డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావుగారి వ్యాసం, "తిలక్ కవితాతత్త్వం–దృక్పథం", లోపలికి... 2012, పుట–102). ఈ లక్షణాలన్నీ తిలక్ కవిత్వంలో ఉన్నాయి. "తిలక్‌కి ముందున్న కవిత్వం భావకవిత్వం; తిలక్‌కు సమకాలికమైనది అభ్యుదయ కవిత్వం. భావకవిత్వ ప్రభావం తిలక్‌మీద జీవితాంతమూ ఉంది" – అంటారు డా॥ రెంటాల (ఇబిడ్).

ప్రణయం (ప్రేమ/శృంగారం) – ప్రకృతి వర్ణనలు – ఋతువర్ణనలు – సౌందర్యం (సౌందర్య పిపాస/సౌందర్య కాంక్ష/ సౌందర్య భావం / అమృత భావం) – దేశభక్తి – స్మృతి గీతాలు: అనే ఆరు అంతశ్శాఖలను తిలక్‌గారి భావకవిత్వంలో గుర్తించడానికి వీలుంది. ఉదా॥ "వానలో నీతో" కవిత పురుషుని హృదయం నుండి వెలువడిన ప్రేమకు ఉదాహరణం. అలాగే "నిరీక్షణ" అనే కవిత స్త్రీ హృదయంనుండి వెలువడిన ప్రణయానికి తార్కాణం. "వెన్నెల" కవితలో ప్రకృతివర్ణన అద్భుతంగా చిత్రితమయింది. "వేసవి" కవిత ఋతువర్ణన. "అమృతం కురిసిన రాత్రి" కవిత సౌందర్యభావం. "త్రిశూలం"– "అమ్మా! నాన్న ఎక్కడికి

వెళ్ళాడు?" దేశభక్తి కవితలు. "నెహ్రూ" – "దుర్మరణవార్త' (కెనడీ మరణం) ఎలిజీలు (స్మృతిగీతాలు). "నువ్వు లేవు నీ పాట వుంది" అనే కవిత ప్రేమగీతమూ అవుతుంది; అనుభూతి కవితా అవుతుంది. "సంధ్య – ప్రాతఃకాలం – గుండెకింద నవ్వు – ద్వైతం – నీవు – విరహోత్కంఠిత – ఆ రోజులు – వసంతం – గ్రీష్మం – వర్షహేల – మొదలైన కవితలు తిలక్ భావకవితావేశానికి మంచి ఉదాహరణాలు.

పురుషుని హృదయపు లోతులనుండి వెలువడిన ప్రేమగీతం చూడండి:

ఆకాశాన్ని మేఘం నల్లని కంబళిలా కప్పుకుంది
ఆనందం మనసులో మయూరబర్హంలా విప్పుకుంది.
ఆలోచనలెందుకు జవ్వనీ! విలోకించు వర్షాసంధ్యని
సందేహం వదలి నాసందిటిని నిలిచి కళ్ళెత్తి చూడు.
అరటితోట నడుంచుట్టి కాలువ ఏటవాలుగా మలుపు తిరిగింది
నారికేళ వనాంతాన పాటినం సంకేతంలా మెరుపు మెరిసింది
నీ వొంటిమీది చిరుగంధ సువాసన నా మనస్సును చుట్టుకుంది
నిర్నిద్ర కాంక్షారమ్యమై నీపమై నా జీవితం విరిసింది....."

(–వానలో నీతో)

ప్రేమగీతంలోనే ప్రకృతివర్ణన కూడా మిళితమై ఉంది. ప్రతిపదంలోనూ సౌందర్యాన్ని నింపుతారు తిలక్. సౌందర్యం ఎక్కువగా ప్రకృతిలో దాగి ఉంటుంది.

ఇదే ప్రణయభావం స్త్రీ గుండెల లోతులలోనుండి వస్తే ఎలా ఉంటుంది? ఆడువారికి సహజమైన మామూలు తెలుగుమాటల్లో ఎంత చిక్కటి వలపును క్రుమ్మరించారో తిలక్ గమనించండి:–

ఈవేళ నువ్వు వస్తావని, మెయిలులో దిగుతావని,
తప్పక వస్తావని, తప్పక తప్పక వస్తావని,
ఈ ఉదయానికి అందం తెస్తావని, అర్థం యిస్తావని,
ఈ ఎదురుగా ఉన్న ట్రాములకన్న
బస్సులకన్న, ఈ వీధమ్మట పోయే జనంకన్న
ఈ దేశంకన్న, ఈ విశ్వంకన్న
అన్నిటికన్న, అందరికన్న ముఖ్యమైన వాడివిగా

నా కళ్ళకి వేడిగా/ నా గుండెల్లోకి వాడిగా, నేరుగా
నా ఒళ్ళోకి తావిగా, నావాడివిగా
వస్తావని, వస్తావని, తప్పక వస్తావని ...
... ఈ గుమ్మం ముందు నిల్చున్నాను నీ కోసం
నీ కోసం/నీ కోసం
అందానికి అవధిగా, యౌవనానికి శిల్పంలా
'చైవక్స్ షావడా' గీసిన బొమ్మలా (నిల్చున్నాను నీ కోసం)....
... ఎంతో అందమైన ఈ ఉదయపు
నీరెండ వానచినుకుల్లో తడుస్తూ
ఒక్కొక్క ఉద్రేకపు తరంగాన్ని
గుండెల్లో జాగ్రత్తగా కొత్తచీర వంపుల్లా మడుస్తూ
నిల్చున్నాను నీ కోసం
నీ కోసం, నీ కోసం.

'చైవక్స్ షావడా' ప్రపంచ ప్రఖ్యాత వర్ణచిత్రకారుడు. సాధారణంగా తిలక్ సంస్కృత పదాలతోను, సమాసాలతోను కవిత్వమల్లుతారు. కాని ఈ కవితలో మాత్రం దానికి భిన్నంగా మామూలు తెలుగుమాటలతో స్త్రీమనస్సులోని ప్రణయభావాన్ని వెల్లడించారు. ఈ యువతి మద్రాసులో ఉండి, భర్త రాకకోసం ఎదురు చూస్తున్నట్టుగా తెలుస్తోంది. 'నువ్వు లేవు నీ పాట వుంది' కవితలోలాగే అసమాపక క్రియాప్రయోగంవల్ల ఆ యువతి మనసు నిండుగా ఉన్న ఊపిరి సలుపని ప్రేమ వ్యక్తమవుతోంది. ఈ కవితలో తిలక్ సృష్టించిన నూతన ఉపమాలంకారాలను గమనించవచ్చు.

తిలక్ ప్రకృతివర్ణనా వైభవానికి 'వెన్నెల' అనే కవిత మంచి ఉదాహరణం:-

కార్తీక మాసపు రాత్రివేళ/ కావాలనే మేలుకున్నాను
చల్లని తెల్లని వెన్నెల/ అంతటా పడుతోంది
మెత్తని పుత్తడి వెన్నెల / భూమి వొంటిని హత్తుకుంది
శిశువులాంటి వెన్నెల/ నవవధువులాంటి మధుపులాంటి వెన్నెల
ఎంత శాంతంగా/హాయిగా, ఆప్యాయంగా ఉంది!
చచ్చిపోయిన మా అమ్మ/తిరిగొచ్చినట్టుంది!

స్వర్గంలో ఎవరో సంగీతం/ పాడుతున్నట్టుంది
స్వర్గంలో అచ్చరలు / జలక్రీడలాడుకున్నట్లుంది
ఎంత నీరవ నిర్మల సౌందర్యం/ నన్నావరించుకొంది?
.... ఓహో! చంద్రకిత ధాత్రి!
ఓహో! కోరకిత గాత్రి
ఓహో! శరద్రాత్రి!

తరువాత వెన్నెల అందాన్ని ఎన్నో రమ్యమైన, నూతనంగా తాను సృష్టించిన ఉపమానాలతో సౌందర్యానుభూతిని నింపి చెపుతున్నారు. తిలక్ :

చలిచలిగా సరదాగా ఉంది వెన్నెల
చెలి తొలిరాత్రి సిగ్గులా వుంది
విరిసిన చేమంతి పువ్వులా ఉంది
పడకగదిలో వెలిగించిన
అగరొత్తుల వాసనలా ఉంది,
పడగ విప్పిన పాములు తిరిగే
పండిన మొగలివనంలాగుంది
పన్నీరు జల్లినట్టు ఉంది/ విరహిణి కన్నీరులా ఉంది.
విరజాజుల తావితో కలిసి/ గమ్మత్తుగా ఉంది
..... యావన వనంలోని కేళీసరస్సులా ఉంది
దవ్వుదవ్వుల పదుచుపిల్లలు/పకపక నవ్వినట్టుంది
దాపరికం లేని కొండజాతినాతి వలపులాగుంది
ఇది సృష్టి సౌందర్యానుభూతికి టీక
ఇది తరుణ శృంగార జీవనహేలకు ప్రతీక
నిండెను తెల్లని చల్లని వెన్నెల
చలిరాత్రుల మౌనపు గానపు తెన్నుల

పై కవితలో తిలక్ ఎన్నో కొత్తకొత్త ఉపమాలంకారాలను సృష్టించి ప్రయోగించారు. ఋతువర్ణన లేదా ప్రకృతివర్ణన చేస్తూ దానిలో ప్రణయభావాన్ని మిళితంచేసి చెప్పడం తిలక్‌గారికి అలవాటు. పైగా ప్రణయానికి యువతీ యువకులే నాయికా నాయకులుగా ఉండాలనే నియమం లేదు. ఒక్కొక్కసారి

మధ్యవయస్కులను కూడా నాయికా నాయకులుగా చేస్తారు తిలక్. ఈ క్రింది అసంపూర్ణ "వసంత" వర్ణనలో ఒక మధ్యవయస్కుడైన పురుషుని మనస్సులోని ప్రేమభావాన్ని ఎంత సున్నితంగా, ఎంత సరళంగా, మామూలు మాటల్లో చెప్పారో చూడండి:-

మనమ్మాయి అద్దం ముందు డ్రీమ్‌గా నిలబడుతుండెందుకు?
ఇదిగో చూడు
చెంపలు నెరిసినా అదేఁవిటి నీ మొహంలో ఏదో అందం!
సిగ్గుపడకిలా చూడు!
చిన్నప్పటి సరదాలూరికే జ్ఞాపకం వొస్తున్నాయెందుకు?
చూరులో పిచ్చిక ఎంత ముద్దుగా చిలిపిగా గంతులేస్తోందో!
చూడిటు గోరింట పువ్వింత అందంగా వుంటుందని నాకు తెలవదు!
గది ఏమిటో బోడిగా ఉంది చక్కని డిజైన్‌గల టేబిల్‌క్లాత్ కొంటానుండు
ఈ రాత్రి పడగ్గదిలో అగరొత్తులు వెలిగించిఉంచు సుమీ! హాయిగాఉంటుంది!
గుసుగుసలాడుతూ వస్తున్న గాలి, పైట తొలగిపోయినట్టుందేఁవిటి మల్లెచెట్టు!
ఆడదానిలా వుందేఁవిటి ప్రకృతి!

భావకవిత్వాన్ని చెప్పేటప్పుడు కూడా తిలక్ తన అత్యాధునిక శాస్త్రవిజ్ఞానాన్నీ, లోకజ్ఞతనూ ప్రదర్శిస్తారని-ప్రముఖ విమర్శకులు డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు గారు ప్రశంసించారు. న్యూటన్ థియరీ, అయిన్‌స్టీన్ థియరీ ఆఫ్ కర్వేచర్, హొయర్ - నర్లేకర్ల సిద్ధాంతాలు "అభినవ ఋగ్వాదం" అనే ప్రేమగీతంలో చొప్పించి హాస్యాన్ని సృష్టించారు తిలక్. "ద్వైతం" అనే కవితలో-

నువ్వు ఉత్తర ధ్రువంలో విరిసిన 'అరోరా బొరియాలిస్' వి
నేను దక్షిణ ధ్రువతీరాన నిలిచిన 'పెలికన్' పక్షిని

ఉత్తరధ్రువంలో ఆరునెలలు పగలు + అరునెలలు రాత్రి ఉంటాయి. ఆ ఆరునెలల రాత్రుల చీకటి రోజులలో ఆకాశంలో ఉండే ఎర్రటి వెలుగును "అరోరా బొరియాలిస్" అంటారు.

III. అనుభూతి కవిత్వం:-

ఇది భావకవిత్వ పరిణామరూపం. దీనికి ఆద్యుడు తిలక్. అనుభూతి కవిత్వంలో అస్పష్టత (Obscurity) ఉంటుంది; కాని అది తిలక్ చెప్పినట్టుగా

"transparent" చీకటిగా ఉండాలి. అలా ఉంటేనే కవి అనుభూతి పాఠకుడికి అందుతుంది. అనుభూతినిగురించి తిలక్ ఇలా అన్నారు:-

(i) "కవి అనుభూతి ఒక విధంగా అవ్యక్తమైనది. గణితంలోలాగ స్థిరమైన అంకెలతో గాని గీతలతో గాని చూపడానికి వీలులేదు. ఎక్కడ గణితమూ, తర్కమూ అంతమవుతాయో, అక్కడనుంచి కళ ప్రారంభమవుతుంది. అవ్యక్తమైన అనుభూతిని సువ్యక్తం చెయ్యటంలోనే కవిత్వంయొక్క ప్రక్రియ జరుగుతుంది" (- 'కావ్యసృష్టి' వ్యాసం)

(ii) "మన లోపల్లోపల జరిగే ఒకానొక అనుభూతి విశిష్టత కవిత్వానికి ఆధారం. ఆ అనుభూతి-అదే feeling-అగోచరమైనదీ, అనిర్దిష్టమైనదీ". (- 'కవిత్వం అంటే' వ్యాసం)

అనుభూతికవితలో ఆలోచనకీ, తర్కానికీ, విశ్లేషణకీ స్థానం లేదంటారు ఇస్మాయిల్. "అనుభూతికవితగా గుర్తుపట్టడానికి ప్రధానలక్షణం - కవిత చదివిన తరువాత మిగిలేది ఒక సందేశం, ఒక భావం, ఒక దృక్పథం కాకుండా - కేవలం అనిర్దిష్టమైన అనుభూతి కావాలి" అంటారు ఆర్.ఎస్. సుదర్శనం.

అభ్యుదయకవిత్వంలో అనుభూతివాదాన్ని ప్రవేశపెట్టినవాడు తిలక్ - అని ప్రశంసించారు ఆరుద్ర. అసలు కవిత్వమే కవి స్పందన, అనుభూతి అయినప్పుడు, మళ్ళీ ప్రత్యేకంగా "అనుభూతి కవిత్వం" అంటూ ఒక రకం కవిత్వాన్ని పేర్కొనడం అసమంజసం - అని అంటారు శేషేంద్ర. ఏదిఏమైనా డా॥ రెంటాలగారు చెప్పినట్టుగా "ఈ రకం కవిత్వంలో పాఠకుడి దృష్టి వస్తువు మీద నిలవనే నిలవదు. బాహ్య ప్రపంచదృశ్యాలు అస్తిత్వం కోల్పోయి అవి అనుభూతులుగా మారిపోతాయి."

తిలక్ "అమృతం కురిసిన రాత్రి" కావ్యంలోని "నేను కాని నేను" - "నువ్వు లేవు నీ పాట వుంది" - "అమృతం కురిసిన రాత్రి" - "రాత్రివేళ" - "యుగళ గీతిక" - "వాన కురిసిన రాత్రి" - "ఒక శ్రుతి" మొదలైన కవితలను అనుభూతి కవితలుగా పేర్కొనవచ్చు.

(i) "నేను కాని నేను" :- అర్ధరాత్రివేళ కవి (తిలక్) తాను ఒంటరిగా కూర్చొని, ఏకాగ్రతతో ఆలోచిస్తూ, కవితారచన చేసేటప్పుడు, ఒక సమాధి స్థితిలోకి వెళ్ళిపోతారు. అప్పటి తన అనుభూతిని మనకు తెలియజేస్తున్నారు:

ఒక నిశార్ధ భాగంలో నక్షత్ర నివహ గగనం
ఓరగా భూమ్మీదకు వొంగి ఏదో రహస్యం చెబుతూన్న వేళ

ఒంటరిగా నా గదిలో నేను మేల్కొని రాసుకుంటుంటాను
నా హృదయ స్పందన మాత్రం నాకు వినిపిస్తూ వుంటుంది
ఎదురుగా గోడమీద బల్లి ఏకాగ్రంగా నాకేసి చూస్తూ వుంటుంది
కిటికీ అవతల ఫెరన్ మొక్క క్రీగంట కనిపెడుతూ వుంటుంది
కీచురాళ్ళ చప్పుడు, అప్పుడప్పుడు వినిపిస్తూ వుంటుంది
. . . .
నా లోపల ఎవరో చప్పున ఇటునుంచి అటువైపు వెళ్లిపోతూ
ఆనవాలుగా వదులుతారు ఇరవై యేళ్ళనాటి జ్ఞాపకాల్ని
నా గది అవతల ఎవరో నవ్వుని నొక్కి పట్టిన ధ్వని నీళ్ళను కలచినట్టు
రోదసిలో చీకటిలో అంటర్హిత సంగీతం తాలూకు శ్రుతి చుట్టుకొన్నట్టు
మంచూ మసకవెన్నెలా కలిసిన శీతాకాలపురాత్రి గుండెలమీద
మరకలా పడుతుంది నా నిట్టూర్పు, ఏకాంతంమీద నా తీర్పు.

(ii) "నువ్వు లేవు నీ పాట వుంది":– ప్రారంభయౌవనం (teenage) లోని ప్రేమను మధ్యవయస్సులో తలచుకున్నప్పుడు తనకు కలిగిన అనుభూతిని "నువ్వు లేవు నీ పాట వుంది" అనే కవితలో చక్కగా వ్యక్తీకరించారు తిలక్. ఆయన తన కవితా లక్షణాలుగా చెప్పుకున్న "త్యాగశక్తి – ప్రేమరక్తి – శాంతిసూక్తి" అనే త్రిగుణాలలో ప్రేమరక్తి ఈ కవితలో ఉంది. చిన్ననాడు తన కౌగిలిలో ఉండి పాడిన ప్రేయసి పాటయొక్క అనుభూతి కవి హృదయంలో ఎలా స్పందించిందో, విషాదనేపథ్యంలో, సౌందర్యభావనతో, విచిత్రమాధుర్యంతో వివరింపబడింది–

నువ్వు లేవు నీ పాట వుంది; ఇంటి ముందు బాకామల్లె తీగల్లో అల్లుకుని
లాంతరు సన్నని వెలుతురులో క్రమ్ముకుని నా గుండెల్లో చుట్టుకుని
గాలిలో ఆకాశంలో నక్షత్రం చివరి మెరుపులో దాక్కుని నీరవంగా
నిజంగా వుంది జాలిగా హాయిగా వినబడుతూ వుంది శిశిర వసంతాల
మధ్య వచ్చే మార్పుని గుర్తుకు తెస్తోంది యిన్నేళ్ళ తర్వాత
వేడిగాలి చల్లదనానికి తిరిగే ఒకానొక గ్రీష్మదివసావసాన సమయాన
డాబామీద సిగ్గిల్లిన సోగకళ్ళతో మల్లెపూల వాల్జడతో నువ్వు పాడిన పాట
నా గుండెల దగ్గర తడబడుతూ ఏదో కొత్త భాషలో చెప్పి
ఒక అందమైన రహస్యాన్ని విప్పి పరువానికి వస్తున్న నా వయస్సులో

చటుక్కున పరిమళపు తుపానుల్ని రేపి మహారణ్యాల సౌందర్యాన్ని చూపి
సముద్రపు కెరటాల జలంతో మధ్యగా మౌనంగావున్న ద్వీపాల్ని ఊపి
ప్రపంచంయొక్క అవధుల్ని దూరంగా సాచి నన్ను దిగంతాలకు విసిరేసినవేళ
. . . .
నీ వొడిలో నా తల పెట్టుకుని అభ్యంగనావిష్కృత త్వదీయ
వీనీల శిరోజ తమస్సముద్రాలు పొంగి నీ బుజాలు దాటి
నా ముఖాన్ని కప్పి ఒక్కటే ఒక స్వప్నాన్ని కంటున్న వేళ
చంద్రికాస్నపిత సంగీతాన్ని వింటున్న వేళ
అకుపచ్చని భూమికీ గిరులకీ ఝరులకీ సమస్త సృష్టికీ
ఒకే ఒక అర్థం కనుక్కున్న వేళ ......
నన్ను మంత్రించిన ఆ రోజులింక రావు
యిప్పుడు నువ్వు లేవు నీ పాట వుంది నా లోపల లోలోపల
ఆరిన కుంపటిలో రగులుతున్న ఒకే ఒక స్మృత్యగ్ని కణంలాగ
క్రమక్రమ జరా రుజాగ్రస్తమైన వయస్సనే పాడింటి మూలగదిలో
కుండీలో యింకా వాడకుండా నిల్చిన పువ్వుల గుత్తిలాగ ....
నీ పాట ఒక్కటే నిజంలాగ నిర్మలమైన గాలిలాగ నిశ్శబ్ద నదీతీరాన్ని
పలకరించే శుక్తిగత మౌక్తికంలాగ (వుంది, నువ్వు లేవు).

ఈ కవితలోని అసమాపక క్రియలవల్ల ఒక ఉపిరి నలుపని ప్రణయబాధ, విషాదం, అవ్యక్త వేదన అనుభూతికి వస్తాయి. సుందర ప్రకృతిలోని ఉపమానాలవల్ల కవిప్రేమకు ఒక పవిత్రత, స్వచ్ఛత, విలువ వచ్చాయి. ఆ రోజుల్లో ఈ కవిత ఎందరో యువతీ యువకుల్ని ఆకర్షించింది. ఇప్పటికీ స్వచ్ఛంగా ఉండి తరుణలోకం మనసులు దోచుకుంటోంది. ఈ కవితలోని ప్రేమభావం సార్వజనీనం కావడం వల్ల కొందరు యువకులు ఈ కవితను ప్రేమలేఖగా వాడుకున్న సంగతి నాకు తెలుసు.

ఈ కవితను గురించి 'ఏమైనా స్వానుభవమా?" అని తిలక్‌గారిని ప్రశ్నించాను. "అవును; నా చిన్నతనంలో ఒక పెళ్ళిలో, చాలా అందంగా ఉన్న ఒక అమ్మాయి పరిచయమయింది. ఆమె అద్భుతంగా పాట పాడింది" అన్నారు తిలక్.

భావకవిత్వంలో కొంత అస్పష్టత (obscurity) ఉంటుంది. కాని అది మునిమాపు చీకటి వంటిది. అది కొంచెం ముదిరితే అనుభూతి కవిత్వం అవుతుంది. అయినా అది transparent చీకటిగా (మసక మసక చీకటిగా) ఉండాలి. ఈ transparent చీకటి ఇంకా దట్టమైపోతే అధివాస్తవికత (surrialism) అవుతుంది. అది కన్ను పొడుచుకున్నా కానరాని కటికి చీకటి! తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' లో రెండుమూడు కవితలలో నాకు అధివాస్తవికతా కవిత్వధోరణులు కూడా కనపడ్డాయి (ఉదా॥ "ప్రవాస లేఖ" – "ఖాళీ చేసిన...." – "మంచు " కవితలు).

IV. అభ్యుదయ కవిత్వం:-

"భావకవిత్వం తర్వాత తెలుగు కవితారంగంలో ఉవ్వెత్తున లేచిన తరంగం అభ్యుదయ కవిత్వం (1935 నుండి 1955 వరకు). సమసమాజ స్థాపనాకాంక్ష దాని హృదయం. మార్క్సిజం దాని మెదడు. వర్గపోరాటం దాని ఆయుధం. శ్రామికజనం దాని ఆప్తవర్గం. వసుధైక కుటుంబ భావన దాని తత్త్వం. కవిగా తిలక్ రచనకు పూనుకునే వేళకి తెలుగుకవిత్వాన్ని అభ్యుదయోద్యమం శాసిస్తోంది" – (డా॥ రెంటాల వ్యాసం, "తిలక్ కవితాతత్త్వం, దృక్పథం", లోపలికి..., పుట 111)

అభ్యుదయ కవిత్వం తిలక్ మీద తన ముద్రను వేసింది. అభ్యుదయకవితా చైతన్యంలో భాగంగా తెలుగులోకి ప్రవేశించిన అనేక నూతనాంశాలు తిలక్ కవిత్వంలో గోచరిస్తాయి – అంటారు డా॥ రెంటాల. మనిషిని ఒక దేశపు పౌరుడిగా కాక, అంతర్జాతీయ మానవుడుగా చూడటం (అంతర్జాతీయ దృక్పథం) – పీడితుల పక్షం వహించడం – దోపిడీని వ్యతిరేకించడం – సంస్కృతిని గురించి అత్యంత వాస్తవికమైన అవగాహన కలిగి ఉండటం – యుద్ధవ్యతిరేకత – ప్రాపంచిక స్పృహ – సామాజిక స్పృహ – పాతివ్రత్యంలోని బానిసత్వాన్ని అణచివేతను అర్థంచేసుకోవడం – కవి తన చైతన్యపరిధిని విస్తరించుకోవడం – ప్రజాశక్తిని గౌరవించడం మొదలైనవి అభ్యుదయ కలిత్వంవల్ల తెలుగులో ప్రవేశించిన నూతనాంశాలు. ఇవన్నీ తిలక్‌లో ఉన్నాయి. "తిలక్ తన కవితనుగురించి తానేవిధంగా నిర్వచించుకున్నప్పటికీ, అతని ఊహలో అడుగడుగునా అభ్యుదయ భావావేశం తొంగిచూస్తూనే ఉంటుంది..... అభ్యుదయ కవితాయుగంలో, కొన్ని

పరిధులకు లోబడి, కొన్ని నిర్దిష్టాంశాలకు మాత్రమే పరిమితమైపోయిన కావ్య వస్తువును విశాలం చేసినవాడు తిలక్” అంటారు కుందుర్తి. “అమృతం కురిసిన రాత్రి” లో ఈ క్రింది కవితలను అభ్యుదయ కవితలుగా భావించవచ్చు: “ఆర్తగీతం – తపాలా బంట్రోతు – నీడలు – సిఐడి రిపోర్టు – గొంగళి పురుగులు – శిఖరారోహణ–భూలోకం–మన సంస్కృతి – ద్వైతం – పోయిన వజ్రం – ప్రార్థన – హార్లెమ్స్‌లో శవం – నిన్నరాత్రి వర్షంలో – సమాజం – వేకువ – ప్రాణంలేని నీడలు – ఈ రాత్రి: 1– కవివాక్కు”.

నేను తిలక్‌గారిని వెతుక్కుంటూ వెళ్ళడానికి కారణమైనదీ, నన్ను మిక్కిలిగా ఆకర్షించినదీ, చలింపచేసినదీ “ఆర్తగీతం” కవిత. ఈ కవితలో భావచిత్రాలు లేవు; ప్రతీకలు లేవు; కాని రసానుభూతి ఉంది. ఇది కరుణరస గేయం. ఇది సామాజిక వాస్తవికతను లోతుగా ప్రదర్శిస్తుంది. శైలీవేగం చాలా గొప్పగా ఉంది. పఠితను ఒక ఊపు ఊపుతుంది. నన్ను అలా ఊపేసింది. నేను వెళ్ళి ఆయన పాదాలదగ్గర పడ్డాను. ఇది సంస్కృత సమాసభూయిష్ఠమైన శైలిలో గ్రాంథికభాషలో కొనసాగుతుంది. “మనదేశం చాలా గొప్పది; మన సంస్కృతి చాలా గొప్పది” అని గొప్పలు చెప్పుకుంటున్నాం, గర్విస్తున్నాం. కాని వాస్తవికత ఎలాఉంది? దుర్భర దారిద్ర్యంతో ప్రజలు మ్రగ్గిపోతున్నారు. ఈ దేశంలో పేదరికం పోనంతవరకూ, పేదల దుస్థితి మారనంతవరకూ మన సంస్కృతిని తలచుకొని గర్వించడం అవివేకం – అని తిలక్ కుండబ్రద్దలుకొట్టినట్లుగా చెప్పారు. వర్తమాన సమాజంలో చూచిన దుర్భర దృశ్యాలను ఎంత ఆవేశంతో చెపుతున్నారో చూడండి:–

నేను చూశాను నిజంగా–ఆకలితో అల్లాడి మర్రిచెట్టు క్రింద మరణించిన ముసలివాణ్ణి
నేను చూశాను నిజంగా–నీరంధ్రవర్షాన వంతెన క్రింద నిండు చూలాలు
ప్రసవించి మూర్ఛిలిన దృశ్యాన్ని
నేను చూశాను నిజంగా–తల్లిలేక తండ్రిలేక తిండిలేక ఏడుస్తూ ఏడుస్తూ
ముంజేతుల కన్నులు తుడుచుకుంటూ
మురికికాల్వ ప్రక్కనే నిద్రించిన మూడేళ్ళ పసిబాలుణ్ణి
నేను చూశాను నిజంగా–పిల్లలకు గంజికాచి పోసి, తాను నిరాహారుడై, రుద్ధ
బాష్పాకులిత నయనుడై ఆఫీసుకు వచ్చిన వృద్ధుని ప్యూన్
వీరన్నని

నేను చూశాను నిజంగా-క్షయగ్రస్త భార్య యిక బ్రతకదని డాక్టరు చెప్పినపుడు
ప్రచండ వాతూలహత నీపశాఖపలె గజగజ వణికిపోయిన
అరక్త అశక్త గుమాస్తాని అయిదుగురు పిల్లలు కలవాణ్ణి
నేను చూశాను నిజంగా-మూర్తీభవత్ దైన్యాన్ని, హైన్యాన్ని, క్షుభితాశ్రు కల్లోల
నీరధుల్ని, గచ్ఛత్ శవాకార వికారుల్ని,
ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి? ఏ విజ్ఞాన ప్రకర్షకుపశ్రుతి?
ఏ బుద్ధదేవుడి జన్మభూమికి గర్వస్మృతి?

ఇటువంటి దృశ్యాలను చూస్తున్న తాను తన దేశాన్ని కీర్తిస్తూ కవితలల్లలే నంటారు తిలక్. **"మానవతలేని లోకాన్ని స్తుతించలేను/ మానవునిగా శిరసెత్తుకు తిరగలేను / ఈ నాగరికతారణ్య వాసం భరించలేను"** అంటారు. కృష్ణశాస్త్రి + శ్రీశ్రీ = తిలక్ అనడానికి ఈ కవిత మంచి ఉదాహరణం. ఇది భావకవిత్వంతో ప్రారంభమై అభ్యుదయకవిత్వంతో ముగుస్తుంది. కవిత మధ్యలో "నేను చూశాను నిజంగా" అనే వాక్యం ఆరుసార్లు పునరుక్తమవుతుంది. దీనిని జానపదకవిత్వంలో "అభివర్ధిత పునరుక్తి" (Incremental Repetition) అంటారు. ఇది శ్రోతలో లేదా పాఠకునిలో రసావేశాన్ని ఇబ్బడిగా ముబ్బడిగా పెంచుతుంది. పాల్కురికి సోమన కూడా తన బసవపురాణంలో ఇటువంటి అభివర్ధిత పునరుక్తిని పాటించాడు ("బసవని శరణన్న పాయు పాపంబు, బసవని శరణన్న భవరోగహరము"). "ధనవంతులైన మీరు ఇటువంటి కవితను ఎలా వ్రాయ గలిగారు?" అని నేను ప్రశ్నించాను. "ఒకరోజు సాయంత్రం ఒక బిచ్చగత్తె బిడ్డను చంకలో పెట్టుకొని మా యింటి గేటు దగ్గరకు వచ్చి అడుక్కుంది. ఆమె దైన్యస్థితిని చూచి మిక్కిలి చలించిపోయాను. ఆ రాత్రి నేను నిద్రపోలేదు. ఫలితంగా ఈ కవిత వ్రాశాను" అన్నారు తిలక్. తిలక్‌గారి "ఆర్తగీతం" చదివినప్పుడల్లా నాకు వ్యాసభాగవతంలోని ఈ క్రింది శ్లోకం జ్ఞప్తికి వస్తూ ఉంటుంది.

"న త్వహం కామయే రాజ్యం – న స్వర్గం నా పునర్భవమ్।
కామయే దుఃఖతప్తానాం – ప్రాణి నా మార్తినాశనమ్॥"

తా॥ "నేను రాజ్యాన్ని కోరను, స్వర్గాన్ని కోరను, పునర్జన్మ రాహిత్యాన్ని (మోక్షాన్ని) కోరను. దుఃఖంతో బాధపడుతున్న ప్రాణులయొక్క దుఃఖనాశనాన్ని కోరుతున్నాను." సరిగ్గా ఇదే భావాన్ని తిలక్‌గారు తన గేయంలో వెల్లడించారు.

"తపాలా బంట్రోతు కవిత" నా కోరిక మీద వ్రాశారు తిలక్. అప్పుడు నేను తణుకు పోస్టాఫీసులో గుమస్తాగా పనిచేస్తూ ఉండేవాడిని. 1959 ఆగస్టు నెలలో పశ్చిమగోదావరిజిల్లా తంతితపాలాశాఖ భీమవరంలో జరుపుకొనే వార్షికోత్సవాలలో చదవడంకోసం ఈ కవిత వ్రాయమన్నాను. హరిశ్చంద్రుని వెనుక నక్షత్రకుడిలా వెంటపడి రోజూ పీడించేవాడిని. ఎన్ని రోజులు అడిగినా వ్రాయలేదు. "చూద్దాంలే! చూద్దాంలే!" అనేవారు నస్యం బాగా ముక్కులోకి దట్టిస్తూ. ఆ వార్షికోత్సవం కాస్తా వచ్చి వెళ్ళిపోయింది. మూడు నెలల తరువాత ఒకరోజు నన్ను ఇంటికి పిలిచి ఈ కవిత చదివి వినిపించారు. నేను ఎగిరి గంతేశాను. ఎంతో ఆనందించాను. "ఇంత మంచికవిత నేను వ్రాయమన్నప్పుడు వ్రాయలేదు. మూడునెలల తరువాత వ్రాశారు. వార్షికోత్సవం కాస్తా అయిపోయింది" అన్నాను. "నువ్వు వ్రాయమన్నప్పుడు వ్రాస్తే ఏడిసినట్టు వచ్చేది. నువ్వు చెప్పిన Subject నా మనసులో మూడునెలలు నానింది కాబట్టే ఇంత బాగా వచ్చింది!" అన్నారు తిలక్. (ఈ కవిత గోరాశాస్త్రిగారి 'ఆంధ్రజనత' దినపత్రికలో దీపావళి ప్రత్యేకసంచికలో వచ్చింది. తిలక్, గోరాశాస్త్రిగారి అభిమాని.)నాతో సంభాషిస్తున్నట్టుగా ఈ కవిత ప్రారంభమవుతుంది. నాయకుడు ధీరోదాత్తుడుగా ఉండాలని మన పూర్వులు శాసించారు. సామాన్యుడైన పోస్టుమేన్ మీద కవిత ఏమిటి? అన్నట్టుగా వ్యంగ్య వైభవంతో ప్రారంభిస్తారు కవితను:-

మైడియర్ సుబ్బారావ్!
కనిపించడం మానేశావ్!
ఏఁవిటీ! - పోస్టుమాన్ మీద గేయం వ్రాయాలా?
అందమైన అమ్మాయి మీద కాని
చందమామ మీద కాని
వంద్యుడైన భగవంతుడి మీద కాని, అ
వంద్యుడైన ధీరనాయకుడి మీద కాని
పద్యాలల్లమని మన పూర్వులు శాసిస్తే
ఎక్కడి పోస్టుమానో యీ గోల?
ఈ చల్లని సాయంత్రం వేళ!
ధనవంతుణ్ణి స్తుతిచేస్తే

పది డబ్బులు రాలుతాయి
సచివోత్తముణి స్మరిస్తే
పదికళ్ళు మనమీద వాలుతాయి.
ఈ నీ ప్రార్థన కదుంగదు అసభ్యం సుబ్బారావ్!
ఉత్త పోస్టుమాన్ మీద ఊహలు రానేరావు!

కాని ఆధునిక సాహిత్యంలో అభ్యుదయ కవిత్వంలో సామాన్యులే నాయకులు అని ధ్వనింపజేస్తూ, పోస్టుమేన్‌వంటి అతిసాధారణమైన వ్యక్తి, తన విధిని తాను నిర్వర్తిస్తూ సమాజానికి ఎంత గొప్ప సేవచేస్తున్నాడో కళ్ళకు కట్టినట్టు చూపించారు తిలక్. ఒక మధ్యతరగతి యువతి, అమెరికాలో ఉన్న భర్తనుండి ఉత్తరం కోసం ఆత్రంగా ఎదురు చూడటం ఎంతో రమ్యంగా వర్ణించారు తిలక్. (ఈ యువతి ఎవరో కాదు, తిలక్‌గారి చెల్లెలు శ్రీమతి ఎల్లా బాలాత్రిపుర సుందరే! అప్పుడు ఆమెభర్త శ్రీ ఈవని సుబ్బరాయశాస్త్రిగారు అమెరికాలో ఉండేవారు.)

ఆ కిటికిలో రెండు విచ్చిన కలువల్లాంటి కళ్ళు
వీథిమొగవైపే ప్రసరిస్తోన్న చూపుల ముళ్ళు
ఆ కళ్లల్లో ఆత్రుత
ఆ గుండెల్లో గడచిన
దేశాంతరగతుడైన
ప్రియుడి వార్తకోసం తహతహ!
అమ్మాయీ!...
నీ చూపులు తుమ్మెదబారులు కట్టి
నీ కోర్కెలు గజ్జెలవలె ఘలంఘలించి
వీథివీథినంతా మేల్కొల్పుతున్నాయి
వీథివీథినంతా కలయజూస్తున్నాయి
అదుగో పోస్టుమాన్!
ఒక్క ఉదుటున వీథిలోకి నువ్వు
అతని మొహం మీద లేదని చెప్పడానికి బదులు చిరునవ్వు!
వెళ్ళిపోతున్న తపాలా బంట్రోతు వెనుక
విచ్చిన రెండు కల్హార సరస్సులు!!

తరువాత శ్రామికవర్గానికి చెందిన ఒక పండుముసలి అవ్వ, అస్సాం రైఫిల్స్ లో సోల్జర్‌గా పనిచేస్తున్న తన ఒకే ఒక కొడుకునుండి ఉత్తరం వస్తుందేమోనని ఎదురు చూడటం వర్ణిస్తారు:–

గుడిసెముందు కూర్చున్న పండుముసలి అవ్వ
గడచిన బ్రతుకంతా కష్టపు నెత్తుటి కాల్వ
కనపడీకనపడని కళ్ళల్లో
కొడిగట్టిన ప్రాణపు దీపంలో
తానుకనిన తన ప్రాణం
తనకు మిగిలిన ఒకే ఒక స్వప్నం
తన బాబు, తన ఊపిరి
అస్సాం రైఫిల్స్‌లో సోల్జర్ సిమ్మాచలం
కోసం నిరీక్షణ
క్షణక్షణ ప్రతీక్షణ
ఒక కార్డుముక్క వ్రాశాడా?
బంట్రోతూ! వెళ్ళువెళ్ళు త్వరగా
ముసలిదానికి మంచి వార్త నందించు
ముడతలు పడిన మొహంమీద ఆనందాన్ని పరికించు!!

నిస్వార్థంగా, ఫలం ఆశించకుండా కర్మచేసే యోగిలాంటివాడు పోస్టుమాన్ అని నిరూపిస్తూ కవితను ఇలా గంభీరంగా, తాత్త్వికంగా ముగిస్తారు:

ఇన్ని యిళ్ళు తిరిగినా
నీ గుండె బరువు దింపుకోవడానికి ఒక్క గడప లేదు.
ఇన్ని కళ్లు పిలిచినా
ఒక్క నయనం నీ కోటుదాటి లోపలికి చూడదు
ఉత్తరం యిచ్చి నిర్లిప్తుడిలాగ వెళ్ళిపోయే నిన్ను చూసినప్పుడు
తీరం వదలి సముద్రంలోకి పోతూన్న ఏకాకినౌక చప్పుడు...

మనం పోస్టుమేన్‌ని ఒక ఉద్యోగిగా (నౌకరుగా) చూస్తామే కాని ఒక మనిషిగా చూడం. ఈ కవిత తిలక్‌గారికి ఎన్నో ఏళ్ళుగా లేఖలు అందించిన "సత్యం" అనే పోస్టుమన్‌ని దృష్టిలో పెట్టుకొని వ్రాశారు. ఈ కవితను ఒక ఒజ్జ బంతిగా

చేసికొని, ఒక మంచి ఒరవడిగా తీసికొని తరువాతి కాలంలో ఎందరో యువకవులు సామాన్యులను కవితానాయకులుగా చేసికొని, ఎన్నో కవితలు వ్రాశారు. ఎండ్లూరి సుధాకర్‌గారి 'గూర్ఖా', 'మైసమ్మ మరణం'; శిఖామణిగారి "ప్రమిద క్రింద చీకటి" (నర్సు); ఇతర కవుల "వంట బ్రాహ్మడు" – "లేడీ కండక్టర్" – "పూల కుర్రాడు" – "పని మనిషి" – "చెప్పులు కుట్టేవాడు" – "గొడుగులు బాగుచేసేవాడు" – "సర్కస్ బాలిక" (పాటిబండ్ల రజని) – "మెహందీలో వేశ్య" (ఓల్గా) మొదలైనవి ఎన్నో వచ్చాయి.

వైశంపాయనుడు – జనమేజయునకు చెప్పినట్టుగా, సూతుడు–శౌనకాది మహామునులకు చెప్పినట్టుగా, తిలక్‌గారు నాకు చెప్పారు ఈ కవితను. ఈ కవితకు నేను శ్రోతను. మొదట నాతో సంభాషిస్తారు. తరువాత కవితలోని ఒక పాత్ర అయిన యువతితో సంభాషిస్తారు. ఆ తరువాత కవితానాయకుడైన తపాలా బంట్రోతు (Postman) తో సంభాషిస్తారు. చాలా అందమైన మిక్కిలి సరళమైన శైలిలో సాగుతూ (విప్రలంభ) శృంగార, కరుణ రసాలను వర్ణించిన మంచి కవిత యిది.

"తిలక్ భావకవా? అభ్యుదయకవా?" అని విమర్శకులలో ఒక చర్చ జరిగింది, జరుగుతోంది. ఈ చర్చకు డా॥ రెంటాలవారు చక్కని సమన్వయాన్ని సాధించారు. "అభ్యుదయ కవితాతత్త్వం మార్క్సిజంనుంచి అవతరించింది. సమాజాన్ని విశ్లేషించి సానుభూతి చూపడం కాక, చైతన్యపరచి మార్చడం దాని లక్ష్యం. తిలక్ కవిత్వంలో విశ్లేషణ ఉన్నట్టుగా, మార్చాలన్న చైతన్యంగాని, మార్చగలమన్న విశ్వాసం గాని లేవు. సూక్ష్మ వివేచనలో–అభ్యుదయ కవితావస్తువుకు భావకవి ప్రతిస్పందనగా తడుతుంది ఈయన కవిత్వం. కవిత్వ రహస్య తత్త్వవేత్తగా మాత్రం ఎందరికో మార్గదర్శి అయినవారు తిలక్." ("తిలక్ కవితాతత్త్వం – దృక్పథం" అనే వ్యాసం, లోపలికి..., పుట–116).

యుద్ధవిముఖత లేక వ్యతిరేకత, శాంతికాముకత (శాంతిప్రియత), మానవతాదృక్పథం, అంతర్జాతీయ దృక్పథం, వసుధైక కుటుంబ భావన మొదలైనవన్నీ అభ్యుదయకవిత్వంలోని భాగాలే. కాని స్పష్టతకోసం వీటిని విడిగా చర్చిస్తున్నాను.

V. యుద్ధకవిత్వం:–

"అమృతం కురిసిన రాత్రి" లో అన్నిటికన్నా యుద్ధకవితలు ఎక్కువగా ఉన్నాయి - (పధ్నాలుగు కవితలు). తిలక్‌గారు తన జీవితంలో మూడు యుద్ధాలు చూచారు. (1) రెండవ ప్రపంచయుద్ధం (1939-1944); (2) చైనాయుద్ధం (1962); (3) మొదటి పాకిస్థాన్‌యుద్ధం (1965)

(1) రెండవ ప్రపంచయుద్ధం (1939-1944): ఇది తిలక్‌గారిని బాగా కలచి వేసింది. దీనిని వ్యతిరేకిస్తూ అనేక కవితలు, కథలు వ్రాశారు, "సైనికుడి ఉత్తరం - శిక్షాపత్రం -టులాన్ - పాడువోయిన ఊరు - లయగీతం - యుద్ధంలో రేవుపట్టణం - శవం - వెళ్ళిపొండి! వెళ్ళిపొండి! - పిలుపు - నిన్నరాత్రి" అనే పది కవితలు దీనికి సంబంధించినవే. "ఈ రాత్రి-2" - "కఠినోపనిషత్" - "న్యూసిలబస్" వంటి మరికొన్ని కవితలలో అక్కడక్కడ కొన్ని పాదాలలో యుద్ధవిముఖత- శాంతిప్రియత - మానవత గోచరిస్తాయి. "వెళ్ళిపొండి! వెళ్ళిపొండి" అనే కవితలో యుద్ధాలవల్ల మానవజాతికి కలిగే దుర్భర విషాదాన్ని, ముఖ్యంగా అనాథలైపోయే స్త్రీల బాధల్ని చిత్రించారు తిలక్. పురుషులు యుద్ధాలుచేసి చనిపోతారు. వారి తల్లులు, భార్యలు, అక్క చెల్లెండ్రు వారికోసం భోరున ఏడుస్తారు. ఎవరీ మాయదారి యుద్ధాలకు కారకులు? అని ప్రశ్నించి, ఇలా సమాధానం చెపుతారు తిలక్:

కురుక్షేత్రమయితే కృష్ణుడ్ని అడుగు
పానిపట్టయితే పీష్వాల నడుగు
బొబ్బిలయితే బుస్సీనడుగు
క్రిమియా యుద్ధం, కొరియా యుద్ధం
ప్రథమ ద్వితీయ ప్రపంచయుద్ధాలు
బిస్మార్క్ నడుగు హిట్లర్ నడుగు
బ్రహ్మదేవుణ్ణి అడుగు!

లక్షలాది ప్రజలు చనిపోయిన రెండవ ప్రపంచయుద్ధంవల్ల మానవజాతి భవిష్యత్తు సర్వనాశనమై పోయిందనీ, మానవ నాగరికత మైలపడిపోయిందనీ, వాపోతూ ఇలా అంటారు తిలక్:

యుద్ధం మీద యుద్ధం వచ్చినా/ మనిషి గుండె పగలలేదు
మనిషి మీద మనిషి చచ్చినా/కన్ను తుదల జాలి లేదు

నాగరికత మైలపడిన దుప్పటిలా నన్ను కప్పుకుంది ......
పాముకోర దేగరెక్క ఈ కాలానికి చిహ్నం
పూలతేనె నెమలిరెక్క ఒక మిథ్యాప్రమాణం
నా ప్రవృత్తి పసుపువన్నెల పెద్దపులిలా పరచుకుంది
ఏదో విపత్ దూరంగా మబ్బులలో దాగి వుంది (ఈ రాత్రి–2)

(2) చైనాయుద్ధం (1962): 1962లో చైనా మనదేశంపై అన్యాయంగా దండయాత్ర చేసింది. దానిని ఖండిస్తూ, భారత వీరులను ప్రశంసిస్తూ తిలక్ మూడు కవితలు వ్రాశారు: "త్రిశూలం" – "మళ్ళీ ఒక దీపావళి", "సమవాకారం". రెండవ ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకించిన తిలక్, ఈ కవితలలో యుద్ధాన్ని సమర్థించడం చూస్తాం. దీనికి తిలక్‌గారి దేశభక్తి కారణం. పైగా మనం ఎవరిపైనా దండెత్తి వెళ్ళలేదు. మన మీదకు అన్యాయంగా విరుచుకుపడిన చైనా, పాకిస్థాన్‌లను ఎదిరించాం. ఇది దేశభక్తి అవుతుంది. కాని యుద్ధోన్మాదం కానే కాదు. ఒకచోట యుద్ధాన్ని వ్యతిరేకించడం, మరొకచోట యుద్ధాన్ని సమర్థించడం–ఏమిటి ఈ వైరుధ్యం? అనుకునే వారికి చక్కని సమాధానం చెప్పారు డా॥ రెంటాల. "యుద్ధంలో అమానుషత్వాన్నే కాక ధర్మాగ్రహాన్ని కూడా తిలక్ గుర్తించారనుకోవాలి." (చూ.లోపలికి, పుట 119)

(3) మొదటి పాకిస్థాన్‌యుద్ధం (1965): దీనినిగురించి తిలక్ ఒకే ఒక్క కవిత వ్రాశారు. (అప్పటికే ఆయన ఆరోగ్యం దెబ్బతిని ఉండాలి. మరుసటి సంవత్సరమే చనిపోయారు.) దాని పేరు "అమ్మా! నాన్న ఎక్కడికి వెళ్ళాడు?". ఇది గుండెలను పిండివేసే కరుణరస భరితమైన కవిత. ఇది మొదట రేడియోలో చదివిన కవిత. తరువాత పత్రికలో వచ్చింది, రేడియో కవిత కావడంవల్ల తిలక్ కొంత కథాకథనాన్ని ఎంచుకున్నారు. రేడియోకి శ్రోతలుంటారు కాని, చదువరులుండరు కదా! ప్రతీకలు, భావచిత్రాలు ఏమీ లేవు. సరళంగా సాగిపోతుంది. అంతమాత్రంచేత ఇది కవిత్వం కాదు అని అనలేం. 1972లో వచ్చిన రెండవ పాకిస్థాన్‌యుద్ధ సమయంలో నేను ఈ కవితను, మిలిటరీ ఆఫీసర్లు జవాన్లు మద్రాసులో నిర్వహించిన ఒక సభలో చదివాను. ఒక మిలిటరీ ఆఫీసరు భార్య (మా తమ్ముడు కర్నల్ టి.కె.మూర్తి భార్య చి.సౌ. శంకరి) భోరున భోరున ఏడ్చేసింది! ప్రతీకలు, భావచిత్రాలు లేనంతమాత్రాన కవిత్వం కాకుండా పోదు.

భావావేశం, రసాత్మకత, వర్ణనాబలం ప్రధానం. మామూలు శ్రోతలకన్నా మిలిటరీకి సంబంధించిన శ్రోతలు, ముఖ్యంగా వారి స్త్రీలు దీనిని వింటే "కన్నీరుగా కరగిన గీతకలై" పోతారు! ఈ కవితలోని విషాదాన్ని తట్టుకోలేరు. ఒక సామాన్య సైనికుని భార్య దేశంకోసం భర్తను త్యాగంచేసి, ఎంతటి దుఃఖాన్ని దిగమ్రింగుతుందో కళ్ళకు కట్టించారు తిలక్ ఈ కవితలో. ఆయన దేశభక్తి, యుద్ధసమర్థన ఈ కవితలో పుష్కలంగా ఉన్నాయి. ఇది తిలక్ కరుణరస పోషణకు చక్కటి ఉదాహరణం.

ఇండియా పాకిస్థాన్ మధ్య యుద్ధం జరుగుతూ ఉంటుంది. ఒక భారతీయ సైనికుడు కాశ్మీర్ సరిహద్దుల్లో యుద్ధంచేస్తూ ఉంటాడు. అతని స్వస్థలంలో అతని భార్య తన నాలుగేళ్ళ పిల్లవాడిని తీసికొని రోజూ పార్కుకి వచ్చి యుద్ధ వార్తలు వింటూ వుంటుంది. తన భర్త శౌర్యానికి గర్విస్తూ ఉంటుంది. "మృదు గర్వరేఖ ఆమె పెదాల చిరునవ్వుతో కలిసి పోయింది" అంటారు తిలక్. కొన్ని రోజులు గడుస్తాయి. యుద్ధం తీవ్రమవుతుంది: ఎందరో సైనికులు చనిపోతూ ఉంటారు.

ఆమె రోజూ వస్తుంది పార్కులోకి వార్తల కోసం
అలాగే తెల్లని చీర కట్టుకుని - ఎర్రని బొట్టు పెట్టుకొని
నల్లని వాల్జడలో తెల్లని సన్నజాజులు తురుముకొని
అదే పార్కు అదే రోడ్డు అదే బజారు అదే యిల్లు
అయినా ఆమె ఏదో మార్పుని పసికట్టింది
అందరూ తింటున్నారు తిరుగుతున్నారు
అయినా ఎక్కడో దెక్కు పట్టింది!

తరువాత చైనా పాకిస్థాన్ దేశాలు మనమీద కత్తికట్టడాన్ని విమర్శిస్తారు తిలక్. **"పాకిస్థాన్ చైనాల పరస్పర మైత్రి / పాము తోడేలూ కలిసినట్టు"** అంటారు. మన యుద్ధాన్ని సమర్థిస్తారు. తన దేశభక్తిని చాటుతారు. భారతజాతిని చూచి గర్విస్తారు. ఈ కవితలో చివరి దృశ్యం కరుణరసనిర్భరంగా ఉండి, శ్రోతల హృదయాలను కలచివేస్తుంది:

ఆమె ఆ రోజు కూడా కొడుకుతో పార్కుకి వచ్చింది
అలాగే తెల్లచీర కట్టుకుంది గాని ఎర్రని బొట్టు లేదు

నల్లని వాల్జడలో తెల్లని సన్నజాజులు లేవు, చేతులకు గాజులు లేవు
ఆమె సోగకన్నులలో వానకురిసి వెలిసిన ఆకాశం స్ఫురించింది
ఆమె చీటికీ మాటికీ అదిరే పెదవిని మునిపంటితో నొక్కుతోంది
అక్కడ చేరిన గుంపులు 'జైహింద్' అన్న నినాదం చేశారు
"అమ్మా! నాన్న ఎక్కడికి వెళ్ళాడు? ఇంకా రాడేం?"
అని అడుగుతున్న కుమారుణ్ణి అక్కున చేర్చుకుని
ఆమె కూడా రుద్ధకంఠంతో 'జైహింద్' అని మెల్లగా పలికింది
ఆ మాట స్వర్గంలో ఒక వీరునికి హాయిగా తీయగా వినపడింది!

కరుణ రసానుభూతికి ఇంతకన్నా మంచి ఉదాహరణం ఇంకేముంటుంది?

VI. మానవతావాదం:-

తిలక్ సంపూర్ణంగా అభ్యుదయకవి కానట్టే, సంపూర్ణంగా మానవతావాది కూడా కాదు - అంటారు డా॥ రెంటాల. మానవతావాదాన్ని నిర్వచించి, దానిని తిలక్‌కి అన్వయించి ఈ విషయాన్ని తేల్చి చెప్పారు. "మానవుడే అన్ని వస్తువులకు ప్రమాణం అంటుంది మానవతావాదం. సృష్టిలో మానవుడి ప్రాధాన్యాన్ని అది గుర్తిస్తుంది. అతని స్వయంనిర్ణయశక్తిని, మేధను, స్వేచ్ఛను గౌరవిస్తుంది. అతీతశక్తి ఒకటి (దైవం) మానవుణ్ణి నియంత్రిస్తుందని అది నమ్మదు. మొత్తం మానవజాతి పరిణామవికాసాలకు మానవుడే స్రష్ట అని చెబుతుంది. అయితే - మానవుడే సృష్టి కేంద్రం అనీ, మార్పు ఎప్పుడూ ఉత్కర్షాపథాన్నే (మెరుగైన మార్గాన్నే) అనుసరిస్తుందనీ నమ్మే మానవతావాదం తిలక్‌లో కనిపించదు" (లోపలికి... పుట 109). దీనికి కారణాలను కూడా డా. రెంటాల చూపించారు:

(1) "మైనస్ యింటూ ప్లస్" కవితలో మానవునికన్నా కలరా బేసిలై శక్తిమంతమైనదని అన్నారు తిలక్.

(2) "ప్లస్ యింటూ మైనస్" కవితలో దేవుడికి మానవుడికి దగ్గరి సంబంధం ఉందన్నారు.

దేవుణ్ణి తిరగేస్తే మానవుడు, మానవుణ్ణి తిరగేస్తే దానవుడు
దేవుడికి మానవుడికి ఎప్పుడూ సరిపడని దాంపత్యం
ఇద్దరికీ విడాకులు ఏ కోర్టూ ఇవ్వలేదు విచిత్రం!

(3) "న్యూసిలబస్" కవితలో 'ఆశ'–విధి'అనేవి మానవుణ్ణి నియంత్రిస్తున్నాయి – అన్నారు:

ఆశ ఉత్తర ధ్రువం, విధి దక్షిణ ధ్రువం
మనిషి రెండింటి మధ్య బంతిలా ఎగిరిపడే ప్రహసనం!

(4) "కాయ్ రాజా కాయ్" కవితలో, మానవుని శక్తిసామర్థ్యాలకన్నా అదృష్టం (luck) గొప్పది అని తీర్మానించారు. ఈ నాలుగు కారణాలను బట్టి తిలక్ పూర్తి మానవతావాది కాదు అని చెప్పవచ్చును.

అయితే తిలక్ మతాన్ని దైవాన్ని నెత్తిన పెట్టుకొని పూజించలేదు. "నిన్నరాత్రి!" కవితలో, లోకంలో పేదలు ఆకలిబాధతో, పడుపువృత్తితో, ఆత్మహత్యలు చేసుకుంటూ, అకారణయుద్ధాల్లో సమిధల్లా అహుతి అయిపోతూ ఉంటే, దేవుడు ఏమీ చెయలేని నిస్సహాయస్థితిలో ఉన్నాడని అధిక్షేపించారు. "కఠినోపనిషత్" కవితలో మనం చరిత్రలో "ఒక్కొక్క యుద్ధంలో మనుష్యుల్ని చంపి నాగరికతను రక్షించే అద్భుత" ప్రయత్నాలు చేశామనీ, "ఆస్తికులు, నాస్తికులు, మతాలు, సిద్ధాంతాలు మనుష్యుల్ని మరచి పరమసత్యాలను తరచి పైకి" తీస్తున్నారని వ్యంగ్యంగా ఎత్తిపొడిచారు. సాటిమనిషి పట్ల ప్రేమ, సానుభూతి ఉన్నది మానవతా దృక్పథం. తోటివాళ్ళకోసం ఆరాటపడటం, త్యాగం చెయ్యటం, ఈ దృక్పథం ఉన్న వ్యక్తులలో మనం చూస్తాం. జాలి, క్షమ, సానుభూతి, మానవప్రేమ – అనే మానవతా దృక్పథంలోని ప్రధాన అంశాలు తిలక్‌గారి కవిత్వంలో అడుగడుగునా మనకు కనిపిస్తాయి. మానవ దుఃఖానికి చలించిపోతాడు తిలక్. ఆయన హృదయం ద్రవించి పోతుంది. ఆరుద్ర అన్నట్టుగా "తిలక్ ఉత్త దయామయుడు". "వెళ్ళిపొండి, వెళ్ళిపొండి" కవితలో చరిత్రలో వివిధ యుద్ధాలలో చనిపోయిన సైనికుల తల్లులు, భార్యలు, అక్కలు, చెల్లెళ్ళు పొందిన దుఃఖంతో తిలక్ మమేకమైపోతారు. "ఆర్తగీతం" కవిత ఆయన దయామయ హృదయానికి ఎత్తిన జయపతాక! "నా కవిత్వం" కవితలో తన కళాకరవాల ధగద్ధగ రవాలుగా చెప్పుకున్న "త్యాగశక్తి, ప్రేమరక్తి, శాంతిసూక్తి" అనే మూడూ మానవతా దృక్పథంలో అతి ముఖ్యమైన మూడు అంశాలు. కుందుర్తి అన్నట్టుగా "తిలక్ ఖచ్చితమైన మానవతావాది. కేవలం వ్యక్తిగతమైన అనుభూతికి సంబంధించిన మానవతాభావనకు, సమాజపరమైన కారుణ్యభావనకు చాలా తేడా ఉంటుంది. తిలక్ నిశ్చయంగా ఈ రెండవ పద్ధతికి

చెందినవాడు". కొన్ని ఉదాహరణాలను చూద్దాం:

(1) **చావు పుట్టుకల మధ్య సందేహంలాంటి**
జీవితంలో నలువైపులా అంధకారం
మంచిగంధంలాగ పరిమళించే మానవత్వం
మాకున్న ఒకే ఒక అలంకారం (–ప్రార్థన)

(2) **అన్నీ పోగొట్టుకున్న నాలో ఆనందం తరగలేదు**
ఆకాశమంత నా ఏకాంతంలో
అనంత మానవ హృదయ స్పందనం వినడం మానలేదు
(– అదృష్టాధ్వగమనం)

(3) **మాటల మ్యేజిక్కు నమ్మి, పాటల మ్యూజిక్కు నీలో క్రమ్మి**
మరచిపోకు అసలువాణ్ణి నీ సోదరుడైన మానవుణ్ణి (– కవి వాక్కు)

(4) **మానవత లేని లోకాన్ని స్తుతింపలేను**
మానవునిగా శిర సెత్తుకు తిరుగలేను
ఈ నాగరికతారణ్యవాసం భరించలేను (–ఆర్తగీతం)

(5) **సంకుచితమైన జాతిమతాల సరిహద్దుల్ని చెరిపి వేస్తున్నాను నేడు**
అకుంఠితమైన మానవీయపతాకను ఎగురవేస్తున్నాను చూడు
చరిత్ర రక్తజలధికి స్నేహసేతువు నిర్మిస్తున్నాను రండి
కవివచస్సవితృ కాంతిపూరమిది స్వేచ్ఛగా జలకమాడండి
(–వసుధైకగీతం)

(6) "అంతర్జాతీయ దృక్పథం" – "వసుధైక కుటుంబ భావన" అనేవి కూడా మానవతావాదంలోనివే. వామనుడు త్రివిక్రమరూపాన్ని ధరించినట్లుగా, నేటి మానవుడు ప్రపంచమంతా వ్యాపించి ఉన్నాడని, అతడు విశ్వరూపాన్ని ధరించాడని చెపుతూ తిలక్ ఇలా అంటారు:
భూమధ్యరేఖ నా గుండెలోంచి పోతోంది
భ్రుకుటి లోపల నక్షత్రగోళం తిరుగుతోంది
ఈ వేళ నన్నానవాలు పట్టలేవు నువ్వు
సూర్యుడిని చూడు నా తలమీద పువ్వు!
అట్లాంటిక్ కల్లోల తరంగాల మేను వాల్చింది నేను

పసిఫిక్ లోతులలో రత్నాల్ని వెదకి తీసింది నేను
ఉత్తర ధ్రువాన ఒక పాదం దక్షిణ ధ్రువాన మరోపాదం
సర్వంసహాచక్రవర్తిపదవి సంపాదించుకున్నాను నేను!

(–వసుధైకగీతం)

తిలక్ వార్తాపత్రికలో ఒక వార్త చదివారు. అమెరికాలో నీగ్రోలకు ఆటపట్టైన "హార్లెమ్స్ స్క్వేర్" అనే ప్రదేశంలో ఒక తెల్లదొర "జేమ్స్ పోవెల్" అనే ఒక నీగ్రోజాతి విద్యార్థిని అవమానించాడు. "ఎందుకు నన్ను అవమానిస్తున్నారు?" అని ఆ కుర్రాడు ఎదురుతిరిగి ప్రశ్నించాడు. దానికి ఆ దొర కోపించి, అతణ్ణి పిస్తోలుతో కాల్చి చంపాడు. ఈ వార్తకు చలించిపోయిన తిలక్ "హార్లెమ్స్‌లో శవం" అనే కవిత వ్రాశారు. ఆ శవం ప్రపంచంలోని ప్రతిమానవుణ్ణి ప్రశ్నిస్తోంది అన్నారు.

"బ్రతికిన పావెల్‌భాష తెలియనివాడా?
చచ్చిన వాని శవం పలకరిస్తే వినలేవా?
... దేశదేశాల మనుష్యులారా!
చచ్చిన పావెల్ మీ తమ్ముడు, మీ మేనల్లుడు
మీ లోపలి మానవుడు! .....
ప్రతి ఒకడూ దీనికి బాధ్యుడు
చరిత్ర పగనెవడూ తప్పించుకోలేదు!"

"వసుధైకగీతం – చావులేని పాట – పిలుపు – మేగ్నాకార్టా – ప్రకటన – కాస్మోపాలిటన్ – కఠినోపనిషత్ – నిన్నరాత్రి – ప్లస్ యింటూ మైనస్ – మైనస్ యింటూ ప్లస్ – భరతవాక్యం – నిజాలు – ఈ రాత్రి–2 – దీపం – వెళ్ళిపొండి వెళ్ళిపొండి – ఆర్తగీతం – న్యూ సిలబస్ – మన సంస్కృతి – పోయిన వజ్రం – అదృష్టాధ్వగమనం – హార్లెమ్స్‌లో శవం – ప్రార్థన – కవివాక్కు" మొదలైన అనేక కవితలలో తిలక్ మానవతావాదం మనకు స్పష్టంగా గోచరిస్తుంది.

VII. తాత్త్వికత:–

కొన్ని కవితలలో తిలక్ ముసలితనాన్ని గురించి, మరణాన్ని గురించి, జీవితాన్ని గురించి, సృష్టితత్త్వాన్ని గురించి – వేదాంతదృష్టితో చింతన చేశారు.

"శిక్షాపత్రం" అనే కవితలో మరణాన్ని తాత్త్వికంగా విశ్లేషించడం చూడండి:

ఒకనాడు గలగలా ఫెళ ఫెళా విరిగి పడుతుంది
నీ రంగు రంగుల గాజుపెంకుల మేడ
ఒకనాడు తెరచుకొని, పరచుకొని పంజాను చరచుకొని
బోనువీడి వస్తుంది క్రౌర్యమనే పసుపువన్నెల పెద్దపులి!
ఒకనాడు వేదం - శాస్త్రం - విజ్ఞానం, పట్టణాలు, పల్లెటూళ్ళు,
ప్రాక్పశ్చిమాల విషపు పరిధులు
తిరిగి తిరిగి గిర్రున తిరిగి తిరిగి
పిడికెడు బూడిదలో పేర్లు వ్రాసికొనును!

అలాగే "ముసలివాడు" అనే కవితలో 'చీకటి'ని మరణానికి సంకేతంగా గ్రహించి ఒక ముసలివాడి మాటల్లో ఇలా అంటారు:

చివరకు చివరకు అక్కడికే అక్కడికే
అది జీవిత పరమసత్యం
అది నాగరికత గమ్యస్థానం
అది చరిత్రల సారాంశం
అక్కడి చీకటి లోతెరుగని చీకటి
దట్టపు చీకటి సుడితిరిగే చీకటి
పాములు బుసకొట్టే చీకటి
తుది ఊపిరి మసలే అక్కడికే అక్కడికే
వెళ్ళబోయే ముసలివాణ్ణి నాయనలారా! ముసలివాణ్ణి!

"దీపం" అనే కవితలో ప్రపంచంలోని ప్రాణులన్నింటినీ దీపాలుగా భావించి, ప్రాణచైతన్యానికి సృష్టిలాలసకు ఆశ్చర్యపోతారు తిలక్:

ఎన్ని కోరికలు! ఎన్ని ప్రవృత్తులు
ఎన్ని విచిత్ర పకృత్యార్భాట ఝంఝా మరుత్తులు
ఎన్ని చలత్ హేమంత వర్షా నిదాఘ ఋతు శకుంత గరుత్తులు!
ఈ అనంతద్రవ్యంనుండి ఎంత వైశ్వానరశక్తి
శిలను చీల్చి సిరలు దాల్చి చిగురించిన ప్రాణయుక్తి
ఎంత సృష్టి లాలస! ఎన్నెన్ని ప్రాణాలు! ఇవన్నీ దీపాలు!

ఈ క్రింది కవితలలో కూడా తిలక్ తాత్త్వికత గోచరిస్తుంది:

"అద్వితీయం" = స్త్రీ పురుషుల కలయిక సృష్టికి మూలం
ప్రకృతి పురుషుల కలయికయే సృష్టి
ప్రేమయే సృష్టికి మూలం.

"ప్రవల్లిక" = స్త్రీని గురించిన సత్యాన్వేషణ.

"కిటికీ" = ప్రకృతి సౌందర్య తత్త్వం.

"చిన్నారికి చిన్నమాట"=జీవన రహస్యాన్ని గురించిన అన్వేషణ

కాయ్! రాజా! కాయ్!"= జీవితాన్ని ఒక జూదంగా భావించి చెప్పడం.

VIII. ఇతరములు:-

8.1 ఉగాది కవితలు= "పోయిన వజ్రం" (మానవత); శిఖరారోహణ (అభ్యుదయం)

8.2 నగర వర్ణన =

(1) "నగరం మీద ప్రేమగీతం" (హైదరాబాద్ నగర వర్ణన – ఆ నగరాన్ని ఒక ప్రేయసిగా భావించడం బాగుంది).

(2) రాజమండ్రి పాటలు (పట్టణ వర్ణన)

(3) నగరంలో హత్య (హైదరాబాద్)

8.3 చమత్కారం–హాస్యం = "న్యూ సిలబస్" "అభినవ ఋగ్వాదం" "రాజమండ్రి పాటలు" – "కాస్మాపాలిటన్"

8.4 అభినందనలు= "కొనకళ్ళకు అక్షరాంజలి" (కొనకళ్ళ వెంకటరత్నంగారికి సన్మానసభ – అభినందన)

8.5 అనువాద కవితలు (ఆంగ్లంనుండి) = (1) "నీవు" – (2) "యీడిపస్" (3) "నగరంపై పీడనీడ".

తిలక్‌గారి చమత్కారానికి, హాస్యానికి కొన్ని ఉదాహరణాలు:

(1) **కన్నీరుకీ పన్నీరుకీ మున్నీరుకీ నీరు సమానం**
అయితే గోదావరి ఏ నీరు? –ఏడ్వనీరు, చావనీరు!(–రాజమండ్రి పాటలు)

(2) **అమెరికాలో డాలర్లు పండును**
ఇండియాలో సంతానం పండును

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ
ధనవంతుడి చుట్టూ తిరుగుతోంది ...
భూమధ్యరేఖ దగ్గరకన్నా ఆడదాని భ్రూమధ్యరేఖ దగ్గర వేడి ఎక్కువ
ఎన్నికలలో ఎగరేసిన వాగ్దానపు కత్తులకు
మొనకన్నా పిడిదగ్గర వాడి ఎక్కువ (– న్యూ సిలబస్)

(3) **ఆస్ట్రేలియన్ ఎబోరిజన్సు మీదా, నెసెసిటీ ఆఫ్ ఎబోర్షన్సు మీదా**
కలిపి ఒకే ఒక ఉద్గ్రంథం రచించారు
గాంధీకీ గాడ్సేకీ దాన్ని అంకితం ఇచ్చారు.
మొదటి భార్య నీయన వదిలేశారు
రెండో ఆవిడ యీయన్ని తగిలేసింది
మూడో పెళ్ళాంకోసం మొనాకో పేపర్లో ప్రకటించారు
పారిస్‌లో కవితనీ షాంపేన్‌నీ కలిపి సేవించారు
ఫ్లారెన్స్‌లో యువతినీ ప్రకృతినీ కలిపి అనుభవించారు.
(– కాస్మాపాలిటన్)

కవిత్వ రహస్య తత్త్వవేత్తగా తిలక్:–

తిలక్ కవితారహస్యాన్ని, ఆయన కవిత్వపు జీవనాడిని తెలిపే పదాలు కొన్ని ఆయన కవితల్లో (వచనకవితల్లోను, పద్యకవితల్లోను కూడా) మనకు పదేపదే తారసపడతాయి. ఇవి తిలక్‌యొక్క విషాద మానసిక స్థితిని (tragic mood ని)మనకు తెలియజేస్తాయి. 1946 నుండి 1954 వరకు ఎనిమిది సంవత్సరాలపాటు రోగగ్రస్తుడై మంచంపట్టడమే దీనికి కారణం కావచ్చును. మంచి యౌవనంలో (25వ ఏట నుండి 33వ ఏడువరకు) గుండెజబ్బుతోను, నరాల సంబంధమైన వ్యాధితోను బాధపడటం తిలక్ జీవితంలో పెద్ద విషాదం!

“ఒక కవి మనస్తత్త్వాన్ని; జీవితంపట్ల, ప్రపంచంపట్ల అతనికిగల దృక్పథాన్ని అంచనా వెయ్యడానికి ఆ కవి తరచుగా ప్రయోగించే పదాలు కరదీపికల్లా పనిచేస్తాయి. ఎందుకంటే అవి అతని ఆలోచనల్లోంచి కాక, స్వభావంలోంచి అసంకల్పితంగా వస్తాయి.” (డా॥ రెంటాల వ్యాసం, లోపలికి... పుట 104)

తిలక్ కవిత్వంలో చాలా హెచ్చుగా మనకు తారసపడే పదాలు:(1) **“స్వప్నం”** లేదా **“కల”**, (2) **“బాష్పం”** లేదా **“కన్నీరు”**, (3) **“ఏకాంతం”** లేదా **“ఒంటరితనం”**,

(4) **"విషాదం"**, (5) **"అవ్యక్త ఆవేదన"**. ఇంతవరకూ డా॥ రెంటాలవారు చెప్పినవి, నాకు మరో రెండు పదాలు కనపడ్డాయి (6) **"నిరాశ"** లేదా **"నిస్పృహ"**, (7) **"రాత్రి"**. తిలక్‌గారి విషాద మానసికస్థితిని తెలియజేసే ఈ పదాల సంఖ్య ఏడుగా ఉండటం (రోదన సంఖ్యగా ఉండటం) కూడా ఒక సాహిత్య విచిత్రమే! నిజానికి ఈ పదాలు భావ కవిత్వానికి సంబంధించినవి. వీటిని తిలక్ అభ్యుదయకవిత్వానికి కూడా అన్వయించడం విశేషం; ఆయన కవితా ప్రత్యేకత; అదే ఆయన గొప్పతనం. కవి మనస్సులో అంతర్గతంగా ఉండే విషాదమే భావకవిత్వం. బాహ్యప్రపంచంలో ఉండే విషాదమే అభ్యుదయకవిత్వం. అందుకే చలంగారు "కృష్ణశాస్త్రిబాధ ప్రపంచానికి బాధ: ప్రపంచంబాధ అంతా శ్రీశ్రీబాధ" అన్నారు. తిలక్‌లో కృష్ణశాస్త్రీ ఉన్నాడు; శ్రీశ్రీను ఉన్నాడు.

1. స్వప్నం లేదా కల: "అమృతం కురిసిన రాత్రి"లోని 96 కవితలలో 61 కవితలలో "స్వప్నం లేదా "కల" అనే పదం కనబడుతోందని డా॥ రెంటాల లెక్కవేసి చెప్పారు. ('నేను గోరువంకలు' లో లెక్క వేశాను. 22 ఖండికలలో 16 సార్లు వచ్చింది.)

1. **కలల పట్టుకుచ్చులూగుతున్న కిరీటం ధరించినవాడు.** (అ.కు.రా, కవిత)
2. **ఈ కలలు కాగితపు పీలికలై రాలినవి.** (ఆర్తగీతం)
3. **స్వప్నాల పుష్పాలు జల్లుకొని, ఆశల వెచ్చని పాన్పుమీద.** (ప్రార్థన)
4. **పిచ్చిదాని వంటిమీద నెత్తుటి కల.** (వేసవి)
5. **కల ఎప్పుడూ మనిషికి బలం**
మిథ్యాజీవన రథ్యలలో
స్వప్నం ఒక సుందర తనుమధ్య. (స్వేచ్ఛావిహారం)
6. **స్వప్నశారికలతని తలచుట్టూ పరిభ్రమిస్తున్నాయి.** (నెహ్రూ)
7. **అధునాతన భావుకులు స్వప్నభుక్కులు.** (కఠినోపనిషత్)
8. **నాగది స్వప్నాలతో నిండిపోయింది.** (విరహోత్కంఠిత)
9. **నీ కలల నినదించు నిత్యశౌర్యపువేట** (లాలి)

2. బాష్పం లేదా కన్నీరు: "జాలి, జాలినుంచి పుట్టిన కన్నీరు తిలక్‌కి చాలా ఇష్టం. కన్నీరు ఆయన కవితలలో రెండు రకాలుగా కనబడుతోంది. సాటి మనిషి దుఃఖానికి స్పందనగా, స్వీయ దుఃఖానికి అభివ్యక్తిగా" (డా॥ రెంటాల వ్యాసం,

లోపలికి... పుట 105).

1. **నా కనులు వరదలై పారినవి.** (ఆర్తగీతం)
2. **ఏ లోకం తల్లీ ఏవో బాష్పజలాలు.** (భూలోకం)
3. **చెమ్మగిల్లే నా కళ్ళని ఎవరైనా చూస్తారేమో అని...**
   బాధని కని కరుణతో కన్నీరు విడిచాం. (ఆ రోజులు)
4. **చినిగిన స్వప్నపు సంచిలో**
   చితికిన బాష్పం నిలవదు. (కాయ్! రాజా! కాయ్!)
5. **రెప్ప రెప్పనీ తడిపింది కన్నీటి చుక్క.** (గుండె కింద నవ్వు)
6. **జిడ్డు తేలిన ముఖాన్ని కన్నీళ్ళతో టాయిలెట్ చేసుకుంటున్నాడు.**
   (కఠినోపనిషత్)
7. **మీరెప్పుడైనా చూశారా?**
   కన్నీరైనా విడిచారా? ('పిలుపు'లో పల్లవిలా వస్తుంది నాలుగుసార్లు)
8. **పాట పాటకు పొంగు మున్నీరులా**
   మాట మాటకి జారు కన్నీరులా (మేగ్నాకార్టా)
9. **నీకు నా కన్నీరు నిత్యదీవన శాంతి** (లాలి)

3. ఏకాంతం లేదా ఒంటరితనం: ఇది పదస్థాయిలో ఉంది. అంతకన్నా ఎక్కువగా భావస్థాయిలో ఉంది. "వాన కురిసిన రాత్రి" – "రాత్రివేళ" – "అమృతం కురిసిన రాత్రి" – "నేను కాని నేను" – "నిన్న రాత్రి వర్షంలో" వంటి చాలా కవితలలో తిలక్ ఏకాంతంలో పొందిన అనుభూతులు వర్ణింపబడ్డాయి. అసలు అనుభూతి కవితలన్నీ తిలక్ ఏకాంతంలోంచి పుట్టినవే!

3.1 ఏకాంత కుంత నిహతమ్ము రసైక మద్భావనా శకుంతమ్ము
(విరహోత్కంఠిత)

3.2 ఆకాశమంత నా ఏకాంతంలో
అనంత మానవహృదయ స్పందనం (అదృష్టాధ్వగమనం)

3.3 శీతాకాలపు రాత్రి గుండెల మీద
మసకలా పడుతుంది నా నిట్టూర్పు
ఏకాంతం మీద నా తీర్పు (నేను కాని నేను)

3.4 రోజుల స్తంభాల చుట్టూ తిరుగుతూ

కాలం కారిడార్లలోకి మసక మసక చీకట్లో సిల్హౌటీలు కల్పిస్తూ,
ఎవరికి వారే ఏకాంత పాంథులు (కిటికీ)

4. విషాదం (దుఃఖం/శోకం/ఏడుపు): ఇది తిలక్‌లో రెండు విధాలుగా ఉంది. (i) బాహ్యవిషాదం; (ii) అంతర్గత విషాదం.

4.1 బాహ్యవిషాదం: "ఆర్తగీతం" కవితలో సమాజంలో ఉన్న పేదరికం చూడటంవల్ల పుట్టిన విషాదం; "వెళ్ళిపొండి, వెళ్ళిపొండి" కవితలో యుద్ధ బీభత్సాల నుండి మానవులు పడుతున్న దుఃఖాన్ని భావించడం వల్ల కలిగిన విషాదం– బాహ్య విషాదం. "ఈ రాత్రి–1"–"ఈ రాత్రి–2"–"నిన్నరాత్రి వర్షంలో"–ప్లస్ యింటూ మైనస్" కవితలలో కూడా బాహ్యవిషాదం ఆవిష్కరింపబడింది. ఉదాహరణానికి:

ఎక్కడెక్కడ ఒక్కణ్ణీ తిరిగానో రాత్రి ఏకాంతంలో
ఎక్కడ చూసినా దీననయనాల ప్రశ్నలు
మౌననిశ్వాసాల పిలుపులు
బావురుమనే గుండెల ఏడ్పులు
బాధల సలసల క్రాగే బ్రతుకులు! (– నిన్నరాత్రి వర్షంలో)

"గోరువంకలు" పద్యకావ్యంలో – "సీత–1" (విషణ్ణ వైదేహి) – "సీత–2" (పరిత్యక్త) అనే ఖండికలలో కూడా సీతనుగురించిన విషాదం వ్యక్తమవుతుంది.

4.2 అంతర్గత విషాదం: ఇది తిలక్ వ్యక్తిత్వంలోని విషాదం. రోగగ్రస్తుడై నప్పుడు కలిగిన వేదన. ఇది ఆయన మానసికతత్త్వంనుండి, జీవితదృక్పథంనుండి రూపుదాల్చిన విషాదం. అమృతం కురిసిన రాత్రిలో 'ముసలివాడు'– 'కిటికీ' – 'పాడువోయిన ఊరు' – 'వెన్నెల' మొదలైనవి దీనికి ఉదాహరణాలు.

(i) **ఈ వెన్నెల నా మనస్సులోకి జారుతోంది.**
నా గుండె పగుళ్ళ నుండి కారుతోంది
నా అంతరాంతర రంగస్థలాన/ఏకాకి నటుడనైన నన్ను
తన మైత్రీ మధుర భావంతో/క్రమ్ముతోంది. (–వెన్నెల)

(ii) **నా ఏడుపు నాకు తప్ప లోకానికి వినిపించని వేళ**
నే కూరుకుపోతున్న చాతకానితనపు వానాకాలపు బురద మధ్య
(–నువ్వు లేవు నీ పాట వుంది)

అలాగే గోరువంకలు పద్యకావ్యంలో "గోరువంకలు" – "బాధాగళము". "శర్వరీప్రియ" తిలక్ వైయక్తిక విషాదాన్ని ధ్వనింపజేస్తాయి.

5. అవ్యక్త ఆవేదన; 6. నిరాశ లేదా నిస్పృహ; 7. రాత్రి లేదా రేయి: ఈ మూడూ తిలక్ విషాదమానసిక స్థితిలోని అంతర్భాగాలే. "పాడువోయిన ఊరు" – "గోరువంకలు" (కవిత) – "బాధాగళము" – "శర్వరీప్రియ"లలో అవ్యక్త ఆవేదన కనబడుతుంది. "ఈ రాత్రి– 1" – "ఈ రాత్రి –2" – "ముసలివాడు" కవితలలో నిరాశ లేదా నిస్పృహ వ్యక్తమయింది. "రాత్రి శబ్దం పదస్థాయిలోనూ ఉంది; భావనాస్థాయిలోనూ ఉంది. "అమృతం కురిసిన రాత్రి" కావ్యంలో ఏడు కవితలకు "రాత్రి" శబ్దంతో కూడిన శీర్షికలున్నాయి. "లాలి" అనే కవితలో "కరకు కత్తుల కొసల కంపించు నీ రేయి!" అంటారు తిలక్. గోరువంకలు కావ్యంలో "శర్వరీప్రియ" అనే శీర్షిక ఉంది; భావనా ఉంది. ఈ కవితలోని భావన అంతా రాత్రిగురించే.

"స్వప్నం/కల – బాష్పం/కన్నీరు – ఏకాంతం/ ఒంటరితనం – విషాదం – అవ్యక్త ఆవేదన – నిరాశ/నిస్పృహ – రాత్రి/రేయి – ఈ ఏడు శబ్దాలూ కలిసి తిలక్ విషాద మానసికస్థితిని మనకు ఆవిష్కరింపజేస్తాయి.

కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం:–

(1) విషాదం–నిరాశ: "ఈ రాత్రి/ బరువుగా బరువుగా
బ్రతుకు కీళ్ళసంధులలోన / చీకటి కరీల్మని కదిలింది
ఈ రాత్రి/ నిలువునా నిలువునా
పరచుకుని అవని గుండె నెరదలలోని
వింతబాధల విప్పి చూపింది
ఈ రాత్రి/ మూగతో సైగతో
మేలుకొన్న <u>నిరాశ</u>తో మాటలాడాను" (ఈ రాత్రి–1)

(2) విషాదం–అవ్యక్త ఆవేదన:–
కాలిపోయిన యిల్లులా జీవితం ఒరుగుతుంది
ఒక వెగటు ఏదో నన్నావరించుకుంది
కాలం పాడునుయ్యిలా నా కన్నులకు కనబడింది.
(–పాడువోయిన ఊరు)

(3) విషాదం లేదా విచారం:–

(i) ఆ రోజుల్ని తలచుకున్నప్పుడల్లా
ఆనందంలాంటి విచారం కలుగుతుంది (– ఆరోజులు)

(ii) ఆనందానికి మేర విషాదమని
నలుదెసలూ కలిసినచోట వ్రాయబడి ఉందిటగా! (–ప్రవాసలేఖ)

(4) టెరిబుల్ ట్రాజెడీ:– అందంగా హాయిగా కామెడీగా ఉన్న జీవితాన్ని ప్రసాదించిన దేవుడే దానిని హఠాత్తుగా టెరిబుల్ ట్రాజెడీగా మార్చివేస్తాడు:–

అందమైన ఉదయాలూ, స్పందించే హృదయాలూ
చందనం, చంద్రకళా, సరదాలూ, స్వప్నాలూ
ఇన్నిటినీ సమకూర్చిన పసందైన గారడీ
చటుక్కువ మడతపెట్టి – చేస్తాడు టెరిబుల్ ట్రాజెడీ! (–ప్లస్ యింటూ మైనస్)

(5) బెంగ: ....ఎందుకో బెంగ నీలో/నాలో
దేనికోసమో తెలీని అన్వేషణ
ఆదృశ్యజీవిత శాఖలపైన
పువ్వులవలేని మొగ్గల సంభాషణ (– పోయిన వజ్రం)

(6) విషాదం–నిస్పృహ:–
గాలిలేని ప్రకృతి యోగిలాగ రోగిలాగ మూల్గుతోంది
కాలు విరిగిన ముసలికుక్క దీనంగా మొరుగుతోంది
తరతరాల నిస్పృహ నన్నావరించుకొంది! (–ఈ రాత్రి–2)

తిలక్ సృష్టించిన కొన్ని నూతన ఉపమాలంకారాలు:–

అద్భుత సౌందర్యంతో కూడిన తిలక్ కవిత్వంలో ఆయన ఎన్నో కొత్త కొత్త అలంకారాలను సృష్టించారు. అవన్నీ ఎక్కువగా ఉపమాలంకారాలే. కవిత్వాన్ని అలంకారంవల్లనే కదా మనం గుర్తించేది! ("కావ్యం గ్రాహ్య మలంకారాత్"). అలంకారం లేనిదే కవిత్వమే లేదు. అన్ని అలంకారాలకీ మూలం ఉపమ.

1. **దూరంగా 'ఆల్ప్స్' మీద మంచు దుఃఖంలా కరుగుతోంది**
   ప్రభాతం సముద్రంమీద వెండినౌకలా ఊగుతోంది(–సైనికుడిఉత్తరం)
2. **నాగరికత మైలపడిన దుప్పటిలా నన్ను కప్పుకుంది**
   నా ప్రవృత్తి పసుపు వన్నెల పెద్దపులిలా పరచుకుంది. (–ఈరాత్రి–2)

3. కాలిపోయే యిల్లులా జీవితం ఒరుగుతుంది
కాలం పాదునుయ్యిలా నా కన్నులకు కనబడింది(–పాడువోయిన ఊరు)

4. లైట్లు వెలిగిన స్టేషన్లోకి రైలు వచ్చినట్లుగా
కొత్త సంవత్సరం హుషారుగా కొత్తగా రావాలి మన మధ్యకు
(–శిఖరారోహణ)

5. రాత్రిని రంపంపెట్టి కోసినపుడు
రాలిన పొట్టులా ఉంది వేకువ (–వేకువ)

6. అందానికి అపధిగా / యౌవనానికి శిల్పంలా
'చైవక్స్ షావడా' గీసిన బొమ్మలా...
ఎదురుగా నిల్చున్నాను నీకోసం
ఒక్కొక్క ఉద్రేకపు తరంగాన్ని / గుండెల్లో జాగ్రత్తగా
కొత్తచీర వంపుల్లా మడుస్తూ/ నిల్చున్నాను నీ కోసం (–నిరీక్షణ)

7. చలి గుండెల మీద కత్తిలా తెగింది
నీ రూపం నా దేహానికి వెచ్చగా తగిలింది (–సైనికుడి ఉత్తరం)

8. పందిరి మంచంపైన / ఆమె చిరునవ్వులో
కవిత్వంలాంటి కొత్తదనం మెరిసింది. (–యుగళ గీతిక)

9. కాంక్షా మధుర కాశ్మీరాంబరం కప్పుకున్నాను (రూపకం)
జీవితాన్ని హసన్మందార మాలగా ధరించాను (ఉపమ)
(–అమృతం కురిసిన రాత్రి)

10. "కార్తీక మాసపు రాత్రివేళ
చల్లని తెల్లని వెన్నెల"
మెత్తని పుత్తడి వెన్నెల" (ఎలా ఉన్నదంటే–)
(i) శిశువు లాంటి వెన్నెల
నవవధువులాంటి, మధుపులాంటి వెన్నెల
(ii) ఎంత శాంతంగా/హాయిగా, ఆప్యాయంగా ఉంది!
చచ్చిపోయిన మా అమ్మ / తిరిగొచ్చినట్టుంది!
స్వర్గంలో ఎవరో సంగీతం / పాడుతున్నట్టుంది

(iii) చలిచలిగా సరదాగా ఉంది వెన్నెల
చెలి తొలిరాత్రి సిగ్గులా ఉంది!
(iv) దవ్వు దవ్వుల పడుచు పిల్లలు / పకపక నవ్వినట్టుంది.
దాపరికంటేని కొండజాతి/నాతి వలపులా ఉంది!

11. ముసలివాడు **"విధి లిఖించిన వె(రిచి(తమువలె ఎండిన ఏటిగట్టువలె"** ఉన్నాడట.
12. కొన్ని పదచి(త్రాల సృష్టిలో కూడా నూతనత్వం చూపించారు తిలక్:
(i) దీపపువత్తి చివర ని(ద్రపోయే నిప్పునలుసు.
(ii) కాలుజారి పడిన కాలపు పాదుమయ్యిలో కనబడిన శూన్యం.
(iii) కాలం కారిడార్లలోకి మసక చీకట్లో సిల్హౌటీలు కల్పిస్తూ
ఎవరికి వారే ఏకాంత పాంథులు.

తిలక్ లేఖలలో కూడా ఇటువంటి నూతన ఉపమాలంకారాలు కనబడతాయి. నాకు, మిరియాల రామకృష్ణకు (వ్రాసిన లేఖల్లో వర్షఋతువును వర్ణిస్తూ – "(ప్రకృతి ఎలా ఉన్నదంటే, నూతి దగ్గర తలారా స్నానం చేసి, నీళ్ళుఓడుతూన్న తడి బట్టలతో ఇంట్లోకి వస్తున్న అందమైన యువ గృహిణిలా ఉంది!" అని నాకు (వ్రాశారు. "స్నానం చేసి వచ్చిన యౌవనవతి శరీరంలాగా అందం, ఆకర్షణ!" అని రామకృష్ణగారికి (వ్రాశారు.

ఉపసంహారం:

తిలక్ వైశిష్ట్యం: –

మొత్తంమీద భావకవిత్వంలోని సౌందర్యం, సౌకుమార్యం, (ప్రణయం; అనుభూతికవిత్వంలోని కవితాసాం(ద్రత, transparent చీకటి; అభ్యుదయ కవిత్వంలోని పీడితజన పక్షపాతం, (ప్రజా(శ్రేయస్సు; యుద్ధకవిత్వంలోని యుద్ధవిముఖత, దేశభక్తి (ధర్మా(గహం); మానవతావాదంలోని జాలి, క్షమ, సౌనుభూతి, మానవ(ప్రేమ, "త్యాగశక్తి + (ప్రేమరక్తి + శాంతిసూక్తి; జీవిత రహస్యాన్ని గురించిన తాత్త్వికత, హాస్యం; "స్వప్నం/కల, బాష్పం/కన్నీరు, ఏకాంతం/ఒంటరితనం, విషాదం (ఆంతరంగిక విషాదం, బాహ్యవిషాదం), అవ్యక్త ఆవేదన, నిరాశ/

నిస్పృహ, రాత్రి/రేయి" – ఈ పదప్రయోగం వల్ల వెలువడే ఒక విషాద మానసికస్థితి తిలక్ కవిత్వంలో పుష్కలంగా ఉంది. కవిత్వ రహస్య తత్త్వవేత్త తిలక్. కవిత్వం ఒక 'ఆల్కెమీ' అనీ, దాని రహస్యం కవికి మాత్రమే తెలుస్తుందనీ, కాళిదాసుకీ పెద్దన్నకీ, కృష్ణశాస్త్రికీ, శ్రీశ్రీకి ఆ రహస్యం తెలుసుననీ తిలక్ చెప్పారు. ఆ పేర్ల చివర తిలక్ శేషేంద్రల పేర్లు కూడా మనం చేర్చవలసిన అవసరం ఉంది:–

కవిత్వం ఒక ఆల్కెమీ, దాని రహస్యం కవికే తెలుసు
కాళిదాసుకు తెలుసు, పెద్దన్నకి తెలుసు
కృష్ణశాస్త్రికి తెలుసు, శ్రీశ్రీకి తెలుసు,
తిలక్‌కి తెలుసు, శేషేంద్రకు తెలుసు!

శ్రీశ్రీ చెప్పినట్లుగా "కవితాసతి నొసట నిత్య రసగంగాధర తిలకం" స్వర్గీయ దేవరకొండ బాలగంగాధర తిలక్!

* * *

తణుకులో టౌన్‌హాల్ ప్రక్కనే ఉండే తిలక్‌గారి యింటిని డా॥ వత్సవాయి వెంకటరాజుగారు అనే శిశువైద్యులు కొనుక్కున్నారు. వారు తిలక్‌గారి బెడ్రూమ్‌ను తన కన్సల్టింగ్ రూమ్‌గా చేసుకున్నారు. నవకుసుమాలవంటి శిశువులకు, అతి సుకుమారుడైన, అమృత హృదయుడైన తిలక్ పడకగదిలో గత 50 ఏండ్లుగా వైద్యసేవలు లభిస్తూ ఉండటం విచిత్రమైన దైవనిర్ణయమని నేను భావిస్తున్నాను.

"కవిత్వం బ్రహ్మపదార్థం లాంటిది. ఏ ఒక్క నిర్వచనానికీ లొంగదు. కవిత్వం మనసుకీ ఉద్రేకాలకీ సంబంధించినది. ఈ మనస్సునీ ఉద్రేకాలనీ కొలిచే సరియైన మానం ఇదివరకు లేదు; ఇక ముందు రాదు!"

– తిలక్

"ఆధునిక కవితారంగంలో... తమ రచనలు గ్రంథరూపంలో రాకపూర్వమే యావదాంధ్రదేశంలో ఉత్తమ కవులుగా లబ్ధప్రతిష్ఠులైన వారు ముగ్గురున్నారు. వారిలో తిలక్ ఒకడు; మిగిలిన యిద్దరూ శ్రీశ్రీ, అజంతాలు"

– కుందుర్తి

4. "తపాలా బంట్రోతు" కవిత పుట్టుక

దేవరకొండ బాలగంగాధర తిలక్ 1921 ఆగస్టు 1వ తేదీని, పశ్చిమ గోదావరిజిల్లా తణుకు తాలూకా, "మండపాక" గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు రామసోదెమ్మగారు, సత్యనారాయణమూర్తిగారు. వీరిది గొప్ప ధనిక కుటుంబం. తిలక్‌గారు తణుకు బోర్డుహైస్కూలులో ఉన్నతపాఠశాలవిద్య పూర్తిచేసికొని, మద్రాసు లయోలా కాలేజీలో ఇంటర్‌మీడియట్‌లో చేరారు. అనారోగ్య కారణాల వల్ల దానిని పూర్తిచేయలేకపోయారు. సొంతంగా తెలుగు సాహిత్యం, సంస్కృత సాహిత్యం, ఆంగ్లసాహిత్యం బాగా చదువుకున్నారు. వీరి తండ్రి సత్యనారాయణ మూర్తిగారు గొప్ప సాహిత్యప్రియులు; దేశభక్తులు. నాతో ఒకసారి ఇలా అన్నారు తిలక్: "మా నాన్న తిక్కన భారతంలోని పద్యాలు గడగడా అప్పగించేవాడు. జాతీయోద్యమం వల్ల ఆయన బాగా ప్రభావితుడయ్యాడు. అయితే గాంధీకన్నా బాలగంగాధర తిలక్ అంటే ఆయనకు చాలా ఇష్టం. ఆ పేరే నాకు పెట్టారు" అన్నారు.

తిలక్‌గారు పద్యకవిత్వం, గేయకవిత్వం, వచనకవిత్వం, నాటికలు, నాటకాలు, లేఖలు, చిన్నచిన్న సాహిత్య వ్యాసాలు రచించారు. వీరి సాహిత్యమంతా ఇటీవల నా ప్రధాన సంపాదకత్వంలో ఒక పెద్ద సంపుటంగా వచ్చింది (ఎమెస్కో ప్రచురణ నవంబరు 2013, ద్వితీయ ముద్రణ, జనవరి 2021.) వీరి "అమృతం కురిసిన రాత్రి" అనే గేయ వచనకవితా సంపుటి, కృష్ణశాస్త్రి "కృష్ణపక్షం" లాగ, శ్రీశ్రీ "మహాప్రస్థానం" లాగ ఎన్నో ముద్రణలు పొందింది. ఈ అమృతం కురిసిన రాత్రి ఎందరో యువకవులకు మార్గదర్శకమయింది. ఆ సంపుటిలోని ఒక ప్రసిద్ధ కవిత "తపాలా బంట్రోతు" కవిత. దీనిని నా అభ్యర్ధన మీద రచించారు తిలక్. "సుందరీ – సుబ్బారావు" కథ, "సుచిత్ర ప్రణయం" నాటిక నన్ను గురించి వ్రాసినవే; నా కోరికమీద వ్రాసినవే!

నేను 1959లో తణుకు పోస్టాఫీసులో గుమాస్తాగా పనిచేస్తూ ఉండేవాణ్ణి, తిలక్‌గారి కవిత్వానికి వీరాభిమానిని నేను. ఆయన వ్రాసిన కవితలన్నీ నాకు

ఆరోజుల్లో కంఠతా వచ్చు. అనేక సభల్లో వాటిని చదువుతూ వుండేవాణ్ణి. ఆ సంవత్సరం ఆగస్టు నెలలో భీమవరంలో పశ్చిమగోదావరిజిల్లా తంతితపాలాశాఖ వారి వార్షికోత్సవాలు జరగబోతున్నాయని తెలిసింది. తపాలాశాఖలో ఇంటింటికీ తిరిగి కష్టపడి పనిచేసేవాడు పోస్టుమానే. అందువల్ల ఆ కార్మికుణ్ణిగురించి తిలక్ గారిచేత ఒక మంచి వచనకవిత వ్రాయించాలనే సంకల్పం కలిగింది నాకు. వెంటనే ఒక సాయంకాలం వారి యింటికి వెళ్ళి "అయ్యా గురువుగారూ! మీరు పోస్టుమేన్ మీద ఒక మంచి కవిత వ్రాసి పెట్టాలి. దానిని నేను మా జిల్లా శాఖవారు జరుపుకొనే వార్షికోత్సవాలలో చదువుతాను." అన్నాను ఉత్సాహంగా. "సరే! చూద్దాంలే!" అన్నారు ఉదాసీనంగా. ఇలా ఎన్నోసార్లు ఆయన్ని నేను నక్షత్రకుడు లాగ పీడించాను. నేను అడిగిన ప్రతిసారీ ఆయన "చూద్దాంలే! చూద్దాంలే!" అన్నారు కాని, కవిత మాత్రం వ్రాయలేదు. పూర్వం ప్రముఖ కాంగ్రెసు నాయకుడు, తమిళుడు అయిన కామరాజ్ నాడార్‌గారు, ఎవరైనా తన దగ్గరకు వచ్చి ఏదైనా పనిచేసిపెట్టమని ప్రార్థిస్తే, "పార్కలాం" (= చూద్దాంలే!) అనేవాడట! కాని ఎన్నాళ్ళైనా చేసేవాడు కాదు. ఆ కామరాజ్ నాడార్‌లాగ చేశారు తిలక్‌గారు నాకు! ఈలోగా జిల్లా తంతితపాలాశాఖ వార్షికోత్సవాలు వచ్చేశాయి. నేను ఆ సభలకు వెళ్ళి తిలక్‌గారి "ఆర్తగీతం" – నాకు బాగా నచ్చిన గీతం – ఆ సభల్లో చదివి వచ్చేశాను. రెండు మూడు నెలలు గడిచిపోయాయి.

తర్వాత, ఒక రోజు సాయంకాలం తిలక్‌గారు తన్ను అర్జెంటుగా వచ్చి కలవమని చెప్పి మా ఇంటికి వారి పనివాడిని పంపించారు. ఏఁవిటో అని నేను పరుగెత్తుకుని వెళ్ళాను. నన్ను కూర్చోమని చెప్పి, వారు యథాప్రకారంగా తన పడక కుర్చీలో కూర్చుని, మధ్యమధ్య ముక్కుపొడుం పీలుస్తూ, సుదీర్ఘమైన ఈ క్రింది వచన కవితను ప్రారంభించారు. అయన సూతమహర్షిలా చెపుతుంటే, నేను శౌనకాది మహామునులందరూ కలిసిననేనై శ్రద్ధగా విన్నాను. మహాభారతాన్ని వైశంపాయనుడు జనమేజయునకు చెప్పినట్లుగా, సూతులవారు శౌనకాది మహామునులకు చెప్పినట్లుగా, తిలక్‌గారు నాకు చెప్పారు ఈ సుదీర్ఘ కవితను.

ఆనాడు తిలక్‌గారు చదివిన కవిత పేరు "తపాలా బంట్రోతు". ఇది తంతి–తపాలాశాఖలో పనిచేసే ఒక కార్మికుని సామాజిక సేవను వర్ణించే కవిత. కొన్ని ఏండ్ల క్రిందట ఈ కవిత సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థుల తెలుగు పాఠ్యగ్రంథంలో చేర్చబడి, యువతరానికి ఉత్సాహాన్నిచ్చిన కవిత.

"తపాలా బంట్రోతు'' అనే ఈ కవితను తిలక్ చాలా Casual గా ప్రారంభిస్తారు. నాతో సరదాగా మాట్లాడుతున్నట్టుగా మొదలు పెడతారు. "మన అలంకార శాస్త్రాలు అందమైన అమ్మాయి మీద, చందమామ మీద, భగవంతుడి మీద, ధీరోదాత్తుడైన నాయకుడు మీద పద్యాలల్లమని శాసించాయి. కాని అలా అల్లిన పద్యాలు గొప్పకవిత్వం కాలేవు. ఆ వర్ణనల్లో సామాజిక స్పృహ ఉండదు. పోస్టుమాన్ వంటి ఒక సామాన్య చిన్నఉద్యోగి నిస్వార్థంగా సమాజానికి చేస్తున్న సేవ గొప్పది. దీనిని మనం గుర్తించాలి; అభినందించాలి. ఇదే అభ్యుదయ కవిత్వం." అని తిలక్‌గారి మనస్సులోని అభిప్రాయం. ఈ విషయాన్ని ఎంతో హృద్యంగా, వ్యంగ్యంగా, ధ్వనిగర్భితంగా తెలియజేస్తారు తిలక్ ఈ కవిత ప్రారంభంలో.

"మైడియర్ సుబ్బారావ్!
కనిపించడం మానేశావ్!
ఏంవిటీ! పోస్టుమాన్ మీద గేయం వ్రాయాలా?
అందమైన అమ్మాయి మీదకాని
చందమామ మీద కాని
వంద్యుడైన భగవంతుడి మీద కాని, అ
వంద్యుడైన ధీరనాయకుడి మీద కాని
పద్యాలల్లమని మన పూర్వులు శాసిస్తే
ఎక్కడి పోస్టుమానో ఈ గోల?
ఈ చల్లని సాయంత్రం వేళ?"

అని నన్ను విసుక్కున్నట్టుగా ఉంటుంది ప్రారంభంలో. ఆ తరువాత, కవియైనవాడు ధనము కీర్తి సులభంగా సంపాదించే మార్గాలు చెపుతున్నారు తిలక్.

"ధనవంతుణ్ణి స్తుతి చేస్తే
పది డబ్బులు రాలుతాయి;
సచివోత్తముణ్ణి స్మరిస్తే
పదికళ్లు మనమీద వాలుతాయి
ఈ నీ ప్రార్థన కడుంగడు అసభ్యం సుబ్బారావ్!
ఉత్త పోస్టుమాన్ మీద ఊహలు రానేరావు"

పోస్టుమాన్ వంటి అతిసామాన్యమైన వ్యక్తులమీద కవిత్వం అల్లడానికి మంచి మంచి ఊహలు రావనీ; ప్రభుత్వంవారి ప్రచారాలు, కోటేశ్వరులైన వ్యాపారవేత్తలు, సినీమాలు, మతగురువులు, యుద్ధాలు, రాజకీయాలు, ప్రభుత్వాలు కూలిపోవడాలు – మొదలైనవన్నీ ఎంతో విలువైన అంశాలనీ, వాటిని గురించి అయితే అద్భుతమైన, అలంకారయుతమైన మంచికవితలు వ్రాయవచ్చనీ అందరూ అనుకుంటారనీ, కానీ ఈ అభిప్రాయాలు తప్పనీ వ్యంగ్యంగా తెలియజేస్తున్నారు తిలక్.

మూడవ పంచవర్ష ప్రణాళిక
ఏడవ వనమహోత్సవ దినం
బిర్లా దాల్మియా
సినిమా దలైలామా
యుద్ధం పరమార్థం
రాజులూ రాజ్యాలూ, తారుమార్లూ
ఇటువంటివి చెప్పు
మరి చూడు నా తడాఖా!
మృదుమాధ్వీ పదలహరీ
తరంగ మృదంగ విలసద్భంగీ
మనోహరాలౌ కావ్యాల్ గేయాల్
కొల్లలుగా వ్రాస్తాను" – అంటారు.

తపాలా బంట్రోతువంటి అతిసామాన్యమైన కార్మికునికి మన సమాజంలో ఏమీ స్థానం లేదనీ, ప్రధానమంత్రి మాత్రమే గొప్పవాడనీ సామాన్యంగా అందరూ భావిస్తారు. అటువంటి భావన సరికాదు – అని తిలక్‌గారు వ్యంగ్యంగా తెలియజేస్తున్నారు.

"కానీ, తపాలా బంట్రోతు మీదా?
హవ్వ!
ఎండలో వానలో
ఎండిన చివికిన
ఒక చిన్న సైజు జీతగాడు!
చెవిలో పెన్సిల్
చేతిలో సంచీ

కాకీ దుస్తులు
అరిగిన చెప్పులు
ఒక సాదా పేదవాడు –
ఇంటింటికీ
వీథివీథికీ
ప్రతిరోజూ తిరిగేవాడు – ప్రైమ్మినిస్టరా ఏం?"

ప్రాచీనకావ్యాల్లో ధీరోదాత్తులైన రాజులే నాయకులు. ఆధునికకవిత్వంలో సామాన్యుడే మాన్యుడు; అతడే నాయకుడు – అని ఇక్కడ ధ్వని.

ఇంతవరకూ ఈ కవితలోని భాగం, నాటకంలోని "నాందీప్రస్తావన" వంటి భాగం. దీనిలో తిలక్‌గారు "సూత్రధారుడు", నేను "నటి" లేదా "నటుడు" వంటివాడను. ఇక మీదట మన సమాజంలో పోస్ట్‌మాన్ వంటి చిన్న ఉద్యోగి నిస్వార్థంగా చేస్తున్న మానవసేవనుగురించి నాలుగు దృశ్యాలలో ప్రదర్శించారు తిలక్. నేను, నాతోపాటు పాఠకులు ప్రేక్షకులుగా ఈ దృశ్యాలను తమ మనోనేత్రంతో చూచి ఆనందిస్తారు.

ఈ విధంగా, సుబ్బారావు అనే తన మిత్రునికి చెప్పి, అతనికి ఒక దృశ్యాన్ని (మొదటి దృశ్యాన్ని) చూపెడుతున్నారు తిలక్. నూతనంగా వివాహమయిన ఒక యువతి, విదేశాల్లో ఉన్న తన భర్తనుండి లేఖకోసం ఎదురుచూస్తున్న దృశ్యం. తాము నివసిస్తున్న ఆ వీథిలోకి పోస్టుమాన్ ఎప్పుడొస్తాడా అని ఆమె వీథివైపున ఉన్న కిటికీలో కూర్చుని, ఆత్రుతగా ఎదురుచూస్తూ ఉంటుంది. అతడు వీథిమొగలో కనపడగానే ఒక్క ఉదుటున దుమికి వీథిలోకి పరుగెత్తుతుంది. తనదగ్గర ఆమెకు సంబంధించిన ఉత్తరం లేదని చెప్పడానికి బదులుగా అతడు ఒక చిరునవ్వు నవ్వుతాడు. అంతే! ఆమె హతాశయై దుఃఖంతో క్రుంగిపోతుంది. కళ్ళల్లో నీళ్ళు ఉబుకుతాయి. పోస్టుమాన్ ముందుకు వెళ్ళిపోతుంటాడు.

ఈ దృశ్యాన్ని తిలక్‌గారు ఎంతో కరుణరసాత్మకంగా చిత్రించారు.

"అయితే చూడు
ఆ కిటికీలో రెండు విచ్చిన కలువల్లాంటి కళ్ళు
ఆ వీథి మొగవైపే ప్రసరిస్తోన్న చూపుల ముళ్ళు
ఆ కళ్ళల్లో ఆత్రుత
ఆ గుండెల్లో గడచిన

దేశాంతర గతుడైన ప్రియుడి వార్తకోసం తహ తహ!
అమ్మాయీ!
పద్దెనిమిదేళ్ళ పదుచుదనాన్ని భద్రంగా దాచి
పళ్ళెరంలో పెట్టి ప్రాణనాథుడి కందించాలనే
నీ ఆశ నాకు అర్థమయింది
అందుకే –
నీ చూపులు తుమ్మెద బారులు కట్టి
నీకోర్కెలు గజ్జెలవలె ఘలంఘలించి
వీథివీథినంతా మేల్కొల్పుతున్నాయి
వీథివీథినంతా కలయచూస్తున్నాయి
అదుగో పోస్టుమాన్!
ఒక్క ఉదుటున వీథిలోకి నువ్వు
అతని మొహం మీద లేదని చెప్పడానికి బదులు చిరునవ్వు
వెళ్ళిపోతున్న తపాలా బంట్రోతు వెనుక
విచ్చిన రెండు కల్హార సరస్సులు!"

కల్హారము అంటే కొంచెం తెలుపు, కొంచెం ఎరుపు కలిగి, మిక్కిలిగా పరిమళించే కలువపువ్వు. దీనిని "సౌగంధికం" అనికూడా అంటారు. ఆ యువతి కళ్ళు విశాలంగా అందంగా వికసించిన కలువపూవుల్లా ఉన్నాయి. కాని భర్త నుండి లేఖ రాకపోవడంతో దుఃఖం వచ్చి, తెల్లని కనుగ్రుడ్లు కొంచెం ఎర్రబడ్డాయి. అందువల్ల ఆ కళ్ళు తెలుపు, ఎరుపు కలగలిసిన కల్హారాల్లా ఉన్నాయి. ఆ కళ్ళల్లో నీళ్ళు ఉబికాయి. కాబట్టి "కల్హార సరస్సులు" అన్నారు తిలక్. ఆమె రెండు కళ్ళూ రెండు కల్హార సరస్సుల్లా ఉన్నాయి అనే ఉపమానం ఎంతో అందంగా ఉంది. ఈ వర్ణనలో శృంగారరసం అంటే విప్రలంభ శృంగారం కరుణరసం కలిసి ఉన్నాయి.

ఈ దృశ్యవర్ణన మధ్యలో కవి తిలక్ తన శ్రోతయైన సుబ్బారావును వదిలేసి యువతిని సంబోధిస్తారు. అంటే తాను వర్ణించే దృశ్యంలో తాను తాదాత్మ్యం చెందారని భావించాలి. తరువాత రెండవ దృశ్యాన్ని వర్ణిస్తూ సుబ్బారావునీ, యువతినీ ఇద్దరినీ వదిలేసి, directగా పోస్టుమాన్‌తోనే సంభాషిస్తారు తిలక్; అతన్నే సంబోధిస్తారు.

ఊరిబయట నున్న చిన్నగుడిసెలో, ఒక ముసలి తల్లి, ఎక్కడో అస్సాంలో సైనికుడిగా పనిచేస్తున్న సింహాచలం అనే తన ఒకే ఒక కుమారుని నుండి ఉత్తరం కోసం ఎదురు చూస్తోంది. తన జీవితమంతా ఎంతో కష్టపడి అతన్ని పెంచింది. త్వరగా వెళ్ళి ఆమెకు వచ్చిన ఉత్తరాన్ని అందివ్వమనీ, ఆమెకు ఆనందాన్ని కలిగించమని తిలక్ తపాలా బంట్రోతును కోరుతున్నారు.

"గుడిసె ముందు కూర్చున్న పండుముసలి అవ్వ
గడచిన బ్రతుకంతా కష్టపు నెత్తుటి కాల్వ
కనపడీ కనపడని కళ్ళల్లో
కొడిగట్టిన ప్రాణపు దీపంలో
తాను కనిన తన ప్రాణం
తనకు మిగిలిన ఒకే ఒక స్వప్నం
తన బాబు, తన ఊపిరి
అస్సాం రైఫిల్స్ లో సోల్జర్ 'సిమ్మాచలం'
కోసం నిరీక్షణ
క్షణక్షణ ప్రతీక్షణ
ఒక కార్డు ముక్క వ్రాశాడా?
బంట్రోతూ! వెళ్ళువెళ్ళు త్వరగా
ముసలిదానికి మంచివార్త నందించు
ముడతలు పడిన మొహంమీద ఆనందాన్ని పరికించు!"

తరువాత వచ్చే మరో రెండు భాగాల్లో లేదా దృశ్యాల్లో కూడా కవి తిలక్ తపాలా బంట్రోతుతోనే సంభాషిస్తారు. మొదటి దృశ్యంలో విదేశాల్లో ఉన్న భర్త నుండి లేఖకోసం ఎదురు చూసే యువతిని, రెండవ దృశ్యంలో అస్సాంలో సైనికుడుగా పనిచేస్తున్న తన ఒకే ఒక కుమారుని లేఖకోసం ఎదురుచూసే ముసలితల్లిని వర్ణించిన తిలక్, తరువాతి భాగంలో (అంటే మూడవ దృశ్యంలో) సాధారణీకరణం చేసి, సమాజంలో ఉన్న రకరకాల మానవులకు, మంచివాళ్ళకు చెడ్డవాళ్ళకు కూడా అతడు వార్తలనందిస్తాడని, అతడు అందరికీ ఇష్టుడనీ, అతని మ్యాజిక్ సంచీలో నవ్వులూ – పువ్వులూ – ఏడ్పులూ – నిట్టూర్పులూ, ఆనందాలూ, అభినందనలూ, ఆక్రందనలూ మొదలైనవన్నీ ఉంటాయనీ, ఏ క్షణంలో ఏది పైకి తీస్తాడో తెలియదనీ, ఆ క్షణంలో అతడు రాజుతో సమానమనీ, అంటే రాజుగారిలాగే

అతడు నిరంకుశుడనీ, క్షణంలో ప్రజలను సుఖదుఃఖాలకు లోనుచేయగలడనీ వర్ణిస్తారు తిలక్.

దూరభారాన ఉన్న కుమారునికోసం/వగచే తల్లికి
చేరువ చేరువౌతున్న నువ్వొక ఊరట!
దగ్గర దగ్గరౌతున్న మిత్రుని లేఖకోసం
నిలిచిన తరుణుడికి నీరాక ఒక బాసట!
వర్తకుడికి, నర్తకుడికి, ఖైదులో దొంగకి, హంతకుడికి,
ఉద్యోగశప్తుడైన నవీన యక్షునికి,
మనిషికి, రాక్షసునికి,
నువ్వు / దూరాల దారాల్ని విచిత్రంగా
ఒకే నిమిషము / అనే కండె చుట్టూ త్రిప్పగల నేర్పరివి – కూర్పరివి
అదృష్టాధ్వంమీద నీ గమనం
శుభాశుభాలకి నువ్వు వర్తమానం
నీ మేజిక్ సంచిలో
నిట్టూర్పులు నవ్వులు పువ్వులు
ఆనందాలు అభినందనలు ఏడ్పులు
ఏ క్షణంలో ఏది పైకి తీస్తావో
ఆ క్షణాన నువ్వు రాజుతో సమానం!"

కాని, అందరికీ ఆత్మబంధువులుగా వార్తలందించే పోస్టుమాన్‌కి, తన వార్తలు వినేవారెవ్వరూ ఉండరు. తన కథని చెప్పుకుందుకు ఎవరూ దొరకరు. అందరికీ ఉపకారం చేసే తపాలా బంట్రోతుకు ప్రత్యుపకారం చేసేవారెవ్వరూ ఉండరు. ప్రజలందరూ అతనిని ఉత్తరాలు అందించే ఒక బంట్రోతుగానే చూస్తారు కాని, మనలాగే సుఖదుఃఖాలు అనుభవించే హృదయంగల మానవునిగా మాత్రం చూడరు. ఈ విషయాన్ని ఎంతో కవితాత్మకంగా "ఇన్నికళ్ళు పిలిచినా/ ఒక్కనయనం నీ కోటుదాటి లోపలికి చూడదు" అంటారు తిలక్! అయినా అతడు ఇవేమీ లెక్కచేయకుండా, నిష్కామకర్మయోగిలా తన duty ని తాను చేసుకుంటూ పోతాడు. ఈ విషయాలన్నీ నాల్గవది, చివరిది అయిన దృశ్యంలో వర్ణిస్తూ కవితను ఎంతో గంభీరంగా, తాత్త్వికంగా ముగిస్తారు తిలక్:–

"కొందరికి పరిచయమైన నవ్వు
కొందరికి తలపంకించిన నవ్వు
కొన్ని వైపులకి చూడనే చూడవు
అందరికీ నువ్వు ఆప్తబంధువువి
అందరికీ నువు వార్త నందిస్తావు
కాని నీ కథనం మాత్రం నీటిలోనే మథనం
అవుతూంటుంది
ఇన్ని ఇళ్ళు తిరిగినా
నీ గుండె బరువు దింపుకోడానికి ఒక్క గడప లేదు
ఇన్ని కళ్ళు పిలిచినా
ఒక్కనయనం నీ కోటుదాటి లోపలికి చూడదు
ఉత్తరం యిచ్చి నిర్లిప్తుడిలాగ వెళ్ళిపోయే నిన్ను చూసినప్పుడు
తీరం వదలి సముద్రంలోకి పోతూన్న ఏకాకినౌక చప్పుడు..."

ఈ విధంగా సుఖదుఃఖాలకు అతీతుడైన నిర్లిప్తుడైన నిష్కామకర్మయోగిలా సమాజసేవ చేస్తున్న, చిన్న ఉద్యోగస్థుడైన తపాలా బంట్రోతును, లేదా పోస్టుమాన్‌ను ఎంతో నిశితంగా పరిశీలించి పాఠకుల కన్నులకు కట్టినట్లుగా వర్ణించారు తిలక్‌గారు. ఈ కవితానిర్మాణంలో, ఎన్నో ఏండ్లు తిలక్‌గారికి లేఖలు అందించిన "సత్యం" అనే పోస్టుమాన్ ఆయన దృష్టిలో ఉన్నట్లు నేను గమనించాను. అలాగే, మొదటి దృశ్యంలో, విదేశాలలో ఉన్న భర్తనుండి లేఖకోసం ఎదురు చూసిన యువతి వర్ణనలో, తిలక్‌గారి సొంత చెల్లెలు శ్రీమతి ఎల్లా బాలాత్రిపుర సుందరి ఆయన స్మృతిపథంలో ఉండి ఉంటుందని తిలక్‌గారి సన్నిహితులు సులభంగా గుర్తించగలరు. ఆమె భర్త ఇంజనీరు, అమెరికాలో ఉండేవారు.

ఇంత గొప్ప కవితను విని మిక్కిలిగా సంతోషించిన నేను తిలక్‌గారితో "ఇంత మంచి కవితను నేను వ్రాయమన్నప్పుడు వ్రాస్తే ఎంత బాగుండేది! మా తంతి-తపాలాశాఖ జిల్లావార్షికోత్సవాలలో చదివేవాడిని కదా!'' అని నిష్ఠురోక్తులాడాను. ఆయన వెంటనే ఇలా అన్నారు. "నువ్వు రాయమన్నప్పుడు రాస్తే అది ఏడిసినట్టు వచ్చేది. నువ్వు నాకు సూచించిన Subject మూడు నెలలపాటు నామనస్సులో నానింది కాబట్టే ఇంత బాగా వచ్చింది" అన్నారు. అదీ నిజమే కదా!

ఈ "తపాలా బంట్రోతు" కవిత ఆ రోజుల్లో హైదరాబాదునుండి గోరా శాస్త్రిగారి సంపాదకత్వంలో వెలువడే "ఆంధ్రజనత" దినపత్రిక – 1959 దీపావళి ప్రత్యేక సంచికలో ముద్రితమయి పాఠకుల మన్ననలు పొందింది. మన సమాజంలో అట్టడుగున ఉన్న చిన్న చిన్న ఉద్యోగులు సమాజానికి చేస్తున్న గొప్పసేవను గుర్తించి ఉన్నతీకరించడం ఈ కవితలోని వైశిష్ట్యం. ఇటువంటి వైశిష్ట్యాన్ని తెలియజేస్తూ తరువాతి కాలంలో వచ్చిన కవులు కొందరు తిలక్‌గారిని అనుకరిస్తూ ఎన్నో కవితలు వ్రాశారు. ఉదాహరణానికి – ఎండ్లూరి సుధాకర్‌గారి "గూర్ఖా", "మైసమ్మ మరణం"; శిఖామణిగారి – "ప్రమిద కింద చీకటి" (నర్సు సేవలు); పాటిబండ్ల రజనిగారి –"సర్కస్ బాలిక"; ఓల్గాగారి–"మెహందీలో వేశ్య" ఇంకా ఇతర కవులు రచించిన "పంట బ్రాహ్మడు", "లేడీ కండక్టర్", "పూలకుర్రాడు", "పనిమనిషి". "చెప్పులు కుట్టేవాడు", "గొడుగులు బాగుచేసేవాడు" మొదలైన కవితలు ఈ వర్గం క్రిందికి వస్తాయి. ఇవన్నీ తిలక్‌గారి "తపాలా బంట్రోతు"కు ప్రతిధ్వనులు. యుద్ధంలో సైనికుడి త్యాగాన్ని ప్రశంసిస్తూ తిలక్‌గారు రచించిన "సైనికుడి ఉత్తరం" – "అమ్మా! నాన్న ఎక్కడికి వెళ్ళాడు?" అనే కవితలు కూడా సమాజానికి సామాన్యులు చేస్తున్న త్యాగవీర ప్రశంసలే! ఇవి కూడా "తపాలా బంట్రోతు" కవితవంటి కవితలే!

దేవరకొండ బాలగంగాధర తిలక్ గారు కనీసం 45 ఏండ్లయినా నిండకుండా మధ్య వయస్సులో 1966 జూన్ 30వ తేదీ రాత్రి తణుకులో స్వర్గస్థులయ్యారు. జూలై 2వ తేదీని అన్ని వార్తాపత్రికలలోను ప్రముఖంగా వచ్చింది. ఈ దుర్వార్త విని శ్రీశ్రీగారు ఎంతో చలించిపోయి, తిలక్‌ను గురించి ఒక గొప్ప "స్మృతిగీతం" (Elegy) వ్రాశారు. అందులో చివరి భాగం:–

"గాలి మూగదయిపోయింది
పాట బూడిదయిపోయింది
వయస్సు సగం తీరకముందే
అంతరించిన ప్రజాకవి
నభస్సు సగం చేరకముందే
అస్తమించిన ప్రభారవి
మరి కనిపించదా?
కోకిలవలె కూజించే కలధ్వని

కేసరివలె గర్జించే రణధ్వని
ఇక వినిపించదా?
భావి దూరతీరాలకు
చేరువగా విహరిస్తూ
జీవనాడి స్పందించే
రుధిర మధువు లందించే
యువలోక ప్రతినిధి
నవభావామృత రసధుని
కవితాసతి నొసట నిత్య
రసగంగాధర తిలకం
సమకాలిక సమస్యలకు
స్వచ్ఛస్ఫాటిక ఫలకం
నడినింగిని మాయమయాడా
మన మిత్రుడు
కవితాపుత్రుడు
కదన క్షాత్రుడు
సకల జగన్మిత్రుడు!"

అని వాపోయారు శ్రీశ్రీగారు

(ఆకాశవాణి బెంగుళూరు కేంద్రంవారి సౌజన్యంతో...)

(ఈ వ్యాసం శ్రీ. కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీగారి సంపాదకత్వంలో వెలువడిన "తిలక్ సాహితీ సందర్శనం"లో ముద్రితమయింది, 2016)

"అన్నా!
కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమలను బహిర్గతం చెయ్యాలి
విస్తరించాలి చైతన్య పరిధి
అగ్నిజల్లినా అమృతం కురిసినా
అందం, ఆనందం దాని పరమావధి!"

– (నవత–కవిత)

5. తిలక్ వచనకవిత్వం - భాషాశైలి

కీ. శే. దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారు (1921 – 1966) ఆధునిక కవి. ఆయన పద్యకవిత్వమూ వ్రాశారు; వచనకవిత్వమూ వ్రాశారు. "గోరువంకలు" పేరుతో ఆయన పద్యకవిత్వమూ, "అమృతం కురిసిన రాత్రి" పేరుతో వచనకవిత్వమూ ఆయన మరణించిన తరువాత ప్రకటితమయ్యాయి. తిలక్ ఆధునికభాషలో వ్రాస్తారు; అంటే శిష్టవ్యావహారికంలో వ్రాస్తారు. బాలవ్యాకరణం, ప్రౌఢవ్యాకరణం అనే గ్రంథాలు ప్రాచీనకావ్యభాషను విశ్లేషించాయి కాని, ఆధునిక కావ్యభాషను విశ్లేషించలేదు. కాబట్టి ఆ గ్రంథాలను ఈ వచనకవిత్వానికి అన్వయించలేం. అయినా పదజాలాన్ని విశ్లేషించేటప్పుడు ఆ గ్రంథాలే మనకు ఆధారమవుతాయి. ఆధునికభాషకు వ్యాకరణగ్రంథాలు లేవు కాబట్టి ఇది తప్పదు. ఇది వచనంలో వ్రాయబడ్డ కవిత్వమయినా, కథ నవల వంటి ప్రక్రియలో ఉండే వచనం దీంట్లో ఉండదు. కర్త – కర్మ – క్రియ వరుసలో వాక్యాలు కవిత్వంలో ఉండవు. "ఆధునిక కవిత్వంలో క్రియ కూడా ఉండ కూడదు." అన్నారు అజంతా. క్రియ లేకుండా క్రియాజన్య విశేషణాలతో పాదాలను రచిస్తారు ఆధునిక కవులు. అందువల్ల ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు కూడా (ముఖ్యంగా వాక్యనిర్మాణ సూత్రాలు) ఈ వచనకవిత్వానికి అన్వయించడం కుదరదు. ఆధునిక శిష్టవ్యావహారికంలో సంస్కృతపదాలు (సంస్కృతసమాలు) అచ్చతెలుగుపదాలు, అన్యదేశ్యాలు (ముఖ్యంగా ఆంగ్లపదాలు) ఉంటాయి. వీటిని గురించి కొంచెం తెలిసికొని, ఇవి తిలక్‌కవిత్వంలో ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం. అలాగే సమాసరచన ఎలాసాగిందో కూడా చూద్దాం. పదగుంఫనం+సమాసరచన కలిపితే "శైలి" అవుతుంది. కాబట్టి తిలక్ "వచనకవిత్వ భాష" అంటే "వచన కవిత్వ శైలి" అని నేను అర్థం చేసుకుంటున్నాను.

బాలవ్యాకరణం తెలుగుభాషను నాలుగు రకాలుగా విడదీసింది. 1) తత్సమం 2) తద్భవం 3) దేశ్యం 4) గ్రామ్యం. సంస్కృతశబ్దంతో సమానమైనది సంస్కృతసమం. ప్రాకృతశబ్దంతో సమానమైనది ప్రాకృతసమం. సంస్కృతసమం

+ ప్రాకృతసమం రెండింటిని కలిపి "తత్సమం" అంటారు. రాముఁడు, విద్య, హరి, ధేనువు, భువి, గోవు, నావ, దివి, హృది, జగత్తు (జగము) – మొదలైనవి సంస్కృతసమాలకు ఉదాహరణాలు. అలాగే అగ్గి, ఓలి, కారము, గారవము, జెడ, మేర, జెముఁడు, రాణి, సింగారము, సిరి–మొదలైనవి ప్రాకృతసమాలకు ఉదాహరణాలు.

సంస్కృతంలోంచి, ప్రాకృతంలోంచి కొన్ని మార్పులు చెంది తెలుగులోకి వచ్చిన పదాలు తద్భవాలు. ఆకసము, గోడ, ఁచందురుడు, తామర, నారసము, నెపము (నెవము) మొకము (మొగము), మెకము (మెగము), వంకర, వేసడము, సంద్రము, సూది, మరుగు, అరణము – మొదలైన శబ్దాలు సంస్కృత భవాలు. అచ్చర, అచ్చెరువు, పనస, పుడమి, పయనము, పవడము (పగడము), మచ్చరము, జన్నము, లచ్చి, వెన్నుఁడు, వెజ్జు, కంబము, తోరము – మొదలైన పదాలు ప్రాకృతభవాలు.

తెలుగుదేశంలో వాడుకలో ఉన్న భాషకు "దేశ్యం" అని పేరు. ఉదా॥ ఊరు, పేరు, ఇల్లు, ముల్లు, కోట, పేట, దూడ, మేడ, కోఁత, లేఁత, తావి, మోవి మొదలైనవి.

లక్షణ విరుద్ధమైన భాష "గ్రామ్యం". ఉదా॥ వస్తాఁడు, తెస్తాఁడు, వచ్చేవి, తెచ్చేవి. వచ్చేవాఁడు, తెచ్చేవాఁడు, వచ్చేటివాఁడు, తెచ్చేటివాఁడు మొదలైనవి. ఈ గ్రామ్యం లౌకిక వ్యవహారానికే కాని కావ్యాలలో ప్రయోగించడానికి అర్హమైనది కాదు – అని చిన్నయసూరిగారు నిర్ణయించారు. అయితే పెద్దలు (ప్రాచీన కవులు) చేసిన ప్రయోగాలు లక్షణ విరుద్ధాలయినా వాటిని ఆదరించి మనం కావ్యాలలో వాడవచ్చును. ఉదా॥ కఱకంఠుఁడు, ప్రాణగొడ్డము, జీవగఱ్ఱ, కపిలకన్నులు, కపిలగడ్డము, కపిలజడలు, (వీటిని "దుష్టసమాసాలు" లేక "వైరిసమాసాలు" అంటారు.) వీటిని నన్నయ, తిక్కన, శ్రీనాథుడు ప్రయోగించారు కాబట్టి మనమూ ప్రయోగించవచ్చును. వీటిని "అనింద్య గ్రామ్యము" అంటారు.

చిన్నయసూరిగారి బాలవ్యాకరణంలో ఏ భాషనైతే "గ్రామ్యము" అన్నారో ఏ భాషనైతే కావ్యాలలో ప్రయోగించడానికి వీలులేదు అన్నారో, ఆ భాషలోనే ఈ నాటి సాహిత్యమంతా రచింపబడుతోంది. గ్రామ్యం అంటే వ్యావహారికం. ఇది రెండు రకాలుగా ఉంటుంది. శిష్టవ్యావహారికం, శిష్టేతరం (జానపదం). శిష్టవ్యావహారికం ప్రమాణభాషగా అన్నిటా చెలామణి అవుతోంది. శిష్టేతరం

మాండలికంగా ఉంది. స్థలమాండలికాలు, కులమాండలికాలు ఉన్నాయి. ఆధునిక రచయితలు కొందరు (ముఖ్యంగా దళిత రచయితలు) తమతమ కుల మాండలికాలలోను, స్థలమాండలికాలలోను ఇప్పుడు రచనలు చేస్తున్నారు.

దేవరకొండ బాలగంగాధరతిలక్‌గారు శిష్టుడు, విద్యావంతుడు, బ్రాహ్మణుడు. అందువల్ల ఆయన శిష్టవ్యావహారికంలోనే తన కవితలన్నీ వ్రాశారు. రెండు మూడు కవితలలో క్రియలు గ్రాంథికభాషలో కూడా ఉన్నాయి. దీర్ఘసమాసభూయిష్ఠమైన రచన కూడా గ్రాంథికభాషనే తలపింపజేస్తుంది. ఈ గ్రాంథికంలో కాని, శిష్టవ్యావహారికంలో కాని, కేవలం చిన్నయసూరిగారు చెప్పిన గ్రామ్యం మాత్రమే ఉండదు. తత్సమము, తద్భవము, దేశ్యము కూడా ఉంటాయి. ఈ మూడింటినీ కలిపి వ్యాకర్తలు మరో విభాగం చేసి చూపించారు.

తత్సమము = సంస్కృతసమము, ప్రాకృతసమము

తద్భవము = సంస్కృతభవము, ప్రాకృత భవము

దేశ్యము = త్రిలింగ దేశంలో (తెలుగు దేశంలో) వ్యవహరింపబడే భాష.

సంస్కృతసమములైన పదాలను "సంస్కృత పదాలు" అన్నారు.

ప్రాకృతసమము + సంస్కృతభవము + ప్రాకృతభవము అయిన పదాలను "వైకృత పదాలు" అన్నారు. వైకృతము + దేశ్యము కలిస్తే "అచ్చతెనుగు" అవుతుంది. (ఇక మీదట దీనిని నేను "తెలుగు పదాలు" అంటాను.) ఈ "అచ్చతెనుగులో" కొందరు ప్రాచీన కవులు కావ్యాలు కూడా వ్రాశారు. పొన్నిగంటి తెలగన్న "యయాతి చరిత్రము", కూచిమంచి తిమ్మన "అచ్చతెనుగు రామాయణము" – "నీలాసుందరీ పరిణయము" అచ్చతెనుగులో వ్రాశారు. వ్యాఖ్యానం లేకుండా ఈ కావ్యాలు అర్థంకావు. సంస్కృతపదాలు, వైకృతపదాలు, దేశ్యపదాలు కలిసిన భాషే సహజమైన తెలుగు. ఈ సహజమైన తెలుగులోనే తిలక్ తన వచనకవితలు రచించారు. పూర్వకాలంలో హిందీ, ఉర్దూ, పారశీకం, అరబిక్ భాషలనుండి కొన్ని పదాలు వచ్చి తెలుగులో చేరిపోయాయి 19, 20 శతాబ్దాలలో ఎన్నో ఆంగ్లపదాలు వచ్చి చేరాయి. ఇలా ఇతర భాషలనుండి వచ్చిన పదాలను "అన్యదేశ్యాలు" అంటారు. కాబట్టి ఆధునికమైన తెలుగుభాష అంటే సంస్కృతపదాలు, అచ్చతెనుగుపదాలు, అన్యదేశ్యాలు కలిసిన భాష. ఈ భాషలోనే తిలక్ వచనకవిత్వం కొనసాగింది.

పై పరిశీలననుబట్టి తిలక్‌వచనకవిత్వంలో ఈ క్రింది శైలీభేదాలను గుర్తించవచ్చు: 1) "సంస్కృత శైలి", 2) "ఆచ్ఛిక శైలి" లేక "తెలుగు శైలి"

3) "రెండూ కలిసిన మిశ్రశైలి", 4) సంస్కృతము + తెలుగు + ఆంగ్లము కలిసిన "విచిత్ర శైలి." సమాసాలను, కవితాశీర్షికలను, పదజాలాన్ని కూడా ఇదే విధంగా వర్గీకరించడానికి అవకాశం ఉంది.

I. కవితాశైలి:

1. సంస్కృత శైలి: సంస్కృత శైలి అంటే పూర్తిగా సంస్కృత పదాలతో సాగే రచన అని అర్థం కాదు. తెలుగుభాషలో కావ్యం వ్రాస్తున్నప్పుడు, సంస్కృత పదాలు ఎక్కువగా వాడినా, విభక్తులు, క్రియలు, సర్వనామాలు తెలుగులోనే ఉంటాయి. కాబట్టి ఈ శైలిలో 90% సంస్కృత పదాలు 10% తెలుగు పదాలు ఉంటాయని అర్థం. "అమృతం కురిసిన రాత్రి"లో కేవలం ఐదు కవితలు మాత్రమే సంస్కృత శైలిలో సాగాయని చెప్పవచ్చును. అవి: ఆర్తగీతం – అద్వితీయం – విరహోత్కంఠిత – దుర్మరణవార్త – వర్షహేల. ఈ గ్రంథంలోని మొత్తం కవితలు 96. అంటే పూర్తిగా సంస్కృతశైలిలో సాగిన కవితలు చాలా తక్కువగా ఉన్నట్టు లెక్క. తిలక్ వచనకవిత్వానికి ప్రాచీన ప్రబంధశైలిని సంతరించినట్టుగా పేరుపడినప్పటికీ, కేవలం సంస్కృత సమాస భూయిష్ఠమైన శైలిలో ఎక్కువ కవితలు వ్రాయలేదు. అచ్చిక శైలిలోను, సంస్కృతంకన్నా తెలుగుపదాలు ఎక్కువగా ఉన్న శైలిలోను, తెలుగు + సంస్కృతం సమపాళ్ళలో మేళవించిన శైలిలోను ఎక్కువ కవితలు వ్రాశారు. కావ్యంలో 3/4 భాగాన్ని ఇటువంటి కవితలే ఆక్రమించాయి (67 కవితలు). సంస్కృతపదాలు దొర్లకుండా ఆధునికాంధ్రభాషలో వాక్యనిర్మాణం జరగదు. ఒకవేళ ఎవరైనా ప్రయత్నపూర్వకంగా కేవలం తెలుగుమాటలతోనే వాక్యనిర్మాణం చేస్తే, ఆ వాక్యం అర్థం కాదు. ఈ సూత్రం కొన్ని ఆంగ్లపదాలకు కూడా వర్తిస్తుంది. (రైలు, బస్సు, కారు, సైకిలు, స్టేషను, రోడ్డు, గ్లాసు, లాంతరు మొదలైన పదాలు తెలుగు పదాలలో కలిసిపోయాయి. వీటిని అనువదించడం కుదరదు.) తెలుగు + సంస్కృతం + ఆంగ్లం కలిసిన ఆధునికాంధ్ర భాషాశైలినే తిలక్ ఎక్కువగా పాటించారని సిద్ధాంతమవుతోంది.

1.1 తిలక్ సంస్కృత శైలికి ఒక ఉదాహరణం:–

"తన విశాల వినీల ఘనాఘన చేలాంచలముల
దశదిశలకు విసరుచు
హిమవింధ్యా శిఖరపతత్ పవనచలత్ తరు

పర్ణకోటి నెగజిమ్ముచు
నిజసముద్ర హృద్బడబాయిత విరహాగ్నిచ్ఛటా
కుఠారముల ద్రిప్పుచు
వచ్చెనొహొ వర్షానవతరుణుడు ధాత్రీ హృదయేశుడు
కదు వడిగా
మ్రోసెను పెనుదంభోళిక సకల వనాంతర నర్తిత
మయూరి మాలిక
కిసలయిత కదంబ కురవక పున్నాగలవంగ వల్లీ
నవకింశుక
ఆకుపచ్చ నొయ్యారము నొలికించెను ధాత్రి నేడు
వాసక సజ్జిక
చందనవన సురభిళ పటువక్షోజ గిరీంద్రహారి
నిరసక్త కంచుక" (వర్షహేల)

పై ఉదాహరణంలో క్రీగీతలుంచిన పదాలు మాత్రమే తెలుగుపదాలు. అవి సర్వనామాలు, విభక్తులు, క్రియలు కాబట్టి తప్పవు. కాని ఈ రచనలో కవి సంస్కృత సమాసాల మధ్యలో "కదువడిగా మ్రోసెను", "ఆకుపచ్చనొయ్యారము నొలికించెను" అనే అచ్చతెలుగు వాక్యాలు రెండు వ్రాశారు.

1.2 తిలక్ సంస్కృత శైలికి పైదానికన్నా కొంచెం సరళమైన మరో ఉదాహరణం:-

"ఈ రోజు నాకు విషాదస్మృతి, విధి తమస్సులు మూసిన
దివాంధరుతి
నా యెదద మ్రోడైన ఒక దుస్థితి
నీ కొత్త సింగారము వలదు, ఉదాత్త సురభిళాత్త
శయ్యాసజ్జితమ్ము వలదు,
రసప్లావితము వలదు.

చిత్ర శిల్ప కవితా ప్రసక్తి వాంఛింపను, తత్త్వసూత్ర
వాదోక్తి చలింపను,
సుందర వధూ కదుష్ణ పరీరంభముల రసింపను.

గత చారిత్రక యశఃకలాపమ్ము వివరింపకు, బహుళ

వీరానేక గాథాసహస్రమ్ము వినిపించకు
ఇంక నన్ను విసిగించకు. (ఆర్తగీతం)

క్రీగీతలుంచిన పదాలు మాత్రమే తెలుగు పదాలు. పై రెండు ఉదాహరణల లోను తెలుగు క్రియలు గ్రాంథికభాషలో ఉన్నాయి. సాధారణంగా తిలక్ తన రచనను వ్యావహారిక శైలిలోనే నడిపిస్తారు. కాని ఇలాంటి తత్సమశైలిలో మాత్రం ఒక్కొక్కప్పుడు గ్రాంథికశైలి వచ్చేస్తుంది. తత్సమశైలికి గ్రాంథికక్రియా రూపాలయితేనే చక్కగా నప్పుతాయని ఆయన భావన కాబోలు. ఈ కవితతోపాటు, "అద్వితీయం", "నీవు", "ఒక శ్రుతి", "లయగీతం" అనే కవితలలో కూడా తిలక్ గ్రాంథికభాషను ప్రయోగించారు.

1.3 తిలక్ గ్రాంథికశైలికి రెండు ఉదాహరణాలు:-

1.3.1 "నిన్ను ప్రేమించినాను, నిందించినాను, ద్వేషించినాను
నీ కొరకు చేతులు చాచినాను, పొమ్మని తల్పులు మూసినాను
కాని యిదియేమి?
నీవులేని చోటున నాకు చోటు లేదు, సుఖము
లేదు, లేదు ఉనికి" ("నీవు")

"ప్రేమించినాను, నిందించినాను" మొదలైన క్రియలు రాయలసీమ వ్యావహారికంలో ఉన్నాయి. అక్కడ యివి గ్రాంథిక రూపాలు కావు. అందువల్ల మరో ఉదాహరణం చూద్దాం.

1.3.2 "ఏమిటి మీ నివేదన, మీ దీనవదన ప్రార్థనమ్ము
ఈ నగరమ్మంతా తోరణమాలలు ధూపమ్ములు దీపమ్ములు
ఏ బాధా నివారణకు? ఏ వాంఛా పరిపూర్తి కొరకు?
మీ మనోగత భావాలను తెలిసికొనగ నేనై వచ్చితి" (-యీడిపస్)

1.4 శుద్ధ సంస్కృత రచన:-

ఒక్కొక్కసారి తిలక్ తెలుగు విభక్తులు, తెలుగు క్రియలు వాడకుండా కేవలం సంస్కృతంలోనే రచన చేస్తారు.

1.4.1 "కథంను లిఖామి మమ హృదయ ప్రమోదం
సుఖితమస్త్వతతః శరదాం శతమ్" (-'కొనకళ్ళకు అక్షరాంజలి')

1.4.2 "సకలధునీ వివిధవనీ సంభ్రమచణ వర్షానిల మహోగ్ర భూమిక
చికురాంచల వారిబిందు నివహాంతర వీక్షాతుర ప్రోషితభర్తృక
కకుబంత వియచ్చరగృహ గాఢాంధహర సమర్థ శతవిద్యుద్దీపిక
భయకుంచిత శకుంతగణ దీనారవ సంకుల కులాయ తరువాటిక"

(- 'వర్షహేల')

2. ఆచ్ఛికశైలి లేక అచ్చతెనుగు శైలి:-

ప్రాకృతసమము, సంస్కృతభవము, ప్రాకృతభవము, అయిన పదాలను "వైకృతము" అంటారనీ, ఈ వైకృతానికి దేశ్యశబ్దాలను కలిపితే "అచ్చతెనుగు" లేక "ఆచ్ఛికము" అవుతుందని ముందుగానే తెలియజేశాను. ఇటువంటి అచ్చతెనుగుశైలిలో తిలక్ 20 కవితలు వ్రాశారు. "సంధ్య - ఈ రాత్రి - ఖాళీ చేసిన... - వేసవి - ముసలివాడు - సైనికుడి ఉత్తరం - గుండెకింద నవ్వు - వాన కురిసిన రాత్రి - పిలుపు - అమ్మా! నాన్న ఎక్కడికి వెళ్ళాడు? - పోయిన వజ్రం - నేను కాని నేను - నిన్న రాత్రి - అభినవ ఋగ్వాదం - శవం - వెళ్ళిపొండి వెళ్ళిపొండి - త్రిమూర్తులు - నా కవిత్వంలో నేను దొరుకుతాను - వసంతం - నిరీక్షణ"

తత్సమశైలికి వర్తించిన సూత్రమే ఈ అచ్ఛికశైలికి కూడా వర్తిస్తుంది. పూర్తిగా అచ్చతెనుగులోనే కవితలు అల్లలేం. అలా చేస్తే శైలి కృతకంగా ఉంటుంది. అచ్చతెనుగు కావ్యాలలాగే అర్థం కాకుండా పోయే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి 90% అచ్చతెనుగు పదాలున్నా మిగిలిన 10% సంస్కృతసమపదాలు ఉంటాయి. ఇటువంటి శైలినే "ఆచ్ఛికశైలి" అంటున్నాను.

2.1 చినుకు చినుకుగ వానకురిసినటు, <u>నిశికి</u>
సన్న చీకటి దోమ తెర కట్టినటు
చలి చలిగ గాలి
చెట్ల ఆకుల దూరి, కప్ప బెకబెకల తేలి
చూరులో నిదురతూలి
గుండె కొసలకు మెల్లగా జారినటు
కప్పుకొను దళసరి దుప్పటిలో
వెచ్చవెచ్చని <u>మనసు</u>లో,పొరలి వచ్చు

నిదురలో, చినుకు రాలినటు

కలలు జారు సవ్వడి" (–'వాన కురిసిన రాత్రి')

పై పాదాలలో "నిశ" – "మనసు" అనే రెండు పదాలు మాత్రమే సంస్కృత పదాలు. "నిశికి" అనే పదాన్ని "నిసికి" అని వ్రాస్తే అది కూడా తెలుగు పదమే అయిపోతుంది. "నిశ" సంస్కృత పదం, "నిసి" తెలుగు పదం (వైకృతం). "నిశ + కి – నిశికి" అనే ఉద్దేశంతో తిలక్ వ్రాసివుండవచ్చు. సంస్కృతంలో "నిశ" అనే శబ్దం లేదు. "నిశ–నిశీథము – నిశీథిని" అనే శబ్దాలున్నాయి. కాని విశ్వనాథ, తిలక్ తమ కవితలలో "నిశ" అనే శబ్దం చాలా చోట్ల వాడారు. ఇది సాధుశబ్దం కాదు.

2.2 **"అమ్మా! నాన్న ఎక్కడికి వెళ్ళాడు? ఇంకా రాదేం?"**
అని అడిగాడు నాలుగేళ్ళ పిల్లవాడు మరోసారి–
అలవోకగా వాడి తల నిమురుతూ ఆమె అలాగే
ఆశతో వింటోంది రేడియోలో వార్తలు
ఆమె కళ్ళలో విమానాల రెక్కలు కదలిన నీడలు
ఆమె గుండెల్లో మర ఫిరంగులు పేలిన జాడలు
కాశ్మీరు సరిహద్దుల్లో కమ్ముకొన్న నల్లని పొగల మధ్య
కాలూని, నిల్చున్న సైనికుడు చటుక్కున
ఆమె కళ్ళముందు నిలిచాడు." (–అమ్మా! నాన్న ఎక్కడికి వెళ్ళాడు?)

క్రింద గీతలుంచిన పదాలలో 'రేడియో' – 'ఫిరంగులు' అన్యదేశ్యాలు. "ఆశ" – "వార్తలు" – "విమానాలు" – "సైనికుడు" సంస్కృతసమ పదాలు.

2.3 **"పాత ఇటికల గుట్టలో మెలికలు తిరిగిన పాము బద్ధకంగా కదులుతుంది**
అదే సమయంలో లేత ఎరుపు ఆవేశాన్ని వొంటినిండా కప్పుకొని

కడుపులో వణికించే చలి కనబడకుండా ఆలోచనల మంటలంటించి
కళ్ళ చివర నేనుకాని నేను నీ వలపు దూరాన్ని ముడివేసుకొంటూ
గొణుక్కొంటూ పాడుకొంటూ ఏదో రాసుకుంటున్నాను" (–'నేను కాని నేను')
'సమయం'– 'ఆవేశం' – 'ఆలోచనలు' – 'దూరం' సంస్కృత పదాలు.

2.4 **"ఎవరు మీరంతా? ఎందుకిలా వొంగిన నడుంతో కన్నీటితో**
చెదిరిన జుట్టుతో జారిన పైటలతో
ఈ సమాధుల చుట్టూ వెతుక్కుంటూ తిరుగుతారు?
తల్లులా, భార్యలా, అక్కచెల్లెండ్రా మీరు?
ఏనాటివారు? ఏ వీటివారు?
ఏ యుద్ధంలో చనిపోయాడు మీవాడు? ఏ దళం?
ఎన్నవ నంబరు?" (– 'వెళ్ళిపొండి వెళ్ళిపొండి')

'సమాధులు' – 'భార్యలు' – 'యుద్ధం' – సంస్కృత పదాలు. 'నంబరు', – అన్యదేశ్యం (ఆంగ్లం).

2.5 **"ఏంవండీ! యిలా వొదిలేసి వొంటరిగా నన్నూ పిల్లల్నీ**
యెక్కడికి చీకట్లో వెళ్ళిపోతున్నారు?
యిలాగ మంచులో పడి పోతున్నారు?
ఇక్కడ మమ్మల్ని భయంతో కట్టేసి
బాధతో పొడిచేసి
అరవకుండా ఆకల్ని నోట్లో కుక్కేసి
అయ్యయ్యో! ముండకోసం జూదంకోసం తాగుడుకోసం
అర్ధరాత్రి వెళ్ళిపోతున్నారు?" (– 'మంచు')

'భయం'–'బాధ'–'అర్ధరాత్రి'– ఈ మూడు పదాలు మాత్రమే సంస్కృతపదాలు.

3. "మిశ్రశైలి" :–

తెలుగు పదాలు సంస్కృత పదాలు కలసిన శైలిని "మిశ్రశైలి" అంటున్నాను. దీంట్లో మళ్ళీ రెండు రకాలు ఉన్నాయి. 1. "సమ మిశ్రశైలి" 2. "విషమ మిశ్రశైలి". తెలుగు పదాలు సంస్కృత పదాలు సమపాళ్ళలో కలిసిన శైలి "సమ మిశ్రశైలి", అంటే 50% + 50%. అలా కాకుండా తెలుగు పదాలు సంస్కృత పదాలు విషమపాళ్ళలో కలసిన శైలి "విషమ మిశ్రశైలి". అంటే రెండుపాళ్ళు తెలుగు పదాలు, ఒక పాలు సంస్కృత పదాలు కలిసిన శైలికాని; లేదా దీనికి వ్యతిరేకమైన శైలికాని (అంటే సంస్కృత పదాలు రెండుపాళ్ళు, తెలుగు పదాలు ఒక పాలు ఉన్న శైలికాని) "విషమ మిశ్రశైలి" అవుతుంది. ఇప్పుడు సమ మిశ్రశైలికి, విషమ మిశ్రశైలికి తిలక్‌కావ్యంలోంచి కొన్ని ఉదాహరణాలను పరిశీలిద్దాం.

3.1 సమ మిశ్రశైలి: – తెలుగు పదాలు + సంస్కృత పదాలు సమపాళ్ళలో మేళవించి వ్రాసిన కవితలు 'అమృతం కురిసిన రాత్రి' లో ఎక్కువగా ఉన్నాయి. "కాయ్ రాజా కాయ్ – నీవు (గ్రాంథికభాష) – తపాలా బంట్రోతు – రాత్రివేళ – దీపం – ప్లస్ యింటూ మైనస్ – మైనస్ యింటూ ప్లస్ – న్యూ సిలబస్ – అమృతం కురిసిన రాత్రి – ఒక్కసారి – చావులేని పాట – వానలో నీతో – ప్రవహ్లిక – అదృష్టాధ్వగమనం – నవత: కవిత – సి.ఐ.డి. రిపోర్టు – కిటికీ – హార్లెమ్స్‌లో శవం – నగరంమీద ప్రేమగీతం – నగరంలో హత్య – మన సంస్కృతి – ద్వైతం – వెన్నెల – శిఖరారోహణ – నిన్నరాత్రి వర్షంలో – ముసలిదైపోయింది భూమి – నిజాలు – ప్రాణంలేని నీడలు" (మొత్తం 28 కవితలు). ఈ కవితలలో నుండి కొన్ని ఉదాహరణాలు ఇస్తాను.

3.1.1 **"చెరచబడ్డ జవ్వని విడివడిన <u>పృథుశిరోజ భారంలాగ</u> ఈ**
<u>నిశీథం మలిన మలినమైన</u> చెదరిన తన అందాన్ని చీకట్లతో
కప్పుకుంటోంది, ఒంటరిగా నాలో <u>ఊహలలో అవ్యక్తంలాగ</u>
ఒదుగుతోంది, <u>అనంతమైన శూన్యాన్ని</u> అలుముకుంటోంది
ఏదో పాట <u>మాత్రం</u> ఏడుపేడుపుగా సన్నగా తియ్యగా గాలిలో
ఊగుతోంది, <u>నీరవమైన ఏకాదశి నిశీథాన్ని</u> రెండుగా చీలుస్తోంది"

(– 'రాత్రివేళ')

ఇందులో తెలుగు పదాలు సంస్కృత పదాలు సమపాళ్లలో కూర్చబడ్డాయి. క్రీగీత లుంచిన భాగాలు సంస్కృత పదగుంఫితములైన భాగాలు. క్రింది. ఉదాహరణాలలో కూడా ఈ విషయాన్ని గమనింపగలరు.

3.1.2 **"జలజలమని కురిసింది వాన**
జాల్వారింది <u>అమృతపు</u> సోన
దోసిళ్ళతో తాగి తిరిగి వచ్చాను
<u>దుఃఖాన్నీ</u> చావునీ వెళ్ళిపొమ్మన్నాను
<u>కాంక్షా మధుర కాశ్మీరాంబరం</u> కప్పుకున్నాను
<u>జీవితాన్ని హసన్మందారమాలగా ధరించాను</u>
<u>జైత్రయాత్రా పథంలో</u> తొలి అడుగు పెట్టాను" (–'అమృతం కురిసిన రాత్రి)

3.1.3 "**అన్నా**
దూరతీరాన తెల్లని ఓడ తెరచాప కదలినపుడు
భావహృదయాన నిశ్వసనానిలం వీచినపుడు
ఒక్క దుఃఖితుడు నవ్వినపుడు
ఒక్క పతితుడు కన్విప్పినపుడు
అక్కడ నా అడుగుజాడ గుర్తించగలవు
అక్కడ నా సందేశాన్ని అశ్రు సంగీతాన్ని
ఆహ్లాదించగలవు" (– 'చావులేని పాట')

3.1.4 "**ఆకాశాన్ని మేఘం నల్లని కంబళిలా కప్పుకుంది**
ఆనందం మనసులో మయూరబర్హంలా విప్పుకుంది
ఆలోచనలెందుకు జవ్వనీ! విలోకించు వర్షాసంధ్యని
సందేహం వదలి నా సందిటిని నిలిచి కళ్ళెత్తి చూడు" (– 'వానలో నీతో')

3.1.5 "**ఇక్షుకోదండ జ్యావల్లి నాస్ఫాలించబోయి**
చటుక్కున ఎందుకో మన్మథుడు వెనక్కి అడుగు వేశాడు
ఆమ్రశాఖాగ్ర పుంస్కోకిల సమ్మె ప్రకటించింది
పల్లవం ముట్టదు గొంతు విప్పదు" (– 'శిఖరారోహణ')

3.2. విషమ మిశ్రశైలి

3.2.1 తెలుగు ఎక్కువ - సంస్కృతం తక్కువ (రెండు పాళ్ళు తెలుగు - ఒకపాలు సంస్కృతం) "దృశ్యభావాలు - పాడువోయిన ఊరు - ప్రవాసలేఖ - మేగ్నాకార్టా - శిక్షాపత్రం - టులాన్ - యుగళగీతిక - ఆ రోజులు - రాజమండ్రి పాటలు– స్వేచ్ఛా విహారం - యుద్ధంలో రేవుపట్టణం - నీడలు - నువ్వులేవు నీ పాట వుంది - త్రిమూర్తులు (పాఠాంతరం) - చిన్నారికి చిన్నమాట - త్రిశూలం - సమాజం - గ్రీష్మం - వేకువ" (మొత్తం 19 కవితలు) ఈ వర్గం క్రిందికి వస్తాయి -

3.2.1.1 "**నువ్వు లేవు నీ పాట వుంది**
ఇంటి ముందు జూకామల్లె తీగల్లో అల్లుకుని
లాంతరు సన్నని వెలుతురులో క్రమ్ముకుని, నా గుండెల్లో చుట్టుకుని,
గాలిలో ఆకాశంలో నక్షత్రం చివరి మెరుపులో దాక్కుని,

నీరవంగా నిజంగా వుంది, జాలిగా హాయిగా వినపడుతూ వుంది,
శిశిర వసంతాల మధ్య వచ్చే
మార్చుని గుర్తుకి తెస్తోంది యిన్నేళ్ళ తర్వాత, వేడిగాలి
చల్లదనానికి తిరిగే ఒకానొక గ్రీష్మ దివసావసాన సమయాన"

('నువ్వు లేవు నీ పాట వుంది')

క్రీగీతలుంచిన పదాలలో ఒక్క "లాంతరు" తప్ప తక్కినవి సంస్కృత పదాలు, లాంతరు ఆంగ్లపదం (Lantern). మిగిలినవన్నీ తెలుగుపదాలు.

3.2.1.2 **"మరొహాడు**
మల్లెపూల మీద పరుంటాడు
మంచిగంధం రాసుకుంటాడు
మరెందుకేడుస్తాడు?
మంచి పనివాడు
మాకు నచ్చినవాడు
మంత్రనగరానికి వెళ్ళొచ్చిన వాడు
మధ్యమధ్య మాధ్వరసం చేదంటాడు
వధ్యశిల మీద విరహగీతం రాస్తాడు
మాతోపాటు నడుస్తానంటాడు
మరి నిజంగా వస్తాడా?
మారిపోయిన జగాన్ని చూస్తాడా?" (-"త్రిమూర్తులు (పాఠాంతరం))

క్రీగీతలు ఉంచిన పదాలు మాత్రమే సంస్కృతం. తక్కినవన్నీ తెలుగుపదాలు.

3.2.2 సంస్కృతం ఎక్కువ-తెలుగు తక్కువ (రెండు పాళ్ళు సంస్కృతం ఒక పాలు తెలుగు):-

"నాకవిత్వం - ప్రాతఃకాలం - ఈ రాత్రి - భూలోకం - కవివాక్కు - ప్రకటన - ఒక శ్రుతి (గ్రాంథిక భాష) - కఠినోపనిషత్ - వసుధైకగీతం - లయగీతం (గ్రాంథిక భాష) - ప్రార్థన - నెహ్రూ - భరతవాక్యం - నా భరతధాత్రి - యీడిపస్ - నగరంపై పీడనీడ-మళ్ళీ ఒక దీపావళి" మొత్తం = 17 కవితలు ఈ శాఖకు ఉదాహరణాలుగా ఉన్నాయి.

3.2.2.1 "సంకుచితమైన జాతిమతాల సరిహద్దుల్ని చెరిపివేస్తున్నాను చూడు
అకుంఠితమైన మానవీయ పతాకను ఎగురవేస్తున్నాను చూడు
చరిత్ర రక్తజలధికి స్నేహసేతువు నిర్మిస్తున్నాను రండి
కవి వచస్సవిత్రు కాంతిపూరమిది స్వేచ్ఛగా జలకమాడండి"
(– 'వసుధైకగీతం')

3.2.2.2 "మానవోత్తముడవు / మేరునగధీరుడవు
అకుంఠిత కార్యదక్షా దీక్షితుడవు
అపుడే ఎలాగ విడిచిపోయావయ్యా
అసంపూర్ణ చిత్రాన్ని వదలి
అనిబద్ధమాలికను వదలి
ఎలాగ కనుగిలికి తెరతొలగించి నిశ్శబ్దంగా నిష్క్రమించావు?
దిగ్భ్రాంతమైన దేశాన్ని విడిచి
దీన మానవాళిని మరచి" (–నెహ్రూ)

పై ఉదాహరణాలలో క్రీగీతలున్నవి తెలుగు విభక్తులు, పదాలు.

4. ఆంగ్లపద మిశ్రితమైన విచిత్రశైలి:–

మధ్యయుగాలలో (13 నుండి 17 శతాబ్దాల మధ్య) ముస్లిముల పాలనలో అరబిక్, పారశీకము, ఉర్దూ పదాలు కొన్ని వచ్చి తెలుగులో కలిసిపోయాయి. వాటిని ప్రాచీనకవులు (శ్రీనాథాదులు) తమ కావ్యాలలో ప్రయోగించారు. ఇటువంటి "ముస్లిం అన్యదేశ్యాలు" 900 పదాల వరకూ ఉన్నాయని పరిశోధకుల అంచనా. ఆధునికయుగంలో (18,19,20 శతాబ్దాలలో) ఇంగ్లీషు పాలనవల్ల, ఆంగ్లభాషాప్రభావంవల్ల కొన్ని ఆంగ్లపదాలు వచ్చి తెలుగులో చేరాయి. వీటిలో కొన్ని మార్పులు చెంది (తద్భవాల వలె) తెలుగుభాషావిభక్తులకు అనుగుణంగా మారిపోయాయి. కొన్ని పదాలు మార్పులు చెందకుండా యథాతథంగా (తత్సమాలవలె) తెలుగులో ఆంగ్లవిద్యావంతులు ప్రయోగిస్తున్నారు. (కొన్ని ఫ్రెంచిపదాలు, కొన్ని పోర్చుగీసు పదాలు కూడా మన తెలుగులో ఉన్నాయి.) మధ్యయుగాలలో ప్రవేశించిన అన్యదేశ్యాలు ఆధునికయుగంలో ప్రవేశించిన అన్యదేశ్యాలను తిలక్ తన కావ్యంలో పుష్కలంగా వాడారు. కవితలోని వస్తువులనుబట్టి ఇవి ప్రవేశించాయి.

4.1 "సైనికుడి ఉత్తరం" కవితలో సైనికుని మనస్తత్వాన్ని భార్యతో చెపుతున్న అతని మాటలతోనే కవి చెపుతున్నాడు కాబట్టి ఆంగ్లపదశైలి దొర్లింది:-

"పోదు నాలో భయం, మళ్ళీ రేపు ఉదయం
ఎడార్లూ నదులూ అరణ్యాలూ దాటాలి
ట్రెంచెస్‌లో దాగాలి
పైన ఏరోప్లేను, చేతిలో స్టెన్‌గన్
కీయిస్తే తిరిగే అట్టముక్క సైనికులం
మార్చ్
వన్ టూ త్రీ షూట్ డెడ్ ఎవడ్?
నువ్వా? నేనా?
కేబుల్‌గ్రాం యిప్పించండి కేరాఫ్ సో అండ్ సో
(మీవాడు డెడ్)
స్పృహ తప్పిన ఏనేస్తిషియాతో / వెన్నెముక కఱ్ఱలా బిగిసింది"

ఈ కవితలోని ఆంగ్లపదాలను తెలుగులోకి అనువదించి చెప్పడం సాధ్యంకాదు. ఒకవేళ చెప్పినా పైన ఉన్న ఆంగ్లశైలిలోని శక్తి రాదు. "ఎవడు?" అనే తెలుగు పదాన్ని కూడా ఆంగ్ల పదంలాగ "ఎవడ్?" అని మార్చడం మరీ విచిత్రంగా ఉంది.

4.2 అలాగే "శిఖరారోహణ" అనే కవితలోని ప్రారంభ పాదాలను చూడండి:-

"లైట్లు వెలిగిన స్టేషన్లోకి రైలు వచ్చినట్టుగా
కొత్త సంవత్సరం హుషారుగా కొత్తగా రావాలి మన మధ్యకి
కాని యీసారి ప్లాట్‌ఫారమంతా చీకటిగా వుంది...
రైలింగ్ అవతల టిక్కెట్లు దొరక్క ప్రజలు దిగాలుపడి నుంచున్నారు"

పై అన్యదేశ్యాలలో "లైట్లు" (ఇంగ్లీషు) "హుషారుగా" (ఉర్దూ) అనే పదాలను "దీపాలు", "ఉత్సాహంగా" అని తెలుగులోకి మార్చుకోవచ్చును. కాని తక్కిన ఆంగ్లపదాలను అనువాదం చేయడం సాధ్యం కాదు.

4.3 – "సైనికుడి ఉత్తరం" – "శిఖరారోహణ" లతోపాటు మరికొన్ని కవితలలో కూడా మధ్య మధ్య ఆంగ్లపద మిశ్రితమైన ఈ విచిత్రశైలి కనబడుతుంది:-

4.3.1 "న్యూస్ పేపర్లో
No Casualities అని వార్త" (– 'ఖాళీ చేసిన')

4.3.2 "స్టేషన్లో టిక్కెట్లను జారీ చెయ్యకండి
ఎక్కడి రైళ్ళు అక్కడ ఆపివేయండి
దేశదేశాలకి కేబుల్ గ్రామ్స్ పంపించండి
... కాఫీ హెూటళ్ళలో క్లబ్బులలో కర్మాగారాల్లో
కాస్త జాగ్రత్తగా నిశితంగా పరిశీలించండి" (– 'ప్రకటన')

4.3.3 "గ్రీష్మంలో
రెల్లుపూల బార్డర్ వేసిన
నీలాల నీటి నైలాన్ చీర
వొంటిమీద నుంచి జారుతుండగా
రాజమండ్రి అనే యువతి ... ...
సెంట్లూ, అత్తర్లు / స్నోలూ, పౌడర్లూ వాడదు,
సినిమాలూ క్లబ్బులూ
చూడదావిడ" (–'రాజమండ్రి పాటలు')

4.3.4 "ప్రిన్స్ ఛార్మింగ్, డార్లింగ్ ఆఫ్ ది మిలియన్స్
వెళ్ళిపోతున్నాడు
దారి యివ్వండి!" (– 'నెహ్రూ')

4.3.5 "సోల్జరు శవం
డెమోక్రసీదా? సోషలిస్టు క్యాంప్‌దా?
ఇంపీరియలిస్టుదా?...
... ...
ఐడెంటిఫికేషన్ పెరేడ్ పెట్టిస్తాను
యు.యన్.ఓ. పీస్ కమిషన్ ఛైర్మన్ గారూ!
భయపడకండి" (– 'శవం')

4.3.6 "యెల్లో గ్రీన్ గ్రీన్ రెడ్ డేంజర్
సైరన్ కూతలు

ఫిరంగి మోతలు
ట్రెంచెస్‌లో నొక్కి పట్టిన ఉలిపిరి ఊపిరి
చీకటిలో వ్యాపించిన మృత్యువు కావిరి
నగరం టవరు మీద ఎక్కి ఎర్రగా చూస్తోంది
నగరం భయంతో గుండె బరువెక్కి నల్లాగా చస్తోంది
లైట్ హౌస్ రాక్షసి తలచుట్టూ ఒకే కన్ను తిరుగుతోంది"
(– 'యుద్ధంలో రేవుపట్టణం')

5. తెలుగు + సంస్కృతం + ఆంగ్లం కలిపిన విచిత్రశైలి

"గొంగళి పురుగులు – కొనకళ్ళకు అక్షరాంజలి – కాస్మొపాలిటన్ – మంచు" అనే నాలుగు కవితలలో తిలక్ తెలుగు + సంస్కృతం + ఆంగ్లం కలిపిన విచిత్రశైలిని పూర్తిగా పాటించారు. కొన్ని ఉదాహరణాలు:

5.1 "రోజూ ఆవకాయ తిన్నట్టు
రొటీన్ అలవాటైన
బల్లపరుపు జీవితం కింద కాషస్‌గా దాచిన
కోర్కెల సీక్రెట్ బాక్స్ లోంచి తీసి
ఉద్రేకాన్నీ, సెక్స్‌నీ, శృంగారాన్నీ
క్రైమ్‌నీ, షాక్‌నీ, లాటరీ కాగితాల్నీ
చాటుగుండా చూసుకుని, నవ్వుకుని, మీసం మెలేసుకుని
మాట్లాడకుండా జెంటిల్మన్‌లా మత్తుగా పడుకుంది గొంగళి పురుగు
బస్‌స్టాప్ దగ్గర పరాయి ఆడది తనకేసి చూసి నవ్విందని
మెరీనా కాంటీన్ యివతల నుంచుంటే
మినపట్టు వాసన ఘాటుగా వేసిందని
అసలు అప్పుడే కాంగ్రెసులో చేరివుంటే ఈపాటికి మినిస్టర్నీ
అయిపోయి ఉండేవాడినని
పెళ్ళాందగ్గర చెప్పాలని సర్దాపడి
... ...
బ్లాక్ మార్కెట్లో బియ్యం, బ్రాకెట్ల ఓపెనింగులు, క్లోజింగులు
థియేటర్లో కొత్త సినిమా, కాఫీ హొటల్ రేడియోలో లతా

రోడ్డుమీద ఖరీదైన కార్లు, ఎన్నికల్లో నెగ్గినవాడి ఉరేగింపు
కేకలు, కోకలు, మూకలు ముసిరిన బజారు రోడ్డమ్మట
… … … …
గోడమీద గ్రూప్ ఫోటోలు, బియేడిగ్రీలు కృశించి …"
(– 'గొంగళి పురుగులు')

5.2 **"సిన్సియారిటీ కవితా సుందరికి సీమంతం లాంటిది**
శివ సుందరాలకి సత్యం బేస్ లాంటిది." (– కొనకళ్ళకు అక్షరాంజలి)

5.3 **"రష్యాలో రివిజనిస్టు వోడ్కా సిప్ చేసి**
చైనాలో రివల్యూషనరిస్టు సప్పర్ భోంచేసి
అమెరికా హాలీవుడ్ తారాపథాల మీద చక్కర్ కొట్టి
టోక్యోలో గైషాయోషాధరాల టేస్టుచేసి
స్పెయిన్‌లో రెయిన్‌లో తడిసి
ఇరాన్లో కొరాన్ చదివి
ఈరోజునే ఇండియా విచ్చేశారు వీరు
కాస్మొపాలిటన్ బోర్ వీరి మారుపేరు"

"కాస్మొపాలిటన్" అనే పేరుగల ఈ కవిత అంతా ఇదే విచిత్రశైలిలో కొనసాగుతుంది.

5.4 "హలో…. హలో… నేనండి నేను ….నేన్నేను
డాక్టర్‌గారున్నారా? … అర్జెంటు సార్, వెరీ అర్జెంట్!
హార్టాపరేషన్ చెయ్యమంటూ
ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాడు
మాఫలేషు కదాచన
పరిత్రాణాయ సాధూనాం
Lead Kndly Light
లాంటి మాటలు విన్నప్పుడల్లా
"బాబోయ్ మోసం!" అని అరుస్తున్నాడు
… హల్లో డాక్టరుగారూ!/అయ్యో! డాక్టరుగారూ

చుంచుకాదు సార్... ... మంచు మంచు
స్నో, ఫాగ్ - సైలెంట్ స్నో-డ్రెడ్‌ఫుల్ స్నో... ఎడ్గార్ స్నో
నిరాశ మంచు నిస్పృహ మంచు
నీమీదా నామీదా, అందరిమీదా
నమ్మకం పోయిన సినికల్ మంచు" (– 'మంచు')

II. శీర్షికల భాష:–

ఈ శైలిభేదాలు కవితాఖండికల శరీరంవంటి రూపం (form)లోనే కాకుండా, శీర్షంవంటి శీర్షికలలో కూడా మనం గుర్తించవచ్చు. విశాలాంధ్ర ప్రచురణాలయం వారు 1968 నుండి ఈనాటివరకూ ముద్రిస్తూ వచ్చిన "అమృతం కురిసిన రాత్రి" కవితా సంపుటిలో 93 కవితలున్నాయి. ఇటీవల – అంటే 2020లో నేను తిలక్ రచించిన మరో మూడు కవితలను సంపాదించగలిగాను. అవి: (1) "లాలి" – (2) "కైమోడ్పు" – (3) "సమవాకారం". ఎమెస్కోవారు తమ ద్వితీయ ముద్రణలో ఈ కొత్త కవితలను చేర్చారు. ఈ మూడూ కూడా కలుపుకొంటే, తిలక్ 'అమృతం కురిసిన రాత్రి'లో మొత్తం కవితల సంఖ్య 96 అవుతుంది. ఈ 96 శీర్షికలలో 38 శీర్షికలు సంస్కృత పదాలతో ఉన్నాయి. 23 శీర్షికలు తెలుగులో ఉన్నాయి. కేవలం ఆంగ్లశీర్షికలు 8 ఉన్నాయి. సంస్కృతపదాలు + తెలుగుపదాలు కలిసిన మిశ్రశీర్షికలు 21 ఉన్నాయి. వీటికి అన్యదేశ్యాలు (హిందీ, ఆంగ్లం) చేర్చిన శీర్షికలు 5 ఉన్నాయి. వ్యక్తినామం (నెహ్రూ) ఒకటి ఉంది. మొత్తం 96 శీర్షికలు.

1. సంస్కృతభాషలో ఉన్న శీర్షికలు:– "దృశ్యభావాలు – ప్రాతఃకాలం–సంధ్య – ప్రవాసలేఖ – శిక్షాపత్రం – సైనికుడి ఉత్తరం – భూలోకం – యుగళగీతిక – కవివాక్కు – ప్రకటన – ఆర్తగీతం – అద్వితీయం – కఠినోపనిషత్ – రాత్రివేళ – వసుధైకగీతం – స్వేచ్ఛావిహారం – దీపం – లయగీతం – విరహోత్కంఠిత – ప్రార్థన – ప్రవహ్లిక – అదృష్టాధ్వగమనం – నవత:కవిత – అభినవ ఋగ్వాదం – దుర్మరణవార్త – ద్వైతం – శవం – త్రిమూర్తులు – త్రిమూర్తులు (పాఠాంతరం) – శిఖరారోహణ – భరతవాక్యం – త్రిశూలం – సమాజం–వసంతం – గ్రీష్మం – వర్షహేల – నిరీక్షణ – సమవాకారం." (38)

2. తెలుగుభాషలో ఉన్న శీర్షికలు:- "పొడువోయిన ఊరు-వేసవి-ముసలివాడు-గుండెకింద నవ్వు-పిలుపు-గొంగళి పురుగులు-నీవు-ఒక్కసారి-అమ్మా! నాన్న ఎక్కడికి వెళ్ళాడు?-నీడలు-చావులేని పాట-వానలో నీతో- నేనుకాని నేను-కిటికీ-నువ్వులేవు నీ పాటవుంది-వెన్నెల-వెళ్ళిపొండి వెళ్ళిపొండి - చిన్నారికి చిన్నమాట-మంచు-నిజాలు-వేకువ - లాలి - కైమోడ్పు". (23)

3. మిశ్రశీర్షికలు (తెలుగు + సంస్కృతం) :- "నా కవిత్వం-ఈ రాత్రి-1 - ఈ రాత్రి-2 - వాన కురిసిన రాత్రి - కాయ్ రాజా కాయ్ - ఒక శ్రుతి - అమృతం కురిసిన రాత్రి - యుద్ధంలో రేవుపట్టణం - కౌనకళ్ళకు అక్షరాంజలి - పోయిన వజ్రం - నిన్నరాత్రి - నగరంమీద ప్రేమగీతం - నగరంలో హత్య - మన సంస్కృతి - నా కవిత్వంలో నేను దొరుకుతాను - నిన్నరాత్రి వర్షంలో - ముసలిదైపోయింది భూమి - నా భరతధాత్రి - నగరంపై పీడనీడ - ప్రాణంలేని నీడలు - మళ్ళీ ఒక దీపావళి." (21)

3.1 అన్యదేశ్య మిశ్రశీర్షికలు:- "ఖాళీ చేసిన... - తపాలా బంట్రోతు - -హార్టెమ్సులో శవం - ఆ రోజులు - రాజమండ్రి పాటలు ." (5)

4. పూర్తిగా ఆంగ్లభాషలో ఉన్న శీర్షికలు:- "మేగ్నాకార్టా - టులాన్ - ప్లస్ యింటూ మైనస్ - మైనస్ యింటూ ప్లస్ - న్యూ సిలబస్ - సి.ఐ.డి రిపోర్టు - కాస్మొపాలిటన్ - యీడిపస్." (8)

మొత్తంమీద సంస్కృతపదాల శీర్షికలు ఎక్కువగా ఉన్నాయి. సంస్కృత భాషలో ఒక విధమైన గాంభీర్యం కాంతి ఉంటాయి. అందువల్ల తెలుగు ఆధునిక కవులు తమ కవితలకే కాదు, కావ్యాలకు కూడా సంస్కృతభాషలోనే నామకరణం చేస్తూ ఉంటారు. ఉదా॥ మహాప్రస్థానం - త్వమేవాऽహం - శేషజ్యోత్స్న - ఆధునిక మహాభారతం - జనవంశమ్ - ఝుంఝు" మొదలైనవి. తిలక్‌కి సంస్కృత పదాలన్నా, సంస్కృత సమాసాలన్నా చాలా యిష్టం.

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. కవితకు పెట్టిన శీర్షిక ఏ శైలిలో ఉందో (లేదా ఏ భాషలో ఉందో) లోపల ఉన్న విషయవర్ణన కూడా ఆ శైలిలోనే (ఆ భాషలోనే) ఉంటుందనే భరోసా లేదు. ఉదాహరణానికి అమృతం కురిసిన రాత్రిలోని 96 శీర్షికలలో సంస్కృతపదాలతో 38 శీర్షికలున్నాయి. కాని నిజంగా సంస్కృతశైలిలో సాగిన కవితలు ఐదు మాత్రమే. (ఈ ఐదు కవితా శీర్షికలూ

సంస్కృత పదాలలోనే ఉన్నాయి లెండి.) తత్సమ (సంస్కృతసమ) శీర్షికలున్న కొన్ని కవితలు లోపల ఆచ్ఛికశైలిలో సాగాయి. ఉదా॥ "సంధ్య - అభినవ ఋగ్వాదం - శవం - త్రిమూర్తులు - వసంతం - నిరీక్షణ." అలాగే "ప్లస్ యింటూ మైనస్ - మైనస్ యింటూ ప్లస్ - న్యూ సిలబస్ - సి.ఐ.డి. రిపోర్టు - మేగ్నాకార్టా - యీడిపస్" అని ఆంగ్లశీర్షికలుంచిన కవితలు లోపలి విషయం. ఆంగ్లశైలిలో లేదు. తెలుగు + సంస్కృతాల మిశ్రశైలిలో ఉంది. నిజంగా ఆంగ్ల శైలిలో సాగిన నాలుగు కవితలలో ఒక్కదానికే ఆంగ్లశీర్షిక ఉంది- ("కాస్మోపాలిటన్"). మిగిలిన మూడింటికీ తెలుగు శీర్షికలే ఉన్నాయి: "గొంగళి పురుగులు - కొనకళ్ళకు అక్షరాంజలి - మంచు."

III.సమాసాలు:- తిలక్ కవిత్వంలోని సమాసాలను ఐదు రకాలుగా విడదీయవచ్చును. : 1) సంస్కృత సమాసాలు 2) తెలుగు సమాసాలు 3) మిశ్ర సమాసాలు 4) అన్యదేశ్య సమాసాలు 5) వైరిసమాసాలు లేక దుష్టసమాసాలు. తిలక్ కూర్చిన సమాసాల్లో నూటికి 90% సంస్కృత సమాసాలే. వీటిలో రెండు పదాల సమాసాలు, మూడు నాలుగు పదాలతో కూర్చిన సమాసాలు, అనేక పదాలతో కూర్చిన సుదీర్ఘసమాసాలు అన్నీ ఉన్నాయి. నిజానికి సమాసరచనలో సంస్కృతపదాలు ఒదిగినట్లుగా తెలుగు పదాలు ఒదగవు. తెలుగు సమాసం ఎక్కువగా రెండు పదాలకే పరిమితమై ఉంటుంది. మూడు నాలుగు పదాలతో సమాసరచన చేయడం తెలుగులో సాధారణంగా సాధ్యం కాదు. అయినా తిలక్ ఒకటి రెండు చోట్ల రెండుకన్నా ఎక్కువ తెలుగు పదాలతో సమాసరచన చేయడానికి ప్రయత్నించారు. హాస్యరసస్ఫోరకమైన ఆంగ్లశైలిలో ఆంగ్లసమాసాలు కూడా సృష్టించారు. మిశ్రసమాసాలలో తెలుగు + సంస్కృతం కలిసిన మిశ్రసమాసాలే ఎక్కువ. తెలుగుతో కాని, సంస్కృతంలో కాని ఆంగ్లం కలిసిన మిశ్రసమాసాలు తక్కువగా ఉన్నాయి.

1. సంస్కృత సమాసాలు:- ఇవి తిలక్ రచనలో కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. అందువల్ల అన్నీ ఉదాహరించడం సాధ్యంకాదు కాబట్టి మచ్చుకు కొన్ని మాత్రమే తెలియజేస్తున్నాను.

1.1. రెండేసి పదాల సంస్కృత సమాసాలు:- "త్యాగశక్తి - ప్రేమరక్తి - శాంతిసూక్తి - దయాపారావతాలు - విజయబరావతాలు - సంధ్యాజ్వాలలు- స్వర్ణధార - కరాళగరళం - అజ్ఞాతకామం - ఉన్మాదస్వర్గం - సృష్టిసింహం -

నక్షత్రధూళి – మాధ్వీచషకం – రజతనదం – చరణమంజీరం – ఆకాశమందారం – సంఘగర్ధభం – ఏకాంతసరస్సు – ఉషఃకాంతి – దీపశిఖ – హేమంతశైత్యం – వినూత్న శృంఖలాలు – యౌవన ధనుస్సులు – ఆశావేశ్య – జీవనమధూళి” మొదలైనవి

1.1.1 ము>పు, ంపు>ం:– సంస్కృత పదాలతో సాధ్యసమాస రచన చేసేటప్పుడు 'ము' వర్ణానికి బదులు “పు,ంపు” లు వస్తాయి. (సరసము + వచనము = సరసపు వచనము, సరసంపువచనము). 'ము' వర్ణానికి 'పు' వచ్చిన సమాసాలు తిలక్‌లో ఉన్నాయి. “విషపు పరిధులు – అంధకారపు సముద్రం – సముద్రపు నీలం – జీవితపు ధూళి – శీతాకాలపు రాత్రి – ఇటువంటి సమాసాలలో ఉత్తరపదం సంస్కృతం కాబట్టి “పు, ంపు” లతో పనిలేదు. ఉత్తరపదం తెలుగుపదం అయినప్పుడే “పు,ంపు”ల అవసరం. కాని తిలక్ ఉత్తరపదం సంస్కృతపదం అయినప్పుడు కూడా “పు, ంపు” లు వాడారు. “అంధకార సముద్రం” అంటే చాలు (సిద్ధసమాసం) “అంధకారపు సముద్రం” (సాధ్యసమాసం) అని అనవలసిన పనిలేదు, అన్నా తప్పుకాదు. సంస్కృతము + తెలుగు మిశ్రసమాసం చేస్తున్నప్పుడు మాత్రం తప్పకుండా “పు, ంపు” లు వస్తాయి. లేదా షష్ఠీవిభక్తి యొక్కకి లోపం వస్తుంది. ఉదా॥ “ఆకాశపు కప్పు – దీపపు వత్తి – పారిజాతపు పువ్వులు – సముద్రపు కెరటం” మొదలైనవి. ఇక్కడ “పు,ంపు” లకు బదులుగా ఆధునిక కవులు పూర్ణబిందువును ప్రయోగిస్తున్నారు. “ము” యొక్క పరిణామమే పూర్ణబిందువు కాబట్టి ఇక్కడ సమాసం ఏర్పడలేదని భావించవలసి వస్తుంది. లేదా ఇటువంటి సమాసాలను దుష్టసమాసాలుగా పరిగణించవలసి ఉంటుంది ఉదా॥ “అనుమానం మంచు” (అనుమానపు మంచు) “జీవితం ముళ్ళకంచెలు “ (జీవితపు ముళ్ళకంచెలు) “జీవితం సంగీతంపెట్టె” (జీవిత సంగీతపుపెట్టె). “నందివర్ధనం పువ్వులు” (నందివర్ధనపు పువ్వులు). ఇటువంటివి తిలక్‌లో తక్కువ. నేటి కవులలో ఎక్కువ.

1.2. రెండుకన్నా ఎక్కువ పదాలతో సంస్కృత సమాసాలు:– “చరిత్ర విచిత్ర సముద్రాలు” (3 పదాలు) – “యుద్ధ విరమణ రేఖ” (3 పదాలు) – “స్మృత్యగ్ని కణం” (3 పదాలు) – “సత్య సౌందర్యాన్వేషణ” (3 పదాలు);– “మంత్ర లోకపు మణి స్తంభాలు” (4 పదాలు) – “కళాకరవాల దగద్ధగ రవాలు” (4 పదాలు) గ్రీష్మదివసావసాన సమయాన” (4 పదాలు) – “జలధిగర్భభరితబడబాగ్ని”

(4 పదాలు) – "ఆలోచనా సాహస వైహాయస వీథులు" (4 పదాలు) – "లలిత లలిత లతాంత మాల" (4 పదాలు).

1.3. సుదీర్ఘ సంస్కృత సమాసాలు (నాలుగు పదాలకన్నా ఎక్కువ పదాలు):– "సత్య శాంతి సౌందర్య సంగీత గీతం" – "కాలం సంకీర్ణ సౌవర్ణ చరణ మంజీరాలు" – "వాస్తవికతా శిథిల బధిర రుధిర కూపం" – ప్రత్యూష పవనలోల మందార లతాంతము" – "ప్రదోష వేళా తమాల శాఖాగ్ర ఘూకం" – "సజ్యకార్ముకాశ్లిష్ట భుజాబలోద్బుద్ధ పార్థులు" – "సముద్ర నిర్నిద్ర జలతరంగ భుజంగ పరీరంభములు" – "భారత జనయిత్రీ పదపూజా నవగీతావళి" – "కవితా చందనశాలా సుందర చిత్ర విచిత్రాలు" – "అభ్యంగనావిష్కృత తద్వీయ వినీల శిరోజ తమస్సముద్రాలు" – "ప్రాగ్దిశా సుందరీ ఖండ చంద్ర పరిదీపిత కపోలాలు" – "శాంత గంభీర నీరవగళత్తుషార కణజాలనోద్రిక్తగళమ్ము" – "చండికా చాముండికా సమ ప్రతాపోద్దీపితోద్దండ మండితాఖండ నారీమండలం."

2. తెలుగు సమాసాలు:– ఇవి తిలక్ కావ్యంలో పరిమిత సంఖ్యలో ఉన్నాయి.

2.1 రెండేసి పదాల తెలుగు సమాసాలు:– "బండిమువ్వ – కాలిగజ్జె – పొన్నమొక్క – జొన్నకంకె – చదలచుక్క – నెమలిరెక్క – అరటిమొక్క – పడుచుపిల్ల – వానచినుకు – కన్నీటి జడులు – కత్తులబోను – కన్నీటి బొట్టు – ఏడుపుకొండలు – చూపు చీకట్లు – రూపు వెన్నెలలు – అడుగుసవ్వడి – చిట్టితల్లులు – నెత్తుటిబొట్లు – వెలుతురు కుందేళ్ళు – నీడల కొండచిలువలు – మెత్తని గాగర – బూడిదరాసులు – నెత్తురువరదలు ('నెత్తుటి వరదలు' అని ఉండాలి.) – ముత్యాల ఉయ్యాల – బ్రతుకుల చితుకులు – చితుకుల మంటలు– తెల్లని చీకటి – నలుపుచార – చిటారుగది – గుండెల ఏడ్పులు – కస్తురిచుక్క."

2.2. రెండుకన్నా ఎక్కువ పదాలతో కూర్చిన తెలుగు సమాసాలు:– ఇటువంటివి కూర్చటం కష్టం. అందువల్ల ఇవి తక్కువగా ఉన్నాయి. "సంజె చీకట్ల చాలు – సన్నచీకటి దోమతెర – సారా నోరు నీరు (సారా నోటి నీరు అని వ్రాస్తే అక్షరరమ్యత పోతుంది)–మెత్తని పుత్తడి వెన్నెల – మంచు కొండల అంచులు – చావు సంజెల నెత్తుటి చార–చల్లని తెల్లని వెన్నెల–పాత తాటియాకుల యిల్లు.

2.3 సుదీర్ఘమైన తెలుగు సమాసాలు ఉండవు. అయినా తిలక్ వీటిని రెండు చోట్ల సృష్టించడానికి ప్రయత్నించారని నేను అనుకుంటున్నాను. (ఇవి సమాసాలే అని గట్టిగా చెప్పలేను), "వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" – "నే కూరుకుపోతున్న చాతకానితనపు వానాకాలపు బురద" (ఇందులో 'కాల' అనే సంస్కృత పదం చేరింది

3. మిశ్రసమాసాలు:– అచ్చుతెనుగు సమాసాలకన్నా ఇవి ఎక్కువే ఉన్నాయి. అయినా పరిమిత సంఖ్యలోనే ఉన్నాయని చెప్పవలసి ఉంది. వీటిని మూడు రకాలుగా విడదీసి పరిశీలించడం మంచిది.

(1) పూర్వపదం సంస్కృతం + ఉత్తరపదం తెలుగు
(2) పూర్వపదం తెలుగు + ఉత్తరపదం సంస్కృతం
(3) తెలుగుపదంతో కాని, సంస్కృతపదంతో కాని కలిసిన అన్యదేశ్యపదం (ముఖ్యంగా ఆంగ్లం)

3.1 పూర్వపదం సంస్కృతం + ఉత్తరపదం తెలుగు:– "పక్షిరెక్క – దీపపువత్తి – ఆకాశపు కప్పు – జీవితపుచక్రాల సీల – అనంతవిశ్వపు గది – ఆదర్శపు చుక్కలు – ఆకాశపు వొంపులు – నిశ్శబ్దపు వల – ఉదయపు నీరెండ – స్వప్నపు సంచి – సముద్రపు కెరటం – వాగ్దానపు కత్తులు – పారిజాతపు పువ్వులు – పరిమళపు తుపానులు – నిస్తబ్దపు కావిరులు – అసహ్యపు టావిరులు – ఆరోగ్యపు వాకిళ్ళు – సూక్తుల కంబళ్ళు – ఆదర్శాల పందిళ్ళు – సంప్రదాయాల కుంపట్లు– సముద్రాల ఉప్పెన – వార్తల గుసగుసలు – ఆశల వెచ్చనిపాన్పు – సంఘపు మర్రిచెట్టు – (తొలి)యౌవనపు గుర్తులు – నిశ్శబ్దపు మెత్తనిపరుపులు – మనుధర్మశాస్త్రప్పందిరి ('మనుధర్మశాస్త్రపు పందిరి'కి చిత్రమైన సంధి చేశారు తిలక్.) – ఆవేశపు మధ్యాహ్నపు ఎండలు– స్త్రీత్వంపు నెత్తుటిబొట్లు – సుందర స్వప్నాల స్వర్గాల మేడమెట్లు – (పాత) వస్త్రముల మూట – ప్రయోజన విజయ పరంపరల పాలరాతిమేడ – అంతరాంతర దగ్ధమైన బూడిద" ఈ సమాసాలలో ఒక్కొక్కసారి పూర్వపదస్థానంలో ఒకటికన్నా ఎక్కువ సంస్కృత పదాలు ఉంటున్నాయి. అలాగే ఉత్తరపదస్థానంలో ఒకటి కన్నా ఎక్కువ తెలుగు పదాలు ఉంటున్నాయి.

3.2 పూర్వపదం తెలుగు + ఉత్తరపదం సంస్కృతం:– "తెల్లని శ్మశానం – వెండినౌక – చవకబారు పానీయాలు – మంచుబాల – మంటలరథం – కన్నీటి

దీపాలు – కత్తుల నది – వెన్నెల బిందువు – చీకటి మార్జాలం – తొలి యౌవనపు (గుర్తులు) – పువ్వుల మాలలు–చీకటి బాధ – నెత్తుటి ప్రతిజ్ఞలు – వలపు దూరం – కోర్కెల వెలుగుల వజ్రం (పూర్వపద స్థానంలో రెండు తెలుగు పదాలున్నాయి.) – పాత వస్త్రముల (మూట)."

3.2.1 పూర్వపద స్థానంలో మూడు తెలుగు పదాలున్న సమాసాలు:– "గాజు కెరటాల వెన్నెల సముద్రాలు" – "జాజి పువ్వుల అత్తరు దీపాలు".

3.2.2 మరొకచోట ఆరుపదాలతో కూర్చిన సమాసంలో తెలుగుపదాలు – సంస్కృతపదాలు:– "తె+ సం + తె + సం + సం + సం" అనే వరుసలో ఉన్నాయి. "మూడు సముద్రాల కెరటాల నీలాల మోహన వస్త్రం" – అంటే ఇది 2 తెలుగుపదాలతోను 4 సంస్కృతపదాలతోను కూర్చిన సమానం. ఇందులో ఉత్తర పదస్థానంలో 3 సంస్కృత పదాలున్నాయి.

3.3 అన్యదేశ్య మిశ్రసమాసాలు :– తెలుగుపదంతో కాని, సంస్కృత పదంతో కాని అన్యదేశ్యం కలిసి ఏర్పడిన సమాసాలు. ఇక్కడ అన్యదేశ్యమంటే ప్రధానంగా ఆంగ్లం. పెర్షియన్ – అరబిక్ – ఉర్దూల నుండి వచ్చిన పదాలు కూడా కొన్ని ఉన్నాయి. పోర్చుగీసు పదాలు కూడా మూడు ఉన్నాయి. కాని ఇవి సమాసరూపంలో లేవు (తెలుగుపదంతో కాని, సంస్కృతపదంలో కాని కలవకుండా ఏర్పడిన సమాసాలు నాలుగో వర్గంలో "అన్యదేశ్య సమాసాలు"గా ఇచ్చాను.) అన్యదేశ్యం తెలుగుతో కాని సంస్కృతంతో కాని కలిసేటప్పుడు పూర్వపదస్థానంలో కలవవచ్చు; లేదా ఉత్తరపద స్థానంలో కలవవచ్చు.

3.3.1 ఆంగ్లపద మిశ్రసమాసాలు:– జార్జెట్ చీర – నైలాన్ చీర – షాంపూ ఘుమఘుమలు – అవసరాల మార్కెట్ – బాస్‌కేక – సిగ్నలిచ్చేవాడు – రామాంటిక్ తోట – పెట్రోలు వాసన – సైంటిఫిక్ నిజాలు–సినికల్ మంచు – పాటల మ్యూజిక్ – పేపరమ్మే కుర్రాడు – మేజిక్ సంచి – సెక్సీహాస్యం – నాలుగురోడ్ల కూడలి – రెల్లుపూల బార్డర్ – నీలాల నీటి నైలాన్ చీర – శాటిన్ తెర – హెడ్ వైర్లెస్ వార్తలు – ప్లాటినం సంగీతం – ట్రాన్స్‌పరెంట్ చీకటి – అడ్రసులేని ఆనంద ప్రియబాంధవి – రేడియం అక్షరం – నగరం టవరు – రేడియం అంకెలు – పెలికన్ పక్షి – రైలు పట్టాలు – స్టెయిన్ లెస్‌స్టీల్ రేకు – చక్కని డిజైన్ – అస్సాం

రైఫిల్స్ – సోల్జర్ సిమ్మాచలం–జెట్ విమానాలు – రాకెట్ల సమూహాలు – యాసిడ్ మచ్చలు – బ్రతుకు రైలుదారి – ప్రొజెయిక్ భావం."

3.3.2 ఆంగ్లేతరభాషాపద మిశ్రసమాసాలు (హిందీ, ఉర్దూ, పారశీకం, అరబిక్ పదాలు:– "భావి మైదానం – అనురాగపు గులాబి – అరక్త ఆశక్త గుమాస్తా –వెన్నెల మైదానం–పాలబాకీ – కాలం సవాల్ – ఎదమొహదా – నీ జవాబు."

4. అన్యదేశ్య సమాసాలు:– 1 ఆంగ్ల సమాసాలు 2. ఆంగ్లేతరభాషల సమాసాలు

4.1. ఆంగ్ల సమాసాలు:– "న్యూలుక్ బ్రా – న్యూస్ పేపర్ – ఎడ్వాన్స్ బుకింగ్– ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్ – కాస్మాపాలిటన్ బోర్ – మిజరబుల్ ఫెల్యూర్స్ – సైలెంట్ స్నో – డ్రెడ్‌ఫుల్ స్నో–మిల్ ఓనర్ – కాఫీ హోటల్ – డీలక్స్ హోటల్ – బాత్‌రూమ్ – అమెరికన్ జాకెట్లు – టెరిబుల్ ట్రాజెడి – కలరా బేసిలై – లైట్‌హౌస్ – డైలీ పేపర్ – కార్పొరల్ బూట్సు – సూటుకేసు – హరికేన్ లాంతరు – ఆస్ట్రేలియన్ స్టెప్పీలు – గ్రూప్ ఫోటో – బి.ఏ. డిగ్రీలు – పోస్ట్ మాన్ – రోమియో జూలియట్ – రష్యన్ బెరియా – మెరీనా క్యాంటీన్ – హూలా హుప్ ట్విస్ట్ – టేబిల్ క్లాత్ – రేడియోగ్రామ్ – సైన్‌పోస్ట్ – పార్కుబెంచీ – స్నోలూ పౌడర్లూ – సినీమాలు క్లబ్బులు – బోగన్ విల్లా – మౌంట్ వెసూవియస్ – అమెరికన్ పాల్‌రాబ్సన్ – సల్ఫ్యూరిక్ యాసిడ్ – ఏడమ్ అండ్ ఈవ్ – సినిమా పోస్టర్లు – డెరిలిక్షన్ ఆఫ్ డ్యూటీ – న్యూటన్ థియరీ – అన్ సైంటిఫిక్." మొదలైనవి.

4.2 ఆంగ్లేతరభాషల సమాసాలు:– "ఉమర్ ఖయాం రుబాయత్ – కాగితపు బురఖాలు – హుసేన్ సాగర్ – మొహబ్బత్ కీ రాత్ – జిందగీకి మతలబ్ – ఇన్సాన్ కీ మంజిల్ – ముఖమల్ జింఖానా – లైలామజ్నూ – పాకిస్థాన్ – ఉల్టాసీదా – మొఖమల్ చోళీ." మొదలైనవి.

5. వైరిసమాసాలు లేక దుష్టసమాసాలు:– "ప్రతిరోజు – ప్రతిఒక్కడు – ప్రతిఇల్లు – ప్రతిగుండె – ప్రతియేడు – ప్రతి ఉగాది – ప్రతితెర – ప్రతిఅర – భావిమైదానం – మాయమంచు – అవిధేయతమంచు – అరక్తఅశక్త గుమాస్తా – అనుమానం మంచు – నందివర్ధనం పువ్వులు – జీవితం ముళ్ళకంచెలు – జీవితం సంగీతంపెట్టె" మొదలైనవి.

IV. పదజాలం:– సంస్కృత పదాలు ఎక్కువగా ఉండటం తెలుగు భాషకు సహజ లక్షణం. సంస్కృతసమాలు, అన్యదేశ్యాలు తప్ప తక్కినవన్నీ తెలుగు పదాలుగానే భావిస్తున్నాం. దీనినే "అచ్చతెనుగు" అంటున్నాం. ఇటువంటి "అచ్చతెనుగు" పదాలు అమృతం కురిసిన రాత్రిలో 50% ఉన్నాయి. మిగిలిన 50% లో 40% సంస్కృత సమాలు 10% అన్యదేశ్యాలు ఉన్నాయి. ఈ అన్యదేశ్యాలలో 9% ఆంగ్లపదాలే. (వీటిని గురించి శైలిలోను, సమాసాలలోను వివరించాను.) మిగిలిన 1% ఆంగ్లేతరభాషల అన్యదేశ్యాలు. అంటే పర్షియన్, అరబిక్, ఉర్దూ, హిందీ, పోర్చుగీసు భాషలకు సంబందించినవి. ఇవి తక్కువగా ఉన్నాయి కాబట్టి వీటి వివరాలు ఇస్తున్నాను. (ఆంగ్లేతరభాషల సమాసాలను గురించి పైన తెలియజేశాను.)

పోర్చుగీసు పదాలు:– "బాతు" – "యిస్త్రీ" – "బాల్చీ" అనే మూడు పదాలు మాత్రం తిలక్ కావ్యంలో కనబడుతున్నాయి.

పర్షియన్, అరబిక్, ఉర్దూ, హిందీ భాషల పదాలు:– "రోజు" అనే పదం చాలా చోట్ల వచ్చింది. తిలక్ "దినం" అనే పదాన్ని తక్కువగా వాడి, "రోజు" అనే పదాన్ని ఎక్కువగా వాడారు. మిగిలిన అన్యదేశ్యాలు "గులాబి – అత్తరు – తివాసీ – కాగితం – బురఖా – మెహబూబ్ – జిందాబాద్ – బీగాలు – సాగర్ – మొహబ్బత్ –రాత్–జిందగీ–మతలబ్–ఇన్సాన్ – మంజిల్ – నౌపహాడ్ – బాలీసు –తురుష్క – ముఖమల్ – జింఖానా – మైదానం – బేజారు – కూపీ – సరదా – తడాఖా–జైహింద్–ఫిరంగి–తుపాకీ–రాస్తా – పైసలు – బాకీ – సవాల్ – మొహదా–షరాయి – జవాబు – చోళీ – గోరీ – గుమాస్తా – జారీ (చేయు)

ఉపసంహారం – తిలక్ రచించిన "అమృతం కురిసిన రాత్రి" అనే వచనకవితా ఖండికల సంపుటిలో శైలి, సమాన పరికల్పన, పదజాలం అనే విషయాలను వివరించాను. శైలిలో తెలుగు + సంస్కృతం కలిసిన మిశ్రశైలి ఎక్కువగా ఉంది (47 కవితలు). దీని తరువాతి స్థానంలో అచ్చతెనుగుశైలి ఉంది. (20 కవితలు). సంస్కృతపదాలు ఎక్కువగా ఉన్న కవితలు 17 ఉన్నాయి. శుద్ధ సంస్కృతశైలిలో సాగిన కవితలు 5 మాత్రమే ఉన్నాయి. కవితా శీర్షికలలో సంస్కృత శీర్షికలు ఎక్కువగా ఉన్నాయి (38). తెలుగు శీర్షికలు–23, మిశ్రశీర్షికలు–21, అంగ్లశీర్షికలు 8 ఉన్నాయి. వ్యక్తినామం 'నెహ్రూ' అనే పదం ఒక్కటే!

ఐదురకాల సమాసాలు తిలక్‌రచనలో కనబడతాయి. (1) సంస్కృత సమాసాలు (2) తెలుగు సమాసాలు (3) మిశ్రసమాసాలు (4) అన్యదేశ్య సమాసాలు (5) వైరిసమాసాలు. వీటిలో 90% సంస్కృత సమాసాలే.

పదజాలంలో 50% తెలుగుపదాలు, 40% సంస్కృతపదాలు 10% అన్యదేశ్యాలు ఉన్నాయి. అన్యదేశ్యాలలో 9% ఆంగ్లపదాలే. ఆంగ్లేతర అన్యదేశ్యాలు 1% కన్నా ఎక్కువ లేవు.

తిలక్ తన కావ్యాన్ని శిష్ట వ్యావహారికంలో వ్రాసినా, అక్కడక్కడ, ముఖ్యంగా సంస్కృతశైలిని పాటించినప్పుడు, గ్రాంథిక శైలిలోకి మారిపోతూ ఉంటారు.

యువకవితాలోకంలో తిలక్‌గారికి ఎందరో అభిమానులు ఉన్నారు. అయినా ఈనాడెవ్వరూ ఆయన పాటించిన శైలిలో కాని, భాషలో కాని కవితలు వ్రాయడం లేదు. తిలక్ కవిత్వశైలి, భాష ఆయన కాలానికి నూతనమైనవి, ఇప్పుడు కావు. ఈనాటి యువకవులు సాదాసీదా పదాలతో, నిత్యవ్యవహారంలో ఉన్న మాటలతో, చక్కని చిక్కని కవితలు అల్లుతున్నారు. ఇది నేటి కవితాశైలిలో వచ్చిన పెద్ద మార్పు!

ఈ వ్యాసం క్రింది గ్రంథాలలో ముద్రించబడింది:

(1) "దేవరకొండ బాలగంగాధర తిలక్ సాహితీ సమాలోచనమ్" సంపాదకులు: ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, ప్రచురణకర్తలు: సాధన సాహితీ స్రవంతి – తిలక్ జయంత్యుత్సవ సమితి, హైదరాబాద్-1, 2008. (ఈ ప్రత్యేక సంచికలోని నా వ్యాసంలో చెప్పలేనన్ని తప్పులు దొర్లాయి).

(2) "తిలక్ సాహితీ సందర్శనం", గౌరవ సంపాదకులు: పెనుగొండ లక్ష్మీనారాయణ, సంపాదకులు: కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 2016.

"వివేకం లేని ఆవేశం విపత్కరమౌతుంది....
కరుణలేని కవివాక్కు సంకుచితమౌతుంది"
– కవివాక్కు

6. తిలక్ పద్యకవితా వైభవం

తిలక్ కవిత్వాన్ని గురించి ఒక్క మాటలో చెప్పాలంటే "అద్భుత సౌందర్యం – దుర్భర విషాదం". వీరి వచనకవిత్వానికి, గేయకవిత్వానికి, పద్యకవిత్వానికి – అన్నింటికీ ఈ నిర్వచనం వర్తిస్తుంది. తిలక్ వచనకవిత్వాన్ని ఎంత గొప్పగా వ్రాసేవారో, పద్యకవిత్వాన్ని కూడా అంతే గొప్పగా వ్రాశారు. కాని విమర్శకులు ఈ విషయాన్ని అంతగా పట్టించుకున్నట్లు లేదు. కారణం ఈ పద్యాలు ఎక్కువగా సులభంగా అర్థంకాని అనుభూతి ప్రధానమైన భావకవిత్వ ధోరణిలో సాగడంవల్ల కాబోలు!

తిలక్ తన 17 సంవత్సరాల వయస్సులో అంటే 1938లో "ప్రభాతము–సంధ్య" అనే పద్యగేయ సంపుటిని రచించారు. దీనిని తిలక్ 1940లో సొంతంగా ప్రచురించుకున్నారు. ఇది కృష్ణశాస్త్రిగారి ప్రభావంతో వ్రాసిన బాల్యరచన. 2013 నవంబరులో ఎమెస్కోవారు నా ప్రధాన సంపాదకత్వంలో ప్రచురించిన "దేవరకొండ బాలగంగాధర తిలక్ – లభ్యరచనల సంకలనం" లో దీనిని చేర్చాను. ఇటీవల (2021 జనవరిలో) ఎమెస్కో వారి పుస్తకం ద్వితీయ ముద్రణ వచ్చింది.

తిలక్ తన 21వ ఏట నుండి (1942 నుండి) పరిపక్వమైన పద్యరచన కొనసాగించారు. 1966 వరకు పద్యాలు వ్రాస్తూనే ఉన్నారు. ఈ పద్యాలలో ప్రధానమైనది "గోరవంకలు" పేరుతో రచించిన 50 పద్యాల ఖండిక. ఈ పద్యాలు 1942–44 మధ్య "ప్రతిభ" అనే పత్రికలో ముద్రితమయ్యాయి. ఈ ఖండిక పేరుతోనే వీరి పెద్దబ్బాయి డా॥ దేవరకొండ సత్యనారాయణమూర్తి (లండన్) 1993 జనవరిలో తిలక్ పద్యాలన్నీ కలిపి ఒక చిన్న సంపుటిగా ప్రచురించాడు. దీనిలో వివిధ విషయాలను గురించి 18 ఖండికలు ఉన్నాయి. నేను 'భారతి' నుండి "ఆటవెలది–2" – "ఆటవెలది–3" – "బాధాగళము" అనే మూడు ఖండికలు, మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తి తన ధారణనుండి ఎత్తి వ్రాసి పంపిన "మండోదరి" లోని మూడు పద్యాలు సంపాదించి ఎమెస్కోవారికి ఇచ్చాను. ఇవి వారి రెండవ ముద్రణలో వచ్చాయి. చూడండి.

1. "ప్రభాతము-సంధ్య":-

తిలక్ తతన బాల్యంలో 15-17 సం.ల మధ్య వ్రాసిన "ప్రభాతము-సంధ్య" అనే కవితాసంపుటిలో ఛందోబద్ధమైన పద్యాలు, మాత్రాగణబద్ధమైన గేయాలు ఉన్నాయి. కొన్ని ఖండికలలో రెండూ కలిసి ఉన్నాయి. తిలక్ వీటిని "కవితా ఖండికా సముచ్చయం" అన్నారు. మొత్తం 51 ఖండికలలో 24 ఖండికలు పద్యాలు, 27 ఖండికలు గేయాలు. (నేను ఈ వ్యాసంలో ఛందోబద్ధమైన పద్యాలను మాత్రమే గ్రహించాను.) 'త్రివేణి' ఆంగ్ల పత్రిక సంపాదకులైన కోలవెన్ను రామకోటేశ్వరరావు గారి ఈ కావ్యానికి 1-6-1940లో ఒక చక్కని "పరిచయము" వ్రాశారు.

"ప్రేమతో పొంగిపోయే హృదయం, ఆశానిరాశల మధ్య తూలిపోతూ స్వాప్నికజగత్తులో విహరించే స్వభావం, వీటికితోడు రసవంతమైన కవనమూ" ఈ కావ్యంలో ఉన్నాయన్నారు. "ఇంత చిన్నతనంలోనే ఇన్ని అనుభవాలూ, ఇన్ని కలలూ ఎలా కలిగినవని ఆశ్చర్యపడ్డా"నన్నారు. తనతోపాటు నాయని సుబ్బారావుగారు కూడా ఈ 'ప్రభాతము - సంధ్య' లోని కవితలను విని మెచ్చుకున్నారని చెప్పారు. "నీ నొసట తీర్చెద విశ్వమానవ కల్యాణ కుంకుమ" అనడం; "నా జీవితమంత ఒక నివాళిగా అర్పణ చేస్తా"ననడం; "విశ్వగానము ఎల్లప్పుడూ నా హృదయంలో నినదిస్తూనే ఉంటుంది" అనడం; "ప్రేమకొరకై జీవితమే సమిధగా వైచినాను" అనడం; మాతృదేవతను దర్శించి "ఆమె చలువ వెలుగు చూపులలరునాకు/ నిదుర జోకొట్టు లాలి పన్నీటిపాట" అనడం; "చిన్నారి నవ్వులో చీకట్లు విచ్చాయి/ చిన్నారి సిగ్గులో చేమంతి పూసింది" అనడం - 'బాలకవి' - 'బాల' గంగాధర తిలక్ సౌందర్యాధనకు, రసపిపాసనకు నిదర్శనాలు. ఈ కావ్యంలో కృష్ణశాస్త్రి, వేదుల మొదలైన భావకవుల ప్రభావం ఎక్కువగా కనబడుతుంది. "ప్రభాతము" అనే మొదటి భాగంలోని కవితలు బాలకవి మనస్సులోని సంతోషాన్ని తెలుపుతున్నాయి; "సంధ్య" అనే రెండవ భాగంలోని కవితలు విషాదాన్ని తెలుపుతున్నాయి. తిలక్ కవిత్వంలో "అద్భుతసౌందర్యం-దుర్భర విషాదం" ఉంటాయని నేను చెప్పిన దానికి బీజాలు ఈ బాల్యరచనలోనే పడ్డాయని తెలుస్తోంది.

తిలక్ ఈ కావ్యాన్ని తన తల్లిదండ్రులకు అంకితమిచ్చారు. ఆ అంకితం పద్యాలు ఎంతో బాగున్నాయి:-

"బాల్యమాదిగ స్వాతంత్ర్య స్వర్ణపాత్ర
మధుర సుకళా సుధల నిడి మామకీన
జీవన నిసర్గశక్తి భాసిల్ల జేసి
నట్టి తలిదండ్రులకిడుదు నంకితమ్ము!

నా ప్రణామ మూర్ధమున ననారతమ్ము
నతని నాశీఃకరము వెల్గు, నతని చలువ –
చాయల మదీయ కల్యాణ సదన మలరు,
నతడు నా తండ్రి గుణవృద్ధు డార్యనుతుడు,
ధీయుతుండు శ్రీ సత్యనారాయణుండు!

నాదు బ్రతుకు భూమిని విత్తనముల ప్రేమ–
వారి జిలికించి పండించె పైడిపంట
నవ్యకవితా మనోజ్ఞరత్నమును, జనని
రమ్యగుణవల్లి యామె శ్రీరామలక్ష్మి!"

"ప్రభాతము" నుండి రెండు పద్యాలు:–

(1) దీపావళి:

"చీకటి వెలుగులకు పెండ్లి చేసినారు
ప్రణయమూర్తి నిశాసాధ్వి భర్తలోన–
లీనమయ్యె నొక్క బిగి యాలింగనమున
సంధ్యలికలేవు కాలంపు చలితయాత్ర!

(2) 'తథాగతుడు'లో సూర్యోదయ వర్ణన:–

"అంత తూర్పు బంగరుకొండ నవతరించె
శాంతి ప్రవహించు ఫాల ప్రసన్నమూర్తి!
ప్రేమముద్రిత నయన సంవీత యోగి
నాట్య దీధితీ స్వర్లోక నవ్యమూర్తి!"

"సంధ్య" నుండి కొన్ని మంచి పద్యాలు:–

(1) 'ఆలయమున' అను ఖండికలో ప్రణయవేదన:–

"చీకటి చెదరిన చిన్నెల చిన్నెలెల్ల

నేర్చి చంద్రకాంతోపల గృహము కట్టి
నెగడు రక్తపుకుంచె మనీషశక్తి
నిన్ను చిత్రించి మోదాబ్ధి నిలువగలనొ!
. . . .
మరల నొక్కొక్క మారు నా మందిరమున
ఇందిరా పాదనూపుర ధ్వను లందగించు,
నవవసంతోదయ మధుప్రసవ సుగంధ
మారుతము వీచు! వెలుగు దామరలు విరియు
గట్టకట్టిన హృదయ దుఃఖాశ్రు సరసి!"

(2) "జంట" అను ఖండికలో కవి భావనాశక్తి:-

"నీలి మాకాశ పారావారమ్ము పైన
నీవు కర్ణధారత్వమున చెలగు-
నపుడు చేలములేచి గాలి పడగలెత్త
నందు శయనించినాను నారాయణుని వోలె!"

(3) 'పూరిల్లు' అను కవితలో ప్రకృతి వర్ణన - ప్రకృతి ప్రీతి:-

"ఏను వసియింతు నెడద పూరింటిలోన
ముంగల నలికి సరిదీర్చి ముగ్గువెట్టు
మధురభక్ష్యముల నొనర్చి మమతదీర్చు
పంచభూతాత్మజుల పెంచి ప్రాణమిచ్చు
నమల గుణవల్లి ప్రకృతి యిల్లాలు నాకు!
. . . .
ఇచట నిదురించునటె సెలయేటి కలలు
రొదలు, మృగశాబకమ్ముల బెదరు కనులు,
పూల ప్రణయ దూతికయౌ పిసాళిగాలి,
పక్షి పక్షముల చలించు పాట మెరుగు
ఇంతపూరింట బ్రహ్మాండమేని నిలుచు!"

"సెలయేటి కలల రొదలు"అనడంలో కృష్ణశాస్త్రి అనుకరణ స్పష్టంగా ఉంది.

(4) "తల్లి" అను కవితలో కవియొక్క మాతృభక్తి వెల్లడి అవుతోంది:-

"దినదినమ్మామె నాకు నుత్తేజమలర

నెడద తరచిన వెన్నెలే యిచ్చు, జీవ
దధిఘటమ్మున చక్కెర తావి గలిపి
ప్రేమపాయసమును వండిపెట్టు కూర్మి.

ఆమె హాసలతాంత జీవాభ్యుదయ సు–
గీతులే జ్ఞానబోధలు కేవలమ్ము,
ఆమె చలువ వెలుగు చూపులలరు నాకు
నిదుర జోకొట్టు లాలిపన్నీటిపాట!

ఎంత గర్భవాసమొ! చూడ సుంతయేని
కోపగింపదు, కాని కన్నొలకులందు
కలుగదట్టె! యీ విశ్వాలె కరగిపోవు
ప్రేమజీవిక – ఎంతటి – పెద్దతల్లి!"

కృష్ణశాస్త్రిగారు "జాలి కన్నీటిపాట" అంటే, తిలక్ కొంచెం మార్పుచేసి "లాలి పన్నీటిపాట" అన్నారు.

మొత్తంమీద "ప్రభాతము–సంధ్య" అనే ఈ కావ్యాన్ని తిలక్, మనస్సు సరిగా పరిణతి చెందని బాల్యంలో వ్రాసినప్పటికీ, అడుగడుగునా కృష్ణశాస్త్రిగారి ప్రభావం పడినప్పటికీ, నా ఉద్దేశంలో కొన్ని కవితాఖండికలు బాగున్నాయి. నేను పైన ఉదాహరించినవన్నీ అటువంటి మంచి ఖండికలే! కాని తిలక్‌గారు చిన్నతనంలో ఈ కావ్యాన్ని చూసి ఎంతో మురిసిపోయినా, పెద్దయ్యాక దీనిని తేలికగా కొట్టిపారేశారు. "ఇప్పుడు దానిని చదువుతూ వుంటే నాకు నవ్వు వస్తుంది. దాంట్లో ప్రతి పంక్తిలోను కృష్ణశాస్త్రి influence స్పష్టంగా కనబడుతుంది!" అన్నారు ఒకసారి నాతో. వారి దృష్టిలో ఇది అపరిణత కావ్యం! పరిణత రచనలు తన 20వ యేట నుండి (అంటే 1941 నుండి) వచ్చాయని స్పష్టం చేశారు.

2. "గోరువంకలు" (పద్యకవితా సంపుటి):–

ఈ వ్యాసప్రారంభంలో నేను తిలక్ కవిత్వాన్ని గురించి ఒక్కమాటలో చెపుతానని చెప్పి, "అద్భుత సౌందర్యం– దుర్భవిషాదం" అని రెండు మాటలు చెప్పాను. ఇప్పుడు వీటికి ఇంకోమాట చేరుస్తున్నాను: అది "ప్రకీర్ణకం" (పరాశ్రయమైన ఇతర కవితలు). కాబట్టి తిలక్ పద్యకవిత్వాన్ని "అద్భుత సౌందర్యం– దుర్భర విషాదం – ప్రకీర్ణకం" – అని మూడు ముక్కల్లో నిర్వచించవచ్చును.

తిలక్ "గోరువంకలు" కావ్యంలో మొత్తం 22 ఖండికలున్నాయి. వీటిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. పైన తెల్పిన విధంగా "అద్భుత సౌందర్యం– దుర్భర విషాదం– ప్రకీర్ణకం" అనే మూడు పాయలుగా విడదీసి పరిగణించవచ్చు. లేదా "భావకవిత్వం" (ఆత్మాశ్రయ కవిత్వం) – "ఇతర కవిత్వం" (పరాశ్రయ కవిత్వం) అనే రెండు పాయలుగా విడదీసి విశ్లేషించవచ్చు. తిలక్ పద్యకవిత్వంలో 80% భావకవిత్వం, 20% ఇతర కవిత్వం కనబడతాయి.

నేను మొదటిరకం వర్గీకరణాన్ని అనుసరిస్తున్నాను:– తిలక్ పద్యరచనలో నిత్యసంధులుకాని, అరసున్నలుకాని, శకటరేఫలుకాని పాటించలేదు. కొన్నిచోట్ల ప్రాసలు తప్పాయి. అసలు యతిప్రాసలే లేకుండా "సంగీతవృత్తము" అనే ఖండిక వ్రాశారు ప్రయోగాత్మకంగా.

(1) అద్భుత సౌందర్యం – ఇది మళ్ళీ రెండు విధాలుగా ఉంటుంది! (1) ప్రణయ సౌందర్యం, (2) ప్రకృతి సౌందర్యం. తిరిగి ప్రణయ సౌందర్యంలో రెండు అంతర్గత భాగాలున్నాయి: (అ) లౌకిక ప్రణయం, (ఆ) అలౌకిక ప్రణయం. అలాగే ప్రకృతిసౌందర్యంలో రెండు అంతర్భాగాలు కనబడతాయి: (అ) ఋతువర్ణనలు; (ఆ) ఇతర ప్రకృతివర్ణనలు

(2) దుర్భర విషాదం:– ఈ విషాదం రెండు రకాలు: (అ) అంతర్గత విషాదం, (ఆ) బాహ్యవిషాదం.

(3) ప్రకీర్ణకం:– దీనిలో స్వీయకవితా నిర్వచనం, కవితా వైశిష్ట్యం, సైన్సు సుందరి, మహాత్ముల ప్రశంస, వాల్మీకి రామాయణవైశిష్ట్యం, "మండోదరి" పద్యాలు అనే ఆరు అంశాలు కనబడతాయి.

స్థూలంగా పరిశీలిస్తే "అద్భుత సౌందర్యం"లో శృంగారరసం ప్రధానంగా ఉంటుంది; "దుర్భర విషాదం" లో కరుణరసం ప్రధానంగా ఉంటుంది. ఈ రెండు విభాగాలు కూడా ఆత్మాశ్రయమైన భావకవిత్వానికి సంబంధించినవి. "ప్రకీర్ణకం" అనే విభాగం పరాశ్రయమైన ఇతర కవిత్వానికి చెందినది. ఈ వర్గీకరణం ప్రకారం "గోరువంకలు" కవితాసంపుటి నుండి కొన్ని ఉదాహరణాలు ఇస్తాను:–

(1) అద్భుత సౌందర్యం:– 1.1 ప్రణయ సౌందర్యం, 1.1.1 లౌకిక ప్రణయం:– (1) "గోరువంకలు"– (2) "భ్రాంతి" అనే రెండు కవితా ఖండికలు ఈ లౌకికప్రణయం క్రిందికి వస్తాయి.

1) గోరువంకలు:-

తిలక్‌గారు 'గోరువంకలు' పేరుతో తాను 50 పద్యాలు వ్రాశానని నాతోను, శ్రీపాద కృష్ణమూర్తితోను తరచుగా చెపుతూ ఉండేవారు. కాని నాకు వీటిలో 39 పద్యాలు మాత్రమే లభించాయి. ఇవన్నీ 1942-44 మధ్య "ప్రతిభ"లో ముద్రింప బడ్డాయి.

యౌవనంలో ఉన్న ప్రేయసీ ప్రియులకు 'గోరువంకలు' సంకేతం. ప్రియుడు (కవి) తన ప్రేయసితో – తన "విలసన్నవయౌవన రాజ్యలక్ష్మి"తో – తన మనసులోని గాఢానురాగాన్ని వ్యక్తం చేయడమే 'గోరువంకలు' కవితా ఖండికలోని ప్రధానాంశం. ఉమర్ ఖయాం రూబాయత్తుల్లా ఉంటాయి ఈ పద్యాలు. (అసలు ఉమర్ ఖయాం ప్రభావంతోనే వీటిని వ్రాశారేమో కూడా!). ఆ రోజుల్లో యువకులందరి నాల్కలపైనా ఈ పద్యాలు నాట్యమాడేవని చెప్పేవారు తిలక్. తిలక్‌గారు కూడా వీటిలోని పద్యాలను తన సన్ననిగొంతుతో కావ్యశైలిలో నాలాంటి మిత్రుల దగ్గర తరచుగా పాడుతూ వుండేవారు.

(i) తిలక్‌గారు తరచుగా పాడే పద్యం:-

"పాటను పైటగా మలచి భామిని రమ్మిటు స్వప్న చిత్రకాం
తాటవిలోని మేడలకు, త్రావని తేనెల పాత్రలెన్నొ నీ
నీటగు మోవిపై నిలిపి, నే కనురెప్పల మంచురేకులన్
చాటుగ దింపి, క్రోలెదను, చాలని చావని సౌఖ్యలిప్తకై!"

(ii) కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు తణుకులో జరిగిన ఒక సభలో విని మెచ్చుకున్న పద్యం:-

"నిశి లేవెన్నెల చాలులో మెరసిపోనీ మబ్బుగాణీలు, ఈ
శశిహాసమ్మున నారికేళదళముల్ స్ఫారించి బంగారు క
త్తులుగానీ, యిటు చంద్రమఃకళల పాథోరాశి అద్దాల నా
ల్కల చీల్కెల్ విదళింపనీ, ప్రియతమా! కౌగిళ్ళలోగిళ్ళలో-
పలనే మూసుకుపోవనీ బ్రతుకు రేఖాచిత్ర చిత్రమ్ములై!"

ఈ పంచపదిలో మొదటి రెండు పాదాలకు 'శ'కార ప్రాస, తక్కిన మూడు పాదాలకు 'ల'కార ప్రాస. ఇది లక్షణ విరుద్ధం. భావకవుల స్వాతంత్ర్యంగా భావించుకోవాలి. "సంగీతవృత్తము" అనే ఖండికలో తిలక్ యతిప్రాసల నియమాన్ని పూర్తిగా ఉల్లఘించి వ్రాశారు. అదొక నూతనప్రయోగం కాబోలు!

(iii) ఈ క్రింది పద్యం తిలక్ మిత్రులైన సూరంపూడి భాస్కరరావుగారికి, నండూరి రామమోహన్‌రావుగారికి మిక్కిలి యిష్టమైన పద్యం. కవి, కాలమనే యువతికి మొరపెట్టుకుంటున్నాడు (లేదా తన ప్రేయసికే విన్నవించుకుంటున్నాడు). ప్రతిదినము కన్నీటితోను, దుఃఖముతోను గడుస్తోంది. మరణం సమీపిస్తోంది. సౌందర్యం తన ఆ కర్షణను కోల్పోతోంది. ఓ కాలమనే యువతీ, నాయౌవనాన్ని హరింపవద్దు!

"ప్రతిదినమేగు బాష్పకణ భార నిరోధ దిశాంత నేత్రమై,
ప్రతివకుళమ్ము రాలు శిశిరాత్త దళాంత గళోచ్చ నాదమై,
ప్రతితెలివేకువన్ తొలగిరాలెను తారలు గాజుపూసలై,
అతివ! కదల్ప కీవయసు టద్దపుమేడ పునాదిగోడలన్"

(2) "భ్రాంతి" అనే కవిత కూడా లౌకికప్రణయానికి ఉదాహరణమే! నాలుగు పద్యాలున్నాయి. ఒక ప్రేయసి తన ప్రియునికోసం వేచిచూడటం, అతడు వచ్చాడనే భ్రాంతిలో మునిగిపోవడం, 'వాసకసజ్జిక' అనవచ్చు.

"తోచెదవీవు రత్నములతో విరచించిన కుచ్చుపాగతో
వీచిన చందనానిలపు వీథుల వత్తువటంచు, ఆరబీ
రాచకులాశ్వమెక్కి, యిరుప్రక్కల బర్హి సుబర్హ చిత్ర చి
త్రోచిత చామరమ్ముల విలోల లతాంత పరాగమేర్పడన్."

1.1.2 అలౌకిక ప్రణయం:-

"స్వయంవర" - "అద్వైత మాన్మథము" - "అమృత భావము" అనే కవితా ఖండికలు ఈ వర్గం క్రిందికి వస్తాయి.

(i) "స్వయంవర" - (12 పద్యాలు) రామాయణంలో సీతపాత్ర అంటే తిలక్‌గారికి ఎంతో యిష్టం. ఈమెను గురించిన కవితలు నాలుగు ఉన్నాయి ఈ సంపుటిలో. అన్నీ భావకవితా ధోరణిలో వ్రాసినవే! సీతాకల్యాణఘట్టంలో రాముణ్ణి చూడగానే సీత తన మనసులోని గాఢానురాగాన్ని చెలికత్తెతో ఆత్మీయంగా చెప్పడం "స్వయంవర" కవితాఖండికలోని సారాంశం.

"ఇతడటే! పుత్రకామేష్టి యాగఫలమ్ము?
దశరథానంద నందనవనమ్ము?
ఇతడటే! వెరపేది యింతవయసున రా-
క్షసుల దున్మిన వాడికత్తిమెఱపు?

ఇతడటే! రఘువంశ తతకీర్తిమద్గుణ-
సంపదల్ ప్రోవైన చారుశీలి?
ఇతడటే! సాకేతస్మిత యౌవత వనమ్ము
కన్నట్టి నెత్తావి కలలగుత్తి?
ఇతడటే! తండ్రి నన్ను నాగేటి చాలు-
కదిపి, వెలికి దీయకముందె కానుపించె-
నేమొగాక! లేక జననమేల నాకు?
స్వామికోసముగాక, నేనేమి కొఱకు?"

"వీని చెంత జేరి విడువగలను నేను
సుఖములేని, రాణి సొగసులేని!
వీని పనుపు చాలు వెడలగలను నేను
అడవికేని, కదలి నడిమికేని!"

"కదలి నడిమికేని" అనే కన్నా "పుడమి నడిమిలేని" అంటే ఇంకా బాగుండేదేమో అనిపించింది నాకు. సీత పుడమితల్లి కూతురు. చివరికి పుడమి నడిమికే వెళ్ళిపోయింది కదా! ఏమైనా యిటువంటి అందమైన పద్యాలు ఎవరో కొద్దిమంది ఉత్తమ కవులు మాత్రమే వ్రాయగలరు. సీసపద్యం నాలుగు పాదాలతో అద్భుతరసం; ఎత్తుగీతిలో తాత్త్వికత (శాంతరసం) కనబడుతున్నాయి.

దీని తరువాతి సీసపద్యంలో కూడా అద్భుతరసంతోపాటు సౌందర్యభావన, తాత్త్వికత నిండుగా తొణకిసలాడుతాయి.

"అతడు వచ్చెనొ లేదొ అల్ల పందిళ్ళ న-
ల్గడల పద్మాల తోరణలు విరిసె!
అడుగు కదిపినంత హల్లకములు పూచి
సభనెల్ల సౌందర్యసరసి జేసె!
పెదవి చిర్నగవు తుంపెసలాడ మల్లెమొ-
గ్గలవాన జల్లుజల్లులయి కురిసె!
వాని గన్నంత నాలోని గుట్టెల్ల బ-
యలువడి పసపుసిగ్గులను జిమ్మె!
ఇది వలపొ! జన్మ జన్మాల నదుము సౌహృ-

దమ్మో! లోని ఆత్మల పిల్పో! దాచుకొన్న-
పుణ్యమో! దోచుకొన్న స్వర్భోగమో! ప-
విత్ర మీక్షణ మీ స్వామి వీక్షణమున!"

(ii) "అద్వైత మాన్మథము":- (7 పద్యాలు) ఈ శీర్షికక్రింద కవిగారే స్వయంగా ఇలా వ్రాశారు: "సీత, రాముని యెడ తనకు కలుగు ప్రేమానురాగము లను, ఆత్మానుబంధమును చెప్పుచున్నది." సీతకు రాముని యెడలగల గాఢానురాగము ఈ క్రింది పద్యంలో రమణీయంగా చిత్రించారు తిలక్:-

"తెల తెలవార నాయెడద తీర్చిన ముగ్గుల త్రొక్కివచ్చు శీ
తల పవనమ్ము వీవు, కనుదమ్ముల నవ్వయి సోకి లోతు లో
తుల దిగిపోవు రత్నఖచితోజ్జ్వల హేతివి, మద్గవాక్ష వీ
థుల పొగమబ్బులౌ అగురుధూపపు తావివి నీవు రాఘవా!"

ఈ ఖండిక చివర్లో తిలక్‌గారు ఒక అద్భుతమైన సీసపద్యం వ్రాశారు, చూడండి:-

"కనుల కన్నులు నిల్పి కాంచితివేని, ని-
దేమి ద్వాదశసూర్యదీప్తి ముంచు!
నసువీడి యడుగిడ, నాలోన నిదియేమి
భవమెల్ల కదలించు బాధపొంగు!
బిగ్గకౌగిలి జేర్చువేళ, బ్రతుకు చివ
రల నిదియేమి కొన్నలుపుమంట!
ప్రేమార నను పేర బిల్వగా, నిదియేమి
గగనాన మ్రోగె నక్షత్రఘంట!
నేను నీలోన నన్ను సృజించుకొనగ,
నీవు నాలో లయింతు వెంతేని వింత!
ఇది యపూర్వక్రమము! సృష్టి మొదలు తుదలు
కలసి కొన్నవి మనలోన కాలమాగి!"

సరిగ్గా ఈ సీస పద్యంలోని భావాన్నే తిలక్ "అమృతం కురిసిన రాత్రి"లో "అద్వితీయం" అనే వచన కవితగా వ్రాశారు (చూ.పుట. 53)

(iii) "అమృతభావము":- (20 పద్యాలు) ఇది కవి మనస్సులోని సౌందర్య భావం. ఈ క్రింది రెండు చిన్నపద్యాలు కవి సౌందర్య పిపాసను తెలియజేస్తాయి:-

"జగమదెల్ల నొక్క సౌందర్యభావమై
ముత్తియముల గొడుగు పొలుపుదాల్చి
పట్టె నీడ నాకు పరువమైన వయసు
కందకుండ, కలలు చిందకుండ."

"మాట పాటయయ్యె, మనసు శిఖరమయ్యె,
ఎక్కి యెక్కి ఎంత యెత్తుకేని
కలయజూడ నదియె కైలాసమే నయ్యె,
లోచనముల దివ్యరోచు లెసగె!"

ఈ ఖండికలోని కొన్ని పద్యాలలో గోపికలు బాలకృష్ణునికోసం పరితపించడం వర్ణించబడింది:-

"ధ్యానమె చాలునో, యెడద ఎఱ్ఱని నెత్తురు కోర్కెచాలులో
నాగలిదున్ని స్వర్గసుఖ రాజనముల్ మరి పండజేయునో,
కౌగిలి చేర్చవో, తనువులన్ భవదూర్జదురః ప్రదేశ కా
ఠిన్యత గ్రుమ్మి దిక్కులకు చిమ్మవొ మమ్ము సుమమ్ములట్లుగన్!"

1.2 ప్రకృతి సౌందర్యం:-

1.2.1 "ఋతువర్ణనలు":-

తిలక్ చేసిన ప్రకృతివర్ణనలలో మామూలు ప్రకృతికన్న ఋతువర్ణనలు ఎక్కువగా ఉన్నాయి. "మధువిరహము" – "వర్షా" – "శిశిరము" – "ఆటవెలది" (1,2,3 ఖండికలు).

(1) "మధువిరహము":- (10 పద్యాలు) దీనిలో తిలక్ సౌందర్యోపాసన వెల్లడి అవుతుంది. వసంతఋతువులోని మలయమారుత వర్ణన:-

"జలజల సాగు యేటి జలజమ్ముల నిద్దుర వోయి, వేకువన్
కిలకిలలాడు సవ్వడుల కేరెడు పక్షులతోడ లేచి, ఆ
యలరుల మంచుపావడల నల్ల కదల్చి, కరంగు త్రావి, క్రొం
బులకల నాకపోలముల పోడిమ నొక్కెడు మారుతమ్ములున్!"

(2) "వర్షా":- ఇది వర్షఋతువర్ణన. 9 పద్యాలు. కవి సౌందర్య పిపాస వ్యక్తమవుతుంది.

"వానవచ్చిన యంత జవ్వాడ నొడలు
ఆటలాడు లేజవ్వను లరిగి రంత
కంకణప్రభా నిక్వణక్వాణ మలర
దూసికొని పోవు మెరపు కత్తులను బోలె."

ఈ పద్యంలో తిలక్ "నిక్వణము" – "క్వాణము" అనే రెండు పదాలు వాడారు. రెండింటికి ఒకటే అర్థం: "వీణ మొదలగువాని మ్రోత". "దృశ్యభావాలు" అనే గేయంలో కూడా "నిక్వణక్వణాల ఝుణం ఝుణల" అని ప్రయోగించారు. ఇలాగ ఒకే అర్థాన్నిచ్చే రెండేసి పదాలు మరికొన్నిచోట్ల కూడా ప్రయోగించారు: ఉదా।। "కోష్ణము–కవోష్ణము" = "కొంచెము వేఁడిమి కలది" అని రెండు పదాలకూ ఒకటే అర్థం. కాని తిలక్ "కోష్ణ కవోష్ణ స్వప్నరంభా పరీరంభపు కైపు" అని 'కిటికీ' అనే కవితలో ప్రయోగించారు. కేవలం లయ అనుప్రాసల మీద వ్యామోహంతో ఇలాంటి ప్రయోగాలు చేసివుంటారు.

(3) "శిశిరము":– (5 పద్యాలు). చలిగాలి వర్ణన:
"శిశిరము సన్నసన్న చిరుచీకటి బాటల వచ్చి, జాలిగా
కొసరెడిపూల అత్తరులకోసము తారెడు గాలి గొంతులో
విసమును బోసి, నల్దెసల వీచుచు, సోరణగండ్ల సందులన్
ముసరుచు తాకి పోవు విషమూరెడి సూదుల వ్రేళ్ళ గుచ్చుచున్"

(4) "ఆటవెలది" (1,2,3):–

(ఎ) వసంతం: **"తోట ఆకుపచ్చపైట తొలగి జార**
పూలరొమ్ము నిక్కపొడిచి నిలిచె
కొమ్మకొమ్మ క్రొత్త కోర్కెల చివురుతో
గాలి కదలి పిలిచె కేలు సాచి." (ఆటవెలది–1)

(బి) గ్రీష్మం: **"ఇంత గ్రీష్మదహన మెగసిన నీ గుండె**
మండి మసిగ మసిగ మారునపుడు
నాదు మాట పాట నవపరీమళముల
వట్టి వేళ్ళ తెరల కట్టె చూడు!" (ఆటవెలది–1)

వేసవి: **"ఉత్సహింప కాంక్ష, ఉడికింప పెనువేడి**

కలసినంతలోన అలసి విడెడి
వింత కౌగిలింత లింతింత కసికాటు
లందగించు తరుణులందు నెందు!" (ఆటవెలది-2)

(సి) వర్షఋతువు- వానచినుకు వర్ణన:

"ఇంత చినుకు పడిన ఎంత పొగరు హెచ్చి
పచ్చిగడ్డిపరక పల్లవించె,
చిన్నపువ్వు తొడిగి, చిలిపి చిలిపి గాలి
నూగి తూగి నవ్వు నూరినెల్ల!" (ఆటవెలది-1)

"నిన్న మొన్నగాదె నీపమిట మొలిచె
చిన్నమబ్బు వానచినుకు జిమ్మ,
స్నాతయైన లేత జవరాలి హొయలుతో
మరుల గొలుపు నెల్ల తరుల జూడు!" (ఆటవెలది-1)

(డి) శరదృతువు - వెన్నెలరేయి:-

"వెండివాన కురిసి వెల్లువై పొంగెనో
పూలజగము విరుగబూసె నేమొ!
త్రిదశభామలొక్కతెర నవ్వినయట్లు
వెలది వెన్నెలలమె విశ్వమెల్ల!" (ఆటవెలది-2)

"హరశిరస్తటమున హరువైన వెన్నెల
ఒలికి పార గిరిజ కలువయయ్యె!
శివ విసరిన చూపు చెలువమ్ము సామేన
నిగుడ శివుడు నీలినింగి యయ్యె!" (ఆటవెలది-2)

పై పద్యంలో తిలక్ భావనాశక్తి అపూర్వంగా ఉంది. శివుని తలమీద నుండి అందమైన వెన్నెల ఒలికి ప్రవహింపగా, నల్లని పార్వతి తెల్లని కలువపూవులా అయిపోయిందట! అప్పుడు ఆమె విసరిన అందమైన నల్లనిచూపు శరీరంలో సగభాగమైన శివునిపై పడగా, తెల్లనిశివుడు నీలినింగివలె అయిపోయాడట!

(ఇ) శిశిరము-మంచు:-

"లేత యెండలోన, లేమ కౌగిలిలోన
సీతువొక్క స్వప్నశీధువౌను!

కవితలోన మధురగాన డోలలలోన
బ్రతుకు పరిమళించు భావమౌను!" (ఆటవెలది-3)

(సీతువు = చలికాలము; శీధువు = చెరకు కల్లు, మకరందము, అమృతము, రూ.సీధువు)

"కొబ్బరాకు కొసల కూడుకొన్నది మంచు
కొదమ తేటి గొంతు పదను దివిసె,
శిశిర నిశలలోన శింజిత శింజినీ
స్వరముతోడ మరుడు జాలిగొలుపు!" (ఆటవెలది-3)

(శింజితము=భూషణములమ్రోత; శింజిని = కాలి అందె; మరుడు=మన్మథుడు.)

1.2.2 ఇతర ప్రకృతి వర్ణనలు:- "ఆవాహన" - "ఆటవెలది" (1,2,3 ఖండికలు) - "ముక్తకము"

(i) "ఆవాహన":- ప్రకృతి సౌందర్యాన్ని చూచి కవి తన్మయుడు కావడం నాలుగు పద్యాలలో వర్ణించబడింది.

"రా కమనీయ మానస తరంగ నవీన నటన్మరాళ ర-
మ్యాకృతి! నిశ్చలాభ్ర రజతాయత వీథిక నిల్చు స్మేర తా-
రాకృతి! ప్రాతరుజ్జ్వల సరః ప్లవమాన సరోజ పాండురే-
ఖాకృతి! రా కవీశ్వరుని కంఠములో దిగజారు వెన్నెలై!"

(ii) "ఆటవెలది" (1,2,3):- "మబ్బువర్ణన:
"సంజ ఎరుపుటంచు సరిదిద్దుకొని చిన్న
మొగిలొకందు శైలమూర్ధమందు
ఏటి నీటిలోన ఏటవాలుగ వంగి
తనదు చెలువు చూచికొనెను చూడు!" (ఆటవెలది-3)

"చుక్క" వర్ణన:
"ముసురు లేతయిరుల మునిమాపు వేళలో
చక్కనైన ఒక్క చుక్క పడుచు
మబ్బు తలుపు తెరచి, మతకరి జాబిల్లి
కొరకు చూచి, వేచి, మరల మూసె" (ఆటవెలది-3)

(మతకరి = మాయలమారి)

ఒక సుందర దృశ్యవర్ణన:

"కలల తోట నిలిచి కవితలు పాడగా
లేతమబ్బుకొసల పూతమెరుగు
గిరుల ఝరుల తరుల కేళిమై పవనుండు
తావి తరగలొత్తె వావిమరచి!" (ఆటవెలది-1)

(ఆటవెలది మూడు ఖండికల లోను కలిపి 14 + 9 + 14 = 37 పద్యాలున్నాయి)ఈ ఆటవెలది ఛందస్సంటే తిలక్‌గారికి చాలా యిష్టం.

(iii) "ముక్తకము": ఈ కవితా సందర్భాన్ని కవిగారే వివరించారు: 17-4-62 మంగళవారం సాయంత్రం 6 గంటలకు రమ్య సాయంత్ర ప్రకృతి వీక్షించి" చెప్పిన పద్యం:-

"తెరలైజారిన లేత మబ్బుగము లందీఅందక స్వీచు తె-
మ్మెర లొయ్యారము లొల్క వోసినవి సుమ్మీ! మందమందాక్ష సుం-
దర సాయంరమణీ కపోలయుగళీ తల్పమ్ములన్నంటి, చెం-
దిరి పూతల్ ఒక యింత రేగికొన తత్సీమంత సీమాంతముల్!"

(చెందిరి పూతల్ = సిందూరపు పూతలు; తత్ + సీమంత + సీమ +అంతముల్= ఆమె పాపట ప్రదేశమంతటా)

2. దుర్భర విషాదం:-

ఇది మళ్ళీ రెండు రకాలు: (1) అంతర్గత విషాదం (2) బాహ్య విషాదం.

2.1 అంతర్గత విషాదం:-

తిలక్‌గారు 1946 నుండి 1954 వరకు 8 సంవత్సరాలపాటు రోగగ్రస్తులై మంచంపట్టి ఇంటికే పరిమితమైపోయారు. ఆ సమయంలో తన మనసులోని విషాదాన్ని "శర్వరీప్రియ". - "బాధాగళము" అనే రెండు కవితాఖండికల్లో వెల్లడించారు.

(1) "శర్వరీప్రియ" 13 పద్యాలు. 1962 అక్టోబరు భారతిలో వచ్చాయి. రాత్రిని ఒక ప్రియురాలిగా భావించి, ఏ కాంతంలో తన మనసులోని బాధల్ని ఆమెతో చెప్పుకోవడం ఈ ఖండికలోని ప్రధానాంశం. రాత్రిని ప్రియురాలుగా, వింతైన ఇల్లాలుగా భావించడం గొప్ప నూతనమైన కల్పన.

ఈ ఖండికలోని మొట్టమొదటి పద్యాన్ని తిలక్‌గారు నా దగ్గర తరచుగా పాడుతూ వుండేవారు:–

"రావే నల్లని దాన! నా మనసులో రాపాడు శోకాకృతీ!
వేవేల్ చుక్కల సరాల దాల్చికొను నా వింతైన యిల్లాల! ని–
ద్రావేశమ్మున లోకమెల్ల జడభూతమ్మయ్యె, మేల్కొన్న నా
ఆవాసమ్ము రహస్య, మిచ్చుటకు నే కాంతమ్ముగా రాచెలీ!"

ఇది ఎంతో అందమైన పద్యం. తిలక్‌గారు ఎంత అందంగా ఉండేవారో ఈ పద్యం కూడా అంత అందంగా ఉంది! ఈ ఖండికలోనే సాయంసంధ్యా వర్ణన ఉంది. సాయంకాలం మెల్లగా చీకట్లు క్రమ్మటం, పక్షులు గూళ్ళకు మళ్ళటం, చుక్కలు పొడవటం, నీడలు అడవిలో దాగటం, బాలచంద్రుడు ఉదయించడం, కీచురాళ్ళమ్రోత, కొత్తగా వికసించే కల్హారాల పరిమళపు గాలులు, సగం విచ్చిన సన్నజాజుల సౌరభములు – ఇవన్నీ తన శర్వరీప్రియ ఆకారంగాను, ఆమె చేసికొన్న అలంకారాలుగాను అన్వయించి చెపుతూ, ఆమెను తనకడకు ఆహ్వానిస్తూ, అత్యద్భుతమైన సీసపద్యం వ్రాశారు తిలక్:–

"పడమట సంద్రాన పడినంత భానుండు
లీలగా కదలె నీలాల కురులు,
పంక్తిగా విహగాళి పయనించు సమయాన
నుదుటిపై తోచెను మొదటి చుక్క,
ఎదురుగా వనవాటి నొదుగ నల్లని నీడ
కచపాళి బాలేందు రచనసౌరు,
కీచురాల్ స్వాగత గీతాల పచరింప
చీకటిగజ్జెలు చిందు రవళి,
నవవికచ కల్హారముల గంధానిలమ్ము,
లరవిరియు సన్నజాజుల పరిమళమ్ము
లొలయ నీమేన, రారమ్ము! వలపు నింప
మూలగా గదిలోని నా మ్రోల కిపుడు!"

రాత్రిని "అంధకార సుందరివి, మా అనుగు చెలివి" అనడం, "నీలోన వైదేహి నిందాచరిత్రమ్ము జాలిజాలిగ కర్ణపాళి సోకు" అనడం ఎంతో బాగుంది.

అలాగే రాత్రిలోనే– క్లియోపాత్రా నీహారసౌందర్యం వ్రాలిపోవడం, అర్జునుడు ఎక్కుపెట్టిన గాండీవ గుణశబ్దగానం ఒలకడం, బుద్ధుని నిర్వాణవేళ విమూఢ జగద్దైన్యమూర్తి తోచడం – ఎంతో రమ్యమైన భావనలు! రాత్రి అనంతమైన ఈ కాలానికి గుర్తు అనీ, రాత్రి ఒక నల్లని నిజమనీ అనడం తిలక్‌గారికే చెల్లును:–

"నీలోన వైదేహి నిందాచరిత్రమ్ము
జాలిజాలిగ కర్ణపాళి సోకు,
నీలోన క్లియొపాత్ర నీహారసౌందర్య
మలసి వ్రాలిన విషాదాంత మొరయు,
నీలోన ఫల్గుణ లాలితాస్ఫాలిత
గాండీవ గుణశబ్దగాన మొలుకు,
నీలోన సుగతుని నిర్వాణ వేళావి–
మూఢజగద్దైన్యమూర్తి తోచు,
నీవు గతకాలమవు, నీవు నీరవమవు,
నీవు శూన్యమాకృతివియు, నేడు రేపు
తిరిగి నీలోన కలిసి గుర్తింపరావు,
రాత్రి! లేదు నీకన్న నల్లని నిజమ్ము."

రాత్రివేళ మనం పోయే నిద్రను ఒక ఆంగ్లకవి "The blessed barrier between day and night" అన్నాడు.

ఒక పద్యంలో రాత్రిని రకరకాలుగా ఎన్నో అందమైన సంబోధనలతో పిలిచి, నమస్కరించారు తిలక్:–

"ఓసి నిశాచరోత్సవ మహోదయమా! గతకాల గాథ ని
శ్వాస రహస్యమా! భవుని స్వాంతములో మొదలింటి ఊహలో
పోసిన శిల్పమా! సమత మూర్తినిగొన్న దయానిధానమా!
నా సఖి! రాత్రిరాజ్ఞి! స్మరణైక సుఖప్రదశాలినీ! నమః"

రాత్రిని తలచుకుంటే చాలు ఆమె కవికి సుఖాన్ని ప్రసాదిస్తుందట!

ఈ ఖండికలోని చిట్టచివరి పద్యంలో కవి శర్వరీప్రియను ఇలా ఆహ్వానిస్తున్నాడు: "నా మెత్తని పట్టువంటి చీకట్ల దుప్పటిలోకి వచ్చి నన్ను కౌగిలించుకో! నా చెక్కిళ్ళనుండి అలలు అలలుగా జాలువారుతున్న కన్నీటితో నీ

గుండెల్ని హత్తుకుంటాను. నీ గుండెలు నా కన్నీటి తడితో ఒక వింత అందాన్ని సంతరించుకుంటాయి. ఈ మత్తులో జోలపాడి నన్ను మైమరపింపుము ఓ నా రాత్రి సఖీ!" అని వేడుకుంటాడు. చాలా రసవంతమైన పద్యం యిది:-

"మెత్తని పట్టుచీకటుల మేలిమి దుప్పటిలోన కౌగిలిన్
ఒత్తుము, నా కపోలగళదూర్మికలై చను బాష్పవారితో
హత్తెద నీయురమ్ము తడియై ఒక వింత సొబంగుదాల్ప, ఈ
మత్తున జోలపాడి నను మైమరపింపుము శర్వరీప్రియా!"

(2) "బాధాగళము":- అనారోగ్యదశలో వ్రాసిన ఆరు పద్యాలు 1964 డిసెంబరు 'భారతి'లో వచ్చాయి. గుండెపోటుతో బాధపడుతున్న తాను కవిత్వం చెప్పలేని స్థితిలో ఉన్నందుకు బాధపడుతూ ఇలా అంటారు తిలక్:-

"గుండియ పోటుతో బ్రతుకు కోసలు వంకరలయ్యె, వేదనల్
చెందిన కత్తు లీ తనువు ఛిన్నమొనర్చెను, మౌనబాష్పముల్
నిండిన సంద్రముల్ కనుల నివ్వెర పోయె, నికేమి పల్కు నీ
కొండొక షట్పదమ్ము, మణికోమల వీణయు, పుంస్కికమ్ముయున్!"

"దీక్ష" అనే నాలుగు పద్యాల ఖండికలోను, యతిప్రాసలు లేకుండా వ్రాసిన "సంగీతవృత్తము"అనే 7పద్యాల ఖండికలోను కవిలోని అవ్యక్తవేదన వర్ణింపబడింది.

2.2 బాహ్యవిషాదం:-

కవి యితరుల దుఃఖాన్ని బాధలను తలచుకొంటూ బాధపడటం బాహ్య విషాద మవుతుంది. ఉదా॥ "ఆటవెలది-3" - "పరిత్యక్త (సీత-2)"

(1) "ఆటవెలది-3"లో 'బాధ'ను గురించి రెండు పద్యాలు వ్రాశారు తిలక్:-

"బాధ లెన్ని విధము లీ ధరిత్రిని, సాను-
భూతి లేక నరుడు పొగులుచుండు,
ఎండ కనలి కనలి గుండెలవిసి భూమి
మబ్బునీడ పడక మండినట్లు."

"ఒక్క జాలిమాట, ఒక్క నిడుదయూర్పు
విడువదేల నరుడు వింతలోభి?
కరకుగుండెకన్న ఇరుకుగుండె అవని
దుఃఖకారణమ్ము, దుర్భరమ్ము!"

(2) "పరిత్యక్త" (సీత-2):- ఇందులో రామునిచే పరిత్యజింపబడిన సీతను తలుచుకుంటూ మహాకవి భవభూతిలాగ బాధపడతారు తిలక్. 10 పద్యాల ఖండిక. అన్నీ రసవంతమైన పద్యాలు. (i) సీతాదేవి నల్లని పొడవైన కేశములు సుదీర్ఘ దుఃఖమే వెల్లువయైనట్లుగాను, రాముడు మోపిన నిందలాగ ఉన్నాయట:-

"అల్లిన నారచీర బిరుసై సుకుమార వపుర్వికర్షణా
వేల్లనమైన లెక్కగొన, వించుక దోహదమేని లేని నీ
నల్లని కైశికమ్ము జఘనమ్మున బర్వె సుదీర్ఘ దుఃఖమే
వెల్లువయైనయట్లు, రఘువీరుడు మోపిన నిందయట్లుగా!"

(ii) భారతదేశ చరిత్రలో ఏకైక విషాదనాయికయైన సీత ప్రపంచంచేత పొగడబడింది. ఆమె కథ కవిని నవ్యనవనీతంలాగ కరిగించివేసింది. సీత అంటే దుస్సహమైన వేదన!

"నీ కథ నన్ను నవ్యనవనీతము వోలె కరంచె, భారతా
స్తోకచరిత్రలో విషమసుందరమున్, కరుణాప్రఫుల్లమున్,
వ్రేకదనమ్ము, దుస్సహపు వేదనయున్-మిళితమ్ముసొంది, ఏ
కైక విషాద నాయికవుగా జగదీడితవైతివమ్మరో!"

(వ్రేకదనము = భారము; జగత్ + ఈడితవు + ఐతివి + అమ్మరో! = లోకము చేత - పొగడబడినదానవు - అయినావు - ఓతల్లీ!)

(iii) మహాభారతంలో ద్రౌపది ఎన్నో కష్టాలు పడింది. అటువంటి కష్టాలు పడిన పతివ్రతలు ఎందరో ఉన్నారు. కాని సీతమ్మ తల్లీ! "నీవు మా గుండెల రక్తనాళముల కోసిన జాలివి!" అంటారు తిలక్:

"పాండవపత్ని జీవితపుబాట యగమ్యము, నిత్యయాతనా
చండిమమున్, తదన్య గుణశాలినులున్నను, తల్లి! నీవు మా
గుండెల రక్తనాళముల కోసిన జాలివి, నిర్మలత్వమే
నిండుగ వెల్గు నీకనులు నిల్చును జాతికి వెల్గుమిన్నులై!"

(iv) నిఖిలాంధ్రజాతికి సీతాదేవి పరమపూజ్యురాలు, మిక్కిలి సన్నిహితురాలు:-

"నీవు సన్నిహితవు నిఖిలాంధ్ర జాతికి
నీదు పేరు విన్న నిలిచి మ్రొక్కు,

బాధనోర్చి బ్రతుకు పడతిని 'సీతమ్మ
యామె!' యంచు పిలుతురింటనింట."

(v) చివరి పద్యంలో భగవంతుని సృష్టిలోని సమస్త ప్రకృతి సౌందర్యం కన్నా మించిన సీతాదేవి అతిలోక సౌందర్యాన్ని అత్యద్భుతంగా వర్ణించారు తిలక్. మొదట ప్రకృతిలోని అతిసుందరమైన అంశాలను వివరించి, సీతాదేవి ఈ అన్నింటికన్న మించిన సౌందర్యవతి అని చెపుతున్నారు. శరత్కాలపు చంద్రరేఖ స్పృశింపగా నవ్విన సన్నజాజి పువ్వు; దిక్కులనే ఇసుక తిన్నెలమీద చిన్న సవ్వడితో దొర్లుతున్న పాలవంటి నురుగు; చీకటితో మూసుకుపోయిన కొండకోన చివర మ్రోగిన వేకువ అనే వెలుగు మువ్వ:– ఇవేవీ కూడా వికసించిన కలువలవంటి నేత్రములు కల్గిన తల్లి సీతాదేవితో సరిరావు.

ఏ శరదిందురేఖ స్పృశియింపగ నవ్విన సన్నజాజి, ఆ
శా సికతాతలాల చిరుసవ్వడి దొర్లెడి పాలనుర్వు, ఏ
మూసిన కొండకోన కొసమ్రోగిన వేకువ వెల్గుమువ్వ, నీ
తో సరిరావుగా వికసితోత్పలనేత్రి! సవిత్రి మైథిలీ!

ఇక్కడ "నేత్రి" లక్షణ విరుద్ధమైన ప్రయోగం. "నేత్ర" అనాలి.

3. ప్రకీర్ణకం (వివిధ విషయాలను గూర్చిన కవితలు – పరాశ్రయకవిత్వం):–

స్వీయకవితా నిర్వచనం; కవిగా తన వైశిష్ట్యం; సైన్సు సుందరి; మహాత్ముల ప్రశంస; వాల్మీకి రామాయణ వైశిష్ట్యం – అనే ఐదు కవితలు ఈ మూడవ వర్గం క్రిందకి వస్తాయి. అలభ్యమైన "మండోదరి" కావ్యంలోని మూడు పద్యాలను కూడా ఈ శీర్షిక క్రిందనే చర్చిస్తున్నాను.

3.1 స్వీయకవితా నిర్వచనం:–

"మేలి ముసుగు జార, వాలు చూపు నిగుడ,
ఒదగ లేని పైట ఒత్తిగిలగ,
అదుగు అదుగునందు ఆనందమే మ్రోయు
ఆంధ్రకవిత నాది ఆటవెలది!" (–ఆటవెలది–1)

3.2 కవిగా తనవైశిష్ట్యం:–

'అమృత తత్త్వమేదొ వ్యాపించె నాలోన
సృష్టి మొదటి యూహ స్పష్టమయ్యె!

బ్రతుకు బయలునందు భయముగొలుపు పాము-
పడగమీద మణిని పట్టినాను!" (-ఆటవెలది-1)

కవి భౌతికంగా శాశ్వతుడు కాకపోవచ్చును; కాని అతని కవిత్వం శాశ్వతం! దీనినే మహాకవి భర్తృహరి "రససిద్ధులైన కవుల కీర్తిశరీరానికి జరామరణముల భయం లేదు!" అని చెప్పాడు.

"జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః
నాస్తి తేషాం యశః కాయే జరామరణజం భయం"

తా॥ చక్కని కృతులు రచించినవారు, రససిద్ధులు ఐన కవీశ్వరులే గొప్ప అదృష్టవంతులు. ఎందుచేతనంటే వారి యశశ్శరీరమునకు జరామరణాదుల భయము ఏమిన్నీ లేదు కదా! దీనినే ఆధునిక కవి శేషేంద్ర ఇంకో రకంగా చెప్పారు:

"నేనింతా పిడికెడు మట్టే కావచ్చు
కాని కలమెత్తితే ఒక దేశపుజెండా కున్నంత పొగరుంది!"

ప్రేమతోనే ఈ సృష్టి ప్రారంభమయింది (బైబిలులోని యాడం- ఈవుల కథ). ప్రేమ-కరుణ-మానవత: ఈ మూడూ ఉంటే జీవితంలో భయం ఉండదు. జీవితంలో భయం అనే పామును పట్టి ఆడించేవాడు కవి! తిలక్‌గారు ఇదే భావాన్ని ఇంకా విపులంగా "అమృతం కురిసిన రాత్రి" అనే వచనకవితలో చెప్పారు.

3.3 "సైన్సు సుందరి":-

సైన్సును ఒక సుందరిగా భావించడం నవ్యకవితా లక్షణం. సైన్సు మానవజాతి మారణ హోమానికి ప్రయత్నిస్తోందని హెచ్చరిక. ఈ ఖండికలో నాలుగు పద్యాలున్నాయి.

"నీవు తామసాంధ తమసు, నీవు తర్క
సుందరివి, కళ నీలోన అందగించు,
కాని భయబంధురమ్ము రక్తాత పత్ర-
మై విరియు నీ చిరునవ్వు మలుపురేక'

3.4 మహాత్ముల ప్రశంస:-

"శ్రీ వివేకానందస్వామి" అనే కవితలో మొదటి సీసపద్యంలో వివేకానందుని

గొప్పతనాన్ని శివునితో పోల్చి చక్కగా వర్ణించారు:-

"ఎవని ఫాలము చెంత ఈశ్వరావాస కై -
లాస శిఖరపాళి లాస్యమాడు,
ఎవని పాదము చెంత భవుని తాండవ నృత్య-
మంజీర ఘంటికామైత్రి తోచు,
ఎవని కన్నులలోన శివజటాజూట మో-
సరిలి సురాపగ కెరలిపారు,
ఎవని పెదవిపైన అవతంస శశికళా-
ఖేలనోత్సవ చంద్రకితము స్మితము
అట్టి శ్రీ వివేకానందమైన మూర్తి
జ్యోతిరబ్ధియౌచు కెరటమొత్తి, నన్ను
తట్టి, ననుముంచి, నాలోన తాదృగభిన
వోజ్జ్వలాంశ శతాంశమే నొరపుగాక!"

వివరణ:- చంద్రకము = నెమలికన్ను, చంద్రకి = చంద్రకములు కలది- నెమిలి, చంద్రకితము = చంద్రక + ఇతము = నెమలి కన్నులుగా చేయబడినది. నాలోన - తా + దృక్ + అభినవ + ఉజ్జ్వల + అంశ - శతాంశము + ఏని = ఆచూపులోని - మిక్కిలి క్రొత్తదియైన - ప్రకాశించుచున్న - అంశములో - నూరవ భాగమైనను - నాలోపల - ఒరపుగాక! = అందగించుగాక!

తిక్కనగారు విరాటపర్వంలో ద్రౌపదిచేత ధర్మరాజు గొప్పతనాన్ని చెప్పిస్తూ: "ఎవాన్ని వాకిట నిభమద పంకంబు రాజభూషణ రజోరాజి నడఁగు" అనే సీస పద్యం వ్రాశారు. ఈ పద్యం అప్పటినుండి ఇప్పటివరకు వందలాది ఏళ్ళుగా ఎందరో కవులకు ఒజ్జబంతి అయింది. తిలక్ కూడా వారిలో ఒకరుగా ఈ సీసపద్యాన్ని వ్రాశారు.

ఈ కవిత చివర "దేవుడెక్కడ ఉంటాడు?" అని ప్రశ్నించి దానికి చాలా గొప్ప సమాధానం చెప్పారు తిలక్:-

"దేవు డెచట? - మనసు తేటతేరిన చోట!
దేవు డెచట? - యిరులు తెగినచోట!
దేవు డెచట? - సకల దీనుల కన్నీట!
దేవు డెచట? - స్వామి! నీవు నచట!!" ఈ ఖండికలో ఐదు పద్యాలున్నాయి.

3.5 వాల్మీకి రామాయణ వైశిష్ట్యము:-

"విషణ్ణ వైదేహి (సీత-1)" అనే కవితాఖండికలో భారతీయసాహిత్యంలో అత్యంత విషాదనాయికయైన సీతాదేవి దుఃఖాన్ని గురించి, ప్రపంచంలోనే అత్యుత్తమమైన ఇతిహాసం - వాల్మీకి రామాయణ వైశిష్ట్యాన్ని గురించి 10 పద్యాలలో ఎంతో రమణీయంగా వర్ణించారు తిలక్.

(1) సీతాదేవిదుఃఖం మనలనందరినీ బాధించే హృదయశల్యం అని ప్రారంభిస్తారు ఖండికను:-

"సీత విదియ చంద్రుని రేక, చిరుత వాక,
చెమ్మగిలిన ప్రతి కనుంగవ చిటిలినట్టి
తరళ బాష్పమ్ము, గుండెలో తరచి గ్రుచ్చు-
కొన్న తొలిబాధ, పదును లోగొన్న బాకు!"

(2) సీతారాముల కాలమెప్పటిదో మనకు తెలియదు. కాని నాటిపాట జానకీరాముల అందమైనగాథ అనే రూపాన్ని ధరించి వందల వేల సంవత్సరాల హృదయవీణమీద నిలిచి, ఈనాటివరకు జాలిగా మ్రోగుతూనే ఉంది:-

"నాటి కాలమెరుగము, నాటిపాట
జానకీ రామచంద్రుల చారుగాథ
దాల్చి, శతసహస్రాబ్ద హృదయవిపంచి
నిలిచి, జాలిగా నినదించు నేటి దనుక!"

(3) సీతారాములకథ విని చలించి నిలువెల్ల ఏడ్చి, కరిగిపోయాడట వాల్మీకి! అప్పుడు అతనిని గుండెలో మధువు పొంగి, సమస్త జనుల కన్నీటితో ముందుకు సాగి, రఘురాముని కథావీథులన్నీ తడిపివేసిందట!

"ఎంత చలియించి, నిలువెల్ల యేడ్చి కరుగ,
పుట్టపుట్టువు గుండెలో పొంగె మధువు;
సకల జననేత్ర వార్ధార సాగి తడిపె
ప్రియ రఘుకులాన్వయ కథావీథులెల్ల!"

(4) ఈ క్రింది సీసపద్యంలో రామాయణ వైశిష్ట్యాన్ని చెపుతున్నారు తిలక్. రామశబ్దం వింటేచాలు, ప్రకృతిలోని ప్రతిపుష్పమూ పులకించిపోతుంది. సీత శబ్దం వింటే చాలు, అది చలికాలమైనా, వేసవికాలమైనా, ప్రతివాగూ వరదలై

పొరుతుంది. సీతారాముల పేర్లు వింటే చాలు, ప్రతిగుండెయు ఒక కోవెల అయిపోతుంది. రామకీర్తన వింటే చాలు మనలోని మదమనే రాక్షసుడు చనిపోతాడు. రామకథ వాడవాడలా మారుమ్రోగింది. దానిని తీసికొని వాల్మీకి మహర్షి రామాయణమనే అక్షరమాల కూర్చాడు:–

"రామ శబ్దము చాలు రచ్చలో గట్టులో
పులకించ నట్టిది పూవు లేదు!
సీత శబ్దము చాలు సీతువో గ్రీష్మమో
వరదలై పారని వాగు లేదు!
రామ సీతానామ రమ్యనాదము చాలు
కోవెల కానట్టి గుండె లేదు!
రామాభిరామ కీర్తనముతో మడియని
స్మయభావ మదనిశాచరుడు లేదు!
వాడవాడల నాడు జీవత్కథాంశ
సంపుటీకృత కాకుత్స్థ చరితమ్రోగె!
దానిగైకొని ప్రతిభా విధానుడైన
మౌని వాల్మీకి అక్షరమాల్య గూర్చె!"

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు తమ రామాయణ కల్పవృక్షము– అయోధ్యాకాండలో ఒక సీసపద్యం వ్రాశారు. మంత్రి సుమంత్రుడు సీతారామ లక్ష్మణులను గంగానదీ తీరంలో వదిలిపెట్టి అయోధ్యకు తిరిగివచ్చి, రాముడులేని అయోధ్య పరిస్థితి ఎలా ఉన్నదో దశరథునితో చెపుతున్నాడు:–

"ఓ మహారాజ! నీ యూళ్ళలో, నీళ్ళలోఁ
జెఱువులందున నొక్క చేఁప లేదు,
భూలోక మఘవ! నీనేలలోఁ బూలలోఁ
దోఁట లందున నొక్క తేఁటి లేదు,
పృథ్వీశ! నీ రాజ్యవీథిలో వీథిలోఁ
బురములందున నొక్క పురుగు లేదు,
ప్రభు! మీరు చను నసివాళ్ళలో బీళ్ళలోఁ
బసిమి మేసెదు నొక్క పశువు లేదు,

చిన్నికోడలుతోడ రామన్న వదలి
వచ్చుచున్నట్టి నాదు దౌర్భాగ్యముఖము
మరి వారించిరొ, నాదు సేవకత పొంటెఁ
బృథ్వీపతి! యెంతగాఁ బ్రతారించినావు? (ప్రతారించు=మోసగించు)

పై సీసపద్య రచనాప్రభావం తిలక్‌గారి మీద ఉన్నదని నేను భావిస్తున్నాను.

(5) తిలక్‌గారు ప్రకృతిలోని ఏ అందమైన దృశ్యాన్ని చూసినా, దానిలో సీతారూపమే కనబడుతోంది. "శరత్కాలంలో ఉదయం వికసించిన పారిజాతం యొక్క ఆకులమీద చలిస్తూన్న హిమబిందువును చూసినా, సాయంకాల సంధ్యాదేవి అందమైన నుదుటిమీద నింగిలో ఏకాకిగా తళుక్కున మెరిసే చుక్కబొట్టును చూసినా, నాకు సీతామహాదేవి రూపమే కనబడుతోంది" అంటారు తిలక్:-

"నాకు శరత్ప్రభాతముల నవ్యవికాసిత పారిజాత ప-
త్రాకుల చంచలమ్మయిన రమ్య హిమాంబు కణమ్ము గాంచ, సం
ధ్యా కమనీయ ఫాలమున తళ్కను ముత్తెపుచుక్కబొట్టు ఏ
కాకిగ నింగిపై నిలువగా గన, తోచును సీతరూపమే!"

(6) రామకథాసముద్రం ఒక ఉదాత్త గంభీరవ్యూహం లాగ ఉంది. బలమైన ఆ సాగరతరంగాలతో కొట్టబడి, గమ్యం తెలియకుండా దిక్కులకు విసరివేయబడిన పద్మంలాగ ఉంది సీతమహాసాధ్వి!

"ఒక ఉదాత్త గంభీరతావ్యూహమౌను
రామకథాసముద్రమ్ము, ప్రబల తత్త-
రంగ తాడితమ్మై, గమ్యరహిత దిశల
కీడ్వబడిన సరోరుహమ్మేమి సీత?"

3.6 "మండోదరి" (తిలక్ అలభ్య పద్యకావ్యం):-

తిలక్ తన సాహిత్యసేవ మొదటిదశలో - అంటే 1938 నుండి 1946 వరకుగల కాలంలో "మండోదరి" పేరుతో సుమారు 300 పద్యాలు వ్రాశారట. కాని వీరి అనారోగ్య విరామదశలో అంటే 1946 నుండి 1954 వరకుగల కాలంలో "మండోదరి" వ్రాతప్రతి బీరువాలో నుండి క్రిందపడింది. దానిని చిత్తుకాగితాలకట్టగా భావించి, వీరి తల్లిగారు పాతకాగితాలు, పాతన్యూస్ పేపర్లు కొనేవాడికి అమ్మేశారు. ఈ విషయం నాతోను, మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తితోను పదే పదే ప్రస్తావించి ఎంతో బాధపడుతూ ఉండేవారు తిలక్.

'మండోదరి' కావ్యం వ్రాతప్రతి బీరువాలోనుండి క్రిందపడినప్పుడు మొదటి పుట చిరిగిపోయి బీరువాక్రిందనే ఉండిపోయింది. తరువాత ఎప్పుడో పనిమనిషి చీపురుతో బీరువా క్రింద ఊడిస్తే అది బయటపడింది. అందులో మూడు పద్యాలున్నాయి. ఆ మూడు పద్యాలనూ శ్రీపాద కృష్ణమూర్తి ధారణ చేశాడు. ఆ ధారణ చేసిన పద్యాలను 21.10.2012 నాడు నాకు వ్రాసిన ఒక లేఖలో చేర్చి పంపించాడు. వాటిని దిగువ యిస్తున్నాను.

1. **నిశినిశి యెల్ల వీచిన వనీ మృదుచందన ధూపమాలికల్**
   దెసల మొగిళ్ళవోలె కొసతేలెను తెల్లని వెండి అంచులన్,
   మసిమసివోని నిద్దురల మైకపు మాటున స్వప్నరమ్య రా
   క్షస వనితాధరమ్ములొక చక్కని నవ్వున వెల్గినట్టులై.

2. **తూరుపుకొండ వెన్క, అలతోచియు తోపని భానుకాంతి, వి**
   స్తార సముద్రవారి బడి శైత్యము దాలిచి, వింత వెన్నెలై
   పారగ ద్వీపమెల్ల, సురతాలస సుందర కాంతలంత, క
   న్నోరగ చేసి చూసి, భ్రమతో నిదురించిరి హాయి క్రమ్మరన్.

3. **సింహళ సిందువారముల సీకృతిలో చెలరేగి సాగి, ఆ**
   సింహళ సింధువార రస శీకర సేచనలో కలంగి, ఆ
   రంహదుదార మారుత శలాక మొకందు పతాక తాకె, ఓ
   సింహళనాథ! లెమ్ము! శివసేవనవేళ గమించి పోయెదున్.

మొదటి పద్యంలో "నిశినిశియెల్ల" అనే ప్రయోగం సరైన ప్రయోగం కాదు. "గోరువంకలు" అనే ఖండికలో కూడా "నిశి లేవెన్నెల చాలులో" అని ప్రయోగించారు తిలక్. సంస్కృతంలో 'రాత్రి'-'అర్ధరాత్రి' అనే అర్థాలలో "నిశ" – నిశీథము" – "నిశీథిని" అనే మూడు పదాలున్నాయి కాని, "నిశి" అనే పదంలేదు. తెలుగులో తద్భవరూపం "నిసి" ఉంది. "నిశినిశియెల్ల" – "నిశి లేవెన్నెల చాలులో" అనే తిలక్ ప్రయోగాలను "నిసి" అని మార్చి వేద్దామనుకున్నాను. కాని తిలక్ భాషను గురించి పరిశోధన చేసేవారిని తప్పుత్రోవ పట్టించినట్లు అవుతుందని ఆ పని చేయలేదు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు కూడా "నిశినిశి" అని తన రామాయణ కల్పవృక్షంలో రెండు మూడు చోట్ల ప్రయోగించారు. బాలకాండ

– అహల్యాఖండంలో “నిశినిశియెల్ల నింద్రునకు నీలసరోరుహలోచనావచో/ నిశితమనోహరార్థ విపణీకృత ధీకునకున్” (534వ పద్యం); “ధృతముని వేషుఁడై బయలుదేఱిన నా నిశిఁ గృష్ణపక్ష సం/గతమగు ద్వాదశిన్... (526వ పద్యం). “నిరంకుశాః కవయః” –కవులు నిరంకుశులు కదా! మనమేమి చెయ్యగలం?

లభించిన పై మూడు పద్యాలనుబట్టి తిలక్‌గారు “మండోదరి” కావ్యం ప్రౌఢకావ్యమని, తెల్లవారుజామున వందిమాగధులు రావణాసురుని మేల్కొల్పడంతో ఇది ప్రారంభమవుతుందని మనం ఊహించవచ్చు.

(ఈ అలభ్యకావ్యం గురించిన మరింత సమాచారం కోసం అనుబంధం చూడవలసిందిగా పాఠకులను కోరుతున్నాను – తంగిరాల)

మా తణుకులో తిలక్‌గారికన్నా సీనియర్ హాస్యరచయిత ఒకరుండేవారు. ఆయన పేరు తెన్నేటి కోదండరామయ్యగారు. వృత్తి రీత్యా లాయరు; ప్రవృత్తిరీత్యా మంచి రచయిత. తిలక్‌గారికి ఆయనంటే గురుభావం. ఒకసారి ఆ కోదండ రామయ్యగారికి పెద్ద సన్మానం జరిగింది. ఆ సభలో తిలక్‌గారు వారిని ప్రశంసిస్తూ కొన్ని అభినందన పద్యాలు వ్రాసి చదివారు. వాటిని సన్మానపత్రంగా ముద్రించారు. అది నా దగ్గర నిన్న మొన్నటి వరకూ ఉండేది. ఇప్పుడు ఎంత వెదకినా కనబడలేదు.

పై విధంగా తిలక్ పద్యకావ్యం “గోరువంకలు” లో 80%గా ఉన్న భావకవిత్వంలో (ఆత్మాశ్రయ కవిత్వంలో) అద్భుత సౌందర్యం– దుర్భ విషాదం ఉన్నాయి. 20 శాతంగా ఉన్న ప్రకీర్ణకంలో సామాజికము పరాశ్రయము అయిన వివిధ కవితలు ఉన్నాయి. వచనకవితా రచనలోనే కాదు, పద్యకవితా రచనలో కూడా తిలక్ ప్రదర్శించిన అసమానకౌశలం మనకు అడుగడుగునా ప్రత్యక్ష మవుతుంది!

“ప్రభాతము–సంధ్య” – “గోరువంకలు” అనే తిలక్ పద్యకావ్యాలు “దేవరకొండ బాలగంగాధర తిలక్: లభ్యరచనల సంకలనం” (ఎమెస్కో, ద్వితీయ ముద్రణ, జనవరి 2021)లో లభిస్తాయి. పద్యకవితాప్రియులు చదివి ఆనందించవచ్చును. ఈ సంకలనం నా ప్రధాన సంపాదకత్వంలో వెలువడింది.

7. తిలక్ లేఖలు - ఒక పరిశీలన

ఆధునిక యుగంలో ప్రసిద్ధ కవులు రచయితలు లేఖారచనను ఒక నూతన సాహిత్య ప్రక్రియగా అభివృద్ధి చేశారు. (ఇది ఆంగ్లసాహిత్య ప్రభావమే అనడంలో ఏమీ సందేహం లేదు.) చలంగారి లేఖలు మిక్కిలి ప్రసిద్ధమైనవి. (ఇప్పుడు ఫోన్లు, సెల్‌ఫోన్లు వచ్చాక ఈ ప్రక్రియ పూర్తిగా అంతరించిపోయింది.) తిలక్‌గారు తన రెండవ సాహిత్య దశ (1954–1966)లో ముఖ్యంగా 1959 నుండి 1966 లో తాను మరణించేంతవరకు, లేఖాప్రక్రియను పరిపుష్టం చేశారు. ఆయన స్వతహాగా స్నేహశీలి, సౌందర్యారాధకుడు, గొప్ప భావుకుడు, గొప్ప కవి కావడంవల్ల ఈ లేఖలకు మంచి సాహిత్య పరిమళం వచ్చింది.

తిలక్ ఎందరో కవిమిత్రులకు ఎన్నో లేఖలు వ్రాశారు. అందరూ వాటిని భద్రపరచుకున్నారో లేదో తెలియదు. ఒక వేళ భద్రపరచినా ప్రచురణకర్తలకు ఇచ్చారో లేదో తెలియదు. పోయినవి పోగా, సుమారు 70 లేఖలు లభించాయి. (ప్రసిద్ధ కవులు, రచయితలు తాము వ్రాసిన లేఖలకు నకళ్ళు పెట్టుకొని వుంటే ఎంత బాగుండేది! ఆ కాలంలో జిరాక్స్ మెషిన్లు లేవు కదా!). 1966 జూన్ 30వ తేదీ రాత్రి తిలక్‌గారు 45 ఏళ్ళ నడివయస్సులో చనిపోగానే, మా తణుకులోని ఆయన మిత్రులు, అభిమానులు - ముఖ్యంగా శ్రీమతి వోగంటి మాణిక్యాంబాదేవిగారు, "తిలక్ సాహితీ సరోవరము" అనే సంస్థను స్థాపించారు. తిలక్ తనకు వ్రాసిన లేఖలు, శ్రీయుతులు సోమసుందర్, వరవరరావు, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, మిరియాల రామకృష్ణ, "జానకీజాని" - అనే మిత్రులకు వ్రాసిన లేఖలు మొత్తం 63 సేకరించారు. 1968 జూన్ నెలలో "తిలక్ లేఖలు" అనే పేరుతో 76 పుటల లేఖలు, మరో 62 పుటల "వ్యాసానుబంధం", 6 పుటల పీఠికలు కలిపి మొత్తం 144 పుటల గ్రంథాన్ని ప్రచురించారు. వ్యాసానుబంధం"లో తిలక్‌గారిని స్మరిస్తూ వివిధ కవులు, రచయితలు వ్రాసిన కవితలు, వ్యాసాలు ఉన్నాయి. వ్యాసరచయితలలో మా తణుకులో ఉండిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ముదిగంటి జగ్గన్నశాస్త్రిగారు, తిలక్‌గారికి హైస్కూలులో తెలుగు

బోధించిన గురువు "తెలుగు రాజుగారు" అనబడే పండిత పెన్మెత్స సత్యనారాయణ రాజుగారు కూడా ఉన్నారు.)

"తిలక్ సాహితీ సరోవరము" వారు ప్రచురించిన 63 లేఖలకు, నేను మరికొన్ని చేర్చాను. 'నవత"లో ప్రచురితమైన మరో 7 లేఖలు, నాకు తిలక్‌గారు వ్రాసిన 4 లేఖలు, వెరసి 11 లేఖలు కలిపాను. మొత్తం 74 లేఖలు అయ్యాయి. ఈ సంఖ్యకు మరొకటి చేర్చాలి. తిలక్‌గారు 16-4-1959 నాడు ఆచంట జానకిరాం గారికి వ్రాసిన పెద్దలేఖను నేను 1966లోనే సంపాదించాను. దీనిని ఈ గ్రంథంలోని మొదటి వ్యాసంలో ("తిలక్ అభిరుచులు-అలవాట్లు"లో) ఇచ్చాను, చూడండి. అయితే ఎమెస్కోవారు ప్రచురించిన "తిలక్ సర్వలభ్యరచనల సంకలనం"లో దీనిని చేర్చడం మరిచిపోయాను. ఈ లేఖతో కలిపితే లభించిన తిలక్ లేఖలు మొత్తం 75 అవుతాయి.

"తిలక్ సాహితీ సరోవరము" లేఖలు:-

తిలక్‌గారు ఎక్కువ లేఖలు వ్రాసింది నలుగురు మిత్రులకు-ప్రసిద్ధ అభ్యుదయ కవి డా॥ ఆవంత్స సోమసుందర్‌గారికి, విప్లవకవి డా॥ పి. వరవరరావుగారికి, డా॥ మిరియాల రామకృష్ణగారికి, శ్రీమతి మోగంటి మాణిక్యాంబాదేవిగారికి. సోమసుందర్‌గారికి 4-4-1952 నుండి 12-4-1966 వరకు 21 లేఖలు వ్రాశారు. (కార్డును చిన్న లేఖగాను; ఇన్‌లాండ్ లెటర్‌నూ, కవరునూ పెద్ద లేఖగాను భావించవచ్చును.) వీటిలో కార్డులు కన్న కవర్లే ఎక్కువ. అంటే పెద్దలేఖలే అధికం. ఈ లేఖలన్నింటికీ సోమసుందర్‌గారు ప్రస్తావనలు, సందర్భాలు వ్రాసి, ఒక అనుస్యూతం (Continuity) కలిగించారు. అందువల్ల ఒక కథలాగ చదవడానికి Interest కనిగిస్తోంది. మిగిలిన వారు ఈ పని చేయలేదు. సోమసుందర్‌గారికి మొదటి లేఖ 1952లో వ్రాసినా తిరిగి 1959 వరకూ ఏమీ వ్రాయలేదు. మరల 1959-1966 మధ్య విరివిగా లేఖలు వ్రాశారు.

28-3-1963 నుండి 1966 ఏప్రిల్ వరకూ వరవరరావుగారికి 17 లేఖలు వ్రాశారు తిలక్. వీటిలో చిన్నవీ, పెద్దవీ ఉన్నాయి. ఒక ఆంగ్ల లేఖ కూడా ఉంది.

ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారికి 15-6-1964 నాడు వ్రాసిన ఒకే ఒక లేఖ (పెద్దది) ఉంది. దీంట్లో సంప్రదాయవాదుల్ని కొంచెం శ్రుతిమించి విమర్శించారనిపిస్తుంది.

20-4-1961 నుండి 18-6-1966 వరకు మిరియాల రామకృష్ణగారికి 15 లేఖలు వ్రాశారు తిలక్. వీటిలో చిన్నవీ, పెద్దవీ, సమానంగా ఉన్నాయి.

26-2-1961 నుండి 20-2-1962 వరకు – అంటే సరిగ్గా ఒక సంవత్సర కాలంలో శ్రీమతి మోగంటి మాణిక్యాంబాదేవిగారికి ఎనిమిది సుదీర్ఘమైన లేఖలు వ్రాశారు తిలక్. ముద్రణలోనే ఒక్కొక్కటి రెండు మూడు పుటలు ఆక్రమించాయి. నా ఉద్దేశంలో తిలక్ లేఖాసాహిత్యంలో ఇవి అగ్రశ్రేణికి చెందుతాయి. సోమసుందర్‌గారికి, వరవరరావుగారికి, మిరియాల రామకృష్ణగారికి వ్రాసిన లేఖల్లో తిలక్ హృదయం ఆవిష్కరింపబడితే, మాణిక్యాంబగారికి వ్రాసిన ఈ అపూర్వలేఖల్లో తిలక్‌గారి ఆత్మ ఆవిష్కరింపబడింది. ఆయన వ్యక్తిత్వం విశదమయింది. ఆయన సాహిత్య సృష్టికి మూలమైన పునాదులు బయటపడ్డాయి. ఆయన భావనాశక్తి తీవ్రత, ఆశయాల ఔన్నత్యం, సాహిత్య సిద్ధాంతాల వైశిష్ట్యం – ఈ లేఖల్లో అడుగడుగునా వ్యక్తమవుతున్నాయి. మాణిక్యాంబగారు ఒక్క సంవత్సరం (1961-62) లో తిలక్‌గారు తనకు వ్రాసిన ఎనిమిది లేఖలను మాత్రమే ప్రకటించారు. ఈ లేఖలలోని ఆత్మీయతను పరిశీలిస్తే, తిలక్‌గారు 1966 వరకు (మరో నాలుగేళ్ళవరకు) ఆమెకు ఎన్నో లేఖలు వ్రాసి వుండాలి. తిలక్‌గారు చనిపోయిన తరువాత ఆమె చాలాకాలం జీవించి వున్నారు. మిగిలిన లేఖలను ఆమె ఎందువల్లనో బహిర్గతం చేయలేదు. ఇది తిలక్ లేఖాసాహిత్యానికి కలిగిన ఒక నష్టం.

చివర్లో "జానకీ జాని" (శాస్త్రి) గారికి వ్రాసిన ఒక ఆంగ్ల లేఖ ఉంది. దానికి అనువాదం కూడా ఇచ్చారు సంపాదకులు. శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు ('భారతి'లో) ఆధునికాంధ్ర కవిత్వ చరిత్ర శ్రీశ్రీ దాకానే వ్రాశారనీ, ఆయనకు అంతవరకే పరిచయం ఉన్నదనీ, తరువాతి కవుల చరిత్రను శాస్త్రిగారు వ్రాస్తే బాగుంటుందని తిలక్ సూచించారు. "జానకీ జాని" అంటే సామవేదం జానకి రామశాస్త్రి. వీరు, 1960-70 దశకంలో ఏలూరునుండి "సాహితి" అనే మాసపత్రికను వెలువరించిన సామవేదం జానకిరామశర్మగారి పుత్రులు. కాకినాడ పి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేసేవారు.

'నవత' లేఖలు:

తిలక్‌గారు 1964-1966 మధ్య దిగంబరకవులైన శ్రీ 'నగ్నముని'కి ఒక లేఖ, శ్రీ 'నిఖిలేశ్వర్'కి ఒక లేఖ, 'నవత'ను నడిపే శ్రీ శిష్ట్లా జగన్నాథంగారి ఒక

లేఖ, నాటక ప్రయోక్త శ్రీ అబ్బూరి గోపాలకృష్ణగారికి నాలుగు లేఖలు వ్రాశారు. మొత్తం ఈ యేడు లేఖలూ 'నవత'లో ప్రచురింపబడ్డాయి. 1965లో దిగంబర కవులు తమ మొదటి కవితా సంపుటిని "నాంపల్లి పాండు" అనే రిక్షా కార్మికుడి చేత ఆవిష్కరింపజేశారు. దీనిని తిలక్ నగ్నమునికి వ్రాసిన లేఖలో విమర్శించారు. కవిత్వం విషయంలో మంత్రిగారు ఎంత మూర్ఖుడో రిక్షావాడూ అంతే మూర్ఖుడు– అని అన్నారు. తన నాటిక "పొగ" ప్రదర్శించడానికి వీలవుతుందేమో చూడమని గోపాలకృష్ణగారికి వ్రాశారు.

నాకు వ్రాసిన లేఖలు: –

నాకు వ్రాసిన లేఖల్లో వర్షహేలకు ముగ్ధులు కావడం, నన్ను దృష్టిలో పెట్టుకొని "సుందరీ–సుబ్బారావు" కథను, "తపాలా బంట్రోతు" కవితను తాను వ్రాయటం, ఫలితంగా నాకు వారి మీద ప్రగాఢమైన గౌరవాభిమానాలు ఏర్పడటం, నన్ను ఆప్యాయంగా తనతోపాటు సినీమా చూడటానికి ఆహ్వానించడం, ఒక ఆర్థిక లావాదేవీ విషయంలో ఒక మిత్రుడు నా మీద చెప్పిన చాడీలు నమ్మి, నన్ను వ్యంగ్యంగా నిందిస్తూ పెద్ద లేఖ వ్రాయటం – ప్రసక్తమయ్యాయి.

లేఖలలో తిలక్ వ్యక్తిత్వం: –

ఒక కవి వ్యక్తిత్వం ఆతని రచనలలో కన్నా లేఖలలో బాగా వ్యక్తమవుతుందని విమర్శకుల భావన. తిలక్‌గారి స్నేహశీలత, ప్రేమ, ఆప్యాయత, కరుణ, సౌందర్యాన్వేషణ, అనారోగ్యంతో బాధపడుతున్నా లెక్కచేయకుండా జీవన మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ ధైర్యంగా ముందుకు వెళ్ళడం, ఆశాభావం, జీవిత రహస్యాన్ని అన్వేషించాలనే తపన, మానవత్వాన్ని ఖూనీచేసే ఛాందస భావాలను ఖండించడం, సంప్రదాయవాదుల మౌఢ్యం మీద – కుహనా దేశభక్తుల మీద తిరుగుబాటు, జ్ఞానానికీ – అజ్ఞానానికి గల భేదం, సామాన్యునికి – కవికి గల భేదం, ప్రకృతి సౌందర్యాన్ని చూచి తన్మయత్వం పొందడం, తన సాహిత్య సిద్ధాంతాలు – వాటి పునాదులు, తాత్త్వికత, నిరాశ, సమాజంలోని జుగుప్సను చూచి నిస్పృహ చెందడం, తనలాగే బాధలలో ఉన్నవారి కన్నీరు తుడవడం, పేదలను చూచి ద్రవించిపోవడం, యువకవి మిత్రుల్ని ఆప్యాయంగా "తమ్ముడూ" అని పిలవడం, వారిని తనయింటికి ఆహ్వానించడం, దిగంబర కవులలోని గుణదోషాలను నిష్కర్షగా బేరీజు వేయడం – మొదలైన ఎన్నో ముఖాలుగా

వ్యాపించిన తిలక్‌గారి మహోన్నతమైన వ్యక్తిత్వం ఈ లేఖలలో ప్రతిఫలిస్తోంది. తాను అనారోగ్యంతో బాధపడుతూ కూడా ప్రకృతి సౌందర్యాన్ని తన్మయుడై ఆస్వాదించడం తిలక్‌గారి విశిష్ట లక్షణం. తిలక్‌గారి గౌరవమిత్రులు సారంగు లక్ష్మీనరసింహారావు గారు చెప్పినట్లుగా "మంచువలె చల్లనైన అతని హృదయం ప్రవృత్తి యిందలి (1968లో "తిలక్ సాహితీ సరోవరము" వారు ప్రచురించిన "తిలక్‌లేఖలు" అనే గ్రంథంలోని) ప్రతివాక్యములోను వ్యక్తమగుచునే యుండును!"

తిలక్‌గారు సోమసుందర్‌గారికి మొట్టమొదటి లేఖ 1952లో వ్రాసినా, వారికి విరివిగా లేఖలు వ్రాయడం మొదలుపెట్టింది 1959 నుండే. సోమసుందర్ గారు ఉపన్యాసాలు చేయడానికి మొదటిసారి తణుకు వచ్చినప్పుడు (1959 ఏప్రిల్ 12, 13 తేదీలు) నేను తిలక్‌గారితోనే ఉన్నాను. అదే సంవత్సరం జూలై నెలలో కాబోలు సోమసుందర్‌గారు బెజవాడ రేడియోస్టేషన్‌లో తన కథను చదివి, తిరుగు ప్రయాణంలో తిలక్‌గారిని చూడటానికి తణుకువచ్చారు. తిలక్‌గారికి తన కథను చదివి వినిపించారు. అప్పుడు నేను అక్కడే ఉన్నాను. (ఆ కథను గ్రీన్ ఇంక్‌తో వ్రాశారు).

తిలక్‌గారు ఎవరెవరికి లేఖలు వ్రాశారో వారి వారి జీవనగమనం కూడా ఆ లేఖలవల్ల మనకు తెలుస్తుంది. వరవరరావుగారి పెండ్లి విషయం, మిరియాల రామకృష్ణగారి హైస్కూలు ఉద్యోగం, తరువాత వాల్తేరులో తెలుగు ఎం.ఏ. చదవడం, అప్పుడు యస్వీ. జోగారావుగారు అక్కడ ప్రొఫెసర్‌గా ఉండడం, రామకృష్ణగారి పెండ్లి, కాలేజీ ఉద్యోగం అన్నీ మనకు తెలుస్తాయి. వరవరరావు దంపతులను, రామకృష్ణ దంపతులను ఆప్యాయంగా తన యింటికి ఆహ్వానించడం, సోమసుందర్‌గారిని, వరవరరావుగారిని తన సొంత తమ్ముళ్ళుగా భావించి సంబోధించడం పరిశీలిస్తే తిలక్‌గారి హృదయం ఎంత ఆర్ద్రమయినదో మనకు విశదమవుతుంది.

1) తిలక్ సంపన్నులా?:-

పత్రికలలో వచ్చిన వరవరరావుగారి రచనలను తిలక్ శ్రద్ధగా చదివి, వాటిలోని లోపాలను ఆయనకు వివరించేవారు. తిలక్ రచనలను గ్రంథరూపంలో తీసికొనిరమ్మని వరవరరావుగారు పదే పదే చెప్పినట్లుగా తెలుస్తోంది. "మీరు సంపన్నులు" అన్న వరవరరావుగారికి ఇలా సమాధానం వ్రాశారు తిలక్: "నన్ను సంపన్నులని మీరు పేర్కొన్నారు. ఇదివరకు ఒకనాడు - కానీ ఇప్పుడు కాదేమో!

సిరితగ్గినా దానితాలూకు దుర్లక్షణాలు అన్నీమాత్రం వున్నాయి. ఖరీదైన అలవాట్లూ, హంగులూ ఇంకా నన్ను పట్టుకునే వున్నాయి. దానికి తోడు అతి సుకుమారమైన ఆరోగ్యం. అందరిలాగ బాధల కత్తిఅంచుమీద నడిచిన వాడినే, కన్నీటివానలో తడిసినవాడినే. అయినా ఏదో అపూర్వమైన మాధుర్యం ప్రాణశక్తితో కలిసి నన్ను బాధిస్తూనే వుంది. ముందుకు నడిపిస్తూనే వుంది.''

2) ఆశాభావం:-

ఈనాటి అవ్యవస్థలో మంచి కవులూ మంచి సాహిత్యమూ రావడానికి అవకాశంలేదని జి.వి.కృష్ణారావుగారు ఒక వ్యాసంలో అన్నారట. ఆ విషయాన్ని ఖండిస్తూ వరవరరావుగారికి 27-5-1966 నాడు ఒక లేఖ వ్రాశారు తిలక్. "జి.వి.కృష్ణారావుగారు ఒక వ్యాసంలో నేటి అవ్యవస్థలో మంచి కవులూ, మంచి సాహిత్యమూ రావడానికి వీలులేదన్నారు. కానీ నేను వారితో సహకరించలేను. కవియొక్క అవసరమూ, కవియొక్క ప్రేరణా ఈనాడే – ఈ అవ్యవస్థలోనే ఎక్కువ వుంది – అన్నాను నేను. కాని దురదృష్టవశాత్తు Mediocre talent మన రాజకీయాలూ, సినిమాలు లాగ. ఏమిటి చెయ్యడం? మనం నిజంగా కొన్ని విలువల్నీ సౌందర్యాన్నీ సృజించగలమా? ఇది మనకు సవాల్."

3) విశ్వనాథవారి "జయంతి" పత్రికను గురించి:-

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు "జయంతి" అనే సాహిత్య పత్రికను కొన్నాళ్ళు నడిపారు. తరువాత వారి శిష్యులు జువ్వాడి గౌతమరావుగారు కొన్నాళ్ళు నడిపారు. (ఇప్పుడు డా॥ వి. కొండలరావుగారు 'జయంతి'ని తెలుగు-ఇంగ్లీషు భాషలలో త్రైమాసికగా నడుపుతున్నారు.) ఎవరో 'జయంతి' పత్రికను తిలక్‌గారికి పంపినట్లున్నారు. ఆయన రచనల్ని పంపకున్నారు కాబోలు. దానిని గురించి మిత్రులు సోమసుందర్‌గారికి ఇలా వ్రాశారు:-

"జయంతి పత్రిక నాకు పంపించాడు. నేనింకా ఏమీ పంపించలేదు. పత్రిక మొత్తం మీద సనాతనపు వానస కొంచెం ఎక్కువగానే కొడుతుంది. కాని వారి ప్రయత్నమూ కృషీ అభినందనీయమైనవి. వాళ్ళకు మనం కొన్ని నేర్పవలసినవీ – వాళ్ళ దగ్గర్నుంచి మనం నేర్చుకోవలసినవీ కూడా వున్నాయేమో అనిపించింది'' (జూన్ 22, 1959).

4) సంస్కృత కళాశాలల్లోని సంప్రదాయవాదులపై ఘాటువిమర్శ:-

ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారు కొవ్వూరులోని "ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం"లో

చదువుకున్నారు. తాను చదువుతున్న కళాశాలను గురించి విమర్శిస్తూ ఆయన తిలక్‌గారికి ఒక లేఖ వ్రాసినట్లున్నారు. దానికి సమాధానంగా 15-7-1964 నాడు శర్మగారికి వ్రాసిన లేఖలో ఇలా ఉంది:-

"మీ సంస్కృత కళాశాల మీద మీ అభిప్రాయాలన్నింటితో ఏకీభవిస్తున్నాను... బ్రతికున్న మనుష్యలోకము వీళ్ళకు అక్కర్లేదు. గ్రాంథికాన్నీ, ఛందస్సునీ, ఆర్షధర్మాన్నీ (దీని అర్థం వాళ్ళకు తెలియదు) పట్టుకు వేళ్ళాడే వాళ్ళని చూస్తే జాలివేస్తుంది. నిజానికి మనం ప్రాచీన ఔన్నత్యాన్ని వైభవాన్ని గుర్తించినట్లుగా, గౌరవించినట్లుగా, వీళ్ళు గౌరవించలేరు. మూఢమైన ఈ అభిమానము కర్తకి కర్మకి కూడా గౌరవం లేకుండా చేస్తోంది."

5) "జ్ఞానం-అజ్ఞానం":-

శ్రీకాంతశర్మగారికి వ్రాసిన పై లేఖలోం తిలక్ జ్ఞానాన్ని అజ్ఞానాన్ని నిర్వచించారు. "జ్ఞానం చురుకైనది, పదునైనది. అనావశ్యకాల్ని వదలి వేస్తుంది. పేలవమైనదాన్ని కుళ్ళినదాన్ని ఖండించి వేస్తుంది. ఎప్పటికప్పుడు నూతనమైన విలువల్ని చైతన్యాన్ని సృష్టించుకుంటూ ముందుకుపోతుంది. అజ్ఞానం బలమైనది, జడమైనది, కదలదు. పాడింటి గోడల్ని, చూరుల్ని పట్టుకొని వ్రేళ్ళాడుతుంది. చీకటిని సరఫరాచేస్తుంది."

6) సంప్రదాయవాదుల మౌఢ్యం:-

మిత్రురాలు శ్రీమతి మోగంటి మాణిక్యాంబాదేవిగారికి 9-5-1961 నాడు వ్రాసిన లేఖలో తిలక్ ఇలా అన్నారు: "ఏళ్ళ తరబడి సృష్టించుకున్న మౌఢ్య భావాల్నీ, సంకెళ్ళనీ పగులగొడ్డటం నాకు సరదా. నలభైకోట్లమంది నా దేశీయుల దరిద్రానికి నేను తల్లడిల్లిపోతాను. వీళ్ళ మౌఢ్యానికి అసహ్యించుకుంటాను."

7) కుహనా దేశభక్తులు:-

పై లేఖలోనే కుహనా దేశభక్తుల్ని తీవ్రంగా విమర్శించారు తిలక్: "నా దేశంకన్నా గొప్పదేశం లేదు. ఇది ఋషుల దేశం ఆధ్యాత్మిక దేశం" - అని పాటపాడేవాళ్ళకు ఎప్పుడో మనస్సులు మూసుకుపోయాయి. వీళ్ళు చీమల్ని చంపడానికి సందేహిస్తారు. మనుష్యులు ఆకలితో దరిద్రంతో వందలకొలదీ చచ్చిపోతూంటే వీళ్ళకి ఆ చీమ కుట్టినట్టయినా వుండదు."

8) సామాన్యునికి – కవికి గల భేదాలు:–

పై మాణిక్యాంబాదేవిగారికే 26–2–1961 నాడు వ్రాసిన లేఖలో, సామాన్య మానవులకూ – కళాశీలికి గల భేదాలను వివరించారు తిలక్:–

"సాధారణంగా మనుష్యులందరూ దైనందిన సమస్యలతో, బాధలతో బ్రతుకుతూ వుంటారు. చిన్న చిన్న కోరికలూ, ద్వేషాలూ, అల్పమైన ఊహలతో సతమతమౌతూంటారు. నేలబారుగా, జడంగా, స్తబ్ధంగా, గొంగళి పురుగుల్లాగా పాకుతారు. వాళ్ళకి సౌందర్యం డబ్బులోనూ, ఉద్యోగంలోనూ, భేషజంలోనూ కనబడుతుంది. కాని కళాశీలికి యివేమీ కనిపించవు. అతనికున్న విలువలు వేరు. అతని చూపు వినీల గగనాన్ని ఒరుసుకుంటూ నక్షత్రమండలంలోకి పోతుంది. అతడు మనిషి లోపల మనిషిని చూస్తాడు. అతని ఆంతరదృష్టి ఎక్కడ అందం వున్నా, నిజం వున్నా, అక్కడ వాలుతుంది. దేని కోసమో తపన, అన్వేషణ నిరంతరంగా సాగిస్తాడు. ఈ యాత్రలో అతడు లౌకిక జగత్తును లక్ష్యపెట్టడు. అందుకే అతని ఊహ శాశ్వతమైంది. అతని నీతి అతీతమైంది. అతని రచన అక్షరమైంది (నశించనది)."

9) ప్రకృతి సౌందర్యం:–

9.1 తిలక్‌గారు ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులు కావడం అనేక లేఖల్లో కనబడుతుంది. 21–10–1963 నాడు మిత్రులు వరవరరావుగారికి వ్రాసిన లేఖలో ఇలా అంటారు: "వర్షం కురిసినప్పుడల్లా నాకు క్రొత్తగా ఆనందంగా కనబడుతుంది. కిటికీలోంచి వానతుంపరలు కలిసిన చలిగాలి నా మొహాన కొడుతూవుంది. 'వార్షుకాభ్రం నాకు యక్షపతి సౌందర్యాన్ని రచిస్తుంది' అని వ్రాశాను ఆ మధ్య. నల్లని మబ్బులు, వాన, ఏమిటో తెలియదు."

9.2 మిరియాల రామకృష్ణగారికి 18–6–1961 నాడు వ్రాసిన లేఖలో – "ఆకాశాన నల్లని మబ్బులు – ఒక్కసారిగా వాన – మనస్సులూ భూమీ చల్లబడి పచ్చబడి ఎంత హాయిగా వుంది! నాకు వర్షకాలం అంటే ఎంతో యిష్టం. స్నానం చేసి వచ్చిన యౌవనవతి శరీరంలాగా విచిత్రమైన అందం, ఆకర్షణ!"

9.3 శ్రీమతి మోగంటి మాణిక్యాంబాదేవిగారికి 9–5–1961 నాడు ఉదయం 7.00 గంటలకు వ్రాసిన లేఖలో –

"వేకువ తొలి జామునే మెలకువ వచ్చింది. చీకటులొత్తిగిల్లి, మెత్తని వెల్తురు

తూర్పున, ఆడదాని అనురాగంలాగ వ్యాపిస్తోంది. నక్షత్రాలు కాంతి విహీనమై గాజుపూసల్లాగ వున్నాయి. అక్కడక్కడ ఒక మబ్బు, ఏ అప్సరస ఒంటిమీదనుండో జారిన చీరకొంగులాగ గాలిలో తేలిపోతూంది. మనోహరమూ, శాంతమూ అయిన ఈ ప్రకృతిలో లీనమౌతున్న నా మనస్సుకు మళ్ళీ అశాంతి!"

10. తిలక్ సాహిత్య సిద్ధాంతాలు - ఆయన సాహిత్య నిర్మాణానికి పునాదులు:-

ఇవి ఆయన లేఖల్లో అడుగడుగునా ప్రత్యక్షమవుతాయి.

10.1 "కుళ్ళిన ముసలిదైపోయిన సంఘాన్ని, బూజుపట్టిన భావాల్నీ రూపుమాపే బాధ్యతకూడా రచయితదే" (-మాణిక్యాంబాదేవిగారికి, 26-2-1961.)

10.2 "కృష్ణశాస్త్రిగారిని జాగ్రత్తగా చదవండి. ఎన్నిసార్లు చదివితే అంత మాధుర్యాన్ని ప్రసాదిస్తుంది." (-అదే లేఖ)

10.3 "ఆర్ద్రమైన ప్రతిహృదయమూ, అశ్రుసిక్తమైన ప్రతినయనమూ, సుందరమైన ప్రతిదృశ్యమూ నన్ను కలలోగూడ వశం చేసుకుంటాయి." - (మాణిక్యాంబగారికి, 24-3-1961.)

10.4 "కరుణ, సౌందర్యమూ, మానవత్వమూ - ఈ మూడూ ప్రాతిపదికలుగా నా ఆదర్శాన్ని ఆలోచనల్నీ నిర్మించుకున్నాను." (-ఆమెకే, 9-5-1961.)

10.5 "ఒక ప్రక్క సాహిత్యమూ, కీట్సూ, షెల్లీ, కృష్ణశాస్త్రి. మరొక ప్రక్క మార్క్సు, లెనిన్, నెహ్రూ, జయప్రకాష్. ఎంతెంత చదివాను? ఎంతెంత ఆలోచించాను? ఈ జీవితానికీ, సమాజానికీ, అర్థం తెలుసుకోడానికి, ఒక అర్థం యివ్వడానికి, ఒక ఆదర్శజ్వాలలో నా బ్రతుకును చుట్టబెట్టి, తోడులేని ఈదారిని నాటినుండీ ప్రయాణం సాగించాను."(-అదే లేఖ)

10.6 "మనిషీ, సంఘమూ, దేశమూ, విశ్వమూ, ఈ సర్వజగత్తు - జ్ఞాన సరస్సులో విరిసిన ప్రేమపద్మంలాగ సత్యం శివం సుందర శీలమై ఉండాలి." (-అదే లేఖ)

11. దుర్భర విషాదం:-

గొప్ప సౌందర్యారాధకుడైన తిలక్ ఒక్కొక్కప్పుడు ఈ సమాజాన్ని చూచి అసహ్యించుకుంటారు. ఎంతో ఆశావాదియైన తిలక్ ఒక్కొక్కసారి నిరాశకు లోనవుతారు. నిస్పృహకు, నిరుత్సాహానికి, దిగులుకు, మానసికమైన

ఒంటరితనానికి గురిఅవుతూవుంటారు. పైకి నవ్వుతూనే లోపల బాధననుభవిస్తూ ఉంటారు.

11.1 **దిగులు – నిరుత్సాహం:–** "సూర్యుడు పశ్చిమ దిశాభిముఖుడౌతున్నాడు. కాస్సేపట్లో కాంతి మాయ మవుతుందనీ, పలుచని చీకట్లు ముసురు కుంటాయనీ – ఈ భావమే ఏదో దిగులునీ – నిరుత్సాహాన్నీ కలిగిస్తూ వుంటోంది... వేళ్ళ సందుల్లోంచి పొడియిసుకలా జారిపోయే కాలాన్నీ, వయస్సునీ, తల్చుకుంటే భయమౌతుంది, సోమసుందర్!" (సో.సు.కి లేఖ, 27-5-1959.)

11.2 **నిరాశ:–** "అన్ని ఋతువులలోనూ కూడా ఎండిపోయిన ఈ మనుష్యులూ ఊళ్ళూ మరీ చికాకు కలిగిస్తున్నాయి. తెలుగుదేశంలో అందం ఆనందం అనేది దొరకవేమో! యింత యిదిగా చచ్చిపురుగుపట్టిన సామాజిక జీవితం ఒక్కొక్కసారి నాలో భయంకరమైన నిరాశని కలిగిస్తోంది." – (వరవరరావుకు లేఖ, 27-5-1966).

11.3 **చికాకు – బాధ:–** "తమ్ముడూ! ఎంతో చికాకునీ బాధనీ లోపల్లోపల సహిస్తున్నాను. వైయక్తికమైన స్వప్నలోకంలో ఎన్నాళ్ళు వుండగలడు ఎవడైనా?" – (అదే లేఖ).

11.4 **మానసికమైన ఒంటరితనం:–** "ఇక్కడ దట్టంగా పరుచుకున్న మనుష్యారణ్యం మధ్య రోడ్లదుమ్మూ, దోమలూ, రాజకీయాలూ, జుమ్మని చెలరేగే ఈ వాతావరణంలోకన్నా, అడవుల పచ్చదనమూ, ప్రకృతీ సన్నిహితంగావున్న మీ జీవితమే సుఖకరమేమో అనిపిస్తుంది, యింతదూరంనుండీ. కాని అదీ కష్టతరమే మీరు వ్రాసినట్టు. మానసికమైన ఒంటరితనం భరించడం నిజంగా కష్టమే." – (అరణ్యప్రాంతంలో హైస్కూలులో తెలుగు పండితుడుగా పనిచేస్తున్న మిరియాల రామకృష్ణగారికి 28-4-1961 నాడు వ్రాసిన లేఖ).

11.5 **ఏకాంతం:–** "ఈరోజు నేను నలుగురిలో తిరుగుతున్నా, చుట్టూ ముళ్ళకంచెలలాంటి సమస్యల్ని చుట్టుకొని వున్నాను. ఏ విపరీతమైన విధి మనల్ని ఇలాగ నడిపిస్తోంది అనుకుంటాను. వెనక్కు తిరిగి చూస్తే ఎన్ని అశ్రుసిక్తరాత్రులు, ఎన్ని విఫల నిశ్వాససహిత ఏకాంతాలు నా జీవితంలో కూడా!" (–మాణిక్యాంబగారికి లేఖ, 18-3-1961).

11.6 **పైకినవ్వు-లోపల బాధ:-** "పైకి నవ్వుతున్నా, అలలతో విరగబడుతూ ఆడుతున్న సముద్రం కడుపులోవున్న బడబాగ్ని జ్వాల నెవరు గుర్తిస్తారు? -అని వాపోతాడు ఒక కవి. అలా వుంది నా పరిస్థితి కూడా" (-ఆమెకే వ్రాసిన లేఖ, 24-3-1961).

11.7 **తెలియని దిగులు:-** "మబ్బుపట్టిన ఆకాశంలో ఈ రోజంతా తెలియని దిగులు."(-ఆమెకే వ్రాసిన లేఖ, 20-2-1962).

12. వ్యక్తిత్వం:-

తిలక్‌గారు మిత్రులకు వ్రాసిన లేఖలలో కొన్నిచోట్ల ఆయన వ్యక్తిత్వం స్పష్టమవుతుంతి. ఎన్ని కష్టాలు వచ్చినా క్రుంగిపోని మనస్తత్వం, ఆశాభావం, సౌందర్యాన్వేషణ-ఆయన వ్యక్తిత్వ ముఖ్యలక్షణాలు. "జీవితంలో ఎన్నో అనుభవాలు, గాయాలు, శోణచ్ఛవులు తగ్గకపోయినా, క్రుంగిపోవడం నా స్వభావానికి వ్యతిరేకం. అయినా వాటి ప్రభావం ప్రచ్ఛన్నంగా వుంటుంది కదా!" (-మిరియాల రామకృష్ణగారికి వ్రాసిన లేఖ, 5-12-1961.) తిలక్ వ్యక్తిత్వంలోని ఆశాభావానికి, సౌందర్యాన్వేషణకు (ప్రకృతి సౌందర్యం) ఉదాహరణాలు ఇంతకు ముందే ఇచ్చాను.

13. తాత్త్వికత:-

13.1 "కాలాన్ని వెనక్కు మడవగలిగితే ఎంత బాగుండును!" (-వరవరరావుకు, 2-1-1965).

13.2 "నాలుగు రోజులనుండి కంటివ్యాధితో బాధపడుతున్నాను. వెలుగు చూడకూడదు. కాని లోపలి వెలుగు వుందిగా! దానిమీద నిషేధం లేదు." (-ఆయనకే, తేదీలేదు).

13.3 "ఎందుకు మానవుడు బ్రతుకుతాడు? ఎందుకు చచ్చిపోతాడు? ఈ ఆనందం, ఈ ఆశలూ, ఈ బాంధవ్యాలూ ఏమవుతాయి? అంతా పెద్ద అబద్ధంగా, మోసంగా, మిథ్యగా అనిపించింది. నాకు బ్రతుకు కూడ విరక్తి కలిగించింది." (-మాణిక్యాంబగారికి, 9-5-1961, ఉదయం 7 గంటలు).

13.4 "జీవితానికీ, సృష్టికీ ఒక అర్థం వెదకాలనీ, సమాజానికీ మానవకోటికీ సుఖసంతోషాల్ని అన్వేషించాలనీ ఏదో తహతహ!"(-ఆమెకే, 20-2-1962).

తిలక్ కవిత్వాన్ని గురించి ఒక్కమాటలో చెప్పాలంటే “అద్భుత సౌందర్యం!- దుర్భర విషాదం!”. ఈ మాట ఆయన లేఖలకు కూడా వర్తిస్తుంది. తిలక్‌గారి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని తెలిసికోవడానికి ఆయన రచనలు ఎంత ముఖ్యమో, ఆయన లేఖలుకూడా అంతే ముఖ్యం. ఒక రకంగా రచనలకన్నా లేఖలే ముఖ్యమేమో!

14. దిగంబర కవులమీద Positive Outlook :-

దిగంబర కవులు తమ మొదటి కవితా సంకలనాన్ని ఒక రిక్షాకార్మికుడిచేత ఆవిష్కరించడం Publicity Stunt గా కొట్టిపారేసిన తిలక్ (చూ. నగ్నమునికి వ్రాసిన లేఖ), వరవరరావుకి వ్రాసిన లేఖలో మాత్రం దిగంబర కవులమీద positive outlook కనబరిచారు.

“ఏ సంచలనమైనా సరే Static Atmosphere కన్నా వెయ్యిరెట్లు నయంగదా! Angry Young Men (Beatnicks) అని ఈ దిగంబర కవుల ఉద్యమాన్ని చూడగానే తెలుస్తుంది. ఏ ఉద్యమం అయినా బలమైన నిజమైన కవులుంటే బ్రతుకుతుందనీ, నిలుస్తుందనీ ఈ ఉద్యమం మీద ఒక వ్యాసం వ్రాయాలను కుంటున్నాను” (ఈ లేఖకు తేదీ లేదు).

15. నచ్చిన హైదరాబాద్ నగరం:-

మద్రాసు, బాంబే, ఢిల్లీ, కలకత్తాలకన్నా హైదరాబాద్ నగరం తిలక్‌గారికి బాగా నచ్చింది. తిలక్‌గారు తణుకునుండి ఏలూరులో లాయరుగా ఉన్న పెద్ద తమ్ముడు శివకుమారశాస్త్రిగారింటికి వెళ్ళారు. అక్కడినుండి జనతా ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళ్ళారు. అక్కడ వారి చిన్న తమ్ముడు పార్థసారథిగారు హైకోర్టులో లాయరుగా ఉండేవారు. (“శ్రీమతి లక్ష్మీపార్థసారథి” అనే ఐ.ఏ.యస్. ఆఫీసరు వీరి కుమార్తెయే!). హైదరాబాద్‌నుండి తణుకులో ఉన్న శ్రీమతి మోగంటి మాణిక్యాంబాదేవిగారికి 27-3-1961 నాడు వ్రాసిన లేఖలో హైదరాబాదు నగరం ఆయనకు నచ్చిన విషయాన్ని స్పష్టంగా చెప్పారు. “విశాలమైన రోడ్లూ భవనాలూ కార్లూ థియేటర్లూ రాజకీయాలూ నాయకులూ నాగరికులూ – యివన్నీ గుప్పుమని గుబాళించే వాతావరణంలోనికి వచ్చాను. బొంబాయి, ఢిల్లీలలో లాగ యిక్కడ కృత్రిమత్వం తక్కువ. తొందర తొట్రుపాటూ కూడా తక్కువ. జాగీర్‌దారుల జనానాలలోని ఒక అలసట అందమూ ఈ నగరంలో కనిపిస్తుంది. మనిషి బ్రతుకుతూ, బ్రతుకుతున్నానని జ్ఞాపకం చేసుకునేటంతటి తీరిక కూడా వుంది.”

"అమృతం కురిసిన రాత్రి" కవితా సంపుటిలోని "నగరంమీద ప్రేమగీతం" అనే కవిత హైదరాబాద్ సౌందర్యవర్ణనమే!

16. తిలక్ లేఖలనుబట్టి మనకు తెలియవచ్చే మరికొన్ని విషయాలు:–

(1) తన "సుప్తశిల" నాటిక గొప్ప రచన అనే నమ్మకం తిలక్‌గారికి ఉంది.

(2) "మలుపు" ("చీలినబాట") నవలకు ఢిల్లీ నేపథ్యం కావాలి. ఆ నేపథ్యానుభవం కోసం ఢిల్లీ వెళ్ళాలనుకున్నారు. అందువల్ల ఆనవలను 60 పుటలు వ్రాసి నిలిపివేశారు.

(3) ప్రఖ్యాతవైణికుడు శ్రీఈమని శంకరశాస్త్రిగారు తిలక్‌గారి మేనకోడలి భర్త.

(4) ఏలూరులోని ప్రజాప్రచురణలవారు తిలక్‌కథలను రెండు సంపుటాలుగాను ("సుందరీ–సుబ్బారావు" – "ఊరిచివరియిల్లు"), "సుశీలపెళ్ళి" నాటకాన్ని, "సుచిత్ర ప్రణయం" నాటికను ప్రచురించారు. విశాలాంధ్రవారు తిలక్ కవిత్వాన్ని ప్రచురించబోతున్నారు.

(5) 1963 ఏప్రిల్ నెల "సాహితి" మాసపత్రికలో తిలక్‌గారి వ్యాసం వచ్చింది. (వ్యాసం పేరు చెప్పలేదు). కాని ఆ వ్యాసం పేరు "యుద్ధమూ – రచయిత" అని ఇటీవల మిత్రులు శ్రీ ఎం.వి. రాయుడు (మనసు ఫౌండేషన్ అధినేత)గారి ద్వారా తెలుసుకున్నాను.

తిలక్‌గారు లేఖలు వ్రాసిన కవులందరూ నాకు సుపరిచితులే – ఇద్దరు తప్ప: మోగంటి మాణిక్యాంబాదేవిగారు, శిష్ట్లా జగన్నాథంగారు నాకు తెలియరు. మాణిక్యాంబగారు తణుకులోనే ఉన్నా నేనెప్పుడూ వారిని చూడలేదు. ఆమె ఎప్పుడూ తిలక్‌గారి యింటికి రాలేదు. తిలక్‌గారే ఆమె యింటికి వెళుతూ ఉన్నట్టుగా లేఖల్లో ఉంది. ఆమె తిలక్‌గారికి గొప్ప అభిమాని అనీ, ఎక్కడో టీచరుగా పనిచేస్తున్నారనీ, ఆమెకు "కామాక్షి" అనే కూతురు ఉందనీ, ఆమె శిష్యుడో కొడుకో (?) "వసంతరావు" అనీ, ఆమె తాను వ్రాసిన గేయాలను పద్యాలను తిలక్‌గారిచేత దిద్దించుకునేవారనీ, తన రచలను వాళ్ళ అమ్మాయి ద్వారాను, శిష్యుని ద్వారాను తిలక్‌గారి యింటికి పంపేవారనీ, తిలక్‌గారు ఆమెకు మంచి మంచి పుస్తకాలు పంపి చదవమని ప్రోత్సహించేవారనీ, ఆమె తిలక్‌గారిని గురువుగా భావించేవారనీ, తిలక్‌మాత్రం "నేను గురువునుకాను, నన్ను మిత్రునిగానే ఉండనివ్వండి" అనేవారనీ – తిలక్ ఆమెకు వ్రాసిన లేఖలనుబట్టి తెలుస్తోంది.

1966 ఏప్రిల్ 24వ తేదీని జరిగిన, తిలక్‌గారి అమ్మాయి చంద్రలేఖ వివాహం ఆయనలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. కవి మిత్రులందరినీ ఆహ్వానిస్తూ లేఖలు వ్రాశారు. కాని అప్పటికే ఆయన ఆరోగ్యం విషమించిన విషయం కూడా లేఖల్లో తెలుస్తోంది. జూన్ 30వ తేదీ రాత్రి వేళ డాక్టరు జి. సోమరాజుగారి ఆసుపత్రికి వెళ్ళి, ఇంజెక్షన్ చేయించుకొని వస్తూ, దారిలో రిక్షాలోనే చనిపోయారు. తెల్లవారి జూలై 1వ తేదీని తిలక్ మరణవార్త లోకానికి తెలిసింది. తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రిసెర్చి చేస్తున్న నేను, జూలై 2వ తేదీ Indian Express లో తిలక్ మరణవార్త విని గిలగిలలాడిపోయాను. శ్రీశ్రీ చెప్పినట్లుగా – "యువలోక ప్రతినిధి / నవభావామృత రసధుని / కవితాసతి నొసట నిత్య / రసగంగాధర తిలకం / ... నడినింగిని మాయమయా"డు. అప్పటికి తిలక్‌గారికి 45 ఏళ్ళు కూడా నిండలేదు!

17. అనుబంధం:– తిలక్‌గారు నాకు వ్రాసిన నాలుగు లేఖలు:

తిలక్‌గారు నాకు నాలుగు లేఖలు వ్రాశారు.

నేను 1955లో "పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కళాశాల" (W.G.B. College) లో బి.ఏ. (స్పెషల్ తెలుగు) చదువుతున్నాను. ఆ సంవత్సరం జూన్ నెల 'భారతి'లో మొట్టమొదటి పుటలో "ఆర్తగీతం" అనే తిలక్‌గారి వచనకవిత వచ్చింది. అది నన్ను మిక్కిలిగా ప్రభావితం చేసింది. దానిని కంఠస్థంచేసి మిత్రుల దగ్గర చదువుతూ ఉండేవాడిని. కాని ఆ గేయ రచయిత "బాలగంగాధర తిలక్" ఎవరో నాకు తెలియలేదు. ఆయన మా తణుకులోనే ఉన్న సంగతి కూడా నాకు తెలియలేదు. సెప్టెంబరు నెలలో దసరా సెలవులకు మా ఊరు వెళ్ళాను. మిత్రుడు శ్రీపాద కృష్ణమూర్తి దగ్గర "ఆర్తగీతం" గురించి చెప్పాను. "తిలక్ మన ఊరివాడే, టౌన్ హాలు ప్రక్కనే ఇల్లు. నేను వాళ్ళ పిల్లలకి ట్యూషన్ చెపుతున్నాను. రా, పరిచయం చేస్తాను" అని నన్ను తీసికొని వెళ్ళి తిలక్‌గారిని చూపించాడు. అప్పటి నుండి 1961లో నేను తెలుగు ఏం.ఏ.లో చేరడానికి తిరుపతి వెళ్ళేవరకూ ఆరు సంవత్సరాలపాటు తిలక్‌గారికి ప్రియశిష్యుడుగా, ఆత్మీయ మిత్రుడుగా ఉండిపోయాను. నేను 1957 నుండి 1961 వరకూ కొవ్వూరు, ఏలూరు, తణుకు పోస్టాఫీసుల్లో గుమాస్తాగా పనిచేశాను.

అప్పుడు తిలక్‌గారు నాకు చాలా లేఖలు వ్రాశారు. వాటిలో ఒకటి స్మృతిపథంలో ఉంది. మూడు లిఖిత పూర్వకంగా ఉన్నాయి. మిగిలినవి పోయాయి.

లేఖ – 1 (కార్డు)

1957లో నేను కొవ్వూరు పోస్టాఫీసులో పనిచేస్తున్నాను. అది వర్షాకాలం. శ్రీకృష్ణదేవరాయలవారిలాగే తిలక్‌గారికి వర్షం అంటే చాలా యిష్టం. ఆ వానకాలాన్ని వర్ణిస్తూ నాకు ఒక కార్డు వ్రాశారు. అందులో ఒక ఉపమానం మిక్కిలి ఆకర్షించి, స్మృతిపథంలో ఉండిపోయింది.

వాన బాగా కురిసింది. ప్రకృతి అంతా తడిసి ముద్దయిపోయింది. నీటి బిందువులతో తళతళ మెరుస్తోంది. ఆ వర్షాకాలపు ప్రకృతి ఎలా ఉన్నదో తిలక్ గారు. ఒక గొప్ప ఉపమానంతో, సౌందర్య దృష్టితో చెప్పారు. 'ప్రకృతి ఎలా ఉన్నదంటే, నూతి దగ్గర తలారా స్నానంచేసి, నీళ్ళు ఓడుతూ, తడిబట్టలతో ఇంట్లోకి వస్తున్న అందమైన యువగృహిణిలా ఉంది!" అని వ్రాశారు నా లేఖలో. ప్రకృతి స్త్రీ స్వరూపమే కదా! భగవంతుడు పురుషుడు, ప్రకృతి స్త్రీ అని భారతీయ సంప్రదాయం. (ఇదే రకమైన వర్షాకాల వర్ణన 18-6-1961లో మిరియాల రామకృష్ణగారికి వ్రాసిన లేఖలో కూడా చేశారు.)

లేఖ – 2 (కార్డు)

(1959లో నేను ఏలూరు Head Post Office లో గుమాస్తాగా పనిచేస్తూ ఉండగా వ్రాసిన లేఖ)

To

Tangirala Subba Rao, B.A.	Tanuku
Clerk	10-3-'59

Post Office

ELLORE

West Godavari Dt.

శ్రీ 'తంగిరాల'కు:

ప్రియమిత్రమా!

నీ ఉపన్యాసమూ, ఏకపాత్రాభినయమూ 12-3-'59 ఆదివారం నాటి programme లో print అయింది. కాబట్టి ఆదివారంనాటి ఉదయానికి తప్పక రావలెను. ఆరోజున శ్రీ సోమసుందర్, 'కనక ప్రవాసి' కూడా వస్తున్నారు.

భవదీయుడు

Tilak

లేఖ-3 (పావుతావు కాగితం)

("వీరపాండ్య కట్టబ్రహ్మన" అనే సినిమాకు వెడదామని నన్ను పిలుస్తూ, చిన్న కథారూపంలో వ్రాసిన, చమత్కారమైన లేఖ. తేదీ ఉంది కాని, సంవత్సరము, నెల లేవు. నేను అప్పుడు తణుకులోనే ఉన్నాను. తణుకు పోస్టాఫీసులో పనిచేస్తున్నాను. నాతోపాటు 'పమ్మి పాపారావు' అనే మిత్రుడు, తిలక్ అభిమాని కూడా తణుకు పోస్టాఫీసులో పనిచేస్తున్నాడు. తిలక్ నాటకాల్లో నటించేవాడు. ఈ లేఖ వ్రాసినది 1959 చివరలో కాని, 1960లో కాని అయివుంటుంది. నెల తెలియదు. తేదీ మాత్రం 17. ఈలేఖకు ఒక శీర్షిక కూడా ఉంచడం విశేషం.)

'సినిమా - సుబ్బారావూ' కథ

చిరంజీవి సుబ్బారావుకి శ్రీ గంగాధరం గారిని చూస్తే అపరిమితమైన భక్తీ, అభిమానమూ. (ఇక్కడ "గంగాధరంగారు" అంటే "దేవరకొండ బాలగంగాధర తిలక్" - తంగిరాల)

ఇన్నేళ్ళ పరిచయమూ, గంగాధరంగారి రచనలే కాదు దీనికి కారణం; కేవలం తననే అనగా సుబ్బారావునే హీరోని చేసి ఒక గేయమూ, కథా కూడా వ్రాశారు కదా!

అందుకే "కట్టబ్రహ్మన" సినీమాకి వెళ్లాలని ఉన్న సుబ్బారావుకి గంగాధరం గారిని పిలవాలని ఉంది. కాని ఇద్దరికీ అయే ఖర్చు తానొక్కడే భరించలేడాయిరి!

పోనీ అంటే ఆయన కూడా ఆర్థికంగా ప్రస్తుతం 'నాస్తినాస్తి' అంటున్నాడు. తన కివ్వవలసిన యాభై కూడా యివ్వలేదు యింకా. తను కాబట్టే యీ మాత్రం ఆలస్యం చేశాడాయన-ఏదో యిబ్బందిలో ఉండి. ఇదివరకాయన ఎన్ని సినిమాలకి తీసుకు వెళ్లలేదూ?

ఎలాగ యిప్పుడు యీ సమస్య పరిష్కారం -

అని ఆలోచించాడు సుబ్బారావు.

"పోనీ మీ టిక్కెట్టు మీరు, నాది నేనూ... ఏమంటారు?"

- అంటూ నసిగాడు చిరంజీవి సుబ్బారావు.

చిరునవ్వు నవ్వుకుని "అలాగే లేవోయ్!" అన్నాడు గంగాధరం.

"అయితే ఆరింటికల్లా వచ్చేస్తాను, రెడీగా ఉండండి"

- అన్నాడు చిరంజీవి.

"ఓ యస్! ఓ యస్!" అన్నాడు శ్రీమాన్.

"మరి పాపారావు కూడా యిదే నిబంధన మీద పిక్చర్‌కి వస్తాడేమో!" అన్నాడు చిరంజీవి.

"ఓయస్! అడిగి చూడవోయ్!" అన్నాడు శ్రీమాన్.

17వ తేదీ సాయంత్రం రిక్షాలో ఇద్దరూ వెళుతూంటే చూసి జనం "ఆహా! వీరి సౌహార్దం ఎటువంటిది చెప్మా" అని ముక్కుమీద వేలేసుగోబోయి కంట్లో పొడుచుకున్నారు-ట!

ఇది సుఖాంతం

Please send this story to any journal you like, but be sharp here by Six O'Clock.

– Tilak

లేఖ-4 (రెండున్నర అరఠావు కాగితాలు)

1961వ సంవత్సరం మే నెల 18వ తేదీనాడు ఉదయం 7 గంటలకు తణుకులోనే ఉన్న నాకు వ్రాసిన లేఖ. తిలక్‌గారి ప్రోద్బలంతో నేను తణుకు ప్రక్కనే ఉన్న 'దువ్వ'లో ఉండే కోటీశ్వరరావు అనే ధనిక యువమిత్రుని దగ్గరకు వెళ్ళి ఆర్థికసంబంధమైన లావాదేవీచర్చలు జరపవలసి వచ్చింది. అవి ఫలించలేదు. నా తెలివి తక్కువతనంవల్ల నేను చల్లా నరసింహారావు అనే కవి మిత్రుని (పద్యకవి, తిలక్‌గారి అభిమాని) నమ్మి, అతని దగ్గర ఈ ఆర్థిక చర్చల విషయంగా నా మనసులోని మాట ఒకటి చెప్పాను. అతడు వెంటనే తిలక్‌గారి దగ్గరకు వెళ్ళి, నామీద ఉన్నవీ లేనివీ కల్పించి చాడీలు చెప్పాడు. ఆ చాడీలను నమ్మి తిలక్‌గారు నా మీద కోపగించి ఈ పెద్ద లేఖ వ్రాశారు. ఈ లేఖ అంతా వైయక్తికమైన విషయాలతో కూడి ఉన్నందున ప్రచురణయోగ్యం కాదని భావిస్తున్నాను. కవులు, రచయితలు వ్రాసిన లేఖలు లౌకిక విషయాలతో కాకుండా, సాహిత్య సంబంధమైన విషయాలతో ఉన్నప్పుడే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటాయి. ఈ లేఖ చివర తిలక్‌గారు ఆంగ్లంలో ఇలా సంతకం చేశారు:

Thanking You,

D. Balagangadhara Tilak

7 O' clock Morning, 18th May '61

Tanuku.

గమనిక:- నా మీద కోపంతో నన్ను వ్యంగ్యంగా నిందిస్తూ రెండున్నర పుటల పెద్ద లేఖ వ్రాసినా, ఆ లేఖ చివర్లో నన్ను ఆశీర్వదిస్తూ ఒక వాక్యం వ్రాశారు తిలక్‌గారు: "మీ శుభం కోరుతూ, మీ భవిష్యత్తు ఉత్తమాదర్శోన్మీలనంతో రాణించాలని కోరుతున్నాను..." ఈ ఆశీర్వచనంవల్లనే కాబోలు నేను జీవితంలో పైకి వచ్చాను. తిలక్‌గారు గొప్పకవి. కవి ఆశీస్సు అమోఘమైనది. "కవి వచనస్సవిత్రు కాంతిపూరమిది/ స్వేచ్ఛగా జలకమాడండి!" అన్నారు "వసుధైక గీతం" అనే కవితలో.

ఆ తరువాతి మాసంలోనే అంటే 1961 జూన్ నెలలో నేను తెలుగు ఎం.ఏ.లో చేరడానికి తిరుపతి వెళ్ళిపోయాను. అప్పటినుండి 1966లో తిలక్‌గారు మరణించేంత వరకూ మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు. ఈ దుఃస్థితికి కారణం చల్లా నరసింహారావు అనే కొండెకాడు!

(ఎప్పుడూ నన్ను శిష్యునిగా భావించి ఆప్యాయంగా "నువ్వు" అని ఏక వచనంలో లేఖలు వ్రాసే తిలక్‌గారు, నామీద కోపం రావడం వల్ల ఈ సుదీర్ఘమైన లేఖలో నన్ను "మీరు" అని సంబోధించారు. అది నన్ను చాలా బాధించింది.)

ఒకసారి నేను తణుకు వెళ్ళి, తిలక్‌గారిని ప్రత్యక్షంగా దర్శించి, చల్లా నరసింహారావు పన్నిన కుట్రను భగ్నంచేసి, మా స్నేహాన్ని మళ్ళీ పునరుద్ధరించుకొని వుంటే బాగుండేది. కాని ఊపిరి సలుపని ఎం.ఏ. చదువువల్ల, తరువాత పిహెచ్.డి. పరిశోధనవల్ల నాకు తీరికలేక ఈ పనిచేయలేకపోయాను. ఇప్పుడు విచారిస్తే ఏం లాభం? గతజల సేతుబంధనం! పైగా తిలక్‌గారు 45 సంవత్సరాల వయస్సులోనే చనిపోతారని నేను కలలో కూడా ఊహించలేదు. సోమసుందర్ గారికి, వరవరరావుగారికి వ్రాసిన లేఖలు చదువుతూవుంటే, తిలక్‌గారి స్నేహాన్ని పునరుద్ధరించుకుంటే నాకు కూడా అంత అందమైన, ఆప్యాయమైన లేఖలు ఎన్ని వచ్చివుండేవో కదా - అని బాధ కలుగుతూ వుంటుంది.

"ఇజంలో యింప్రిజన్ అయితే యింగితజ్ఞానం నశిస్తుంది!
ప్రిజంలాంటిది జీవితం, వేర్వేరు కోణాలు ప్రదర్శిస్తుంది!!"

- (న్యూ సిలబస్)

అనుబంధం: I

తిలక్ అలభ్య పద్యకావ్యం 'మండోదరి'

కీ. శే. దేవరకొండ బాలగంగాధర్ తిలక్‌గారి మిక్కిలి స్వల్పమైన జీవితంలో (1921–1966 = కేవలం 45 సంవత్సరాలు మాత్రమే) మూడు దశలున్నాయి:–

1. మొదటి సాహిత్యదశ (భావకవిత్వ దశ):– 1938 నుండి 1946 వరకు (వారి 17వ ఏట నుండి 25వ ఏడు వరకు) = 8 సంవత్సరాలు.

2. అనారోగ్య విరామదశ:– 1946 నుండి 1954 వరకు (వారి 25వ ఏట నుండి 33వ ఏడు వరకు) = 8 సంవత్సరాలు.

3. రెండవ సాహిత్యదశ (అభ్యుదయ కవిత్వ దశ):– 1954 నుండి 1966 వరకు (వారి 33వ ఏట నుండి 45వ ఏడువరకు) = 12 సంవత్సరాలు.

తిలక్ తన మొదటి సాహిత్యదశలో, అంటే 1938 నుండి 1946 వరకు పద్యకవితలు ఎక్కువగా వ్రాశారు. "గోరువంకలు" పేరుతో 50 పద్యాలు వ్రాశానని నాతో చెపుతూ ఉండేవారు. అవి "ప్రతిభ" అనే సాహిత్య పత్రికలో 1942–44 మధ్య ప్రకటింపబడ్డాయి. కాని నాకు 39 పద్యాలు మాత్రమే లభించాయి.

ఈ మొదటి సాహిత్యదశలోనే "మండోదరి" పేరుతో సుమారు 300 పద్యాలు వ్రాశానని నాతోను, నా మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తితోను తరచుగా అంటూ ఉండేవారు. కాని అవన్నీ ఆయన అనారోగ్య విరామదశలో (1946–1954 మధ్య) నష్టమైపోయాయని ఎంతో బాధపడుతూ ఉండేవారు. తాను రోగంతో మంచం పట్టినప్పుడు వారితల్లిగారు పాతన్యూస్ పేపర్లతో కలిపి "మండోదరి" వ్రాతప్రతిని కూడా, అందులో తిలక్‌గారి పద్యాలున్నాయని తెలియక, పొరపాటున అమ్మివేశారట! ఈ విషయం తిలక్‌గారు నాతో చెప్పిన జ్ఞాపకం. కాని మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తి ఇంకోరకంగా చెపుతున్నాడు. 2010 డిసెంబరు నెలలో తిలక్ అవార్డు ప్రదానం సందర్భంగా మేమిద్దరం తణుకులో కలిశాము. అప్పుడు అతడు నాతో ఇలా చెప్పాడు: "తిలక్‌గారింట్లో రోజూ పొద్దున్నే కాఫీకాచడంకోసం కుంపటి వెలిగించడానికి చిత్తుకాగితాల్ని ఉపయోగించేవారు. ఆ చిత్తుకాగితాల్లో ఈ 'మండోదరి' కావ్యం కూడా చేరిపోయింది. దానిలో మొదటి పేజీ మాత్రం

మిగిలింది. ఆ పేజీలో మూడు పద్యాలున్నాయి. ఆ మూడు పద్యాలూ నేను ధారణ చేశాను. ఇప్పుడు ఆ ధారణలో నుండి ఒక్కపద్యం మాత్రం చెప్పగలను" అని ఈ క్రింది పద్యాన్ని మంచి కావ్యధోరణిలో చక్కగా చదివాడు:

ఉ॥ **"సింహళ సిందువారముల సీకృతిలో చెలరేగి సాగి, ఆ**
సింహళ సింధువార రసశీకర సేచనలో కలంగి, ఆ
రంహదుదార మారుత శలాక యొకందు పతాక తాకె, ఓ
సింహళనాథ! లెమ్ము! శివసేవనవేళ గమించి పోయెదున్!"

తరువాత మిగిలిన రెండు పద్యాలూ జ్ఞాపకం చేసికొని, మొత్తం మూడు పద్యాలూ కలిపి, 21-10-2012నాడు నాకు వ్రాసిన ఒక లేఖతో చేర్చి పంపాడు. ఆ లేఖలో తిలక్‌ను గురించి, నష్టకావ్యం 'మండోదరి'ని గురించి వ్రాశాడు. అతని లేఖను దిగువ యథాతథంగా ఇస్తున్నాను. ఇది తిలక్‌ను గురించి మంచి సమాచారం ఇస్తున్న చిన్నవ్యాసం లాంటి లేఖ:-

శ్రీః

విశాఖ
26-10-'12

చి॥ సుబ్బారావుకి -

అనేక శుభాశీస్సులు - తిలక్‌గారి రచనలన్నీ ఎమెస్కోవాళ్ళు ప్రచురించ పూనడం అభినందనీయం.

'మండోదరి' కావ్యానికి ఆయనే నాతో అప్పుడప్పుడు చెప్పిన విషయాలు గుర్తుంచుకొని 'ఉపోద్ఘాతం' చిన్నది రాశాను. ఆ ఉపోద్ఘాతంతోపాటు ఆ పద్యాలు మూడూ 'గోరువంకలు'లో చేరిస్తే బాగుంటుంది.

కృష్ణశాస్త్రిగారిని గురించిన వ్యాసం జెరాక్స్ కాపీయే ఇక్కడ వుంది. అదీ, తిలక్‌గారు కాలంచేసినప్పుడు 'కాళోజీ', గంగుల బుచ్చిరెడ్డి రాసిన రచనలు పంపిస్తున్నాను - ముట్టుకుంటే చిరిగిపోతున్నాయి అవి - 46 ఏళ్ళక్రితంవి కదా!

తిలక్ కొడుకు సత్యాన్ని మరి మరీ అడిగినట్లు చెప్పు - ఈ కవరు అందగానే ఫోన్ చేసి తెలియజెయ్యి.

ఆప్యాయంగా
శ్రీపాద కృష్ణమూర్తి

శ్రీః

"కీ.శే. బాలగంగాధర తిలక్‌గారితో నాకు కీ.శే. పిలకా గణపతిశాస్త్రిగారి ద్వారా పరిచయం అయింది. రెండవ ప్రపంచయుద్ధకాలంలో ఏ కారణంవల్లనో గణపతిశాస్త్రిగారు కొద్ది నెలలు తణుకులో వున్నారట. అప్పటికే గణపతిశాస్త్రిగారి ప్రథమభార్య కాలంచేశారని – ఆ భార్యకి పుట్టిన కూతురు పదియేండ్ల లోపు వయస్సుకల అమ్మాయి ఎక్కువకాలం తిలక్‌గారి యింట్లోనే గడిపేదనీ – సవతితల్లిగారి మీద అలిగి యింటికి పోనని మారాంచేసేదనీ – తాను ఏదోవిధంగా ఆ అమ్మాయిని అనునయించి పంపేవాడిననీ తిలక్‌గారు నాతో పలుపర్యాయాలు ప్రసక్తానుప్రసక్తంగా చెప్పేవారు. ఆ విషయం అలా వుండనిద్దాం–

అప్పటికే తిలక్‌గారు 'మండోదరి' అనే సుమారు రెండువందల పైచిలుకు పద్యకావ్యం రచించారట. ఈ కావ్యంలోని పద్యాలు మల్లవరపు విశ్వేశ్వరరావు గారికి, పిలకా గణపతిశాస్త్రిగారికి వినిపించేవారట. గణపతిశాస్త్రిగారు కూడ ఈ విషయం – తిలక్‌గారు ఆకస్మికంగా మరణించాక శ్రీ ఉప్పులూరి కాళిదాసుగారు వెలువరించిన తిలక్ స్మారక సంచికలో (ఆనందవాణిలో) – తిలక్‌గారి గురించి వ్రాస్తూ – ప్రస్తావించారు. కాని వారు ఆ కావ్యాన్ని "ఊర్మిళ" అని పొరపాటుగా పేర్కొన్నారు.

నేను తిలక్‌గారితో 1950 నుంచి 1960 దాకా పది సంవత్సరాలు చాలా సన్నిహితంగా – వారి కుటుంబంలో ఒకణ్ణిగా మెలిగినవాడిని. ఆయన ఎప్పుడూ 'మండోదరి' కావ్యాన్ని గురించే చెపుతూ వుండేవారు. ఆయనకి సీత, ద్రౌపది, మండోదరి – ఈ ముగ్గురిపట్లా చాలా అభిమానం, సానుభూతీ వుండేవి.

సీత గురించి 'స్వయంవర' – 'సీత–1', 'సీత–2' అని కావ్యఖండికలు రచించారు. తర్వాత 'మండోదరి' కావ్యం రచించినట్లు చెప్పుతూ వుండేవారు. ఈ కావ్యం రచించిన విషయం డా॥ తంగిరాల సుబ్బారావుకిన్నీ బాగా తెలుసు. తిలక్‌గారితో సుబ్బారావుకి నా ద్వారానే పరిచయం. తొలి రోజుల్లో ఆయనంటే భయపడేవాడు.

ఇంతకీ 'మండోదరి' కావ్యం – శేషించి వున్న కావ్యప్రారంభపద్యాలు మూడింటివల్లా అది చాలా ఉత్తమకావ్యం అని నా అభిప్రాయం. ఆ కావ్యాన్ని ఆయన పావుతావు సైజు రూళ్ల కాగితాలమీద రాసి, ట్వైన్ దారంతో పైన ఒక మూలలో కుట్టారనుకుంటాను. ఆయన జబ్బుపడ్డనాళ్లలో ఆ రాతప్రతి బీరువాలోంచి క్రిందపడిపోయి, చాలా రోజులు దుమ్ముకొట్టుకొని పడివుంది. వారి యింటి

పనిమనిషి దానిలోనుండి రోజూ కొన్ని కాగితాలు చింపి కుంపటి అంటించేస్తూ వుండేది – అందరికీ కాఫీలు కాచడం కోసం. అయితే ఆ కాగితాల కట్ట 'మండోదరి' కావ్యమే అని నేను ఊహించలేకపోయాను.

కావ్యం మొదటి పుట – ఆయన పుస్తకాల బీరువా క్రింద ఊడ్చిస్తూ వుంటే – బయటపడింది. ఆ కాగితం చాలానాళ్లు నా దగ్గరే వుండిపోయింది. తర్వాత శ్రమకోర్చి ఏలూరు, బెజవాడ, గుంటూరు వెళ్ళి ఆయన రచనలు చాలావరకూ సేకరించుకొని వచ్చి – వాటిని ఒక పుస్తకంలో రాసేటప్పుడు – ఆ మండోదరి కావ్యంలోని పద్యాలు మూడూ కూడా ఆ పుస్తకంలో రాసి వుంచాను.

కొన్నాళ్లకి ఆ పుస్తకమూ పోగొట్టుకున్నారాయన* – 'మండోదరి' కావ్యానికి ఇంత ఉపోద్ఘాతం వుంది.

నేను ఎరిగినందాకా కృష్ణశాస్త్రి తర్వాతితరం కవుల్లో ఆయనంతటి ప్రతిభావంతుడు లేడు. ఆయన Born Poet. పద్యరచన చేసినా, వచనపద్యరచన చేసినా ఆయన అందరికంటె ప్రథమస్థానంలో ఉండేవాడు. 'మండోదరి' చాలా గొప్పకావ్యంగా పేరుతెచ్చుకొని వుండేది. ఏమి లాభం? ఆ కావ్యం కనుమరుగై పోవడం తెలుగు సహృదయుల దురదృష్టం!"

'మండోదరి'లో మిగిలిన మూడు పద్యాలు (వ్రాతప్రతి మొదటి పుటలోనివి)

---

* ఈ వ్రాతప్రతిని తిలగ్‌గారు పోగొట్టుకోలేదు. ఆ రోజుల్లో ఏలూరులో ఉండే శ్రీ వెల్చేరు నారాయణరావుగారికి యిచ్చి మరిచిపోయారు. తరువాత జ్ఞాపకం వచ్చి, ఆ ప్రతిని తిరిగి తెప్పించి, తననుగురించి భారతిలో వ్యాసం వ్రాస్తానన్న శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారికి పంపాలని తిలక్ యత్నించారు. కాని యింతలోనే చనిపోయారు. ఈ విషయాలు శ్రీ వా.స.మూర్తిగారు 1966లో తిలక్‌గారి యింటికి వెళ్ళి ఆయనతో జరిపిన ఇష్టాగోష్ఠివల్ల తెలుస్తోంది. ఈ యిష్టాగోష్ఠి "తిలక్‌తో కొన్ని గంటలు" అనే పేరుతో 1969లో 'ఆనందవాణి' తిలక్ ప్రత్యేక సంచికలో ప్రచురింపబడింది. (చూ. శ్రీ కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ సంపాదకత్వంలో వెలువడిన 'తిలక్ సాహితీ సందర్శనం' పుటలు 270–283, విశాలాంధ్ర ప్రచురణ, నవంబరు 2016.) తిలక్‌గారిచ్చిన వ్రాతప్రతిని గురించి ఇటీవల నేను, చాలా ఏండ్లు అమెరికాలో ఉండి, ఇప్పుడు ఏలూరులో స్థిరపడిన ప్రొ॥ వెల్చేరు నారాయణరావుగారిని అడిగాను. "అవును, ఇచ్చారు. కాని తిలక్ చనిపోగానే నేను ఆ వ్రాతప్రతిని 'స్మైల్'కి ఇచ్చాను. ఆయన దానిని విశాలాంధ్ర ప్రచురణాలయంవారికి ఇచ్చాడు. దాని ఆధారంగానే వారు 1968లో "అమృతం కురిసిన రాత్రి"ని మొదటిసారి ముద్రించారు" అని చెప్పారు నారాయణరావుగారు. **– తంగిరాల**

1. నిశినిశి యెల్ల వీచిన వనీ మృదుచందన ధూపమాలికల్
దెసల మొగిళ్ళవోలె కొసతేలెను తెల్లని వెండి అంచులన్,
మసిమసివోని నిద్దురల మైకపు మాటున స్వప్నరమ్య రా
క్షస వనితాధరమ్ములొక చక్కని నవ్వున వెల్గినట్టులై.

ప్రతిపదార్థములు: నిశినిశి యెల్లన్ = ప్రతిరాత్రీ; వీచిన = వ్యాపించిన; వనీ = పూదోటలలోని (అడవులలోని); మృదు = మెత్తని; చందన ధూపమాలికల్ = మంచిగందపు పొగల వరుసలు; తెల్లని వెండియంచులన్ = తెల్లని వెండితో ఏర్పరచిన అంచులతో; దెసలన్ = దిక్కులయందు; మొగిళ్ళవోలె = మబ్బులవలె; మసిమసి+పోని = చీకటి పూర్తిగా పోనట్టి; నిద్దురలన్ = నిద్రలలో (పూర్తిగా మెలకువరాని నిద్రలలో అని భావం); మైకపు మాటునన్ = మత్తు చాటున; స్వప్నరమ్యరాక్షస = కలలో రమణీయంగా ఉన్న రాక్షసజాతికి చెందిన; వనితా+అధరమ్ములు = స్త్రీల పెదవులు; ఒక చక్కని నవ్వునన్ = ఒక అందమైన నవ్వుతో; వెల్గిన + అట్టులు + ఐ = వెలిగిన విధంగా మారి; కొసతేలెను = పొడుచుకొని వచ్చాయి.

2. తూరుపుకొండ వెన్క, అల తోచియు తోపని భానుకాంతి, వి-
స్తార సముద్రవారి బడి శైత్యము దాలిచి, వింత వెన్నెలై
పారగ ద్వీపమెల్ల, సురతాలస సుందర కాంతలంత, క
న్నోరగ చేసి చూసి, భ్రమతో నిదురించిరి హాయి క్రమ్మరన్.

ప్రతిపదార్థములు: తూరుపు కొండవెన్కన్ = ఉదయగిరి (తూర్పుకొండ) వెనుక; అల = అలా అలా; తోచియు తోపని భానుకాంతి = ఇంకా బాగా కనపడని సూర్యుని కాంతి; విస్తార సముద్రవారిన్ = విశాలమైన సముద్రపు నీటిలో; పడి = పడి; శైత్యము = చల్లదనాన్ని; తాలిచి = కూర్చుకొని; వింతవెన్నెల + అయి = వింతగా కనిపించే వెన్నెలగా మారి; ద్వీపము + ఎల్లన్ = ద్వీపమంతటా; పారగన్ = వ్యాపించగా; సురత + అలస – సుందర – కాంతలు = రతిక్రీడతో అలసిన అందగత్తెలు; అంతన్ = అప్పుడు; కన్ను+ఓరగన్ చేసి = కంటిని ఓరగా (కొంచెం ఒంపుగా) పెట్టి; చూసి = చూసి; భ్రమతో = ఇంకా తెల్లవారలేదనే భ్రాంతితో; క్రమ్మరన్ = తిరిగి; హాయి = హాయిగా; నిదురించిరి = నిద్రపోయిరి.

3. సింహళ సిందువారముల సీకృతిలో చెలరేగి సాగి, ఆ
సింహళ సింధువార రస శీకర సేచనలో కలంగి, ఆ

రంహదుదార మారుత శలాక యొకండు పతాక తాకె, ఓ
సింహళనాథ! లెమ్ము! శివసేవనవేళ గమించి పోయెడున్.

ప్రతిపదార్థములు: ఓ సింహళనాథ! = ఓ లంకాధిపతీ; ఆ-రంహత్ + ఉదార – మారుత- శలాక-ఒకండు= గొప్పవేగంతో బాగా తెలియవచ్చే ఊచలాగ సాగే ఒక గాలి విసురు; సింహళ-సిందువారముల – సీకృతిలోన్ = సింహళదేశంలోని వావిలిచెట్లనుండి "సీ" అంటూ వినవచ్చే ధ్వనితో; చెలరేగి = విజృంభించి; సాగి = ముందుకు పోయి; ఆ-సింహళ-సింధువార – రస- శీకర – సేచనలోన్ = ఆ సింహళదేశాన్ని ఆనుకొని ఉన్న – సముద్రసమూహమునకు సంబంధించిన – నీటి – తుంపురుల – స్నానంతో; కలంగి = ఊగిపోయి; పతాకన్ = జెండాగుడ్డను; తాకెన్ = తాకింది; లెమ్ము! = లే!; శివ-సేవన-వేళ = శివార్చన సమయం (శివుని పూజించే సమయం); గమించి – పోయెడిన్ = దాటిపోతోంది!

(ఈ మూడు పద్యాలను పరిష్కరించి ప్రతిపదార్థాలు వ్రాసియిచ్చినవారు నా పండితమిత్రులు ఆచార్య శలాక రఘునాథశర్మగారు. వారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను – తంగిరాల)

* * *

1966 జూన్ 30వ తేదీ రాత్రి దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారు తన 45వ ఏట హఠాత్తుగా చనిపోవడంతో సాహిత్యలోకమంతా దిగ్భ్రాంతికి లోనై విషాదసాగరంలో మునిగిపోయింది. అప్పుడు ఇద్దరు కవులు వ్రాసిన స్మృతి గీతాలను ఈ దిగువ ఇస్తున్నాను:–

తమ్ముడూ

– శ్రీ కాళోజీ

ఎంత తొందర పడ్డావోయ్ తిలక్!
నేను చచ్చినా నీ మాటలబడి బ్రతుకుతా ననుకున్నాను తమ్ముడూ!
నీ ఎదలో అతి నాజూకైన ఒక మూల
నాకు విడిదిగా ఉండేది.
నువ్వే చెప్పకుండా డేరా ఎత్తివేస్తే
Next Halt ఎక్కడో చెప్పకుండా దాటేస్తే

నేనెక్కడికని వెతుక్కుంటూ రాను?
నాజూకు ఎరగని నా ఎదలో
నువ్వెప్పుటైనా నిలువలేవని
నాకు తెలుసు
ఇబ్బందైనా నా వాడవు కాబట్టి
ఎట్లాగో వుండిపోతావనుకున్నాను అక్కడనే
ఇంత సుకుమారివైపోతావనుకోలేదు
గృహలక్ష్మి ఇందిరను వదలి
ఒక్క క్షణం వుండలేనివాడివి
ఎట్లా పోగలిగావు చెప్పక చెయ్యక?
ఊహలకందని లోకాన్ని చూద్దామని వెళ్ళావా?
ఉన్నలోకం ఊహల కందకుండా కాకూడదు సుమా!

(విశాలాంధ్ర, 10-7-1966)

కీ.శే. బాలగంగాధర తిలక్

- గంగుల బుచ్చిరెడ్డి

నీవు చావడం ఏమిటి "తిలక్?"
మేము బ్రతకడం ఏమిటి?
కావ్యజగత్తులో
కనకాలు పండించే వాడివి!
కమ్మని కథలు చెప్పి
కలలు కల్పించే వాడివి!
చెదిరిన కలలా
జారిపోయావేం తిలక్?
నీవు చావడం ఏమిటి!!
నీవు లేదన్నదే నిజంలాంటి అబద్ధం
చేదుమాత్రలా మింగేస్తున్నాము!
నిజంగా నీవు లేవూ!
నీ నాల్గు వాక్యాలు చాలు
నాల్గు కోట్ల మధ్య

నీవెవరో లెక్కించడానికి!
తళుక్కున మెరుస్తున్న కాలంలో
చటుక్కున మాయమయి పోయావేం తిలక్!
కక్షలు-గ్రూపులూ అంటూ (లేక)
సాహిత్యం రాజకీయంలో
ఏపాలు అంటూ పంచుకోక
కడ్డీగా నిలబడ్డావు!
సన్నగా మాయమయేవేం తిలక్!
రాబిన్ పక్షిలా
వలసపోయావనుకున్నా
తిరిగి వస్తావన్న ఆశ మాకేది? తిలక్!
మారుతున్న కాలంలో
రేగుతున్న హృదయంతో
గడుస్తున్న జీవితాలను చూడలేక,
టిక్కెట్టులేని రాకెట్టులో
చేరుకున్నావా.... చుక్కలసీమకు...?
చక్కని బాటకు?
అంతేనా తిలక్! (-1966 జూలై 17 ఆదివారం - 'ఆంధ్రప్రభ')

ఒకసారి ప్రముఖ దిగంబర కవి "జ్వాలాముఖి"గారిని మా నన్నయపీఠంలో తిలక్‌ను గురించి ప్రసంగించడానికి ఆహ్వానించాం. ఆయన్ని హోటల్ గదినుండి సభాస్థలికి రిక్షాలో తీసికొని వెడుతున్నాను. దారిలో "తిలక్‌గారి యిల్లెక్కడ?" అని అడిగారు నన్ను. నేను రిక్షాని తిలక్‌గారి యింటికి మళ్ళించి, ఆ యిల్లు చూపించాను. ఆయన వెంటనే రిక్షాదిగి, ఆ యింటి ముందుకు వెళ్ళి, భక్తితో సాష్టాంగ నమస్కారంచేసి వచ్చారు. నేను, వీధిలో ఉన్న ప్రజలు ఆశ్చర్య పోయాము. తరువాతి తరం యువకవులకు తిలక్‌గారంటే అంతటి అభిమానము, భక్తి ప్రపత్తులు!

- "సుశర్మ" (నన్నయపీఠం ప్రధాన కార్యదర్శి)

అనుబంధం: II

కవితా కదన క్షాత్రుడు

అది కాదు,
నాకు తెలియకడుగుతున్నాను
ఏమిటీ ఘోరం?
అబద్ధాలు ప్రకటించడానికి
అలవాటుపడిపోయిన – కాదు
అంకితం అయిపోయిన
ఓ దుర్వార్తా పత్రికలారా! చెప్పండి
ఈ వార్త నిజమేనా?

(బహుశా నిజమే అనుకోవాలి. అప్పుడప్పుడో భయంకర సత్యం ప్రకటిస్తారు! అప్పుడే మీ అబద్ధాలకు విలువ.)

సిమెంటనే మారు పేరు ధరించిన
ఇసుకతో నిర్మించబడిన
వంతెనలాంటి ప్రభుత్వమా
ఏమిటీ ఘోరం?
అని నిన్నడిగి ఏం లాభం?
నిద్రపో హాయిగా
వృక్షమా! ఋక్షమా! ద్విపక్షమా!
బదులు చెప్పండర్రా! మీరైనా?
జవాబు లేదు.

గాలి మూగదయిపోయింది
పాట బూడిదయిపోయింది
వయస్సు సగం తీరకముందే
అంతరించిన ప్రజాకవి

నభస్సు సగం చేరకముందే
అస్తమించిన ప్రభారవి
మరి కనిపించదా?

కోకిలవలె కూజించే కలధ్వని
కేసరివలె గర్జించే రణధ్వని
ఇక వినిపించదా?

భావి దూర తీరాలకు
చేరువుగా విహరిస్తూ
జీవనాడి స్పందించే
రుధిర మధువు లందించే
యువకవిలోక ప్రతినిధి
నవభావామృత రసధుని
కవితాసతి నొసట నిత్య
రస గంగాధర తిలకం!
సమకాలిక సమస్యలకు
స్వచ్ఛస్ఫాటిక ఫలకం!
నడినింగిని మాయమయాడా
మన మిత్రుడు
కవితా పుత్రుడు
కదన క్షాత్రుడు
సకల జగన్మిత్రుడు! – శ్రీశ్రీ

అర్థములు: ఋక్షము = నక్షత్రము; ద్విపక్షము = పక్షి; నభస్సు = ఆకాశము; నవభావ + అమృతరసధుని= క్రొత్తభావాలు అనే అమృతద్రవానికి నది వంటివాడు; రసగంగాధరము= గంగసిందూరము (కుంకుమతో కలిపి బొట్టుపెట్టుకొను ఒక జాతి సిందూరము); స్వచ్ఛస్ఫాటిక ఫలకం= మలినములేని పటికపుజాతి పలక; కదనక్షాత్రుడు = రణరంగంలో క్షత్రియవీరుడు; సకల జగత్ + మిత్రుడు = సమస్త ప్రపంచానికి స్నేహితుడు.

అనుబంధం: III

ఆచంట జానకిరాంగారికి తిలక్ వ్రాసిన లేఖ

తణుకు
16-4-59

జానకిరామ్ అన్నగారికి –

శ్రీపాద కృష్ణమూర్తి, గదిలో పరుండిన నా వద్దకు రిజిస్టరు కవరు తీసుకువచ్చి యిచ్చాడు. Receipt మీద సంతకం పెట్టి తీసుకున్నాను.

కవరు లోంచి ఆ పుస్తకాన్ని వెలికి తీశాను. మెత్తని పువ్వుల వెలుతురు లాగ, తావిలాగ తగిలింది చేతికి, కన్నులకి, మనస్సుకి.

స్వర్ణసీత! ఆ చిత్రం ఎంత మోహనంగా ఉంది! ఆ బొమ్మనే చూస్తూ అలాగ కొంతసేపు ఉండిపోయాను.

అందంగా ఆలోచించడం, అందంగా బ్రతకడమూ, అందంగా ఒక పనిచేయడమూ – అంటే 'జానకిరామ్' అన్నమాట అని అనుకున్నాను నేను.

లోపల మీ పాటల్ని (అవి పాటలే సుమండీ) చదువుకున్నాను. మనస్సు ఆర్ద్రమయింది. నా హృదయం కూడా 'మళ్లీ జానకిరామ్ ఎప్పుడొస్తారు?' అని చకోరిలాగ, చాతకంలాగా ప్రశ్నించింది.

గది నుండి హాలులోకి వచ్చాను. అక్కడ నన్నయపీఠం సభలకి ఆహ్వానింప బడిన కవిమిత్రుడు, నా తమ్ముడు సోమసుందర్ (ఆవంత్స సోమసుందర్) తదితరులూ 'స్వర్ణసీత'ని చూశారు. తలలూచి మెచ్చుకున్నారు – వారికి నేను చదివి వినిపిస్తూ ఉంటే.

సోమసుందర్‌ని మీరెప్పుడైనా చూశారా – అతని రచనలు కాని? అతనికి కొన్నాళ్ల నుండి ఒక కోర్కె ఉంది. అతను 'మిణుగురులు' అని కృష్ణాపత్రికలో యీ మధ్యా, యిదివరకు 'ఆనందవాణి'లోనూ ప్రియురాలిపరంగా కొన్ని గద్యపద్యాల లాంటివివ్రాశాడట. నేను చూడలేదు. వాటిని అనతికాలంలోనే అచ్చువేయిస్తున్నాడు. ఆ కావ్యాన్ని మీకు అంకితం యివ్వాలని అతనికి ఒక యేడాది నుండీ ఉన్న అభిలాష. ఇక్కడకు వచ్చిన రోజునే నాకు చెప్పి నన్ను మీకు వ్రాయమన్నాడు.

సభల హడావుడిలో వ్రాయలేకపోయాను. అతను వెళుతూ వెళుతూ మరిమరీ చెప్పి వెళ్లాడు. సోమసుందర్ సుందరమూ, స్నేహశీలమూ అయిన మనస్సు కలవాడు. మీరు అతని కోరికని అంగీకరిస్తే ఎంతో బావుంటుంది అనిపించింది. మీరు 'మిణుగురులు' చదివే ఉంటారనుకుంటున్నాను. లేనిదే మీకు ఆ రచన పంపే ఏర్పాటు చేస్తాను.

మీ ఉత్తరం వచ్చేటప్పటికి నేను ఊళ్లో లేను. ఎప్పటికప్పుడు వస్తారని అనుకోవడం వలన మీకు పంపబడలేదు. నేను రాజమండ్రీ, పరిసర గ్రామాలకు వెళ్లడమూ, పది పదిహేను రోజులుండి పోవడమూ జరిగింది. రాగానే తొమ్మిది రోజులపాటు సభల హడావుడి, కవిమిత్రులు అతిథులుగా రావడమూ, కవితా గాన కోలాహలంతో యిల్లంతా నిండిపోయింది. అందువలన మీకు జవాబు వ్రాయడానికి యింత ఆలస్యమయింది. ఏమీ అనుకోకండి.

చంద్రలేఖని అడయారు కళాక్షేత్రంలో చేర్పించాలని ఉంది. నృత్య సంగీతాలు నేర్పించాలనీ ఉంది. అక్కడ విధానమూ, నిబంధనలూ, యివన్నీ మీకు తెలిసే ఉంటాయి. లేనిదే, శ్రమ అనుకోక, తెలుసుకొని నాకు విపులంగా తెలియచేస్తారా? కొందరు హైదరాబాద్‌లో నటరాజ రామకృష్ణ నడిపే పాఠశాలలో చేర్పించమనీ అంటున్నారు. ఈ సందర్భంలో మీ సలహా నాకు ఎంతగానో కావాలి.

మీరు తణుకు ఎప్పుడు వస్తారు? ఇది వరకటిలాగ కాక, యీసారి ఒకవారం రోజులకి తక్కువ కాకుండా, యితర బాదరబందీ లేకుండా గడపాలి. నా రచనలని వినిపిస్తాను మీకు. వాటిని పుస్తకరూపంలోకి తీసుకువచ్చే ప్రయత్నంలో ఉన్నాను. అందువలన మీ అభిప్రాయమూ, సలహా ముందుగానే నాకు చాలా అవసరం.

మన పరిచయం మొన్నమొన్ననే జరిగినా, ఎన్నాళ్లదోలాగ అనిపిస్తోంది. ఈ వసంతం వెళ్లిపోకుండా, మల్లెపువ్వులూ, మంచి గంధమూతోపాటు మీరుకూడా దగ్గరే వుంటే ఎంత బావుంటుంది! రండి, ఎంత త్వరలో వీలైతే అంత త్వరగా!

కృష్ణమూర్తి యీ సభలకి వచ్చి నిన్ననే వెళ్లిపోయాడు. అతని హృదయానికి చికిత్స చేస్తూనే ఉన్నాను నేను. నవ్యకవిత మీద ఒక ఉపన్యాసం వ్రాసి తీసుకువచ్చి చదివాడు. అక్కడక్కడ చాలా బాగా వ్రాశాడు.

మీ కొత్త శిష్యుడు–మా తమ్ముడు మీకు ప్రత్యేకంగా జాబు వ్రాస్తానని అన్నాడు.

ఇంతే సంగతులు. మీ జాబుకోసం ఎదురుచూస్తోంటాను. శారద అక్కగారికి నా అభివందనాలు తెలుపండి.

భవదీయుడు

బాలగంగాధర తిలక్”

* * *

(ఈ లేఖ సన్నని అక్షరాలతో, బ్లూ ఇంక్‌లో, కాగితానికి ఒకే ప్రక్కన, రెండు కాగితాలలో వ్రాయబడి ఉంది. తిలక్ ఏ పంక్తిని ఎక్కడ ఆపు చేసి వ్రాశారో అలాగే వ్రాసుకున్నాను నేను. దీనిని దయతో నా కొసగిన మాన్యమిత్రులు శ్రీ ఆచంట జానకిరాం గారికి నా నమస్సులు.) ఈ లేఖతో ఒక చిన్న చిట్ కూడా జతపరచబడింది. దానిపై ఇలా ఉంది:–

“జానకిరామ్ గారికి:
మీకు వసంతోపహారంగా

. . . .

ఇంత వేసగి మంట లేచిన నీగుండె
మాడి మసిమసిగ మారునపుడు
నా పాట నామాట నవపరీమళముల
వట్టి వేళ్ల తెరల కట్టి చూడు!

. . . .

మరీ మరీ వికసించే నా వయస్సొక్క మల్లెపువ్వు
నీ కాంక్షా నిశీథాల బలే పరిమళాన్ని రువ్వు,
మరి మరీ పొంగిపొరలు యీ యౌవన శీధువు
నింపునులే నీ బ్రతుకంతా ఎర్రని మైమరపు!

– (వసంతగీతం నుండి)

– “తిలక్:”

(తిలక్‌గారు ఆచంట జానకిరాంగారికి వ్రాసిన ఈ అందమైన లేఖను నేను నవంబరు 2013లోను, తిరిగి జనవరి 2021లోను ‘ఎమెస్కో’వారు ప్రచురించిన “దేవరకొండ బాలగంగాధర తిలక్ – లభ్యరచనల సంకలనం”లో చేర్చడం మరిచిపోయినందుకు మిక్కిలి చింతిస్తున్నాను – తంగిరాల)

అనుబంధం-IV:

తిలక్ కుటుంబ చరిత్ర

దేవరకొండవారి స్వగ్రామం: పశ్చిమగోదావరిజిల్లా- తణుకు తాలుకా - "మండపాక". వీరు వెలనాటి వైదికులు. 'హరితస' గోత్రులు. ఈ గోత్రంలో ముగ్గురు ఋషులుంటారు: (1) హరిత, (2) అంబరీష, (3) యౌవనాశ్వ - త్రయార్షేయం - ఆపస్తంబ సూత్రం - కృష్ణయజుశ్శాఖ.

మూల పురుషుడు: ఎల్లప్పగారు

|

కృష్ణప్పగారు

|

అన్నప్పగారు

1. సత్యనారాయణమూర్తిగారు — భార్య: రామసోదెమ్మగారు
2. పాపయ్యశాస్త్రిగారు — భార్య: అన్నపూర్ణగారు
3. రామలింగయ్యగారు — భార్య: వెంకమ్మగారు

(1. సత్యనారాయణమూర్తిగారు సంతానం:) ఐదుగురు కూతుళ్ళు — ఏడుగురు కొడుకులు

వీరిని జ్యేష్ఠానుక్రమంగా దిగువ ఇస్తున్నాను:-

1. **సీతారత్నంగారు:-** భర్త: ఈమని సీతయ్యగారు(కాకినాడ). వీరు గొప్ప ధనికులు. స్వగ్రామం: మండపాక.
2. **మాణిక్యాంబగారు:-** భర్త: కప్పగంతుల సూర్యనారాయణమూర్తిగారు. ఈ దంపతుల కుమార్తె: నరసమాంబగారు. ఈమె భర్త ప్రసిద్ధ వైణికుడు: ఈమని శంకరశాస్త్రిగారు. ఈ సూర్యనారాయణమూర్తిగారు మొదట స్థితిపరులే! కాని దుర్వ్యసనాలకు లోనై, ఆస్తి అంతా పోగొట్టుకొని, చివరికి అత్తవారింట్లో తలదాచుకోవలసి వచ్చింది.
3. **అచ్యుతాంబగారు:-** భర్త: జయంతి దీక్షితులుగారు (కాకినాడ). వీరు గొప్ప ధనికులు; మంచి టెన్నిస్ క్రీడాకారులు. వీరికేమీ చెడ్డ అలవాట్లు లేకపోయినా, ఆడంబరాలకు పోయి, ఆస్తినంతా పోగొట్టుకున్నారు.

4. **సూర్యకాంతంగారు:–** భర్త: డా॥ వేపా కూర్మారావుగారు. (కర్నూలుజిల్లా, నంద్యాల దగ్గర ఉన్న ఆత్మకూరు వీరి స్వగ్రామం). తణుకులో వైద్యవృత్తి నవలంబించిన మొదటితరం డాక్టర్లలో ఒకరు. ప్రసిద్ధ వైద్యులు. ఈయనకు మామగారన్నా, ఆయన తమ్ముళ్ళన్నా పడేదికాదు. ఎందుకో కారణం తెలియదు.
5. **పెద్ద అన్నప్పగారు:–** భార్య: రామాయమ్మగారు (తణుకు). ఈ దంపతులకు – శ్రీమతి రామసోదెమ్మ (కిరణ్మయి)–శ్రీమతి సత్యప్రేమ–శ్రీమతి మాధురీదేవి – శ్రీ సత్యనారాయణమూర్తి – శ్రీ సుబ్రహ్మణ్యకిశోర్ – శ్రీమతి స్వర్ణ – శ్రీఉదయశంకర్ – శ్రీమతి సుజాత – శ్రీమతి శశిరేఖ – శ్రీమతి సునీత – అనే ఏడుగురు కూతుళ్ళు; ముగ్గురు కొడుకులు.
6. **దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారు (ప్రముఖకవి, కథారచయిత, నాటక కర్త):–**భార్య: ఇందిరాదేవిగారు(తణుకు). వీరికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు.
   - **6.1 పెద్ద కొడుకు: డా॥ దేవరకొండ సత్యనారాయణమూర్తి (లండన్):–** భార్య: శ్రీమతి శారద. వీరికి ఇద్దరు కూతుళ్ళు;చి॥ సంధ్య, చి॥ స్మిత.
   - **6.2 చిన్నకొడుకు: డా॥ దేవరకొండ సుబ్రహ్మణ్యం (అమెరికా):–** భార్య: శ్రీమతి హరికుమారి. వీరికి ముగ్గురు కొడుకులు: చి॥ రాజేష్ తిలక్ – చి॥ సునీల్ – చి॥ సంజయ్ (వీరికి కోడలు – ఇద్దరు మనుమలు కూడా ఉన్నారు).
   - **6.3 కూతురు: శ్రీమతి చంద్రలేఖ (అమెరికా):–** భర్త: కీ.శే. యనమండ్ర విశ్వమోహనరావుగారు వీరికి ముగ్గురు కూతుళ్ళు: చి॥ సీత, చి॥ పద్మ, చి॥ గీత. (వీరికి ఇద్దరు మనుమలు, ఇద్దరు మనుమరాండ్రు కూడా ఉన్నారు.)
7. **శివకుమారశాస్త్రిగారు:–** భార్య: శకుంతలాదేవిగారు. శాస్త్రిగారు ఏలూరులో జిల్లాకోర్టులో న్యాయవాదిగా పనిచేసేవారు. ఈ దంపతులకు – శ్రీ సత్యనారాయణ – శ్రీమతి వసుంధర – శ్రీమతి లక్ష్మీతార – శ్రీమతి రాధా వరలక్ష్మి – అనే ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్ళు. (శ్రీమతి వసుంధరగారి భర్త శ్రీ ఈవని సత్యనారాయణమూర్తిగారు – మేనరికం.)
8. **ఎల్లా బాలాత్రిపుర సుందరిగారు:–**భర్త: ఈవని సుబ్బరాయశాస్త్రిగారు. (తణుకు

దగ్గరనున్న "కానూరు అగ్రహారం" వీరి స్వగ్రామం). వీరు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పెద్ద ఇంజినీరుగా పనిచేస్తూ, అమెరికా వెళ్ళి అక్కడ హఠాత్తుగా చనిపోయారు. ఈ దంపతులకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. వారు జ్యేష్ఠానుక్రమంగా:-కీ.శే. సుబ్బయ్యశాస్త్రిగారు, శ్రీ సత్యనారాయణ మూర్తిగారు, డా॥ లక్ష్మీనరసింహమూర్తిగారు, శ్రీమతి విజయరాఘవి, శ్రీమతి వసంత.

9. **పార్థసారథిగారు:-** భార్య: సూరమ్మగారు. పార్థసారథిగారు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేసేవారు. ఈ దంపతుల ఏకైక పుత్రిక శ్రీమతి లక్ష్మీపార్థసారథిగారు, ఐ.ఏ.ఎస్.అధికారిణి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అనేక ఉన్నత పదవులు అధిష్ఠించారు. తణుకులో తిలక్‌గారి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసినవారు వీరే! ఈమె భర్త శ్రీభాస్కర్‌గారు కూడా I.A.S.. ఆఫీసరే. ఈ దంపతులకు ఇద్దరు కొడుకులు: శ్రీ కృష్ణభాస్కర్, I.A.S., శ్రీ పార్థసారథి, I.F.S. ఇలాగ ఈ కుటుంబమంతా గొప్పవిద్యావంతులతోను, ఉన్నతోద్యోగులతోను కూడినట్టిది. (వీరందరికీ నా అభినందనలు-తంగిరాల)

10. **గంగాధర రామారావుగారు:-** భార్య: సీతాదేవిగారు. రామారావుగారు తణుకు తాలూకా కోర్టులో లాయరుగా పనిచేసేవారు. గొప్ప సాహిత్య ప్రియుడు, మంచి కథారచయిత; అన్న తిలక్‌గారి అభిమాని. ఈ దంపతులకు - శ్రీమతి రమాదేవి-శ్రీమతి పద్మకాంతి - శ్రీ డి.వి.ఆర్.ఎస్.మూర్తి- శ్రీవల్లి - అనే ముగ్గురు కూతుళ్ళు, ఒక కొడుకు.

11. **ధనంజయగారు:-** భార్య: మీనాక్షిగారు (తణుకు). ఈ దంపతులకు - శ్రీ సుధాకర్ - శ్రీ శ్రీధర్ అనే ఇద్దరు కొడుకులు.
తిలక్‌గారి మరదళ్ళలో శ్రీమతి మీనాక్షిగారు తిలక్ వీరాభిమాని. పత్రికలలో వచ్చిన తిలక్ రచనలన్నీ కత్తిరించి, ఒక బైండ్ పుస్తకంలో అంటించి భద్రపరిచారు. ఈమెకు నా అభినందనలు - తంగిరాల

12. **తిమ్మేశ్వరరావుగారు:-** భార్య: వెంకట సూర్య లక్ష్మిగారు (రాజమండ్రి). ఈ దంపతులకు-శ్రీ రామగోపాల్-శ్రీ మురళీకృష్ణ-శ్రీమతి కల్యాణి (భర్త శ్రీ మూర్తి, I.A.S.) -అనే ఇద్దరు కొడుకులు, ఒక కూతురు.

పై వివరాలన్నీ నాకు తెలియజేసినవారు: తిలక్‌గారి మేనల్లుడు (ఎల్లమ్మగారి కొడుకు), శివకుమారశాస్త్రిగారి అల్లుడు అయిన శ్రీ ఈవని సత్యనారాయణమూర్తి ("జుజ్జు") గారు. వీరికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. **- తంగిరాల**

అనుబంధం-V:
తిలక్ సాహిత్య పురస్కారాలు (1997 నుండి 2019 వరకు)

శ్రీ నన్నయ భట్టారక పీఠము
తణుకు-534 211
పశ్చిమ గోదావరి జిల్లా

నా సాహిత్య మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తి 1955 సెప్టెంబరు నెల దసరాపండుగ రోజుల్లో నాకు తిలక్‌గారిని పరిచయం చేశాడు. అప్పటినుండి 1961 జూన్ నెలలో నేను తెలుగు ఎం.ఏ. చదవడానికి తిరుపతికి వెళ్ళేవరకూ నేను తిలక్‌గారికి అభిమాన శిష్యుడుగా ఉన్నాను. 1950 నుండి 1960 వరకూ కృష్ణమూర్తికూడా తిలక్‌గారికి ఆత్మీయ శిష్యుడే. 1966లో తిలక్‌గారు స్వర్గస్థులైన తర్వాత తణుకులో ఆయన్ని ఎవరూ తలచుకోవడం లేదు. కాని కొందరు అభిమానులు, మిత్రులు కలిసి "తిలక్ సాహితీ సరోవరము" అనే సంస్థను స్థాపించి, 1968 జూన్ నెలలో "తిలక్ లేఖలు" అనే పేరుతో 144 పుటల గ్రంథాన్ని ప్రచురించారు. ఈ సంస్థలో ప్రధాన పాత్ర శ్రీమతి మోగంటి మాణిక్యాంబాదేవి గారిది. తరువాత ఈ సంస్థలో సభలు ఏవీ జరిగినట్లు లేదు. నన్నయ భట్టారక పీఠంలో కూడా తిలక్ సంస్మరణ సభలు ఏవీ జరగడంలేదు. ఆ పరిస్థితుల్లో 1996లో నేను, మిత్రుడు డా॥ శ్రీపాద కృష్ణమూర్తి కలిసి ఆలోచించి, చెరొక 10వేల రూపాయలు వేసికొని, నన్నయ భట్టారక పీఠానికి 20 వేల రూపాయలు ఇచ్చి, ప్రతి సంవత్సరం ఆగస్టునెలలో తిలక్‌గారి పేరుతో ఒక కవిని సత్కరించమని చెప్పాము. అలాగ కొన్నేండ్లు జరిగిన తరువాత తిలక్‌గారి పిల్లలు డా॥ దేవరకొండ సత్యనారాయణమూర్తి, డా॥ దేవరకొండ సుబ్రహ్మణ్యం, శ్రీమతి యనమండ్ర చంద్రలేఖ కలిసి 50 వేల రూపాయలు నన్నయ పీఠానికి ఇచ్చారు. ఇలాగ మొత్తం 20 + 50 =70 వేల రూపాయల నిధి ఏర్పడింది. దీని మీద వచ్చే వడ్డీతో 1997 నుండి 2019 వరకు ఈ క్రింది 23 మంది కవులను, కథారచయితలను, నాటక రచయితలను, విమర్శకులను నన్నయపీఠం సత్కరించింది. (2020 నుండి కరోనా మహమ్మారి వల్ల సత్కార సభలు జరపలేకపోయారు):-

1) 1997 – డా॥ గుంటూరు శేషేంద్రశర్మగారు (కవి, పండితుడు, విమర్శకుడు.)
2) 1998 – ఇస్మాయిల్‌గారు (కవి)
3) 1999 – డా॥ ఆవంత్స సోమసుందర్‌గారు (కవి, విమర్శకుడు.)
4) 2000 – కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణగారు (కవి)
5) 2001 – శ్రీ కె. శివారెడ్డిగారు (కవి)
6) 2002 – ప్రొ॥ ఎన్. గోపిగారు (కవి, పరిశోధకుడు.)
7) 2003 – డా॥ అద్దేపల్లి రామమోహనరావుగారు (కవి, విమర్శకుడు, పరిశోధకుడు.)
8) 2004 – "రసరాజు" (కవి, కథారచయిత) – శ్రీ రంగనీని సత్యనారాయణ రాజుగారు.
9) 2005 – ప్రొ॥ ఎండ్లూరి సుధాకర్‌గారు (కవి, పరిశోధకుడు)
10) 2006 – ఉత్పల సత్యనారాయణాచార్యగారు (పద్యకవి)
11) 2007 – దుగ్గిరాల రామారావుగారు (పద్యకవి)
12) 2008 – మునిపల్లె బి. రాజుగారు (కథారచయిత)
13) 2009 – శ్రీ పల్లేటి లక్ష్మీకులశేఖర్‌గారు (నాటక రచయిత)
14) 2010 – శ్రీ కొప్పర్తి వెంకట రమణమూర్తిగారు (కవి)
15) 2011 – "మంజుశ్రీ" డా॥ అక్కిరాజు రమాపతిరావుగారు (కథారచయిత, నవలా రచయిత, పరిశోధకుడు.)
16) 2012 – ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారు (కవి)
17) 2013 – డా॥ పోరంకి దక్షిణామూర్తిగారు (కథారచయిత, నవలారచయిత, పరిశోధకుడు.)
18) 2014 – శ్రీ పువ్వాడ తిక్కన సోమయాజిగారు (పద్యకవి)
19) 2015 – డా॥ పాపినేని శివశంకర్‌గారు (కవి, కథారచయిత, పరిశోధకుడు.)
20) 2016 – శ్రీ బి.వి.వి. ప్రసాద్‌గారు (కవి)
21) 2017 – "శిఖామణి" (పొ॥ కత్తి సంజీవరావుగారు) (కవి, పరిశోధకుడు.)
22) 2018 – డా॥ గన్నమరాజుగారు గిరిజా మనోహరబాబుగారు (విమర్శకుడు, పరిశోధకుడు.)
23) 2019 – డా॥ రెంటాల శ్రీవెంకటేశ్వరరావుగారు (కవి, విమర్శకుడు, పరిశోధకుడు)

ఇటీవల ఈ పురస్కార నిధికి తిలక్‌గారి మేనల్లుడు శ్రీ ఈవని సత్యనారాయణ మూర్తి ("జుజ్జు")గారు (సినిమా మ్యూజిక్ డైరెక్టరు, హైదరాబాద్) 50 వేల రూపాయలు సేకరించి ఇచ్చారని నన్నయపీఠం కార్యదర్శియైన మిత్రులు శ్రీ సుశర్మగారు (శ్రీయామిజాల సుబ్రహ్మణ్య శర్మగారు) నాకు తెలియజేశారు. ఈ విరాళాల వివరాలు:–

1.	శ్రీ ఈవని సత్యనారాయణమూర్తి ("జుజ్జు")గారు, (తిలక్‌గారి మేనల్లుడు)	– రూ.20,000–00
2.	శ్రీమతి వారణాసి సత్యవాణిగారు (తిలక్‌గారి మేనకోడలు)	– రూ.20,000–00
3.	శ్రీ దేవరకొండ మురళీకృష్ణగారు (తిలక్‌గారి తమ్ముడు తిమ్మేశ్వరరావుగారి కొడుకు)	– రూ. 10,000–00
	మొత్తం	– రూ.50,000–00

అంటే ఇప్పుడు తిలక్ సాహిత్య పురస్కార నిధిలో 20 వేలు + 50 వేలు + 50 వేలు = ఒక లక్షా ఇరవై వేల రూపాయలున్నాయి. దీనిమీద వచ్చే వడ్డీతో పురస్కార సభలు జరుపుతారు.

"సీతావధానం"
బెంగుళూరు,
30–06–2021
(తిలక్ 56వ వర్ధంతి)

ఇట్లు
తంగిరాల వెంకట సుబ్బారావు
("తిలక్ సాహిత్య పురస్కార నిధి"
ప్రారంభకులలో ఒకరు)

* **దూరంగా 'ఆల్ ఫ్స్' మీద మంచు దుఃఖంలా కరుగుతోంది!**
ప్రభాతం సముద్రం మీద వెండి నౌకలా ఊగుతోంది!! (–సైనికుడి ఉత్తరం)

* **రాత్రిని రంపంపెట్టి కోసినప్పుడు**
రాలిన పొట్టులా ఉంది వేకువ! (–వేకువ)

* **కాంక్షా మధుర కాశ్మీరాంబరం కప్పుకున్నాను!**
జీవితాన్ని హసన్మందార మాలగా ధరించాను!! (–అమృతం కురిసిన రాత్రి)

అనుబంధం-VI:

ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు

(జీవన రేఖలు)

1. జననం:-

30-03-1935, భావనామ సంవత్సరం, ఫాల్గున బహుళ ఏకాదశి, శనివారం. పశ్చిమగోదావరిజిల్లా, కొవ్వూరు తాలూకా, 'వాడపల్లి' గ్రామం (మాతామహుల గృహం).

2. తల్లిదండ్రులు:-

కీ.శే. సీతామహాలక్ష్మి - కీ.శే. తంగిరాల వెంకట సుబ్బావధానులు.

3.స్వగ్రామం:-

1948 వరకు: పశ్చిమగోదావరిజిల్లా, తణుకు తాలూకా "కాకుల ఇల్లిందుల పఱ్ఱు"; 1948 నుండి తణుకు.

4. విద్యాభ్యాసం:-

స్వగ్రామం - రాజమండ్రి - తణుకు - భీమవరం - తిరుపతి. ఎం.ఏ. (తెలుగు) 1963, పిహెచ్.డి. "తెలుగు వీరగాథా కవిత్వము" 1969, (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి)

5. గురువులు:-

స్వర్గీయులు: దిగుమర్తి సీతారామస్వామిగారు, ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు, ఆచార్య జి.యన్.రెడ్డిగారు, ఆచార్య తిమ్మావజ్ఝుల కోదండ రామయ్యగారు.

6. ఉద్యోగాలు:-

- 1969 నుండి 1996 వరకు: బెంగుళూరు విశ్వవిద్యాలయంలో తెలుగు లెక్చరర్‌గా, రీడరుగా, ప్రొఫెసర్‌గా, శాఖాధ్యక్షునిగా పనిచేశారు.
- మధ్యలో 1980-1983, మొట్టమొదటి పరీక్షా నియంత్రణాధికారి (First

Controller of Examinations), గుల్బర్గా విశ్వవిద్యాలయం, గుల్బర్గా.

- 1998–2000: ప్రొఫెసర్ ఎమిరిటస్ (Professor Emeritus), బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగుళూరు.

7. ముఖ్యవిషయం (జీవితంలో సాధించిన ఘనత:–

1971లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పి.వి. నరసింహారావుగారికి లేఖవ్రాసి, మూడు లక్షల రూపాయల గ్రాంటు సంపాదించి, 1974లో బెంగుళూరు విశ్వవిద్యాలయంలో తెలుగు స్నాతకోత్తర శాఖ (Telugu Post-Graduate Department)ను స్థాపించడం.

8. రచనలు (ముఖ్యమైనవి):–

1) కాటమరాజుకథలు – మొదటి సంపుటం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, 1976. (పునర్ముద్రణ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 1998)
2) కాటమరాజుకథలు – రెండవ సంపుటం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, 1978. (పునర్ముద్రణ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 1998)
3) అంకమ్మ కథలు, 1993, 'శ్రీరస' ప్రచురణలు.
4) శ్రీకృష్ణకర్ణామృతము (సం.) 1998, 'శ్రీరస' ప్రచురణలు.
5) రేనాటి సూర్యచంద్రులు – మొదటి సంపుటం (1999); రెండవ సంపుటం (2000); మూడవ సంపుటం (2011), 'శ్రీరస' ప్రచురణలు.
6) ఏటిన ముత్యాలు (సం.), 2006, 'శ్రీరస' ప్రచురణలు.
7) తెలుగు వీరగాథాకవిత్వము (సమగ్ర సంపుటం), 2013, 'శ్రీరస' ప్రచురణలు.
8) దేవరకొండ బాలగంగాధర తిలక్–లభ్యరచనల సంకలనం – (సేకరణ, సంపాదకత్వం), ఎమెస్కో ప్రచురణ, ప్రథమ ముద్రణ, నవంబరు 2013. ద్వితీయ ముద్రణ, జనవరి 2021.
9) వీరగల్లు – మొదటి సంపుటం (సం.) ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం, 2017.

11) సింహాద్రి నారసింహ శతకము (సం.) 2019, 'శ్రీరస' ప్రచురణలు.
12) వేణుగోపాల శతకము (సం.) 2020, 'శ్రీరస' ప్రచురణలు.
13) కాటమరాజుకథలు – మూడవ సంపుటం (సం.) 2021, 'శ్రీరస' ప్రచురణలు.
14) రసగంగాధర తిలకం (దేవరకొండ బాలగంగాధర తిలక్, అభిరుచులు – అలవాట్లు, ఇతర వ్యాసాలు) శతజయంతి నివాళి, 2021, 'శ్రీరస' ప్రచురణలు.
15) "రక్తతిలకం" (ముఖ్యమైన మూడు బుఱ్ఱకథలు) (సం.) 2021, 'శ్రీరస' ప్రచురణలు.
16) "VIJAYA LIPI" (Kannada Telugu Common Script), Co-editor, 1989.

9. కవిత్వ పత్రిక:–

కేవలం కవిత్వానికే అంకితమైన "చైతన్య కవిత" అనే పత్రికను 1986లో స్థాపించి 2009 వరకు 24 సంవత్సరాలు వెలువరించారు; 48 సంచికలు తీసికొనివచ్చారు. ప్రముఖ కవుల ముఖచిత్రాలతో ఆరు మాసాలకొకసారి వెలువడేది: వసంతం (ఏప్రిల్) – శరత్తు (అక్టోబరు.)

10. "శ్రీరస" సాహిత్య సంస్థ:–

భావనామ సంవత్సర ఉగాదినాడు – అంటే 11-04-1994 నాడు "శ్రీకృష్ణదేవరాయ రసజ్ఞ సమాఖ్య" ("శ్రీరస") అనే పేరుతో ఒక సాహిత్య సంస్థను స్థాపించి ఈనాటి వరకూ నిర్వహిస్తున్నారు. ప్రముఖ విద్వాంసులచేత కొన్ని వందల సాహిత్యోపన్యాసాలు ఏర్పాటు చేశారు. "మధురభారతి" శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తిగారు 2001 నుండి 2019 వరకు "శ్రీరస"లో ప్రతినెల మూడేసి ఉపన్యాసాలు చేశారు. వీరు మహాభారతాన్ని గురించి (వ్యాసుడు – కవిత్రయం తులనాత్మకంగా) 36 ఉపన్యాసాలు, రామాయణాన్ని గురించి (వాల్మీకి–విశ్వనాథ తులనాత్మకంగా) 27 ఉపన్యాసాలు, భాగవత సప్తాహాలు, "ప్రబంధ

సుగంధం" పేరుతో 20 ఉపన్యాసాలు, "సౌందర్యలహరి"ని గురించి 15 ఉపన్యాసాలు, భగవద్గీతను గురించి 9 ఉపన్యాసాలు చేశారు. వీరి ఉపన్యాసాలు "శ్రీరస" శ్రోతలకు కర్ణరసాయనంగా (కర్ణామృతంగా) కొనసాగాయి. 2019లో రజతోత్సవం జరుపుకొనిన ఈ సంస్థ తన రజతోత్సవ ప్రత్యేక సంచికను కూడా మిక్కిలి సుందరంగా వెలువరించింది.

11. పురస్కారాలు (కొన్ని ముఖ్యమైనవి):-

1. శ్రీ ఎన్.టి. రామారావుగారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండగా "ఉగాది పురస్కారం", హైదరాబాదు, 1987.
2. శ్రీ బెడవాడ గోపాలరెడ్డిగారిచే "కవిత్రయ పురస్కారం" నెల్లూరు, 1998.
3. విజయవాడ సిద్ధార్థ కళాపీఠంవారిచే "సాహిత్య పురస్కారం", 23.9.2000.
4. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డిగారిచే "ఉగాది పురస్కారం", బెంగుళూరు, 3.4.2006.
5. ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘంవారిచే "తెలుగు భాషా పురస్కారం", బెంగుళూరు, 4.11.2007.
6. యోగివేమన విశ్వవిద్యాలయంవారిచే "సి.పి.బ్రౌన్ పురస్కారం", కడప, 10.11.2007.
7. కీ.శే. దేవరకొండ బాలగంగాధర తిలక్ స్మారక సాహిత్య పురస్కారం, హైదరాబాద్, 27.1.2008. (ఇది తిలక్‌గారి సంతానం ఇచ్చిన పురస్కారం).
8. తెలుగు విజ్ఞానసమితివారిచే శ్రీకృష్ణదేవరాయ కళాపురస్కారం (ఉగాది పురస్కారం), 25.4.2008.
9. ఆచార్య జి.యస్. మోహన్‌గారిచే "డా॥ చిలుకూరి నారాయణరావు సాహిత్య పురస్కారం", మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై, 14.9.2014.
10. "ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 171 వర్ధంతి పురస్కారం" - 'రేనాటి సూర్యచంద్రుల స్మారకసమితి' అధ్యక్షులు శ్రీ పోచా బ్రహ్మానందరెడ్డి గారిచే ఘనసన్మానం (రూ.50,000/-), నంద్యాల, 22.2.2018.

11. "జీవిత సాఫల్య పురస్కారం" – సి.పి.బ్రౌన్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ ఇడమకంటి లక్ష్మిరెడ్డిగారిచే – తెలుగు విజ్ఞాన సమితి ప్రాంగణంలో – బెంగుళూరు, 07.03.2020.

12. బిరుదులు:–

"వీరగాథల సవరాల జిమ్మడు" – "రసజ్ఞ రాజశేఖరుడు".

13. అభిరుచులు:–

తెలుగు సాహిత్యం – ముఖ్యంగా కవిత్వం (ప్రాచీనం–జానపదం–ఆధునికం) – కవి పండిత గోష్ఠి – సాహిత్య సభల నిర్వహణ – గ్రంథ ప్రచురణ.

14. చిరునామా:–

Prof. T.V. SUBBA RAO
#1708, *"Siitaavadhaanam"*
11th Cross; 1st "G" Main
Kengeri Satellite Town
BENGALURU – 560 060
Mobile: 99454 22742
E-mail: tangiralasubbarao@gmail.com

"కవిత్వం అంటే ఒక విశిష్టానుభూతిని కవి పాఠకుడికి సరఫరా చేసే శక్తి, అక్షరాల కూర్పు" – తిలక్

"ఇప్పుడు నువ్వులేవు–నీ పాటవుంది; ఇంటి ముందు జూకామల్లెతీగల్లో అల్లుకుని, లాంతరు సన్నని వెలుతురులో క్రమ్ముకుని, నా గుండెల్లో చుట్టుకుని, గాలిలో ఆకాశంలో నక్షత్రం చివరి మెరుపులో దాక్కుని, నీరవంగా నిజంగా వుంది, జాలిగా హాయిగా వినపడుతూ వుంది, శిశిర వసంతాల మధ్య వచ్చే మార్పుని గుర్తుకు తెస్తోంది యిన్నేళ్ళ తర్వాత...." –తిలక్

అనుబంధం–VI:

ఏఱిన ముత్యాలు - జ్ఞానరత్నాలు

- టి.వి.కె. సోమయాజులు

1. శ్లో॥ సంగీత సాహిత్య రసానుభూత్యై
కర్ణద్వయం కల్పితవాన్ విధాతా।
ఏకేన హీనః పునరేక కర్ణో
ద్వాభ్యాం విహీనో బధిరస్సయేవ॥

తా॥ బ్రహ్మదేవుడు మనకు రెండు చెవులు కల్పించాడు – ఒకటి సంగీతం విని ఆనందించడానికి; రెండవది సాహిత్యం విని ఆనందించడానికి. ఎవడైనా ఒకడు "నాకు సంగీతం ఇష్టంలేదు" అంటే, వాడికి ఒక చెవి పనిచేయడంలేదు – అని అర్థం. ఎవడైనా ఒకడు "నాకు సాహిత్యం ఇష్టంలేదు" – అంటే వాడికి కూడా ఒక చెవి పనిచేయడం లేదు అని అర్థం. ఎవడైనా ఒకడు (ఔరంగజేబులాంటివాడు) "నాకు సంగీత సాహిత్యాలు రెండూ ఇష్టంలేదు" – అంటే, వాడే నిజమైన చెవిటివాడు!

2. శ్లో॥ సంగీత సాహిత్య కళా విహీనః
సాక్షాత్ పశుః పుచ్ఛ విషాణ హీనః।
తృణం నఖాన్నపి జీవమానః
తద్భాగధేయం పరమం పశూనాం॥

తా॥ సంగీత సాహిత్యాలు విని ఆస్వాదించని వాడు – సాక్షాత్తు తోక కొమ్ములు లేని పశువు! ఈ వింత పశువు గడ్డిమేయకుండానే బ్రతికేస్తుంది! ఎందువల్లనంటే లోకంలో ఉన్న పశువులు చేసుకున్న గొప్ప అదృష్టం వల్ల! (ఈ వింత పశువు కూడా గడ్డి మేయడం మొదలుపెడితే లోకంలోని అసలు పశువులకు గడ్డి దొరకదు!)

3. శ్లో॥ వ్యాఘ్రీవ తిష్ఠతి జరా పరితర్జయన్తీ
రోగాశ్చ శత్రవ ఇవ ప్రహరన్తి దేహమ్।
ఆయుః పరిస్రవతి భిన్న ఘటాదివాంభః
లోక స్తథాపి అహితమాచరతీతి చిత్రమ్॥ (–భర్తృహరి)

తా॥ ముసలితనం ఆడపెద్దపులిలాగ బెదిరిస్తూ ఎదురుగా నిలబడి మీద పడటానికి సిద్ధంగా ఉంది. రోగాలు శత్రువులవలె శరీరాన్ని చితగ్గొదుతున్నాయి. ఆయుర్దాయం

బీటలు తీసిన కుండలోని నీళ్ళులాగ బొట్లు బొట్లుగా కారిపోతోంది. తన పరిస్థితి ఇలా ఉన్నా కూడా మానవుడు ఇతరులకు అపకారం చేస్తున్నాడు. ఇది చాలాచిత్రంగా ఉంది సుమా!

4. శ్లో॥ **యస్సుందరః - తద్వనితా కురూపా**
యా సుందరీ - సాపతి రూపహీనా।
యత్రోభయం - తత్ర దరిద్రతా చ
విధేర్విచిత్రాణి విచేష్టితాని ॥

తా॥ భర్త అందంగా ఉంటే-భార్య కురూపిగా ఉంటుంది. భార్య అందంగా ఉంటే - భర్త కురూపిగా ఉంటాడు. భార్యాభర్తలు ఇద్దరూ అందంగా ఉంటే ఆ సంసారంలో దారిద్ర్యం తాండవిస్తూ ఉంటుంది. బ్రహ్మదేవుని చేష్టలన్నీ విచిత్రంగా ఉంటాయి!

5. ఒక పండు ముసలి అవ్వకు నడుం బాగా వంగిపోయింది. ఒక ఊతకర్ర చేత పుచ్చుకొని, నేలచూపులు చూస్తూ, వీథిలో మెల్లగా నడచి వెడుతోంది. ఆమెకు ఎదురుగా మంచి యౌవనంలో పైలా పచ్చీసుగా ఉన్న ఒక యువకుడు వస్తున్నాడు. అతడు ఆ ముసలిదాన్ని ఆటపట్టించాలని అనుకున్నాడు. "ఏమిటి ముసలిదానా! నేలమీద వెతుకుతున్నావు?" అని అడిగాడు. బాగా వంగిపోయి నేలమీదికి చూస్తూ నడుస్తోంది కదా! అందుకని అలా అపహాస్యం చేస్తున్నాడు. ఆ ముసలిది శాంతంగా "ఒక వస్తువు పోయింది నాయినా! దానికోసం వెతుక్కుంటున్నాను!" అన్నది. "అంతగా వంగిపోయి వెతుక్కుంటున్నావు, ఏమిటావస్తువు?" అని అడుగుతూ ఆమెను "వినమ్రాంగీ!" అని సంబోధించాడు. మంచి యౌవనంలో ఉండి, స్తన భారంతో కొంచెం వంగిన యువతిని ఈ పదంతో వర్ణిస్తారు కవులు. ఇక్కడ యువకుడు ఆ పదంతో వృద్ధురాలి గేలిచేస్తున్నాడు. అప్పుడా ముసలిది "నా యౌవనపు ముత్యం పోయింది నాయనా! దానికోసం వెతుక్కుంటున్నాను!" అంది. (కొన్నాళ్ళకు నవ్వు కూడా నాలాగే వెతుక్కుంటావురా ఈనాటి నీనవయౌవనాన్ని!" అని ధ్వని - వాడికి చురక.) ఈ యిరువురి సంభాషణ శ్లోకరూపంలో ఉంది.

శ్లో॥ (యువకుడు:) **"అధః మశ్యసి కిం వృద్ధే?"**
(వృద్ధురాలు:) **"మృగ్యతే వస్తు కంచన!"**
(యువకుడు:) **"కిం తద్వస్తు వినమ్రాంగీ?"**
(వృద్ధురాలు:) **"నష్టం తారుణ్య మౌక్తికం!"**

6. శ్లో॥ తృణాదపి లఘుస్తూలః- తూలాదపి చ యాచకః ।
వాయునా కిం ననీతో సౌ? - మామయం ప్రార్థయే దితి॥

తా॥ గడ్డిపరకకన్నా దూది తేలిక! దూదికన్నా యాచకుడు తేలిక! అయితే, గడ్డిపకనూ దూదినీ పైకి ఎగరగొట్టే గాలి (వాయుదేవుడు) ఆ రెండింటికన్నా మిక్కిలి తేలికయైన యాచకుణ్ణి ఎందుకు ఎగరగొట్టడం లేదు? అనే ప్రశ్న వస్తుంది. యాచకుడి దగ్గరకు వెడితే వాడు తనను కూడా యాచిస్తాడేమో అని వాయుదేవుని భయం! అందువల్ల వాడి దగ్గరకు వెళ్ళడంలేదు!

7. శ్లో॥ గుణదోషౌ బుధోగృహ్ణన్ - ఇందుక్ష్వేడా వివేశ్వరః ।
శిరసా శ్లాఘతే పూర్వం -పరం కంఠే నియచ్ఛతి॥

తా॥ శివుడు చంద్రకళను శిరస్సు మీద ధరించాడు; విషాన్ని కంఠంలో దాచుకున్నాడు. అలాగే పండితుడైనవాడు ఇతరుల గుణాలను నెత్తిమీద పెట్టుకొని గౌరవిస్తాడు (శిరసావహిస్తాడు); దోషాలను తనలోపలనే దాచుకుంటాడు.

8. శ్లో॥ సుజనో నయాతి వైరం
పరహిత బుద్ధిః వినాశ కాలేపి ।
ఛేదేపి చందన తరుః
సురభయతి ముఖం కుఠారస్య ॥

తా॥ సజ్జనుడు ఎల్లప్పుడూ పరులకు మేలునే కోరుతాడు. తనను నాశనం చేస్తున్న వారికి కూడా మేలు చేస్తాడు. మంచిగంధపు చెట్టు తనను నరుకుచున్నప్పుడు కూడా ఆ గొడ్డలికి తన సువాసనను ఇస్తుంది కదా!

9. శ్లో॥ వస్త్రేణ, వపుషా, వాచా - విద్యయా, వినయేనచ।
వకారైః పంచభిర్యుక్తః - నరోభవతి పూజిత॥

తా॥ లోకంలో ఐదు 'వ'కారాలు కలిగిన నరుడు పూజింపబడతాడు:- (1) వస్త్రేణ= తగిన వస్త్రంధారణంచేత; (2) వపుషా= శరీరసౌష్ఠవంచేత; (3) వాచా = మంచి మాటకారితనంచేత; (4) విద్యయా = చక్కని విద్యచేత; (5) వినయేన= మిక్కిలి వినయంచేత. ఈ అయిదు కలిగిన వ్యక్తి గౌరవింపబడతాడు.

10. సంస్కృతంలో ఒక చక్కని చమత్కార భరితమైన శ్లోకం ఉంది. అది శివుని గురించిన ప్రార్థన. శ్లోకరచయితయైన ఆ కవి మనల్ని ఆశీర్వదిస్తున్నాడు. "హరః పాతువః" = శివుడు మిమ్మల్ని కాపాడుగాక!; "నగ్నోహరః పాతువః" =

దిగంబరుడైన శివుడు మిమ్మల్ని కాపాడుగాక!; "హ్రియా, నతముఖో, నగ్నోహరః పాతువః"=సిగ్గుతో తలవంచుకున్న దిగంబరుడైన శివుడు మిమ్మల్ని కాపాడుగాక! ఇప్పుడు శివుడు దిగంబరుడు ఎలా అయ్యాడో హాస్య రస గర్భితంగా చెపుతున్నాడు కవి.

ఒకనాడు విష్ణుమూర్తి, శ్మశానంలో ఉండే దిగంబరుడైన శివునికి ఒక వార్త పంపించాడు: "అయ్యా! మీతో నాకు కొంచెం పని పడింది; మీ దగ్గరకు వస్తున్నాను" అని. ఎల్లప్పుడూ పట్టుపీతాంబరాలు ధరించే గొప్పవాడైన విష్ణుమూర్తి తన దగ్గరకు వస్తూ ఉంటే, తాను దిగంబరంగా ఉంటే బాగుండదని, శివుడు హడావిడిగా ఒక పామును మొలత్రాడుగా చుట్టుకొని, గజచర్మాన్ని గోచీగా పెట్టుకుని, విష్ణుమూర్తిని ఆహ్వానించడానికి బయలుదేరాడు. ఇంతలో విష్ణుమూర్తి తన వాహనమైన (హెలికాప్టర్) గరుత్మంతుని మీద దిగాడు. శివుడు ఆయనను సమీపించబోయాడు. అప్పుడు శివుడు తన మొలత్రాడుగా చుట్టుకున్న పాము, గరుత్మంతుని చూచి గడగడ వణికిపోయి, ఒక్కసారిగా భూమి మీదికి దూకి పారిపోయింది! మళ్ళీ శివుడు యథాప్రకారంగా దిగంబరుడయిపోయాడు! విష్ణుమూర్తి ముందు సిగ్గుతో తలవంచుకున్నాడు. అటువంటి శివుడు మిమ్మల్ని రక్షించుగాక! (గరుత్మంతునికి పాములు ఆహారం. అవి కనపడితే గుటుక్కున నోట్లో వేసుకుంటాడు)

శ్లో॥ విష్ణోరాగమనం నిశమ్య, సహసాకృత్వా ఫణీంద్రం గుణం
కౌపీనం పరిధాయ చర్మకరిణః, శంభుః పురోధావతి।
దృష్ట్వా విష్ణురథం సకంపహృదయః సర్పో పతత్ భూతలే,
కృత్తిర్విస్ఖలితా, హ్రియా, నతముఖో, నగ్నో, హరః పాతువః ॥

11. "హరికథా పితామహుడు" ఆదిభట్ల నారాయణదాసుగారు హరికథ చెప్పబోతూ, "హరికథ చెప్పమంటారా? గిరికథ చెప్పమంటారా?" అని అడిగారు సరదాగా శ్రోతల్ని. సభలో ఉన్న ఒక కొంటెవాడు "మాకు హరికథ వద్దు, గిరికథ చెప్పండి!" అన్నాడు ("మాయాబజార్" సినిమాలో మాకు "కంబళి" వద్దు, "కింబళి" కావాలి అని-"తల్పం" వద్దు "గిల్పం" కావాలి-అని అడిగినట్టుగా). దాసుగారు "సరే! 'గిరికథ' పార్వతీ కల్యాణం చెపుతున్నాను, వినండి!" అని హరికథ చెప్పబోతున్నారు. ఇంతలో ఆయన శిష్యుడు, "అయ్యా గురువుగారూ! ఈ రోజు మీ హరికథ వినడానికి కలెక్టరు దొరగారు వచ్చారు. కాబట్టి మీరు

ఆంగ్లంలో ప్రార్థన చేయండి. దొరవారికి బాగా అర్థమవుతుంది" అన్నాడు. దాసుగారు "ఓ! దానికేముంది! అలాగే చేస్తాను!" అని ఆశువుగా, ఒక ఉత్పలమాల పద్యంలో ఆంగ్లపద మిశ్రితంగా, శివుణ్ణిగురించి ఈ క్రింది విధంగా ప్రార్థన చేశారు:-

ఉ॥ హెడ్డున మూను, స్కిన్నుపయి నెంతయు డస్టును, ఫైరు నేత్రమున్,
సైడున గ్రేటు బుల్లు, బహుచక్కని గాంజెసు హైరు లోపలన్,
బాడికి హాఫెయౌచు నలపార్వతి మౌంటెను దాటరుండ, ఐ
షుడ్డు డివోటు దండములు సోకగ ప్రేయరు సేతు నెప్పుడున్!

12. ఒక పెండ్లిలో ఆంగ్ల విద్యాపారంగతులైన వధూవరులను ఆశీర్వదిస్తూ, ఒక హాస్యకవి, వధువును తన చెల్లిగా సంబోధిస్తూ, సంసారపు మెలకువలు చెపుతూ ఈ క్రింది సీస పద్యం చదివాడు:-

సీ॥ "హస్బెండు" తెచ్చిన "అన్‌వాల్యుథింగైన"
"మోస్టు బ్యూటీ" యంచు మురిసికొనుము;
"రిక్వెస్టు" చేయగా "రెఫ్యూజు" చేయక
"థాంక్స"ని అద్దాని తీసికొనుము;
"సిల్లి"గా ఎపుడైన చిలిపి చేష్టలు చేయ
"సీరియస్" కాబోకు చెల్లి! నీవు;
"ఆఫీసు" వేళైన, "కాఫీ"కి "లేటైన"
"సారీ"ని చెప్పుమా సారసాక్షి!;
తే॥ ఆంగ్లభాషకు అలవడ్డ అయ్యవార్ల-
తోడి కాపురమును చేయు జాడ లెఱిగి
స్త్రీలు వర్తించునట్టివౌ "సీకిరేట్లు"
ఎఱిగి మసలిన వారికి "హెవెను" మెట్లు!!

13. ఒక కవిశేఖరుడు శతావధానం చేస్తున్నాడు. ఆ అవధానిని పరాభవం చేయాలని కొందరు సభ్యులు మాటిమాటికి అల్లరిచేస్తున్నారు. అవధానికి చాలా కోపం వచ్చి, ఆ అల్లరి చేసేవాళ్ళందరినీ గట్టిగా తిట్టాలని నిశ్చయించుకున్నాడు. ఇంతలో ఒక పృచ్ఛకుడు "అందఱి కందఱే మఱియు నందఱి కందఱె అందఱందఱే!" అనే సమస్య ఇచ్చాడు. అవధానికి అల్లరిచేసేవాళ్ళని ఛెడామడా

తిట్టడానికి మంచి అవకాశం దొరికింది. ఆ సమస్యను ఆధారంగా చేసికొని, ఆ అల్లరిగాళ్ళను ధ్వని గర్భితంగా గట్టిగా చీవాట్లు పెట్టాడు ఈ క్రింది పద్యంలో:-

ఉ॥ కొందఱు పార్థు టెక్కెములు! కొందఱు కాలుని వాహనంబులున్!
కొందఱు భైరవాశ్వములు! కొందఱు నీశ్వరు వాహనంబులున్!
కొందఱు కృష్ణజన్మమున కూసిన ధన్యులు! ఎంచి చూడగా
అందఱి కందఱే మఱియు నందఱి కందఱె! అందఱందఱే!!

తా॥ "ఈ సభలో కొందరు అర్జునుని జెండాలు (కోతులు) - కొందరు యమధర్మరాజుగారి వాహనాలు (దున్నపోతులు) - కొందరు భైరవుని గుఱ్ఱాలు (కుక్కలు) - కొందరు ఈశ్వరుని వాహనాలు (ఎద్దులు)! - కొందరు కృష్ణుడు జన్మించినప్పుడు కూసిన ధన్యజీవులు (గాడిదలు)! - పరిశీలిస్తే అందరికందరే సరైనవాళ్ళు!" సభలో అల్లరి చేస్తున్నవాళ్ళని "కోతులు - దున్నపోతులు - కుక్కలు- ఎద్దులు - గాడిదలు" అని సిగ్గుపడేలాగా తిట్టి కసితీర్చుకున్నాడు ఆ అవధానిగారు.

14. శ్లో॥ అహన్యహని భూతాని - గచ్ఛన్తీ హ యమాలయమ్।
శేషాః స్థిరత్వ మిచ్ఛన్తి - కిమాశ్చర్య మతః పరమ్?"

తా॥ ప్రతిదినము అనేక జీవులు మరణిస్తూనే ఉన్నాయి. కాని మిగిలి ఉన్నవి మాత్రం తాము స్థిరంగానే ఉంటామన్నట్లుగా జీవయాత్ర సాగిస్తూనే ఉన్నాయి. బాగా ఆలోచిస్తే, ఇంతకన్నా ఆశ్చర్యమేముంటుంది?

15. శ్లో॥ ద్రవ్యాణి భూమౌ, పశవశ్చ గోష్ఠే
భార్యాగృహద్వారి, జనశ్మశానే, ।
దేహశ్చితాయాం, పరలోకమార్గే
కర్మామగో గచ్ఛతి జీవ ఏకః...."

తా॥ సంపాదించిన ధనం భూమిమీద ఉండిపోతుంది; పశువులు కొట్టంలో ఉండిపోతాయి; భార్య గృహద్వారం లోపల ఉండిపోతుంది; బంధుమిత్రులు శ్మశానం దగ్గరనే నిలిచిపోతారు; దేహం చితిపై మిగిలిపోతుంది. జీవుడు మాత్రం తాను చేసిన కర్మను అనుసరించి ఒంటరిగా ప్రయాణం చేస్తాడు!

2. జ్ఞానరత్నాలు

2.1 ఆస్తిక-నాస్తిక వాదాలు

ప్రశ్నసప్తకం:

1. దైవం-దేవుడు-దేవత: ఈ మూడింటిలో ఏది అనాలి?
2. దేవుడు ఉన్నాడా?
3. ఎక్కడున్నాడు?
4. ఉంటే కన్పించడేం?
5. దేవుడు ఏమి చేస్తాడు?
6. కన్పించటం లేదు కాబట్టి "దేవుడు లేడు" అంటాను. మీరేమంటారు?
7. అంతటా భగవంతుడున్నప్పుడు దేవాలయానికి ఎందుకు వెళ్ళటం?

1. దైవం-దేవుడు-దేవత - ఈ మూడింటిలో ఏది అనాలి?

సమాధానం: మూడు లింగములు దైవస్వరూపములే! దైవము గుణాతీతుడు. "యా దృశీ భావనా యత్ర సిద్ధిర్భవతి తాదృశీ"-భగవద్గీత - నీవు ఎట్లూహించెదవో, అట్లే నీకు సిద్ధించును. "యే యథా మాం ప్రపద్యంతే తాన్ తథైవ భజామ్యహం" -భగవద్గీత-ఎవరు ఏ ప్రకారముగా నన్ను ఆశ్రయించుచున్నారో (సేవించుచున్నారో) వారలను ఆ ప్రకారమే నేను అనుగ్రహించుచున్నాను.

2. దేవుడు ఉన్నాడా?

సమాధానం:

(1) ఉంటేనే మన తిప్పలు ఇలా ఉన్నాయి. లేకపోతే దిక్కు లేకుండా పోయేవాళ్ళం! (దిక్కులేనివారికి దేవుడే దిక్కు!).

(2) ఎందుకూ పనికిరాని - చేతకాని వెధవవు నీవే ఉన్నావే? సృష్టి-స్థితి - లయకారుడు, 84 లక్షల జీవరాసుల్ని పోషించే మహనీయుడు ఉండలేడా?

(3) ఈ ప్రపంచంలో ఉండే అన్ని వస్తువులకు నిర్మాత ఉన్నాడు.. భూమ్యాకాశాలు - పంచభూతాలు - సూర్యచంద్రులు - ఖగోళాలు - 84లక్షల జీవరాసులు కన్పిస్తున్నాయే! "వీటిని నిర్మించినవాడు కూడా ఒకడున్నాడు!". అనే భావం నీకు ఎందుకు కలగటం లేదు?

3. ఎక్కడున్నాడు?

సమాధానం: ఎక్కడ లేడో చెప్పు? ఉన్నచోటు నేను చెప్తాను!

క॥ ఇందుగల డందు లేడని సందేహము వలదు, చక్రి సర్వోపగతుం,
డెందెందు వెదకి చూచిన అందందే కలడు దానవాగ్రణి! వింటే?

4. ఉంటే కన్పించదేం?

సమాధానం: నీకు ఎందుకు కన్పించాలి? నీవు దేవుడికి బాస్‌వా? (యజమానివా?)

నీకు కన్పించనంత మాత్రంతో లేదు అంటావా? కన్పించనివి అన్నీ "లేవు" అంటావా?

(a) పగటివేళ నక్షత్రాలు ఉన్నాయా?

(b) నీ కన్ను నీకు కన్పిస్తోందా?

(c) నీ వీపు?

(d) గాలి కన్పిస్తోందా?

(e) పాలలో వెన్న?

(f) దండలో దారం?

(g) నీ తాతకు తండ్రి?

(h) అమెరికా ఉందా? కనిపిస్తోందా?

వస్తువులయొక్క అన్నిటి ఉనికిని మన కళ్ళతో మనం చూడలేము. దర్శించటానికి మూడు మార్గాలున్నాయి:-

(1) ప్రత్యక్ష ప్రమాణము; (2) అనుమాన ప్రమాణము; (3) ఆప్తవాక్యము.

(1) ప్రత్యక్ష ప్రమాణము:-

"అన్నీ ప్రత్యక్షంగా చూస్తేకాని నమ్మను!" అనేవాడు మూర్ఖుడు. నీ కన్ను నిన్ను మోసం చేస్తుంది. ఎదురుగా ఉన్న వస్తువును చూడటానికి కూడా దాని శక్తి చాలదు. సాధనలు అవసరం.

నక్షత్రాలను చూడాలంటే - దూరదర్శిని

లోపలి వస్తువులను చూడాలంటే - ఎక్సరే.

సూక్ష్మజీవుల్ని చూడాలంటే - మైక్రోస్కోపు

దేవుణ్ణి చూడటానికి - దివ్యక్షేత్రాలు.

కొన్నిటికి ఉపకరణాలు కావాలి. మన నేత్రాలు, మన వీపు అద్దాలలో చూస్తున్నాము.

(2) అనుమాన ప్రమాణము:-

"యత్ర ధూమః తత్ర వహ్నిః"-పొగ ఉన్నచోట అగ్ని ఉండును. ఒక దానిని బట్టి మరియొకటి ఊహించుట అనుమాన ప్రమాణము.

1. మన తాతను- (మన తండ్రికి - తండ్రిని) మనం చూచినాము. దీనిని బట్టి మన తాతకు కూడా తండ్రి ఉన్నాడని నమ్ముతున్నాము.
2. గాలి కన్పించకపోయినా స్పర్శను బట్టి గ్రహిస్తున్నాము.
3. దండలో దారం కూడా ఉంటుందని ఒప్పుకుంటున్నాము.
4. పాలలో వెన్న ఉంటుందని అంగీకరిస్తున్నాము.

(3) ఆప్తవాక్యము:-

గురువులు-పెద్దలు-మిత్రులు చెప్పిన విషయాలు అంగీకరిస్తాము. ఆప్తవాక్యంగా విశ్వసిస్తాము..

అమెరికాను గురించి ఒక వ్యక్తి వింటూ "ఏది? కన్పించదేం?" అన్నాడు.

సమాధానం: ఊరికే కన్పిస్తుందా? వీసా తీసికొని, పైసా చేత్తో పట్టుకొంటే కన్పిస్తుందన్నాడు.

భగవద్గీత 11వ అధ్యాయంలో "విశ్వరూపాన్ని చూపిస్తున్నాను" అన్నాడు. కృష్ణుడు. అర్జునుడు కళ్ళు బాగా తెరచి రెప్పవేయకుండా చూస్తున్నాడు. అప్పుడు కృష్ణుడు:

శ్లో॥ నతు మాం శక్యసే ద్రష్టుం అనేనైవ స్వచక్షుషా ।
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ ॥

తా॥ ఓ అర్జునా! నీవు ఈ చర్మనేత్రములతో నన్ను చూడలేవు! దివ్య నేత్రమును నీకు అనుగ్రహిస్తున్నాను, చూడు!- అన్నాడు. భగవంతుని దర్శించటానికి జ్ఞాననేత్రం కావాలి! త్రీడి పిక్చర్స్‌కు కళ్ళజోడు కావాలి. పాలలో వెన్న ఉన్న విషయాన్ని అర్థం చేసికోవటానికి, కర్మయోగాన్ని ఆశ్రయించాలి. భక్తి - జ్ఞాన - కర్మ - యోగ మార్గాలలో ఏదో ఒక మార్గాన్ని పట్టుకొని విశ్వాసంతో ప్రయాణిస్తేనే ఆ విశ్వేశ్వరుణ్ణి సందర్శించగలం.

అంధుడు "లేదు" అంటే – సూర్యుడు లేకుండా పోడు. నాస్తికుడు "లేదు" అంటే – దేవుడు లేకుండా పోడు. అంధుణ్ణి అసహ్యించుకోము; జాలిపడతాము. అలాగే నాస్తికుణ్ణి చూచి జాలిపడాలి. "దేవుడు లేడు!" అన్న నాస్తికుణ్ణి కూడా దేవుడే పోషిస్తున్నాడు!

5. దేవుడు ఏమి చేస్తాడు?

సమాధానం: మానవుని ఊహలకు అందని – మానవుడు చెయ్యలేని పనులు చేస్తాడు. మూగవాడిచేత ఉపన్యాసాలు చెప్పిస్తాడు. కుంటివాడిచేత పర్వతాలు. దాటిస్తాడు. అతని లీలలు చూచి హస్తాలు జోడించవలసిందే! అఘటన ఘటనా సమర్థుడు! ప్రపంచంలో ఏ జడ్జీలు విధించలేని భయంకర శిక్షలు–అత్యాశ్చర్యకరమైన రక్షలు – భగవంతుని దిన (క్షణ) కృత్యాలు! భగవంతుడు చేసే పనులు హేతువాదానికి అందవు!

6. కన్పించటం లేదు కాబట్టి "దేవుడు లేడు" అంటాను. మీరేమంటారు?

సమాధానం: నీ అంత మూర్ఖుడు లేడని నేను అంటాను. ఉపకరణములతో, అనుమాన ప్రమాణముతో, ఆప్తవాక్యములతో సత్యాన్ని అంగీకరించవలసిన నీవు, గ్రుడ్డివాడు "సూర్యుడు లేడు" అన్నట్లుగా మాట్లాడితే, నీవు "కళ్ళున్న గ్రుడ్డివాడివి" అని అంటాను. కొంతమందికి వెదకుకోవటం బద్ధకం! అలాంటి బద్ధకస్థులు దేవుడు లేడన్నారు. విశ్వాసమే దైవం! "నమ్మక చెడకుర శ్రీహరిని!"

7. అంతటా భగవంతుడున్నప్పుడు దేవాలయానికి ఎందుకు వెళ్ళటం?

సమాధానం: "దేవుడు దేవాలయంలో ఉన్నాడు!" అనేది భక్తి! "అంతటా ఉన్నాడు" అనేది జ్ఞానం! భక్తుడు తప్పుచేయవచ్చును కాని జ్ఞాని తప్పు చేయలేడు! భగవంతుడు వివిధ రూపాలలో (మనుష్య రూపేణ దైవం) సాక్షాత్కరిస్తూ సహకరిస్తాడు. దైవాన్ని గుర్తించకపోవటం మన అజ్ఞానం. **I came to you like a friend, like an old man and like a child, but you didn't receive me!** "భగవంతుడు ఎక్కడను లేడు!" అని వ్రాసిన మహాక్షరములలో కూడ భగవంతుడున్నాడే! అతడింక ఎక్కడ లేడు?

GOD IS NOWHERE! = GOD IS NOW, HERE!

సాక్షాత్కరించిన దైవానికి స్వాగతం చెప్పి అభినందించుదాం! రండి!!

సీ॥ లోకాల చీకట్లు పోకార్ప రవిచంద్ర
దీపాలు గగనాన త్రిప్పలేక –
జగతిపై పడవచ్చు జలరాశి కెఱటాలు
మామూలు మేరకు మడవలేక–
పనిమాలి ప్రతిరోజు ప్రాణికోటుల గుండె
గడియారముల కీలు కదపలేక –
అందాలు చిందు నీలాకాశ వీథిలో
చుక్కల ముగ్గులు చెక్కలేక –

తే॥ ఎంత శ్రమనందుచుంటివో ఏమొ స్వామి!
అడుగిడితి వెట్లొ నేడు మా గడపలోన –
గుండె కుదిలించి నీ ముందు కుప్పవోతు!
అందుకొనుమయ్య హృదయ పుష్పాంజలులను!!

సీ॥ పుట్టబోయెడి బుల్లి బుజ్జాయి కోసమై
పొదుగు గిన్నెను పాలు పోసి పోసి,
కలికి వెన్నెలలూరు చలువ పందిళ్ళలో
లతలకు మారాకు లతికి యతికి,
పూల కంచాలలో రోలంబములకు – రే
పటి భోజనము సిద్ధపరచి పరచి,
తెలవారకుండ మొగ్గలలోన చొరబడి
వింతలౌ రంగులు వేసివేసి,

తే॥ తీరికే లేని విశ్వసంసారమందు
అలసిపోయితివేమొ దేవాదిదేవ!
ఒక నిమేషము కన్ను మూయుదువు గాని
రమ్ము! తెరచితి మా కుటీరమ్ము తలుపు!

– "కరుణశ్రీ" జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు

2.2 అర్థమును కాదు, అంతరార్థమును గ్రహింపవలెను!

1. బ్రాహ్మణుడు "ముక్కు పట్టుకో!" అంటే – బ్రాహ్మడి ముక్కు కాదు! 'నీ ముక్కు' అని అర్థం.

2. ఇంట్లోకి కుక్క వస్తుంది –చూస్తూ ఉండు! అంటే – జాగ్రత్తగా ఉండు అని అర్తం. చూస్తూ ఊరుకోమని కాదు!

3. ఈ ప్రసాదం చీమలు పట్టనిచోట దాచు! అంటే, దానిని తినవేసి – "పొట్టలో పెట్టుకొన్నాను. చీమలు పట్టవండి!" అన్నాడట ఒక మూర్ఖశిష్యుడు.

4. గురువుగారు శిష్యుడికి ఆత్మీయత నేర్పటం కోసం "మన" అంటూ ఉండమన్నారు. "మన ఆవులు, మన యిల్లు, మన పుస్తకాలు, మన గాదెలు" అనమన్నాడు. అంతా విన్న మూఢశిష్యుడు, మధ్యాహ్నమయ్యేసరికి – "మన ఆవిడ భోజనానికి రమ్మంటున్నారండి!" అన్నాడట!

5. "మొక్కలకు వేళ్ళు తడిసేలా నీళ్ళు పొయ్యి" అన్నాడు యజమాని. మూర్ఖుడైన పనివాడు – మొక్కలు పీకి నీళ్ళకుండలో ముంచుతున్నాడట!

6. "ఈసారికిలా కానియ్యండి! మళ్ళీసారి తగ్గిస్తాము!" – పెళ్ళి భాజాభజంత్రీల బేరాలలో, వంటబ్రాహ్మణ బేరాలలో శుభాలలో అలా అంటారు! శవాన్ని చిన్నకారులో తీసికెళ్ళే వేళ, చిన్నకారువాడు లేదా శవాన్ని మోసేవాహకుడు – అలా మాట్లాడకూడదు కదా!

2.3 శిష్య ప్రశ్నలు – శంకర సమాధానాలు

1. దుఃఖం కిం నిమిత్తం భవతి? – శరీర పరిగ్రహాత్!
   = దుఃఖ మెందుకు వచ్చును? – శరీరములో ఉండుటవలన.
2. శరీర పరిగ్రహః కేన భవతి? – కర్మణా!
   = శరీరాన్ని ఎందుకు పట్టుకొన్నాడు?–సుకర్మ–దుష్కర్మలు చేయుట వలన.
3. కర్మకేన భవతి? – రాగాదిభ్యః
   = కర్మలు ఎందుకు చేయును? – రాగ– ద్వేష– అహంకార– మమకారముల వలన.
4. రాగాదయః కేన భవన్తి? – అజ్ఞానాత్!

= రాగద్వేషము లెందుకు వచ్చును? – అవబోధనము లేక – లోకమును అర్థము చేసికొనక.

5. అజ్ఞానము కిం నిమిత్తం భవతి–అజ్ఞానమెందుకు వచ్చును? అది ఏమి?
= అజ్ఞానం–అనాద్యం–అనిర్వచనీయం!!
ఈ గుహలోకి చీకటి ఎలా వచ్చింది? అని తలబ్రద్దలు కొట్టుకోకు. జ్ఞాన జ్యోతిని వెలిగించుకో! చీకటిని తొలగించుకో!

2.4 తృప్తి:-

1. కోట్లు లేవని ఏడవకు! – కూటికి ఉన్నందుకు సంతోషించు!!
2. తేలు కుట్టిందని ఏడవకు! – పాము కరవనందుకు సంతోషించు!!
3. ఒక కన్ను పోయిందని ఏడవకు! – రెండు కళ్ళూ పోనందుకు సంతోషించు!!
4. జబ్బు వచ్చిందని ఏడవకు! – డబ్బుతో ఉన్నందుకు సంతోషించు!!

2.5 ఏడుపులు:-

"లోకం శోకహతం చ సమస్తమ్!"

(లోకులు అందరూ ఏడుస్తున్నారు. కాని స్థాయి భేదాలున్నాయి. అంతే తేడా!)

1. గంజిలోకి ఉప్పులేదని – పాలలోకి పంచదార లేదనీ;
2. నడకవాడు – చెప్పులు లేవని; చెప్పులున్నవాడు – సైకిలు లేదనీ
3. సైకిలున్నవాడు – స్కూటరు లేదని!; స్కూటరున్నవాడు – కారులేదని! కారున్నవాడు – హెలికాప్టరు లేదనీ!
4. పెళ్ళికానివాడు చేసికోలేదని; చేసికొన్నవాడు – పిల్లలు లేరనీ;
5. పిల్లలున్నవాడు – డబ్బులేదని; డబ్బు ఉన్నవాడు – ఇంకా లేదనీ;
6. పిల్లలున్నవాళ్ళు – చెప్పిన మాట వినటం లేదనీ, ఎదురింటి వాళ్ళ పిల్లల్లా లేరనీ, అందుపులో పెట్టలేక – పోషించలేక – చదువుకోవటం లేదనీ, ఉద్యోగాలు రాలేదనీ – వస్తే పెద్ద ఉద్యోగాలు కావనీ.
7. ఆడపిల్లలకు–పెళ్ళి చెయ్యలేకపోయామనీ, పెళ్ళిచేస్తే – కూతురు మందలో ఉందనీ, వేరే కాపురం పెట్టలేదనీ, అత్తమామలు బ్రతికి ఉన్నారనీ, అందరూ ఆడపిల్లలే అనీ;
8. స్థలం లేనివాడు – విశాల ప్రపంచంలో విసనకఱ్ఱంత నేల సంపాదించ లేకపోయాననీ,

సంపాదించినవాడు - ఇల్లు కట్టలేదనీ
ఇల్లు కట్టినవాడు - అద్దెకు పెట్టలేదనీ
అద్దెకు పెట్టినవాడు - సరిగా అద్దె ఇవ్వటంలేదనీ
ఇల్లు ఖాళీ చెయ్యటం లేదనీ - పన్నులు పెంచారనీ;

9. అన్నీ ఉన్నవాడు - ఆరోగ్యం లేదనీ
జుట్టు నెరుస్తోందనీ, పళ్లు ఊడిపోతున్నాయనీ,
దార పుత్రులు - ధనం ఎప్పుడు ఏమైపోతాయో అనీ;
ఎందుకో అందుకు, అందరూ ఏడిచేవాళ్ళే!

10. కాళ్లు తడి అవకుండా సప్తసముద్రాలూ దాటవచ్చు! కాని కళ్ళు తడి అవకుండా జీవితాన్ని దాటలేడు మానవుడు!

11. భయం! భయం! బ్రతుకు భయం!! బెంగ! బెంగ!!

12. ఈ ప్రపంచంలో ఒక్క జ్ఞాని తప్ప, అందరూ ఏడుస్తున్నారు. లేనివాడు "లేద"నీ, ఉన్నవాడు "పోతుందేమో" అనీ.

భరతవాక్యము

(శాంతిమంత్రములు)

1. శ్లో॥ స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయ్యేన మార్గేణ మహీం మహీశా ।
గోబ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యం
లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ॥

2. శ్లో॥ కాలే వర్షతు పర్జన్యః, పృథివీ సస్యశాలినీ ।
దేశోఽ యం క్షోభరహితో, బ్రాహ్మణాస్సంతు నిర్భయాః॥

3. శ్లో॥ అపుత్రాః పుత్రిణ స్సంతు, పుత్రిణ స్సంతు పౌత్రిణః ।
అధనా స్సధనా స్సంతు, జీవంతు శరదాం శతమ్ ॥

అనుబంధం–VIII :

ఛాయాచిత్రములు

తణుకులో తిలక్‌గారి యిల్లు (టౌన్ హాలు ప్రక్కన) ఫోటో: శ్రీ ఈవని సత్యనారాయణమూర్తిగారు (తిలక్‌గారి మేనల్లుడు)
గత ఏభై ఏండ్లుగా ఇది డా॥ వత్సవాయి వెంకటరాజుగారి 'శకుంతలా నర్సింగ్‌హోమ్' (శిశువైద్యశాల)

శ్రీమతి ఇందిరాదేవి – శ్రీ తిలక్ దంపతులు – బాల్యంలో చిరంజీవులు :
చంద్రలేఖ – 'సుబ్బన్న' – 'సత్యం' (1954)

శ్రీ యనమండ్ర విశ్వమోహనరావు–శ్రీమతి చంద్రలేఖ దంపతులు (1966)

కీ.శే. దేవరకొండ బాలగంగాధర తిలక్

జననం : 1921 ఆగస్టు 1వ తేది; మరణం: 1966 జూన్ 30వ తేది రాత్రి

కీ.శే. దేవరకొండ బాలగంగాధర తిలక్

(1921–1966)



తిలక్‌గారి దస్తూరీ



మిత్రుడు శ్రీపాద కృష్ణమూర్తి తణుకులో ఫోటో స్టూడియోలో తీయించిన తిలక్‌గారి ఫోటో



1967 నుండి ఈనాటి వరకు విశాలాంధ్రవారు ప్రచురిస్తున్న
తిలక్‌గారి కథల పుస్తకం



1968 నుండి ఈనాటి వరకు విశాలాంధ్రవారు ప్రచురిస్తున్న
తిలక్‌గారి కవితా సంపుటి "అమృతం కురిసిన రాత్రి"



1993లో తిలక్‌గారి పెద్దకొడుకు డా॥ డి.యస్.మూర్తిగారు
ప్రచురించిన తిలక్ పద్యకవితా సంపుటి "గోరువంకలు"

శతజయంతి సమాపనోత్సవంలో తిలక్ విగ్రహానికి
పూలమాలవేస్తున్న శ్రీ తంగిరాల పాల గోపాలకృష్ణగారు,
సంయుక్త కార్యదర్శి, నన్నయపీఠం, తణుకు 01.08.2021



2013 నుండి ఎమెస్కోవారు ప్రచురిస్తున్న

"తిలక్ లభ్యరచనల సంకలనం"

ప్రధాన సంపాదకుడు: ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు

తిలక్‌గారి ప్రియశిష్యులు:
ప్రొ॥ తంగిరాల సుబ్బారావు – డా॥ శ్రీపాద కృష్ణమూర్తి

శతజయంతి సమాపనోత్సవంలో నన్నయపీఠం ప్రధాన కార్యదర్శి శ్రీ సుశర్మగారి నాయకత్వంలో తిలక్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించిన సాహిత్య వేత్తలు, తణుకు, ఆగస్టు 1వ తేది, 2021

తిలక్ సాహితీ సమాలోచనమ్: 27-01-2008, హైదరాబాద్

తంగిరాల సిద్ధం చేసిన తిలక్ ఛాయాచిత్రాన్ని డా॥ దేవరకొండ సత్యనారాయణమూర్తికి బహూకరిస్తున్న డా॥ సి. నారాయణరెడ్డిగారు

తిలక్ ఛాయాచిత్రాన్ని శ్రీమతి చంద్రలేఖకు బహూకరిస్తున్న డా॥ సి. నారాయణరెడ్డిగారు

ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారికి – డా॥ సి.నారాయణరెడ్డిగారిచే తిలక్ సాహిత్య పురస్కారం

ఆచార్య తంగిరాలకు తిలక్ సాహిత్య పురస్కారం

తిలక్‌గారి సంతానం - బంధువులు

తిలక్‌గారి పెద్దకొడుకు డా॥ దేవరకొండ సత్యనారాయణమూర్తిగారి కుటుంబం-1

పెద్దకూతురు: "సంధ్య" - భార్య: "శ్రీమతి శారద" - డా॥ సత్యం- చిన్నకూతురు: "స్మిత" (లండన్)

డా॥ దేవరకొండ సత్యనారాయణమూర్తిగారి కుటుంబం–2

చిన్నకూతురు: "స్మిత" – భార్య: "శ్రీమతి శారద" – డా॥ సత్యం – పెద్ద కూతురు "సంధ్య"

తిలక్‌గారి చిన్నకొడుకు - చిన్నకోడలు

డా॥ దేవరకొండ సుబ్రహ్మణ్యం-చి॥ సౌ॥ హరికుమారి(అమెరికా)

డా॥ సుబ్రహ్మణ్యం కుటుంబం-ముందు వరుస: కోడలు: బెట్సీ-భార్య: శ్రీమతి హరికుమారి-మనుమడు: చి॥ ఎవన్-డా॥ సుబ్రహ్మణ్యం
వెనుక వరుస: చి॥ రాజేష్ తిలక్ - చి॥ సునీల్ - చి॥ సంజయ్ (కొడుకులు)

శ్రీమతి చంద్రలేఖ కుటుంబం – ముందు వరుస: శ్రీమతి చంద్రలేఖ – భర్త:శ్రీ యనమండ్ర విశ్వమోహనరావుగారు
తల్లి: శ్రీమతి ఇందిరాదేవిగారు – వెనుక: కుమార్తెలు: శ్రీమతి సీత – శ్రీమతి గీత – శ్రీమతి పద్మ

శ్రీమతి చంద్రలేఖ మనుమలు–మనుమరాండ్రు
(తిలక్‌గారి మునిమనుమలు–మునిమనుమరాండ్రు)

శ్రీ ఈవని సత్యనారాయణమూర్తి – డా॥ వసుంధర దంపతులు
(తిలక్‌గారి మేనల్లుడు – తమ్ముని కూతురు – మేనరికం)

తణుకులో 17-08-2013 నాడు తిలక్‌గారి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి శ్రీమతి దేవరకొండ లక్ష్మీపార్థసారథి, I.A.S., Principal Secretary, Tourism and Culture, (తిలక్‌గారి తమ్ముని కూతురు)

శ్రీమతి దేవరకొండ లక్ష్మీపార్థసారథిగారు, I.A.S., (Principal Secretary, Tourism and Culture, Govt. of Andhra Pradesh) ప్రత్యేక శ్రద్ధతో 17-08-2013 నాడు తణుకులో ఆవిష్కరింపజేసిన తిలక్‌గారి కాంస్య విగ్రహం (తణుకు మునిసిపల్ ఆడిటోరియంకికూడా తిలక్‌గారి పేరుపెట్టారు.)

– ఫోటో: శ్రీసుశర్మగారు



గ్రంథరచయిత
ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారు

"భళ్ళమూడివారి చిట్టి"

కీ.శే. తంగిరాల శకుంతలాదేవిగారు

జననం: 30-04-1940 :: మరణం: 31-08-2006

దాతలు-బంధువులు



ఈ గ్రంథ ముద్రణకు రూ.30,000/- లు విరాళమిచ్చిన

"అపరదానకర్ణుడు"

(రాయలసీమ మహాదాత బుడ్డా వెంగళరెడ్డిగారి వంశంలోనివారు.)

శ్రీమతి శంకరి - కర్నల్ తంగిరాల కృష్ణమూర్తి దంపతులు

చి॥ "కాళిదాసు" – చి॥ సౌ॥ నాగలక్ష్మి
(కాశ్మీరీ దుస్తుల్లో – దాల్ లేక్ – శ్రీనగర్)

శ్రీ పోచా బ్రహ్మానందరెడ్డిగారు – ధర్మపత్ని శ్రీమతి పుల్లమ్మగారు

మునిమనుమడు-మనుమరాలు-మనుమడు-చి॥ శివాంశ శౌరి, డా॥ నిరుపమ,
డా॥ వేంకట శ్రీరామ ఫణిప్రసన్నతేజస్వి

డా॥ వత్సవాయి వెంకటరాజుగారు - ధర్మపత్ని శ్రీమతి సత్యవతిగారు

చి॥ కాశీభట్ల విక్రాంత్ కౌశిక్ – డా॥ శ్రీ ప్రసన్న ప్రత్యూష దంపతులు
పిల్లలు: చి॥ రాఘవ శ్రీహరి ప్రవీర్ శౌర్య – చి॥ శ్రీ ప్రావ్య స్వర

శ్రీమల్లాది చంద్రశేఖర్ – శ్రీమతి శైలజాదేవి దంపతులు

మా మునిమనుమడు చిరంజీవి అర్జున్
(శ్రీమతి సీత- ప్రొ॥ పుట్టప్ప దంపతుల మనుమడు)

మా అన్నయ్య కీ.శే. టి.వి.కె. సోమయాజులుగారు
(కీ.శే. తంగిరాల వేంకట కృష్ణ సోమయాజులుగారు)
జననం: 30-12-1930 :: మరణం: 28.07.2021

కీ.శే. టి.వి.కె. సోమయాజులుగారు (తంగిరాల వేంకట కృష్ణ సోమయాజులుగారు) (1930 - 2021)

ప్రముఖ కవి డా॥ గుంటూరు శేషేంద్రశర్మగారు (1927-2007)

డా॥ పోతుకూచి ఉమాభట్టీశ్వరశర్మ-శ్రీమతి విజయలక్ష్మి దంపతులు

డా॥ కాదరబాద్ రవీంద్రనాథ్ – శ్రీమతి జ్ఞానప్రసూన దంపతులు

శ్రీమతి ఎం.వి. లక్ష్మి –శ్రీ మల్లెబోయిన లక్ష్మీనారయణ యాదవ్ దంపతులు

శ్రీమతి అంబికా అనంత్‌గారు

డా॥ వి. నారాయణప్పగారు (ఢిల్లీ విశ్వవిద్యాలయం

డా॥ గన్నమరాజు గిరిజామనోహరబాబుగారు



డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావుగారు

డా॥ నాగమ్మగారి భీమన్నగారు

శ్రీ ఖండాప్లి మన్మథరావుగారు

డా॥ సనపల ఢిల్లీశ్వరరావుగారు

శ్రీ తంగిరాల పాల గోపాల కృష్ణగారు

డా॥ రాచకొండ నరసింహశర్మ–డా॥ అన్నపూర్ణాదేవి దంపతులు
(2004 లో చైతన్య కవిత–40వ సంచికను అంకితం పుచ్చుకున్నప్పుడు.
ఇప్పుడు ఈ దంపతుల వయస్సు 97సం.లు)